
ఉప వేదాంగాలు

దర్శన, భాష్య, బ్రహ్మ సూత్రాలు

బ్రహ్మ సూత్రాలు


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి. కనుక తమవంతుగా భక్తి,జ్ఞాన ప్రచారార్ధం మహానుభావులైన **శ్రీ విద్యా సారధి** వెబ్ సైట్ వారు ఉచితంగా విలువైన గ్రంధాలను ఆన్ లైన్ ద్వారా eBOOK(PDF) రూపంలో అందిస్తున్నారు. వారు చేస్తున్న జ్ఞాన యజ్ఞానికి సాయి రామ్ కూడా తమవంతుగా సహాయం చేసే కార్యక్రమంలో భాగంగా వారి గ్రంధాలను సాయి రామ్ ద్వారా కూడా అందచేస్తున్నాము, ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం చేసిన ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in),మైక్రోసాఫ్ట్ సైట్(http://www.microsoft.com) వారికి కూడా మేము ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) **శ్రీ విద్యా సారధి** వారి వెబ్ సైట్: http://srividyasaradhi.org/
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com
సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement
సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంద వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.

గమనిక: భక్తి,జ్ఞాన ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో **శ్రీ విద్యా సారధి** వెబ్ సైట్ వారు అందించటం జరిగింది. ఈ గ్రంధముపై వ్యాపార,ముద్రణ హక్కులు వారికి గలవు,కనుక వారిని సంప్రదించగలరు.

SaiRealAttitudeManagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు *

శ్రీ విద్యా సారధి వారి వెబ్ సైట్:

http://srividyasaradhi.org/



అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

బ్రహ్మసూత్రాలు



గ్రంథకర్త :

కనకాభిషేక గ్రహీత, సువర్ణఘంటాకంకణ, శ్రీవిద్యా నిధి,
చక్రవిద, శ్రీవిద్యా రత్నాకర, శ్రీవిద్యా విశారద,

క్రోవి పార్థసారథి

బ్రహ్మసూత్రాలు

ప్రథమ ముద్రణ : ఆగష్టు, 2002

ప్రతులు : 1000

వెల : అమూల్యము

ప్రతులకు :
కె. విజయకుమార్
27/25, భొజ్జిల్లిపేట
మచిలీపట్నం.

ముద్రణ :
నిర్మలా ఆఫ్‌సెట్ ప్రింటర్స్
26-6-3, పాపయ్య వీధి, గాంధీనగర్,
విజయవాడ-3. ఫోన్ : 0866 - 574828

ఈ గ్రంథము
తిరుమల తిరుపతి దేవస్థానము వారి
ఆర్థిక సహాయంతో ముద్రించటమైనది.

అంకితం



'బ్రహ్మసూత్రాలు' అనే అద్వైత
సిద్ధాంత ప్రతిపాదితమైన ఈ గ్రంథాన్ని
కలియుగదైవము అయిన
శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి అంకితం
చేస్తున్నాను.

బ్రహ్మసూత్రాలు

"నమస్కారం గురువుగారూ" !

అప్పుడే ధ్యానం చాలించిన రత్నాకరుడు ఒక్కసారి కళ్ళు తెరిచి చూశాడు. ఎదురుగా తన శిష్యులు నారాయణభట్టు, కృష్ణశర్మ నిలబడి ఉన్నారు.

అది కృష్ణానదీ తీరం, విజయవాటిక నగరానికి దూరంగా బ్రహ్మవిద్యాశ్రమం నిర్మించుకుని, వానప్రస్తం సాగిస్తున్నాడు రత్నాకరుడు. విశాలమైన ఆశ్రమప్రాంగణం. మధ్యలో పర్ణశాల. చుట్టూ రకరకాల పళ్ళ, పూలచెట్లు. కొంచెం దూరంగా మామిడి, రావి, మర్రి, వేపలాటి నీడనిచ్చే వృక్షాలు. వాటిమీద తిరుగాడే చిలుకలు, గోరింకలు. ఎదురుగా కృష్ణవేణి. ఆశ్రమప్రాంగణంలో సాయంసమయంలో ధ్యానం చేస్తున్నాడు రత్నాకరుడు. ఇది అతడి దినచర్య. కృష్ణశర్మ, నారాయణభట్టు అతని శిష్యులు. గతంలో రత్నాకరుడి దగ్గర అనేక విషయాలు తెలుసుకున్నారు. శ్రీవిద్య, ఉపనిషత్తులు పూర్తిగా చెప్పుకున్నారు.

చాలాకాలం తరువాత వచ్చిన శిష్యులను చూడగానే మహదానందం పొందాడు రత్నాకరుడు. ఆదరంగా ఆహ్వానించాడు. కుశలప్రశ్నలు అయిన తరువాత అడిగాడు. 'వచ్చిన పని ఏమిటి?' అని

"గురుదేవా ! గతంలో మీవల్ల శ్రీవిద్యను గురించి పూర్తిగా తెలుసుకున్నాము. ఉపనిషత్తులు చెప్పుకున్నాము. అనేక సంశయాలు తీర్చుకున్నాము. ఇప్పుడు 'బ్రహ్మసూత్రాలు' చెప్పుకోవాలని వచ్చాము." అన్నారు.

ఆ మాటలు విన్న రత్నాకరుడు అమితమైన ఆనందం పొందినవాడై "నాయనలారా! ఆధ్యాత్మిక విషయాలపై జిజ్ఞాస ఉన్నవారే కరువైన ఈ రోజుల్లో మీరు బ్రహ్మసూత్రాలు తెలుసుకోవాలనుకోవటం చాలా గొప్పవిషయం. పదిమందికి చెప్పినప్పుడే తెలిసిన విద్యకు సాఫల్యం చేకూరుతుంది. కాబట్టి నాకు తెలిసినంతవరకు బ్రహ్మసూత్రాలను మీకు వివరిస్తాను. ఈ రోజుకు సెలవు తీసుకుని రేపటినుంచి ప్రారంభిద్దాం". అన్నాడు.

మర్నాడు ఉదయం దైనందిన కార్యక్రమాలు పూర్తి చేసుకుని, వచ్చిన శిష్యులను వాత్సల్యంతో పలుకరించి బ్రహ్మసూత్రభాష్యము ప్రారంభించాడు రత్నాకరుడు.

వేదాలు అపౌరుషేయాలు. అవి ఎవరిచేత వ్రాయబడలేదు. ప్రత్యక్షంగా బ్రహ్మముఖం నుండే వచ్చినాయి. ఇక్కడ బ్రహ్మ అంటే పరమేశ్వరుడు. సృష్టి, స్థితి లయ కారకుడు. ఆది మధ్యాంతరహితుడు. పరమేశ్వరుడు ఈ వేదాలను సృష్టికారకుడైన ప్రజాపతికి ఇచ్చాడు. కాలక్రమేణా ఈ వేదాలు గురుపరంపరగా భూలోకంలో వ్యాప్తిచెందాయి.

త్రేతాయుగం వరకు ఈ వేదం అంతా ఒకటిగానే ఉండేది. ఆ తరువాత కాలంలో అంటే ద్వాపరయుగంలో కలగా పులగంగా ఉన్న ఈ వేదాన్ని అర్థంచేసుకోవటం కష్టమైంది. అందుచేత ప్రజాపతి, అపాంతరతముడు అనే మానసపుత్రుణ్ణి సృష్టించి, వేదాన్ని భూలోకంలో బాగా ప్రచారం చేసి రమ్మన్నాడు. అపాంతరతముడు ఋగ్, యజు, స్సామ అథర్వణములు అని వేదాన్ని నాలుగు భాగాలుగా చేసి బహుళప్రచారంలోకి తెచ్చి, తన తండ్రియైన బ్రహ్మదగ్గరకు వెళ్ళి ఈ విషయం చెప్పాడు. దానికి బ్రహ్మ చాలా సంతోషించి ప్రతి మహాయుగంలోని ద్వాపరయుగంలోనూ వేదాలను ఈ రకంగానే విభజనచేసి ప్రచారం చెయ్యవలసినదిగా అపాంతరతముణ్ణి ఆదేశించాడు.

నాలుగు యుగాలు కలిస్తే ఒక మహాయుగం. అందులోని ద్వాపరయుగంలో ఈ వేదాలు బ్రహ్మయొక్క ఆదేశానుసారము విభజన చేయబడుతుంటాయి.

ఇది ఇరవై ఎనిమిదవ మహాయుగము. అంటే ఇప్పటికి ఇరవై ఎనిమిది సార్లు వేదాలను విభజించటం జరిగింది. వేదాలను విభజించినటువంటివాడు వేదవ్యాసుడు అనబడతాడు. ఈ మహాయుగంలో వేదాలను విభజించినవాడు కృష్ణద్వైపాయనుడు అతడే మనకు తెలిసిన వేదవ్యాసుడు.

పరాశరమహర్షి తీర్థయాత్రలు చేస్తూ కాళిందీ నదీతీరాన్ని చేరి, ఆ నదిని దాటించమని దాశరాజును అడిగాడు. ఆ సమయంలో దాశరాజు భోజనం చేస్తున్నాడు. అందుచేత, తన ప్రక్కనే ఉన్న తనకుమార్తెను ఆ పని చెయ్యమన్నాడు. దాశరాజు కుమార్తె మత్స్యగంధి పడవలో మహర్షిని ఎక్కించుకుని బయలుదేరింది. పడవ నది మధ్యకి చేరింది. దైవికంగా మహర్షి మనస్సు మత్స్యగంధి మీదకు పోయింది. ఆపుకోలేని తమకంతో మహర్షి ఆమె చెయ్యి పట్టుకున్నాడు. అప్పుడు మత్స్యగంధి "స్వామీ ! నేను దుర్వాసన వేస్తున్నాను కదా. మీకు అసహ్యం కలగటం లేదా ?" అన్నది. ఆ మాట విన్న వెంటనే మహర్షి, ఆమె ఉన్నచోటునుంచి యోజనదూరం కస్తూరి వాసనలు వెదజల్లేటట్లుగా

వరమిచ్చాడు. అప్పటినుంచే మత్స్యగంధి కాస్తా 'యోజనగంధి' అయింది. అప్పుడు ఆమె "స్వామీ ! ఇది పగలు. లోకమంతా చూస్తుంది. అదీగాక, దివాసంగమం నిషిద్ధం కదా ?" అన్నది. మహర్షి తనతపశ్శక్తితో ఆ ప్రాంతమంతా చిమ్మచీకట్లు ఆవరింపచేశాడు. అప్పుడు ఆమె "నేను కన్యను. నీ పని నువు చేసుకుపోతావు. మరి నా సంగతి ఏమిటి?" అంది. ఆమె కన్యాత్వము చెడకుండా వరమిచ్చాడు మహర్షి. ఈ రకంగా తన కన్యాత్వము చెడకుండ, తండ్రికి తెలియకుండ, తనకు నిత్యయవ్వనము, నిత్యసుగంధము ఉండేటట్లు, పరాశరునితోపాటు సమానమైన కుమారుడు కలిగేటట్లు వరాలు పుచ్చుకుని మహర్షి కోర్కె తీర్చింది. మహర్షి సంతుష్టి చెంది "నీకు విష్ణ్వాంశ సంభూతుడు, ముల్లోకాలలోను ఖ్యాతిని ఆర్జించేవాడు, వేదవిభజన చేసేవాడు, పురాణకర్త అయిన కుమారుడు పుడతాడు" అని ఆమెను దీవించి తనదారిన తాను వెళ్ళిపోయాడు.

యోజనగంధి సద్యోగర్భాన ఒక కుమారుణ్ణి కన్నది. అతడు పుడుతూనే మునివేషంలో దండకమండలాలు ధరించి ఉన్నాడు. పుట్టిన వెంటనే తల్లికి నమస్కరించి, అవసరమైనప్పుడు స్మరణమాత్రం చేతనే ప్రత్యక్షమవుతాను అని తల్లికిమాట ఇచ్చి, తపస్సు చేసుకోవటానికి వెళ్ళిపోయాడు. ఈ విధంగా కృష్ణద్వీపమున (చీకటిగా ఉన్న ద్వీపమునందు) జన్మించినవాడు కావటంచేత ఆ బాలకుడు కృష్ణద్వైపాయను డైనాడు. వేదవిభజన చేసి వేదవ్యాసుడు అయినాడు. ఈయనే వ్యాసమహర్షి. ఋషులలో అనేక భేదాలున్నాయి. 1. మహర్షులు – వ్యాసుడు మొ॥వారు 2. పరమఋషులు – భేలాదులు. 3 దేవర్షులు – నారదుడు, కణ్వుడు మొ॥వారు. 4. బ్రహ్మర్షులు – వసిష్ఠాదులు 5. శ్రుతర్షులు – శుశ్రుతాదులు 6. రాజర్షులు – విశ్వామిత్రాదులు 7. కాండర్షులు – జైమిన్యాదులు. ఈ ఋషులందరిలోను వ్యాసుడు ప్రముఖుడు.

ఈ రకంగా వ్యాసుడు వేదాలను విభజించిన తరువాత బ్రహ్మవిద్యపై దృష్టి సారించాడు. అంటే తనను గురించి తాను తెలుసుకోవాలి అనుకున్నాడు. దాన్ని గురించి తీవ్రంగా ఆలోచన చేశాడు. అదే తపస్సు. అప్పుడు "బ్రహ్మసత్యం – జగన్మిథ్య" అనే విషయం ఆయనకు తట్టింది. ఈ రకంగా పరమేశ్వరుణ్ణి గురించి తీవ్రంగా ఆలోచించి, తాను దర్శించిన పరమార్థాన్ని చిన్నచిన్న సూత్రాలుగా క్రమబద్ధీకరించాడు. అవే "బ్రహ్మసూత్రాలు".

పరబ్రహ్మ తత్త్వాన్ని నిరూపించటమే ఈ సూత్రాల ప్రధానధ్యేయం. చరాచర జగత్తు అంతా బ్రహ్మపదార్థంతోనే సృష్టించబడింది. జగత్తంతా పరమేశ్వరమయమే. మానవుడు ఎక్కడనుంచి వచ్చాడు ? మరణానంతరము మళ్ళీ ఎక్కడికి పోతాడు? పునర్జన్మ ఎందుకు

ఎత్తాలి? మోక్షం అంటే ఏమిటి ? ఇత్యాది ప్రశ్నలకు సమాధానం చెప్పగలిగింది ఒక్క బ్రహ్మవిద్య మాత్రమే. 'బృంహణం' అంటే అంతటా నిండి ఉండటము అని అర్థం. బృంహణశక్తి గలది బ్రహ్మము. ఇది విశాల విశ్వమంతా వ్యాపించి ఉన్నది. జీవాత్మ, పరమాత్మ వేరు కాదు. రెండూ ఒక్కటే.

వ్యాసుడు బ్రహ్మపదార్థాన్ని తరచి చూసి, దాన్ని సూత్రబద్ధం చేశాడు. అవే బ్రహ్మ సూత్రాలు. బ్రహ్మసూత్రాలు వ్రాయటానికి ముందు వ్యాసుడు చార్వాక, నాస్తిక, లోకాయుత, నిరీశ్వరవాదాలన్నీ పూర్తిగా అధ్యయనం చేశాడు. ఆ తరువాత తార్కికబుద్ధితో బాగా ఆలోచించి జగత్తులో కనిపించేది, కనిపించనిది అంతా బ్రహ్మపదార్థమే. అని తేల్చాడు.

సర్వవేదాంత తాత్పర్య నిర్ణయాయ మహామునిః
చకార బ్రహ్మసూత్రాణి భగవాన్ బాదరాయణః
చత్వారస్త్రత్రచాధ్యాయాః ప్రత్యేకం తే చతుష్పదాః
సూత్రాణాం పంచ పంచాశ దుత్తరం శత పంచకం
వేదాంతస్థాధికరణం ద్వినవత్యుత్తరం శతం
ఏతచ్ఛారీరకం శాస్త్రం కృష్ణద్వైపాయనో గురుః
పుత్రమధ్యాపయామాస శిష్యంచ శుక మాదరాత్

వ్యాసమహర్షి ఉపనిషత్సారము అంతా బ్రహ్మసూత్రాలలో నింపాడు. ఇది మొత్తం నాలుగు అధ్యాయాలు. ప్రతి అధ్యాయానికి నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలోనూ కొన్ని అధికరణలు ఉంటాయి. మొత్తం మీద ఈ గ్రంథంలో 555 సూత్రాలు, 192 అధికరణలు ఉంటాయి. ఈ బ్రహ్మసూత్రాలను వ్యాసుడు అతి ఆదరముతో తన కుమారుడు, శిష్యుడు కూడా అయిన శుకమహర్షికి ఉపదేశించాడు.

'బ్రహ్మసూత్రాలు' అనే మాటలో బ్రహ్మ అంటే పరబ్రహ్మ. నిరాకారుడు, నిర్గుణ స్వరూపుడు, ఆది మధ్యాంతరహితుడు సృష్టి స్థితి లయ కారకుడు, సర్వవ్యాపి. ఈ జగత్తంతా తానే అయి ప్రతివస్తువునందు, ప్రతి ప్రాణియందు కూడా వ్యాపించి ఉన్నాడు. మరి సూత్రము అంటే

అల్పాక్షర మసందిగ్ధం సారవద్విశ్వతో ముఖం ।
అస్తోభ మనవద్యంచ సూత్రం సూత్రవిదో విదుః ॥

కొద్ది అక్షరాలు మాత్రమే కలిగి, అనుమానానికి తావులేని అర్థాన్ని వివరిస్తూ, ఆకారంలో చిన్నదై, ఏ విధమైన దోషములేని వాక్యాన్ని సూత్రము అంటారు. సూత్రము

అంటే దారము అనికూడా అర్థం. పూలన్నీ కలిపి మాలగా గ్రుచ్చటానికి ఉపయోగపడేది. దండ గ్రుచ్చిన తరువాత, దానికి ఉపయోగించిన దారము కనిపించదు. పూలు మాత్రమే కనిపిస్తాయి. అలాగే ఈ సృష్టిలో మనకు కనిపించే 84 లక్షల జీవరాసులు, పర్వతాలు, లోయలు, చెట్లు, చేమలు, నదీనదాలు, అడవులు, కొండలు, ఎడారులు ఈ రకంగా ప్రాణమున్నవి, ప్రాణములేనివి, ఒకేసూత్రంతో బంధించబడి ఉన్నాయి. ఈ విధంగా జగత్తునంతటినీ ఒకటిగా కలిపి ఉంచగలిగినది ఆత్మ అనే సూత్రం ఒక్కటే.

బ్రహ్మసూత్రాలకు శంకరభగవత్పాదులు, రామానుజాచార్యులు, మధ్వాచార్యులు మొదలైన పదిమంది మహానుభావులు వ్యాఖ్య వ్రాశారు. అయితే సామాన్యుడికి అర్థంకాని శాస్త్రం నిరుపయోగం. బ్రహ్మసూత్రాలు అర్థంకాని పదార్థం కాదు. కొరుకుడుపడని కఠినశిల అంతకన్న కాదు. కాబట్టి, ముందుగా నా గురుదేవులకు నమస్కరించి, ధర్మసంస్థాపన కోసం ఏర్పాటు చేయబడ్డ శృంగేరి, కంచి, పుష్పగిరి, కుర్తాళం పీఠాధిపతులకు సాష్టాంగ ప్రణామాలాచరించి, అవధూతలకు, స్వామీజీలకు, మాతాశ్రీలకు ప్రణతులర్పించి బ్రహ్మసూత్రాలు సామాన్యుడికి కూడా అర్థం కావాలనే తలంపుతో సులభశైలిలో వ్రాయటానికి ఉపక్రమిస్తున్నాను. పండితులు, జ్ఞానులు, వృద్ధులు నా యీ ప్రయత్నాన్ని మన్నించి నన్ను ఆశీర్వదింతురుగాక.

ప్రథమాధ్యాయము

బ్రహ్మసూత్రాలు మొత్తం నాలుగు అధ్యాయాలుగా ఉంటుంది. ప్రతి అధ్యాయానికి నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలోను కొన్ని అధికరణలు ఉంటాయి. ప్రతి అధికరణంలోను కొన్ని సూత్రాలు ఉంటాయి. ఈ రకంగా ఈ గ్రంథం మొత్తంమీద 192 అధికరణలు, 555 సూత్రాలు ఉన్నాయి.

ప్రథమ పాదము

ఇక మొదటి అధ్యాయంలో మొదటి పాదాన్ని చూద్దాం. ఇందులో 11 అధికరణలు, 31 సూత్రాలు ఉన్నాయి.

వ. నెం.	అధికరణము	విషయము	సూత్రాలు
1.	జిజ్ఞాసాధికరణము	బ్రహ్మజిజ్ఞాస ఎందుకు ?	1
2.	జన్మాద్యధికరణము	పరబ్రహ్మ లక్షణాలు	1
3.	శాస్త్రయోనిత్వాధికరణము	వేదానికి కారణము బ్రహ్మ	1
4.	సమన్వయాధికరణము	వేదాంత వాక్యాల సమన్వయం వల్ల బ్రహ్మను తెలుసుకోవటం	1
5.	ఈక్షత్యధికరణము	జగత్తుకు కారణము చేతనమా ? అచేతనమా ?	7
6.	ఆనందమయాధికరణము	బ్రహ్మము ఆనందమయము	8
7.	అంతరధికరణము	ఆదిత్యుని యందున్న పురుషుడు జీవుడు కాదు	2
8.	ఆకాశాధికరణము	ఆకాశము బ్రహ్మ	1
9.	ప్రాణాధికరణము	ప్రాణము బ్రహ్మ	1
10.	జ్యోతిశ్చాధికరణము	జ్యోతి బ్రహ్మ	4
11.	ప్రతర్దనాధికరణము	ప్రాణము బ్రహ్మ	4
		మొత్తం సూత్రాలు	31

గురువుగారూ ! అధికరణ అంటే ఏమిటి ? అని అడిగాడు నారాయణభట్టు.

“నారాయణభట్టారకా ! అధికరణ అంటే గ్రంథభాగము. అయితే కేవలము గ్రంథంలోని ఒక భాగాన్ని అధికరణ అనటానికి వీలులేదు. దానికి కొన్ని లక్షణాలున్నాయి.

విషయో విశయశ్చైవ పూర్వపక్షస్తథోత్తరమ్ ।
ప్రయోజనం సంగతిశ్చ ప్రాంచోఽధికరణం విధుః ॥

విషయము, విశయము, పూర్వపక్షము, ప్రయోజనము, సంగతి వీటినే అధికరణ పంచకము అంటారు.

విషయము	–	విచారణ చేయదగినది
విశయము	–	దానిలో కలిగే సంశయము
పూర్వపక్షము	–	కాదని ఖండించుట
ప్రయోజనము	–	అవునని నిర్ధారణ చేయుట
సంగతి	–	పరస్పరానుకూల్యము చూచుట

విషయః సందేహః సంగతిః పూర్వపక్షః సిద్ధాన్త ।
ఇత్యేకైక మధికరణం పంచావయవం జ్ఞేయం ॥

విషయము, సందేహము (సంశయము), సంగతి, పూర్వపక్షము, సిద్ధాంతము అనేవి అధికరణకు ఐదు అవయవములు వంటివి.

ఏదైనా ఒక విషయాన్ని గురించి చెప్పేటప్పుడు ఇతర గ్రంథాలలో దాన్ని గురించి ఏం చెప్పారు? దానిమీద మనకున్న సందేహాలు ఏవి? వాటికి సమాధానాలు ఏవి? దానిమీద వాద ప్రతివాదనలు; విషయాన్ని అవును అని నిర్ధారణ చెయ్యటము. అలా తీర్మానించటానికి సిద్ధాంతము. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని చేసే గ్రంథభాగమే అధికరణము. ఇక మొదటి అధ్యాయంలోని మొదటి పాదంలో మొదటి అధికరణము చూద్దాం.

1. జిజ్ఞాసాధికరణము

జిజ్ఞాస అంటే తెలుసుకోవాలనే కోరిక. విషయం తెలుసుకోవటానికి చేసే యత్నం. ఈ అధికరణలో బ్రహ్మను గురించి తెలుసుకోవాలనే కోరిక ఎందుకు కలుగుతుందో వివరిస్తున్నారు.

సూ 1. అథాతో బ్రహ్మజిజ్ఞాసా

అథ – పిమ్మట, అతః – కాబట్టి, బ్రహ్మజిజ్ఞాసా – బ్రహ్మమును తెలుసుకోవాలనే కోరిక. వివేకాది సాధన సంపత్తి సిద్ధించిన తరువాత కర్మఫలం అనిత్యము, అశాశ్వతము, మోక్షము నిత్యము పరబ్రహ్మయే సత్యము అని తెలిసింది కాబట్టి ముముక్షువు బ్రహ్మను గురించి తెలుసుకోవటానికి ప్రయత్నించాలి.

సాధకుడు వేదవేదాంగాలు చదివాడు. బ్రహ్మచర్యం పూర్తయింది. గృహస్తు అయినాడు. శాస్త్రోక్తంగా యజ్ఞయాగాలు నిర్వహించాడు.

ఎన్ని శాస్త్రాలు చదివినా, యజ్ఞయాగాలు చేసినా, దేవతలను అర్చించినా, జీవాత్మ పరమాత్మల ఏకత్వంగురించి తెలియకపోతే ఉపయోగం లేదు. అటువంటి వాడికి ఎన్ని కల్పాలు గడచినా మోక్షం రాదు. ధనంవల్ల మోక్షం లభించదు. కర్మలవల్ల మోక్షం రాదు. కర్మాచరణవల్ల ఉత్తమలోకాలు మాత్రమే ప్రాప్తిస్తాయి. కేవలము జ్ఞానమే మోక్షానికి మార్గము.

అందుచేత విద్వాంసుడు ఐహిక భోగాలను వదలిపెట్టి, మంచి గురువును శరణుజొచ్చి, ఆయన ఉపదేశాలు శ్రద్ధగా వింటూ, బ్రహ్మచర్య దీక్ష పాటిస్తూ, మోక్షమార్గం కోసం ప్రయత్నించాలి. సద్వస్తువైన ఆత్మను దర్శించటంలో నిమగ్నుడై, యోగియై సంసార సాగరంలో పడి కొట్టుమిట్టాడుతున్న తన ఆత్మను ఉద్ధరించుకోవాలి.

ఈ విధంగా ఎల్లప్పుడూ ఆత్మదర్శనాభ్యాస తత్పరుడైన విద్వాంసుడు సమస్తకర్మలను వదిలి, ప్రాపంచిక బంధనాలనుండి విముక్తి పొందటానికి ప్రయత్నించాలి. కర్మలు బంధహేతువులు. కాబట్టి కర్మపరిత్యాగం చెయ్యాలి. కర్మలవల్ల చిత్తశుద్ధి జరుగుతుంది. అంతేకాని జ్ఞానంమాత్రం రాదు. గురువు చేసిన బోధలు వినటంవల్ల, వాటిని గురించి ఆలోచించటంవల్ల ఆత్మజ్ఞానం కలుగుతుంది. అంతేకాని ఎన్ని తీర్థాలు సేవించినా, దానధర్మాలు చేసినా, సత్రములు కట్టించినా, కర్మలు చేసినా జ్ఞానం మాత్రం రాదు.

ఆత్మనిష్ఠ కలగాలంటే విద్వాంసుడికి నాలుగు లక్షణాలుండాలి. వాటినే సాధన చతుష్టయము, సాధన సంపత్తి అంటారు. ఇవే మోక్షసాధనాలు. సాధనచతుష్టయము అంటే –

1. నిత్యానిత్య వివేకము : ఏది సత్యము ? ఏది అసత్యము ? ఏది నిత్యము ? ఏది అనిత్యము ? అనే విషయ పరిజ్ఞానం. బ్రహ్మ సత్యం. – జగన్ మిథ్య, కనిపించే జగత్తంతా అనిత్యమైనది. బ్రహ్మఒక్కటే శాశ్వతమైనది.

2. వైరాగ్యము : ఇహలోక సుఖాలపట్ల విముఖత, శరీరం మొదలు బ్రహ్మలోకం వరకు ఉండే భోగ్య పదార్థాలన్నింటిమీద అసహ్య భావన కలగటం.

3. షట్సంపత్తి : ఇవి మొత్తం 6.

1. శమము – అంతరింద్రియ నిగ్రహము
2. దమము – బాహ్యేంద్రియ నిగ్రహము. ఇంద్రియాలను వాటివాటి విషయాలనుండి మళ్ళించి, వాటి స్థానాలలో వాటిని నిలిపి వేయటం.
3. ఉపరతి – కర్మపరిత్యాగం. బాహ్యవిషయాలను చిత్తవృత్తులతో ఆశ్రయించకుండా ఉండటము.
4. తితిక్ష – శీతోష్ణ సుఖదుఃఖాలను సహించే శక్తి. చింత, బాధ మొదలయినవి లేకుండా, సమస్త సుఖ దుఃఖాలు కష్టాలు సహించటం. ఎదుర్కోగలిగిన సామర్థ్యం ఉండికూడా అపకారికి ఉపకారం చెయ్యటం.
5. శ్రద్ధ – గురువునందు, ఆయన చెప్పే విషయాలయందు విశ్వాసము.
6. సమాధి – బుద్ధిని ఎప్పుడూ శ్రద్ధ బ్రహ్మమునందే నిలిపి ఉంచటం

4. ముముక్షత్వము : మోక్షం పొందాలనే కోరిక. అహంకారం దగ్గర నుండి బ్రహ్మవరకు శరీరానికి అంతా అజ్ఞానంతో కల్పించబడిన బంధనాలే. ఆత్మజ్ఞానం పొందటంద్వారా ఈ బంధనాలను త్రెంచుకోవచ్చు.

బ్రహ్మసూత్రాలు అనబడే ఈ గ్రంథం 'వేదాంత మీమాంశ' ఉత్తర మీమాంశ అని కూడా చెప్పబడుతుంది. వేదాంతము. అంటే వేదములలో చివరి భాగము ఉపనిషత్తులు. మీమాంశ అంటే పరిశీలన. ఈ గ్రంథాన్ని 'ఉత్తరమీమాంశ' అన్నారు కదా ! మరి 'పూర్వ మీమాంశ' అనే గ్రంథం ఏదైనా ఉన్నదా ? అంటే జైమిని మహర్షి వ్రాసిన పూర్వప్రజ్ఞాదర్శనమే 'పూర్వమీమాంశ' అంటారు. ఇది 12 అధ్యాయాలు గల న్యాయశాస్త్రము. దీనినే జైమిని న్యాయసూత్రాలు అని కూడా అంటారు. ఈ రకంగా వ్యాసుని శిష్యుడైన జైమిని పూర్వ మీమాంశలో ధర్మసూత్రాలు వ్రాయగా, సర్వజ్ఞుడైన వ్యాసుడు బ్రహ్మదర్శనం కోసం ఉత్తర మీమాంశ వ్రాశాడు. వేదానికి అర్థం కేవలము కర్మలు కాదు. జీవబ్రహ్మైక్యం గురించి వేదంలో చెప్పబడలేదు. కాని వేదాలకు

అంతమందున్న ఉపనిషత్తులలో ఉంది. వేదముయొక్క ప్రమాణము వేదాల చివరన ఉన్న ఉపనిషత్తులకు కూడా ఉన్నది. అందుచేతనే వేదాంతంకూడా వేదమే. కాబట్టి వేదప్రమాణం గల ఉపనిషత్తులసారాన్ని బ్రహ్మసూత్రాలుగా వ్రాశాడు వ్యాసమహర్షి.

'జిజ్ఞాస' అంటే కోరిక. బ్రహ్మ జిజ్ఞాస అంటే బ్రహ్మను గురించి తెలుసుకోవాలనే కోరిక. ఇది ఎందుకు ? తాపత్రయ నివృత్తికోసం. తాపత్రయాలు అంటే మూడు రకాలయిన తాపములు. అవి 1. ఆది భౌతిక 2. ఆది దైవిక 3. ఆధ్యాత్మికములు.

1. ఆదిభౌతికము : తనకన్న ఇతరులైనవారి వలన వచ్చిన బాధలవల్ల పరితపించుట. భార్యాపుత్రులు, సర్ప వృశ్చికాదులు, అగ్ని, వరద, భూకంపాలవంటివి.

2. ఆదిదైవికము : దైవముచే కలుగచేయబడేవి.

3. ఆధ్యాత్మికము : దేహేంద్రియాలకు గలిగిన అధివ్యాధులచే అనగా అలసత్వము, కపటము, అవిశ్వాసము, అశ్రద్ధ, మొ॥వాటితో దుఃఖించుట.

ఈ మూడు రకాలయిన దుఃఖాలు శాశ్వతంగా పోవాలంటే జన్మరాహిత్యం తప్ప ఇంకొక మార్గం ఏదీలేదు. వేదాంతశాస్త్రం చెప్పేది జన్మరాహిత్యం. అదే మోక్షం. ఆ మోక్షం పొందటానికే ఈ బ్రహ్మజిజ్ఞాస. బ్రహ్మజిజ్ఞాసకు ఫలితం బ్రహ్మప్రాప్తి. అంటే మోక్షం. "బ్రహ్మవిద్ బ్రహ్మైవభవతి" బ్రహ్మనెరిగినవాడు కూడా బ్రహ్మమే అవుతాడు.

మనం తెలుసుకోవలసినది బ్రహ్మము గురించి. బ్రహ్మగురించి తెలుసుకున్నవాడు కూడా బ్రహ్మమే. కాబట్టి తెలుసుకోవలసినది, తెలుసుకున్నవాడు ఈ రెండూ పరబ్రహ్మ స్వరూపమే. అందుచేతనే "అయమాత్మా బ్రహ్మ" "అహం బ్రహ్మాస్మి" అనే మహావాక్యాలు జీవాత్మా పరమాత్మా రెండూ ఒక్కటే అని చాటి చెబుతున్నాయి. కాబట్టి జీవునికన్న తెలుసుకోవలసిన పదార్థము ఇంకొకటి లేదు. అదే బ్రహ్మస్వరూపము, ఆత్మస్వరూపము.

కర్మలద్వారా అంటే యజ్ఞయాగాదులవల్లగాని, ఇష్టాపూర్త కర్మలద్వారాగాని పుణ్యలోకాలు వస్తాయి. సాధకుడు స్వర్గసుఖాలు అనుభవించిన తరువాత కర్మఫలాన్ని అనుభవించటానికి ఉత్తర జన్మలు ఎత్తుతాడు. మళ్ళీ కర్మలు చేస్తాడు. స్వర్గసుఖాలు అనుభవించి మళ్ళీ జన్మిస్తాడు. ఈ రకంగా గానుగకు కట్టిన ఎద్దులాగా సంసారమనే బండి చక్రంలో పడి గిరగిర తిరుగుతూ ఉంటాడు. అయితే ఈ సుఖాలు అన్నీ క్షణికమైనవి. శాశ్వతమైన సుఖము, ఆనందము బ్రహ్మానందము ఒక్కటే. అది మోక్షం ద్వారానే కలుగుతుంది. అందుకే బ్రహ్మజిజ్ఞాస చేయాలి అంటే బ్రహ్మనుగురించి తెలుసుకోవాలి. వేదాధ్యయనం చెయ్యటంవల్లగాని, కర్మలు చెయ్యటంవల్లగాని, తర్కమువల్లగాని,

శాస్త్రపాండిత్యము వల్లగాని బ్రహ్మమును గురించి తెలుసుకోలేము. కేవలము. జ్ఞానము వల్ల మాత్రమే బ్రహ్మనుగురించి తెలుసుకోవటము జరుగుతుంది. అందుచేతనే సాధన చతుష్టయము పొందిన తరువాతనే బ్రహ్మజిజ్ఞాస కావాలి.

బ్రహ్మమనేది జ్ఞానప్రమాణాలవల్ల మాత్రమే తెలుసుకోదగ్గది. అంటే వేదాంతము అనగా ఉపనిషత్తుల విచారణద్వారా మాత్రమే బ్రహ్మము తెలుస్తుంది. చతుర్విధ పురుషార్థాలలో నాల్గవదైన మోక్షము బ్రహ్మసాక్షాత్కారమువల్లనే జరుగుతుంది. అందుకనే బ్రహ్మనుగురించి తెలుసుకోవటానికి ప్రయత్నించాలి. అంటే బ్రహ్మజిజ్ఞాస కావాలి.

ఆ మాటలు విన్న కృష్ణశర్మ చిన్నగా తలపంకించి వినమ్రతతో అడుగుతున్నాడు. గురువుగారూ ! ఇక్కడ ఒక చిన్న అనుమానం వస్తుంది. బ్రహ్మము మనకు తెలిసినదా ? తెలియనిదా ? ఒకవేళ తెలిసినదే అయితే దాన్నిగురించి మళ్ళీ విచారణ చెయ్యవలసిన అవసరం లేదు. ఒకవేళ తెలియనిది అయితే దాన్ని విచారించి ప్రయోజనం లేదు. కాబట్టి బ్రహ్మజిజ్ఞాస ఉపయోగం లేనిదిగా కనిపిస్తుంది కదా ?"

శిష్యుని అనుమానాన్ని అర్థం చేసుకున్న రత్నాకరుడు చెప్పటం ప్రారంభించాడు. "బ్రహ్మము ప్రసిద్ధమే. అది నిత్య, శుద్ధ, బుద్ధ, ముక్త స్వభావం కలది. సర్వశక్తి సంపన్న మైనది. పైగా అది అందరికీ ఆత్మ. అంచేత అందరికీ తెలిసినదే. ఆత్మ ఉన్నదని అందరూ నమ్ముతారు కదా ! కాబట్టి ఆత్మయొక్క అస్తిత్వము ప్రసిద్ధమే. అదే బ్రహ్మము" అన్నాడు.

ఇప్పుడు నారాయణభట్టు అడుగుతున్నాడు. "గురువుగారూ ! ఆత్మ అనేదే బ్రహ్మము అన్నారు. దీన్ని గురించి అందరికీ తెలుసును అన్నారు. మరి అందరికీ తెలిసినదాన్ని గురించి మళ్ళీ విచారించాల్సిన అవసరం ఏమిటి ?"

"నారాయణభట్టారకా ! బ్రహ్మము ప్రసిద్ధమైనదే అంటే అందరూ ఎరిగినదే. బ్రహ్మాన్నిగురించిన సామాన్యజ్ఞానము అందరికీ ఉన్నది. కాని దానివిశేషజ్ఞానం మీద అనేక వాదోపవాదాలున్నాయి. అందుచేతనే బ్రహ్మనుగురించి తెలుసుకునే ప్రయత్నం చెయ్యాలి. దేహమే ఆత్మ అని నాస్తికులు, చార్వాకులు అంటారు. కాదు చేతనంగా కనుపించే ఇంద్రియాలే ఆత్మ అని కొందరంటారు. ఇంద్రియాలను ప్రేరేపించే మనస్సే ఆత్మ అని, కాదు విజ్ఞానము (బుద్ధి) ఆత్మ అని, కాదు దేహము ఇంద్రియాలకున్న వేరైన వాడొకడున్నాడు. అతడే ఆత్మఅని, ఆత్మ అనేది కేవలము భోక్తయే తప్ప కర్తకాదు అని, ఈ రకంగా అనేకమంది ఆత్మనుగురించి అనేక విధాలుగా చెబుతుంటారు. ఇవన్నీ నిజంకాదు. వీరి వాదనలన్నీ సవ్యంగానే ఉన్నట్టు అనిపిస్తాయి. కాని ప్రమాణాలు కావు.

ఈ స్థితిలో సామాన్య మానవులు ఎవరికి తోచిన విధంగా వారు ఆత్మను ప్రతిపాదించుకుంటారు.

మనకు వేదశాస్త్రాలే ప్రమాణం. ఈ జగత్తు అంతా మిధ్య. అంటే ఇవాళ్ళ ఉండేది రేపు ఉండనిది. పుట్టిన ప్రతి మనిషి గిట్టక మానడు. జీవితం దుఃఖ భూయిష్టం. సంసారిక దుఃఖాలనుండి నివృత్తి కావాలి. ఇది అందరూ కోరేదే. అంటే మరణము ఉండకూడదు. అనగా జన్మరాహిత్యం కావాలి. ఇదే మోక్షం. మోక్షము ఒక్కటే ఈ దుఃఖాలనుండి రక్షించి మానవుడికి శాశ్వత ఆనందాన్ని ఇస్తుంది.

పరబ్రహ్మ సాక్షాత్కారమే మోక్షము. ఇది జ్ఞానంవల్లనే వస్తుంది. 'జ్ఞానాదేవతు కైవల్యం' కాబట్టి మోక్షసాధనమైన బ్రహ్మాన్నిగురించి తెలుసుకోవాలి. అందుకే బ్రహ్మజిజ్ఞాస, అంటూ మొదటి అధికరణములో బ్రహ్మజిజ్ఞాస ఎందుకో వివరించాడు రత్నాకరుడు.

2. జన్మాద్యధికరణము

నాయనా ఇప్పటివరకూ పరబ్రహ్మను గురించిన జిజ్ఞాస ఎందుకు చెయ్యాలో చెప్పుకున్నాము. ఇప్పుడు ఈ అధికరణంలో పరబ్రహ్మ లక్షణాలను గురించి చెప్పుకుందాం.

సూ 2 **జన్మాద్యస్యయతః**

జన్మాది అస్య యతః

అంటూ బ్రహ్మసూత్రాలలోని రెండవ సూత్రాన్ని వివరించటం ప్రారంభించాడు రత్నాకరుడు.

చరాచర జగత్తు అంతా ఎవనివల్ల నడపబడుతుందో, ఎవనివల్ల సృష్టిస్థితిలయాలు జరుగుతున్నాయో అతడే బ్రహ్మ. అంటే పరబ్రహ్మ యొక్క లక్షణాలు ఏవి ? అనే విషయం వివరిస్తున్నాడు వ్యాసుడు.

పరబ్రహ్మ లక్షణాలు ఏవి ? అనేది అనేకసార్లు ఉపనిషత్తులలోను, పురాణాలలోను కూడా వివరించబడింది. ఎవ్వని చే జనించు జగము. ఎవ్వని లోపల నుండు లీనమై. ఆ పరమేశ్వరుడే ఈ జగత్తుకు సృష్టికర్త. సృష్టికి ముందు ఈ జగత్తంతా ఆ పరమేశ్వరునిలోనే లీనమైఉన్నది. తనలో అంతర్గతంగా ఉన్న సృష్టిని బహిర్గతం చేశాడు. అందుకే ఒక పరి జగముల వెలినిడి, ఒకపరి లోపలికి గొనుచు తనలో దాగిఉన్నటువంటి లోకాలన్నింటిని బయటకు పంపుతున్నాడు. అంటే సృష్టి చేస్తున్నాడు అలాగే ఈ లోకాలను తనలోపలికి తీసుకుంటున్నాడు. అనగా సృష్టిని లయం చేస్తున్నాడు. ఈ రకంగా సృష్టి, లయము

రెండూ చేస్తూ జగములు ప్రవర్తిల్ల చేస్తున్నాడు. అనగా స్థితికార్యం కూడా చేస్తున్నాడు ఇదే విషయాన్ని తైత్తిరీయోపనిషత్తులో చెప్పటం జరిగింది.

యతోవా ఇమాని భూతాని జాయంతే ।

యేన జాతాని జీవంతి, యత్ప్రయంత్యభిసంవిశంతి ॥

వరుణమహర్షి కుమారుడు భృగుమహర్షి. విద్యాభ్యాసం పూర్తిచేసి తండ్రిదగ్గరకు వచ్చి బ్రహ్మోపదేశం చెయ్యమని అడిగాడు. పరబ్రహ్మను గురించి ఒకరు చెబితే తెలుసుకునేది కాదు. ఎవరికి వారు తపస్సుచేసి బ్రహ్మతత్త్వాన్ని తెలుసుకోవాలి. కాబట్టి వెళ్ళి తపస్సు చెయ్యి అన్నాడు తండ్రి. కొంతకాలం తపస్సు చేశాడు భృగువు. ఇప్పుడు అతనికి తెలిసింది. అన్ని ప్రాణులు అన్నంవల్లనే బ్రతుకుతాయి కాబట్టి అన్నమే బ్రహ్మ. అదే మాట తండ్రికి చెప్పాడు. కాదన్నాడు తండ్రి. ఇంకొంతకాలం తపస్సు చెయ్యమన్నాడు. తపస్సు చేశాడు భృగువు. ఇప్పుడు తెలిసిందతడికి అన్ని జీవులు జీవించి ఉండాలంటే ప్రాణమే ముఖ్యమైనది. కాబట్టి ప్రాణమే బ్రహ్మ. అదే విషయం తండ్రికి చెప్పాడు. కాదు. ఇంకొంతకాలం తపస్సు చెయ్యి అన్నాడు తండ్రి. మళ్ళీ తపస్సు చేశాడు భృగువు. సంకల్ప వికల్పాలకు నిలయమైంది మనస్సు. దీనివల్లనే జగత్తు వృద్ధి చెందుతున్నది. కాబట్టి మనస్సే బ్రహ్మ అని తెలిసింది. ఇదే విషయాన్ని తండ్రికి చెప్పాడు. కాదన్నాడు తండ్రి. ఇంకొంతకాలం తపస్సు చెయ్యమన్నాడు. అలాగే తపస్సు చేశాడు కుమారుడు. ఇప్పుడు తెలిసింది విజ్ఞానమే బ్రహ్మఅని. అదే విషయం తండ్రికి చెప్పాడు భృగువు. కాదన్నాడు తండ్రి. మళ్ళీ కొంతకాలం తపస్సు చెయ్యమన్నాడు. ఇప్పుడు తెలిసింది ఆనందమే బ్రహ్మని. ఆ మాట వినగానే సంతోషించాడు తండ్రి. కుమారుడికి బ్రహ్మోపదేశం చేశాడు. సమస్త భూతాలు, సమస్త ప్రాణులు ఎవరివలన పుట్టి ఎవరివలన జీవించి, ఎవరియందు లయం అవుతాయో అతడే బ్రహ్మ అన్నాడు. ఆ పరబ్రహ్మ ఆది మధ్యాంత రహితుడు, జన్మమృత్యుజరాదులు లేనివాడు. **సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ.** అతడు సత్యస్వరూపుడు. జ్ఞానరూపుడు. అనంతుడు. దేశకాలవస్తుకృతమైన మార్పులు లేనివాడు. జగత్తుకు ఆధారమైనవాడు.

గురువుగారూ ! పరమాత్మ నిరాకారుడు, నిర్గుణ స్వరూపుడు. దేనియందు ఆసక్తి లేనివాడు కదా ! మరి అలాంటప్పుడు సృష్టిస్థితిలయాలు ఎందుకు చేస్తున్నాడు? వీటితో అతడికి సంబంధం ఏమిటి ? అసలు సృష్టి చెయ్యటమనేది అతని లక్షణమా ? లేక తన వినోదం కోసం చేస్తున్నాడా ? అంటూ అనుమానాన్ని వ్యక్తం చేశాడు కృష్ణశర్మ. ఆ

ప్రశ్నను విన్న రత్నాకరుడు ఒక్కక్షణం మౌనం వహించి, ఆ తరువాత తలపంకించి చెప్పటం ప్రారంభించాడు.

"నాయనా కృష్ణశర్మా ! భగవంతుడు ఆకారం లేనివాడు. ఇచ్ఛారహితుడు. గుణరహితుడు అనేది నిజమే. అయితే ఈ సృష్టి ఎందుకు చేస్తున్నాడు అన్నదే ప్రశ్న. నిరాకారుడు, నిర్గుణ స్వరూపుడు అయిన పరబ్రహ్మ ఈ సృష్టి చెయ్యాలి అనుకున్నటువంటి వాడై తనలోని కొంతశక్తిని బయటకు పంపాడు. అయితే అసలు సృష్టి చెయ్యాలని ఎందుకు అనుకున్నాడు? గతంలో ప్రళయం సంభవించినప్పుడు కర్మ పరిపక్వం కాకుండా తనలో లీనమైపోయిన జీవరాశుల యొక్క కర్మను క్షయంచేసి, వాటికి మోక్షం కలిగించాలనే ఆలోచనతో సృష్టిచెయ్యాలని సంకల్పించాడు." అన్నాడు రత్నాకరుడు. ఆ మాట విన్న వెంటనే "గురువుగారూ కర్మ పరిపక్వం కాని జీవరాశులు పరబ్రహ్మలో ఏ విధంగా లీనమైనాయి? కొంచెం వివరించండి" అన్నాడు నారాయణభట్టు. వివరించటం మొదలు పెట్టాడు రత్నాకరుడు.

"నారాయణభట్టూ నీ అనుమాన నివృత్తి చేస్తాను. వినవలసినది" అంటూ ప్రారంభించాడు.

జగత్తంతా లయం అయిపోగానే జీవరాశి అంతా నశించిపోయింది. వస్తుజాలము రూపుమాసిపోయింది. ఈ పరిస్థితిలో కర్మక్షయం చెందిన జీవరాశులు పరమాత్మలో లీనమయిపోయినాయి. అంటే సాయుజ్యం పొందినాయి. మరి కర్మక్షయంకాని జీవుల సంగతి ఏమిటి ? కర్మఫలాన్ని అనుభవించటానికి మళ్ళీ జన్మ ఎత్తాలి కదా ! మరి అవి ఏ విధంగా పరబ్రహ్మలో లీనమైపోతాయి? అన్నదే ప్రశ్న. ప్రళయకాలంలో కర్మక్షయం అయిన జీవరాసితో పాటు కర్మక్షయం చెందని జీవులు తమయొక్క కర్మను తమతోపాటుగా మూటకట్టుకుని పరమేశ్వరునిలో లీనమవుతాయి. ఈ రకంగా కర్మక్షయం కాకుండా తనలో ఉన్న జీవరాశులు కర్మలను క్షయం చేసి వాటికికూడా మోక్షం ప్రసాదించాలనే కోరికతో సృష్టి కార్యక్రమము చేస్తున్నాడు పరబ్రహ్మ. కాబట్టి చరాచర జగత్తును సృష్టించటము అనేది జీవులకు మోక్షము ప్రసాదించటానికే కాని తన లీలా వినోదం కోసం మాత్రం కాదు. ఈ రకంగా సృష్టిస్థితిలయాలు పరమేశ్వరుని యొక్క లక్షణమే కాని వేరు కాదు.

శిష్యులారా ! సృష్టి చెయ్యటము పరమేశ్వరుని లక్షణమే. ఐతరేయోపనిషత్తులో ఈ విషయం పూర్తిగా వివరించబడింది. "ఆత్మయే ఆలోచనా పూర్వకంగా ఈ లోకాలను సృష్టించింది. సృష్టి జరగటానికి ముందు జగత్తు అంతా బ్రహ్మమయంగానే ఉండేది.

దానికి భిన్నమైన పదార్థం ఏదీ లేదు. దానినే 'ఆత్మ అంటారు. ఆ ఆత్మయే లోకాలను సృష్టించాలి అనుకున్నది. కొంతకాలానికి అంభస్సు, మరీచి, ఆపః, మర అనే పేర్లు గల లోకాలను సృష్టించింది.

ద్యులోకానికి ఆవల ఉన్నది అంభస్సు. దానికి ఆశ్రయము సువర్లోకము. అదే స్వర్గము. దానిక్రింద భువర్లోకమున్నది. దాని క్రింద భూలోకమున్నది. ఇది మరము. అనగా మరణము గుణముగా గలది. ఇక్కడ పుట్టిన ప్రతిప్రాణీ మరణిస్తుంది. భూలోకానికి క్రిందగా జలలోకమున్నది. అది క్రిందనున్న లోకాలచే పొందబడుతున్నది. కాబట్టి అపోలోకమనబడుతుంది. ఈ లోకాలన్నీ పంచభూతాలచే నిర్మించబడ్డాయి. ఈ రకంగా లోకాలను సృష్టించిన తరువాత విరాట్ స్వరూపాన్ని, ఇంద్రియాలను, ఇంద్రియాలకు అధిష్ఠాన దేవతలను సృష్టించింది. ఆ తరువాత అన్నాన్ని సృష్టించింది. ఇప్పుడు ప్రాణికోటిని సృష్టించింది. ఈ మానవుల శరీరంలో నేను లేకపోతే ఎలాగ ? అని ఆలోచించి బ్రహ్మ రంధ్రంగుండా మానవశరీరంలో ప్రవేశించింది. ఈ రకంగా ఆత్మలోకాలను, ప్రాణికోటిని సృష్టించి మానవులందరిలోనూ కూడా తాను ప్రవేశించింది. కాబట్టి ఓ శిష్యులారా! పరబ్రహ్మయే ఈ లోకాలను సృష్టించింది. ఈ రకంగా సృష్టి చెయ్యటము అనేది బ్రహ్మయొక్క లక్షణము" అంటూ వివరించాడు రత్నాకరుడు.

"గురువుగారూ ! సృష్టిలో మనకు కనిపించే ప్రతివస్తువూ పరిమితమైనది. నాశనమయ్యేది. అశాశ్వతమైనది. బ్రహ్మము దీనికి వ్యతిరేక లక్షణాలుగల శుద్ధ, బుద్ధ ముక్తస్వభావం గలది. ఇట్టి బ్రహ్మస్వరూపం ఎవరికీ అంత తేలికగా తెలిసేది కాదు గదా! అంటే బ్రహ్మమనేది అప్రసిద్ధిమైనది. ప్రసిద్ధమైనదానికే లక్షణాలుంటాయి. మరిబ్రహ్మ అప్రసిద్ధమైనది కదా? దానికి లక్షణము ఉండదు కదా!" అన్నాడు కృష్ణశర్మ. ఈ మాటలు విన్న రత్నాకరుడు "నాయనా! తైత్తిరీయోపనిషత్తులో చెప్పినట్లుగా నామరూపాత్మకమైన జగత్తు అంతాకూడా పరబ్రహ్మవల్లనే జరుగుతున్నది. ఈ రకంగా సృష్టించబడిన జగత్తుకు ఉపాదాన కారణము, నిమిత్త కారణము రెండూ కూడా బ్రహ్మమే.

ఉపాదాన కారణము అనగా	-	ప్రధాన కారణము
నిమిత్త కారణము అనగా	-	ఉపకారణము

చిత్రకారుడు ముందుగా చిత్రాన్ని మనసులో ఊహించుకుని, తరువాత చిత్రాన్ని గీసినట్లే, పరబ్రహ్మకూడా నామరూపాత్మకమైన జగత్తును ముందుగానే ఊహించి తరువాతనే సృష్టిస్తున్నాడు. పరబ్రహ్మ సర్వశక్తి సంపన్నుడు. అందుచేతనే అనేక పేర్లు, రూపాలు,

కర్తలు, భోక్తలు, క్రియలు, క్రియాఫలాలు గల ఈ జగత్తును సృష్టిస్తున్నాడు. కాబట్టి ఈ సృష్టికి కారణముబ్రహ్మ. సృష్టి అనేది అతినిలక్షణం.

"గురువుగారూ ! సృష్ట్యాది అంటే సృష్టి మొదలైనవి. అనగా సృష్టి స్థితి లయాలు అంటున్నారు కదా ! మరి సృష్టి పరిణామము ఆరు విధాలు అని విన్నాను. అది ఏమిటి?" అన్నాడు కృష్ణశర్మ. దానికి సమాధానంగా

"జాయతే స్తివి పరిణమతే వర్ధతే క్షీయతే వినశ్యతి"

అని సృష్టి పరిణామము ఆరు విధాలుగా 'నిరుక్తం'లో చెప్పబడింది. నిరుక్తము అంటే వేదానికి నిఘంటువు. అందులో

జాయతే	–	పుడుతున్నది
అస్థి	–	అస్థిత్వము పొందుతున్నది
పరిణమితే	–	పరిణామాన్ని పొందుతున్నది
వర్ధతే	–	వర్ధిలుచున్నది. పెరుగుచున్నది
క్షీయతే	–	క్షీణిస్తున్నది
నశ్యతి	–	నశించుచున్నది

అయితే ఈ ఆరు దశలు ఒక దానితో ఒకటి కలిసి మొత్తం మూడే అవుతాయి.

పుట్టుక, అస్థిత్వము పరిణామము పొందటము	–	సృష్టి
వర్ధిల్లటము	–	స్థితి
క్షీణించటము, నశించటము	–	లయము

ఈ రకంగా ఈ ఆరు దశలూ, రెండు రెండు దశలు కలిసిపోయి మొత్తం మూడు దశలు అవుతున్నాయి. అవే సృష్టి స్థితి లయాలు. వీటన్నింటికీ కారణం పరబ్రహ్మ" అంటూ సృష్టి పరిణామ క్రమాన్ని వివరించాడు రత్నాకరుడు.

"గురువరేణ్యా ! సృష్టి స్థితి లయాలకు కారణం బ్రహ్మ అంటున్నారు. మరి ఇతర మతస్తులు అంటే సాంఖ్యులు, శూన్యవాదులు మొ॥వారు ఒప్పుకుంటారా?" అనుమానం వ్యక్తం చేశాడు నారాయణభట్టు. ఆ మాటలు విన్న రత్నాకరుడు కొద్దిగా ఆలోచించి చెప్పటం ప్రారంభించాడు.

"సాంఖ్యమతంలో సృష్టికి కారణం 'ప్రకృతి' అయితే ప్రకృతి జడము. కాబట్టి జడంవల్ల ఈ సృష్టి జరగదు. శూన్యవాదులు సృష్టి స్థితి లయాలకు కారణం 'శూన్యం'

అంటారు. కాని శూన్యమనేది అభావరూపం. జగత్తు భావరూపం. ఇసుక నుండి నూనెరానట్లే అభావంనుంచి భావం ఉత్పత్తి కాదు.

అణువాదులు ఈ జగత్తంతా అణువులచేత నిర్మించబడినది అంటారు. అణువులు జడములు. కాబట్టి జడములైన అణువులు తమంత తాము సృష్టి చెయ్యలేవు. నైయాయికులు అంటే న్యాయశాస్త్రం తెలిసినవారు సృష్టి స్థితి లయాలకు కారకుడుగా ఈశ్వరుణ్ణి అనుమాన ప్రమాణంతో నిరూపిస్తారు.

ఎవరు ఏం చెప్పినప్పటికీ సృష్టి స్థితి లయాలకు పరమేశ్వరుడే కారణము. సాలెపురుగు తన నోటిలో నుండి వచ్చిన దారంతో గూడు అల్లి మళ్ళీ దానిని తన నోటిలోకి తీసుకున్నట్లు గానే పరమేశ్వరుడు ఈ జగత్తును సృష్టించి మళ్ళీ తనలో లీనం చేసుకుంటాడు. అక్షర స్వరూపుడైన పరబ్రహ్మనుంచే ఈ జగత్తు సృష్టించబడి మళ్ళీ అతనిలో లీనమై పోతున్నది.

అవిద్య ఆవరించటంవల్ల మానవుడు ఈ విషయం తెలుసుకోలేకపోతున్నాడు. అటువంటి అజ్ఞానికి గనక ఎవరైనా ఒక గురువు జ్ఞానోదయం చేసినట్లైతే అతడు ఆత్మస్వరూపాన్ని పొంది దుఃఖము నుంచి విముక్తుడౌతాడు. మరి ఆత్మజ్ఞానం పొందటం ఎలా ? అనే విషయాన్ని ఛాందోగ్యోపనిషత్తులో వివరించబడింది.

ఉద్దాలకుడు తన కుమారుడైన శ్వేతకేతువుకు ఆత్మజ్ఞానం పొందే మార్గం వివరిస్తున్నాడు.

"నాయనా ఒక మనిషి కళ్ళకు గంతలు కట్టి, చేతులు కదలకుండా కట్టేసి దట్టమైన అరణ్యంలో త్రోవ తెలియని చోట వదిలేశామనుకో, అప్పుడు అతడు ఏం చేస్తాడు ? పెద్దగా అరుస్తాడు. త్రోవ కనపడదు. భయపడతాడు. ఏడుస్తాడు. ఇప్పుడు ఎవరైనా వచ్చి కళ్ళగంతలు విప్పేశారనుకో. అప్పుడు అతడు దోవ వెతుక్కుంటూ కనిపించిన వారిని తన ఇంటికి దోవ అడుగుతూ చివరకు ఇల్లు చేరగల్గుతాడు. అదే విధంగా అజ్ఞానంతో కొట్టుమిట్టాడుతున్న మానవుడు తన లక్ష్యమైన ఆధ్యాత్మిక సాధన కోసమే ప్రయత్నించాలి. మనం వేసే ప్రతి అడుగుకూ గమ్యం ఆత్మే కావాలి. అప్పుడు అతడికి ఆత్మసాక్షాత్కారం జరిగి అతడే పరబ్రహ్మ అవుతాడు."

ఈ రకంగా సృష్టి స్థితి లయాలకు ఉపాదాన, నిమిత్త కారణము పరబ్రహ్మే. అనే విషయం ఈ సూత్రంలో వివరించబడింది" అంటూ రెండవ అధికరణలో పరబ్రహ్మ లక్షణాలను వివరించాడు రత్నాకరుడు.

3. శాస్త్రయోనిత్వాధికరణము

చరాచర జగత్తును సృష్టించినవాడు బ్రహ్మ. సృష్టి స్థితి లయాలకు కారణము బ్రహ్మ. అని ఇంతవరకు చెప్పబడింది. అయితే ఆ బ్రహ్మ 'సర్వజ్ఞుడు' అని చెప్పి దానికి శాస్త్ర ప్రమాణము నిరూపిస్తున్నారు.

సూ 3 శాస్త్రయోనిత్వాత్

పరబ్రహ్మ సర్వజ్ఞుడు. సర్వశాస్త్రములకు కారణమైనవాడు. వేదాలు అపౌరుషేయాలు. సాక్షాత్తూ బ్రహ్మముఖం నుండే వచ్చినాయి. ఈ రకంగా వేదాలకు కారణమైనవాడు బ్రహ్మ. అందుకే అతడు సర్వజ్ఞుడు. అంతేకాదు బ్రహ్మము అనేది శాస్త్రప్రమాణం గలది. అంటే బ్రహ్మయొక్క యదార్ద స్వరూపానికి, యదార్ధజ్ఞానానికి వేదాలే ప్రమాణము. అందుచేతనే బ్రహ్మకు శాస్త్రప్రమాణమున్నది.

'అసలు శాస్త్రము అంటే ఏమిటి?' సందేహం వెలిబుచ్చాడు కృష్ణశర్మ. "శాశించేదే శాస్త్రము. ఈ రకంగా చెయ్యాలి. ఈ రకంగా చెయ్యకూడదు అని నిర్దేశించేదే శాస్త్రము. అదే వేదము. వేదాలు మహత్తరమైన విషయాలను బోధిస్తాయి. అటువంటి వేదాలకు కారణమైనవాడు బ్రహ్మ. కాబట్టి బ్రహ్మసర్వజ్ఞుడు. అన్ని విషయాలను గురించి వివరించటమనేది ఒక్కపరమేశ్వరుడికి తప్ప సామాన్యుడివల్ల కాదు. అందుచేతనే బ్రహ్మ సర్వజ్ఞుడు.

శాస్త్రాలు రెండు రకాలు 1. పౌరుషేయాలు 2. అపౌరుషేయాలు

1. పౌరుషేయాలు పురుషునిచేత చెప్పబడ్డాయి. అవి పది.

1. పురాణాలు	6. కల్పము
2. న్యాయశాస్త్రము	7. వ్యాకరణము
3. మీమాంస	8. నిరుక్తము
4. శిక్ష	9. ఛందస్సు
5. ధర్మశాస్త్రము	10. జ్యోతిషం

1. పురాణాలు : 1. సర్గ, 2. ప్రతిసర్గ, 3. వంశము, 4. మన్వంతరము, 5. వంశ చరిత్రము అనబడే ఐదు లక్షణాలు ఉన్న దాన్ని పురాణము అంటారు. వేదాలలో సంక్షిప్తంగా చెప్పిన సృష్టి మొదలైన వర్ణనలను వివరిస్తూ, వేదార్ధాన్ని పూర్తిగా వివరిస్తాయి. పురాణాలు 18 ఉపపురాణాలు 18 వీటన్నింటినీ వ్యాసుడే వ్రాశాడు.

2. న్యాయశాస్త్రము : ప్రమాణము, ప్రమేయము మొదలైన విషయ పరిజ్ఞానాన్ని వివరించేదే న్యాయశాస్త్రము.

3. మీమాంస : వేదాలు స్వతః ప్రమాణాలు. అయినప్పటికీ వాటి అర్ధంలో ఎప్పుడైనా అనుమానం వచ్చినట్లైతే, ఆ విషయాన్ని విశదీకరించటానికి ఉపయోగించేది మీమాంస.

4. శిక్ష : వేదాలు చదివేటప్పుడు

1. వర్ణము	4. బలము
2. స్వరము	5. సామము
3. మాత్ర	6. సంతానము

అనే విషయాలను జాగ్రత్తగా గమనించి చదవాలి. లేకపోతే వాటి అర్ధం మారిపోతుంది.

1. వర్ణము : అ నుంచి క్ష వరకు ఉండే అక్షరాలను చక్కగా ఉచ్చరించాలి.

2. స్వరము : వేదానికి నాలుగు స్వరాలుంటాయి.

1. అనుదాత్తము	–	క్రిందికి నొక్కి పలకటము
2. ఉదాత్తము	–	సమానస్థాయిలో పలకటము
3. స్వరితము	–	పైస్థాయిలో పలికేది
4. దీర్ఘస్వరితము	–	పైస్థాయిలో దీర్ఘంగా పలికేది

వీటిని గురుముఖతః నేర్చుకోవాలి.

3. మాత్ర : మాత్ర అంటే 256 లవములు.

తామర పువ్వుల రేకులను కట్టగా చేసి సూదితో గ్రుచ్చినట్లైతే, ఒక్కొక్క దళానికీ గ్రుచ్చుడుబడటానికి ఎంతకాలము పడుతుందో దానికి లవము అని పేరు. ఇంతకన్న తక్కువ మానము కాలానికి చెప్పలేదు.

హ్రస్వాక్షరముల (అచ్చుల) ఉచ్చారణా కాలము	–	ఒక మాత్ర
దీర్ఘాక్షరముల ఉచ్చారణ కాలము	–	రెండు మాత్రలు
హల్లుల ఉచ్చారణ కాలము	–	అర్ధమాత్ర

4. బలము : ఆయా అక్షరాలను ఉచ్చరించేటప్పుడు చేయవలసిన ప్రయత్నము. దీనినే ఊతము అంటారు.

5. సామము : సమానత్వము. మరీ వేగము, మరీ నెమ్మదికాకుండా ఉచ్చరించటము.

6. సంతానము : సంహిత అర్ధాన్ని అనుసరించి కలిపి చదవటము.

5. ధర్మశాస్త్రము : వేదాలలో చెప్పబడిన ధర్మాలను వివరించేది.

6. కల్పము : వైదిక విధులు నిర్ణయించే పద్ధతుల వివరణ.

7. వ్యాకరణము : పద విభజన, సంధి, సమాస పరిచ్ఛేదము. వేదార్థ నిర్ణయానికి ఇది ఉపకరిస్తుంది.

8. నిరుక్తము : వేదాలలోని పదాలకు అర్థాలు చెప్పే నిఘంటువు.

9. ఛందస్సు : పద్యాలు, శ్లోకాలు వ్రాయటానికి ఉపయోగించే తీరు. వేదాలలో గాయత్రి, జగతీ, అనుష్టప్ మొదలైన ఛందస్సులున్నాయి.

10. జ్యోతిషము : రాబోయే కాలం యొక్క ఫలితాలు, తెలియచేస్తూ, వేదకర్మలకు కాలనిర్ణయం చేస్తుంది.

2. అపౌరుషేయాలు : బ్రహ్మముఖం నుండి వచ్చినవి. వేదాలు ఇవి నాలుగు

1. ఋగ్వేదము
2. యజుర్వేదము
3. సామవేదము
4. అధర్వణవేదము

ఋగ్వేదానికి	-	21 శాఖలు
కృష్ణయజుర్వేదానికి	-	94 శాఖలు
శుక్ల యజుర్వేదానికి	-	15 శాఖలు
సామ వేదానికి	-	100 శాఖలు
అధర్వణ వేదానికి	-	500 శాఖలు

ఇప్పుడు వీటిలో చాలా వరకు కనిపించటం లేదు.

ఈ రకంగా మొత్తం శాస్త్రాలు 14. వీటన్నింటికీ కారకుడు పరమేశ్వరుడు. అందుచేతనే అతడు సర్వజ్ఞుడు.

ఈ విధంగా పురాణాలు, మీమాంస మొదలైనవాటివల్ల వేదాలలో చెప్పబడిన అర్థం తెలుస్తోంది. వేదార్థం తెలియనివాడు, వేదంలో చెప్పబడ్డ మహత్తరవిషయాలను తెలుసుకోలేడు. వేదాలు స్వతఃప్రమాణాలు, సూర్యుడు ప్రకాశించటానికి ఇంకొకరి సాయము అవసరం లేదు. అలాగే వేదాలు సర్వార్థాలను ప్రకాశింపచేస్తున్నాయి. అందుకనే అవి పరమేశ్వరునితో సమానమైనాయి.

సర్వార్థాలను ప్రకాశింపచేస్తున్న వేదాలు బ్రహ్మముఖం నుండి వచ్చాయి. ఆ వేదాలకు కారణం బ్రహ్మ. కాబట్టే బ్రహ్మ సర్వజ్ఞుడు అంటూ బ్రహ్మ యొక్క సర్వజ్ఞత్వాన్ని వివరించాడు రత్నాకరుడు.

4. సమన్వయాధికరణము

ఆ మాటలు విన్న నారాయణభట్టు "గురువుగారూ చిన్న సందేహము" అన్నాడు. ఏమిటో చెప్పమన్నట్లుగా తలఎత్తి చూశాడు రత్నాకరుడు. "బ్రహ్మకు శాస్త్రప్రమాణకత్వం ఉన్నది అన్నారు కదా? వేదము అనేది క్రియార్థకం. అంటే క్రియలను (కర్మకాండను) వివరిస్తుంది. ఇంకా వివరంగా చెప్పాలంటే విధి, నిషేధము, అర్థవాదము, మంత్రాలతో కూడిన సమస్తవేదము కూడా యజ్ఞయాగాది కర్మలను గురించి చెబుతోంది. ఇందుకు భిన్నమైనటువంటి **సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ, తత్త్వమసి** లాంటి వేదాంతపరమైన ఉపనిషద్వాక్యాలేవీ క్రియాపరాలు కాదు. కాబట్టి అవి నిష్ప్రయోజనమైనవి. ఈ స్థితిలో మీరు చెప్పే బ్రహ్మము శాస్త్రప్రామాణికము ఎలా అవుతుంది? వేదాంత వాక్యాలలో దేవతను, కర్తను, సాధనను గురించి చెప్పబడింది. అంటే ఉదా॥ 'తత్త్వమసి' ఇక్కడ తత్ అంటే దేవత, త్వం అంటే కర్మచేసే మానవుడు. ఈ విధంగా ఈ రెండు పదాలు దేవతను, కర్తను సూచిస్తున్నాయి. కొన్ని వాక్యాలు ఫలితాన్ని, సాధనను సూచిస్తున్నాయి. కాబట్టి వేదాంతవాక్యాలు కర్మాంగాలు అవుతున్నాయి. అందుచేత బ్రహ్మకు శాస్త్రప్రామాణకత్వం కుదరదు కదా!" అన్నాడు నారాయణభట్టు.

ఆ మాటలు విన్న రత్నాకరుడు బ్రహ్మసూత్రాలలోని నాల్గవ సూత్రాన్ని వివరించటం ప్రారంభించాడు.

సూ 4. తత్తు సమన్వయాత్

తత్, తు, సమన్వయాత్

శాస్త్రప్రామాణకత్వము సమన్వయమువల్ల మాత్రమే తెలుసుకోవలసినది. సమన్వయం అంటే వేదాంతవాక్యాలకు పరస్పర విరోధం లేకుండా ఏకాభిప్రాయం సాధించటం. వేదాంత వాక్యాలు అన్నీ ఒకచోటలేవు. అవి విడివిడిగా అనేక ప్రకరణలలో ఉన్నాయి. కాబట్టి అవి కర్తృ ప్రతిపాదికములు అంటే కర్తను గురించి చెప్పేవికాదు. కేవలము బ్రహ్మను గురించి చెప్పేవే. అన్నివేదాంత వాక్యాలూ ఒకే అర్థంతో బ్రహ్మకు సంబంధించిన జ్ఞానాన్ని కలుగజేస్తాయి. కాబట్టి మహావాక్యాలు కర్మాంగాలు కాదు. వాటి ముఖ్యోద్దేశ్యము బ్రహ్మమే.

సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ

అనే వాక్యంలో సత్యము, జ్ఞానము, అనంతము అనే పదాలు బ్రహ్మనుగూర్చి చెప్పినవే. అంతేకాకుండా ఉపక్రమ, ఉపసంహారాది షడ్విధలింగాలను దృష్టిలో ఉంచుకుని చూసినా మహావాక్యాల అర్థం బ్రహ్మమే. షడ్విధ లింగాలు అంటే ఏదైనా ఒక విషయం యొక్క తాత్పర్యాన్ని నిర్ణయించే సాధనాలు. ఇవి ఆరు.

1.	ఉపక్రమము	–	ప్రారంభము
	ఉపసంహారము	–	సమాప్తి
2.	అభ్యాసము	–	మళ్ళీ మళ్ళీ చెప్పటం
3.	అపూర్వత	–	లోగడ చెప్పినది కాకుండా క్రొత్త విషయం చెప్పటము
4.	ఫలము	–	ప్రయోజనము
5.	అర్థవాదము	–	అర్థాన్ని విచారించటము
6.	ఉపపత్తి	–	యుక్తి

వీటి ఆధారంగా చూసినట్లైతే మహావాక్యాలకర్థం పరబ్రహ్మ. ప్రతిచోట ఉపనిషత్ ప్రారంభంలోనూ అంతంలోనూ కూడా బ్రహ్మను గురించే చెప్పబడింది. ఛాందోగ్యోపనిషత్తులో ఉద్దాలకుడు తనకుమారుడైన శ్వేతకేతువుకు బ్రహ్మోపదేశం చేస్తూ "నాయనా ఈ సృష్టికి పూర్వం జగత్తంతా సత్తుగానే ఉండేది" అని ప్రారంభించి "ఇదంతా ఆత్మస్వరూపమే" అని పూర్తి చేస్తాడు. ఇక 'తత్త్వమసి' ఆ పరబ్రహ్మయే నీవు. అనే పదాన్ని అనేకసార్లు చెప్పాడు. ఇదే అభ్యాసము. శ్వేతకేతువుకు ఉప్పు నీటిలో కలిసినా అది నీకు కనిపించదు. అలాగే బ్రహ్మకూడా సర్వత్రా వ్యాపించినా నీకు కనిపించదు" అంటాడు. అది అపూర్వత.

"బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి" అనే వాక్యంవల్ల బ్రహ్మను తెలుసుకొన్నవాడు కూడా బ్రహ్మమే అని చెప్పబడింది ఇది ఫలము.

ఎవడైతే బ్రహ్మలో నానాత్వాన్ని చూస్తాడో, అంటే బ్రహ్మ ఒకరు కాదు అనేకులున్నారు అని అనుకుంటాడో అతడు గానుగకు కట్టిన ఎద్దులాగా సంసారమనే బండి చక్రంలో పడి తిరుగుతుంటాడు. అని కఠోపనిషత్తులో చెప్పబడింది. ఇది అర్థవాదము.

కుమ్మరివాడు మట్టితో అనేక రకాల పాత్రలు తయారుచేస్తాడు. వాటిరూపాలు వేరైనా, ఉపయోగాలు వేరైనా వాటిని తయారుచేసేందుకు ఉపయోగించిన మట్టి ఒక్కటే" ఈ విషయం ఉపనిషత్తులలో ప్రతిపాదించబడింది. ఇది ఉపపత్తి.

ఈ విధంగా బ్రహ్మము అనేది శాస్త్రప్రామాణికము అని సిద్ధాంతీకరించబడుతోంది.

వేదము కర్మనుగురించి, బ్రహ్మనుగురించి కూడా ప్రతిపాదిస్తోంది. ఇందులో కర్మను గురించి చెప్పే ప్రకరణలు వేరు. బ్రహ్మను గురించి చెప్పే ప్రకరణలు వేరు. వేదాంతం యొక్క ఉద్దేశ్యము బ్రహ్మమే, అంటూ నాల్గవ అధికరణలో బ్రహ్మను తెలుసుకోవటం ఎలాగో వివరించాడు రత్నాకరుడు.

5. ఈక్షత్యధికరణము

"గురువుగారూ ! ఈ జగత్తుకు కారణము చేతనమా ? అచేతనమా ? ఎందుకంటే సాంఖ్యులు వాదన ప్రకారము బ్రహ్మనిర్గుణుడు. వికారాలు లేనివాడు. మరి అటువంటి బ్రహ్మలో వికారము అంటే మార్పు ఎలా కలుగుతుంది? మట్టిలో మార్పు కలగటంవల్ల కుండ తయారవుతుంది. మట్టి జడము. అలాగే జడమైన ప్రకృతిలో మార్పు కలగటంచేత సృష్టి జరగాలి. కాబట్టి ఈ జగత్తుకు ఉపాదాన కారణము చేతనమైన బ్రహ్మ కాదు. జడమైన ప్రకృతి. ఆత్మకు ప్రకృతితో సంబంధం ఏర్పడితేనే సంసార సంబంధం కలుగుతుంది. ఈ అవివేక జన్యమైన సంసారం, జ్ఞానంవల్ల అంతరిస్తుంది. అదే విధంగా వైశేషికులు ఈ జగత్తుకు ఈశ్వరుడు నిమిత్త కారణము అని, వాయువు, అగ్ని, జలము, భూమి ఉపాదాన కారణమని అంటారు.

బౌద్ధులు జగత్తుకు ఉపాదాన కారణం శూన్యము. ఏ వస్తువైనా సరే శూన్యంలో నుంచి పుట్టి చివరకు శూన్యంలోనే లీనమవుతుంది అంటారు.

తార్కికులు గొప్ప వస్తువులన్నీ చాలా తక్కువ వాటితోనే తయారవుతున్నాయి. చిన్నచిన్న దారపు పోగులతోనే పట్టువస్త్రం తయారవుతుంది. అలాగే పరమాణువువల్లనే జగత్తు సృష్టించబడుతోంది. అంతేకాని చేతనుడైన బ్రహ్మవల్ల మాత్రం కాదు. అంటున్నారు. కాబట్టి గురుదేవా ! ఈ జగత్తుకు కారణముచేతనమా ? అచేతనమా ? వివరించండి అన్నాడు కృష్ణశర్మ.

మీ ప్రశ్నలన్నింటికీ సమాధానంగా వ్యాసభగవానుడు ఐదవ సూత్రాన్ని చెబుతున్నాడయ్యా! వినండి. అంటూ 5వ సూత్రాన్ని ప్రారంభించాడు. రత్నాకరుడు.

సూ. 5 ఈక్షతేర్నా శబ్దమ్

ఈక్షతేః, న, అశబ్దమ్.

సాంఖ్యులు చెప్పేటటువంటి జడమైన ప్రకృతి 'ఈక్షణము' అనే పనికి కర్తగా చెప్పటానికి వీలు లేదు. ఛాందోగ్యోపనిషత్తులో ఉద్దాలక అరుణి తన కుమారుడైన శ్వేతకేతువుకు ఆత్మజ్ఞానాన్ని వివరిస్తూ 'ఈ జగత్తంతా సృష్టికి పూర్వం నామరూపాలతో కూడి లేదు. అద్వితీయంగా ఉండేది. కేవలం సత్తు మాత్రమే ఉండేది. ఆ రకంగా ఉన్న పరబ్రహ్మ తాను అనేకం కావాలి అని ఆలోచించింది. అనేక లోకాలను సృష్టించి అనేక రూపాలు పొందాలి అనుకొన్నది" అని చెప్పాడు.

ఐతరేయోపనిషత్తులో 'జీవాత్మ పరమాత్మా రెండూ ఒక్కటే. మరణానంతరము జీవాత్మ పరమాత్మలో లీనమై పోతుంది. ఆత్మయే ఆలోచనా పూర్వకంగా ఈ లోకాలను సృష్టించింది. సృష్టి జరగటానికి ముందు జగత్తు అంతా బ్రహ్మమయంగానే ఉండేది. దానికి భిన్నమైన పదార్ధం ఏమీ లేదు. దాన్నే ఆత్మ అంటారు. ఆ ఆత్మయే ఈ లోకాలను సృష్టించింది.

అదే విధంగా ప్రశ్నోపనిషత్తులోని 1వ ప్రశ్నలో ప్రజాపతి సృష్టి చెయ్యాలనే కోరిక గలవాడై రయి, ప్రాణము అనే జంటను సృష్టించాడు. అని 3వ ప్రశ్నలో ఆత్మనుంచే ప్రాణం పుట్టింది శరీరాన్ని ఆశ్రయించి నీడ ఉన్నట్లుగా, ఆత్మపైన ప్రాణము విస్తరించి ఉన్నది. నీడకు స్వతంత్రమైన అస్థిత్వం లేనట్లే, ప్రాణానికి కూడా స్వతంత్రమైన అస్థిత్వం లేదు." అని చెప్పబడింది.

ముండకోపనిషత్తులో అంగిరసుడు తన శిష్యుడైన శౌనకునికి బ్రహ్మతత్త్వాన్ని వివరిస్తూ "ప్రజ్వరిల్లిన అగ్నినుండి అదే విధమైన ఆకారము, గుణము గల వేలకొలది నిప్పురవ్వలు బయటకు వచ్చినట్లే, పరబ్రహ్మ నుండి అనేకమైన శరీరాలు, రూపాలు వెలువడి, మళ్ళీ అందులోనే లీనమై పోతున్నాయి. బ్రహ్మస్వయం ప్రకాశము గలవాడు. నిరాకారుడు. బాహ్యాభ్యంతరాల్లో ఉండేవాడు. పుట్టుక, ప్రాణము,మనస్సు లేనివాడు. పరిశుద్ధుడు, మాయకు అతీతుడు. అతనినుండే ప్రాణము, మనస్సు, సమస్త ఇంద్రియాలు, పంచభూతాలు పుడుతున్నాయి."

వీటన్నింటిలోనూ 'ఈక్షణ' అనేదానికి కర్త ఆత్మ అనే చెప్పారు. అంతేకాని ప్రకృతి కాదు. కాబట్టి చేతనధర్మం గల బ్రహ్మమే ఈ జగత్తుకు కారణము.

సూ. 6 గౌణశ్చేన్నాత్మ శబ్దాత్
గౌణః, చేత్, న, ఆత్మ శబ్దాత్

ఇందాక చెప్పిన 'ఈక్షితి' (చూపు) అనే శబ్దము గౌణము అంటే అప్రధానం కాదు. అనగా ప్రాముఖ్యత లేనిది అని చెప్పటానికి వీలులేదు. ఎందుకని ? అంటే ఇక్కడ ఆత్మ అంటున్నారు. ఆత్మ అనేది ఈ జగత్తుకు కారణము.

ఐతరేయోపనిషత్తులోని ప్రథమాధ్యాయంలో సృష్టి ఏ రకంగా జరిగిందో వివరించ బడింది. ఆత్మయే ఆలోచనా పూర్వకంగా ఈ లోకాలను సృష్టించింది. లోకపాలకులను, విరాట్స్వరూపాన్ని, ఇంద్రియాలను, ఇంద్రియాధి దేవతలను, ఇంద్రియాల కోసం అన్నము సృష్టించింది. ఇప్పుడు పరమేశ్వరుడు, ఇంద్రియాలతో కూడిన మానవ శరీరంలో ప్రవేశించాలి అనుకున్నాడు. శిరస్సునందలి బ్రహ్మరంధ్రం ద్వారా మానవ శరీరంలోకి ప్రవేశించాడు.

ఛాందోగ్యోపనిషత్తులో ఉద్దాలకుడు తనకుమారుడైన శ్వేతకేతువుకు ఆత్మజ్ఞానాన్ని వివరిస్తూ "మొదటగా ఉన్నది ఏకైక పరబ్రహ్మ అది అనేకం కావాలనుకుంది. రకరకాల రూపాలతో వస్తువులుగా, జీవులుగా రూపుదాల్చింది. ద్రవ, ఘన, వాయు పదార్థాలగా మార్పు చెంది అనేక రూపాలతో సృష్టి ఆకారం పొందింది. ఈ రకంగా పరబ్రహ్మలో నుంచే ఇవన్నీ వచ్చినాయి.

తాను అనేకం కావాలనుకున్నప్పుడు సత్తు మొదటగా అగ్నిని సృష్టించింది. అగ్ని నుండి జలము, జలము నుండి భూమి ఏర్పడ్డాయి. అప్పుడు సత్తు, అగ్ని, జలము, అన్నములలో ప్రవేశించాలి అనుకుంది. అంతే ప్రవేశించి వ్యక్తమైన రూపాలు పొందింది"

జీవుడు ఈ శరీరానికి చేతనుడైన యజమాని. బ్రహ్మానికి జీవుడు స్వరూపం. ఉద్ధాలకుడు చెబుతున్నాడు "మానవుడు నిదురించేటప్పుడు తాత్కాలికంగా ఆత్మలో లీనమవుతాడు. మరణకాలంలో వాక్కు మనసులో లీనమవుతుంది. మనసు ప్రాణంలో లీనమవుతుంది. ప్రాణం తేజస్సులో కలిసిపోతుంది. చివరకు అది పరమశక్తిలో కలిసిపోతుంది. ఆ శక్తి చాలా సూక్ష్మమైనది. కాని విశ్వమంతా వ్యాపించి ఉన్నది. అదే సత్యము. అదే నిత్యము అదే ఆత్మ. అదే నీవు. శ్వేతకేతూ ఆ ఆత్మే నీవు."

ఈ రకంగా నువ్వే ఆత్మ అని ఉపదేశం చెయ్యబడ్డది. అంటే ఆత్మ, జీవుడు ఒక్కటే అని చెప్పబడ్డది" అన్నాడు రత్నాకరుడు. ఆ మాటలు విన్న కృష్ణశర్మ అడుగుతున్నాడు "గురువర్యా ! రాజుగారు తనకు అన్నివిధాలా సహాయకారి అయిన మంత్రిని చూపించి 'ఇతడే నా ఆత్మ' అంటాడు. అందుచేత ఆత్మ అన్నంతమాత్రం చేత ఈక్షితి వ్యవహారం గౌణం కాదనటానికి వీలు లేదు కదా" అన్నాడు.

ఈ సందేహం నివృత్తి చెయ్యటానికి రత్నాకరుడు తరువాతి సూత్రం చెబుతున్నాడు.

సూ 7 తన్నిష్ఠస్యమోక్షోపదేశాత్
తత్, నిష్ఠస్య, మోక్షోపదేశాత్

ఆత్మనిష్ఠుడైన వాడికి మాత్రమే అనగా చేతనుడైన పురుషుడికి మాత్రమే మోక్షోపదేశం చెయ్యటంవల్ల, అచేతనమైన ప్రధానాన్ని (ప్రకృతిని) ఆత్మశబ్దంతో చెప్పటానికి వీలు లేదు. శరీరము జడము అది ఆత్మకాదు.

ప్రకృతి ఆత్మకాదు. అది జడపదార్థం. ఉద్దాలకుడు శ్వేతకేతువుకు ఆత్మజ్ఞానాన్ని వివరిస్తూ "ఓ శ్వేతకేతూ ! నీవే ఆత్మ" ఆత్మయే నీవు. అని ఉపదేశించాడు. అంతా విన్న శ్వేతకేతువు అడుగుతున్నాడు "తండ్రీ! ఆత్మజ్ఞానాన్ని పొందే ఉపాయమేదో శెలవివ్వండి" అని. అప్పుడు ఉద్దాలకుడు చెబుతున్నాడు. "శ్వేతకేతూ! ఒక మనిషి చేతులు కట్టివేసి, కళ్ళకు గంతలు కట్టి భయంకరమైన అరణ్యంలో వదలివేశామనుకో. అప్పుడు అతడికి తాను ఎక్కడున్నాడో తెలియదు. దారితెన్నూ కనిపించదు. అసలు అది పగలో రాత్రో కూడా తెలియదు. ఆ స్థితిలో పిచ్చివానివలె తిరుగుతాడు. గొంతెత్తి అరుస్తాడు. ఏడుస్తాడు. ఆ సమయంలో ఎవరైనా వచ్చి కళ్ళగంతలు విప్పేశారనుకో అప్పుడు అతడికి త్రోవ కనిపిస్తుంది. కనిపించిన బాట వెంట వెడతాడు. త్రోవలో ఎదురైన వాళ్ళను తన ఊరికి దారెటో అడిగి తెలుసుకుంటాడు. అటువంటి ఆత్మనిష్టగలవాడికి శరీరపాతం అంటే ఈ శరీరాన్ని వదలటమే ఆలస్యం. మోక్షం సిద్ధిస్తుంది. అతడు బ్రహ్మ అవుతాడు" అన్నాడు.

ఇక్కడ 'శ్వేతకేతూ నీవే ఆత్మ' అంటే శ్వేతకేతువు శరీరం ఆత్మ కాదు. అతనిలో ఉండే జీవాత్మయే పరమాత్మ. ఆ రెండూ ఒక్కటే అని అర్థం ముండకోపనిషత్తులో పరమాత్మను గురించి వివరిస్తూ ఒకే పేరు, రూపము గల రెండు పక్షులు ఒక చెట్టుమీద కూర్చుని ఉన్నాయి. అందులో ఒకటి జీవి. తన కర్మవల్ల వచ్చిన ఫలితాలను అనుభవిస్తోంది. రెండవది పరమాత్మ. కర్మఫలం ఏదీ లేకుండా చూస్తూ కూచుంది. శరీరమే ఆ వృక్షం. ఆ పక్షులే క్షేత్రజ్ఞ పరమాత్మలు. వారిద్దరూ వేరు కాదు.

పరబ్రహ్మ దివ్యుడు, అచింత్యుడు, సూక్ష్మాతిసూక్ష్మమైనవాడు, అజ్ఞానులకు దూరంగానూ, జ్ఞానులకు దగ్గరగానూ ఉంటాడు. అతడికి రూపం లేదు. కంటికి కనిపించడు.

ఆత్మ అనేది సూక్ష్మరూపంలో మనలోనే ఉంది ఆత్మసాక్షాత్కారానికి చిత్తశుద్ధి అవసరం. శుద్ధమైన అంతఃకరణ గల జ్ఞాని కోరుకున్నవి పొందగలుగుతాడు. అతడికి పునర్జన్మ ఉండదు. అతడే సాక్షాత్తూ పరబ్రహ్మ అని చెప్పబడింది. ఇక్కడ అతడు సాక్షాత్తూ పరబ్రహ్మ అంటే ఎవరు బ్రహ్మ ? సాధకుడి శరీరమా ? కాదే ఆ శరీరం ఇక్కడే మట్టై పోతుంది. మరి బ్రహ్మ ఎవరు ? జీవాత్మ పరమాత్మ రెండూ ఒక్కటే అంటే జడమైన సాధకుని శరీరం బ్రహ్మకాదు. చేతనమైన అతని ఆత్మయే బ్రహ్మము.

ఒకవేళ ఇలా కాకుండా జడమైన ప్రకృతి, లేక సాధకుడి శరీరమే ఆత్మ అనుకుంటే అంధ, వృషభ న్యాయంలా ఉంటుంది. పూర్వకాలంలో ఒక గ్రుడ్డివాడు తన బంధువుల ఇంటికి వెళ్ళటానికి బయలుదేరాడు. దారిలో పెద్ద అడవిగుండా పోవాలి. ఆ అడవిలో త్రోవ తెలియక పెద్దరాయి తగిలి క్రింద పడిపోయాడు గ్రుడ్డివాడు. అటుగా పోతున్న ఒక తుంటరి గ్రుడ్డివాడిని అడిగి విషయం తెలుసుకుని దూరంగా గడ్డిమేస్తున్న ఒక పొగరుబోతు ఆబోతును తోలుకువచ్చి, దానితోకను అతని చేతిలో ఉంచి, ఎట్టి పరిస్థితిలోనూ దీన్ని వదలకు. ఇది నిన్ను మీ బంధువుల ఇంటికి తీసుకుపోతుంది అన్నాడు. ఆ మాట నిజమే అని నమ్మాడు గ్రుడ్డివాడు. ఆబోతు తోకను గట్టిగా పట్టుకున్నాడు. తోకను గట్టిగా పట్టుకోగానే ఆబోతు బెదిరి పరుగెత్తుటం మొదలుపెట్టింది. గ్రుడ్డివాడుకూడా దాని వెనకే పరుగు మొదలుపెట్టాడు. ఆబోతు రాళ్ళు, గోతులు, ముళ్ళు అనే తేడా లేకుండా పరుగెత్తింది. దాంతో గ్రుడ్డివాడు అలసిపోయి, ఒళ్ళంతా దెబ్బలు తగిలి, కదలలేని స్థితిలో క్రింద పడిపోయి ప్రాణాపాయం తెచ్చుకున్నాడు. ఈ శరీరమే ఆత్మ అనుకున్న వారి గతి కూడా అంతే. కాబట్టి జడమైన సాధకుని శరీరం ఆత్మకాదు. అతనిలో ఉన్న జీవాత్మయే పరబ్రహ్మ. ప్రజాపతి చేసిన ఉపదేశాన్ని తప్పుగా అర్థం చేసుకుని, రాక్షసులు ఈ శరీరమే ఆత్మ అనుకుని భ్రష్టులయ్యారు.

సూ 8. హేయత్వా వచనాచ్చ
హేయత్వ, అవచనాత్, చ

'నిరాకరింపబడినది' అనే మాట చెప్పకపోవటంవల్ల ప్రధానం. సచ్ఛబ్ద వాచ్యంకాదు. (ప్రకృతి ఆత్మ కాదు)

ప్రకృతి అనేది అనాత్మ. జడము ఒకవేళ ఇది సచ్ఛబ్ద వాచ్యం గనక అయి ఉంటే, తేలికగా అర్థం కావటం కోసం స్థూల అరుంధతీ న్యాయంగా 'తత్త్వమసి' అని చెప్పినప్పటికీ, ఆ తరువాత యదార్థమైన దానిని గ్రహించేటట్లు చెయ్యటంకోసం ముందు చెప్పిన దాన్ని నిరాకరించాలి. అలా చెయ్యలేదు కాబట్టి జడమైన ప్రకృతి సచ్ఛబ్దవాచ్యం కాదు. అని వాదన.

'స్థూల అరుంధతీన్యాయం'

అరుంధతి వసిష్ఠ మహర్షి భార్య. మహాపతివ్రత. నిత్య సౌభాగ్యవతి. వసిష్ఠుడు సప్తర్షులలో ఒకడు. నక్షత్రమండలంలో ఉత్తర దిక్కున ఉంటారు సప్తర్షులు. సప్తర్షిమండలం పైనే ధృవమండలం ఉన్నది.

సప్తర్షి మండలంలో క్రింది వరుసలో నున్న మూడు నక్షత్రాలలో మధ్యన ఉండేది వసిష్ఠ నక్షత్రం. వసిష్ఠ నక్షత్రానికి దిగువగా, అతి సమీపంలో ఉండే అతిచిన్న నక్షత్రమే అరుంధతి. చాలా జాగ్రత్తగా చూస్తేగాని కనిపించదు. స్థూల అరుంధతీ న్యాయం అంటే– చాలా చిన్నదైన అరుంధతి నక్షత్రాన్ని చూడటానికి దానికి దగ్గరలో ఉన్న పెద్ద నక్షత్రం అయిన వసిష్ఠ నక్షత్రాన్ని ముందు ఆనవాలుగా చూస్తారు. తరువాత అది కాదని దాని ప్రక్కన ఉన్న చిన్న నక్షత్రం చూపుతారు. అలాగే ఏదైనా ఒక సూక్ష్మమైన విషయాన్ని తెలియచేసేటప్పుడు, అది సులభంగా అర్థం గావటానికి, ఇంకొక స్థూలవిషయాన్ని ముందుగా చెప్పి, ఆ తరువాత అది కాదు అని అసలు విషయాన్ని చెప్పటం.

అయితే ఇక్కడ శ్వేతకేతువుకు 'తత్త్వమసి' నువ్వే ఆత్మ అని చెప్పారు. కాని దాన్ని తరువాత నిరాకరించలేదు. అందుచేత చైతన్యమైనదే ఆత్మ. అంతేకాని జడము ఆత్మకాదు.

సూ 9. స్వాప్యయాత్

సుషుప్తి కాలంలో జీవులు స్వరూపంలో లయం చెందుతున్నాయి. కాబట్టి సచ్ఛబ్ద వాచ్యం చేతనమైన బ్రహ్మేకాని జడమైన ప్రకృతి కాదు.

నిద్రపోతున్న మానవుడు ఎక్కడికి పోతాడు ? అని అడిగిన శ్వేతకేతువుకు తండ్రియైన ఉద్దాలకుడు చెబుతున్నాడు. "నాయనా ! నిద్ర పోతున్నప్పుడు మనిషి తాత్కాలికంగా ఆత్మతో తాదాత్మ్యం చెందుతాడు. తేనెటీగలు తోటంతా తిరిగి మకరందాన్ని స్వీకరించి తేనెగా తయారుచేస్తాయి. ఆ తేనె ఆ పూవుల నుంచి స్వీకరించినదే. కాని ఏ చుక్క ఏ పూవు నుంచి తీసిందో చెప్పలేము. అలాగే జీవరాసులు విడివిడిగా ఉన్నప్పటికీ ఆత్మలోనే లీనమై ఉంటాయి. అది నిద్రాసమయం, లేదా మరణ సమయం ఏదైనా కావచ్చు. గాఢనిద్రలో గతం తెలియదు.

మానవుడు నిద్రించేటప్పుడు ఆత్మలో తాత్కాలికంగా లీనమవుతాడు. ఆ ఆత్మయే నీవు"

కుమారా ! మానవుడు గాఢనిద్రలో ఉన్నప్పుడు అతడు సుషుప్తిలో ఉన్నాడంటారు. ఆ సమయంలో జీవుడు పరమసత్తను పొందుతాడు. అంటే తన నిజస్వరూపాన్ని పొందుతాడు. ఆ స్థితిలో ఆత్మను స్వపితి అంటారు. సుషుప్తావస్థలో మనస్సు ఇంద్రియాలు పని చెయ్యటం మానివేస్తాయి. అప్పుడు మిగిలేది ఆత్మ మాత్రమే.

బృహదారణ్యకోపనిషత్తులో బాలాకికి కాశీరాజు బ్రహ్మోపదేశం చేస్తాడు. అందులో "జీవి నిద్రిస్తుండగా ఇంద్రియాల యొక్క విషయాలన్నీ, అంటే వాక్కు మొదలైన ప్రాణాల విజ్ఞానాన్ని పూర్తిగా గ్రహించి హృదయాకాశంలో నిద్రిస్తున్నాడు.

ఈ రకంగా సుషుప్తిలో ఇంద్రియాలన్నీ ఆత్మలో లయం చెందుతాయని చెప్పబడింది. కాబట్టి చైతన్యమైన ఆత్మయే సచ్ఛబ్దవాచ్యము. అంతేకాని జడమైన ప్రకృతి కాదు.

సూ 10. గతి సామాన్యాత్

వేదాంతములన్నీ చేతనమైన బ్రహ్మయే జగత్కారణము అని చెబుతున్నాయి. కాబట్టి జగత్కారణం ప్రకృతి కాదు. బ్రహ్మమే.

ఉపనిషత్తులలో ఒకసారి జగత్తుకు కారణము బ్రహ్మఅని, ఇంకోసారి కాదు అని చెప్పలేదు. ప్రతిచోట ఉపనిషత్తులు ఈ జగత్తుకు కారణము 'బ్రహ్మమే' అని చెప్పాయి. ముండకోపనిషత్తులో శౌనకుడికి అంగిరసుడు ఈ విషయాన్ని చెబుతూ, "ప్రజ్వరిల్లిన అగ్ని నుండి అదే విధమైన ఆకారము, గుణము గల వేలకొలది నిప్పురవ్వలు వెలువడినట్లే పరబ్రహ్మనుండి అనేకమైన జీవరాసులు ఉద్భవించి, మళ్ళీ అందులోనే లీనమవుతున్నాయి".

సాలెపురుగు ఏ సహాయం లేకుండానే తన శరీరంనుంచి దారాలను తయారుచేసి వాటిని మళ్ళీ తానే మ్రింగేస్తుంటుంది. భూమి నుండి ఓషధులు పుడుతున్నట్లుగా, మానవ శరీరం మీద రోమాలు పుడుతున్నట్లుగా, అక్షర పరబ్రహ్మ నుంచి ఈ జగత్తు పుడుతున్నది. తైత్తిరీయోపనిషత్తులో "సృష్టికి మూలము ఆత్మ. దానినుంచే ఆకాశం పుట్టింది. పంచభూతాలు పుట్టినాయి. పంచభూతాలవల్లనే శరీరం ఉద్భవించింది." అని చెప్పబడింది.

ఈ రకంగా ప్రతి ఉపనిషత్తు కూడా ఈ జగత్తుకు కారణము బ్రహ్మయే అని చెబుతున్నాయి.

సూ. 11 శ్రుతత్వాచ్చ
శ్రుతత్వాత్, చ

సర్వజ్ఞుడైన పరబ్రహ్మయే ఈ జగత్తుకు కారణము అని ఉపనిషత్తులు ఘోషిస్తున్నాయి కాబట్టి ఈ జగత్తుకు కారణము చేతనమైన బ్రహ్మయే కాని, అచేతనమైన ప్రకృతి కాదు. అంటూ ఐదవ అధికరణము పూర్తి చేశాడు రత్నాకరుడు.

"గురువుగారూ ! ఈశ్వరుడు ఒక్కడే అయినప్పటికీ సాకారము, నిరాకారము అని రెండు రకాలుగా చెప్పబడుతున్నాడు. నామము, రూపము, వికారము, ఉపాధి (శరీరము) వీటితో కూడినవాడు ఉపాస్యుడు. ఈయనే సాకారుడు. నామరూప వికారాలు లేనివాడు నిరాకారుడు. జ్ఞేయుడు అనబడతాడు.

ఈ ఇద్దరిలో ఎవరు బ్రహ్మ? కాస్త వివరించండి" అంటూ అడిగాడు నారాయణభట్టు. ఆ ప్రశ్న విన్న రత్నాకరుడు.

"నాయనా ! వీరిద్దరిలో ఎవరివల్లనైతే నీకు శాశ్వతమైన ఆనందం కలుగుతుందో, అతడే బ్రహ్మ. ఈ విషయం 6వ అధికరణంలో చెప్పబడింది. దాన్ని మీకు చెబుతాను వినండి. అంటూ శిష్యుని సందేహ నివృత్తి చెయ్యటానికుపక్రమిస్తున్నాడు రత్నాకరుడు.

6. ఆనందమయాధికరణం

సూ 12. ఆనందమయోఽభ్యాసాత్

ఆనందమయః, అభ్యాసాత్

ఆనందమయుడు అనే శబ్దాన్ని పరబ్రహ్మను శూచించటానికే ఉపనిషత్తులలో పదేపదే వాడారు. అందుచేత ఆనందమయుడంటే పరమాత్మ అంతేకాని జీవికాదు.

తైత్తిరీయోపనిషత్తులో అన్నమయ, ప్రాణము, మనోమయ విజ్ఞానమయ కోశాలు దాటిన తరువాత ఆనందమయ కోశమున్నది. అదే పరమాత్మ స్థానము. చరాచర జగత్తంతా బ్రహ్మమయమే. సృష్టికి పూర్వం అంతా శూన్యంగానే ఉండేది. ఆ శూన్యంలో పరబ్రహ్మ ఒక్కడే ఉండేవాడు. అతడే నామరూపాత్మకమైన జగత్తును సృష్టించాడు. అతడే ఆనందమయుడైన బ్రహ్మ.

బ్రహ్మను తెలుసుకున్నవాడు మోక్షానికి అర్హుడు. అంటే తానే పరబ్రహ్మ అవుతాడు. దహరాకాశంలో ఉన్న పరబ్రహ్మని తెలుసుకున్న వాడికి జ్ఞానము, ఇష్టకామ్యార్థ సిద్ధి కలుగుతుంది. సాయుజ్యం లభిస్తుంది.

ఆనందమయుడు బ్రహ్మ. అంటే ఆనందాన్ని కలుగజేసేవాడు బ్రహ్మ. ఆనందము అంటే క్షణికమా ? శాశ్వతమా ?

తైత్తిరీయోపనిషత్తులో చెప్పినట్లుగా

కోరికలను అనుభవించటంవల్ల పొందే ఆనందం క్షణికానందం. అనుభవించగానే ఈ ఆనందము తరిగిపోతుంది. రెండవది శాశ్వతమైన ఆనందం. అదే బ్రహ్మానందం. ఈ లోకంలోని సంపద అంతా యువకుడు, సదాచార సంపన్నుడు, వేదాధ్యాయి, శరీర బలము గలవాడు అనుభవించటానికే ఉన్నది. ఇటువంటి వ్యక్తి అనుభవించే ఆనందాన్ని మానుషానందము అంటారు.

మానుషానందానికి నూరు రెట్లు	–	మానుష్యగంధర్వానందం
మనుష్య గంధర్వానందానికి నూరురెట్లు	–	దేవగంధర్వానందం
దేవగంధర్వానందానికి నూరురెట్లు	–	చిరలోక పితరానందం

చిరలోకపితరానందానికి నూరురెట్లు	–	అజానజదేవానందం
అజానజదేవానందానికి నూరురెట్లు	–	కర్మదేవానందం
కర్మదేవానందానికి నూరురెట్లు	–	దేవానందం
దేవానందానికి నూరురెట్లు	–	ప్రజాపతి ఆనందం
ప్రజాపతి ఆనందానికి నూరురెట్లు	–	బ్రహ్మానందం

ఇతడే ఆనందస్వరూపుడైన పరబ్రహ్మ.

ఆనందమయుడైన బ్రహ్మ పంచకోశముల లోపల ఉన్నాడు. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశముల మధ్య ఆనందమయ కోశమున్నది. అందులో ఉండే ఆనందమయ పురుషుడికి

ప్రియము (తనవారిని చూచినప్పుడు కలిగే సంతోషము)	–	శిరస్సు
మోదము (కోరుకున్నది లభించినప్పుడు కలిగే సంతోషము)	–	దక్షిణ పక్షము
ప్రమోదము (మోదము ఎక్కువైనపుడు కలిగేది)	–	ఉత్తర పక్షము
ఆనందము (అన్నింటినీ మించినది)	–	ఆత్మ

అని చెప్పబడింది. ఇక్కడ చివరలో చెప్పిన ఆనందాన్ని మించినది లేదు. అదే పరమాత్మ.

సూ. 13 వికారశబ్దాన్నేతి చేత్‌న ప్రాచుర్యాత్

వికారశబ్దాత్, న, ఇతి, చేత్, న, ప్రాచుర్యాత్

బ్రహ్మవిషయంలో 'ఆనందమయుడు' అనే శబ్దం వాడకూడదు. బ్రహ్మ ఆనందము అనే వికారం కలవాడు అని చెబుతున్నారు కాబట్టి ఆనందమయుడు బ్రహ్మకాదు అని కొందరంటారు. కాని అది సరికాదు. ఎందుకంటే మానుషానందం నుంచి వరుసగా బ్రహ్మానందం వరకు చెప్పారు. అంతేకాని ఆనందము అనేది బ్రహ్మకు వికారం కాదు. బ్రహ్మనిర్వికల్పుడు.

సూ. 14 తద్ధేతు వ్యపదేశాచ్చ

తద్, హేతు, వ్యపదేశాత్, చ

అటువంటి ఆనందానికి హేతువు బ్రహ్మ. కాబట్టి ఆనందమయుడంటే పరమాత్మయే కాని వేరు కాదు.

సూ. 15 మాంత్రవర్ణికమేవ చ గీయతే

మాంత్రవర్ణికమ్, ఏవ, చ, గీయతే

మంత్రాల్లో చెప్పబడినట్టి బ్రహ్మమే బ్రాహ్మణంలో గానం చేయబడుతున్నది.

సత్యము జ్ఞానము అనంతము అయినది బ్రహ్మ. ఆకాశాది పంచభూతాలను ఆ బ్రహ్మమే సృష్టించింది. తరువాత ఆ భూతాలలో ప్రవేశించి బుద్ధిరూపమైన గుహలోనే పరబ్రహ్మ ఉన్నది. వారుణివిద్యలో వరుణ మహర్షి కుమారుడు భృగుమహర్షి. విద్యాభ్యాసం పూర్తిచేసి బ్రహ్మోపదేశం చెయ్యమని తండ్రిని అడుగుతాడు. బ్రహ్మవిద్య ఉపదేశిస్తే తెలిసేది కాదు. తపస్సు చేసి తెలుసుకోవాలన్నాడు తండ్రి. అలా తపస్సు చేసిన భృగువుకు వరుసగా అన్నము, ప్రాణము, మనస్సు, విజ్ఞానము చివరకు ఆనందమే బ్రహ్మము అని తెలిసింది. కాబట్టి ఆనందమయుడు పరమాత్మే.

సూ. 16 నేతరో஽నుపపత్తేః

న, ఇతరః, అనుపపత్తేః

ఆనందమయుడు అనే శబ్దానికి అర్థం పరబ్రహ్మకన్న ఇతరులు ఎవరూ లేరు. సృష్టి ప్రారంభానికి ముందు పరమాత్మ సృష్టి చెయ్యాలని కోరుకున్నాడు. ఈ రకంగా 'కోరటం' అనే ధర్మము జీవుడికి వర్తించదు. అది బ్రహ్మకే వర్తిస్తుంది. ఆ బ్రహ్మయే ఆనందమయుడు.

సూ. 17 భేదవ్యపదేశాచ్చ

భేద, వ్యపదేశాత్, చ

జీవాత్మకు పరమాత్మకు భేదం చెప్పటంవల్ల కూడా జీవుడు ఆనందమయుడు కాదు అని తెలుస్తోంది. వాస్తవంగా చూస్తే జీవాత్మ పరమాత్మలకు భేదం లేదు. కాని యదార్థం తెలియక, అజ్ఞానంతో ఈ రెండింటి మధ్యనా తేడా ఉందని అనుకుంటారు. ఈ విషయమే ముండకోపనిషత్తులో వివరించటం జరిగింది. ఒకే చెట్టుమీద రెండు పక్షులు కూచుని ఉన్నాయి. వాటిలో ఒకటి కర్మఫలాన్ని అనుభవిస్తోంది. రెండవది చూస్తూకూచుంది. ఇవే జీవాత్మ, పరమాత్మలు. ఆ రెండూ ఒక్కటే, అజ్ఞానంవల్ల రెండింటికీ తేడా ఉన్నది అనుకుంటున్నారు.

పరమేశ్వరుడు లోకాలను, ప్రాణులను సృష్టించిన తరువాత బ్రహ్మరంధ్రంగుండా ప్రాణులలో ప్రవేశించి నవరంధ్రాలతో కూడిన ఈ పట్టణంలో ఉంటూ ఇంద్రియాలతో

అన్ని సుఖాలూ అనుభవిస్తూ బయటకుపోయే మార్గం తెలియక పంజరంలో బంధించబడిన పక్షిలాగా కొట్టుమిట్టాడుతున్నాడు. అతడు శరీరంలో ఉన్నంతవరకు ఈ శరీరానికి ఉన్న బంధనాలన్నీ తనవే అనుకుంటాడు. ఇతడే జీవాత్మ. జీవాత్మ గనక వచ్చిన త్రోవనే అంటే బ్రహ్మరంధ్రం ద్వారానే బయటకు వెళ్ళగలిగినట్లైతే అది పరమాత్మలో లీనమవుతుంది. అంతవరకు అజ్ఞానంతో తాను, పరబ్రహ్మ వేరువేరని తలుస్తుంది. అంతేగాని నిజానికి ఆ రెండూ ఒక్కటే.

సూ. 18 కామాచ్చ నానుమానాపేక్షా

కామాత్, చ, న, అనుమాన, అపేక్షా

'సో஽కామయత' అంటూ సాంఖ్యులు కోరికను చెప్పినందువల్ల అనుమాన ప్రమాణంతో సాధించిన జడమైన ప్రకృతి ఆనందమయము కాదు.

సూ. 19 అస్మిన్నస్యచ తద్యోగంశాస్తి

అస్మిన్, అస్య, చ, తత్, యోగం, శాస్తి

అజ్ఞాని అయిన వాడికి జ్ఞాన సముపార్జన జరిగిన తరువాత, అతని ఆత్మ పరమాత్మలో లీనమై పోతుంది. పరమాత్మయందు తాదాత్మ్యం గలవాడికి సంసారబంధనాలుండవు. ద్వైదీభావము ఉన్నవాడికి సంసార భయం ఉంటుంది.

సంసార బంధనాలలో చిక్కుకుని, దుఃఖసాగరంలో మునిగిపోయినవాడు, అజ్ఞానం తొలగిపోగానే సంసారబంధనాలు త్రెంచుకుని ఆనందమయుడైన పరమాత్మలో లీనమైపోతాడు.

ఈ రకంగా ఆనందమయుడు చైతన్యమైన బ్రహ్మయేకాని, జడమైన ప్రకృతికాదు. అంటూ ఆరవ అధికరణను పూర్తి చేశాడు రత్నాకరుడు.

ఆ మాటలు విన్న కృష్ణశర్మ 'గురువుగారూ ! ఆదిత్య మండలంలోని పురుషుడు, అక్షిలోని పురుషుడు జీవుడేనా?" అంటూ అడిగాడు. ఆ మాటలు విన్న రత్నాకరుడు "నాయనా ! నీ ప్రశ్నకు సమాధానంగా తరువాతి రెండు సూత్రాలను వివరిస్తాను. వినవలసినది" అంటూ ప్రారంభించాడు.

7. అంతరధికరణము

సూ. 20 అంతస్తద్ధర్మోపదేశాత్

అంతః తద్ధర్మ, ఉపదేశాత్

ఆదిత్యమండలంలోని పురుషుడు, అక్షిలోని పురుషుడు, సంసారియైనట్టి అతిశయమును పొందినట్టి జీవుడు కాదు. అతడు పరమేశ్వరుడే. పరమాత్మ పాపరహితుడు. ఈ ధర్మము అక్షియందున్న పురుషుడికి కూడా చెప్పబడింది కాబట్టి అతడు కూడా పరమాత్మయే అతడే ఋక్కు, అతడే యజస్సు, అతడే సామము. అతడే బ్రహ్మ.

పరమాత్మకు శబ్దస్పర్శ రూపాదులు లేవు. అతడు అవ్యయుడు. ఛాందోగ్యోపనిషత్తులో సనత్కుమారుడు నారదుడికి బ్రహ్మోపదేశం చేస్తూ "ఆత్మ సర్వవ్యాపకమైనది. ఊర్ధ్వలోకాలలో, అధోలోకాలలో కూడా అది వ్యాపించి ఉంది. అని చెప్పాడు.

సూ. 21 భేదవ్యపదేశాచ్చాన్యః
భేద, వ్యపదేశాత్, చ, అన్యః

సూర్యుడు వేరు, పరమాత్మ వేరు, పరమాత్మ సూర్యునిలోనే ఉన్నాడు. కాని అతడు సూర్యుడు కాదు. బృహదారణ్యకంలో చెప్పినట్లుగా సూర్యుడు అన్ని భూతాలకూ మధువు అన్ని భూతాలు ఆదిత్యునికి మధువులాంటివి. ఆదిత్యునిలో ఉన్న ప్రకాశవంతమైన పురుషుడే శరీరంలోని కనులలో ఉండే తేజోమయుడైన పురుషుడు. వీరిద్దరూ ఒకటే. అదే ఆత్మ.

పరమాత్మ ఆదిత్యలోకంలో ఉంటాడు. ఆదిత్యలోకం అతన్నెరగదు. ఆదిత్యలోకమే అతని శరీరం. ఆదిత్య లోకంలో ఉంటూ ఆదిత్యలోకాన్ని నియంత్రిస్తాడు. అతడే అంతర్యామియైన ఆత్మ.

కాబట్టి ఆదిత్యునికన్న భిన్నమైనవాడు ఆ పరమాత్మ అంటూ వివరించాడు రత్నాకరుడు.

"గురువుగారూ ! ఆకాశం అంటే ఏది ? భూతాకాశమా ? లేకపోతే పరమాత్మయా?" వివరంగా చెప్పండి అన్నాడు నారాయణభట్టు. ఆ మాటలు విన్న రత్నాకరుడు ప్రారంభించాడు.

"నాయనా ! ఆకాశము నుండి వాయువు, వాయువు నుండి అగ్ని, అగ్ని నుండి జలము, జలము నుండి భూమి ఉద్భవించాయని సృష్టిక్రమంలో చెప్పబడింది. ఇక్కడ ఆకాశము అంటే భూతాకాశమే. కాని సమస్త భూతాలు ఆకాశంనుండే పుడుతున్నాయి. అని శ్రుతులు చెబుతున్నాయి. సమస్త భూతాలు ఆకాశం నుంచే పుట్టి అందులోనే లయమవుతున్నాయి. అంటే ఆకాశము అన్నప్పుడు ఇక్కడ 'పరబ్రహ్మ' అనే అర్థము. ఈ విషయాన్నే 22వ సూత్రంలో వివరిస్తున్నారు.

8. ఆకాశాధికరణము

సూ. 22 ఆకాశ స్తల్లింగాత్
ఆకాశః, తద్, లింగాత్

ఆకాశము అనే శబ్దం, పరమాత్మ సూచకము.

ఛాందోగ్యోపనిషత్తులో శిలకుడు, దార్బ్యల్యుడు, ప్రవాహణుడు ఉద్గీతమీద వాదోపవాదాలు చేస్తుంటారు. శిలకుడు అడుగుతున్నాడు "ఈ లోకానికి ఆధారం ఏది?" ప్రవాహణుడు చెబుతున్నాడు. "స్వరాభిన్నమైన ఆకాశమే ఈ లోకానికి ఆశ్రయం. ఆకాశం అంతటా ఆవరించి ఉన్నది. ఆకాశం అంటే పరబ్రహ్మ. సమస్త లోకాలు, జీవకోటి అంతా కూడా ఆకాశరూపమైన పరబ్రహ్మనుంచే ఉద్భవించి, అందులోనే లీనమవుతున్నాయి. కాబట్టి ఈ లోకానికి పరబ్రహ్మే ఆధారము".

వాయువు మొదలైన భూతాలన్నీ ఆకాశంనుంచే పుడుతున్నాయి. అంతమాత్రంచేత ఆకాశమంటే భూతాకాశం కాదు. అది పరమాత్మ. కాబట్టి 'ఆకాశం' అనగానే భూతాకాశం స్ఫురించినా, దాని అర్థం మాత్రం పరమాత్మయే అన్నాడు రత్నాకరుడు.

9. ప్రాణాధికరణము

ఆ మాటలు విన్న కృష్ణశర్మ చిన్నగా అడుగుతున్నాడు. "గురువుగారూ ! మరి ప్రాణము అంటే పరమాత్మయా ? లేక ప్రాణ, అపానాదులలోని ఒకటా?"

ఆ ప్రశ్నను విన్న రత్నాకరుడు చిన్నగా నవ్వి "నాయనా ! ఈ అనుమానం తీర్చటానికే వ్యాసభగవానుడు ఈ అధికరణాన్ని చెబుతున్నాడు.

సూ. 23 అత ఏవ ప్రాణః
అతఏవ, ప్రాణః

ప్రాణమనేది పరబ్రహ్మ రూపము.

ఛాందోగ్యోపనిషత్తులో ఉషస్తి చాక్రాయణుడు యాగం చేస్తున్న ఋత్విక్కులను పిలిచి చెబుతాడు. మీరు చేసే కార్యకలాపాలకు అధిష్ఠానదైవం ప్రాణం. అన్ని జీవరాశులు ప్రాణంలో ప్రవేశిస్తాయి. ప్రాణంతోనే జీవిస్తాయి." ఇక్కడ ప్రాణము అంటే పరబ్రహ్మ.

ఉద్దాలకుడు తనకుమారుడైన శ్వేతకేతువుకు సుషుప్తిని గురించి వివరిస్తాడు. సుషుప్తావస్థలో మనస్సు, ఇంద్రియాలు పని చెయ్యటం మానివేస్తాయి. ఇంద్రియాలన్నీ

అలసట చెంది ఒక్కొక్కటే మనస్సులో లీనమవుతాయి. మనస్సు ప్రాణంలో లీనమవుతుంది. సుషుప్తావస్థలో ఒక్కప్రాణం మాత్రమే మేల్కొని ఉంటుంది. ఆ ప్రాణమే ఇంద్రియాల యొక్క మనస్సు యొక్క అలసటను తీరుస్తుంది.

ఇక్కడ ప్రాణం అంటే ప్రాణాపానాదులలోని ప్రాణమే అని ముందు అనిపించినా, ఇంద్రియాలు, మనస్సు అన్నీ ప్రాణంలో లీనమవుతాయి అని చెప్పటంవల్ల ప్రాణం అంటే పరమాత్మే కాని వేరు కాదు. అంటూ ప్రాణాధికరణం పూర్తిచేశాడు రత్నాకరుడు.

"గురువుగారూ ! ఆకాశము అంటే బ్రహ్మ అన్నారు. ప్రాణము అంటే బ్రహ్మ అన్నారు. మరి జ్యోతి అంటే పంచభూతాలలో ఉండే అగ్నా ? లేక పరమాత్మా ? కాస్త వివరించండి" అన్నాడు కృష్ణశర్మ. ఆ విషయం చెప్పటానికి ప్రారంభించాడు రత్నాకరుడు.

10. జ్యోతిశ్చరణాధికరణము

సూ. 24 జ్యోతిశ్చరణాభిధానాత్

జ్యోతిః, చరణ, అభిధానాత్

ఇక్కడ జ్యోతికి చరణములు అంటే పాదములు చెప్పటంవల్ల, జ్యోతి అంటే పంచభూతాలలోని అగ్ని కాదు. సాక్షాత్తు పరమాత్మయే.

ఛాందోగ్యోపనిషత్తులో గాయత్రి అనబడే బ్రహ్మ యొక్క 'మహిమ గొప్పది. పృథ్వి రూపమైన గాయత్రి, శరీరంలో ఉండే పంచభూతాలు, ఇంద్రియాలు, అన్నీ ఒకటే పురుషుని శరీర రూపమైన గాయత్రియే పురుషుని హృదయ కమలంలో ఉండే పురుషుడు. ఇద్దరూ ఒక్కటే. అంటే ఆ పురుషునిలోనే, గాయత్రిలోనే ప్రాణాలు ప్రతిష్ఠితమై ఉన్నాయి.

ఈ జగత్తంతా బ్రహ్మయొక్క విభూతే. శుద్ధబ్రహ్మ కార్యబ్రహ్మకన్న గొప్పది. పాంచభౌతికమైన జగత్తంతా శుద్ధబ్రహ్మయొక్క ఒక పాదమే. మిగిలిన మూడు పాదాలు ఆ పరబ్రహ్మలోనే ఉన్నాయి. గాయత్రి ద్వారా ప్రతిపాదించబడిన మూడు పాదములుగల అమృత స్వరూపమైన బ్రహ్మము ఇదే.

సూ. 25 ఛందోఽభిధానాన్నేతిచేన్న తథా

చేతోఽర్పణ నిగదాత్తథాహి దర్శనమ్

ఛందః, అభిధానాత్, న, ఇతి, చేత్, న, తథా

చేతోఽర్పణ, నిగదాత్, తథాహి, దర్శనమ్

గాయత్రీ మంత్రము ఛందస్సును చెబుతోంది కాబట్టి అది బ్రహ్మ కాదు. అని వాదము. అయితే శ్రుతులలో గాయత్రీ ఛందస్సుద్వారా, గాయత్రి యందు ఉన్న బ్రహ్మమందు చిత్తాన్ని ఏకాగ్రం చెయ్యాలి. అని చెబుతున్నారు. కాబట్టి బ్రహ్మమే నాలుగు పాదములు గలది అని అర్థం.

"అయితే గాయత్రి నాలుగు పాదాలు గలది. అని చెప్పారు కాని అది బ్రహ్మ అని చెప్పలేదు. అని కొంతమంది అంటారు. కదా!" అంటూ ప్రశ్నించాడు నారాయణభట్టు.

గాయత్రి ఛందస్సు ద్వారా గాయత్రిలో ఉన్న బ్రహ్మయందు మనసు నిలిపి, అదే సర్వమూ అని ఉపాసించాలి. ఈ సమస్తమూ గాయత్రే. అంతేకాని అక్షరముల కూర్పు కాదు.

సూ. 26 భూతాది పాదవ్యపదేశోపపత్తేశ్చైవమ్

భూతాది, పాద, వ్యపదేశ, ఉపపత్తేః, చ, ఏవం ॥

పృథివి మొదలైన భూతాలను గాయత్రి పాదాలుగా చెప్పబడ్డాయి. కాబట్టి గాయత్రి అంటే బ్రహ్మమే. ఒకవేళ గాయత్రి గనక బ్రహ్మకాకపోతే పృథివి మొదలైన భూతాలు దీనికి పాదాలుగా ఉండవు.

సూ. 27 ఉపదేశభేదాన్నేతిచేన్నోభయస్మిన్నప్యవిరోధాత్ ।

ఉపదేశ, భేదాత్, న, ఇతిచేత్, న, ఉభయస్మిన్, అపి, అవిరోధాత్ ॥

ఉపదేశ వాక్యాలు వేరుగా ఉండటంవల్ల వాక్యంలో చెప్పిన వస్తువు భిన్నం కాదు. గాయత్రి మంత్రాన్ని ఎన్ని రకాలుగా ఉపదేశించినా, అందులో చెప్పబడ్డ బ్రహ్మ ఒక్కటే. అంటూ ఈ అధికరణంలో బ్రహ్మజ్యోతి స్వరూపుడు అని, జ్యోతి అంటే అగ్ని కాదు. బ్రహ్మమే అని వివరించాడు రత్నాకరుడు.

"గురువుగారూ ! ప్రాణమే బ్రహ్మ అంటారు కదా! మరి ప్రాణమంటే మామూలు ప్రాణమా ? లేక వాయువా? వివరించండి." అన్నాడు నారాయణభట్టు చెప్పటం ప్రారంభించాడు రత్నాకరుడు.

11. ప్రతర్దనాధికరణము

"గురువర్యా ! గతంలో ప్రాణాధికరణం చెబుతూ, 'ప్రాణమే బ్రహ్మ' అని చెప్పారు. కాని ప్రాణము వాయురూపమైనదా ? దేవతా ? పరబ్రహ్మ స్వరూపమా ? అనే అనుమానం ఇంకా పట్టి పీడిస్తోంది. కాబట్టి దీన్ని గురించి పూర్తిగా వివరించండి" అన్నాడు కృష్ణశర్మ.

ఆమాటలు విన్న రత్నాకరుడు ప్రాణాన్ని వివరించటం ప్రారంభించాడు.

సూ. 28 ప్రాణ స్తథానుగమాత్

ప్రాణః, తథా, అనుగమాత్

పూర్వకాలంలో కాశీనగరాన్ని దివోదాసు అనే రాజు పరిపాలిస్తున్నాడు. అతడు చాలా పండితుడు, విద్వాంసుడు, పరాక్రమశాలి, ధర్మపరాయణుడు. అతని పాలనలో ప్రజలంతా సుఖశాంతులతో హాయిగా ఉన్నారు. దివోదాసు కుమారుడు 'ప్రతర్దనుడు' తండ్రికి తగ్గ తనయుడు.

ఒకసారి దేవదానవులకు భీకరమైన పోరు జరుగుతున్నది. దానవుల ధాటికి తట్టుకోలేక దేవతలు వెనుకంజ వెయ్యవలసి వచ్చింది. ఆ సమయంలో ఇంద్రుడికి గుర్తు వచ్చాడు దివోదాసు. వెంటనే దేవతలకు సహాయం రావలసిందిగా కబురు పంపాడు. విషయం తెలుసుకున్న దివోదాసు తనకుమారుడైన ప్రతర్దనుణ్ణి దేవతలకు సాయంగా పంపాడు. ఆ యుద్ధంలో చివరకు దేవతలే విజయం సాధించారు. విజయోత్సవ వేడుకలు నిర్వహించటానికి సభ ఏర్పాటు చేసి, దానికి ప్రతర్దనుణ్ణి ఆహ్వానించాడు ఇంద్రుడు. ఆ సభలో ప్రతర్దనుడి శౌర్యపరాక్రమాలను ప్రశంసించి "రాజా ! దేవతలకు చాలా సహాయం చేసి విజయానికి కారకుడవైనావు. కాబట్టి నీకు ఏ వరం కావాలో కోరుకో" అన్నాడు ఇంద్రుడు. దానికి "నేను మానవుడను. కాబట్టి నాకు హితమైనది, పరమ పురుషార్ధమైనది ఏదో దాన్ని ప్రసాదించవలసినది" అన్నాడు రాకుమారుడు.

బ్రహ్మ జ్ఞానం తప్ప మానవులకు హితమైనవి ఏవీ లేవు. పురుషార్థాలలో కూడా నాల్గవది, ముఖ్యమైనది మోక్షము. పరమాత్మను గురించి తెలుసుకున్న పురుషుడు జనన మరణాల నుండి విముక్తుడౌతాడు. మోక్షం పొందాలంటే బ్రహ్మజ్ఞానం తప్ప వేరే సాధనము లేదు. పరబ్రహ్మకు సంబంధించిన జ్ఞానం కలిగినంతనే మానవుడి కర్మక్షయం అయిపోతుంది. కర్మక్షయం కావటమే పరమపురుషార్థం.

ఆ మాటలు విన్న ఇంద్రుడు "నేను ప్రాణాన్ని, ప్రజ్ఞాత్మను. అటువంటి నన్ను ఆయువుగాను, అమృతత్వంగాను తలచి ఉపాసన చెయ్యి," అంటాడు.

అంటే ఇక్కడ ప్రాణమే పరబ్రహ్మ అని చెప్పాడు ఇంద్రుడు. ఈ విషయం కౌశీతకీ ఉపనిషత్తులో చెప్పబడింది.

సూ. 29 న వక్తురాత్మోపదేశాదితి చే

దధ్యాత్మసంబంధ భూమాహ్యస్మిన్

న, వక్తుః, ఆత్మోపదేశాత్, ఇతి, చేత్

అధ్యాత్మ సంబంధభూమా, హి అస్మిన్

ఇక్కడ ఇంద్రుడు తనను గురించి చెప్పాడు. "నేనే ప్రాణాన్ని, ప్రజ్ఞాత్మను" అన్నాడు. ఇంద్రుడు దేవత. కాబట్టి ఇది దేవాత్మను గురించి చెప్పినది అని భావించరాదు. ఇది పూర్తిగా బ్రహ్మపరము అన్నాడు రత్నాకరుడు.

"మరి అలా అయితే నేనే బ్రహ్మని" అని ఇంద్రుడు చెప్పాడు కదా! ఇంద్రుడు బ్రహ్మకాదు కదా! మరి తన ఆత్మను గురించి ఎందుకు చెప్పాడు? అంటూ ప్రశ్నించాడు నారాయణభట్టు.

ఆ మాటలు విన్న రత్నాకరుడు చెప్పటం ప్రారంభించాడు.

సూ. 30 శాస్త్ర దృష్ట్యాతూపదేశోవామదేవవత్

శాస్త్రదృష్ట్యా, తు, ఉపదేశః, వామదేవవత్

శ్రీ కృష్ణుడు గీతలో అర్జునుడికి బ్రహ్మోపదేశం చేస్తూ "అర్జునా ! చంపేది నేనే. చచ్చేదీ నేనే. సృష్టి స్థితి లయ కారకుడను నేనే" అంటాడు. అలాగే ఇంద్రుడు కూడా నేనే బ్రహ్మను అని చెప్పాడు. అంతేగాని వేరు కాదు. అందుచేత ప్రాణశబ్దం పరబ్రహ్మ అవుతుంది.

బ్రహ్మ సాక్షాత్కారం పొందినవాడు కూడా సాక్షాత్తూ పరబ్రహ్మ స్వరూపమే అవుతాడు. అలాగే ఇంద్రుడు కూడా బ్రహ్మ సాక్షాత్కారం పొందాడు కాబట్టే అతడు కూడా పరబ్రహ్మ స్వరూపమే. కేనోపనిషత్తులో చెప్పినట్లుగా "దేవదానవ సంగ్రామం జరిగింది. అందులో దేవతలు విజయం సాధించారు. విజయోత్సాహం జరుపుకుంటున్నారు. ఈ విజయం తమశక్తి సామర్థ్యాలవల్లనే లభించింది అని విర్రవీగి పోతున్నారు. ఆ స్థితిలో దేవతలను చూశాడు పరబ్రహ్మ. వీరి గర్వం అణచాలి అనుకున్నాడు. ఒక పెద్ద తత్త్వంగా వారి ముందు ప్రత్యక్షం అయ్యాడు.

ఆ భయంకరమైన తత్త్వాన్ని చూసి భయపడ్డారు దేవతలు. అది ఏమిటో కనుక్కు రమ్మని అగ్నిని కోరారు. అతనిచేత కాలేదు. దాన్ని తెలుసుకుందామని వాయువు వెళ్ళాడు. అతనికి కూడా చేత కాలేదు. చివరకు ఇంద్రుడు వెళ్ళాడు. అప్పుడు ఆ తత్త్వం అదృశ్యమై పోయింది. దానిస్థానంలో ఉమాదేవి ప్రత్యక్షమైంది. ఆమెను అడిగాడు ఇంద్రుడు ఆ తత్త్వం ఏమిటి? అని

ఇప్పటిదాకా మీ ఎదురుగా ఉన్న ఆ “భయంకరమైన ఆ తత్త్వమే పరబ్రహ్మ” అని ఉమాదేవి చెప్పింది. ఈ రకంగా పరబ్రహ్మను గురించి తెలుసుకున్నవాడు, దేవతలలో మొదటివాడు ఇంద్రుడు. కాబట్టి ఇంద్రుడు కూడా పరబ్రహ్మమే అవుతాడు. అంచేత ‘నేనే ప్రాణాన్ని’ అని చెప్పాడు ఇంద్రుడు.

పూర్వకాలంలో వామదేవుడు అనే ఋషికూడా పరబ్రహ్మ సాక్షాత్కారం పొంది, తానే సర్వస్వము అని తెలుసుకున్నాడు. కాబట్టి ఇంద్రుడు తానే పరబ్రహ్మ స్వరూపము అని చెప్పటంలో తప్పులేదు.

సూ. 31 జీవముఖ్య ప్రాణలింగాన్నేతి చేన్నోపాసాత్రై
విధ్యా దాశ్రితత్వాదిహ తద్యోగాత్
జీవముఖ్యప్రాణలింగాత్, న, ఇతి, చేత్, న
ఉపాసా, త్రైవిధ్యాత్, ఆశ్రితత్వాత్, ఇహ, తద్యోగాత్

జీవియొక్క ముఖ్యప్రాణం పరబ్రహ్మయే. ఆత్మనుండి ప్రాణం పుడుతోంది. శరీరాన్ని ఆశ్రయించి నీడ ఉన్నట్లుగా ఆత్మపైన ప్రాణము వ్యాపించి ఉన్నది. నీడకు స్వతంత్రమైన అస్థిత్వం లేనట్లే ప్రాణానికి కూడా స్వతంత్రమైన అస్థిత్వం లేదు. మనస్సులో పుట్టిన సంకల్ప వికల్పాలవల్లనే ఇది శరీరంలోకి వస్తుంది. అని కేనోపనిషత్తులో చెప్పబడింది.

కాబట్టి ప్రాణము పరబ్రహ్మ నుంచి పుడుతోంది. ఆ పరబ్రహ్మను ఆశ్రయించి ఉన్న ప్రాణముకూడా పరబ్రహ్మ స్వరూపమే. ఈ ప్రాణమే ప్రజ్ఞాత్మ. ఆనందము, అమృతమయము.

ప్రాణికోటిలో ఏ జీవికూడా ప్రాణంతోనే జీవించదు. అపానంతో అంతకన్నా జీవించదు. ఈ రెండింటికన్న అతీతమైన దానివల్ల, ఈ రెండింటికీ ఆశ్రితమైన దానివల్ల జీవిస్తున్నాయి. అదే బ్రహ్మ. కాబట్టి ఓ బ్రహ్మజిజ్ఞాసులారా ! ప్రాణమే బ్రహ్మ”, అంటూ మొదటి అధ్యాయంలోని మొదటి పాదాన్ని పూర్తి చేశాడు రత్నాకరుడు.

ద్వితీయ పాదము

ఇప్పటివరకు మొదటి పాదాన్ని గురించి చెప్పుకున్నాము. ఇక రెండవ పాదాన్ని ప్రారంభిద్దాం.

రెండవపాదంలో మొత్తం 7 అధికరణలు ఉన్నాయి. వాటి వివరాలు

వ.నెం.	అధికరణము	విషయము	సూత్రాలు
1.	సర్వత్రప్రసిద్ధ్యధికరణము	మనోమయ పురుషుడు బ్రహ్మమే	8
2.	అత్త్రధికరణము	జగద్రక్షకుడు పరమాత్మే	2
3.	గుహాప్రవిష్టాధికరణము	హృదయ గుహలోని ఇరువురూ జీవాత్మ పరమాత్మలు	2
4.	అంతరాధికరణము	అక్షియందలి పురుషుడు బ్రహ్మమే	5
5.	అంతర్యామ్యధికరణము	అధిదేవతాదులందున్నవాడు పరమాత్మే	3
6.	అదృశ్యత్వాధికరణము	అదృశ్యత్వాది రూపము గలది బ్రహ్మము	3
7.	వైశ్వానరాధికరణము	వైశ్వానరుడు బ్రహ్మమే	9
		మొత్తం సూత్రాలు	32

మొదటి పాదంలో అనేక విషయాలు చెప్పి అవన్నీ బ్రహ్మను గురించినవే అని నిరూపించటం జరిగింది. కాని ఇంకా స్పష్టంగా బ్రహ్మను సూచించనట్టి వాక్యాలు కొన్ని ఉన్నాయి. వాటిని 2, 3 పాదాల్లో వివరిస్తున్నారు.

కంటికి కనుపించే చరాచర జగత్తంతా పరబ్రహ్మ స్వరూపమే. జీవకోటి, వస్తు సముదాయము అంతాకూడా ఆ పరబ్రహ్మనుంచే పుట్టి, మళ్ళీ అందులోనే లయమవుతున్నది. పురుషుడు క్రతుమయుడు. అంటే నిశ్చయజ్ఞానం కలిగినటువంటివాడు. మానవుడు ఏ విధమైన సంకల్పాలు కలిగి ఉంటాడో, చనిపోయిన తరువాత కూడా ఆ ఫలితాన్నే పొందుతాడు. ఏ భావాలు స్మరిస్తూ మానవుడు మరణకాలంలో శరీరం విడిచి పెడతాడో, ఆయాభావాలకు తగిన ఫలితాన్నే పొందుతాడు అని అర్థం. దీనికి భాగవతంలో చెప్పిన జడభరతుని యొక్క వృత్తాంతమే ఉదాహరణ.

పూర్వకాలంలో ‘అజనాభము’ అనే దేశాన్ని ఋషభుడు అనే రాజు పరిపాలిస్తున్నాడు. అతని భార్య జయంతి వీరికి తొమ్మిది మంది కుమారులు. వారిలో పెద్దవాడు భరతుడు ఇతడు వేదవేదాంగ విదుడు. పరాక్రమశాలి. ధర్మపరుడు.

తండ్రి తరువాత భరతుడే రాజయ్యాడు. ఇతని భార్య 'పంచజనని' ఇతడు చాలా సంవత్సరాలు ప్రజారంజకంగా రాజ్యపాలన చేసి, తరువాత రాజ్యాన్ని కుమారుల కప్పగించి, వానప్రస్తానికి వెళ్ళాడు. నదీ తీరంలో కుటీరం నిర్మించుకుని నివసిస్తున్నాడు. ఇతని తల అంతా జడలు కట్టిపోయింది. కాబట్టి ఇతణ్ణి 'జడభరతుడు' అనేవారు.

ఒక రోజున జడభరతుడు నదిలో స్నానం చేస్తుండగా, ఒక గర్భిణి అయిన లేడి నదీ తీరానికి వచ్చింది. ఆ సమయంలో ఆకాశం మేఘావృతమై ఉంది ఉన్నట్టుండి పెద్ద ఉరుము ఉరిమింది. దానికి ఆ లేడి భయపడి బిడ్డను ప్రసవించి మరణించింది.

తల్లి లేని లేడిపిల్లను తెచ్చి పెంచసాగాడు జడభరతుడు. దానికి తల్లి లేదు కాబట్టి, దానిమీద అమితమైన ప్రేమ పెంచుకున్నాడు. దైనందిన కార్యక్రమాలు కూడా వదలి, ఎప్పుడూ దాన్నిగురించే ఆలోచిస్తుండేవాడు. చివరకు మరణకాలంలో కూడా ఆ లేడిపిల్లను గురించి ఆలోచిస్తూనే ప్రాణాలు వదిలాడు. ఆ ఫలితంగానే మరుజన్మలో అతను లేడి అయిపుట్టాడు. కాబట్టి మానవుడు ఏ విషయాలు స్మరిస్తూ ప్రాణాలు వదలుతాడో ఆ విషయం పొందుతాడు. అందుకే నేను బ్రహ్మాన్ని పొందుతాను అని నిశ్చయించుకుని, బ్రహ్మగురించే ఆలోచించాలి అన్నాడు రత్నాకరుడు. ఆ మాటలు విన్న నారాయణభట్టు "స్వామీ ! శరీరానికి, ఇంద్రియాలకు అధిపతి జీవాత్మ. జీవాత్మకు మనస్సు, ఇంద్రియాలు మొదలైన వాటితో సంబంధం ఉంది. పరమాత్మ ప్రాణరహితుడు. శరీరము లేనివాడు. ఇటువంటప్పుడు మనోమయుడు, ప్రాణము, శరీరము గలవాడు అని చెప్పబడ్డ జీవాత్మ ఉపాస్యుడు ఏ విధంగా అవుతాడు?" అన్నాడు.

ఆ మాటలు విన్న రత్నాకరుడు, నారాయణభట్టారకా ! ఛాందోగ్యంలోని **సర్వం ఖిల్విదంబ్రహ్మ. తజ్జలానితిశాన్త ఉపాసీత** అనే వాక్యం బ్రహ్మోపాసన విధిని గురించి చెప్పటం లేదు. శమాన్ని గురించి చెబుతున్నది. అంటే శాంతుడవై, పైన చెప్పిన గుణాలు గల బ్రహ్మను ఉపాసించు. శాంతము అంటే రాగద్వేషాలు లేకుండా అని. ఈ వాక్యంలో బ్రహ్మోపాసన ప్రధానం కాదయ్యా. ఇక్కడ ఉపాసించవలసినది జీవాత్మనే. ఈ విషయానికి సమాధానంగానే తరువాతి సూత్రాన్ని చెబుతున్నారు.

1. సర్వత్రప్రసిద్ధ్యధికరణము

సూ. 1 సర్వత్ర ప్రసిద్ధోపదేశాత్
సర్వత్ర, ప్రసిద్ధ, ఉపదేశాత్

వేదాంత వాక్యాలన్నిటిలోనూ ఈ జగత్తుకు కారణము బ్రహ్మ అని చెప్పటంవల్ల ఇక్కడ ఉపాస్యము పరమాత్మయే అవుతున్నది.

'సర్వం ఖల్విదం బ్రహ్మ' ఈ జగత్తంతా బ్రహ్మమయమే అని శ్రుతులు చెబుతున్నాయి. అతడు అంటే బ్రహ్మ మనోమయాది ధర్మాలు గలవాడుగా చెప్పటంవలన మూలవస్తువును విడిచిపెట్టటం అనేది ఉండదు. ఇతర వస్తువులను గూర్చి చెప్పటం కూడా ఉండదు. ఈ రెండింటిలోను ఏది చేసినా, అంటే, మూలవస్తువును వదిలి పెట్టినా, ఇతర వస్తువులను గురించి చెప్పినా అది దోషము అవుతుంది. కాని ఇక్కడ అలా జరగలేదు. ఇక్కడ ఉపాసించదగినవాడు, ఉపాసించబడే వాడు కూడా బ్రహ్మమే. కేవలము ఉపాసనకోసమే అతనికి మనోమయాది ధర్మాలు చెప్పబడ్డాయి.

సూ. 2 వివక్షిత గుణోపపత్తేశ్చ
వివక్షిత, గుణ, ఉపపత్తేః, చ

ఉపాసన కోసము చెప్పడినటువంటి సత్యసంకల్పము, బహురూపత్వము అనే గుణాలు బ్రహ్మకు అన్వయిస్తాయి కాబట్టి మనోమయుడు పరమాత్మయే తప్ప జీవుడు కాదు.

'వివక్ష' అంటే చెప్పదలచుకున్నట్టి మాట. ఏదైనా ఒక విషయాన్ని గురించి చెప్పదలిస్తే ఆ విషయం వివక్షితం అవుతుంది. వేదాలు అపౌరుషేయాలు కాబట్టి వాటిని చెప్పాలి అనుకున్నవాడు ఎవరూ లేరు. వేదాలయొక్క తాత్పర్యం దీనిలో ఉన్నదా ? లేదా? అనే విషయం ఆలోచించి, ఆ తాత్పర్యం ఉన్నదానినే గ్రహించాలి. ఈ విధంగా గనక చూసినట్లైతే 'ఉపాసనకు కావలసిన గుణాలన్నీ పరబ్రహ్మలో ఉన్నాయి.

సృష్టి స్థితి సంహారాల్లో అతడు శక్తి సంపన్నుడు. కాబట్టి సత్యకాముడు, సత్యసంకల్పుడు అవుతాడు. ఆత్మ పాపరహితము. ఆకాశమువలె సర్వవ్యాపి. భూమికన్న పెద్దది. సమస్త కర్మలు తానే అయినది. మనోమయము, ప్రాణమయము. ఇవి జీవ లక్షణాలు కాదు. ఇవి కేవలము పరబ్రహ్మయొక్క లక్షణాలు మాత్రమే.

సూ. 3 అనుపపత్తేస్తు న శారీరః
అనుపపత్తేః, తు, న, శారీరః

ఉపాసన కోసం చెప్పబడ్డ ఈ గుణాలు జీవునికి ఉండవు. అందుచేతనే జీవుడు ఉపాస్యుడు కాదు.

జీవుడు భోగానికి అవసరమైన ఈ శరీరంలోనే ఉన్నాడు కాని పరమేశ్వరుడు సర్వాంతర్యామి భూమ్యాకాశాలకన్న పెద్దవాడు. అంతటా వ్యాపించి ఉన్నవాడు. నిత్యుడు అందుకనే పరబ్రహ్మయే ఉపాస్యుడు.

సూ. 4 కర్మ కర్తృ వ్యపదేశాచ్చ
కర్మ, కర్తృ, వ్యపదేశాత్, చ

సాధకుడు ఈ శరీరం నుండి విముక్తి పొందిన తరువాత, ఆ పరమాత్మను పొందుతాడు. ఇక్కడ పొందేవాడు సాధకుడు. పొందబడేది బ్రహ్మ. అందుచేత ఉపాస్యుడు జీవుడు కాదు. బ్రహ్మమే.

పొందేవాడు, పొందబడేది అంటే కర్త, కర్మ రెండూ ఒకటి కాదు. జీవాత్మ పరమాత్మను చేరుతుంది. అందుచేత ఉపాస్యుడు బ్రహ్మ.

సూ. 5 శబ్ద విశేషాత్

శబ్దము అంటే ఇక్కడ విభక్తి భేదంవల్ల కూడా బ్రహ్మయే ఉపాస్యుడు.

ఛాందోగ్యోపనిషత్తులో శాండిల్యుడు అనే మహర్షి తనశిష్యులకు బ్రహ్మోపదేశం చేస్తూ "ఆత్మ అనేది సూక్ష్మాతి సూక్ష్మమైనది. అలాగే మహత్తరమైనది. హృదయ పద్మంలో గల ఆత్మ వరిగింజ కన్న, బార్లీగింజ కన్న ఆవగింజకన్న కూడా చాలా సూక్ష్మమైనది. అలాగే ఈ ఆత్మ భూమికన్న, స్వర్గలోకం కన్న, సమస్త లోకాలకన్న కూడా పెద్దది" అని చెబుతాడు శతపథ బ్రాహ్మణంలో "ధాన్యపు గింజకాని, యనగింజకాని, చామగింజకాని, ఏ విధంగా తోప ఉంటుందో, అలాగే హిరణ్మయుడైన పురుషుడు అంతరాత్మలో ఉన్నాడు". కాబట్టి హిరణ్మయపురుషుడు, ఆత్మకన్న వేరైనవాడు. ఇక్కడ హిరణ్మయపురుషుడు అంటే– పరమాత్మ. ఆత్మ అంటే – జీవుడు.

సూ. 6 స్మృతేశ్చ
స్మృతేః, చ

స్మృతులలో కూడా జీవుడికి, బ్రహ్మకి భేదం చూపబడింది. కాబట్టి ఉపాస్యుడు బ్రహ్మమే.

పరమేశ్వరుడు అన్ని జీవులయందు అంతర్యామిగా ఉండి, వారివారి కర్మలననుసరించి, వారికి పునర్జన్మ కలిగిస్తూ ఉంటాడు. అన్నాడు రత్నాకరుడు.

ఆ మాటలు విన్న కృష్ణశర్మ "గురువర్యా! ఇక్కడ మీరేమో, జీవాత్మ పరమాత్మ వేరు అంటున్నారు. బృహదారణ్యకోపనిషత్తులో యాజ్ఞవల్క్యుడు మైత్రేయికి బ్రహ్మోపదేశం

చేస్తూ "కంటికి కనిపించే ప్రతిదీ ఆత్మస్వరూపమే. అంతకన్న భిన్నమైనది ఏదీ లేదు. లోకంలో అన్నీ ఆత్మనుంచే పుడుతూ, ఆత్మలోనే లీనమవుతున్నాయి.

లోకంలో ఉన్నదంతా ఆత్మే. ఈ ఆత్మ అందరిలోనూ సమానంగా ఉన్నది. ఆత్మనుండే అన్ని పుట్టినాయి. మళ్ళీ అందులోనే లీనమవుతాయి. అందుచేతనే ఆత్మను గురించి తెలుసుకుంటే మిగిలిన విషయాలన్నీ తెలిసినట్లే" అన్నాడు. అలాగే భగవానుడు కూడా గీతలో "అర్జునా క్షేత్రములందు (శరీరములందు) క్షేత్రజ్ఞుడను నేనే" అంటాడు.

ఈ విషయాలు చూస్తే, జీవాత్మ, పరమాత్మ, రెండూ ఒక్కటే అని తెలుస్తుంది. మరి మీరేమో జీవుడికి, బ్రహ్మకి భేదం ఉంది అంటున్నారు కదా ?" అన్నాడు. ఆ మాటలు విన్న రత్నాకరుడు సమాధానం చెబుతున్నాడు.

"నాయనా ! ఆకాశమనేది ఒక్కటేనయ్యా. అదే మహదాకాశం. కాని గదిలోని ఆకాశం, కుండలోని ఆకాశం, కమండలంలోని ఆకాశం అని వేరువేరుగా కనిపిస్తుంది. అలాగే పరమాత్మకూడా ఒక్కడే అయినప్పటికీ, దేహము, బుద్ధి, ఇంద్రియాల సంబంధంవల్ల జీవుడు అని పిలువబడుతున్నాడు. ఈ భేదంవల్లనే ఉపాసకుడు ఉపాస్యుడు అని భేదం కలుగుతుంది . కాని 'తత్త్వమసి' 'నువ్వు ఆత్మ' అని తెలిసినప్పుడు ఈ భేదాలు ఉండవు.

సూ. 7 అర్భకౌ కస్త్వాత్తద్వ్యపదేశాచ్చనేతి చేన్నని
చాయ్యత్వాదేవం వ్యోమవచ్చ
అర్భకౌకస్త్వాత్, తద్వ్యపదేశాత్, చ, న, ఇతి, చేత్
న, నిచాయ్యత్వాత్, ఏవం, వ్యోమవత్, చ

ఆత్మహృదయ స్థానంలో అతిచిన్నదిగా ఉంటుంది. అదే మనం వెతకవలసినది. అందుకనే ఆత్మయే ఉపాస్య. అన్నాడు రత్నాకరుడు.

ఆ మాటలు విన్న నారాయణభట్టు అడుగుతున్నాడు. "గురువుగారూ, మనోమయుడు, ప్రాణమయుడు శరీరంగలవాడు అయిన ఆత్మ నా హృదయంలో ఉన్నాడు. అని, అతడు ధాన్యపు గింజకన్న సూక్ష్మమైనవాడు అని అన్నారు. సర్వవ్యాపి అయిన పరమాత్మ, హృదయమనే చిన్నస్థానంలో ఉండటం కుదరదు కదా. కాబట్టి ఇక్కడ చెప్పింది జీవాత్మను గురించే అనవచ్చుకదా?"

"నారాయణభట్టూ ! బుద్ధికి, విజ్ఞానానికి స్థానం హృదయమయ్యా. భగవంతుణ్ణి తెలుసుకోవటానికి తగినది ఆ హృదయమే. అందుకే పరమాత్మ హృదయంలో ఉన్నాడని

చెప్పారు. పరమాత్మ సర్వాంతర్యామి. అయినప్పటికీ ఉపాసనకోసం లింగం చూపించి 'ఇది శివుడు ఉపాసించు' అనెలా చెబుతారో, అలాగే ఇక్కడకూడా పరమాత్మ సూక్ష్మరూపంతో హృదయమందున్నాడని చెప్పబడింది. అంతేకాదు పరమాత్మ హృదయంలో ఉన్నాడు. ప్రతిశరీరంలోను హృదయముంది. వీటన్నిటితోనూ సంబంధమున్నది. మరి వాటి గుణదోషాలు అతడికి అంటుతాయి కదా? అని కొందరంటారు. దానికి సమాధానంగానే తరువాతి సూత్రం చెప్పబడుతోంది.

సూ. 8 సంభోగప్రాప్తిరితిచేన్న వైశేష్యాత్
సంభోగప్రాప్తిః, ఇతి, చేత్, న, వైశేష్యాత్

జీవుడికి, పరమాత్మకు ఉండే లక్షణాలు వేరు. అందుచేత పరమాత్మకు సుఖదుఃఖాలు ఉండవు. అతడు భోగాలు అనుభవించడు.

జీవాత్మ వేరు పరమాత్మ వేరు. జీవి, కర్త, భోక్తకూడా. అతడికి సుఖము, దుఃఖము ఉంటాయి. ముండకోపనిషత్తులో చెప్పినట్లుగా ఒకే పేరు, రూపము గల రెండు పక్షులు ప్రపంచమనే వృక్షాన్ని ఆశ్రయించి ఉన్నాయి. అందులో ఒకటి జీవి. ఇది తన కర్మవల్ల వచ్చిన ఫలితాలను అనుభవిస్తోంది. రెండవది పరమాత్మ. కర్మఫలం ఏమీలేకుండా చూస్తూ కూచుంది. రెండూ ఒకేచోట ఉన్నప్పటికీ జీవుడు మోహానికి వసుడై శోకాన్ని అనుభవిస్తున్నాడు. అజ్ఞానంవల్ల బాధలు పడుతున్నాడు.

కాని అతడే యోగీశ్వరులచే సేవించబడేవాడు అని తెలిసినప్పుడు, అంటే మోహము నశించినప్పుడు శోకం నుండి విముక్తుడౌతాడు. ఇతడికి ఎప్పుడైతే జ్ఞానం కలుగుతుందో, అప్పుడు భేదభావంపోయి అద్వైతభావం పొందుతాడు. సమస్త జీవులయందు ఉంటూ భిన్నంగా కనిపించేదే పరమాత్మ. అతడు వేరువేరు జీవుల్లో వేరువేరుగా కనిపిస్తాడు."

కాబట్టి 'మనోమయ పురుషుడు బ్రహ్మమే' అంటూ మొదటి అధికరణం పూర్తిచేశాడు రత్నాకరుడు.

2. అత్త్రధికరణము

గురువర్యా! పరమేశ్వరునికి బ్రహ్మ క్షత్రియులనే రెండు జాతులు భక్షించటానికి తగినవే. అని కఠోపనిషత్తులో చెప్పగా, ఈశ్వరుడు తినకుండానే చూస్తున్నాడు అని ముండకోపనిషత్తులో చెప్పబడింది. ఈ రెండూ విరుద్ధ ప్రకటనలు కదా ! వాటిని వివరించండి" అన్నాడు కృష్ణశర్మ. ఆ మాటలు విన్న రత్నాకరుడు తొమ్మిదవ సూత్రాన్ని వివరించటం మొదలుపెట్టాడు.

సూ. 9 అత్తా చరాచర గ్రహణాత్
అత్తా, చరాచరగ్రహణాత్

స్థావర జంగమాత్మకమైన ఈ ప్రపంచాన్ని గ్రహించటంవలన భుజించేవాడు పరమాత్మయే.

ఈ లోకాలను భుజించే శక్తి ఆ పరమాత్మ ఒక్కడికే ఉన్నది. బ్రహ్మ క్షత్రియులు అంటే బ్రహ్మ క్షత్రియాదిగ గల మొత్తం మానవులు అని అర్ధం. ఇక భుజించటము అంటే తనలోకి తీసుకోవటము. అంటే లయం చేసుకోవటము ఒక్క మానవులను ఏమిటి? ఈ జగత్తునంతటినీ తనలో లయం చేసుకుంటాడు పరమాత్మ. అయితే ఈశ్వరుడు తినకుండానే చూస్తున్నాడు. అని చెప్పటంలో ఉద్దేశ్యం పరమాత్మకు కర్మఫలం లేదు. జీవుడు కర్మఫలాన్ని అనుభవిస్తున్నాడు. పరమాత్మ ఆ ఫలితము లేక చూస్తూ కూచున్నాడు. అంతేకాని ఈ రెండూ విరుద్ధ ప్రకటనలు కావు.

సూ. 10 ప్రకరణాచ్చ
ప్రకరణాత్, చ

కఠోపనిషత్తులో నచికేతుడు యముడి దగ్గరకు వెళ్ళి బ్రహ్మోపదేశం చెయ్యమని అడుగుతున్నాడు. "ఓ యమధర్మరాజా! నువు ధర్మాధర్మాలకు భిన్నముగ, కార్యకారణములకు అతీతముగ, భూతభవిష్యద్వర్త మానములకు అతీతంగా దేనిని చూస్తున్నావో దానిని గురించి నాకు వివరించవలసినది." ఆ మాటలు విన్న యమధర్మరాజు చెబుతున్నాడు. "సమస్త వేదాలు ఎవరిని ప్రశంశిస్తున్నాయో, సమస్త తపస్సులు దేనిని ప్రకటిస్తున్నాయో, దేనిని కోరి యోగిపుంగవులు నియమనిష్ఠలతో, బ్రహ్మచర్యంతో కాలం గడుపుతున్నారో, అటువంటి దాన్ని గూర్చి నీకు వివరిస్తాను. అదే ఓం కారము. ఈ అక్షరమే పరబ్రహ్మ.

ఓం కారాన్ని ఏ రూపంలో ఉపాసిస్తే సాధకుడు ఆ రూపాన్నే పొందుతాడు. బ్రహ్మప్రాప్తి కావాలంటే ఓంకారాన్ని ఆశ్రయించటమే మంచిది. ఆత్మకు చావుపుట్టుకలు లేవు. ఆత్మ తనంత తానుగా పుట్టినది. స్వయంభువు. నాశరహితమైనది. శాశ్వతమైనది. శరీరం మరణించినా ఆత్మ మరణించదు. ఆత్మ చంపేదీ కాదు. చంపబడేదీ కాదు. అది సూక్ష్మమైనది. పెద్దవాటికన్న ఇంకా పెద్దది. ఇది మానవుడి హృదయపద్మంలోనే ఉంటుంది. ఇంద్రియలోలురు ఆత్మను గుర్తించలేరు. ఆత్మ కదలకుండా ఒకచోట కూర్చునే అన్ని ప్రదేశాలు చూస్తుంది. అనిత్యమైన శరీరాల మధ్య శరీరం లేనిదిగా, అశాశ్వతమైన వాటి మధ్య శాశ్వతమైనదిగా ఉంటుంది. ఆత్మనిత్యము, సత్యము. సర్వవ్యాపకమైనది. అట్టి ఆత్మను గుర్తించగలిగినవాడికి దుఃఖము లేదు.

వేదాలు వల్లించటంవల్లగాని, శాస్త్రాలు చదవటంవల్లగాని, ఉపదేశాలు పొందటంవల్లగాని ఆత్మసాక్షాత్కారం లభించదు. అది ఆత్మవల్ల మాత్రమే లభ్యమవుతుంది".

కాబట్టి అన్నిటికి బ్రహ్మమే భోక్త. ఆత్మసాక్షాత్కారము కష్టసాధ్యము. జగద్రక్షకుడు పరమాత్మ తప్ప వేరొకరు కాదు అంటూ రెండవ అధికరణం పూర్తి చేశాడు రత్నాకరుడు.

3. గుహాప్రవిష్టాధికరణము

"గురువుగారూ! మీరు చెప్పినదాన్ని బట్టి హృదయస్థానంలో ఇద్దరుంటారని అర్థమవుతోంది. అయితే వారెవరు? బుద్ధి, జీవుడునా లేక జీవుడు, పరమాత్మ. వీరిలో ఎవరో సవివరంగా చెప్పండి" అన్నాడు కృష్ణశర్మ.

ఆ మాటలు విన్న రత్నాకరుడు శిష్యుని సందేహనివృత్తి కోసం ఉపక్రమిస్తున్నాడు.

సూ. 11 గుహాం ప్రవిష్టావాత్మానౌ హి తద్దర్మనాత్

గుహామ్, ప్రవిష్టౌ, ఆత్మానౌ, హి, తద్దర్మనాత్

హృదయమనే గుహలో ప్రవేశించి ఉన్నవారు జీవాత్మ, పరమాత్మలు.

ఈ ఇద్దరూ ఒకే రకంగా ఉంటారు. ఒకే స్వభావం కలవారై ఉంటారు. కర్మఫలాన్ని అనుభవించే వాడు జీవుడు. రెండోవాడు కర్మఫలం లేనివాడు. పరమాత్మ అంతేగాని అచేతనమైన బుద్ధికాదు. పరమాత్మకు కర్మఫలానుభవము, పుణ్యలోకప్రాప్తి అనేవి ఉండవు. అయితే ఆ లక్షణాలు హృదయంలో ఉన్న ఇద్దరికీ ఎందుకు చెప్పారు? అంటే – ఇది 'ఛత్రిన్యాయం'. కొంతమంది గొడుగులతో పోతున్నారు. కొంతమంది గొడుగులు లేకుండా పోతున్నారు. అప్పుడు వారందరినీ కలిపి 'ఛత్రధారులు వెడుతున్నారు' అంటారు. ఇక్కడ గొడుగు లేనివారిని గురించి చెప్పవలసిన అవసరం లేదు. గొడుగు ఉన్నవానిని గురించి మాత్రమే చెప్పాలి అందుకని అలా చెబుతారు. అదే విధంగా ఇక్కడ కూడా ఒకరికి కర్మఫలం, భోగం ఉన్నాయి. రెండవ వాడికి అవి లేవు. అయినప్పటికీ, ఈ మాట ఇద్దరికీ సంబంధించే చెబుతారు.

పరమాత్మ హృదయమనే గుహలోనే ఉంటాడు. శరీరంలో పరబ్రహ్మ ఉండేచోట ఇద్దరున్నారు. వారిలో ఒకడు కర్మఫలం అనుభవించేవాడు. రెండవవాడు సంసారబంధనాలు లేనివాడు. వీరిద్దరే వెలుగు, నీడ.

వీరిద్దరూ ఒకటే. భేదం లేదు. అజ్ఞానంలో ఉన్నప్పుడు జీవుడు. అజ్ఞానం వదిలిపోతే ఆ జీవుడే పరమేశ్వరునిలో లీనమై పోతాడు.

సూ. 12 విశేషణాచ్చ

విశేషణాత్, చ

శ్రుతులందలి విశేషణాలవల్ల కూడా వీరిద్దరూ జీవాత్మ, పరమాత్మ అని తెలుస్తోంది.

"ఈ శరీరం రథం వంటిది. కర్మఫలాన్ని అనుభవించే జీవాత్మ దాని యజమాని. బుద్ధే సారథి. మనస్సే కళ్ళెం. ఇంద్రియాలే గుర్రాలు. విషయమే మార్గం. కాబట్టి ఇంద్రియాలను నడిపే సారథి నేర్పరి కాకపోతే ఆ గుర్రాలు అదుపులో ఉండవు." అని కఠోపనిషత్తులో చెప్పబడింది.

ఆత్మ అనేది సూక్ష్మమైన బుద్ధిచేత మాత్రమే గ్రహించబడుతుంది. ఆత్మ సర్వ వస్తువులందూ ఉన్నది. కాని పైకి కనపడదు. సూక్ష్మబుద్ధి గలవారే దీన్ని గ్రహించగలరు. ఆ రకంగా ఆత్మదర్శనం పొందినవాడే హర్షశోకాలకు అతీతుడౌతాడు.

ముండకోపనిషత్తులో చెప్పినట్లుగా, "ఒకే పేరు రూపము గల రెండు పక్షులు ప్రపంచమనే వృక్షాన్ని ఆశ్రయించి ఉన్నాయి. అందులో ఒకటి కర్మఫలాన్ని అనుభవిస్తుంది. రెండవదానికి కర్మఫలం ఉండదు. ఈ రెండే జీవాత్మ, పరమాత్మలు అజ్ఞానపు ముదులు వీడి తానే పరమాత్మ అని తెలిసినపుడు, అంటే ఆత్మసాక్షాత్కారం జరిగినప్పుడు జీవాత్మ పరమాత్మలో లీనమైపోతుంది.

కాబట్టి హృదయమనే గుహలో ఉండే జీవాత్మే, పరమాత్మ అంటూ మూడవ అధికరణాన్ని పూర్తి చేశాడు రత్నాకరుడు.

4. అంతరాధికరణము

"గురువర్యా ఛాందోగ్యోపనిషత్తులో ఉపకోశలుడు బ్రహ్మజ్ఞానం కోసం సత్యకామ జాబాలి దగ్గరకు వెళ్ళి శిష్యరికం చేస్తాడు. సత్యకాముడు ఎంత కాలానికి అతడికి బ్రహ్మోపదేశం చెయ్యడు. చివరకు ఆశ్రమంలో ఉండే అగ్నులే ఉపకోశలుడికి బ్రహ్మోపదేశం చేస్తాయి. ఆ విషయం తెలుసుకున్న సత్యకాముడు బ్రహ్మజ్ఞానాన్ని ఉపకోశలుడికి వివరిస్తూ, "కంటియందు కనిపించే పురుషుడు ఆత్మ. అతడు మరణము, భయము లేనివాడు. అతడే బ్రహ్మ" అని చెప్పాడు. మరికంటి యందున్న పురుషుడు జీవుడా? పరమాత్మా? వివరించండి" అన్నాడు నారాయణభట్టు. ఈ సందేహం నివృత్తి చెయ్యటానికి ఉద్యుక్తుడౌతున్నాడు రత్నాకరుడు.

సూ. 13 అంతర ఉపపత్తేః

అంతరే, ఉపపత్తేః

కంటియందున్న పురుషుడు ఉపపత్తి (సంగతి) వలన పరమాత్మ అని అర్థం.

ఆత్మ అనే పదానికి అర్థం పరమాత్మ. అమృతత్వము, అభయత్వము అనేవి అతని గుణాలు. నేయిగాని, నీరుగాని పోసినప్పుడు అవి అంటకుండా పక్కలకు పోతాయి. అంటే పరమాత్మకు పాపపుణ్యాలు అంటవు.

ఛాందోగ్యోపనిషత్తులో "ఆకాశంలో ఉండే సూర్యునిలో ఉండే తత్త్వము, చంద్రునిలో ఉండే తత్త్వము, భూమిమీద ఉండే అగ్నిలో ఉండే తత్త్వము అన్నీ ఒకటే. సూర్యుడు, చంద్రుడు మొదలైన రూపాల్లో ఈ అక్షి పురుషుడే లోకాల్లో ప్రకాశిస్తున్నాడు. కాబట్టి అక్షి పురుషుడు పరమాత్మయే కాని వేరు కాదు.

సూ. 14 స్థానాది వ్యపదేశాచ్చ
స్థానాది, వ్యపదేశాత్, చ

పరమాత్మ నిరాకారుడే అయినప్పటికీ, ఉపాసన కోసము అతడికి నామరూపాలు చెప్పబడ్డాయి.

పరబ్రహ్మ ఆకాశంలాగా సర్వవ్యాపి. అంతటా వ్యాపించి ఉన్నాడు. పరమాత్మ ఎక్కడ ఉన్నాడు ? అనే విషయం బృహదారణ్యకోపనిషత్తులో "అంతర్యామిగా ఉండే నియామకుని గురించి చెప్పవలసినది." అని అడిగినప్పుడు యాజ్ఞవల్క్యుడు చెబుతున్నాడు.

అతడు భూమిలోపల ఉంటాడు. కాని భూమి అతనిని ఎరుగదు. భూమే అతని శరీరము. భూమిలోపల ఉంటూనే భూమిని నియంత్రిస్తుంటాడు. అతడే అంతర్యామి అయిన నీ ఆత్మ.

తేజస్సులో ఉంటాడు. కాని తేజస్సు అతన్ని ఎరుగదు. తేజస్సే అతని శరీరము. తేజస్సులో ఉంటూనే తేజస్సును నియంత్రిస్తాడు. అతడే అంతర్యామి అయిన నీ ఆత్మ.

కనులలో ఉంటాడు కాని కనులు అతన్నెరుగవు. కనులే అతని శరీరము. కనులలో ఉంటూ కనులను నియంత్రిస్తాడు. అతడే అంతర్యామి అయిన నీ ఆత్మ. ఈ రకంగా పరమాత్మ సర్వాంతర్యామి అని చెబుతాడు. కాబట్టి కనులలో ఉండే పురుషుడే పరమాత్మ.

సూ. 15 సుఖవిశిష్టాభిధానాదేవచ
సుఖ, విశిష్ట, అభిధానాత్, ఏవ, చ

శ్రుతులలో పరమాత్మ సుఖవిశిష్టుడుగా చెప్పబడ్డాడు.

ఛాందోగ్యంలో ఉపకోశలుడికి అగ్నులు ఉపదేశం చేస్తూ అగ్ని, భూమి సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, అన్నీ పరబ్రహ్మ స్వరూపాలే అని చెప్పాయి. అంటే పరమాత్మ

ప్రాణస్వరూపుడు, సుఖస్వరూపుడు, ఆకాశరూపుడు. కాబట్టి బ్రహ్మనేత్రరూపుడా ? కాదా? అనే ప్రశ్న కూడా అవసరం లేదు. అక్షియందున్న పురుషుడు పరమాత్మే. ఇతణ్ణి తెలుసుకున్నవాడికి పాపకర్మ ఉండదు.

సూ. 16 శ్రుతోపనిషత్క గత్యభిధానాచ్చ
శ్రుత, ఉపనిషత్క, గతి, అభిధానత్, చ

శ్రుతులు, స్మృతులు, ఉపనిషద్రహస్యాలు విన్నవారికి దేవయాన మార్గాన్ని చెప్పటంవల్ల, ఇతడు పరమాత్మ స్వరూపుడే అని తెలుస్తుంది.

ఉపాసకుడు బ్రహ్మచర్యము, తపస్సు మొదలైనవి ఆచరిస్తూ, నియమ నిష్ఠలతో సాధన చేసినట్లైతే అతను ఆత్మసాక్షాత్కారం పొందుతాడు. అటువంటివాడు ఉత్తరాయణ మార్గం ద్వారా ఆదిత్యలోకం చేరతాడు. అతడికి పునర్జన్మ ఉండదు. ఇదే విధంగా అర్చిరాది మార్గం గురించి భగవద్గీతలోకూడా చెప్పబడింది. కాబట్టి అక్షిపురుషుడు పరబ్రహ్మమే.

సూ. 17 అనవస్థితే రసంభవాచ్చనేతరః
అనవస్థితేః, అసంభవాత్, చ, న, ఇతరః

నిలకడ లేకపోవటంవల్ల, అమృతత్వము, అభయత్వము మొదలైన గుణాలు అసంభవమైనందున, అక్షిపురుషుడు జీవాత్మ, ఛాయాత్మ కాదు. అతడు పరమాత్మే.

ఛాయాత్మ అంటే – ప్రతిబింబం గలవాడు. మన ఎదురుగా నుంచున్నవాని ప్రతిబింబం మనకంట్లో పడుతుంది. అతడు ఛాయాత్మ. ఇది ఎప్పుడూ నిలకడగా కంట్లో ఉండదు. ఎందుకంటే ఉపాసన చేసేటప్పుడు ఎదురుగా ఏ ఆకారాన్ని ఉంచుకోము. పోనీ జీవాత్మ అందామా అంటే అది ఒక్క కంటిలోనే ఉండదు. శరీరమంతా వ్యాపించి ఉంటుంది.

ఉపాసన కోసం పరమాత్మకు కన్ను స్థానంగా చెప్పారు. అంతేకాని జీవాత్మకు కాదు. పైగా అమృతత్వము, అభయత్వము ఇత్యాది గుణాలు జీవాత్మకు, ఛాయాత్మకు లేవు. ఒక్క పరమాత్మకే ఉంటాయి. దేవతలయొక్క అమరత్వం శాశ్వతం కాదు.

తైత్తిరీయోపనిషత్తులో "పరబ్రహ్మను గురించిన భయంతోనే గాలి వీస్తోంది. సూర్యుడు ఉదయిస్తున్నాడు. ఇంద్రాదిదేవతలు తమ విధులు సక్రమంగా నిర్వహిస్తున్నారు." పరమాత్మ ఒక్కడే అమరుడు. అతడే అక్షిలోని పురుషుడు అంటూ నాల్గవ అధికరణను పూర్తి చేశాడు రత్నాకరుడు.

5. అంతర్యామ్యధికరణము

"పరమేశ్వరుడు సర్వవ్యాపి. అన్ని భూతములయందు అంతర్యామిగా ఉన్నవాడే ఆత్మ అంటున్నారు కదా! ఇక్కడ అంతర్యామిగా చెప్పబడినవాడు వాటివాటికి అభిమాని అయిన దేవతా ? లేక పరమేశ్వరుడా?" కాస్త వివరించండి." అన్నాడు నారాయణభట్టు.

శిష్యుడి సందేహం తీర్చటం ప్రారంభించాడు రత్నాకరుడు.

సూ. 18 అంతర్యామ్యధి దైవాదిషుతద్ధర్మవ్యపదేశాత్

అంతర్యామి, అధిదైవాదిషు, తత్, ధర్మ, వ్యపదేశాత్

అధిదైవము, అధియజ్ఞము మొదలైన వాటియందు అంతర్యామిగా చెప్పబడినవాడు, అన్ని భూతములయందు ఉన్నవాడు, అమృతత్త్వము మొదలైన ధర్మాలు గలవాడు ఆ పరమాత్మయే.

పరమేశ్వరుడు సమస్త భూతములందు అంతర్యామిగా ఉంటూ వాటిని నియంత్రిస్తున్నాడు. అందుకనే పరమేశ్వరునియందు భయంవల్లనే గాలి సవ్యంగా వీస్తోంది. సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. చంద్రుడు చల్లదనాన్నిస్తున్నాడు. ఆపరమాత్మయే అన్నిటికన్న, అందరికన్న శక్తిమంతుడు. అందుచేతనే బృహదారణ్యకోపనిషత్తులో "పరమేశ్వరుడు అన్ని భూతములయందు ఉన్నాడు. ఆ భూతాలు అతన్నెరుగవు. ఆ భూతాలే అతని శరీరం. సర్వభూతాలలో ఉంటూ, వాటిని నియంత్రిస్తున్నాడు. అతడే అంతర్యామి అయిన నీ ఆత్మ" అని చెప్పబడింది.

అయితే పరమాత్మ నామరూపాలు లేనివాడు. అశరీరి. మరి శరీరంలేనివాడు ఇతరులను ఎలా నియమిస్తాడు? అని అనుమానం వస్తుంది. అతడు ఎవరిని, దేనిని నియమిస్తున్నాడో వారి వారి శరీరాలతో, ఇంద్రియాలతోనే వారిని నియమిస్తున్నాడు. వారి శరీరము ఇంద్రియాలతోనే తాను శరీరము ఇంద్రియాలు కలవాడు అవుతున్నాడు. అందుకనే అంతర్యామి అయినవాడు ఆత్మ.

సూ. 19 న చ స్మార్త మతద్ధర్మాభిలాపాత్

న, చ, స్మార్తం, అతద్ధర్మాభిలాపాత్

అంతర్యామి పరబ్రహ్మ. అంతేకాని సాంఖ్యులు చెప్పే ప్రకృతి కాదు. అంతర్యామికి ఉన్న ధర్మాలు ప్రకృతికి వర్తించవు అన్నాడు రత్నాకరుడు.

"అంతర్యామిగా ప్రకృతిని అంగీకరించకపోతే జీవిని అంగీకరించవచ్చును కదా" అన్నాడు కృష్ణశర్మ. ఈ అనుమానానికి సమాధానంగా తరువాతి సూత్రం చెబుతున్నారయ్యా.

సూ. 20 శారీరశ్చోభయేஉపి హి భేదేనైన మధీయతే

శారీరః, చ, ఉభయే, అపి, హి, భేదేన, ఏనం, అధీయతే

అంతర్యామి అంటే జీవి కాదు. ఈ జీవి అంతర్యామి కన్న భిన్నమైనవాడు.

శరీరం గల జీవికి కొన్ని గుణాలుంటాయి. కంటి చూపు, నోటిమాట ఉంటాయి. కాని పృధివ్యాధుల్లో ఇమిడి ఉండదు. వాటిని నియమించే శక్తి జీవికి ఉండదు. అందుచేత అంతర్యామి అంటే పరమాత్మ. అతడు అన్ని భూతాలయందు ఉంటాడు. అందరు దేవతల యందు ఉంటాడు. అందరినీ నియమిస్తాడు. అతనివల్లనే ఈ జగత్తు అంతా సవ్యంగా నడుస్తోంది. ఈ రకంగా అధిదేవతాదులందున్న వాడు పరమాత్మయేకాని వేరు కాదు అంటూ ఐదవ అధికరణాన్ని పూర్తి చేశాడు రత్నాకరుడు.

6. అదృశ్యత్వాధికరణము

"గురువర్యా! పరబ్రహ్మ అక్షరస్వరూపుడు. చూడశక్యముకానివాడు. నాశనము లేనివాడు. నామరూపాలు లేనివాడు. ఇంద్రియాలు లేనివాడు. సర్వవ్యాపి. సమస్తానికి కారణభూతుడు. అని చెప్పారు కదా. ఈ లక్షణాలు కలది ప్రకృతా? జీవుడా? పరమాత్మా? వివరించండి" అన్నాడు నారాయణభట్టు.

ఆ మాటలు విన్న రత్నాకరుడు "ఆ సంశయం తీర్చటానికే వ్యాసమహర్షి ఈ క్రింది సూత్రాలు చెబుతున్నాడు అంటూ ప్రారంభించాడు.

సూ. 21 అదృశ్యత్వాది గుణకోధర్మోక్తేః

అదృశ్యత్వ, ఆది, గుణకః, ధర్మోక్తేః

సర్వజ్ఞుడు, అన్ని ధర్మాలు, గుణాలు గలవాడు పరమాత్మే తప్ప వేరు కాదు.

సర్వజ్ఞత్వమ, సర్వనేతృత్వము అనే ధర్మాలు జడమైన ప్రకృతివీ కాదు. శరీరంగల జీవుడివి అంతకన్నా కాదు. ఈ లక్షణాలన్నీ పరమేశ్వరుడివి. అతనివల్లనే ఈ సృష్టి జరుగుతున్నది.

సూ. 22 విశేషణ భేద వ్యపదేశాభ్యాం చ నేతరౌ

విశేషణభేదవ్యపదేశాభ్యాం, చ, న, ఇతరౌ

విశేషణాలను, భేదాన్ని చెప్పటంవల్ల భూతాలను సృష్టించినవాడు పరమాత్మే కాని ఇంకొకరు కాదు.

పరమాత్మ అన్ని భూతాలను సృష్టించాడు. అతడు దివ్యుడు, మూర్తిరహితుడు, పూర్ణుడు, బాహ్యాంభ్యంతరాల్లో ఉండేవాడు, జన్మలేనివాడు, ప్రాణరహితుడు, మనసు లేనివాడు, పరిశుద్ధుడు, మాయకు అతీతుడు అతనినుండే ప్రాణము, పంచభూతాలు, మనస్సు, ఇంద్రియాలు పుడుతున్నాయి. అని ముండకపనిషత్తు చెబుతోంది.

జీవుడికి నామరూపాలుంటాయి. కాబట్టి ఈ లక్షణాలు అతడికి వర్తించవు. భూతము సృష్టికి కారణము ప్రకృతి కాదు. అక్షరము అంటే క్షరము కానిది. అవ్యాకృతము. నామరూపాలతో వ్యక్తం కానిది. అదే పరమేశ్వరుడు.

సూ. 23 రూపోపన్యాసాచ్చ

రూప, ఉపన్యాసాత్, చ

రూపాన్ని చెప్పటంవల్ల భూతయోని అంటే పరమాత్మయే కాని వేరు కాదు.

ముండకోపనిషత్తులో "ఆ పరమేశ్వరుని నుంచే చతుర్వేద మంత్రాలు పుట్టినాయి. మౌంజీ బంధనాది దీక్షలు, అగ్నిహోత్రాది యజ్ఞాలు, దక్షిణలు, యజ్ఞాలకు కాలప్రమాణము, సూర్యచంద్ర లోకాలు, ఉత్తరాయణ దక్షిణాయన మార్గాలు పుట్టాయి. అష్టవసువులు, ఏకాదశరుద్రులు, ద్వాదశాదిత్యులు పుట్టారు. కర్మాధికారంగల మానవులు పుట్టారు. పశువులు, పక్షులు, ఉచ్ఛ్వాసనిశ్వాసలు, ధాన్యాలు, పురుషార్థాలు సాధించటానికి వీలైన తపస్సు, శ్రద్ధ, మితభాషణ, హితభాషణ, అష్టవిధమైథునాలు, త్యజించటంద్వారా ఆచరించే బ్రహ్మచర్యం పుట్టాయి. పరబ్రహ్మనుండే సప్తప్రాణాలు, (కళ్ళు - 2, ముక్కులు-2, చెవులు-2, నోరు-1) పుట్టాయి. ఏడు ఆహుతులు, ఏడు ప్రాణాలు సంచరించే స్థానాలు, సప్తసముద్రాలు, పర్వతాలు, నదులు, వివిధరకాల ధాన్యాలు, షడ్రుచులు అన్నీ పరమాత్మ నుంచే పుట్టాయి" అని చెప్పబడింది. అంటే ఈ రూపాలన్నీ పరమాత్మవే. ఈ రూపం జీవుడికి కాదు. సర్వభూతాలకు ఆత్మగా ఉండటమనేది ప్రకృతి లక్షణం కాదు. ఈ లక్షణాలన్నీ పరబ్రహ్మవే. అదృశ్యాది రూపము గలది, భూతయోని పరబ్రహ్మ తప్ప వేరేదీ కాదు. అంటూ రత్నాకరుడు ఆరవ అధికరణను ముగించాడు.

7. వైశ్వానరాధికరణము

"గురువుగారూ! ఆత్మ అంటే జీవాత్మా లేక పరమాత్మా? అలాగే వైశ్వానరుడు అంటే జఠరాగ్ని, భూతాగ్ని, అగ్నిదేవుడు. వీటిలో ఏది ? వైశ్వానరుడు కూడా బ్రహ్మమేనా? వివరించండి" అని అడిగాడు కృష్ణశర్మ.

శిష్యుని సందేహం విన్న రత్నాకరుడు ఈ విధంగా చెప్పటం మొదలుపెట్టాడు.

సూ. 24 వైశ్వానరః సాధారణ శబ్దవిశేషాత్

వైశ్వానరః, సాధారణశబ్ద, విశేషాత్

సాధరణ శబ్ద విశేషాలవల్ల వైశ్వానరుడు పరమాత్మ.

వైశ్వానరశబ్దం పరమాత్మ వాచకం. వైశ్వానరాత్మను గురించి ఛాందోగ్యోపనిషత్తులో వివరించబడింది.

ఉపమన్యుని కుమారుడు ప్రాచీన శీలుడు, పులుషుని కుమారుడు సత్యయజ్ఞుడు, భల్లుని కుమారుడు ఇంద్రద్యుమ్నుడు, శర్కరాక్షుని కుమారుడు జనుడు, అశ్వతరాశ్యుని కుమారుడు బుడిలుడు. వీరు ఆత్మ అంటే ఏమిటి? బ్రహ్మతత్త్వం ఏమిటి? అనే విషయాలు తెలుసుకోవటానికి ఉద్దాలకుని వద్దకు వెళ్ళారు. ఉద్దాలకుడు వీరందరిని వెంటపెట్టుకుని అశ్వపతి మహారాజువద్దకు వెళ్ళాడు. రాజు వీరందరినీ, విడివిడిగా వైశ్వానరాత్మను ఏ రకంగా ఉపాసన చేస్తున్నారని అడిగి, వారు చేస్తున్న ఉపాసన తప్పు అని చెప్పాడు. తరువాత అశ్వపతి మహారాజువారికి వైశ్వానరాత్మను గురించి వివరిస్తాడు. "ఓ బ్రాహ్మణ కుమారులారా! వైశ్వానరాత్మను నేనే అని భావించేవాడు వైశ్వానరవేత్త అయి అన్న భక్షణ చేస్తాడు. అంటే సమస్తలోకాల్లోనూ, ప్రాణుల్లోనూ తానే ఉండి, అన్ని రకాల అన్నులు భక్షిస్తాడు.

వైశ్వానరుడికి	శిరస్సు	-	ద్యులోకము
	నేత్రాలు	-	ఆదిత్యుడు
	ప్రాణం	-	వాయువు
	శరీర మధ్యభాగం	-	ఆకాశం
	మూత్రకోశం	-	జలం
	పాదాలు	-	భూమి
	వక్షస్థలం	-	వేదక
	రోమాలు	-	దర్భలు
	హృదయం	-	గార్హపత్యాగ్ని
	మనస్సు	-	దక్షిణాగ్ని
	నోరు	-	ఆహవనీయాగ్ని

ఈ రకంగా మూడు లోకాలు శరీరమే అనటంచేత అతడు పరమాత్మ తప్ప వేరు కాదు.

సూ. 25 స్మర్య మాణ మనుమానం స్యాదితి

స్మర్యమాణం, అనుమానం, స్యాత్, ఇతి.

స్మృతులలో చెప్పిన రూపం దీని ప్రమాణంగా ఉండటంచేత వైశ్వానరుడు పరమాత్మ అనే చెప్పాలి.

పురాణాలలో పరమేశ్వరుని వర్ణిస్తూ "ఎవరికైతే అగ్ని – ముఖము, ద్యులోకము – శిరస్సు, ఆకాశం – నాభి – భూమి – పాదాలు, సూర్యుడు – కనులు, దిక్కులు – శ్రోత్రములు అయినాయో, అటువంటి పరమాత్మకు నమస్కారము" ఇక్కడ చెప్పిన వైశ్వానరుడు, పురాణాలలోని పరమేశ్వరుడు ఇద్దరూ ఒకటే.

సూ. 26 శబ్దాది భ్యోఽ_ంతః ప్రతిష్ఠానాచ్చనేతిచేన్న తథా దృష్ట్యుపదేశాదసంభవాత్పురుషమపి చైన మధీయతే

శబ్దాదిభ్యః, అన్తః, ప్రతిష్టానాత్, చ, న, ఇతి చేత్, న, తథా దృష్ట్యుపదేశాత్, అసంభవాత్, పురుషం, అపి, చ, ఏనం, అధీయతే

వైశ్వానరశబ్దం అగ్నికి సంబంధించి ఉన్నది. వైశ్యానరపదం – పరమాత్మకు సంబంధించినది. అంతేకాని జఠరాగ్ని మాత్రం కాదు.

ఈ ప్రకరణంలో జఠరాగ్ని రూపంలో పరమేశ్వరోపాసన చెప్పబడింది. అంతేకాని వైశ్వానరుడు పరమాత్మే.

సూ. 27 అత ఏవ న దేవతా భూతం చ

అత, ఏవ, న, దేవతా, భూతం, చ

వైశ్వానరపదానికి అగ్ని అని అర్థం కాదు. పరిమితశక్తి గల అగ్నికి, ముల్లోకాలు శరీరం కావు. కాబట్టి వైశ్వానరుడు పరమాత్మే.

సూ. 28 సాక్షాదప్య విరోధం జైమినిః

సాక్షాత్, అపి, అవిరోధం, జైమినిః

ప్రత్యక్షంగా సాక్షాత్తు ఇది పరమేశ్వరోపాసనే. వైశ్వానరుడు అనే శబ్దానికి విశ్వానికే నరుడు, విశ్వంలోని జీవులన్నింటికీ ప్రతిరూపం. సమస్త జీవులు ఇతనికి సంబంధించినవే. అందుకే వైశ్వానరుడు సర్వేశ్వరుడు.

సూ. 29 అభివ్యక్తే రిత్యాశ్మరథ్యః

అభివ్యక్తేః, ఇతి, ఆశ్మరథ్యః

ఉపాసకులను అనుగ్రహించటంకోసం హృదయము మొదలైనస్థానాల్లో ఉంటున్నాడు. అతడు ఉండే స్థానాన్ని బట్టి స్వల్పపరిమాణం గలవాడని అశ్మరథ్యుడు అనే ఋషి చెప్పాడు.

సూ. 30 అనుస్మృతేర్బాదరిః

అనుస్మృతేః, బాదరిః

బాదరి అనే ఆచార్యుడు "ధ్యానమువల్ల ప్రాదేశమాత్రుడుగా చెప్పబడుతున్నాడు" అని చెప్పాడు. పరమేశ్వరుడు సర్వవ్యాపకుడు. అయినప్పటికీ 'శేరుతో కొలిచిన ధాన్యం శేరే' అన్నట్టుగా, పరిభిన్నమైన మనసుతో ధ్యానం చేస్తున్నాము కాబట్టి పరిభిన్నుడుగా చెప్పబడుతున్నాడు.

సూ. 31 సంపత్తేరితి జైమిని స్తథా హి దర్శయతి

సంపత్తేః, ఇతి, జైమినిః, తథా, హి, దర్శయతి

వాజసనేయ బ్రాహ్మణంలో ద్యులోకం మొదలు భూమివరకు వైశ్వానరునికి శిరస్సు మొదలు గడ్డం వరకు అవయవాలు అని చెప్పబడింది. అందుకని వైశ్వానరుడే పరమాత్మ అంటున్నాడు జైమిని మహర్షి.

సూ. 32 ఆమనంతి, చైనమస్మిన్

ఆమనంతి, చ, ఏనం, అస్మిన్

జాబాలిశాఖవారు పరమేశ్వరుని శిరస్సుకు, గడ్డానికి మధ్యప్రదేశంలో ఉపాసించాలి అంటున్నారు జాబాలోపనిషత్తులో ఈ విధంగా చెప్పబడింది.

జీవుడు దేనియందు ప్రతిష్ఠితమై ఉన్నాడు? – వరుణకు నాసికి మధ్యభాగంలో

వరుణ అంటే ఏమిటి ?

ఇంద్రియాలు చేసిన అన్ని పాపాలను హరించేది. నాసి అంటే ఏమిటి ?

సర్వపాపాలు నశింపచేసేది.

అందుకే భ్రూ, నాసికల మధ్యభాగమే వారణాసి అది ద్యులోకానికి పరలోకాలకు సంధి. కాబట్టి వైశ్వానరుడు అంటే పరమాత్మే.

మాండుక్యోపనిషత్తులో "కనిపించే జగత్తంతా పరబ్రహ్మ స్వరూపమే. పైకి కనిపించే విశ్వము మాత్రమే బ్రహ్మకాదు. కనిపించకుండా లోపల ఉండే ఆత్మకూడా బ్రహ్మమే. అంటే కనిపించేదీ, కనిపించనిదీ కూడా బ్రహ్మమే. బ్రహ్మనికి నాలుగు పాదాలున్నాయి.

అందులో మొదటి పాదం వైశ్వానరుడు. అంటే విశ్వంలోని నరులందరిలోనూ సమానంగా ఉండేవాడు. వారందరికీ ప్రతినిధి విశ్వముయొక్క వ్యష్టిరూపం వైశ్వానరుడైతే, సమిష్టిరూపం విరాట్స్వరూపం" అని చెప్పబడింది. కాబట్టి వైశ్వానరుడు అంటే బ్రహ్మ తప్ప ఇంకెవరూ కాదు. అంటూ రెండవ పాదాన్ని ముగించాడు రత్నాకరుడు.

తృతీయ పాదము

ఇప్పటివరకు రెండు పాదాలు పూర్తి అయినాయి. ఇప్పుడు మూడవపాదాన్ని ప్రారంభిద్దాం.

ఈ పాదంలో మొత్తం 13 అధికరణలు, 43 సూత్రాలు ఉన్నాయి. వాటి వివరాలు

వ.నెం.	అధికరణము	విషయము	సూత్రాలు
1.	ద్యుభ్వాద్యధికరణము	ద్యులోకానికి, భూలోకానికి ఆధారము బ్రహ్మ	7
2.	భూమాధికరణము	భూమము బ్రహ్మమే	2
3.	అక్షరాధికరణము	అక్షరము బ్రహ్మమే	3
4.	ఈక్షితకర్మ వ్యపదేశాధికరణము	దర్శనీయుడు పరమాత్మే	1
5.	దహరాధికరణము	హృదయాకాశము బ్రహ్మమే	8
6.	అనుకృత్యధికరణము	బ్రహ్మము స్వయంప్రకాశము	2
7.	ప్రమితాధికరణము	అంగుష్టమాత్ర పురుషుడు బ్రహ్మమే	2
8.	దేవతాధికరణము	దేవతలు బ్రహ్మవిద్యకు అధికారులే	8
9.	అపశూద్రాధికరణము	శూద్రులకు బ్రహ్మవిద్యాధికారం లేదు	5
10.	కంపనాధికరణము	సమస్తాన్ని ప్రవర్తింపచేసే ప్రాణం బ్రహ్మమే	1
11.	జ్యోతిరధికరణము	జ్యోతిశబ్దం బ్రహ్మాన్నే చెబుతోంది	1
12.	అర్థాంతరత్వవ్యపదేశాధికరణము	ఆకాశము బ్రహ్మమే	1
13.	సుషుప్త్యుత్క్రాం త్యధికరణము	సుషుప్తియందు, ఉత్క్రాంతి యందలి పురుషుడు బ్రహ్మమే	2
		మొత్తం సూత్రాలు	43

రెండవ పాదంలో ఉపాస్యబ్రహ్మను గురించి చెప్పారు. కాని ఈ పాదంలో జ్ఞేయబ్రహ్మను గురించి చెబుతున్నారు.

1. ద్యుభ్వాద్యధికరణము

గురువుగారూ ! ముండకోపనిషత్తులో "అక్షర పురుషుడుగా చెప్పబడే ఆ పరబ్రహ్మలో ద్యులోకము, భూమి, అంతరిక్షము, ఇంద్రియాలు, మనస్సు, అన్నీ వస్త్రంలో దారపుపోగుల లాగా కలిసి ఉన్నాయి. అదే అద్వితీయమైన బ్రహ్మ అదే మోక్షానికి సేతువు" అని చెప్పబడింది.

ఇక్కడ సేతువు అని చెప్పబడింది. సేతువు అంటే 'ఒక వడ్డు నుంచి ఇంకొక వడ్డుకు చేర్చేది' అని అర్థం కదా. మరి పరమాత్మ సేతువు ఎలా అవుతాడు. పరమాత్మ అనంతమైనది. అపారమైనది. కదా ! సేతువు పరిమితమైనది. మరి అపరిమితమైన పరమాత్మ, పరిమితమైన సేతువు ఎలా అవుతుంది? లేకపోతే ఈ సేతువు ప్రకృతి కాని, వాయువుకాని అవుతుందా? "కాస్త వివరించండి" అన్నాడు నారాయణభట్టు.

ఆ మాటలు విన్న రత్నాకరుడు శిష్యుని సందేహం తీర్చటం ప్రారంభించాడు.

సూ. 1 ద్యుభ్వాద్యాయతనం స్వశబ్దాత్
ద్యు, భూ, ఆది, ఆయతనం, స్వ, శబ్దాత్

ద్యులోకము, భూలోకము, ప్రాణము, మనస్సు, అంతరిక్షముగల ఈ జగత్తుకు ఆధారమైనది పరబ్రహ్మ. పైన చెప్పిన సూత్రంలో 'స్వ' అనేది పరబ్రహ్మ వాచకము. శ్రుతుల్లో అనేకచోట్ల ఈ శబ్దంతోనే ఆత్మను సూచించారు.

ముండకోపనిషత్తులో "సమస్త ప్రపంచము, అగ్నిహోత్రాది కర్మలు, తపస్సు, అన్నీ అతనిరూపమే. అన్నింటియందు పరమేశ్వరుడున్నాడు. సమస్త ప్రాణుల హృదయాల్లోనూ ఉన్నాడు. సూర్యాదిగ్రహాలను ప్రకాశింపచేసేది బ్రహ్మమే. అదే ప్రాణం. అదే వాక్కు. అదే మనస్సు. అదే సత్యము, అదే నిత్యము. అమృతమయము" అని చెప్పబడింది.

కాబట్టి ఈ జగత్తుకు ఆధారము బ్రహ్మమే.

సూ. 2 ముక్తోపసృప్యవ్యపదేశాత్
ముక్తో, పసృప్య, వ్యపదేశాత్

ముక్తులచే పొందదగినది అని చెప్పటంవల్ల ద్యులోకము, భూలోకము మొదలైన వాటికి అధిష్ఠానం పరబ్రహ్మమే.

అజ్ఞానము. నేను నాది అనే అహంకార మమకారాలు. ఈ అజ్ఞానంవల్లనే శరీరము మొదలైన వాటికి గౌరవ సత్కారాలు. వీటివలన రాగము ఉద్భవిస్తుంది. దేహాన్ని అగౌరవపరిస్తే ద్వేషం కలుగుతుంది. శరీరం నాశనమవుతందేమోనని భయం. దానిమీద మోహం. ఈ రకంగా అవిద్య అనేక రకాలుగా ఉంటుంది. దీనికి విరుద్ధం ముక్తి. రాగద్వేషాలు లేనప్పుడు పొందే స్థానమే ముక్తి. అదే భూమి, స్వర్గము మొ॥వాటికి అధిష్ఠానము. అదే బ్రహ్మ.

ముండకోపనిషత్తులో చెప్పినట్లుగా "ఆత్మ వేదాధ్యయనంవల్లగాని, శాస్త్రజ్ఞానం వల్లగాని తెలియబడదు. ఆత్మ సాక్షాత్కారమందు అకుంఠితదీక్ష గలవాడికే ఇది బోధపడుతుంది. ఐహిక బంధనాలలో కూరుకుపోయిన వాడికి, కర్మ పరిత్యాగం చెయ్యనివాడికి ఆత్మ సాక్షాత్కరించదు. బ్రహ్మనిష్ఠాగరిష్ఠులైన సన్యాసులకే ఇది గోచరిస్తుంది. జ్ఞానులైన మహర్షులు తమ హృదయంలో దర్శించిన ఆత్మనే పరమాత్మగా తెలుసుకుంటారు. ఉపనిషత్సారమైన బ్రహ్మజ్ఞానమే తమ ధ్యేయంగా నిశ్చయించి సన్యసించిన యతీశ్వరులు మాత్రమే బ్రహ్మలోకము ప్రవేశించి ముక్తి పొందుతారు" అని చెప్పబడింది. అంటే ముక్తి అనేది పరమపురుషులకు మాత్రమే కలుగుతుంది. యుక్త పురుషులు పరబ్రహ్మని పొందుతారు కాని ప్రకృతిని పొందరు. కాబట్టి ద్యుభ్వాదులకు ఆయతనం పరమాత్మ.

సూ. 3 నానుమాన మతచ్ఛబ్దాత్

న, అనుమానం, అతచ్ఛబ్దాత్

ఇక్కడ ప్రకృతి అని చెప్పే శబ్దం లేనందువల్ల, అనుమాన ప్రమాణంతో ప్రకృతిని ద్యుభ్వాదులకు అధిష్ఠానం అని చెప్పరాదు.

బ్రహ్మాన్ని ప్రతిపాదించటానికి అనేకమైన విశేషాలు గతంలో చెప్పారు. కాని ఇంకొక దానికి అలాంటివేమీ చెప్పలేదు. కాబట్టి స్వర్గము, పృథివి మొదలైన వాటికి అధిష్ఠానము బ్రహ్మమే.

సూ. 4 ప్రాణభృచ్చ

ప్రాణభృత్, చ

ప్రాణాలను భరించేవాడు ప్రాణభృత్తు అంటే జీవుడు. అయితే విజ్ఞానాత్మ అయిన జీవుడు కూడా ద్యుభ్వాదులకు అధిష్ఠానం కాదు.

జీవుడు సర్వజ్ఞుడు కాదు. అతనిలో ఆత్మత్వము చేతనత్వము ఉన్నాయి కాని జీవుడు ఉపాధి పరిఛిన్నుడు అంటే శరీరం ధరించినవాడు. అందుకని జీవి సర్వజ్ఞుడు కాదు. మరి సర్వజ్ఞుడు బ్రహ్మమే.

సూ. 5 భేదవ్యపదేశాత్

ఇద్దరి మధ్య భేదం చెప్పటంవల్ల జీవుడు అధిష్ఠానం కాదు.

ముండకోపనిషత్తులో చెప్పినట్లుగా "సంసారమనే వృక్షంమీద రెండు పక్షులు కూర్చుని ఉన్నాయి. అందులో ఒకటి కర్మఫలం అనుభవిస్తోంది. రెండవది చూస్తూ కూర్చుంది. అజ్ఞానపు పొరలు తొలగిపోయినప్పుడు జీవాత్మ పరమాత్మ ఒకటే అని తెలుస్తుంది. అదే మోక్షము. కాబట్టి అన్నిటికీ అధిష్ఠానము బ్రహ్మమే.

సూ. 6 ప్రకరణాత్

ప్రకరణంవల్ల ప్రాణాలను ధరించే జీవుడు అధిష్ఠానం కాలేదు.

ఏదైనా అర్థం చెప్పేటప్పుడు సందర్భాన్ని బట్టి చెప్పాలి. అందుచేత అన్నిటికీ అధిష్ఠానం బ్రహ్మమే.

సూ. 7 స్థిత్యదనాభ్యాంచ

స్థితి, అదనాభ్యాం, చ

ఉదాసీనుడై ఉండటం, కర్మఫలాన్ని అనుభవించటం అనే గుణాలవల్ల కూడా ప్రాణాలుధరించే జీవుడు అధిష్ఠానం కాలేదు.

ముండకోపనిషత్తులో చెట్టుమీది పక్షులలో ఒకటి జీవాత్మ. రెండవది పరమాత్మ. జీవాత్మ కర్మఫలాన్ని అనుభవిస్తోంది. పరమాత్మ ఉదాసీనంగా కూర్చుంది. కాబట్టి కర్మలను అనుభవించే జీవుడు, శరీరధారి. కాబట్టి అతడు లోకాలకు అధిష్ఠానం కాదు. ద్యులోకానికి, భూలోకానికి అధిష్ఠానము ఆ పరమాత్మే కాని ఇంకొకరు కాదు. అంటూ మొదటి అధికరణం పూర్తి చేశాడు.

2. భూమాధికరణము

సూ. 8 భూమా సంప్రసాదా దధ్యుపదేశాత్

భూమా, సంప్రసాదాత్, అధి, ఉపదేశాత్

సుషుప్త్యవస్థలో మేల్కొని ఉండేది ప్రాణమే కాబట్టి ప్రాణమే పరమాత్మ అంటారు. కాని అది నిజం కాదు.

సూ. 9 ధర్మోప పత్తేశ్చ

ధర్మ, ఉపపత్తే, చ

అమృతత్వాది ధర్మాలయొక్క సంగతివల్లకూడా భూమము అంటే పరమాత్మే.

ఛాందోగ్యోపనిషత్తులో "ఒకసారి నారద మహర్షి సనత్కుమారుడి దగ్గరకు వెళ్ళి తనకు ఆత్మానందం కలుగచేయమని కోరతాడు. అప్పుడు సనత్కుమారుడు నారదా ఇంతవరకు నువు తెలుసుకున్నదంతా పదాలు మాత్రమే. ఆ పదజాలం దేన్నైతే సాధించగలవో, అదే నీకు లభిస్తుంది. అంతకన్న ఏమీ దొరకదు. ఇంతవరకు నువు తెలుసుకున్నది నామమాత్రమైనది. నామంకన్న గొప్పది వాక్కు, వాక్కుకన్న మనసు, మనసు కన్న సంకల్పం, సంకల్పం కన్న చిత్తం, చిత్తంకన్న ధ్యానం, ధ్యానంకన్న విజ్ఞానం, విజ్ఞానంకన్న బలం, బలంకన్న అన్నం, అన్నంకన్న జలం, జలంకన్న తేజస్సు, తేజస్సు కన్న ఆకాశం, ఆకాశంకన్న అంతఃకరణ, అంతఃకరణ కన్న ఆశ, ఆశకన్న ప్రాణం ముఖ్యమైనవి. ప్రాణంకన్న శ్రేష్ఠమైనది ఆత్మ విజ్ఞానం. ఆత్మయే సర్వానికి అధిష్టము అని చెప్పారు. కాబట్టి ఆత్మయే సర్వానికి అధిష్టము భూమము అంటే బ్రహ్మమేకాని ప్రాణం కాదు. అంటూ వివరించాడు రత్నాకరుడు.

3. అక్షరాధికరణము

"అక్షరము అంటే అకారము నుంచి క్షకారము వరకు గల అక్షర సమామ్నాయము. అక్షరమే బ్రహ్మ అని అన్నప్పుడు ఈ అక్షర సమామ్నాయమే పరమాత్మ అవుతుంది. అంటే ప్రకృతినే పరబ్రహ్మ అనాలి కదా?" అంటూ అనుమానం వ్యక్తం చేశాడు కృష్ణశర్మ. దానికి సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 10 అక్షరమంబరాంతధృతేః

అక్షరం, అంబరాంతధృతేః

భూమి దగ్గర నుండి ఆకాశందాకా అన్నిరకాలైన స్వరూపాలు అక్షరానివే. అక్షరము అంటే నాశనము లేనిది. అదే పరబ్రహ్మ. సర్వమూ ఆకాశం నుంచే ఉద్భవించింది. ఆకాశం పరబ్రహ్మనుంచి ఉద్భవించింది. కాబట్టి ఆకాశంతో సహా సమస్తమూ పరబ్రహ్మలోనే లీనమై ఉన్నాయి. అందుచేత అక్షరము అంటే పరమాత్మేకాని ప్రకృతి కాదు.

సూ. 11 సాచ ప్రశాసనాత్

సా, చ, ప్రశాసనాత్

ధరించటము అనేది 'ప్రశాసనం' వల్లనే జరుగుతుంది. ప్రశాసనము అంటే – ఆజ్ఞ. ఈ విధంగా ప్రశాసనం చెయ్యటమనేది పరమాత్మవల్లనే అవుతుంది. అందుచేత అక్షరము అంటే పరమాత్మయే కాని ప్రకృతి కాదు.

సూ. 12 అన్యభావ వ్యావృత్తేశ్చ

అన్య, భావ, వ్యావృత్తేః, చ

అన్యభావము అంటే ఈశ్వరునికన్న భిన్నమైనది అని అర్థం. పరమాత్మకన్న భిన్నమైనవాడు అక్షరునిలో లేడు కాబట్టి అక్షరమంటే పరమాత్మే కాని ప్రకృతి కాదు.

బృహదారణ్యకోపనిషత్తులో జనకుని కొలువులో ఆధ్యాత్మిక సామ్రాజ్యానికి చక్రవర్తి ఎవరో తెలుసుకోవాలని పరిక్ష పెట్టాడు జనకమహారాజు. ఆ సందర్భంగా యాజ్ఞవల్క్యునికీ, గార్గికీ మధ్య వాదన జరుగుతుంది. గార్గి అడుగుతున్నది. "యాజ్ఞవల్క్యా! ద్యులోకానికి పైన, భూలోకానికి క్రింద, బ్రహ్మాండముయొక్క మధ్యలో ఉన్నట్టి, భూత వర్తమాన భవిష్యత్తులుగా పేర్కొనబడినటువంటి ఈ ప్రపంచమంతా దేనిలో వ్యాపించి ఉన్నది? నక్షత్రాలకు పైన, భూమిక్రింద, ఈ రెంటికీ మధ్య భూతభవిష్యద్వర్తమానాలలో ఏముంటుందో కాస్త వివరించండి."

"సర్వవ్యాపకమైనది, భూతభవిష్యద్వర్తమానాలలో కూడా ఉండేది ఆకాశం మాత్రమే" అన్నాడు యాజ్ఞవల్క్యుడు. మళ్ళీ అడుగుతోంది గార్గి. "మహానుభావా ! ఆకాశంకన్న సూక్ష్మమైనది, అందులోకూడా వ్యాపించి ఉన్నది ఏమిటి?"

"పరబ్రహ్మ చరాచర జగత్తు యొక్క సృష్టి స్థితి లయాలకు కారణం అదే. సర్వవ్యాపక మైనది. సర్వాంతర్యామి అయినది ఆ బ్రహ్మమే. ఆదిమధ్యాంతరహితమైన పరమసత్యం" అన్నాడు యాజ్ఞవల్క్యుడు.

అక్షరము అంటే క్షరము కానిది. నాశనము లేనిది. శాశ్వతమైనది. ఈ లక్షణాలు గలది పరబ్రహ్మేకాని ప్రకృతికాదు. అంటూ మూడవ అధికరణను పూర్తి చేశాడు రత్నాకరుడు.

4. ఈక్షతికర్మవ్యపదేశాధికరణము

"గురువుగారూ ! ప్రశ్నోపనిషత్తులో ఓంకారోపాసన చేసినవారు సూర్యలోకానికి పోతారు అని చెప్పారు కదా! అంటే ఆ పరబ్రహ్మనే ఉపాస్యగా చెబుతున్నారు. కాబట్టి ఉపాస్యుడు పరబ్రహ్మ, సూర్యుడా? దర్శనీయుడు ఎవరు ?" అంటూ అనుమానం

వెలిబుచ్చాడు నారాయణభట్టు. ఆ మాటలు విన్న రత్నాకరుడు శిష్యుని సందేహం తీర్చటానికి ఉపక్రమించాడు.

సూ. 13 ఈక్షతి కర్మవ్యపదేశాత్సః

ఈక్షతి, కర్మ వ్యపదేశాత్, సః

దర్శనీయుడు, ధ్యానం చేయబడదగినవాడు పరమాత్మే కాని వేరు కాదు.

ఇక్కడ పరబ్రహ్మనే ధ్యానం చెయ్యాలి అని చెబుతున్నారు. ఈక్షితి అంటే చూచుట. దర్శనీయము.

ప్రశ్నోపనిషత్తులో సత్యకాముడు పిప్పలాదుడికి నమస్కరించి, మానవుడు మరణించే దాకా ఓంకారోపాసన చేస్తే ఏ లోకాలకు పోతాడు? అని అడిగాడు. దానికి పిప్పలాదుడు సమాధానం చెబుతూ ఓంకారమనేది అకార ఉకార మకారముల యొక్క సమ్మేళనము. దీనిలో ఒక అక్షరాన్ని మాత్రమే ధ్యానిస్తే మరణానంతరము భూలోకంలో మళ్ళీ పుడతాడు. రెండు అక్షరాలను కలిపి ధ్యానిస్తే సాధకుడు సూక్ష్మశరీరంతో చంద్రలోకానికి పోయి, అక్కడ సుఖాలనుభవించి, తిరిగి భూమి మీద జన్మిస్తాడు. మూడు అక్షరాల రూపమైన ఓంకారాన్ని ధ్యానిస్తే సాధకుడు తేజోమయమైన సూర్యలోకానికి పోతాడు. ఆ తరువాత బ్రహ్మలోకంచేరి, కల్పాంతంవరకు అక్కడ ఉండి, కల్పాంతాన పరబ్రహ్మలో లీనమవుతాడు" అని చెప్పబడింది.

కాబట్టి దర్శనీయుడు సూర్యుడు కాదు. సాధకుడు చంద్రలోకం వెళ్ళినట్లే, సూర్యలోకం చేరతాడు. అంతే ఇక్కడ ఉపాసన చేయవలసినది సూర్యుణ్ణి కాదు. అలాగే దర్శనీయుడు కూడా సూర్యుడు కాదు. పరమాత్మయే అంటూ నాల్గవ అధికరణను ముగించాడు రత్నాకరుడు.

5. దహరాధికరణము

"ఆకాశము అంటే భూతాకాశం. లేదా మానవదేహంలో ఉండే దాన్ని దహరాకాశము అనాలి. అంతేగాని అది పరమాత్మ ఎందుకవుతుంది?" అంటూ అనుమానం వ్యక్తం చేశాడు కృష్ణశర్మ. శిష్యుని అనుమానం తీర్చటానికి ఉద్యుక్తుడౌతున్నాడు రత్నాకరుడు.

సూ. 14 దహర ఉత్తరేభ్యః

దహరః, ఉత్తరేభ్యః

శరీరంలో ఉండే ఆకాశాన్ని దహరాకాశము అంటారు. దహరాకాశము అంటే బ్రహ్మమే.

ఛాందోగ్యోపనిషత్తులో గాయత్రి ఉపాసన గురించి చెబుతూ "శుద్ధబ్రహ్మ కార్య బ్రహ్మకన్న గొప్పది. పాంచ భౌతికమైన ఈ జగత్తంతా శుద్ధ బ్రహ్మయొక్క మొదటి పాదమే. మిగిలిన మూడు పాదాలు ఆ పరబ్రహ్మలోనే ఉన్నాయి. గాయత్రి ద్వారా ప్రతిపాదించబడి, మూడు పాదములు గల అమృతస్వరూపమైన బ్రహ్మ ఇదే. ఆ పురుషునికి లోపలా బయటా కూడా ఉన్న ఆకాశము ఒకటే. అలాగే హృదయంలోపలా బయటా ఉన్న ఆకాశము ఒకటే. అదే ఆత్మ. ఈ రకంగా బ్రహ్మను గురించి తెలుసుకున్నవాడు జీవించి ఉండగానే బ్రహ్మస్వరూపం పొందుతాడు అని చెప్పబడింది. బాహ్యాకాశము ఎంత ఉన్నదో, సూక్ష్మాకాశం, దహరాకాశం కూడా అంత ఉన్నది. ఇందులో స్వర్గము, పృథివి రెండూ ఉంటాయి. ఆత్మపాపరహితుడు. జన్మమృత్యుజరాదులు లేనివాడు. ఆకలి దప్పికలు లేనివాడు. సత్యకాముడు, సత్యసంకల్పుడు దహరాకాశము, భూతాకాశము రెండూ ఒకటి కాదు. స్వర్గము, పృథివి రెండూ దహరాకాశంలో ఉన్నాయి. కాబట్టి భూమికీ, ఆకాశానికి, స్వర్గానికీ కూడా దహరాకాశమే ఆధారము.

సూ. 15 గతిశబ్దాభ్యాం తథాహి దృష్టం లింగం చ

గతిశబ్దాభ్యాం, తథాహి, దృష్టం, లింగం, చ

గతి అంటే గమనము, బ్రహ్మలోకము. అందుచేత, దహరాకాశము అంటే పరమాత్మే కాని వేరు కాదు. ఛాందోగ్యోపనిషత్తులో ఉద్దాలకుడు తన కుమారుడైన శ్వేతకేతువుకు సుషుప్తిని గురించి వివరిస్తున్నాడు. మానవుడు గాఢనిద్రలో ఉన్నప్పుడు అతడు సుషుప్తిలో ఉన్నాడు అంటారు. ఆ సమయంలో జీవుడు పరమసత్తను పొందుతాడు. అంటే తన నిజస్వరూపాన్ని పొందుతాడు. తన ఆత్మను తాను పొందుతాడు. కాబట్టి అతన్ని గురించి చెప్పేటప్పుడు అతడు నిద్రిస్తున్నాడు అంటారు. సుషుప్తావస్తలో మనస్సు, ఇంద్రియాలు పని చెయ్యటం మానివేస్తాయి. అప్పుడు మిగిలేది ఆత్మ మాత్రమే. ఆ ఆత్మ నిజరూపంలో మిగులుతుంది. ప్రతిబింబంలాంటి జీవభావం పోయి మిగిలేది ఆత్మభావం ఒక్కటే. ఇంద్రియాలన్నీ అలసట చెంది ఒక్కొక్కటే మనసులో లీనమైపోతాయి. మనసు ప్రాణంలో లీనమైపోతుంది. అంటే సుషుప్తావస్తలో ఒక్కప్రాణం మాత్రమే మేల్కొని ఉంటుంది. అదే ఇంద్రియాల అలసటను తీరుస్తుంది. సుషుప్తిలో జీవుడు పరమాత్మను పొందుతున్నాడు. కాబట్టి దహరాకాశము అంటే బ్రహ్మమే.

సూ. 16 ధృతేశ్చ మహిమ్నోఽ స్యాస్మిన్నుపలబ్ధేః

ధృతేః, చ, అస్యమహిమ్నః, అస్మిన్, ఉపలబ్ధేః

సమస్త జగత్తునూ ధరించటంవల్లనూ, సమస్త లోకాలను ధరించటము అనే మహిమ ఈతని యందు ఉండటంవల్లనూ దహరశబ్ద వాచ్యుడు బ్రహ్మమే.

బ్రహ్మపురమనే ఈ శరీరంలో దహరాకాశమున్నది. దానిలో సమస్తము ఉన్నాయి. దానికి సంబంధించినదే ఆత్మ. అది ఏ పాపములు లేనిది. లోకాలను ధరిస్తూ ఉంటుంది.

ఈ విధంగా లోకాలను ధరించటము అనేది ఒక్క బ్రహ్మవల్లనే అవుతుంది. ఆ శక్తి బ్రహ్మకే ఉన్నది. అతని ఆజ్ఞప్రకారమే సూర్యచంద్రులు తిరుగుతున్నారు. అతడే అందరికీ ప్రభువు. సర్వభూత పాలకుడు కాబట్టి లోకాలను ధరించటమనే కారణంవల్ల దహరాకాశము బ్రహ్మమే కాని వేరు కాదు.

సూ. 17 ప్రసిద్ధేశ్చ

ప్రసిద్ధేః, చ

ఆకాశము అనే మాట పరమాత్మ అనే అర్థంలోనే ప్రసిద్ధి చెందింది. కాబట్టి దహరాకాశము అంటే బ్రహ్మమే. జీవుడు కాదు. భూతాకాశం అంతకన్నా కాదు.

సూ.18 ఇతర పరామర్శాత్స, ఇతి చేన్నా సంభవాత్

ఇతర, పరామర్శాత్, సః, ఇతిచేత్, న, అసంభవాత్

సంప్రదాయార్థంలో జీవుడు అంటే దహరాకాశం అని అర్థం చెబుతారు. కాని ఇది సరికాదు.

అలా అనటానికి వీలు లేదు. బుద్ధి మొదలైనవాటి చేత ఆవరించబడిన జీవుడికి ఆకాశంతో సమానత్వం చెప్పటం కుదరదు. శరీరధారి అయిన జీవుడికి పాపాలనుండి విముక్తుడవటంకూడా జరగదు.

సూ. 19 ఉత్తరాచ్చే దా విర్భూత స్వరూపస్తు

ఉత్తరాత్, చేత్, ఆవిర్భూతస్వరూపః, తు

దహరవిద్యకు ఉత్తరమున (తరువాత) ఉన్న ప్రజాపతి విద్యవల్ల దహరపదము జీవుడికి వర్తిస్తుంది తప్పు.

ఛాందోగ్యోపనిషత్తులో ప్రజాపతి కథ చెప్పబడింది.

పూర్వకాలంలో ప్రజాపతి ఆత్మతత్వాన్ని ఒక ప్రకటన చేశాడు.

ఆత్మకు పాపం అంటదు. ముసలితనం రాదు. మృత్యువు దాన్ని కబళించదు. శోకం తాకదు. దానికి ఆకలిదప్పికలు లేవు. మానవుడు సత్యకాముడు. సత్యసంకల్పుడు అయి ఆత్మజిజ్ఞాసను అలవరచుకోవాలి. ఆత్మకోసం అన్వేషించినవాడు. ఆత్మను అనుభవించినవాడు ఆత్మస్వరూపాన్ని పొందుతాడు.

ఆ మాటలు విన్న దేవతలు, రాక్షసులు కూడా ఆత్మాన్వేషణకు బ్రహ్మదగ్గరకు వెళ్ళారు. ముప్పైరెండు సంవత్సరాలు దీక్ష ఆచరించిన తరువాత 'కనులలో మెదులుతూ కనిపించే పురుషుడే ఆత్మ' అన్నాడు బ్రహ్మ. ఈ మాటలు విన్న రాక్షస రాజు శరీరమే ఆత్మ' అని ప్రచారం చేశాడు.

కాని ఇంద్రుడు దాన్ని నమ్మలేదు. ప్రజాపతి ఇంద్రుని చాలాసార్లు పరిక్ష చేసి పరబ్రహ్మతత్వాన్ని ఉపదేశించాడు. పరబ్రహ్మ హృత్పద్మంలోనే ఉన్నాడు. కాబట్టి దహరాకాశమే బ్రహ్మ.

సూ. 20 అన్యార్థశ్చ పరామర్శః

అన్యార్థః, చ, పరామర్శః

దహరవిద్యా ప్రకరణంలోని దహరుడు పరమేశ్వరుడే

సూ. 21 అల్ప శ్రుతేరితి చేత్తదుక్తమ్

అల్పశ్రుతేః, ఇతి, చేత్, తత్, ఉక్తమ్

దహరము అంటే సూక్ష్మము, అల్పము అని అర్థము. దహరాకాశము అంటే సూక్ష్మమైన ఆకాశము. అయితే సూక్ష్మము అని చెప్పిన మాత్రంచేత అది పరమాత్మ కాకపోదు. పరమాత్మ పరమాణువులుగా అతిసూక్ష్మరూపంలో కూడా ఉన్నాడని కఠోపనిషత్తులో చెప్పబడింది. కాబట్టి సూక్ష్మరూపంలో ఉన్నప్పటికీ దహరాకాశము అంటే పరమాత్మ అంటూ ఐదవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

6. అనుకృత్యధికరణము

"గురువుగారూ! సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు అక్కడ ప్రకాశించవు. అంతా పరమేశ్వరుని యొక్క కాంతులే" అని ముండకోపనిషత్తులో చెప్పారు. మరి ఆ కాంతి కూడా ఏదో తేజస్సే అయి ఉండాలి కదా?" అంటూ తన అనుమానాన్ని వ్యక్తం చేశాడు

కృష్ణశర్మ. ఆ మాటలు విన్న రత్నాకరుడు తన శిష్యుని అనుమానం తీర్చటానికి సంసిద్ధుడౌతున్నాడు.

సూ. 22 అనుకృతే స్తస్య చ

అనుకృతేః, తస్య, చ

అనుకరించటంవల్ల ఆత్మయొక్క తేజస్సుతోనే సమస్తమూ ప్రకాశిస్తుంది.

సూ. 23 అపిచస్మర్యతే

అపిచ, స్మర్యతే

ఈ విషయం స్మృతులలో కూడా వివరించబడింది.

బృహదారణ్యకోపనిషత్తులో "ఒకరోజున యాజ్ఞవల్క్యుడు జనక మహారాజు ఆస్థానానికి వచ్చాడు. అతడికి నమస్కరించి జనకమహారాజు తన సందేహాలు తీర్చమని అడిగాడు. అలాగే అన్నాడు యాజ్ఞవల్క్యుడు. ఇప్పుడు జనకుడు అడుగుతున్నాడు.

జ : మానవుడు ఏ వెలుగు వల్ల నిత్యకృత్యాలు సాగిస్తున్నాడు ?

యా : సూర్యుని యొక్క వెలుగువల్ల

జ : సూర్యుడు లేకపోతే, అంటే రాత్రులందు ఏ వెలుగుచేత నిత్యకృత్యాలు సాగిస్తాడు?

యా : చంద్రునికాంతులలో

జ : సూర్యుడు, చంద్రుడు ఇద్దరూ లేనప్పుడు? అంటే సంధ్య వేళలయందు?

యా : అగ్ని యొక్క కాంతులతో

జ : సూర్యుడు, చంద్రుడు, అగ్ని కూడా లేనప్పుడు ?

యా : వాక్కు యొక్క సాయంతో

జ : మరి వాక్కుకూడా లేనప్పుడు ?

యా : జనకమహారాజా ! ఈ వెలుగులన్నిటికీ ఆవల ఆత్మజ్యోతి ఉన్నది. ఆ ఆత్మప్రకాశములకు ప్రకాశము. కాంతులకు కాంతి. అటువంటి ఆత్మవల్లనే మానవుడు తన మనుగడ సాగిస్తాడు.

జ : స్వామీ ! ఆత్మ అంటే ఏమిటి ? శరీరము, ఇంద్రియాలు, మనస్సు, వీటిలో ఆత్మ జ్యోతి ఏది ?

యా : ప్రాణాల్లోను, బుద్ధివృత్తులయందు ఉండే విజ్ఞాన జ్యోతియే ఆత్మ. ఇంద్రియాల మధ్య స్వయంప్రకాశమై హృదయంలో ఉండే పురుషుడే ఆత్మ అతడే జ్యోతిస్వరూపుడు

ముండకోపనిషత్తులో చెబుతున్నాడు

నతత్ర సూర్యోభాతి నతత్ర చంద్రతారకం

అక్కడ సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు ఏవీ ప్రకాశించవు. కేవలము ఆత్మజ్యోతి ప్రకాశము మాత్రమే ఉంటుంది.

పరమేశ్వర స్వరూపము జ్ఞానజ్యోతి. ఆ జ్యోతి నుంచి అనేకవేల లక్షల కోట్ల కోటానుకోట్ల కిరణాలు ప్రకాశిస్తున్నాయి. అందులో 360 కిరణాలు మాత్రమే మనం తీసుకోగలిగాము. అందులో అగ్ని 108 కిరణములు రవి 116 కిరణములు, చంద్రుడు 136 కిరణములు తీసుకోగలిగారు. ఈ మొత్తం 360 కిరణములు సూర్యుడు, చంద్రుడు, అగ్ని అందరూ ఆ పరమేశ్వరుని కిరణాలవల్లనే ప్రకాశిస్తున్నారు.

ఈ రకంగా బ్రహ్మవల్లనే ఈ జగత్తు అంతా ప్రకాశిస్తున్నది. పరబ్రహ్మ స్వయం ప్రకాశము గలవాడు అంటూ ఆరవ అధికరణను పూర్తి చేశాడు రత్నాకరుడు.

7. ప్రమితాధికరణము

"గురువుగారూ ! అంగుష్ఠమాత్ర పురుషుడు శరీర మధ్యలో ఉన్నాడు. అతడే భూతభవిష్య ద్వర్తమానాలకు ప్రభువు". అని కఠోపనిషత్తులో చెప్పారు. ఈ అంగుష్ఠమాత్రుడు జీవుడా ? పరమాత్మా?

భారతంలో యముడు సత్యవంతుని శరీరం నుండి అంగుష్ఠమాత్రుడైన పురుషుణ్ణి బయటకు లాగాడు అని చెప్పారు. ఇక్కడ అంగుష్ఠమాత్రుడు అంటే జీవుడే కదా?" అన్నాడు నారాయణభట్టు.

కాదయ్యా అంగుష్ఠమాత్రుడైన పురుషుడు అంటే జీవుడు కాదు. పరమాత్మే.

సూ. 24 శబ్దాదేవ ప్రమితః

శబ్దాత్, ఏవ, ప్రమితః

అంగుష్ఠమాత్రుడైన పురుషుడు బ్రహ్మమేకాని వేరు కాదు.

సూ. 25 హృద్యపేక్షయా తు మనుష్యాధికారత్వాత్

హృది, అపేక్షయా, తు, మనుష్యాధికారత్వాత్

ఈశ్వరుడు సర్వవ్యాపి అయినప్పటికీ అతడు అంగుష్ఠమాత్రుడై, హృదయస్థానంలో ఉన్నాడు.

పరమేశ్వరుడు సర్వాంతర్యామి. సర్వశక్తి సంపన్నుడు. అతనికి ఉన్న ఈశత్వము, భూతభవిష్యత్తులమీద అధికారము జీవికి ఉండవు. పరమేశ్వరుడు ఎందులో ఉంటే ఆ రూపంలోనే ఉంటాడు. అంటే వెదురు బొంగులో ఉండే ఆకాశము సన్నగా పొడవుగా ఉంటుంది. అలాగే చీమ, దోమలయందు ఉన్న పరమాత్మ, సూక్ష్మరూపంలో ఉంటాడు. ఈ అంగుష్ఠమాత్రుడు అనే శబ్దం మానవులలో ఉండే పరమాత్మకే వర్తిస్తాయి. కాబట్టి అంగుష్ఠమాత్ర పురుషుడు పరబ్రహ్మయే అంటూ ఏడవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

8. దేవతాధికరణము

"బ్రహ్మవిద్యను ఎవరు అభ్యసించాలి? మానవులకు బ్రహ్మోపదేశము పొందే హక్కు ఉన్నది. మరి దేవతలసంగతి ఏమిటి? దేవతలకు బ్రహ్మవిద్యను పొందే అధికారము ఉన్నదా!" అన్నాడు కృష్ణశర్మ. శిష్యుడి అనుమానం తీర్చటానికి ప్రయాణమవుతున్నాడు రత్నాకరుడు

సూ. 26 తదుపర్యపి బాదరాయణః సంభవాత్

తదుపరి, అపి, బాదరాయణః, సంభవాత్

మానవులకన్న ఉన్నతులు దేవతలు. దేవతలు భోగలాలసులు అనే మాట నిజమే. కాని వారి భోగం శాశ్వతం కాదు అనే విషయం వారికి తెలుసు. అందుకే వారుకూడా శాశ్వతమైన ఆనందం కావాలి అనుకుంటారు. కాబట్టే వారికికూడా వైరాగ్యం కలుగుతుంది. అప్పుడు బ్రహ్మవిద్యకు అధికారులవుతారు.

సూ. 27 విరోధః కర్మణీతి చేన్నానేక ప్రతిపత్తేర్దర్శనాత్

విరోధః, కర్మణి, ఇతి, చేత్, న, అనేక, ప్రతిపత్తేః దర్శనాత్

దేవతలకు దేహమున్నది మానవులు చేసే యజ్ఞయాగాలలో హవిర్భాగము తీసుకోవటానికి దేవతలు వస్తారు. ఒకేసారి అనేకచోట్ల ప్రత్యక్షమై హవిర్భాగం తీసుకుంటారు. బృహదారణ్యకోపనిషత్తులో శాకల్యుడు అడుగుతున్నాడు. యాజ్ఞవల్క్యా! దేవతలెంతమంది ? యాజ్ఞవల్క్యుడు చెబుతున్నాడు 3306 మంది.

శా : దేవతలెంతమంది

యా : ముప్పైముగ్గురు

శా : దేవతలెంతమంది

యా : ఆరుగురు

శా : దేవతలెంతమంది

యా : ముగ్గురు

అంటే ఒకే దేవత ఒకేసారి అనేక శరీరాలు పొందుతుంది శ్రీకృష్ణుడు అనేకమంది గోపికలతో ఒకేసారి క్రీడించాడని చెప్పబడింది. కాబట్టి దేవతలకు శరీరత్వమున్నది.

సూ. 28 శబ్ద ఇతి చేన్నాతః ప్రభవాత్ప్రత్యక్షాను మానాభ్యామ్

శబ్ద, ఇతి, చేత్, న, అతః, ప్రభావాత్, ప్రత్యక్షానుమానాభ్యామ్

వేదము నిత్యమైనది. దేవతలు అనిత్యులు. దేవతలంతా పూర్వజన్మలో చేసిన కర్మననుసరించి దైవత్వము పొందినవారే. అందుకే వారు అనిత్యులు. నిత్యమైన వేదంనుంచే అనిత్యులైన దేవతలు ఉద్భవించారు. ప్రజాపతే దేవతలందరినీ సృష్టించాడు. అని ఐతరేయోపనిషత్తులో చెప్పబడింది.

బృహదారణ్యకోపనిషత్తులో కూడా ఎనభై నాలుగు లక్షల జీవరాసులను సృష్టించాడు వీరిలో బ్రహ్మను గురించి తెలుసుకున్నవారు బ్రహ్మస్వరూపులయ్యారు. అని చెప్పబడింది. కాబట్టి దేవతలకు బ్రహ్మవిద్యయందు అధికారమున్నది.

సూ. 29 అత ఏవ చ నిత్యత్వమ్

అతఏవ, చ, నిత్యత్వం

నిరాకారుడైన పరబ్రహ్మ ఒకరూపం దాల్చినట్లైతే అదే అక్షరము. దాని నామమే ఓంకారము. ఇది నిత్యమైనది. ఓంకారంనుండే వేదాలు ఉద్భవించినాయి. అందుచేతనే వేదాలుకూడా నిత్యమైనవి. దేవతలు వేదంనుంచే ఉద్భవించారు. జగత్తంతా వేదంనుంచే ఆవిర్భవించింది.

ప్రళయకాలంలో ఈ వేదాలు మూడూ అకార ఉకార మకారాలలో కలిసిపోతాయి. అకార ఉకార మకారాలు ఓంకారంలో చేరిపోతాయి. వేదాలు నిత్యాలు అంటే వ్యావహారిక నిత్యాలని గుర్తుంచుకోవాలి. పారమార్థిక నిత్యాలు కాదు.

సూ. 30 సమాన నామరూపత్వాచ్చావృత్తావప్య

విరోధోదర్శనాత్స్మృతేశ్చ

సమాన నామరూపత్వాత్, చ, ఆవృత్తౌ, అపి
అవిరోధః, దర్శనాత్, స్మృతేః, చ

ఒక అక్షరానికి లేదా పదానికి దాని ఆకారమే అర్థం. ప్రళయకాలంలో సమస్తము నశించిపోతాయి కదా. మళ్ళీ అదే ఆకారాలతో పుడతారనే నమ్మకం లేదు కదా!

ప్రళయం సంభవించినప్పుడు, సమస్తమూ పరమాత్మలో లీనమైపోతాయి. సృష్టి జరిగినప్పుడు మళ్ళీ పుడతాయి. వేసవికాలంలో చెరువులు ఎండిపోతాయి. వాటిలోని చేపలు, కప్పలు అన్నీ చచ్చిపోతాయి. వర్షాలు పడి చెరువులు నిండగానే మళ్ళీ అన్ని పుట్టినట్లే ఈ సృష్టి, ప్రళయముకూడా సంభవిస్తాయి. సృష్టి జరిగినప్పుడు అన్ని జీవరాసులు పరమాత్మనుండే ఉద్భవిస్తాయి అని ఐతరేయోపనిషత్తు ముండకోపనిషత్తులలో చెప్పబడింది. ఈ సృష్టి అంతా పూర్వంలాగానే జరిగింది. అంటే గతంలో లాగానే జీవరాసులన్నీ ఆవిర్భవించాయి. ప్రళయకాలంలో దేవతలు కూడా పరమాత్మలో లీనమైపోయి మళ్ళీ ఆవిర్భవిస్తారు. అందుచేతనే దేవతలు శాశ్వతానందం కోసం ప్రయత్నిస్తారు. వారికి బ్రహ్మవిద్యాధికారమున్నది.

సూ. 31 మధ్వాదిష్వ సంభవాద నధికారం జైమినిః
మధుఆదిషు, అసంభవాత్, అనధికారం, జైమినిః

ఈ సూత్రంలో బ్రహ్మవిద్యయందు దేవతలకు అధికారం లేదు అంటున్నాడు జైమిని.

ఛాందోగ్యోపనిషత్తులో మధువిద్య చెప్పబడింది. అందులో "దూరంగా ఆకాశంలో మనకు కనిపించేవాడే సూర్యుడు. అతడు దేవతలను తృప్తిపరుస్తాడు. అతడే దేవతలకు మధువు అని చెప్పబడింది. సూర్యుడు దేవతలకు మధువు వంటివాడు. అంటే దేవత. అటువంటప్పుడు సూర్యుడికి బ్రహ్మవిద్యయందు అధికారం లేదు కదా? అంటున్నాడు జైమిని.

సూ. 32 జ్యోతిషి భావాచ్చ
జ్యోతిషి, భావాత్, చ

సూర్యచంద్రాది దేవతలు గ్రహాలు. వారికి ప్రత్యేక మండలాలున్నాయి. కాబట్టి వారికి బ్రహ్మవిద్య యందు అధికారం లేదు అంటాడు జైమిని.

సూర్య, చంద్ర, వాయుమండలాలు జ్యోతిర్మండలాలు అచేతనాలు. విగ్రహాలు కావు, కాబట్టి వాటికి బ్రహ్మవిద్యాధికారం లేదు.

సూ. 33 భావంతు బాదరాయణోஉస్తిహి
భావం, తు, బాదరాయణః, అస్తి, హి

వ్యాసుడు దేవతలకు బ్రహ్మవిద్యయందు అధికారము ఉన్నది అంటున్నారు.

దేవతలతో కూడి ఉన్న ఉపాసనయందు దేవతలకు అధికారం ఉండకపోవచ్చు. కాని బ్రహ్మవిద్యయందున్నది. సూర్య, చంద్ర, వాయువులు మండలాలని చెబుతున్నప్పటికీ వారికి కూడా రూపం చెప్పబడుతోంది. కాబట్టి వారికి కూడా విద్యయందు అధికారమున్నది. ఛాందోగ్యంలో ప్రజాపతిగాథ కూడా దీనికి నిదర్శనం.

కాబట్టి మొత్తంమీద దేవతలకు బ్రహ్మవిద్యయందు అధికారమున్నది అంటూ ఎనిమిదవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

9. అపశూద్రాధికరణము

"గురువుగారూ ! బ్రహ్మవిద్యను తెలుసుకోవటానికి శూద్రునికి అధికారమున్నదా? ఛాందోగ్యోపనిషత్తులో 'జానసృతి' గాథలో రాజును చూసి ఓ శూద్రా ! నీ గోవుల్ని నీవద్దనే ఉంచుకో అంటాడు. అదీగాక శూద్రుడికి ఉపనయనం లేదు. ఉపనయనం లేనివారికి వేదాధికారం లేదు. వేదాధికారం లేకపోతే వేదాంతానికి అధికారం ఉండదు కదా! కాబట్టి శూద్రుడికి బ్రహ్మవిద్యాధికారమున్నదా?" అన్నాడు నారాయణభట్టు. శిష్యుడి అనుమానం తీర్చటం ప్రారంభించాడు రత్నాకరుడు.

సూ. 34 శుగస్య తదనాదర శ్రవణాత్తదా ద్రవణాత్ సూచ్యతేహి
శుక్, అస్య, తత్, అనాదరశ్రవణాత్, తదా, ఆద్రవణాత్, సూచ్యతే, హి

ఛాందోగ్యంలో జానసృతి మహారాజును చూసి రైక్వుడు ఓ శూద్రా ! అని సంబోధించాడు. కాని నిజానికి జానసృతి మహారాజు క్షత్రియుడు. అయితే ఇక్కడ శూద్రుడు అంటే విచారముతో నిండినవాడు అని అర్థం. అంతేకాని నాల్గవజాతివాడు అని మాత్రం కాదు. శూద్రుడికి ఉపనయనముండదు కాబట్టి వేదాభ్యాసము వేదాంత విచారము ఉండవు.

సూ. 35 క్షత్రియత్వావ గతేశ్చోత్తరత్ర చైత్రరథేన లింగాత్
క్షత్రియత్వ అవగతేః, చ, ఉత్తరత్ర, చైత్రరథేన, లింగాత్

ఇక్కడ జానసృతి క్షత్రియుడు అని తేల్చి చెప్పారు. కాని శూద్రునికి మాత్రం బ్రహ్మవిద్యాధికారం లేదు.

సూ. 36 సంస్కార పరామర్శాత్తదభావాభిలాపాచ్చ

సంస్కార, పరామర్శాత్, తత్, అభావ, అభిలాపాత్, చ

బ్రహ్మవిద్య కావాలంటే ఉపనయనాది సంస్కారాలు కావాలి. అటువంటి సంస్కారాలు లేని శూద్రునికి బ్రహ్మవిద్యాధికారం లేదు.

సూ. 37 తదభావ నిర్ధారణేచ ప్రవృత్తేః

తత్, అభావ, నిర్ధారణే, చ, ప్రవృత్తేః

శూద్రత్వం లేదని నిశ్చయించినప్పుడు మాత్రమే బ్రహ్మోపదేశం చెయ్యాలి.

ఛాందోగ్యోపనిషత్తులో సత్యకామజాబాలి. గౌతముడి దగ్గరకు వెళ్ళి బ్రహ్మోపదేశం చెయ్యమని అడుగుతాడు. అప్పుడు గౌతముడు నీ గోత్రం ఏమిటి? అంటాడు. దానికి సత్యకాముడు తన వృత్తాంతాన్ని వివరిస్తాడు. అది విన్న గౌతముడు సత్యం చెప్పేవాడు బ్రాహ్మణుడు తప్ప ఇంకెవరూ ఉండరు. అని సత్యకాముడు బ్రాహ్మణుడే అని నిర్ధారణ చేసుకున్న తరువాతనే అతనికి బ్రహ్మోపదేశం చేశాడు కాబట్టి శూద్రుడికి బ్రహ్మవిద్యాధికారం లేదు.

సూ. 38 శ్రవణాధ్యయనార్థ ప్రతిషేధాత్ స్మృతేశ్చ

శ్రవణ, అధ్యయన, అర్థ ప్రతిషేధాత్, స్మృతేః చ

స్మృతులలో కూడా శూద్రునికి వేదశ్రవణము, అధ్యయనము, అనుష్ఠానము అనేవి లేవు. కాబట్టి శూద్రునికి బ్రహ్మవిద్యార్హత లేదు.

నారాయణభట్టారకా ! ఈ రోజుల్లో శూద్రులలోకూడా అనేకమంది సన్యాసులౌతున్నారు. బ్రహ్మవిద్యపై ఆసక్తి చూపుతున్నారు. అలాగే బ్రాహ్మణులైనప్పటికీ ఏ రకమైన కర్మలూ చేయనివారు అనేకులున్నారు. అదంతా మళ్ళీ పూర్వజన్మ సుకృతం. కాబట్టి నారాయణభట్టూ విద్యమీద ఆశక్తిగల వారందరూ కులమతాల ప్రసక్తిలేకుండా బ్రహ్మవిద్యకు అర్హులేనని గుర్తించాలి. అంటూ తొమ్మిదవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

10. కంపనాధికరణము

"గురువుగారూ ! ప్రాణము అనేది భయకారణము. దానిని తెలుసుకున్నవాడు అమృతత్వాన్ని పొందుతాడు. అని కఠోపనిషత్తులో చెప్పారుకదా! మరి ప్రాణము అంటే ఏది? ప్రాణవాయువా? లేక పరమాత్మా?" అంటూ అనుమానాన్ని వ్యక్తం చేశాడు కృష్ణశర్మ.

శిష్యుడి సందేహం తీర్చటం ప్రారంభించాడు రత్నాకరుడు

సూ. 39 కంపనాత్

సమస్త జగత్తు ప్రాణమునుండి పుట్టి చలిస్తున్నది. బృహదారణ్యకోపనిషత్తులో "దోష భూయిష్టమైన ఇతర అవయవాలకు ఆత్మత్వం సిద్ధించలేదు. ముఖ్యప్రాణం పాపరహితమైనది. అందుకే దానికి ఆత్మత్వం సిద్ధించింది. కాబట్టి మిగిలిన ఇంద్రియాలు ప్రాణాన్ని ఆత్మరూపంలో ఆశ్రయించినాయి. పవిత్రమైన ప్రాణానికి మృత్యువు ఎప్పుడూ దూరంగానే ఉంటుంది. మృత్యువు ప్రాణాలు తీసింది అనుకుంటాము. అది తప్పు, ప్రాణాలు పోయిన తరువాతే మృత్యువు ఆసన్నమవుతుంది" అని చెప్పబడింది. అంటే ఆ ప్రాణానికి ఆత్మత్వం ఉన్నది. అందుకే సమస్తాన్ని ప్రవర్తింపచేసే ప్రాణము బ్రహ్మమే. అంటూ పదవ అధికరణను పూర్తిచేశాడు రత్నాకరుడు.

11. జ్యోతిరధికరణము

"గురువర్యా ! ప్రాణం బ్రహ్మ అన్నారు. బాగున్నది. మరి జ్యోతి అంటే సూర్యుడా? పరమాత్మా?" అన్నాడు కృష్ణశర్మ రత్నాకరుడు చెప్పటం ప్రారంభించాడు.

సూ. 40 జ్యోతిర్దర్శనాత్

జ్యోతిః, దర్శనాత్

జ్యోతి అంటే తేజస్సు, కాంతి అని చెబుతున్నది. అంటే జ్యోతిశబ్దము పరమాత్మ వాచకమే.

జ్యోతిరూపా పరాకారా యశ్యాదేవోద్భవాశ్మివే

పరమేశ్వరుని నుంచి జ్యోతి అంటే అనేక వేలకోట్ల కిరణాలు ఉద్భవిస్తున్నాయి. అదే పరమాత్మ రూపం. ఆ కిరణాలలో 116 కిరణాలను సూర్యుడు గ్రహించాడు. కాబట్టి జ్యోతి అంటే సూర్యుడు కాదు. పరమాత్మే.

12. అర్థాంతరత్వాది వ్యపదేశాధికరణము

ఛాందోగ్యంలో ఆకాశము బ్రహ్మ అని చెప్పబడింది. మరి ఆకాశమంటే పరమాత్మా? భూతాకాశమా ? వివరించండి అన్నాడు నారాయణభట్టు చెప్పటం మొదలుపెట్టాడు రత్నాకరుడు.

సూ. 41 ఆకాశోఽ ర్థాంతరత్వాది వ్యపదేశాత్

ఆకాశః, అర్థాంతరత్వాది, వ్యపదేశాత్

ఇక్కడ ఆకాశము అంటే బ్రహ్మ. పంచభూతాలలో ముందు పుట్టింది ఆకాశము. ఆకాశము బ్రహ్మనుంచే పుట్టింది కాబట్టి ఆకాశముకూడా బ్రహ్మమే అందుచేతనే దహరాకాశము కూడా బ్రహ్మమే అని గతంలోనే చెప్పబడింది. అంటూ పన్నెండవ అధికరణను పూర్తి చేశాడు రత్నాకరుడు.

13. సుషుప్త్యుత్క్రాంత్యధికరణము

సుషుప్తిలో ఉన్న పురుషుడు బ్రహ్మమా కాదా? అనే విషయాన్ని వివరిస్తున్నారు.

సూ. 42 సుషుప్త్యుత్క్రాంత్యోర్భేదేన

సుషుప్త్యుత్క్రాంత్యోః, భేదేన

సుషుప్తిలోని పురుషుడు పరమాత్మయే కాని వేరు కాదు.

సూ. 43 పత్యాది శబ్దేభ్యః

పతి, ఆది, శబ్దేభ్యః

దీనిలో పతి మొదలైన శబ్దాలు అసంసారియైన వాడి స్వరూపాన్ని ప్రతిపాదిస్తున్నాయి.

ఈ అధికరణలో సుషుప్తిలో ఉండే పురుషుడు ఆత్మా? కాదా? అనే విషయం వివరించబడింది. బృహదారణ్యకోపనిషత్తులో జనకుడు యాజ్ఞవల్క్యుడిని ఆత్మను గురించి వివరించమని అడిగాడు. యాజ్ఞవల్క్యుడు చెబుతున్నాడు.

ప్రాణాల్లో, బుద్ధి వృత్తులలో ఉండే విజ్ఞానజ్యోతి స్వరూపమే ఆత్మ. ఇంద్రియాల మధ్య స్వయంప్రకాశమై హృదయంలో ఉండే పురుషుడే ఆత్మ. అదే ఈ లోకంలోనూ, పరలోకంలోనూ సంచరిస్తుంది. కదులుతున్నట్లు కనిపిస్తుంది. స్వప్నంలాగా ఉంటూ దేహేంద్రియాలను, మృత్యువునుకూడా దాటిపోతుంది.

ఆత్మపురుషుడికి ఈ లోకము, పరలోకము అని రెండు స్థానాలున్నాయి. ఈ రెండింటి మధ్యనా ఉన్న స్వప్నజగత్తు మూడవస్థానము. ఆ లోకము అంటే సుషుప్తావస్థ. స్వప్నంలో ఉంటూ మిగిలిన రెండు స్థానాలనూ చూస్తాడు ఆత్మపురుషుడు. నిద్రించేటప్పుడు ఆత్మపురుషుడు సమస్త లోకాలలోని అనుభవాలను తీసుకుని స్థూలశరీరాన్ని వదలి, స్వప్నశరీరంలో ప్రవేశించి ఆత్మజ్యోతి రూపమైన ప్రకాశంతో స్వప్నం చూస్తాడు. ఈ స్థితిలో అతడు స్వప్నద్రష్ట అయిన పురుషుడు తైజసుడు.

సుషుప్తిలో అతడు అన్ని దుఃఖాలను అధిగమిస్తాడు. అదే గాఢనిద్ర. ఈ స్థితిలో తల్లి, తండ్రి అనే సంబంధాలు ఉండవు. అయినవారు కానివారవుతారు. ఆ స్థితిలో పురుషుడికి పాపపుణ్యాలతో సంబంధం ఉండదు. ఏ భేద భావము ఉండదు. అప్పుడు హృదయంలో ఉండే సమస్త శోకాలకు అతీతుడౌతాడు.

ఆ స్థితిలో వాసన చూడలేడు. అంటే వాసనచూసే శక్తి నశించిందని కాదు. అతడు వాసన చూస్తూనే వాసన చూడలేడు.

సుషుప్తిలో ఆత్మపురుషుడు ఎవరితోనూ మాట్లాడలేడు. వినలేడు. మననం చెయ్యడు. అద్వితీయస్థితిలో ఉంటాడు. అంటూ సుషుప్తిలో ఉండే పురుషుడు బ్రహ్మమే అని చెప్పారు.

ఛాందోగ్యోపనిషత్తులో ఉద్దాలకుడు తన కుమారుడైన శ్వేతకేతువుకు సుషుప్తిని గురించి వివరిస్తూ మానవుడు గాఢనిద్రలో ఉన్నప్పుడు అతడు సుషుప్తిలో ఉన్నాడంటారు. ఆ సమయంలో జీవుడు పరమసత్తను పొందుతాడు. అంటే తన నిజస్వరూపాన్ని పొందుతాడు. తన ఆత్మను తాను పొందుతాడు. అంటూ సుషుప్తిలో ఉండే పురుషుడు బ్రహ్మమే అని వివరించారు.

కాబట్టి సుషుప్తియందలి పురుషుడు బ్రహ్మమే అంటూ పదమూడవ అధికరణను వివరిస్తూ తృతీయపాదాన్ని పూర్తిచేశాడు రత్నాకరుడు.

చతుర్థపాదము

వేదాంతవాక్యాలన్నీ జగత్కారణం బ్రహ్మ అని చెబుతున్నాయి. ప్రకృతి జగత్కారణం కాదు అని చెప్పారు. కాని ఇంకా చాలాచోట్ల ప్రకృతే జగత్కారణము అని చెప్పే వాక్యాలున్నాయి. కపిలుడు మొదలైనవారు ప్రకృతినే జగత్కారణము అంటున్నారు. ఇది నిజం కాదు అని నిరూపిస్తే తప్ప 'పరమాత్మే జగత్కారణము' అనే మాటకు బలం చేకూరదు. అందుకే ఈ పాదాన్ని చెబుతున్నారు. ఈ పాదంలో ఎనిమిది అధికరణలు, 28 సూత్రాలు ఉన్నాయి.

వ.నెం.	అధికరణము	విషయము	సూత్రాలు
1.	అనుమానికాధికరణము	అవ్యక్తమనే పదం శరీరాన్ని చెబుతోంది	7
2.	చమసాధికరణము	అజము అంటే ప్రకృతి కాదు	3
3.	సంఖోపసంగ్రహాధికరణము	పంచ పంచజనములు అంటే	
		25 తత్త్వాలు కాదు	3
4.	కారణత్వాధికరణము	జగత్తును సృష్టించటానికి కారణము పరమాత్మ	2
5.	బాలాక్యధికరణము	వేదితవ్యుడైన పురుషుడు బ్రహ్మమే	3
6.	వాక్యాన్వయాధికరణము	ద్రష్టవ్యము, శ్రోతవ్యము అయినది పరమాత్మే	4
7.	ప్రకృత్యధికరణము	జగత్తుకు బ్రహ్మమే నిమిత్త ఉపాదాన కారణము	5
8.	సర్వవ్యాఖ్యానాధికరణము	ప్రకృతిని నిరాకరించటంతో అన్నింటినీ	
		నిరాకరించినట్లే	1
		మొత్తం సూత్రాలు	28

ఇప్పుడు చతుర్థ పాదంలోని మొదటి అధికరణను చూద్దాం.

1. అనుమానికాధికరణము

సూ. 1 అనుమానికమప్యేకేషామితి చేన్న శరీర రూపక
విన్యస్త గృహీతేర్దర్శయతి చ
అనుమానికం, అపి, ఏకేషాం, ఇతి, చేత్, న, శరీర
రూపక విన్యస్తగృహీతేః, దర్శయతి, చ

సాంఖ్యులు మొదలైనవారు ప్రధానము (ప్రకృతి) వేద ప్రతిపాదితం కాదు అంటున్నారు. ఇక్కడ ప్రకృతి అంటే శరీరమే.

కఠోపనిషత్తులో "ఈ శరీరం రథం వంటిది. కర్మఫలాన్ని అనుభవించే జీవాత్మ దాని యజమాని. బుద్ధే సారథి. మనస్సే కళ్ళెం. ఇంద్రియాలే గుర్రాలు. విషయమే మార్గం. కాబట్టి ఇంద్రియాలను నడిపే సారథి నేర్పరి కాకపోతే గుర్రాలు అదుపులో ఉండవు. అందుకనే

ఇంద్రియాలు	–	మనస్సు అధీనం లోనూ
మనస్సు	–	బుద్ధి అధీనం లోనూ
బుద్ధి	–	యజమాని అధీనం లోనూ ఉండాలి

విజ్ఞానహీనుడు మనసును అదుపులో ఉంచుకోలేడు. తాను చేరవలసిన గమ్యం చేరలేడు. మోక్షాన్ని పొందలేడు. వివేకవంతమైన బుద్ధిని గలవాడు మనసును అదుపులో ఉంచగలుగుతాడు. పరమపదాన్ని చేరగలుగుతాడు.

ఇంద్రియాలకన్న	–	వాటి విషయాలు శ్రేష్ఠమైనవి
విషయాలకన్న	–	మనస్సు శ్రేష్ఠమైనది
మనస్సుకన్న	–	బుద్ధి శ్రేష్ఠమైనది
బుద్ధికన్న	–	మహతత్త్వం శ్రేష్ఠమైనది
మహత్తత్త్వంకన్న	–	అవ్యాకృత ప్రకృతి శ్రేష్ఠమైనది
ప్రకృతికన్న	–	సూక్ష్మరూపి అయిన పురుషుడు గొప్పవాడు

ఇంతకుమించినదేదీ లేదు. ఇదే పరాకాష్ట. అతణ్ణి చేరినవారు తిరిగిరారు. ఇక్కడ అవ్యాకృతప్రకృతి అంటే – శరీరం అని అర్థం.

సూ. 2 సూక్ష్మంతు తదర్హత్వాత్
సూక్ష్మం, తు, తదర్హత్వాత్

వెనుకటి సూత్రంలో అవ్యక్తము అంటే శరీరము అన్నారు కదా. మరి శరీరం స్థూలమైనది. అటువంటప్పుడు ఈ శరీరం అవ్యక్తం ఎలా అవుతుంది?

వ్యక్తం కాని దానిని అంటే స్పష్టంగా కనిపించని దానిని అవ్యక్తము అంటారు. స్థూలశరీరం స్పష్టంగా కనిపిస్తుంది. కాబట్టి అది అవ్యక్తం కాదు. కాబట్టి స్థూలశరీరానికి కారణభూతమైన కారణ శరీరము అవ్యక్తం అవుతుంది.

సూ. 3 తదధీనత్వాదర్థవత్

తద్, అధీనత్వాత్, అర్థవత్

అవ్యక్తము అంటే – కారణ శరీరమైనప్పుడు, ప్రకృతి అంటే శరీరమే.

ఈ జగత్తు అంతా చేతనుడైనటువంటి ఈశ్వరునివల్లనే సృష్టించబడినందువల్ల అది సార్థకము. అయితే అవ్యక్తమనేది ఈశ్వరాధీనమైనందువల్ల అది స్వతంత్రం కాదు. ఈశ్వరునిచేత అధిష్టితమైన మాయ జగత్కారణం. ఈ మాయనే అవిద్య, అవ్యక్తము, అక్షరము, ఆకాశము అంటారు. అన్నాడు రత్నాకరుడు.

"జగత్తుకు కారణం ఈశ్వరుడు అంటూ మధ్యలో మాయ, అవిద్య అంటారేమిటి?" అన్నాడు కృష్ణశర్మ.

సృష్టికి పూర్వం అంతా పరమేశ్వరుని అధీనంలో ఉన్నది. శక్తిరహితుడైన పరమాత్మకు ఏ ప్రవృత్తీ ఉండదు. ముక్తి పొందిన పురుషులు మళ్ళీ పుట్టరు. అవిద్య, అజ్ఞానము అనేది పరమేశ్వరుని అధీనంలో ఉంటుంది. ఆత్మసాక్షాత్కారం పొందని మానవులు ఈ అవిద్యను ఆశ్రయిస్తారు. ఇదే మాయాశక్తి. అవ్యక్తము. దీనినే ఆకాశము అనికూడా అంటారు. పరమాత్మ ఈ ప్రకృతికన్న వేరైనవాడు. మాయే ప్రకృతి. మాయకు అధిపతి పరమాత్మ. అవ్యక్తం నుంచే మహత్తత్వము పుట్టింది. మహత్తు అంటే హిరణ్య గర్భరూపమైన బుద్ధి. కాబట్టి మహతత్త్వముకన్న అవ్యక్తము గొప్పది.

అవ్యక్తమే అవిద్య అదే మాయ. శరీరము అవ్యక్త కారకము శరీరంలాగానే ఇంద్రియాలు కూడా అవ్యక్తానికి వికార స్వరూపాలు.

సూ. 4 జ్ఞేయత్వావచనాచ్చ

జ్ఞేయత్వ, అవచనాత్, చ

అవ్యక్తము అంటే జ్ఞేయము అని చెప్పలేదు. కాబట్టి అవ్యక్తము అంటే ప్రధానం కాదు.

సాంఖ్యులు పురుషత్వంలాగానే ప్రధానత్వం కూడా జ్ఞేయము (తెలుసుకోతగ్గది) అంటారు. కాని శ్రుతులలో ఈ మాట చెప్పలేదు కాబట్టి అవ్యక్తము అంటే జ్ఞేయము కాదు.

సూ. 5 వదతీతిచేన్న ప్రాజ్ఞోహి ప్రకరణాత్

వదతి, ఇతి, చేత్, న, ప్రాజ్ఞః, హి, ప్రకరణాత్

ప్రధానాన్ని జ్ఞేయంగా చెప్పలేదు. ఇక్కడ పరబ్రహ్మను గూర్చే చెబుతారు.

శబ్ద స్పర్శ రూప రస గంధాలు లేనిది, అనాది, అవ్యయము, అనంతము అయినది మహత్తుకన్న పరమైనది, నిశ్చలమైనది అయిన దానిని తెలుసుకున్నవాడు మృత్యువాత పడడు అని ఉపనిషత్తులలో చెప్పబడ్డది. అయితే ఇక్కడ తెలుసుకోతగ్గది ప్రధానాన్ని గురించి చెప్పలేదు. పురుషునికన్న పరమైనవాడు లేడు. అతణ్ణి గురించి తెలుసుకోవాలి. ఆత్మజ్ఞానంవల్ల మాత్రమే మృత్యువు నుంచి తప్పుకోవటం సాధ్యమవుతుంది. కాబట్టి తెలుసుకోదగినవాడు బ్రహ్మమే.

సూ. 6 త్రయాణామేవ చైవముపన్యాసః ప్రశ్నశ్చ

త్రయాణామ్, ఏవ, చ, ఏవమ్, ఉపన్యాసః, ప్రశ్నః, చ

ఇంతవరకు ప్రశ్నలు అన్నీ అగ్ని, జీవపరమాత్మల గురించే వచ్చాయి. అంతేకాని ప్రధానం గురించి లేవు. కఠోపనిషత్తులో నచికేతుడు యముణ్ణి కొన్ని ప్రశ్నలు అడిగాడు. అవి

1. అగ్నిని ఆరాధించే అగ్నిచయనము గురించి చెప్పవలసినది.

2. మరణం మీద నాకు అనేక అనుమానాలున్నాయి. మరణించిన తరువాత ఇంద్రియాలు, అవయవాలు, మనస్సు మొదలైన వాటితో జీవాత్మకు సంబంధం ఉండదని కొందరు, ఉంటుందని కొందరు అంటారు. అందులో నిజం ఏది ? దానికి యముడు.

1. అగ్ని చయనము గురించి వివరంగా చెప్పాడు.

2. చనిపోయిన తరువాత జీవుడు ఏమవుతాడో ఆ రహస్యం నీకు చెబుతాను. ఈ విషయం తెలుసుకుంటే జన్మరాహిత్యం జరుగుతుంది. ఈ విషయం తెలియని అజ్ఞానులకు జన్మరాహిత్యం ఉండదు. వారికి పునర్జన్మ ఉంటుంది. చేసిన కర్మను అనుసరించి వారు మళ్ళీ జన్మనెత్తుతారు విద్వాంసుడైన వాడికి జనన మరణాలుండవు. ఇక్కడ ప్రధానాన్ని గురించి చెప్పలేదు. ఆత్మను గురించే చెప్పారు.

సూ. 7 మహద్వచ్చ

మహద్వత్, చ

మహత్ అనే శబ్దం సాంఖ్యులు చెప్పేది కాదు. అలాగే అవ్యక్తం కూడా సాంఖ్యులు చెప్పే ప్రధానం కాదు.

అవ్యక్తమనే పదానికి అర్థం 'శరీరము' అంతేకాని 'ఆత్మకాదు' అంటూ మొదటి అధికరణను పూర్తి చేశాడు రత్నాకరుడు.

2. చమసాధికరణము

సూ. 8 చమసవదవిశేషాత్

చమసవత్, అవిశేషాత్

చమసము అంటే నాలుగు పలకలుగా (చతురస్రంగా) ఉండే యజ్ఞపాత్ర. ఈ పాత్రలాగానే అజా శబ్దానికి కూడా ప్రత్యేకమైన నిర్ణయం ఏమీ లేదు.

అజము అంటే – జీవుడు, మేక అని అర్థం

చమసము అంటే క్రిందవైపు గోయిలాగా ఉండి, పైన ఉబ్బెత్తుగా ఉండే పాత్ర. దీన్ని నిర్ణయించటానికి తగిన విశేషం ఏదీ లేదు. ఎందుకంటే యజ్ఞంలో ఉపయోగించే పాత్రలన్నీ మనం వాడుకునే గరిటలు లాగా ఎత్తుపల్లాలుగానే ఉంటాయి. అలాగే 'అజ' అనే శబ్దం ప్రత్యేకంగా ప్రధానాన్ని చూపుతుందని చెప్పటానికి కారణము ఏదీలేదు.

బృహదారణ్యకంలో "ఒక గిన్నె ఉంది. దాని మూతి క్రిందివైపు తెరిచి ఉంది. పై భాగం ఉబ్బెత్తుగా ఉంది. దానిప్రక్కనే ఏడుగురు ఋషులున్నారు. వేదాలద్వారా వాదము చేసే వాక్కున్నది. ఆ గిన్నే శిరస్సు. క్రింది భాగంలో తెరచి ఉండేదే నోరు. పైభాగాన ఉబ్బెత్తుగా ఉండేదే పుర్రె. సోమపాత్రలో సోమరసం ఉన్నట్లుగా శిరస్సులో అనేక రకాల విజ్ఞానమున్నది" అని చెప్పబడింది.

ఇక్కడ చమసము అంటే శిరస్సు అని అర్థము.

సూ. 9 జ్యోతిరుపక్రమా తు తథాహ్యధీయత ఏకే

జ్యోతిరుపక్రమా, తు, తథా, హి, అధీయతే, ఏకే

తేజస్సు దేనిలో ఉంటుందో, దానిని అజ అని గ్రహించాలి.

ఛాందోగ్యంలో తేజస్సు ఉదకము అన్నము అనేవి సమస్త జగత్తుకు కారణము అని, కార్యమైన వస్తువు కారణంకన్న భిన్నం కాదు.

తేజస్సు అన్నములందు అజ యొక్క ఆకృతి ఏదీ లేదు. అందుచేత జన్మరహితమైన అజ శబ్దము వాటియందు అన్వయించదు.

సూ. 10 కల్పనోపదేశాచ్చ మధ్వాది వదవిరోధః

కల్పన, ఉపదేశాత్, చ, మధ్వాదివత్, అవిరోధః

ఆదిత్యాదులందు మధువును చెప్పినట్లుగానే అజా శబ్దము తేజోలక్షణము.

అంటే తేజస్సు, జలము, అన్నము, వీటి లక్షణాలు గల చరాచర యోనులందు అజ శబ్దము చెప్పబడ్డది.

చాందోగ్యోపనిషత్తులో ఆకాశంలో కనిపించే సూర్యుడు దేవతలను తృప్తిపరుస్తాడు. అతడు దేవతలకు మధువు వంటివాడు ఈ విధంగానే అజ శబ్దాన్ని కూడా చెప్పటం జరిగింది.

అజము అంటే మేక. మేక మూడురంగుల్లో ఉంటుంది. ఎరుపు, తెలుపు, నలుపు, ఇతర రంగులు ఉండవు. ఈ మేక తనవంటి అనేక మేకలను ఉత్పత్తి చేస్తోంది. అలాంటి మేకను మేకపోతు సేవిస్తోంది. అంటే ప్రకృతిని అజ్ఞాని అయిన జీవుడు సేవిస్తున్నాడు. వేరొక మేకపోతు తాను అనుభవించిన మేకను వదలివేస్తోంది. అంటే జ్ఞాని తాను అనుభవించిన ప్రకృతిని వదలివేస్తున్నాడు. త్యాగ భోగాలలో ప్రకృతియందు సమత్వమే ఉంటుంది అని చెబుతున్నారు.

సూర్యోపాసన కోసం మధువును కల్పించి చెప్పారు. అంతేకాని నిజంగా సూర్యుడు మధువు కాదు. అలాగే అవాంతర ప్రకృతియందు మేకను కల్పించి చెప్పారయ్యా. అంతేకాని అజము అంటే ప్రకృతి కాదు అంటూ రెండవ అధికరణను పూర్తిచేశాడు రత్నాకరుడు.

3. సంఖ్యోపసంగ్రహాధికరణము

"గురువుగారూ ! 'పంచ పంచ జనులు' అంటే ఇరవై ఐదు తత్వాలేనా" అంటూ అడిగాడు కృష్ణశర్మ. నాయనా పంచ పంచ అంటే ఐదు ఐదులు ఇరవైఐదు తత్వాలు. అని చెపుతున్నారు సాంఖ్యులు.

ఆ తత్వాలు పంచభూతాలు – 5, తన్మాత్రలు – 5, జ్ఞానేంద్రియాలు – 5, కర్మేంద్రియాలు – 5, మనస్సు – 1, మహత్తత్వము – 1, అహంకారము –1, ప్రకృతి–1, పురుషుడు – 1 వెరసి ఇరవై ఐదు.

సూ. 11 న సంఖ్యోప సంగ్రహాదపి నానాభావాదతిరేకాచ్చ

న, సంఖ్య, ఉపసంగ్రహాత్, అపి, నానాభావాత్, అతిరేకాత్, చ

సాంఖ్యులు చెప్పిన తత్వాలన్నీ పరస్పర విలక్షణాలు కలిగి ఉంటాయి. పంచ అంటే ఐదు అని అర్థం చెప్పారు. ఇవి ఐదు సమూహాలుగా ఉండాలి. ఒక సమూహంలోని ఐదింటికీ ఒకే లక్షణాలుండాలి. కాని ఇవి అలా లేవు. వీటి ధర్మాలు వేరుగా ఉన్నాయి. కాబట్టి పంచ పంచ జనులు అంటే 25 తత్వాలు కాదు.

సూ. 12 ప్రాణాదయో వాక్యశేషాత్

ప్రాణాదయః, వాక్యశేషాత్

పంచజన అనే శబ్దానికి ప్రాణాదులను గ్రహించాల్సి ఉంటుంది. ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానములే, పంచజనములు, అంతేకాని 25 తత్త్వాలు కాదు.

సూ. 13 జ్యోతిషైకేషామ సత్యన్నే

జ్యోతిషా, ఏకేషామ్, అసతి, అన్నే

బృహదారణ్యకోపనిషత్తులో జనకమహారాజుకు బ్రహ్మ జ్ఞానాన్ని వివరిస్తూ, పరబ్రహ్మ ప్రాణానికి ప్రాణం, చక్షువుకు చక్షువు, శ్రోత్రానికి శ్రోత్రం, అన్నానికి అన్నం, మనస్సుకు మనస్సు అంటాడు. వీటిలో అన్నము అనేమాటకు బదులుగా జ్యోతిని తీసుకోవాలి. ఇప్పుడు పంచజనులు అంటే ప్రాణము, చక్షువు, శ్రోత్రము, జ్యోతిషు, మనస్సు. అంతేకాని 25 తత్త్వాలు మాత్రం కాదు. అంటూ మూడవ అధికరణను పూర్తి చేశాడు రత్నాకరుడు.

4. కారణత్వాధికరణము

"గురువుగారూ! ఇంతవరకు చెప్పిన ఆక్షేపణలన్నీ సమన్వయం చేశారు. కాని ఇంకా కొన్ని అనుమానాలున్నాయి. ఉపనిషత్తులలో చెప్పినదాంట్లో సమన్వయం కుదరటం లేదు. తైత్తిరేయోపనిషత్తులో ఆత్మనుంచి ఆకాశం పుట్టింది.

ఛాందోగ్యంలో అతడు తేజస్సును సృష్టించాడు

ప్రశ్నోపనిషత్తులో అతడు ప్రాణాన్ని సృష్టించాడు

ఐతరేయంలో అతడీ లోకాలు సృష్టించాడు అన్నారు

ఛాందోగ్యంలో మొదట అద్వితీయమైన సత్తే ఉన్నది

ఛాందోగ్యంలో మొదట ఇది అసత్తే. తరువాత సత్తయింది అన్నారు.

ఈ వైవిధ్యంవల్ల ఈ జగత్తుకు కారణం బ్రహ్మే అని సమన్వయం కుదరటం లేదు కదా! అన్నాడు

ఆ మాటలు విన్న రత్నాకరుడు శిష్యుడి సందేహం తీర్చటం ప్రారంభించాడు.

సూ. 14 కారణత్వేన చాకాదిషు యథావ్యపదిష్టోక్తేః

కారణత్వేన, చ, ఆకాశాదిషు, యథా వ్యపదిష్ట ఉక్తేః

చరాచర జగత్తుకు కారణం బ్రహ్మ. ఇందులో సందేహం లేదు. ఆకాశాది పంచభూతాలకు కూడా పరబ్రహ్మే కారణము అని ఉపనిషత్తులలో చెప్పబడింది.

ఒకవేళ ఎక్కడైన క్రమంలో తేడా ఉండచ్చు. అంటే పంచభూతాలలో ముందుగా ఆకాశము, వాయువు అగ్ని, జలము, పృథివి ఉద్భవించినాయి. అయితే కొన్నిచోట్ల ముందుగా అగ్ని ఉద్భవించింది అన్నారు. ఏమైనా ఈ పంచభూతాల కారణం బ్రహ్మమే. ఇందులో సందేహం లేదు. అలాగే పరమాత్మ సర్వజ్ఞుడు, సర్వేశ్వరుడు, సర్వాత్మ, అద్వితీయుడు అని ఉపనిషత్తులు చెబుతున్నాయి. కాబట్టి జగత్తుకు కారణం బ్రహ్మ తప్ప వేరొకటి కాదు.

సూ. 15 సమాకర్షాత్

ఈ సృష్టి అంతా సత్తునుంచి జరిగిందని ఒకచోట, అసత్తునుంచి జరిగిందని ఇంకొకచోట చెప్పబడింది అంటారు. ఇది సమాకర్షణ దీనివల్ల ఇబ్బంది ఏమీ లేదు.

సృష్టికి పూర్వం ఈ జగత్తు అంతా అసత్తై ఉండేది. అంటే అసత్తుతో నిండి ఉండేది. అంతేకాని సృష్టికి కారణం అసత్తుకాదు. బ్రహ్మను అసత్తు అనుకున్నవాడు తానుకూడా అసత్తే అవుతాడు. ఎవడు బ్రహ్మను సద్వస్తువు అనుకుంటాడో, తానుకూడా సద్వస్తువు అవుతాడు.

ఇక అది సత్యము, నిత్యము అన్నారు. ఈ ప్రకృతి సత్యమూ కాదు నిత్యమూ కాదు. సత్యము, నిత్యము అయినది బ్రహ్మ ఒకటే. దానికి జరామరణములు, ఆద్యంతములు లేవు. అదే శాశ్వతమైనది. కాబట్టి ఈ జగస్సృష్టికి బ్రహ్మ తప్ప వేరేదీ కాదు అంటూ నాల్గవ అధికరణను పూర్తిచేశాడు రత్నాకరుడు.

5. బాలాక్యధికరణము

"గురువుగారూ ! బృహదారణ్యకోపనిషత్తులో బాలాకి ఉదంతం చెప్పబడింది. గార్గ్య గోత్రంలో పుట్టిన బాలాకి బ్రహ్మోపదేశం చేస్తానని కాశీరాజు దగ్గరకు వెళ్ళి సూర్యుడు, చంద్రుడు, విద్యుత్తు, ఆకాశము, వాయువు, జలము, దిక్కులు మొదలైన వాటిలో ఉండే పురుషుడే బ్రహ్మము అంటాడు. అవి ఏవీ బ్రహ్మకాదు అంటాడు రాజైన అజాతశత్రువు. ఆ మాటలు విన్న బాలాకి రాజునే బ్రహ్మోపదేశం చెయ్యమని అడుగుతాడు.

మానవుడు నిద్రిస్తున్నప్పుడు, ఇంద్రియాలన్నీ అతని ప్రాణంలో కలిసిపోతాయి. ఆత్మస్వప్నావస్థలో ఉన్నప్పుడు దానికర్మ ఫలాలు ప్రారంభమవుతాయి. స్వప్నస్థితిలో ఆత్మ మహారాజులా ఉంటుంది. గొప్ప బ్రాహ్మణునిలా ఉంటుంది. దేవతలవలె ఉచ్ఛస్థితి,

అసురులవలె నీచస్థితి పొందుతుంది. రాజుగారు తన దేశంలో సంచరించినట్లే ఆత్మ ఈ శరీరంలో స్వేచ్ఛగా విహరిస్తుంది.” అని చెప్పబడింది. దీనిని బట్టి చూస్తే మనం తెలుసుకోవలసినది ప్రాణమా? లేక ఆత్మా?'' కాస్త వివరించండి. అన్నాడు “నారాయణభట్టు” ఆ మాటలు విన్న రత్నాకరుడు సందేహనివృత్తికి ఉపక్రమించాడు.

సూ. 16 జగద్వాచిత్వాత్

ఇక్కడ కర్మ ప్రపంచ వాచకం. కాబట్టి కర్త పరమాత్మే. కర్మ అనే పదం జగత్తును సూచిస్తుంది. పైన చెప్పిన కథలో బాలాకి సూర్యుడు, చంద్రుడు మొదలైన వారందరినీ చెప్పాడు బాలాకి వాటిలో ఎవరూ బ్రహ్మకాదు. ఈ మాటే చెప్పాడు కాశీరాజు.

తరువాత కాశీరాజే బాలాకికి బ్రహ్మోపదేశం చేశాడు”

ఇక్కడ బాలాకి చెప్పినవన్నీ కాదన్నాడు రాజు. అంటే వీటన్నింటికన్న అతీతమైనది ఏదో ఉన్నది. అదే బ్రహ్మ. ఈ రకంగా సమస్తవేదాలలోనూ పరమేశ్వరుడు మాత్రమే తెలుసుకోదగినవాడు అని చెప్పారు.

సూ. 17 జీవముఖ్య ప్రాణలింగాన్నేతిచేత్తద్వ్యాఖ్యాతమ్
జీవ, ముఖ్యప్రాణ, లింగాత్, న ఇతి, చేత్, తత్, వ్యాఖ్యాతమ్

తెలుసుకోవలసినది పరమాత్మను గురించి ప్రాణము, బ్రహ్మ. వీరిలో తెలుసుకోదగిన వాడు బ్రహ్మ మాత్రమే. ఈ విధంగా బ్రహ్మనుగురించి తెలుసుకున్నవాడు సమస్త పాపాలను నాశనం చేసుకుని అమరుడౌతాడు.

సూ. 18 అన్యార్థంతు జైమినిః ప్రశ్న వ్యాఖ్యానాభ్యామపిచైవమేకే
అన్యార్థం, తు, జైమినిః, ప్రశ్నవ్యాఖ్యానాభ్యాం, అపి, చ, ఏవం ఏకే

ఇక్కడ బ్రహ్మ ప్రతిపత్తి కోసమే జీవ పరామర్శ జరిగింది.

బృహదారణ్యకంలో బాలాకిని నిద్రపోతున్న బ్రాహ్మణుని దగ్గరకు తీసుకువెళ్ళి లేపమన్నాడు రాజు. అతడు లేవలేదు. అప్పుడు రాజు చెప్పాడు.

నిద్రిస్తూ ఉండగా ఇంద్రియాలయొక్క విషయాన్ని గ్రహించి జీవి హృదయాకాశంలో నిద్రిస్తాడు. అదే పరమాత్మ ఉండేచోట నిద్రావస్థలో ఉన్నప్పుడు పురుషుడు శరీరము ఇంద్రియాలను తనలో లీనం చేసుకుంటాడు. ప్రాణాలన్నింటినీ తనలో ఆకర్షించుకుంటాడు. కాబట్టి ఇక్కడ ఆకర్షింపబడే పురుషుడే బ్రహ్మ అంటూ 5వ అధికరణను పూర్తిచేశాడు రత్నాకరుడు.

6. వాక్యాన్వయాధికరణము

“గురువుగారూ! శ్రుతులలో చెప్పిన ‘ఆత్మ’ శబ్దము జీవి ని సూచిస్తుందా? పరమాత్మను సూచిస్తుందా?” వివరించండి అన్నాడు కృష్ణశర్మ. వివరించటం ప్రారంభించాడు రత్నాకరుడు.

సూ. 19 వాక్యాన్వయాత్

వాక్యాలకు అన్నింటికి పరబ్రహ్మయందే అన్వయం కలుగుతున్నది. శ్రవణ, మననాదులకు యోగ్యమైనది బ్రహ్మమే.

బృహదారణ్యకోపనిషత్తులో యాజ్ఞవల్క్యుడు సన్యాసం స్వీకరించాలనే కోరికతో తన ఇద్దరు భార్యలకు తన ఆస్తిపాస్తులు పంచుతానంటాడు. రెండవ భార్యయైన మైత్రేయి ఈ సిరిసంపదలు నాకు వద్దు. శాశ్వతమైన ఆనందాన్ని ఇచ్చే బ్రహ్మవిద్యను నాకు ఉపదేశించండి అంటుంది. అప్పుడు యాజ్ఞవల్క్యుడు చెబుతాడు

మైత్రేయీ! ఆత్మ ప్రయోజనం కోసమే ఒకరికొకరు ప్రియులౌతారు. భార్య భర్తను ప్రేమిస్తోంది అంటే ఈ ప్రేమ ఆమె భర్త కోసం కాదు. భార్యప్రయోజనం కోసమే. అంటూ ఆత్మ ఒక్కటే చూడదగినది. వినదగినది. మననం చేయదగినది. ధ్యానం చేయదగినది దర్శన, శ్రవణ, మనన విజ్ఞానంతో అంతా తెలుస్తుంది. అంటూ చివరలో విజ్ఞానమయుడైన ఆత్మయే సమస్తభూతాలకు అధిపతి. సమస్త భూతాలకు రాజు. సమస్త దేవతలు, లోకాలు ప్రాణులు అన్నీ పరమాత్మలోనే ఇమిడి ఉన్నాయి. ఆ ఆత్మయే పరబ్రహ్మ” అని చెబుతాడు. ఆత్మ అనే పదాన్ని ముందు చెప్పటంచేత ఇక్కడ చెప్పింది జీవుణ్ణి గురించి కాదు. జీవవిజ్ఞానం వల్ల అమృతత్వం లభించదు. ఆత్మవిజ్ఞానం చేతనే సమస్తమూ తెలుస్తుంది. కాబట్టి ద్రష్టవ్యుడు పరమాత్మేకాని వేరు కాదు.

సూ. 20 ప్రతిజ్ఞాసిద్ధేర్లింగమాశ్మరథ్యః
ప్రతిజ్ఞాసిద్ధేః, లింగమ్, ఆశ్మరథ్యః

ఏక విజ్ఞానంవల్ల సర్వమూ తెలుస్తుంది. ఇలాంటివి జీవునితో ప్రారంభించటమనేది సంప్రదాయము అని ‘అశ్చరధ్వాచార్యుడు’ చెబుతున్నాడు. ‘ఆత్మవిజ్ఞానం తెలిస్తే ఈ దృశ్యజాతమంతా తెలుస్తుంది’ ఆత్మయే సమస్తము. అని ఉపనిషత్తులో చెప్పబడింది. ఇక్కడ ఆత్మ అంటే జీవాత్మ కాదు. పరమాత్మ అని అర్థం.

సూ. 21 ఉత్క్రమిష్యత ఏవం భావాదిత్యౌడులోమిః
ఉత్క్రమిష్యతః, ఏవంభావాత్, ఇతి, ఔడులోమిః

ఆత్మసాక్షాత్కారం జరిగిన తరువాత ఈ దేహాన్ని విడిచిన జీవాత్మ పరమాత్మలో లీనమవుతుంది. కాబట్టి 'ఔఢులోమి' అనే ఆచార్యుడు భవిష్యత్తులో జరుగబోయేదాన్ని ముందుగానే ఊహించి జీవునితో వాక్యం ప్రారంభించటం తప్పులేదు అంటున్నాడు.

సూ. 22 అవస్థితేరితి కాశకృత్స్నః

అవస్థితేః, ఇతి, కాశకృత్స్నః

అవిద్య, అజ్ఞానములతో వచ్చిన భేద భావం వల్ల ఆ పరబ్రహ్మ జీవరూపంలో ఉన్నాడు. అందుచేతనే 'జీవాత్మ'తో వాక్యం ప్రారంభమవుతుంది.

కాబట్టి తెలుసుకోదగినవాడు పరమాత్మ తప్ప వేరెవరూ కాదు అంటూ ఆరవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

7. ప్రకృత్యధికరణము

"గురువుగారూ! ఈ జగత్తుకు బ్రహ్మ ఉపాదాన కారణమా ? నిమిత్త కారణమా ? కుండకు కుమ్మరి నిమిత్త కారణము మట్టి ఉపాదాన కారణము. అలాగే ఆభరణానికి ఉపాదాన కారణము బంగారం. నిమిత్త కారణం కంసాలి. కుమ్మరివాడు కుండను ఏ రకంగా తయారుచెయ్యాలో ముందుగా ఆలోచించుకుని తయారుచేస్తాడు. అలాగే స్వర్ణకారుడుకూడా. ఛాందోగ్యోపనిషత్తులో ఈ సృష్టిని గురించి పరబ్రహ్మ ఆలోచించాడు. ఒకటిగా ఉన్న పరబ్రహ్మ తాను అనేకం కావాలి అనుకున్నాడు. ప్రశ్నోపనిషత్తులో ఆ పరబ్రహ్మ ఆలోచన చేశాడు. ముందుగా ప్రాణాన్ని సృష్టించాడు ఐతరేయోపనిషత్తులో పరమాత్మ విరాట్స్వరూపాన్ని దృష్టిలో ఉంచుకుని తీవ్రమైన ఆలోచన చేశాడు. అని చెప్పబడింది. కాబట్టి ఈ జగత్తుకు పరబ్రహ్మ ఉపాదాన కారణమా ? నిమిత్త కారణమా? తెలియచెయ్యండి" అన్నాడు నారాయణభట్టు. రత్నాకరుడు ప్రారంభించాడు.

సూ. 23 ప్రకృతిశ్చ ప్రతిజ్ఞా దృష్టాంతానుపరోధాత్

ప్రకృతిః, చ, ప్రతిజ్ఞా, దృష్టాంత, అనుపరోధాత్

పరబ్రహ్మ ఈ జగత్తుకు ఉపాదాన కారణము నిమిత్త కారణము కూడా.

ఛాందోగ్యోపనిషత్తులో ఆత్మజ్ఞానాన్ని బోధిస్తూ ఉద్దాలకుడు తన కుమారుడైన శ్వేతకేతువుతో అంటున్నాడు. "నాయనా శ్వేతకేతూ ! శ్రవణ గోచరంకాని తత్త్వం ఇంద్రియ గోచరమయ్యే విధానము గురించి మీ గురువుగారిని అడిగావా?"

ఏమిటా విషయం ? అన్నాడు శ్వేతకేతువు మట్టిని గురించి తెలిస్తే, మట్టితో చేసిన రకరకాల వస్తువులకు పేర్లలో తేడా ఉన్నవాటిని గురించి తెలుస్తుంది. అలాగే బంగారం గురించి తెలిస్తే దానితో తయారుచేసే నగలకు ఏ పేరు పెట్టినా అందులో ఉన్నది బంగారమే అని తెలుస్తుంది. అలాగే ఏ విషయం తెలుసుకున్నందువల్ల మనకు అన్ని విషయాలు బోధపడతాయో, దాన్ని గురించి తెలుసుకోవాలి. ఇక్కడ మట్టి సత్యం. ఉపాదాన కారణము. అలాగే బ్రహ్మ సత్యం. ఈ జగత్తుకు అదే ఉపాదాన కారణము, నిమిత్త కారణము కూడా.

సూ.24 అభిధ్యోపదేశాచ్చ

అభిధ్య, ఉపదేశాత్, చ

పరబ్రహ్మ తాను అనేకం కావాలని కోరుకున్నాడు. ఈ కోరిక వల్ల బ్రహ్మకు కర్తృత్వము, ఉపాదానత్వము రెండూ వస్తాయి.

సూ. 25 సాక్షాచ్చోభయామ్నానాత్

సాక్షాత్, చ, ఉభయామ్నానాత్

బ్రహ్మకు సృష్టి, లయాలు రెండూ చెప్పటంవల్ల అతడు జగత్తుకు ఉపాదాన కారణం అవుతున్నాడు. ఈ సమస్త భూతాలు ఆకాశంనుంచే పుడుతున్నాయి. ఆకాశంలోనే లీనమవుతున్నాయి. అని చెప్పటం జరిగింది. ఇక్కడ ఆకాశము అంటే పరబ్రహ్మ అంతేకాని భూతాకాశం కాదు. ఈ జగత్తంతా బ్రహ్మనుండే పుట్టి బ్రహ్మలోనే లీనమవుతుంది. ఒకవస్తువు యొక్క సృష్టికి, లయానికి ఏది కారణమవుతుందో, అది దానికి ఉపాదాన కారణము. మట్టి నుండి పుట్టిన కుండ మళ్ళీ మట్టిలోనే కలిసిపోతుంది. అందుకే కుండకు మట్టి, జగత్తుకు బ్రహ్మ ఉపాదానకారణము.

సూ. 26 ఆత్మకృతేః పరిణామాత్

ఆత్మసంబంధమైన కృతివల్ల, ఆత్మను స్వయంగా సృజించాడు అని చెప్పటంవల్ల బ్రహ్మ ఈ జగత్తుకు ఉపాదానకారణము అవుతున్నాడు. అతడే స్వయంగా నామరూపాత్మకమైన జగత్తును సృష్టించాడు అని చెప్పటంవల్ల అతడికి కర్తృత్వం వస్తోంది. అంటే నిమిత్త కారణమవుతున్నాడు.

సూ. 27 యోనిశ్చ హి గీయతే

యోనిః, చ, హి, గీయతే

ఇక్కడ యోని అంటే ఆత్మ అని అర్థం. ముండకోపనిషత్తులో వివేకవంతులు సమస్త భూతాలకు కారణమైనవానిని అంతటా చూస్తారు అని చెప్పటం జరిగింది.

కాబట్టి ఈ జగత్తుకు బ్రహ్మ ఉపాదాన కారణము మరియు నిమిత్త కారణము కూడా అంటూ ఏడవ అధికరణను పూర్తిచేశాడు రత్నాకరుడు.

8. సర్వవ్యాఖ్యానాధికరణము

ఇంతవరకు సాంఖ్యులయొక్క వాదాన్ని తిరస్కరించి జగత్కారణం ప్రకృతి కాదు అని నిరూపించారు. ఇక అణువాదాన్ని నిరాకరిస్తున్నారు.

సూ. 28 ఏతేన సర్వే వ్యాఖ్యాతా వ్యాఖ్యాతాః

ఏతేన, సర్వే, వ్యాఖ్యాతాః, వ్యాఖ్యాతాః

ప్రధాన కారణాన్ని నిరాకరించటంవల్ల మిగిలిన వాదనలన్నీ నిరాకరించబడినట్లే. సాంఖ్యులవాదనలో ఉన్న లోపాలే అణువుల్ని జగత్కారణంలోనూ ఉన్నాయి. కాబట్టి ఈ వాదన కూడా నిరాకరించినట్లే. వాదనలన్నింటిలోకి సాంఖ్యుల వాదనే బలమైనది. అందుకనే సాంఖ్యులను తిరస్కరిస్తూ మిగిలిన వాదనలు కూడా తిరస్కరించినట్లే అని చెబుతూ బ్రహ్మసూత్రాలలో మొదటి అధ్యాయాన్ని పూర్తి చేశాడు రత్నాకరుడు.

ద్వితీయాధ్యాయము

మొదటి అధ్యాయంలో సర్వేశ్వరుడైన పరమేశ్వరుడే సృష్టి స్థితి లయాలకు కారకుడు అని నిరూపించటం జరిగింది. ఈ అధ్యాయంలో సాంఖ్య, యోగ, కణాదాది శాస్త్రాలతోను, వారి తర్కాలతోను వేదాంత వాక్యాలలో కనుపించే విరోధాలను సమన్వయం చేస్తున్నారు.

ప్రథమ పాదము

ఈ పాదంలో 13 అధికరణలు, 37 సూత్రాలు ఉన్నాయి.

వ.నెం.	అధికరణము	విషయము	సూత్రాలు
1.	స్మృత్యధికరణము	శ్రుతులకు విరుద్ధమైన స్మృతుల నిరాకరణ	2
2.	యోగప్రత్యుక్త్యధికరణము	యోగసిద్ధాంత నిరాకరణ	1
3.	నవిలక్షణత్వాధికరణము	ఉపాదాన కారణమైనందున బ్రహ్మస్వభావానికి భంగం లేదు	8
4.	శిష్టాపరిగ్రహాధికరణము	శిష్టులు అంగీకరించని మతాన్ని నిరాకరించటము	1
5.	భోక్త్రాపత్త్యధికరణము	బ్రహ్మ, భోక్త అయిన జీవుడు, భోగ్యవిషయాలు	1
6.	ఆరంభణాధికరణము	కార్యకారణాలకు తేడా లేదు	7
7.	ఇతరవ్యపదేశాధికరణము	పరమేశ్వరునికి హితకణాది దోషప్రసక్తి	3
8.	ఉపసంహార దర్శనాధికరణము	బ్రహ్మనికి బాహ్యసాధనాలు అవసరం లేదు	2
9.	కృత్స్నప్రసక్త్యధికరణము	జగత్తువల్ల బ్రహ్మపరిపూర్ణతకు బాధ్యత లేదు	4
10.	సర్వోపేతాధికరణము	బ్రహ్మయొక్క వివిధ శక్తులు	2
11.	ప్రయోజనవత్త్వాధికరణము	జగత్తు ఈశ్వరుని లీల	2
12.	వైషమ్యనైర్ఘృణ్యాధికరణము	బ్రహ్మకు పక్షపాతము, దయ లేవు	3
13.	సర్వధర్మోపపత్త్యధికరణము	సృష్టికి కావలసిన లక్షణాలన్నీ బ్రహ్మకు ఉన్నాయి	1
		మొత్తం సూత్రాలు	37

ఇక మొదటి ప్రకరణాన్ని చూద్దాం

1. స్మృత్యధికరణము

"గురువుగారూ ! కపిల మహర్షి సర్వజ్ఞుడు అంటారు. సృష్టి ఆరంభంలో పుట్టినటువంటి కపిలుడు, పుట్టుకతోనే మహాజ్ఞానియై, తన జన్మకు కారణము ఎవరో కనుక్కోవాలి అనుకున్నాడని ఉపనిషత్తులు చెబుతున్నాయి. మరి అటువంటి కపిలుడు చెప్పిన విషయాలు కాదనటానికి లేదు. కపిల మహర్షి 'బ్రహ్మమే సమస్త జగత్తుకూ కారణము' అనే విషయంలో సందేహం వెలిబుచ్చాడు కదా!" అన్నాడు కృష్ణశర్మ.

"నిజమేనయ్యా ! కపిలుడు చాలా గొప్పవాడు. సాంఖ్యస్మృతి వ్రాసినది ఆయనే. దానికి సమాధానంగానే వ్యాసుడు ఈ క్రింది సూత్రాలు చెబుతున్నాడు" అంటూ మొదటి అధికరణ ప్రారంభించాడు రత్నాకరుడు.

సూ. 1 స్మృత్యనవకాశదోష ప్రసంగఇతి
చేన్నాన్యస్మృత్య నవకాశదోష ప్రసంగాత్
స్మృతి, అనవకాశ, దోష, ప్రసంగః, ఇతి, చేత్, న
అన్యస్మృతి, అనవకాశదోషప్రసంగాత్

లోకంలో అనేకమంది గొప్పవాళ్ళున్నారు. వాళ్ళలో మనువు మొదలైన వాళ్ళుకూడా కపిలునికి మల్లేనే స్మృతులను వ్రాశారు. అందుకని విషయనిర్ణయం చేసేటప్పుడు, కేవలం సాంఖ్యస్మృతిని మాత్రమే దృష్టిలో ఉంచుకుని నిర్ణయించాలి అనటం తప్పు. ఇలాంటప్పుడు అనేకమంది చెప్పినది అంగీకరించటమే మంచిది ఈ సృష్టికి కారణం బ్రహ్మ అనే మాటను స్మృతులు అంగీకరించాయి. వేదాలు స్వతః ప్రమాణాలు వీటిని శ్రుతులు అంటారు. వాటిలో ఉన్న అర్థాన్ని గ్రహించి, తేలిక భాషలో వ్రాసినవే స్మృతులు. కాబట్టి స్మృతులలో వ్రాసిన విషయం శ్రుతులకు తేడాగా ఉండవచ్చు. అందుచేత వేదంలో చెప్పిన దానికి విరుద్ధమైన అర్థం వచ్చేటప్పుడు ఆ స్మృతులను అంగీకరించరాదు. ఈ జగత్తుకు కారణము బ్రహ్మ అనే విషయం అనేకచోట్ల చెప్పబడింది. భగవద్గీత, పురాణాలు కూడా ఈ విషయాన్నే చెబుతున్నాయి. కాబట్టి వేదార్థానికే ప్రామాణ్యత ఉన్నది కాని, దానికి విరుద్ధమైన సాంఖ్యస్మృతికి ప్రామాణ్యత లేదు.

సూ. 2 ఇతరేషాంచానుపలబ్ధేః
ఇతరేషామ్, చ, అనుపలబ్ధేః

సాంఖ్యస్మృతిలో ప్రధానమైనది ప్రకృతి. మహత్తు మొదలైన తత్త్వాలు లేవు. అయితే ప్రకృతియొక్క పరిణామాలుగా చెప్పబడుతున్న మహత్తత్త్వము, అహంకారము, తన్మాత్రలు మొదలైనవి సాంఖ్యులు కల్పించినవి. భూతాలు, ఇంద్రియాలు వేదంలో చెప్పబడ్డాయి. కాని ఆరవ ఇంద్రియము అని చెప్పి మహత్తును కల్పించారు సాంఖ్యులు. అందుచేతనే సాంఖ్యము అప్రమాణమైనది.

కాబట్టి వేదవిరుద్ధమైన స్మృతులను నిరాకరించి 'జగత్కారణము బ్రహ్మమే' అని చెప్పాలి అంటూ మొదటి అధికరణను పూర్తి చేశాడు రత్నాకరుడు.

2. యోగ ప్రత్యుక్త్యధికరణము

సాంఖ్యస్మృతిని ఆధారంగా చేసుకుని వచ్చిందే యోగశాస్త్రము. యోగశాస్త్రంలో కూడా వేదాలకు విరుద్ధంగా ప్రకృతినే జగత్కారణంగా అంగీకరించారు. అయితే సాంఖ్యస్మృతిని నిరాకరించటంవల్ల యోగశాస్త్రాన్ని కూడా నిరాకరించినట్లే అవుతుంది.

సూ. 3 ఏతేన యోగః ప్రత్యుక్తః

సాంఖ్యమతాన్ననుసరించే యోగశాస్త్రమున్నప్పటికీ యోగశాస్త్రంలో ఈశ్వరుడున్నాడు. సాంఖ్యశాస్త్రంలో ప్రకృతే ప్రధానమైనది. ఈ రెండింటికీ తేడా ఇది ఒక్కటే. మిగిలినవన్నీ సమానమే. అన్నాడు రత్నాకరుడు. ఆ మాటలు విన్న కృష్ణశర్మ అడుగుతున్నాడు "గురువుగారూ ! ఉపనిషత్తులలో యోగాన్ని వివరించటం జరిగింది. యోగి ఏ రకంగా ఉండాలో కూడా చెప్పారు. కఠోపనిషత్తులో సంపూర్ణమైన యోగవిధిని పొందిన నచికేతుడు బ్రహ్మత్వం పొందాడు అని చెప్పారు. కాబట్టి యోగాన్ని, యోగశాస్త్రాన్ని కాదనలేము కదా"

ఆ మాటలు విన్న రత్నాకరుడు "నాయనా ! యోగశాస్త్రం సాంఖ్యశాస్త్రాన్ని ఆధారంగా చేసుకుని చెప్పబడింది. సాంఖ్యులు ప్రకృతే జగత్కారణము అన్నారు. అదే యోగానికి కూడా ఆధారం. మరి సాంఖ్యశాస్త్రానికే ప్రమాణం లేనప్పుడు, యోగశాస్త్రానికి ప్రమాణం ఎలా ఉంటుంది? ఈ రెండింటికీ వేదప్రమాణం లేదు. వేదప్రమాణాన్ని అంగీకరించినంత వరకే వీటికి ప్రమాణత్వమున్నది. కాని ఎప్పుడైతే వేదప్రమాణాన్ని ఇవి అంగీకరించలేదో, అప్పుడే వీటికి ప్రమాణత్వం లేదు. శ్రుతివిరుద్ధమైన విషయాల్లో మాత్రం ఇవి అప్రమాణాలు అంటూ రెండవ అధికరణను పూర్తి చేశాడు రత్నాకరుడు.

3. న విలక్షణత్వాధికరణము

"గురువుగారూ ! సాంఖ్యస్మృతిని కాదన్నాము. కాని తార్కికుల మాటేమిటి? బృహదారణ్యకోపనిషత్తులో ఆత్మ అనేది శ్రవణ, మనన, నిదిధ్యాసలకు తగినది అని చెప్పబడింది కదా! ఇక్కడ యుక్తులతో చింతన చేయటమే మననము అని తార్కికులు అంటున్నారు కదా" అన్నాడు నారాయణభట్టు. ఆ మాటలు విన్న రత్నాకరుడు శిష్యుని సందేహనివృత్తి చెయ్యటం ప్రారంభించాడు.

సూ. 4 న విలక్షణత్వాదస్యతథాత్వంచ శబ్దాత్

న, విలక్షణత్వాత్, అస్య, తథాత్వం, చ, శబ్దాత్

ఈ జగత్తు తనకు కారణమైన బ్రహ్మకన్న విలక్షణమైనది. కాబట్టి చేతనమైన బ్రహ్మమే జగత్కారణము అనటానికి వీలు లేదు. ఈ రకంగా తేడా ఉన్నది అనే విషయం కూడా వేదంవల్లనే తెలుస్తోంది.

ఏ లక్షణాలుగల పదార్థంనుండైనా, ఆ లక్షణాలుగల పదార్థాలే పుడతాయి. జడపదార్థం నుంచి జడపదార్థమే పుడుతుంది కాని చైతన్యము పుట్టదు. జడమైన మట్టినుంచి, జడమైన కుండ మాత్రమే పుడుతుంది. అంతేగాని బంగారు ఆభరణాలు పుట్టవు. దారం నుండి వస్త్రం తయారవుతుంది. అంతేకాని కుండ తయారుకాదు. అలాగే జగత్తు అచేతనము, జడము, బ్రహ్మము చేతనము ప్రకాశ రూపము, ఆనందాత్మకము మరి జగత్తు అప్రకాశము, దుఃఖరూపము. బ్రహ్మశుద్ధము, జగత్తు అపవిత్రము ఈ రెండింటికీ లక్షణాలు వేరు. కాబట్టి చేతనమైన బ్రహ్మనుంచి, జడమైన జగత్తు పుట్టదు. అందుచేత జగత్తుకు కారణం బ్రహ్మకాదు అని తార్కికులు వాదిస్తున్నారు.

అయితే బ్రహ్మకు, జగత్తుకు విరుద్ధభావాలు లక్షణాలు లేవు. బ్రహ్మము చైతన్యము అలాగే జగత్తుకూడా చైతన్యమే. ఉపనిషత్తులలో అనేకచోట్ల మృత్తిక చెప్పింది. ఉదకం ఆలోచించింది. వాయువు చెప్పింది. అంటూ పంచభూతాలకు చేతనత్వము చెప్పబడింది. ఛాందోగ్యములో ఉపకోశలుడికి అగ్నులు ఉపదేశం చేశాయి. అంతేకాదు ఇంద్రియాలు కూడా చేతనమే. బృహదారణ్యకము, ఛాందోగ్యోపనిషత్తులలో ఇంద్రియాలు తమలో ఎవరు గొప్ప అని పోట్లాడుకున్నాయి అని చెప్పబడింది. ఈ రకంగా ఇంద్రియాలు తమలో తాము వాదులాడుకుని తీర్పుకోసం బ్రహ్మదగ్గరకు వెళ్ళటం అనేది చేతనధర్మమే కాని జడత్వం కాదు. కాబట్టి జగత్తు, బ్రహ్మ రెండూ చేతనాలే చేతనం నుండి జడము పుట్టదు. చేతనం నుండి చేతనమే పుడుతుంది. అని తార్కికులవాదన.

సూ. 5 అభిమాని వ్యపదేశస్తు విశేషాను గతిభ్యామ్

అభిమాని, వ్యపదేశః, తు, విశేషానుగతిభ్యామ్

ఉపనిషత్తులలో ఇంద్రియాలు మాట్లాడాయి అని చెప్పబడింది గదా. అక్కడ ఇంద్రియాలు అంటే ఇంద్రియాభిమానులైన దేవతలు. ఐతరేయోపనిషత్తులో ఇంద్రియాభిమానులైన దేవతలగురించి చెప్పబడింది. నోటికి అధిదేవత అగ్ని. ముక్కుకు వాయువు అందుచేత ఇంద్రియాలు, భూతాలు చేతనాలు కావు.

సూ. 6 దృశ్యతే తు

దృశ్యతే, తు

చేతనంనుంచి అనేక అచేతన పదార్థాలు పుట్టాయి. అలాగే అచేతనం నుంచి చేతనాలు పుట్టాయి. కాబట్టి అచేతనమైన జగత్తు చేతనంవల్ల వచ్చిందనటానికి సందేహం లేదు.

బ్రహ్మ చేతనము. జగత్తు అచేతనము. కాబట్టి జగత్తు బ్రహ్మచే సృష్టించబడలేదు అని చెప్పటానికి వీలు లేదు. చేతనుడైన పురుషుడి నుండి అచేతనమైన గోళ్ళు, వెంట్రుకలు పుడుతున్నాయి. అలాగే అచేతనమైన పేడ, పెంట ప్రోగులనుండి తేళ్ళు, జర్రులు పుడుతున్నాయి. ప్రకృతి వికృతి అని రెండు ఉన్నాయి. ప్రకృతి యొక్క ధర్మాలన్నీ వికృతిలో ఉండవు. ఒకవేళ ఉంటే అది వికృతి కాదు. ప్రకృతి అవుతుంది. అలాగే చేతనుడైన పరమాత్మ యొక్క ధర్మాలన్నీ జగత్తులో ఉండనవసరం లేదు.

కాబట్టి ప్రకృతిలోని సమస్త వికారాలకు ప్రకృతి బ్రహ్మమే. బ్రహ్మవిషయంలో శ్రుతి (వేద) ప్రమాణం తప్ప, తర్కం పనికిరాదు. అయితే తర్కం పూర్తిగా పనికిరానిది కాదు. అది అవసరమైనంత వరకు వేదప్రమాణమున్నంతవరకూ మాత్రమే ఉపయోగించాలి.

సూ. 7 అసదితి చేన్న ప్రతిషేధమాత్రత్వాత్

అసత్, ఇతిచేత్, న, ప్రతిషేధమాత్రత్వాత్

నామరూపాలు లేనట్టి బ్రహ్మము, నామరూపాలు ఉన్న జగత్తుకు కారణము సృష్టికి ముందు అంతా బ్రహ్మమయమే.

సూ. 8 అపీతౌ తద్వత్ప్రసంగాద సమంజసమ్

అపీతౌ, తద్వత్, ప్రసంగాత్, అసమంజసమ్

ప్రళయకాలంలో కర్మపరిపక్వం చెందని ప్రాణులన్నీ తమకర్మను తమతో పాటు మూటకట్టుకుని బ్రహ్మలో లీనమవుతున్నాయి. ఈ రకంగా జగత్తంతా బ్రహ్మలో లీనమయిపోతుంది. మరి అటువంటప్పుడు జగత్తుకు ఉన్నటువంటి అవలక్షణాలన్నీ బ్రహ్మకు సంక్రమిస్తాయి. కాబట్టి ఉపనిషత్తులలో చెప్పిన పరిశుద్ధము చేతనము అయిన బ్రహ్మ జగత్తుకు కారణము అని చెప్పటానికి వీలులేదనేది వీరి వాదన.

సూ. 9 న తు దృష్టాంత భావాత్

న, తు, దృష్టాంతభావాత్

ఈ వాదన సరికాదు. ఎందుకంటే మట్టిలో కలిసిపోయిన కుండ తనకు కారణమైన మట్టిని కలుషితం చేయదు. అలాగే బంగారు ఆభరణాలు మళ్ళీ బంగారంలో కలిసిపోయేటప్పుడు, ఆ బంగారాన్ని దూషితం చెయ్యవు.

ఈ సమస్తమూ బ్రహ్మమే. సృష్టి ఆరంభంలో అంతా బ్రహ్మమయంగానే ఉండేది. పరబ్రహ్మ స్వయం ప్రకాశం గలవాడు. నిరాకారుడు. పుట్టుక, ప్రాణము మనస్సు లేనివాడు. పరిశుద్ధమైనవాడు. అతని నుండే ప్రాణము, మనస్సు, ఇంద్రియాలు, పంచభూతాలు పుడుతున్నాయి. అని ముండకోపనిషత్తు చెబుతున్నది. గారడీవాడు, తాను చేసే మాయద్వారా దూషితుడు కానట్లే, పరమాత్మ కూడా తనలో లీనమయిన జగత్తువల్ల దూషితుడు కాడు.

సూ. 10 స్వపక్షదోషాచ్చ

స్వపక్షదోషాత్, చ

సాంఖ్యులు చెప్పే దోషాలు వారి మతంలోనూ ఉన్నాయి. కాబట్టి దోషాలు, దోషపరిహారాలు రెండు మతాల్లోనూ సమానమే.

సాంఖ్యుల ఆక్షేపణలు

1. బ్రహ్మకన్న జగత్తు విలక్షణమైనది. ఆ రెండింటికీ ప్రకృతి వికృతుల భావం కుదరదు.

2. సృష్టికి పూర్వం అంతా అసత్తుగా ఉన్నది.

3. ప్రళయకాలంలో జగత్తు అంతా బ్రహ్మలో లీనమయినప్పుడు, బ్రహ్మ అపరిశుద్ధమవుతుంది.

ఈ దోషాలు సాంఖ్యమతంలో కూడా ఉన్నాయి.

1. శబ్దహీనమైన ప్రకృతి నుండి శబ్దాదులు గల జగత్తు పుడుతోంది. ఈ రెండింటికీ కూడా ప్రకృతి వికృతి భావం కుదరదు.

2. ప్రళయ కాలంలో గుణాలు లేని ప్రకృతిలో గుణాలు గల జగత్తు లీనమయినప్పుడు, ప్రకృతి దోషభూయిష్టమవుతుంది.

3. దోషాలన్నీ సాంఖ్యమతానికే వర్తిస్తాయి కాని ఉపనిషత్వానికి వర్తించవు.

సూ. 11 తర్కాప్రతిష్ఠానాదప్యన్యథానుమేయమితి చేదేవ మప్యనిర్మోక్ష ప్రసంగః

తర్క, అప్రతిష్ఠానాత్, అపి, అన్యథా, అనుమేయమ్ ఇతిచేత్, ఏవం, అపి, అనిర్మోక్ష, ప్రసంగః

తర్కం ఒప్పుకోక పోయినప్పటికీ బ్రహ్మమందు వేదాంతవాక్యాలు సమన్వయించటం లో ఆక్షేపణ ఉండదు. ఇక తార్కికుడు చెప్పే అర్థము వేరొక తార్కికుడు ఒప్పుకోడు. కాబట్టి తర్కం నిలకడ లేనిది కాబట్టి వేదాంత సిద్ధాంతం ప్రకారం చెప్పిన బ్రహ్మమే జగత్కారణము. ఇందులో సందేహం లేదు.

ఏ విధమైన సందేహాలకు తావు లేకుండా ఉండేటటువంటి జ్ఞానమే తత్త్వజ్ఞానము. ఇందులో విరుద్ధ భావాలుండవు. వేదాలను అనుసరించకుండా చెప్పే జ్ఞానము సమ్యజ్ఞానము కాదు. అటువంటి జ్ఞానంవల్ల మోక్షం రాదు. కాబట్టి వేదప్రమాణం లేని తర్కము పనికి రాదు. ఈ జగత్తుకు బ్రహ్మమే ఉపాదానకారణము అందులో ఏ మాత్రం సందేహం లేదు అంటూ మూడవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

4. శిష్టాపరిగ్రహాధికరణము

సూ. 12 ఏతేన శిష్టాపరిగ్రహా అపి వ్యాఖ్యాతాః

ఏ సిద్ధాంతాన్నైనా సరే శిష్టులు ఖండించినట్లైతే, ఆ సిద్ధాంతాన్ని అందరూ తిరస్కరించినట్లే.

ఈ జగన్నిర్మాణానికి కారణము ప్రకృతి అన్నారు సాంఖ్యులు. ఇలాగే పరమాణువులు కారణమని అణువాదులంటారు. ఈ సిద్ధాంతాలన్నింటినీ మనువు, వ్యాసుడు వంటి మహానుభావులు ఖండించారు. కొంతవరకు ఈ వాదనలు వేదాలను అనుసరించి ఉన్నప్పటికీ, అవి మొత్తంమీద వేదవిరుద్ధములే వీటిలో ముఖ్యమైనది సాంఖ్యము. దాన్నే తిరస్కరించారు కాబట్టి మిగిలిన వాటిని కూడా తిరస్కరించినట్లే.

ఈ రకంగా సాంఖ్యసిద్ధాంతాన్ని ఖండించటం ద్వారా వేదాలలో లేనటువంటి కణాద, గౌతమ, బౌద్ధ, అక్షపాద మతసిద్ధాంతాలన్నింటినీ ఖండించినట్లే అవుతుంది. కాబట్టి శిష్టులు అంగీకరించనటువంటి మతాన్ని నిరాకరించినట్లే అంటూ నాల్గవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

5. భోక్త్రాపత్త్యధికరణము

“గురువుగారూ ! భోక్త అంటే చేతనుడైన జీవుడు. భోగ్యము అంటే శబ్దాది విషయ సమూహము. బ్రహ్మమే జగత్తుకు ఉపాదాన కారణము. కాబట్టి భోగ్యవస్తువుకే భోక్తృత్వము కూడా లభిస్తోంది. అందుచేత భోక్త భోగ్య విభాగం కుదరదు కదా!” అన్నాడు కృష్ణశర్మ. ఆ మాటలు విన్న రత్నాకరుడు చెప్పటం ప్రారంభించాడు.

సూ. 13 భోక్త్రాపత్తేరవిభాగశ్చేత్ స్యాల్లోకవత్

భోక్తృ, అపత్తేః, అవిభాగః, చేత్, స్యాత్, లోకవత్

బ్రహ్మము ఈ జగత్తుకు ఉపాదానకారణము. భోక్తరూపంలోగాని, భోగ్యరూపంలో గాని కనిపించే జగత్తంతా బ్రహ్మకన్న భిన్నమైనది కాదు. అందువల్ల భోక్త భోగ్యము అనే విభాగము ఉండదు.

కుండ, మూకుడు వీటిలో ఉన్నది మట్టే. ఈ వస్తువులలో తేడా ఉన్నప్పటికీ వాటికి కారణమైన మట్టిలో తేడా లేదు. అలాగే ఈ జగత్తుకు బ్రహ్మ ఉపాదాన కారణము. ఈ జగత్తు, బ్రహ్మ రెండూ వేరు కాదు. అంటూ ఐదవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

6. ఆరంభణాధికరణము

గురువుగారూ ! జగత్తుకు, బ్రహ్మకు భేదం లేదు అన్నారు. దీనివల్ల జగత్తుకు భోక్తృత్వం వస్తోందనే దోషాన్ని కూడా పరిహరించారు. కాని లోకంలో కనిపించే మట్టి, కుండ ఉదాహరణలుగా చెప్పటంవల్ల కార్యకారణాలకు భేదం కనిపిస్తోంది కదా! కాబట్టి జగత్తుకు, బ్రహ్మకు భేదం ఎందుకు చెప్పకూడదు?” అన్నాడు నారాయణభట్టు. ఆ మాటలు విన్న రత్నాకరుడు చెప్పటం ప్రారంభించాడు.

సూ. 14 తదనన్యత్వమారంభణ శబ్దాదిభ్యః

తత్, అనన్యత్వం, ఆరంభణశబ్దాదిభ్యః

కార్యము జగత్తు, కారణము బ్రహ్మ. ఈ రెండింటికీ అభిన్నత్వమున్నదనే విషయం వేదాలలో చెప్పబడింది.

ఛాందోగ్యోపనిషత్తులో ఉద్దాలకుడు శ్వేతకేతువుకు ఆత్మజ్ఞానాన్ని వివరిస్తూ మట్టిని గురించి తెలుసుకుంటే ఆ మట్టితో చేసే వివిధరకాల వస్తువులకు పేర్లలోను ఉపయోగాల లోను తేడా ఉన్న, వాటిని గురించి తెలుస్తుంది. ఎందుకంటే అవన్నీ పేరుకు మాత్రమే వికారాలు మట్టి అనేదే సత్యం మట్టితో తయారైన పాత్రల రూపంలో తేడా ఉన్నప్పటికీ, అవి మట్టికన్న భిన్నమైనవి కాదు. అలాగే బంగారము, ఆభరణాలు తేజము, జలము, అన్నము అనే వాటిని బ్రహ్మకు కార్యంగా చెప్పినప్పుడు, కార్యరూపంలో ఉన్న ఇవి తమకు కారణరూపమైన బ్రహ్మకన్న భిన్నమైనవి కాదు. ఎప్పుడూ వికారాలనేవి నామమాత్రం. ఛాందోగ్యంలో ఉద్దాలకుడు సృష్టి అంతా ఆత్మస్వరూపం. అదే సత్యం. అదే ఆత్మ. అదే నీవు ఈ సమస్తమూ ఆత్మపదార్థమే. ఇక్కడ భిన్నమైనది ఏదీ లేదు. కాబట్టి కారణము సత్యం. కార్యం వికారం అందుకే కారణమయిన బ్రహ్మసత్యం కార్యమైన జగత్తు మిథ్య. కార్యకారణాలకు భేదం లేదు.

సూ. 15 భావేచోపలబ్ధేః

భావే, చ, ఉపలబ్ధేః

కారణమున్నప్పుడే కార్యము లభించటం జరుగుతుంది. అంటే మట్టి ఉంటేనే కుండ తయారవుతుంది. బంగారముంటేనే ఆభరణాలు తయారవుతాయి. కాబట్టి కార్యకారణాలకు భేదం లేదు.

సూ. 16 సత్త్వాచ్చావరస్య

సత్త్వాత్, చ, అవరస్య

కార్యము అంటే వస్తువు రావటానికి ముందుకూడా కారణమున్నది. కాబట్టి కార్యకారణాలకు భేదం లేదు. కుండ తయారవకముందే మట్టి ఉన్నది. కుండ తయారయిన తరువాతకూడా అది మట్టికన్న వేరు కాదు.

సృష్టికి ముందు అంతా ఆత్మమయంగానే ఉండేది మట్టి నుండి కుండ పుట్టినట్లే, బ్రహ్మనుండి జగత్తు పుట్టింది.

సూ. 17 అసద్వ్యపదేశాన్నేతిచేన్న ధర్మాంతరేణ వాక్యశేషాత్

అసద్వ్యపదేశాత్, న, ఇతిచేత్, న, ధర్మాంతరేణ, వాక్యశేషాత్

సృష్టికి ముందు అసత్తు అని చెప్పటంవల్ల కార్యం కారణరూపంలో లేదు అంటారు. ఇది సరికాదు. ఎందుకంటే కేవలము అది అసత్తు కాదు.

సూ. 18 యుక్తేః శబ్దాంతరాచ్చ

యుక్తేః, శబ్దాంతరాత్, చ

యుక్తి విషయంగా ఆలోచిస్తే పెరుగుకు పాలు, కుండకు మట్టి, ఆభరణానికి బంగారము కారణము. పెరుగు కావాలనుకున్నవాడు పాలను కోరతాడు అంతేకాని మట్టిని కోరడు. సృష్టికి అంటే పుట్టటానికి ముందు పెరుగు, పాలరూపంలో ఉంది. అలాగే కుండ కావాలనుకునేవాడు మట్టిని, ఆభరణాలు కావాలనుకునే వాడు బంగారాన్ని కోరతాడు. అంతేకాని అసత్తును కోరడు. కార్యమనేది ఉత్పత్తికి పూర్వం కారణరూపంలోనే ఉంది. అందుచేత కార్యకారణాలకు భేదం లేదు.

సూ. 19 పటవచ్చ

పటవత్, చ

బట్టచుట్టగా చుట్టబడిఉన్నా, పరచబడి ఉన్నా అది బట్టే. అంటే ఒక్క ఆకారమే మారుతోంది. మూలంలో మార్పుండదు. అలాగే మట్టి, కుండ విషయంలోకూడా అయితే వస్త్రం చుట్టబడి ఉన్నప్పుడు దాని పొడవు, వెడల్పు, నాణ్యత తెలియవు. అది పరచినప్పుడు మాత్రమే అవి తెలుస్తాయి. అలాగే మట్టిగా ఉన్నప్పుడు తెలియని విషయాలు కుండ తయారైన తరువాత తెలుస్తాయి. అంతేకాని కార్యకారణాలయిన కుండ, మట్టిలలో భేదం లేదు.

సూ. 20 యథా చ ప్రాణాది

యథా, చ, ప్రాణాది

ప్రాణాయామం చేస్తున్నప్పుడు ఊపిరి బిగపడతారు. అంటే వాయువును కుంభిస్తారు. అప్పుడు, అపాన, వ్యాన, ఉదానములనే తేడాలు వాయువుకు ఉండవు. అప్పుడు ప్రాణం మాత్రమే ఉంటుంది. ఎందుకంటే వాయుప్రసరణ జరగటంలేదు కాబట్టి. ప్రాణాయామం ఆపేసినప్పుడు అవన్నీ యధాతథంగా వస్తాయి. అంతమాత్రంచేత వీటిమధ్య తేడా ఉన్నదని కాదు. కార్యకారణాల మధ్య ఏ మాత్రం భేదం లేదు. అంటూ ఆరవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

7. ఇతర వ్యపదేశాధికరణము

"గురువుగారూ ! కార్యకారణ భేదం లేదన్నారు బాగుంది. అయితే జీవాత్మ పరమాత్మ రెండూ ఒకటే అంటున్నారు కదా. జీవి కర్మలు చేస్తుంటాడు. ఆ కర్మలవల్ల అతనికి జనన మరణాదులు సంభవిస్తుంటాయి. ఈ కర్మలలో కొన్ని దోషములు కూడా ఉంటాయి. జీవాత్మ, పరమాత్మ ఇద్దరూ ఒకటే అయినందున జీవి చేసిన దోషాలు పరమేశ్వరుడికి కూడా సంక్రమిస్తాయి కదా. అప్పుడు పరబ్రహ్మకూడా దోషభూయిష్టుడు కాడా?" అన్నాడు కృష్ణశర్మ. దానికి సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 21 ఇతర వ్యపదేశాద్ధితా కరణాది దోషప్రసక్తిః

ఇతరవ్యపదేశాత్, హితకరణాది దోష ప్రసక్తిః

జీవుడికి బ్రహ్మత్వం చెప్పటంవల్ల, బ్రహ్మకు హితకరణాది దోషం వస్తుంది అంటారు.

తత్త్వమసి అనటంవల్ల జీవునియందలి దోషాలు బ్రహ్మకు అంటుతాయని, జీవాత్మా, పరమాత్మా రెండూ ఒక్కటే అనటంవల్ల జీవికుండే లక్షణాలన్నీ బ్రహ్మకు ఆపాదించబడతాయి. అప్పుడు బ్రహ్మ, దోష భూయిష్టుడౌతాడు. కాబట్టి అతడు జగత్కారణము అనటం వీలుపడదు. అని వాదము. ఛాందోగ్యోపనిషత్తులో ఉద్దాలకుడు శ్వేతకేతూ 'తత్త్వమసి' నీవే ఆత్మవి అంటాడు అలాగే ఐతరేయంలో మనుషులను సృష్టించి వారిదేహంలో ప్రవేశించాలి అనుకున్నాడు అని చెప్పారు. దీనివల్ల జీవాత్మా, పరమాత్మా ఒక్కటే అని తెలుస్తోంది. ఈ కారణంచేత బ్రహ్మకున్న సృష్టికర్తృత్వం జీవికికూడా వస్తోంది. అప్పుడు జీవుడికి ఉన్న జన్మజరాదులు అనే దోషాలు బ్రహ్మకు కూడా వర్తిస్తాయి కాబట్టి బ్రహ్మ జగత్కారణం అనటానికి వీలు లేదు అనివారి వాదన.

సూ. 22 అధికం తు భేద నిర్దేశాత్

అధికం, తు, భేదనిర్దేశాత్

సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు అయిన బ్రహ్మ జగత్కర్త. కాబట్టి అతనికి హితాహితీకరణ దోషాలు ఉండవు.

ఆత్మదర్శనం కావాలంటే దానిని గురించి వినాలి. తెలుసుకోవాలి. మననం చెయ్యాలి. ఆత్మ మననం చెయ్యదగ్గది. ఛాందోగ్యంలో ఆత్మనుగురించి చెబుతూ సుషుప్తిలో అది సత్ శబ్ద వాచ్యునితో కూడి ఉంటుంది అన్నారు. మరణకాలంలో జీవాత్మ పరమాత్మచేత అధిష్టితమై శబ్దం చేస్తూ పోతుంది. ఈ రకంగా కర్త కర్మ భేదంవల్ల జీవుడికి బ్రహ్మకు

భేదం చెప్పారు. ఈ భేదం ఉపాధి (శరీరం)కి సంబంధించినది మాత్రమే. పరబ్రహ్మకు హితము అహితము అనేవి లేవు. ఆయన నిర్గుణుడు. నిర్వికారుడు. ప్రేమ, దయ, అభిమానము ఏవీ లేనివాడు. కాబట్టి ఆయనకు దోషాలు అంటవు.

సూ. 23 అశ్మాదివచ్చ తదనుపపత్తిః

అశ్మాదివత్, చ, తదనుపపత్తిః

ఒకేరూపం గల బ్రహ్మ ఈ జగత్తును నిర్మించినప్పుడు కార్యాల్లో వైచిత్ర్యము ఉండకూడదు అని వారి వాదన.

భూమిలో నుంచి రాళ్ళు పుడుతున్నాయి. వాటిలో కొన్ని బండరాళ్ళు. కొన్ని కంకరరాళ్ళు, కొన్ని వజ్రాలు ఈ రకంగా వాటివిలువలో తేడాలున్నాయి. భూమిమీద పెరిగే మొక్కలలో కూడా ఈ తేడా ఉన్నది. ఒకచెట్టు కాయలు తియ్యగా ఉంటే, వేరొక దానివి పుల్లగా ఉంటాయి. మనం తీసుకునే ఆహారం జీర్ణమయి రక్తము, మాంసము, ఎముకలు, మజ్జ, గోళ్ళు, వెంట్రుకలుగా మారుతుంది. వీటన్నింటికీ రూపంలోను, ఉపయోగంలోనూ భేదం ఉన్నది. అదేవిధంగా ఒకే పరమాత్మ నుంచి పుట్టిన జగత్తులోనూ వైవిధ్యం ఉంటుంది. ఇందులో తప్పులేదు ఇదేమీ దోషం కాదు. అంటూ ఏడవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

8. ఉపసంహార దర్శనాధికరణము

"గురువుగారూ ! కుమ్మరివాడు కుండలు చెయ్యాలి అంటే కేవలము మట్టి మాత్రమే కాకుండా సారె, కర్ర, నీరు వంటి ఇతర సాధనాలు కావాలి కదా. మరి జగత్తును సృష్టిచేసే బ్రహ్మకు మాత్రం ఈ రకమైన ఇతరసాధనాలు అవసరం ఉండవా?" అన్నాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 24 ఉపసంహారదర్శనాన్నేతిచేన్న క్షీరవద్ధి

ఉపసంహారదర్శనాత్, న, ఇతిచేత్, న, క్షీరవత్, హి

పని చేసేవాడు సాధనాలను ప్రోగుచేస్తాడు. మరి బ్రహ్మకు ఇతర సాధనాలుండవా? అంటే కుమ్మరివాడు ఇతరసాధనాలు ఉపయోగిస్తాడు. మరి బ్రహ్మకు ఇతర సాధనాలు ఏవీ లేవు. కాబట్టి జగత్తుకు కారణం బ్రహ్మకాదు అనకూడదు. ఉపకరణాలు లేకపోయినా లోకంలో పని జరుగుతుంది. పాలు పెరుగుగా మారాలంటే ఏ సాధనము అవసరం లేదు. పాలను వేడి చేస్తున్నాం అనకండి. అవి తొందరగా తోడుకోవటానికి వేడి చేస్తున్నాం

అంతే. వేడి చెయ్యకపోయినా పెరుగవుతుంది. పాలల్లో పెరుగయ్యే గుణం లేకపోతే వాటిని వేడి చేసినా, ఇగరపెట్టినా పెరుగవదు. నీళ్ళని వేడి చేస్తే పెరుగవదు. మట్టిని వేడిచేస్తే పెరుగవదు. ఆ గుణం లేకపోతే దాన్ని ఏం చేసినా అది పెరుగవదు. అలాగే పరమాత్మ సర్వశక్తి సంపన్నుడు. సర్వగుణ సంపన్నుడు. కాబట్టి అతడికి ఇతర సాధనాలు ఏవీ అవసరం లేదు.

బ్రహ్మకు కార్యము కారణము లేదు. అతనితో సమానమైనవారు గాని, అతనికన్న అధికులుగాని లేరు. కాబట్టి అతడికి వేటి సాయము అవసరం లేదు.

సూ. 25 దేవాది వదపి లోకే

దేవాదివత్, అపి, లోకే

మంత్రశాస్త్రంలోను, ఇతిహాసాల్లోనూ కూడా దేవతాదులు అసహాయులై కార్యం చేస్తున్నారని చెప్పబడింది.

వేదాలు, పురాణాలు, ఇతిహాసాలలో దేవతలు, పితృదేవతలు ఏ సాధన సంపత్తి లేకుండానే సంకల్పబలం మాత్రంచేతనే మహత్తర కార్యాలు చేశారని చెప్పబడింది. సాలెపురుగు ఏ సహాయం లేకుండానే గూడు నిర్మిస్తుంది. కొంగ శుక్ర వీర్యాలు లేకుండానే గర్భధారణ చేస్తుంది. అలాగే బ్రహ్మకూడా ఏ సహాయము, సాధన సంపత్తి లేకుండానే జగన్నిర్మాణము చేస్తున్నాడని చెబుతు ఎనిమిదవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

9. కృత్స్నప్రసక్త్యధికరణము

"గురువుగారూ ! పాలు పెరుగుగా మారినట్లే పరబ్రహ్మ జగత్తుగా మారుతున్నాడని చెప్పారు కదా? ఇది పూర్తి పరిణామమా ? లేక కొంతభాగం మాత్రమేనా?" అంటూ అడిగాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 26 కృత్స్న ప్రసక్తిర్నిరవయవ శబ్ద కోపోవా

కృత్స్న ప్రసక్తిః, నిరవయవత్వ శబ్దకోపః, వా

అవయవాలు లేని బ్రహ్మ గనక పరిణామం చెందినట్లైతే, బ్రహ్మ పూర్తిగా కార్యరూపంలో పరిణామం చెందినట్లవుతుంది. కొంతభాగమే అయితే బ్రహ్మకు అవయవాలు వచ్చి, బ్రహ్మ నిరవయవుడు అన్న శ్రుతికి విరోధం వస్తుంది. ఏది ఎలా చూచినా బ్రహ్మ అనిత్యమవుతుంది. అందుచేత బ్రహ్మ జగత్తుకు ఉపాదాన కారణము కాలేదు. అని వారి వాదన.

బ్రహ్మపూర్తిగా పరిణామం చెందాడు అంటే జగత్తు బ్రహ్మ రెండూ ఒక్కటే. కొంతభాగమే పరిణామం చెందాడు అంటే, జగత్తు కాక బ్రహ్మ ఇంకా కొంతభాగం ఉన్నాడు. అని అంటే బ్రహ్మసాకారుడు. ఏదైనప్పటికీ వేదాలలో చెప్పిన విషయాలకు విరుద్ధమవుతుంది. కాబట్టి జగత్తుకు బ్రహ్మ ఉపాదాన కారణము కాదు. అని అంటారు.

సూ. 27 శ్రుతేస్తు శబ్దమూలత్వాత్

శ్రుతేః, తు, శబ్దమూలత్వాత్

బ్రహ్మము వేద ప్రమాణమైనది. కాబట్టి ఆ దోషం అంటదు.

ఛాందోగ్యోపనిషత్తులో "శుద్ధ బ్రహ్మ కార్య బ్రహ్మకన్న గొప్పది. పాంచభౌతికమైన జగత్తంతా శుద్ధ బ్రహ్మయొక్క ఒకపాదమే. మిగిలిన మూడు పాదాలు ఆ పరబ్రహ్మలోనే ఉన్నాయి. గాయత్రి ద్వారా ప్రతిపాదించబడి, మూడు పాదాలు గల అమృత స్వరూపమైన బ్రహ్మ ఇదే. ఆ పురుషునికి బయటా, లోపలా కూడా ఉన్న ఆకాశము ఒకటే. అని చెప్పబడింది. బ్రహ్మనికి వేదప్రమాణమున్నది. అందుచేత వారు చెప్పే దోషం బ్రహ్మకు అంటదు.

సూ. 28 ఆత్మనిచైవం విచిత్రాశ్చహి

ఆత్మని, చ, ఏవం, విచిత్రాః, చ, హి

బ్రహ్మలో ఇన్ని రకాల వస్తువులు సృష్టించబడినట్లే, స్వప్నాన్ని చూసే ఆత్మలోకూడా అనేక రకాలయిన సృష్టులు చెప్పబడ్డాయి.

ఈ జగత్తంతా బ్రహ్మయొక్క పరిణామము. కాబట్టి స్వప్న ప్రపంచంలాగా మాయతో కూడినది. ఈ జగత్తుకు బ్రహ్మఉపాదాన కారణమే అయినప్పటికీ, స్వప్నావస్తలోని సాక్షి వంటివాడు. కాబట్టి అతడికి దోషాలు అంటవు. గారడీ వాడి రూపం నాశనం కాకుండానే, అతడు సృష్టించిన అనేక వస్తువులు కనిపించినట్లుగానే బ్రహ్మలో కూడా ఈ విచిత్ర సృష్టులు కనిపిస్తున్నాయి.

సూ. 29 స్వపక్ష దోషాచ్చ

స్వపక్ష, దోషాత్, చ

ఈ దోషము సాంఖ్యులు చెప్పే మతంలో కూడా ఉన్నది. సాంఖ్యులు ప్రధానాన్ని జగత్కారణంగా చెబుతారు. ఆ ప్రధానముకూడా నిరవయవము, అపరిచ్ఛిన్నము అది సావయవము, పరిచ్ఛిన్నము అయిన జగత్తుకు కారణము అవుతోంది.

ఒకే దోషం అన్ని మతాలలోనూ ఉంది కాబట్టి దానిని లెక్కించనవసరం లేదు. ఈ జగత్తుకు బ్రహ్మ ఉపాదాన కారణమే. జగత్తువల్ల బ్రహ్మపరిపూర్ణతకు బాధ్యత లేదు. అంటూ తొమ్మిదవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

10. సర్వోపేతాధికరణము

"గురువుగారూ! బ్రహ్మ విచిత్రమైన కార్యశక్తి గలది అని చెప్పారు కదా! ఆ విషయం ఎలా తెలుస్తుంది?" అన్నాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 30 సర్వోపేతాచ తద్దర్శనాత్

సర్వోపేతా, చ, తద్దర్శనాత్

వేదాలలో పరదేవత శక్తి సంపన్నమైనది అని చెప్పబడింది.

ఛాందోగ్యోపనిషత్తులో పరమాత్మ స్థూల సూక్ష్మ రూపాలు లేనివాడు. చైతన్య స్వరూపుడు సత్యసంకల్పుడు. సర్వవ్యాపి, సమస్త కర్మలు స్వరూపంగా గలవాడు. సర్వకాముడు. సమస్త గంధములు, రసములు గలవాడు. జగత్తును వ్యాపించి ఉండేవాడు అని చెప్పబడింది. బృహదారణ్యకంలో యాజ్ఞవల్క్యుడు గార్గికి సమాధానం చెబుతూ "బ్రహ్మయొక్క శాసనం వల్లనే సూర్యచంద్రులు తమ స్థానాలలో ఉన్నారు." ముండకోపనిషత్తులో పరబ్రహ్మ స్వయంప్రకాసి నిరాకారుడు. బాహ్యాభ్యంతరాల్లో ఉండేవాడు. పుట్టుక, ప్రాణము లేనివాడు అని చెప్పబడింది. కాబట్టి బ్రహ్మకు విచిత్రమైన కార్యశక్తి ఉన్నది.

సూ. 31 వికరణత్వాన్నేతి చేత్తదుక్తమ్

వికరణత్వాత్, న, ఇతి, చేత్, తత్, ఉక్తమ్

బ్రహ్మకు ఇంద్రియాలు లేవు. నిరాకారుడు. నిరవయవుడు అని చెప్పబడింది. అలాంటి బ్రహ్మ జగత్తును ఏ విధంగా ఉత్పత్తి చేస్తాడు? అని వారి ప్రశ్న.

బ్రహ్మనిరాకారుడనే మాట నిజమే. అవయవాలు లేనివాడు. అయినప్పటికీ సర్వజ్ఞుడు. సర్వశక్తిమంతుడు. అంటూ పదవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

11. ప్రయోజనవత్త్వాధికరణము

సూ. 32 న ప్రయోజనవత్త్వాత్

న, ప్రయోజనవత్త్వాత్

ప్రవృత్తి అనేది ప్రయోజనాన్ని ఆశించి ఉంటుంది. పరబ్రహ్మ నిత్యతృప్తుడు. అందుచేత ప్రయోజనం ఉండదు, ప్రవృత్తి ఉండదు. అని వాదిస్తారు. అంటే ఈ జగత్తంతా బ్రహ్మచేతనే సృష్టించబడుతోంది. ఎవరు ఏ పనిచేసినా కొంత ప్రయోజనముంటుంది. బృహదారణ్యకంలో యాజ్ఞవల్క్యుడు మైత్రేయికి ఈ విషయమే చెబుతాడు. ప్రయోజనం లేనిదే ఎవరూ ఏ పనీ చెయ్యరు. మరిబ్రహ్మ ఏ ప్రయోజనం ఆశించి ఈ సృష్టి చేశాడు? అన్నది ప్రశ్న.

సూ. 33 లోకవత్తు లీలాకైవల్యమ్

లోకవత్, తు, లీలాకైవల్యమ్

లోకంలో గొప్పవారు ఏ ప్రయోజనం ఆశించకుండానే పనులు చేస్తారు. అలాగే పరమాత్మ కూడా ఏ అపేక్ష లేకుండానే ఈ సృష్టి చేస్తున్నాడు. ఈ జగత్తు అంతా ఈశ్వరలీల. అంటూ పదకొండవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

12. వైషమ్యనైర్ఘృణ్యాధికరణము

“గురువుగారూ ! పరమాత్మ ప్రాణులను వారివారి కర్మలను బట్టి సృష్టిస్తున్నాడా? లేదా? కర్మలనుబట్టి సృష్టిస్తే సృష్టి కర్మాధీనమవుతుంది. అలా కాకుండా అంటే కర్మలను పరిగణించకుండా సృష్టిస్తున్నాడు అంటే బ్రహ్మకు పక్షపాతము అంటుకుంటుంది. ఎందుకంటే పశువులు, పక్షులుగా పుట్టిన ప్రాణులు హింసింపబడుతున్నాయి. దేవతలు విలాసవంతులు ఈ విషయాన్ని వివరించండి అన్నాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 34 వైషమ్యనైర్ఘృణ్యేన సాపేక్షత్వాత్తథాహి దర్శయతి

వైషమ్య, నైర్ఘృణ్యే, న, సాపేక్షత్వాత్, తథా, హి, దర్శయతి.

పరమేశ్వరుడికి పక్షపాతము, నిర్దయత్వము అనే లక్షణాలు, దోషాలు లేవు. జీవులను కర్మానుసారమే సృష్టిస్తాడు. ఇలా చెయ్యటంవల్ల సృష్టి కర్మాధీనమవుతుంది. అనీశ్వరత్వం కలుగుతుంది అనే మాట తప్పు.

పరబ్రహ్మ జీవుల ధర్మాధర్మాలననుసరించి, సాపేక్షుడై ఈ విషమసృష్టి నిర్మాణం సాగిస్తున్నాడు. పరమేశ్వరుడు మేఘం వంటివాడు. అన్ని పంటలకు వర్షాన్నిస్తాడు. ధాన్యంలో ఉండే తేడా, ఆ విత్తనాలలోనే ఉన్నది. భగవద్గీతలో చెప్పినట్లుగా పరమేశ్వరుని ఎవరు ఏ విధంగా సేవిస్తారో, వారికి ఆ విధమైన ఫలమే వస్తుంది.

సూ. 35 న కర్మావిభాగాదితిచేన్నానాదిత్వాత్

న, కర్మావిభాగాత్, ఇతిచేత్, న, అనాదిత్వాత్

సృష్టికి పూర్వం ఏ విధమైన భేదమూ లేదు. కాబట్టి కర్మ అనేది లేదు. అలాంటప్పుడు ఈ విషమ సృష్టి ఎలా జరిగిందనేది ప్రశ్న. దీనికి సమాధానం,

సంసారమనేది అనాది అయింది. బీజాంకురములులాగా సృష్టి, కర్మలకు కార్యకారణ భావం ఉన్నది. అందుచేత కర్మను అనుసరించే సృష్టి జరిగింది.

ప్రళయం జరిగినప్పుడు కర్మపరిపక్వంకాని జీవులు తమ కర్మను తమతో మూట కట్టుకుని పరమేశ్వరునిలో లీనమయినాయి. మళ్ళీ సృష్టి జరిగినప్పుడు తమ కర్మానుసారము జన్మిస్తున్నాయి.

సూ. 36 ఉపపద్యతే చాప్యుపలభ్యతే చ

ఉపపద్యతే, చ, అపి, ఉపలభ్యతే, చ

సృష్టి అనేది చాలా కాలం నుంచీ జరుగుతున్నది. చెట్టు లేనిదే విత్తు లేదు. విత్తు లేనిదే చెట్టు లేదు. అలాగే కర్మలేనిదే జన్మలేదు. జన్మలేనిదే కర్మలేదు. ఈ రెండూ ఒక దానిని ఒకటి ఆశ్రయించుకుని ఉంటాయి. ప్రశ్నోపనిషత్తులో చెప్పినట్లుగా ప్రజాపతి సంతానాన్ని పొందాలనే కోరికగలవాడై తపస్సు చేశాడు. ఇక్కడ తపస్సు అంటే పూర్వకల్పంలో తాను చేసిన సృష్టిని ధ్యానించటము.

కాబట్టి సృష్టి వెనుకటి కల్పంలోలాగానే జరిగింది. ఈ సృష్టిలో బ్రహ్మకు ఏ విధమైన పక్షపాతమూ లేదు. జీవులన్నీ తమ కర్మానుసారమే ఉద్భవిస్తాయి. అంటూ పన్నెండవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

13. సర్వధర్మోపపత్త్యధికరణము

సూ. 37 సర్వధర్మోపపత్తేశ్చ

సర్వ ధర్మ ఉపపత్తేః, చ

జగత్తును సృష్టించటానికి కావలసిన సర్వజ్ఞత్వము, జగత్కారణత్వము, సర్వశక్తిత్వము అనే సమస్త ధర్మాలు పరబ్రహ్మకున్నాయి. కాబట్టి ఈ జగత్తును సృష్టించటానికి కారణము ఆ బ్రహ్మ తప్ప వేరుకాదు అంటూ పదమూడవ అధికరణను వివరిస్తూ ద్వితీయాధ్యాయంలో మొదటి పాదాన్ని పూర్తి చేశాడు రత్నాకరుడు.

ద్వితీయపాదం

ఈ పాదంలో సాంఖ్యులు మొదలైనవారి యుక్తుల్ని ఖండిస్తూ అవి ప్రమాణాలు కావని నిరూపిస్తున్నారు. ఇందులో 8 అధికరణలు, 45 సూత్రాలు ఉన్నాయి. అవి

వ.నెం.	అధికరణము	విషయము	సూత్రాలు
1.	రచనానుపత్త్యధికరణము	సాంఖ్యుల ప్రధానం జగత్కారణంకాదు	10
2.	మహద్దీర్ఘాధికరణము	వైశేషికుల సిద్ధాంతము	1
3.	పరమాణుజగదకారణత్వాధికరణము	పరమాణువాదనిరాకరణ	6
4.	సముదాయాధికరణము	బౌద్ధమతఖండన	10
5.	అభావాధికరణము	యోగాచారులమతఖండన	5
6.	నైకస్మిన్న సంభవాధికరణము	జైనమతఖండనము	4
7.	పత్యధికరణము	సాంఖ్య, పాతంజలి, తార్కిక మతఖండన	5
8.	ఉత్పత్త్యధికరణము	పాంచరాత్రాగమ మతఖండన	4
		మొత్తం సూత్రాలు	45

ఇక మొదటి అధికరణ చూద్దాం.

1. రచనానుపత్త్యధికరణము

"పురుషుడు తామరాకు మీద నీటిబొట్టులా ఉంటాడు. జగత్తుకు కారణము ప్రధానము. పురుషునికి భోగవస్తువులను సమకూర్చటానికే ప్రధానము అనేక రూపాలలో సృష్టించబడింది.

ఈ జగత్తు సుఖము, దుఃఖము, మోహములతో కూడి ఉంది. ఇవే త్రిగుణాలు. సుఖము-సత్వగుణము, దుఃఖము-రజోగుణము, మోహము – తమోగుణము, త్రిగుణాత్మక మైనదే జగత్తు" ఇది సాంఖ్యవాదము. ఇక్కడ ఈ వాదాన్ని ఖండించటం జరుగుతున్నది.

సూ. 1 రచనానుపపత్తేశ్చ నానుమానమ్
రచనాఅనుపపత్తేః, చ, న, అనుమానమ్

ఈ జగత్తంతా సుఖము, దుఃఖము, మోహములతో ఏర్పడింది. ఎందుకనంటే వాటినికూడి ఉన్నది కాబట్టి. ఇది కేవలము అనుమానం. ఈ అనుమాన ప్రమాణంతోనే ప్రధానమనేది జగత్తుకు ఉపాదాన కారణము అంటున్నారు. ప్రధానము జడము. దానినుంచే చిత్రవిచిత్రాలయిన వస్తువులు పుడుతున్నాయి.

ఏది దేనితోకూడి ఉన్నదో, దానికి అదే కారణము అని సాంఖ్యుల సిద్ధాంతము. జగత్తు సుఖ దుఃఖ మోహాలతో కూడి ఉన్నది కాబట్టి జగత్తుకు త్రిగుణాలే కారణము అని వారి వాదన. అయితే ప్రధానము అచేతనము, జడము. దానికి సృష్టించే శక్తి ఉండదు.

సూ. 2 ప్రవృత్తేశ్చ
ప్రవృత్తేః, చ

ప్రవృత్తి, ఆచరణలవల్ల కూడా ప్రధానమనేది ఈ జగత్తుకు కారణం కాదు. ఎందుకంటే ఈ ప్రవృత్తి అనేది లోకంలో చేతనమైన వాటికే ఉంటుంది. అచేతనాలకు ప్రవృత్తి అనేది ఉండదు. ఒకవేళ ఈ జగత్తు గనక అచేతనమైన ప్రధానంవల్ల సృష్టించబడి ఉంటే, మట్టితో తయారయిన కుండలాగా, వస్త్రంలాగా ఏ రకమైన చైతన్యము లేకుండా అలాగే పడి ఉండాలి అన్నాడు రత్నాకరుడు.

ఆ మాటలు విన్న కృష్ణశర్మ అడుగుతున్నాడు "గురువుగారూ ! అచేతనాల్లో కూడా ప్రవృత్తి కనిపిస్తున్నది కదా. పాలు అచేతనము. అవి దూడను పోషిస్తున్నాయి. అలాగే నీరు అందరికీ ఉపయోగిస్తోంది. అలాగే జడమైన ప్రధానము పురుషునికి భోగవస్తువు కావచ్చును కదా!"

ఈ మాటలు విన్న రత్నాకరుడు ప్రారంభించాడు.

సూ. 3 పయోంబువచ్చేత్తత్రాపి
పయోంబువత్, చేత్, తత్ర, అపి

దూడకోసం పాలు, లోకం కోసం నీరులాగానే పురుషుని కోసం ప్రకృతి రూపుదాలుస్తున్నాయనేది నిజం కాదు. వాటిల్లోకూడా చేతనప్రవృత్తి ఉన్నది.

లోకంలో జరిగే పనులన్నీ చేతనుడైన ఈశ్వరునిచే నడిపించబడతాయి. బృహదారణ్యంలో యాజ్ఞవల్క్యుడు చెబుతాడు. "అతడు వాయువులో ఉంటాడు. వాయువు అతన్నెరగదు. వాయువే అతని శరీరం. వాయువులో ఉంటూనే వాయువును నియంత్రిస్తాడు. అతడే అంతర్యామి అయిన నీ ఆత్మ జలంలో ఉంటాడు. దూడకు పాలిచ్చే ఆవు చేతనమే పాలు త్రాగేదూడ కూడా చేతనమే. అలాగే పల్లానికి ప్రవహించటమనేది నీటిప్రవృత్తి. ఇదంతా బ్రహ్మచైతన్యంవల్లనే జరుగుతోంది.

సూ. 4 వ్యతిరేకానవస్థితేశ్చానపేక్షత్వాత్
వ్యతిరేకానవస్థితేః, చ, అనపేక్షత్వాత్

ప్రధానానికి వ్యతిరేకమైన అప్రధానము ఏదీ లేదు కాబట్టి అచేతనమైన ప్రధానము జగత్కారణం కాదు.

సాంఖ్యమతం ప్రకారము త్రిగుణముల సమూహమే ప్రధానము. దీనికి మించినది ఇంకొకటి లేదు. పురుషుడు ప్రవర్తకుడు కాదు. నివర్తకుడూ కాదు. కేవలం ఉదాసీనుడు. ఏమీ పట్టనివాడు.

సాంఖ్యంకన్న ఇతర మతాల్లో ఈశ్వరుడు చేతనుడు, సర్వజ్ఞుడు. సర్వశక్తిమంతుడు. తన ఇష్టప్రకారము ప్రవృత్తిని నివృత్తులలో పాల్గొంటాడు.

సూ. 5 అన్యత్రాభావాచ్చ న తృణాదివత్

అన్యత్ర అభావాత్, చ, న, తృణాదివత్

గడ్డి క్రమంగా పరిణామం చెంది, పశువులకు ఆహారమై, చివరకు పాలుగా మారుతున్నది. ఆ విధంగా ప్రధానానికి స్వాభావిక పరిణామము ఉండదు.

గడ్డికి పాలుగా మారటము స్వాభావిక లక్షణం కాదు. ఆవులు, గేదెలు తిన్న గడ్డి మాత్రమే పాలుగా మారుతుంది. ఎద్దులు, దున్నలు తిన్న గడ్డి పాలుగా మారదు. అంటే గడ్డి పాలుగా మారటానికి ప్రత్యేకమైన కారణము వేరే ఉందన్నమాట. అయినా గడ్డి పాలుగా మారటమనేది గడ్డియొక్క స్వభావం కాదు. ఎందుకంటే ఒకవేళ అలా మారితే ఆవు, గేదెలతో పని లేదు. కాబట్టి ప్రధానంయొక్క పరిణామం గడ్డి మొదలైన వాటిలాగా స్వాభావికం అనటానికి వీలు లేదు.

సూ. 6 అభ్యుపగమేఽప్యర్థాభావాత్

అభ్యుపగమే, అపి, అర్థ, అభావాత్

పోనీ, ప్రధానానికి స్వాభావిక ప్రవృత్తి ఉన్నది అనుకుందాం. ఆ ప్రవృత్తికి తగిన ప్రయోజనం లేదు. అందువల్ల దోషం కలుగుతున్నది. అంటే ...

ప్రధానానికి ఇతర ప్రయోజనం ఏదీలేదు అన్నట్లయితే, ఈ ప్రధానమనేది పురుషునికి భోగాలనిస్తుందని అందుకే ప్రవృతమవుతున్నదని చెప్పటం సాంఖ్యులకు కష్టమవుతుంది. సాంఖ్యమతంలో పురుషుడు నిర్మలుడు, ఉదాసీనుడు, అన్ని విశేషాలు ఉన్నవాడు. అటువంటి పురుషుడికి ప్రధానం భోగాన్ని ఇవ్వలేదు. అందుచేత ప్రధానం పురుష ప్రయోజనం కోసం కాదు.

సూ. 7 పురుషాశ్మవదితిచేత్తథాపి

పురుష అశ్మ వత్, ఇతి, చేత్, తథాపి

గురువుగారూ ! ప్రధానం పురుష ప్రయోజనం కోసం కాదు అన్నారు బాగుంది. అయితే పురుషుడే ప్రధానాన్ని ప్రవృతం చెయ్యవచ్చును గదా! ఏ విధంగా అంటే, గ్రుడ్డివాడు ఒంటరిగా పోలేడు. అలాగే కుంటివాడు చకచకా నడిచిపోలేడు. ఇప్పుడు కళ్ళున్న కుంటివాడు, కాళ్ళున్న గ్రుడ్డివాడి భుజాలమీద కూర్చుని వెళ్ళటం లేదా? ఐస్కాంతము తాను కదలకుండానే ఇనుపముక్కను కదల్చటం లేదా? అదే విధంగా పురుషుడు ప్రధానాన్ని ప్రవృత్తం చెయ్యవచ్చును కదా!" అన్నాడు కృష్ణశర్మ.

ఆ మాటలు విన్న రత్నాకరుడంటున్నాడు "నిజమేనయ్యా. కుంటివాడి సాయంతో నడిపించబడే గ్రుడ్డివాడు అస్వతంత్రుడు. అలాగే ఇనుపముక్క కూడా. అలాగే పురుషుని ప్రేరణవల్ల ప్రవృతమయ్యే ప్రధానం అస్వతంత్రమవుతోంది. ఇది దోషం. అంతేకాకుండా, ఉదాసీనుడు, కూటస్థుడు, వికారరహితుడు అయిన పురుషుడు ప్రేరకుడు కావటం రెండవ దోషం. కుంటివాడు గ్రుడ్డివాడు. ఇనుపముక్క ఐస్కాంతముల సాన్నిధ్యం నిత్యం కాదు. కాని ప్రధాన పురుషుల సాన్నిధ్యం నిత్యం. కాబట్టి ఎప్పుడూ ఈ ప్రవృత్తి ఉంటూనే ఉంటుంది. కాబట్టి ప్రధానం ప్రవృతమవుతోందనటం మూడవ దోషం. అవిద్య అయిన ప్రధానాన్ని, చేతనమైన పురుషుని కలిపే తత్త్వం ఇంకొకటి ఏదీ లేదు.

సూ. 8 అంగిత్వానుపపత్తేశ్చ

అంగిత్వానుపపత్తేః, చ

అంతేకాదు గుణాలకు సంబంధించిన అంగాంగి భావం కూడా కుదరదు.

సత్వ రజ స్తమో గుణాలు మూడూ సామ్యావస్థను పొందిన స్థితినే ప్రధానము అంటారు. కాబట్టి ఈ మూడింటిలోనూ ఒకటి ఎక్కువ, ఒకటి తక్కువ లేదు. సామ్యావస్థలో ప్రధానానికి ప్రవృత్తి ఉండదు. ప్రవృత్తి కలగాలంటే సామ్యావస్థలో వికారం, కదలిక పుట్టాలి. ఆ రకమైన కదలిక కలిగించే పదార్థమేదీ లేదు. కాబట్టి ప్రధానానికి జగదుత్పాదక శక్తి లేదు.

సూ. 9 అన్యథానుమితౌచజ్ఞశక్తి వియోగాత్

అన్యథా, అనుమితౌ, చ, జ్ఞశక్తి, వియోగాత్

ఈ మూడు గుణాలు కార్యోత్పత్తికి అనుకూలంగా అంగాంగి భావాన్ని పొందుతాయని అనుకున్నప్పటికీ, ప్రధానంలో జ్ఞానశక్తి లేనందువల్ల జగన్నిర్మాణం జరగదు. జ్ఞానశక్తిలేని ప్రధానం జగత్తును నిర్మించలేదు. ఒకవేళ సాంఖ్యులు గనక ప్రధానానికి జ్ఞానశక్తి ఉన్నదని

ఒప్పుకుంటే, చేతనమైన పదార్థమే జగదుత్పత్తికి ఉపాదాన కారణమవుతుంది. అంటే బ్రహ్మమే జగన్నిర్మాణానికి కారకుడు అని అంగీకరించినట్లౌతుంది.

అంతేగాకుండా సామ్యావస్థలోకూడా, నిమిత్తం లేకుండానే త్రిగుణాలు మార్పు చెందుతాయి. అని గనక అంటే, అవి ఎప్పుడూ మార్పు చెందుతూనే ఉండాలి. అప్పుడు జగత్తే నిత్యమవుతుంది. మోక్షమనేది ఉండదు.

సూ. 10 విప్రతిషేధాచ్చాసమంజసమ్

విప్రతిషేధాత్, చ, అసమంజసమ్

సాంఖ్యమతంలో పరస్పర విభేదాలున్నాయి. 'ఈశ్వరుడు జగత్కారణము' అన్న మాట సాంఖ్యమతం ఒప్పుకోదు. వీరు మహత్తునుంచి తన్మాత్రలు వచ్చాయని ఒకసారి, అహంకారంనుంచి తన్మాత్రలు పుడుతున్నాయని ఒకసారి చెప్పారు. అలాగే కర్మేంద్రియాలు ఏడు (చర్మము మనస్సు కలిపి) అంటారు. ఇంకొకచోట ఐదే అంటారు. ఒకసారి ఇంద్రియాలు మొత్తం పదకొండు అంటారు. అంతఃకరణ అంటే బుద్ధి, మనస్సు, అహంకారము అంటారు. ఇంకోచోట బుద్ధి ఒక్కటే అంటారు. (మన లెక్కలో మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము) ఈ రకంగా వారి వాదనలో పొంతన అనేది ఉండదు.

కాబట్టి సాంఖ్యులు చెప్పే ప్రధానం జగత్కారణం కాదు. అంటూ మొదటి అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

2. మహద్దీర్ఘాధికరణము

ఇప్పటిదాకా సాంఖ్యమతాన్ని చెప్పి, ఇప్పుడు వైశేషిక మతాన్ని ఖండిస్తున్నారు. వైశేషిక మతాన్ననుసరించి కారణ పదార్థాలకుండే గుణాలతోనే కార్యాలు పుడతాయి. అంతేగానీ వేరే గుణాలు గలవి పుట్టవు. ఎర్రరంగు నూలుతో తయారయిన వస్త్రం, ఎర్రగానే ఉంటుందిగాని తెల్లగా ఉండదు. ఈ సిద్ధాంతం ప్రకారము చేతనమైన బ్రహ్మనుంచి పుట్టిన జగత్తు అచేతనం కావటానికి వీలు లేదు. అదికూడా చేతనమే కావాలి. కాని అలా కాలేదు. కాబట్టి జగదుత్పత్తికి కారణం చేతనమైన బ్రహ్మకాదు. ఇది వైశేషికులవాదన. అయితే వారి వాదాన్ని, వారి వాదంతోనే ఖండిస్తున్నారు.

సూ. 11 మహద్దీర్ఘవద్వా హ్రస్వపరిమండలాభ్యామ్

మహద్దీర్ఘవత్, వా, హ్రస్వపరిమండలాభ్యామ్

హ్రస్వములు, పరిమండలాలు, వీటివల్ల మహత్తులు దీర్ఘములు పుట్టినట్లే, చేతనమైన బ్రహ్మనుండి జగత్తు పుడుతున్నది. అనేది వైశేషికుల వాదన.

వైశేషికుల మతంప్రకారము జగసృష్టికి మూలము పరమాణువులు. రెండు పరమాణువులు కలిస్తే ద్వణుకములౌతాయి. ద్వణుకములు సంయోగం చెందితే త్ర్యణుకములౌతాయి. అలాగే చతురణుకములౌతాయి. ఈ రకంగా అణువులనుండి కొండలు, నదులు, పర్వతాలు, మొదలైన సృష్టి అంతా ఏర్పడుతుంది.

ఈ అణువులు ఒకదానితో ఒకటి కలిసినప్పుడు వాటి ఆకారము మారుతుంది.

ఒక అణువు యొక్క పరిమాణాన్ని	-	పారిమాండల్యపరిమాణము
అదిద్విగుణాలుగా మారినప్పుడు	-	హ్రస్వ పరిమాణము
త్ర్యణుకాలుగా మారినప్పుడు	-	దీర్ఘపరిమాణము

పొందుతాయి. అంటే పూర్వమున్న ఆకారం పొందకుండా క్రొత్త ఆకారం పొందుతాయి. ఈ విధంగా చూస్తే వారివాదన వారికే సమర్ధనీయం కాలేదు. అందుచేత చేతనమైన బ్రహ్మ నుండి చేతనమైన జగత్తే సృష్టించబడాలి అనే వాదన సరికాదు. అంటూ రెండవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

3. పరమాణుజగదకారణత్వాధికరణము

సూ. 12 ఉభయథాపి న కర్మాతస్తదభావః

ఉభయథా, అపి, న, కర్మ, అతః, తదభావః

రెండువిభాగాలుగాకూడా పరమాణువులందు సృష్టి జరగదు. కాబట్టి పరమాణువుల నుండి ద్వణుకం మొదలైన క్రమంలో సృష్టి జరగదు.

వైశేషికుల ప్రకారము అణువుల కలయికవల్లనే ఈ సృష్టి జరుగుతోంది. అయితే ఇక్కడ కర్మ ఏదీ లేదు అని వారంటారు. దారపుపోగులు వాటంతటవి వస్త్రంగా తయారుకావు. వాటిని కలిపి వస్త్రంగా తయారుచెయ్యాలి. ఇది కర్మ. అయితే ఈ కర్మ అనేది లేదు అని వారంటారు.

వైశేషిక మతంలో మొత్తం తొమ్మిది ద్రవ్యాలుంటాయి. వీటిలో పృథివి, జలము, అగ్ని, వాయువు అనే నాలుగు నిత్యములు. ఆకాశము, కాలము, దిక్కు, ఆత్మ, మనస్సు అనబడే ఐదు అనిత్యాలు. పరమాణువులు ఒకదానితో ఒకటి కలియటంవల్ల ఘట, పటాది (వస్త్రము) రూపాల్లో సృష్టి జరుగుతోంది.

ఇక ప్రళయం ఏ విధంగా జరుగుతుంది అంటే కొన్ని అణువులు కలిసి ఒక వస్తువు ఏర్పడింది. మళ్ళీ ఆ అణువులన్నీ విడిపోతే, ఆ వస్తువు ఉండదు. ఈ విధంగా అణువులు విడిపోవటమే ప్రళయము.

అయితే వారు చెప్పే క్రమాన్ని పరిశీలిస్తే అణువులు పర్వతంగానో, కొండగానో తయారవటానికి ఏ అవసరం లేదు. కాని మట్టికుండగా తయారవటానికి కర్మ అవసరమవుతుంది. కాని వారి వాదనలో కర్మ అనేది లేదు. అందుచేత వైశేషికుల వాదం సరికాదు.

సూ. 13 సమవాయాభ్యుపగమాచ్చ సామ్యాదనవస్థితేః
సమవాయాభ్యుపగమాత్, చ, సామ్యాత్, అనవస్థితేః

అన్యోన్య సంబంధాన్ని గనక అంగీకరించినట్లైతే భేదం సమ మవటంచేత అనవస్థా దోషం అంటే ఉపపావ్య, ఉపపాదకాలకు తెంపు లేకపోవటం అనే దోషం కలుగుతుంది.

పరమాణువుకు కొన్ని లక్షణాలున్నాయి. అవి రెండు కలిసినప్పుడు పరమాణువుల లక్షణాలు వదలి వేరే లక్షణాలు సంతరించుకుంటున్నాయి. ఈ రకంగా సంతరించుకోవటం చేత అనవస్తా దోషం అంతులేకపోవటం అనే దోషం కలుగుతున్నది. అందుచేత వీరి వాదన సరికాదు.

సూ. 14 నిత్యమేవచ భావాత్
నిత్యమ్, ఏవ, చ, భావాత్

పరమాణువాదంలో చాలా విచిత్రమైన స్థితి ఉన్నది. దీని ప్రవృత్తి స్వభావాన్ని అంగీకరిస్తే, ప్రవృత్తి నిత్యం అవటంవల్ల ప్రళయం ఉండదు. నివృత్తి వాదాన్ని అంగీకరిస్తే, నివృత్తి నిత్యమైనందున సృష్టి అనేది ఉండదు. కాబట్టి పరమాణువాదం కుదరదు.

ప్రవృత్తి స్వభావం – అంటే ఆ స్వభావంలో మార్పు ఉండదు కాబట్టి ఎప్పుడూ సృష్టి జరుగుతూనే ఉంటుంది లయం ఉండదు.

నివృత్తి స్వభావం – అంటే అణువులు నాశనమై పోతుంటాయి. కాబట్టి సృష్టి అనేది జరగదు. ఈ విధంగా చూస్తే సృష్టిగాని, ప్రళయంగాని, ఈ రెండింటిలో ఏదో ఒకటి మాత్రమే జరుగుతుంది.

సూ. 15 రూపాది మత్వాచ్చ విపర్యయో దర్శనాత్
రూపాదిమత్వాత్, చ, విపర్యయః, దర్శనాత్

వైశేషికులు పరమాణువులకు రూపము మొదలైనవి ఉన్నాయంటారు. కాని నిజ స్థితిలో వీరి వాదనలో తేడా కనిపిస్తోంది.

పృథివి, జలము, అగ్ని, వాయువు. వీటికి సంబంధించిన అణువులు నిత్యములు, నిరవయవములు, కుండ, వస్త్రములలో కూడా ఈ లక్షణాలున్నాయి అంటారు. కాని లోకంలో నూలు పోగులతో తయారయిన వస్త్రం, ఆ పోగులకన్న స్థూలంగా ఉంటుంది. అలాగే మట్టితో తయారయిన కుండ కూడా. కాబట్టి వీరు నిత్యము, నిరవయవత్వము అని చెప్పేవి స్థూలము, సావయవత్వముగా కనిపిస్తున్నాయి. కాబట్టి వీరివాదన సరికాదు.

మనం పంచీకరణ చెప్పినట్లుగానే వీరు

వాయువులో	–	స్పర్శ
అగ్నిలో	–	స్పర్శ, రూపము
జలములో	–	స్పర్శ, రూపము, రసము
భూమిలో	–	స్పర్శ, రూపము, రసము, గంధము

ఉన్నాయి. వాటివల్లనే ఈ సృష్టి జరుగుతోంది అంటారు. ఇవి ఒకదానికన్న ఒకటి స్థూలమైనవి. వీటివల్ల జగన్నిర్మాణం జరగదు.

సూ. 16 ఉభయథా చ దోషాత్
ఉభయథా, చ, దోషాత్

ఒకదానికన్న ఒకటి స్థూల సూక్ష్మాలని తారతమ్యం చెప్పినా, తారతమ్యం లేదని చెప్పినా రెండు విధాలుగానూ దోషమే ఉన్నది కాబట్టి పరమాణువాదం సరికాదు.

భూమిలో స్పర్శ, రూప, రస, గంధాలున్నాయి. కాబట్టి ఇది స్థూలము. జలంలో మూడు గుణాలున్నాయి. కాబట్టి భూమికన్న ఇది సూక్ష్మము. ఈ రకంగా అగ్ని ఇంకా సూక్ష్మం. వీటన్నింటిలోకీ వాయువు మరీ సూక్ష్మం. ఈ రకంగా వీటిలో తేడాలుండటం వల్ల, వీటికి కారణమైన పరమాణువులలో కూడా తేడాలుండి ఉంటాయి. ఇలా తేడాలున్నవి పరమాణువులు అని చెప్పటానికి లేదు. ఇది దోషం.

ఒకవేళ భూమిలో గంధము, జలంలో రసము, అగ్నిలో రూపము, వాయువులో రసము మాత్రమే ఉన్నాయి. వీటిమధ్య తారతమ్యాలు లేవు అని అంటే ఇదీ దోషమే. అందువల్ల అణువాదం సరికాదు.

సూ. 17 అపరిగ్రహాచ్చాత్యంత మనపేక్షా

అపరిగ్రహాత్, చ, అత్యంతమ్, అనపేక్షా

పరమాణువాదాన్ని మనువు మొదలైన శిష్టులు ఎవరూ అంగీకరించలేదు. అంటే మోక్షవాదులు దీనిని అంగీకరించరు.

పరమాణువాదం శిష్ట సమ్మతమూ కాదు, యుక్తి సమ్మతమూ కాదు. అందుచేత దీనిని అంగీకరించవలసిన అవసరం లేదు. అంటూ మూడవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

4. సముదాయాధికరణము

ఇప్పటిదాకా అణుసిద్ధాంతాన్ని నిరాకరించిన వ్యాసభగవానుడు ఇప్పుడు బౌద్ధమతాన్ని ఖండిస్తున్నాడు. బుద్ధుని ఉపదేశాలను ఆధారం చేసుకున్న శిష్యులు నాలుగు శాఖలుగా చీలిపోయారు. వారు వరుసగా

1. వైభాషికులు, 2 సౌత్రాంత్రికులు, 3. విజ్ఞానవాదులు, 4. సర్వశూన్యవాదులు

వీటిలో ముందుగా మొదటి ఇద్దరి వాదాన్ని ఉటంకిస్తున్నారు.

సూ. 18 సముదాయ ఉభయహేతుకేఽపితదప్రాప్తిః

సముదాయః, ఉభయహేతుకే, అపి, తదప్రాప్తిః

పరమాణు హేతుకమైన బాహ్యసముదాయము, స్కంధహేతువైన ఆధ్యాత్మ సముదాయంలో కూడా తమంతట తాముగా సముదాయం సిద్ధించదు.

లోకంలోని పదార్ధమంతా బాహ్యము, అభ్యంతరము అని రెండు విధాలు. బాహ్యపదార్ధం మళ్ళీ రెండు రకాలు. 1. భూతము 2. భౌతికము అభ్యంతర పదార్ధము కూడా రెండు విధాలు 1. చిత్తము 2. చైత్తము

1. భూతము అంటే – భూమి, జలము, అగ్ని, వాయువులు

2. భౌతికము అంటే – స్పర్శ, రూప, రస, గంధాలు

వీటిలో ఆకాశము, దాని లక్షణమైన శబ్దము లేవు. భౌతిక పదార్థాలన్నీ ఆ నాలుగు భూతాలకు సంబంధించినవే.

వీటిలో భూమికి సంబంధించిన పరమాణువులు – కఠిన స్వభావం గలవి.

జలానికి సంబంధించినవి – స్నేహస్వభావం గలవి

అగ్నికి సంబంధించిన పరమాణువులు – ఉష్ణస్వభావం గలవి

వాయువుకు సంబంధించిన పరమాణువులు – చలన స్వభావం గలవి

ఈ పరమాణువుల స్వరూపమే జగత్తు.

బాహ్యసముదాయం పరమాణు హేతువు. ఆధ్యాత్మిక సముదాయం స్కంద హేతువు. ఈ రెండూ అచేతనాలే. ఈ రెండు అచేతనాలను ఒకచోట చేర్చే సంధానకర్త ఒకడుండాలి. అటువంటివాడు ఉన్నాడని వీరు అంగీకరించటం లేదు.

సూ. 19 ఇతరేతర ప్రత్యయత్వాదితిచేన్నోత్పత్తి మాత్రనిమిత్తత్వాత్

ఇతరేతర, ప్రత్యయత్వాత్, ఇతిచేత్, న, ఉత్పత్తి మాత్రనిమిత్తత్వాత్

అవిద్యాదులు ఒక దానికి ఒకటి కారణమైనంత మాత్రంచేత, చేతనుడు లేకపోయినప్పటికీ ఉత్పత్తి జరుగుతుంది అని వారంటారు. అది నిజం కాదు.

అవిద్యాదులన్నీ ఒకదానికి ఒకటి పుట్టటానికి మాత్రమే కారణమవుతాయి. అంతేకాని సముదాయోత్పత్తికి మాత్రం కాదు. సముదాయోత్పత్తి కావాలంటే చేతనుడు ఉండాల్సిందే. కాబట్టి వీరివాదన సరికాదు.

సూ. 20 ఉత్తరోత్పాదేచ పూర్వనిరోధాత్

ఉత్తరోత్పాదే, చ, పూర్వనిరోధాత్

వీరి మతంలో ఉత్తర కార్యోత్పత్తి జరిగే సమయానికి, పూర్వకారణం నశిస్తోంది. కాబట్టి హేతువుకు అధీనమైన కార్యోత్పత్తి కూడా జరగదు.

వీరి మతానుసారము అవిద్య, సంస్కారము, విజ్ఞానము, నామము, రూపము మొదలైన వాటిలో అవిద్య వల్ల సంస్కారం పుడుతుంది. సంస్కారం పుట్టగానే అవిద్య నశిస్తుంది. సంస్కారం నుంచి విజ్ఞానం పుడుతుంది. విజ్ఞానం పుట్టగానే సంస్కారం నశిస్తుంది. విజ్ఞానం నుంచి నామం పుడుతుంది. నామం పుట్టగానే విజ్ఞానం నశిస్తుంది. ఈ రకంగా ఉత్తర కార్యాలు నశించినప్పుడు, పూర్వకార్యాలు నశిస్తాయి. నశించిన వస్తువు ఇంక ఉండదు. లేనిది కారణం కాదు కదా! కాబట్టి కారణాన్ని అనుసరించి కార్యోత్పత్తి జరగదు. ఇది ఒక దోషం.

సూ. 21 అసతి ప్రతిజ్ఞోపరోధోయౌగపద్య మన్యథా

అసతి, ప్రతిజ్ఞా, ఉపరోధః, యౌగపద్యమ్, అన్యథా

కారణం లేకుండానే కార్యం జరుగుతుంది. అని వారు చెప్పినదానికి భంగం కలుగుతుంది. అలా కాక కార్యం కలిగేంతవరకు కారణం ఉంటుంది. అన్నా వారు చెప్పేదానికి భంగం కలుగుతుంది.

బౌద్ధమతంలో ఇది ఎరుపు. ఇది నలుపు అనే జ్ఞానరూపమైన కార్యం పుట్టాలి అంటే పూర్వజ్ఞానము, చక్షుసు, ఆ లోకము (చూచుట) విషయము అనే నాలుగు హేతువులుండాలి. కాబట్టి కారణం లేకుండా కార్యం పుడుతుందని అంగీకరిస్తే వారి వాదనకు భంగం వస్తుంది. అలాగే కారణం ఉన్నప్పుడే కార్యం ఉంటుంది. అని అంగీకరించినా వారి వాదనకు భంగం వస్తుంది. ఎందుకంటే కార్యకారణాలు ఒకే కాలంలో ఉంటాయి కాబట్టి సర్వం క్షణికం అనే మాటకు భంగం వాటిల్లుతుంది. ఈ రకంగా బౌద్ధుల వాదన తప్పు అవుతోంది.

సూ. 22 ప్రతిసంఖ్యా ప్రతిసంఖ్యా నిరోధాప్రాప్తి రవిచ్ఛేదాత్

ప్రతిసంఖ్యా ప్రతిసంఖ్యా నిరోధ, అప్రాప్తిః అవిచ్ఛేదాత్

ఇక్కడ రెండు పదాలున్నాయి. 1. ప్రతి సంఖ్యా నిరోధము – బుద్ధి పూర్వకమైన నాశనము ఇదే స్థూలనాశనము.

2. అప్రతిసంఖ్యా నిరోధము – బుద్ధి పూర్వకము కాని నాశనము. సహజంగా జరిగే నాశనము.

ఈ రెండు వినాశనాలు బౌద్ధులు కల్పించుకున్నవే. వీరి భాషలో భావాలు అంటే కుండ, వస్త్రము మొదలైనవి. ఇవి ప్రతిక్షణం నశించి పోతుంటాయి. అంటే – వాటంతట అవే నశిస్తాయి. అలాంటప్పుడు బుద్ధి పూర్వకనాశనానికి అవకాశం లేదు.

వీరి మతం ప్రకారం ప్రతిక్షణం నశించటము అంటే కుండ వాటి మూల పదార్థమైన మట్టి నాశనం అయ్యే వరకు నశిస్తుంది అనాలి. నశించిన కుండే మళ్ళీ పుట్టింది అనాలి. అలాకాక ఇంకొక కుండ వచ్చింది అంటే వెనుకటి కుండ, ఇప్పటికుండ ఒకటే అని అనిపించదు. జాగ్రత్తగా పరిశీలించినట్లైతే కుండ, వస్త్రము మొదలయిన వస్తువులలో మట్టి, దారాల యొక్క అనుబంధం స్పష్టంగా కనిపిస్తుంది. కాబట్టి అప్రతి సంఖ్యానిరోధము బుద్ధి పూర్వకం కాని నాశనము జరగటం లేదు. కాబట్టి వారి వాదన తప్పు.

సూ. 23 ఉభయథా చ దోషాత్

ఉభయథా, చ, దోషాత్

అవిద్య అనేది జ్ఞానంవల్ల నశిస్తోందా? లేక తనంతటతానే నశిస్తోందా?

క్షణికములైన వాటిని శాశ్వతమని భావించటమే అవిద్య. యమ నియమాలతో కూడిన మార్గం ఈ అవిద్యను నిరోధిస్తుంది. అని బౌద్ధుల వాదన. జ్ఞానంవల్లనే అవిద్య నిరోధించబడుతోంది అంటే, అన్ని వస్తువులకు నాశనం ఏర్పడుతుందనే వాదన తప్పుకుంది. అలా కాకుండా దానంతట అదే అవిద్య నశించిపోతుంటే, సర్వం క్షణికం అన్న బుద్ధుని బోధలు తప్పవుతాయి. ఏ రకంగా చూసినా వీరి వాదనకు బలం లేదు.

సూ. 24 ఆకాశే చా విశేషాత్

ఆకాశే, చ, అవిశేషాత్

ఆకాశం అనేది ఒకవస్తువు కాదు అంటారు బౌద్ధులు. బౌద్ధమతంలో ఆకాశము అంటే ఆవరణ లేకపోవటము. అని అర్థం చెపుతూ, భూమిమొదలైన వాటిలాగా ఆకాశముకూడా ఒక వస్తువే అని భావించటం లేదు.

కాని ఆకాశం కూడా ఒక వస్తువే. ఆకాశము అంటే అవకాశం కల్పించేది. నేలమీద కుండను ఉంచినప్పుడు, ఆ కుండకు ఆధారంగా భూమి ఉన్నదనే భావం కలుగుతోంది. ఆకాశంలో పక్షులుగాని, విమానాలుగాని ఎగురుతున్నప్పుడు వాటికి ఆధారంగా నిలిచేది ఆకాశమే. ఈ విధంగా ఆకాశంకూడా ఒక వస్తువే. తైత్తిరీయోపనిషత్తులో చెప్పినట్లుగా పరబ్రహ్మ నుండి ఆకాశం పుట్టింది. ఈ రకంగా ఆకాశం కూడా ఒక వస్తువులాగానే పుట్టింది. అని ఉపనిషత్తులలో చెప్పబడింది. కాబట్టి ఆకాశం కూడా ఒక వస్తువు లాంటిదే.

సూ. 25 అనుస్మృతేశ్చ

అనుస్మృతేః, చ

బౌద్ధుల వాదం ప్రకారం సర్వము క్షణికం, అంటే ఆత్మకూడా క్షణికమే అంటారు. కాని అది నిజం కాదు.

ఆత్మ శాశ్వతమైనది. అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ ఉండేదే. ఆత్మే నిత్యము సత్యమైనది. ఈ విషయం ఉపనిషత్తులలో స్పష్టంగా అనేకసార్లు చెప్పబడింది. కాబట్టి ఆత్మ క్షణికమైనది అని చెప్పే బౌద్ధుల వాదన తప్పు.

సూ. 26 నా సతోఽదృష్టత్వాత్

న, అసతః, అదృష్టత్వాత్

అసత్తు, అభావం నుండి ఏమీ పుట్టదు. బౌద్ధమతంలో స్థిరమైనది అంటూ ఏమీ లేదు. సర్వమూ క్షణికం. విత్తనం నుండి మొలక పుడుతోంది. అంటే విత్తనం తన

రూపాన్ని కోల్పోయి అభావరూపం పొందుతుంది. తరువాత అంకురం వస్తోంది. కాబట్టి బీజం యొక్క అభావభావం నుండి (లేకపోవటమనే దాని నుండి) వస్తువు పుడుతోంది. అని వారి వాదం.

అభావం నుంచి భావం ఎప్పుడూ పుట్టదు. లేని వస్తువు నుంచి ఉన్న వస్తువు ఎలా పుడుతుంది? అభావానికి కారణమయ్యే శక్తి ఉండదు. కుందేటి కొమ్ము నుండి ఏమీ పుట్టదు. బీజం నశించినప్పుడు కూడా అందులోని బీజవాయువులే అంకురానికి కారణమవుతాయి. అంతే కానీ పప్పుబద్దల్లాగా ఉండే బీజదళాల నాశనాన్ని చూసి బీజం అంతా నశించిందనుకోవటం తప్పు.

సూ. 27 ఉదాసీనానామపి చైవం సిద్ధిః

ఉదాసీనానామ్, అపి, చ, ఏవం, సిద్ధిః

అభావం నుండి భావం పుడుతుందనే మాట అబద్ధం. ఈ మాటే గనక నిజమైతే వ్యవసాయం చెయ్యవలసిన అవసరం లేదు. ఇంట్లో కూచుని కోరుకుంటే చాలు కోరికలు నెరవేరాలి. ఈ రకంగా కష్టపడకుండా కోరికలు తీరితే కర్మ చెయ్యాల్సిన పనే ఉండదు. స్వర్గ నరకాలుండవు.

కాబట్టి బౌద్ధులవాదం సరియైనది కాదు. అంటూ నాల్గవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

5. అభావాధికరణము

ఈ అధికరణలో యోగాచారుల మతాన్ని ఖండిస్తున్నారు. యోగాచారుల ప్రకారం బాహ్యపదార్థాలనేవి లేవు. వీరి మతం ప్రకారము విజ్ఞానమనేది ఒక్కటే ఉన్నది. మనకు కనిపించే ఎరుపు, తెలుపు, నీలము రంగులన్నీ విజ్ఞానం యొక్క ఆకార విశేషాలే. కలలో కనిపించేవి కూడా విజ్ఞానం యొక్క ఆకార విశేషాలే. ఈ విధంగా సర్వత్రా విజ్ఞానమే బాహ్యాకారాన్ని పొందుతున్నదని వీరి వాదన.

సూ. 28 నాభావ ఉపలబ్ధేః

న, అభావః, ఉపలబ్ధేః

విజ్ఞానం కన్న ఇతర పదార్థాలు లేవనేవి నిజం కాదు. బాహ్యపదార్థాలు గోడ, కుండ, వస్త్రము లాంటివి కంటికి కనిపిస్తున్నాయి. అలాంటప్పుడు విజ్ఞానం తప్ప ఇతర వస్తువులు లేవనటం సరికాదు.

సూ. 29 వైధర్మ్యాచ్చ న స్వప్నాదివత్

వైధర్మ్యాత్, చ, న, స్వప్నాదివత్

స్వప్నావస్థకూ, జాగ్రదావస్థకూ భేదం ఉన్నది. స్వప్నంలో కనిపించిన వస్తువుల్లాగా జాగ్రదావస్థలో కూడా విజ్ఞానం తప్ప ఇతర పదార్థాలేమీ లేవు. అనే వాదన తప్పు.

యోగాచార్యులు జాగ్రదావస్థలో ఉన్నవేవీ కూడా విజ్ఞానంకన్న భిన్నమైనవి, తెలుసుకోవలసినవి కాదు. స్వప్నావస్థలోని విజ్ఞానం లాంటిదే జాగ్రదావస్థలో కూడా అంటారు. ఇది సరికాదు. స్వప్నానికి జాగ్రత్తకు పోలిక లేదు. కలలో కనిపించిన వస్తువు, మెలకువ రాగానే కల కరిగిపోతుంది. కాని జాగ్రదావస్థలో అలా కాదు. ఈ వస్తువులు అలాగే ఉంటాయి. అందరికీ ఉన్నట్లుగానే కనిపిస్తాయి. (స్వప్నంలో మన ఒక్కరికే కనిపిస్తాయి) కలలో కనిపించిన దానికి, దాని అనుభవానికి కారణం గుర్తు ఉండటం. కాని జాగ్రత్తలో ప్రత్యక్షానుభవం ఉన్నది. వస్తువును తాకుతున్నాం. అనుభవిస్తున్నాం. అందరికీ చూపిస్తున్నాం. ఇంకొకరికి ఇస్తున్నాం. ఈ రకంగా జాగ్రస్వప్నాలకు తేడా ఉన్నది. స్వప్నావస్థ లాంటిదే జాగ్రదావస్థకూడా అనటం తప్పు.

సూ. 30 న భావోఽనుపలబ్ధేః

న, భావః, అనుపలబ్ధేః

యోగాచారుల ప్రకారం బాహ్యపదార్థాలు లేవు. కాబట్టి వాటివలన వచ్చే వాసనలు కూడా ఉండవు అంటారు.

వీరి మతానుసారము బాహ్యపదార్థాలు లేవు. కాబట్టి వాసనలు, సంస్కారాలు కూడా ఉండవు. వాటి అనుభవం కూడా ఉండదు. అనుభవం ఉంటేనే గాని వాసనలు, సంస్కారాలు జనించవు. కాబట్టి వాసనా వైచిత్ర్యంవల్ల జ్ఞానవైచిత్ర్యం కలుగుతోంది అనటం సరికాదు. వాసనే లేనప్పుడు దానివల్ల జ్ఞానం కలగటం అసంభవం.

సూ. 31 క్షణికత్వాచ్చ

క్షణికత్వాత్, చ

ఆలయ విజ్ఞానం కూడా క్షణికం అన్నారు కాబట్టి అదికూడా వాసనలకు ఆశ్రయం కాలేదు.

ఆలయ విజ్ఞానము అంటే – ఈ మతంలో నేను, నేను అంటూ అందరికీ ఎప్పుడూ అన్వయించే జ్ఞానపరంపర. ఇటువంటి ఆలయ విజ్ఞానమే వాసనలకు ఆశ్రయం అని వీరంటారు.

శూన్యవాదులు ఈ ఆలయ విజ్ఞానాన్ని క్షణికము అంటారు. కాబట్టి ఆలయ విజ్ఞాన పరంపర వాసనలకు ఆశ్రయం కాజాలదు.

సూ. 32 సర్వథానుప పత్తేశ్చ

సర్వథా, అనుపపత్తేః, చ

ఏ విధంగా చూసినా బౌద్ధదర్శనం ఆమోదం కాదు. వీరు చెప్పే బాహ్యార్థవాదం, విజ్ఞాన వాదం, శూన్యవాదం, ఏవీ యుక్తియుక్తంగా లేవు. పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. కాబట్టి ఈ మతం అంగీకారం కాదు. అంటూ ఐదవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

6. నైకస్మిన్న సంభవాధికరణము

ఈ అధికరణలో జైనమతాన్ని ఖండిస్తున్నారు.

సూ. 33 నైకస్మిన్న సంభవాత్

న, ఏకస్మిన్, అసంభవాత్

ఒకే వస్తువులో విరుద్ధమైన ధర్మాలుండటం అసంభవం కాబట్టి వీరి సిద్ధాంతం అంగీకార యోగ్యం కాదు. ఒకే వస్తువుకు అనేక రూపాలుండవు. విషయాన్ని చెప్పేటప్పుడు ఫలానా అని ఖచ్చితంగా నిర్ధారణ చెయ్యకపోతే, అది ప్రమాణం కాదు. జైనమతం ఏ విషయాన్నీ ఖచ్చితంగా చెప్పదు. ఉండచ్చు, ఉండకపోవచ్చు. అంటుంది కాబట్టి వీరి వాదం సరికాదు.

సూ. 34 ఏవంచాత్మా కార్త్స్న్యమ్

ఏవం, చ, ఆత్మాకార్త్స్న్యమ్

జైనమతంలో ఆత్మకు పరిచ్ఛిన్నత్వము అనే దోషం కలుగుతోంది. కాబట్టి ఆత్మకూడా మిగిలిన వస్తువులకు మల్లేనే అనిత్యమవుతున్నది.

జైనమతం ప్రకారము శరీర పరిమాణము ఎంత ఉంటుందో, ఆత్మ పరిమాణము అంతే ఉంటుంది. ఇలా అనటంవల్ల ఆత్మకు శాశ్వతత్వం పోయి శరీరంలాగానే చెప్పబడుతుంది. అంటే ఆత్మ అనిత్యమవుతోంది. ఇది ఈ మతంలోని దోషం.

ఆత్మ శరీరమంత పరిమాణం కలిగి ఉంటుంది అనటం తప్పు. ఎందుకంటే ఒక జీవి శరీరం పెద్దది ఇంకొక జీవి శరీరం చిన్నది ఉంటుంది. అలా అయినప్పుడు పెద్దదైన ఏనుగు శరీరంలో అంత పెద్ద ఆత్మ, చిన్నదైన చీమ శరీరంలో చిన్న ఆత్మ ఉండాలి. ఒక

వేళ ఆత్మకు ఒకే పరిమాణముంటే, పెద్ద, చిన్న శరీరాలలో అది ఇమడటానికి ఇబ్బంది పడాలి.

సూ. 35 న చ పర్యాయాదప్య విరోధో వికారాదిభ్యః

న, చ, పర్యాయాత్, అపి, అవిరోధః, వికారాదిభ్యః

జీవికి క్రమంగా అవయవాలు వస్తాయి. ఆత్మకూడా శరీరమంతా ఉంటుంది కాబట్టి దీనికి కూడా ఈ దోషాలు (అవయవాలు) వస్తాయి. ఆత్మ అనిత్యము అంటున్నారు కాబట్టి మోక్షం లేదు.

వికారం (మార్పు) చెందటం జీవుడికి ఉన్నది అని గనక అంటే, ఆత్మ అనిత్యమవుతుంది. గతజన్మలో పశువు. ఈ జన్మలో మనిషి. మరి పశువుగా ఉన్నప్పటి అవయవాలు కృశించి ఇప్పుడు మనిషి అవయవాలు వస్తాయా? ఈ రకంగా జీవికి వికారం వస్తుందా? ఆత్మకు నాశనము ఉన్నదా? ఆత్మ నాశనమయితే మోక్షం మాట ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానాలు లేవు.

జైన మతంలో మోక్షం పొందే సమయానికి ఉండే జీవుని శరీర పరిమాణమే నిత్యము అంటారు.

సూ. 36 అంత్యావస్థితేశ్చోభయ నిత్యత్వాద విశేషః

అంత్యావస్థితేః, చ, ఉభయనిత్యత్వాత్, అవిశేషః

మోక్షావస్థలోని పరిమాణం నిత్యము అయినట్లైతే, ముందు ఉన్నవి కూడా నిత్యమే కావాలి. ఆది మధ్య అంతము అన్నీ సమానంగానే ఉండాలిగాని ఒకటి నిత్యము, ఇంకొకటి అనిత్యము కావు. అందుకే ఈ మతం అప్రమాణము. ఆమోదయోగ్యం కాదు అంటూ ఆరవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

7. పత్యధికరణము

"గురువుగారూ ! పరమాత్మ ప్రధానతత్త్వానికీ, పురుష తత్త్వానికీ ప్రేరకుడు. ఈ పరమాత్మ ప్రపంచానికి నిమిత్తకారకుడే తప్ప ఉపాదానకారకుడుకాదు. అని మాహేశ్వరులు అంటున్నారు కదా. మరి వారి మాట ఏమిటి?" అన్నాడు కృష్ణశర్మ. ఆ మాటలు విన్న రత్నాకరుడు ఈ విధంగా చెబుతున్నాడు.

మాహేశ్వరులు అంటే శివుణ్ణి ఆరాధించేవారు. వీరు శైవులు, పాశుపతులు, కాపాలికులు, కారుణిక సిద్ధాంతులు అని నాలుగు రకాలుగా ఉన్నారు.

సూ. 37 పత్యురసామంజస్యాత్

పత్యుః, అసామంజస్యాత్

పరమేశ్వరుడు ప్రకృతి మొదలైన వాటన్నింటికీ ప్రేరకుడు కాబట్టి కేవలం నిమిత్త కారకుడు అంటారు. అది తప్పు. ఈ రకంగా అంటే అతనియందు రాగద్వేషాలు ఆపాదించబడతాయి.

పాశుపతులు అనుమాన ప్రమాణంతో పరమేశ్వరుడున్నాడని, అతడు ప్రకృతిని, పురుషుణ్ణి (ఆత్మను) ప్రేరేపిస్తున్నాడని, ఆ కారణంగానే సృష్టి జరుగుతోంది అని అందుచేత పరమేశ్వరుడు కేవలం నిమిత్తకారణుడు అంటారు. ఇది సరికాదు. ఇలా గనక జరిగితే సృష్టిలో కొంతమందిని సుఖవంతులుగా మంచివారుగా, కొంతమందిని దుఃఖితులుగా, చెడ్డవారుగా సృష్టిస్తున్నాడు అనాలి. అలా అయితే అతడికి రాగద్వేషాలున్నట్లవుతుంది. ఇది వేదవిరుద్ధం. కాబట్టి ఈ వాదం సరికాదు.

సూ. 38 సంబంధానుపపత్తేశ్చ

సంబంధ, అనుపపత్తేః, చ

ప్రేరేపించబడే ప్రకృతికి, ప్రేరకుడైన ఈశ్వరునికి సంబంధం లేదు. కాబట్టి ఈ మతం సరికాదు.

పరమేశ్వరుడు ప్రకృతికి, పురుషునికి ప్రేరకుడు అన్నారు. మరి ప్రేరకుడికి, ప్రేరేపించే వాడికి సంబంధం ఏమిటి? సంబంధం లేకపోతే అతడు ప్రేరకుడు అనటం కుదరదు.

వారి మతం ప్రకారము ప్రకృతి, పురుషుడు, పరమేశ్వరుడు. ఈ మూడు తత్త్వాలు నిరవయవాలు. సర్వవ్యాపకాలు. వీటికి సంయోగము ఉన్నది అంటారు. ఇది సంభవం కాదు. అవయవాలుంటేనే సంయోగముంటుంది. లేకపోతే ఈ సంబంధం ఉండదు. కాబట్టి వీరి వాదం సరికాదు.

సూ. 39 అధిష్ఠానానుపపత్తేశ్చ

అధిష్ఠాన, అనుపపత్తేః, చ

రూపం లేని ప్రకృతికి ప్రేరకుడు కానందువల్లఈశ్వరుడు నిమిత్త కారణుడు అవడు.

ప్రకృతి రూపం లేనటువంటిది. రూపరహితమైన ప్రకృతిని ప్రేరేపించి ఈశ్వరుడు సృష్టి చేస్తున్నాడనటం సమంజసం కాదు.

సూ. 40 కరణవచ్చేన్న భోగాదిభ్యః

కరణవత్, చేత్, న, భోగాదిభ్యః

ఇంద్రియాలు జీవునిచేత ప్రేరేపించబడి పని చేస్తున్నాయి. అలాగే ప్రకృతిని ఈశ్వరుడు ప్రేరేపిస్తున్నాడు అని చెప్పరాదు. అలా చెబితే జీవుడిలాగా ఈశ్వరుడికి కూడా భోక్తృత్వము వస్తుంది. అప్పుడు ఈశ్వరత్వానికే లోపం వస్తుంది.

సూ. 41 అంతవత్త్వమసర్వజ్ఞతావా

అంతవత్త్వమ్, అసర్వజ్ఞతా, వా

ఈశ్వరుడు ప్రకృతిది, పురుషుడుది, తనది అయిన సంఖ్యా పరిమాణాన్ని నిశ్చయిస్తాడా, నిశ్చయించడా? ఇక్కడ నిశ్చయిస్తే పరిచ్ఛిన్నత్వ దోషము. నిశ్చయించకపోతే అసర్వజ్ఞత్వ దోషము వస్తుంది.

ఈశ్వరుడు సర్వజ్ఞుడు, అనంత స్వరూపుడు. అతడు ప్రధాన, పురుషుల, తనయొక్క పరిమితిని గుర్తిస్తున్నాడా? లేదా? గుర్తిస్తున్నాడు అంటే అతనికి అంతముంటుంది గుర్తించకపోతే సర్వజ్ఞుడు కాదు. అందుచేత వీరి వాదము అసమంజసము అంటూ ఏడవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

8. ఉత్పత్త్యధికరణము

ఈ అధికరణలో పాంచరాత్రుల మతాన్ని ఖండిస్తున్నారు. ఈ మతాన్నే భాగవత మతము అంటారు.

ఈ మతంలో భగవంతుడు వాసుదేవుడు. అతడు నిర్వికారుడు, నిరంజనుడు, జ్ఞానస్వరూపుడు, ఇతడే ఈ జగత్తుకు ఉపాదాన, నిమిత్త కారణము. వాసుదేవుని నుండి సంకర్షణుడు (జీవుడు) అతని నుండి ప్రద్యుమ్నుడు (మనస్సు) అతని నుండి అనిరుద్ధుడు (అహంకారము) పుడుతున్నారు. భక్తులు భగవంతుణ్ణి పరిపరివిధాల ఆరాధించి చివరకు పరమపదం చేరతారు.

వీరికి వైదికమతానికీ పెద్దగా తేడా ఏమీ లేదు. ఉన్నదల్లా ఒక్కటే అది. వాసుదేవుని నుండి సంకర్షణుడనే జీవుడు పుడుతున్నాడనటం. అది సరికాదు.

సూ. 42 ఉత్పత్త్య సంభవాత్

వాసుదేవుని నుండి జీవుడు ఉద్భవించటం అసమంజసము, ఇలా చెప్పటంవల్ల జీవి అనిత్యుడు, అని, అతనికి ఉత్పత్తి లేదని చెప్పాలి. మరి అనిత్యమైన జీవుడికి మోక్షంకూడా ఉండదు.

సూ. 43 న చ కర్తుః కరణమ్

న, చ, కర్తుః, కరణమ్

కర్త నుంచి సాధనం పుట్టదు. ఇక్కడ కర్త రూపం సంకర్షణుడు (జీవి) అతని నుండి మనస్సు, అతని నుండి అహంకారము పుట్టవు. ఈ ప్రక్రియకు వేదప్రమాణం లేదు.

సూ. 44 విజ్ఞానాది భావే వా తదప్రతిషేధః

విజ్ఞానాదిభావే, వా, తత్, అప్రతిషేధః

సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధులు వాసుదేవునిలాగే ఐశ్వర్యము, బలము గలవారే అని చెప్పినట్లైతే, ఒకే ఈశ్వరునితో సృష్టికార్యము జరిగేటప్పుడు, నలుగురు ఈశ్వరులు అనవసరం. వీరందరినీ సమానులుగా ఒప్పుకుంటే వాసుదేవుడొక్కడే పరతత్త్వం అనే మాట అబద్ధమవుతుంది.

సూ. 45 విప్రతిషేధాచ్చ

విప్రతిషేధాత్, చ

ఈ రకంగా పరస్పర విభేదాలున్నాయి కాబట్టి ఈ మతం సరికాదు. అంటూ ద్వితీయాధ్యాయంలో ద్వితీయపాదాన్ని పూర్తి చేశాడు రత్నాకరుడు.

తృతీయ పాదం

ఈ పాదంలో పంచమహాభూతాలు, జీవుడు మొదలైన వాటి గురించి శ్రుతులలో ఉన్న తేడాలను పరిహరిస్తున్నారు. ఇందులో 17 అధికరణలు, 53 సూత్రాలు ఉన్నాయి.

వ.నెం.	అధికరణము	విషయము	సూత్రాలు
1.	వియదధికరణము	ఆకాశానికి ఉత్పత్తి ఉన్నది	7
2.	మాతరిశ్వాధికరణము	వాయువు ఆకాశం నుండి ఉత్పత్తి అయింది	1
3.	అసంభవాధికరణము	బ్రహ్మకు పుట్టుక లేదు	1
4.	తేజోధికరణము	వాయువు నుంచి అగ్ని పుడుతోంది	1
5.	అబధికరణము	అగ్ని నుంచి జలం పుడుతున్నది	1
6.	పృథివ్యధికారాధికరణము	జలంనుంచి భూమి పుడుతున్నది	1
7.	తదభి ధ్యానాధికరణము	బ్రహ్మమే అన్నిటిని సృష్టించిన తత్త్వము	1
8.	విపర్యయాధికరణము	బ్రహ్మయందు లయము	1
9.	అంతరావిజ్ఞానాధికరణము	ఇంద్రియాలవల్ల భూత సృష్టి లయాలకు భయం లేదు	1
10.	చరాచరవ్యపాశ్రయాధికరణము	జీవుని ఉత్పత్తి లయము నిజం కాదు	1
11.	ఆత్మాధికరణము	జీవికి జనన మరణాలు లేవు	1
12.	జ్ఞాధికరణము	జీవి నిత్యజ్ఞానస్వరూపుడు	1
13.	ఉత్క్రాంతిగత్యధికరణము	జీవుని పరిమాణ విమర్శనము	14
14.	కర్త్రధికరణము	జీవుడే కర్త	7
15.	తక్షాధికరణము	వడ్రంగి లా ఉపాధివల్ల జీవుడు కర్త అవుతున్నాడు	1
16.	పరాయత్తాధికరణము	జీవుని కర్తృత్వం పరమేశ్వరాధీనం	2
17.	అంశాధికరణము	బ్రహ్మతో జీవికి గల సంబంధం	11
		మొత్తం సూత్రాలు	53

ఇక మొదటి అధికరణ చూద్దాం.

1. వియదధికరణము

"గురువుగారూ ! పంచభూతాలలో ఆకాశం మొదటిది. మరి ఈ ఆకాశానికి అసలు ఉత్పత్తి ఉన్నదా? శ్రుతులలో కూడా దీనిమీద భిన్నవాదనలున్నాయి. దయచేసి దానిని గురించి వివరించండి" అన్నాడు కృష్ణశర్మ. శిష్యుడి అనుమానం తీర్చటం ప్రారంభించాడు రత్నాకరుడు.

సూ. 1 న వియద శ్రుతేః

న, వియత్, అశ్రుతేః

ఆకాశము యొక్క ఉత్పత్తిని గురించి శ్రుతులు చెప్పటంలేదు. కాబట్టి ఆకాశం ఉత్పత్తి లేదు. అని కొందరి వాదన. దీనికి కారణం ఏమిటంటే ఛాందోగ్యోపనిషత్తులో ఉద్దాలకుడు, తన కుమారుడైన శ్వేతకేతువుకు ఆత్మజ్ఞానం బోధిస్తూ, "శ్వేతకేతూ, సృష్టికి పూర్వం ఈ ప్రపంచం నామరూపాలతో కూడిలేదు. అప్పుడు కేవలము అద్వితీయమైన 'సత్తు' మాత్రమే ఉన్నది. నామరూపాలు, పదార్థాలు ఏవీ లేవు. సత్తు అంటే – ఉనికి, సత్యము అని అర్థము. అన్నిటికన్నా పూర్వమైనది, రెండు కానిది, మొదటగా ఉన్నది ఏకైకమైన పరబ్రహ్మ. ఆ తత్త్వం అనేకం కావాలనుకుంది. రకరకాల రూపాలతో వస్తువులుగా జీవించాలనుకుంది. జీవులుగా రూపుదాల్చింది. ద్రవ ఘన వాయు పదార్థాలుగా మార్పు చెంది, అనేక రూపాలతో సృష్టి ఆకారం పొందింది.

తాను అనేకం కావాలనుకున్న 'సత్తు' ముందుగా అగ్నిని సృష్టించింది. అగ్నినుండి జలము, జలము నుండి పృథివి వచ్చాయి. వీటివల్లనే అన్నం పుట్టింది.

ఈ రకంగా పంచభూతాలలో అగ్ని, జలము, భూమి మూడింటినే చెప్పారు. ఆకాశాన్ని గురించి చెప్పలేదు. కాబట్టి ఆకాశం లేదు అని వారి వాదన.

సూ. 2 అస్తితు

అస్తి, తు

కాని వేదాలలో ఆకాశానికి ఉత్పత్తి ఉన్నది అని చెప్పబడింది. తైత్తిరీయంలో "బ్రహ్మను గురించి తెలుసుకున్నవాడు. మోక్షాన్ని పొందుతాడు. అంటే తానే పరబ్రహ్మ అవుతాడు. 'సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ' దహరాకాశంలో ఉన్న పరబ్రహ్మను తెలుసుకున్నవాడికి బ్రహ్మజ్ఞానంతోబాటు, ఇష్టకామ్యార్థసిద్ధి కలుగుతుంది. సృష్టికి మూలము బ్రహ్మ. దానినుంచే ఆకాశం పుట్టింది. అంటే ఆకాశం కూడా బ్రహ్మమే.

బ్రహ్మ నుండి	–	ఆకాశము
ఆకాశము నుండి	–	వాయువు
వాయువు నుండి	–	అగ్ని
అగ్ని నుండి	–	జలము
జలము నుండి	–	భూమి

ఈ రకంగా పంచభూతాలు ఉద్భవించాయి"

సూ. 3 గౌణ్య సంభవాత్

గౌణీ, అసంభవాత్

ఆకాశం నిత్యమనే వారి వాదన ఈ విధంగా ఉంటుంది. ఆకాశం సర్వవ్యాపకమైనది. అది నిత్యమైనది. కాబట్టి ఆకాశం ఉత్పత్తి లేదు. కణాది మతానుయాయులు (వైశేషికులు) కారణసామాగ్రి లేకపోవటంవల్ల ఆకాశము ఉత్పత్తి జరగదు అంటారు. భూమి, అగ్ని మొదలైన వాటి విషయాల్లో, వీటి ముందు స్థితికీ, తరువాత స్థితికీ తేడా ఉంది. కాని ఆకాశం విషయంలో ఆ తేడా కనిపించదు. మట్టికుండగా మారితే, చాలా తేడా కనిపిస్తుంది కాని ఆకాశం చిన్నది కావటం, పెద్దది కావటం, ఛిద్రం కావటం లాంటివి ఏవీ కనిపించటం లేదు. కాబట్టి 'ఆకాశం గగనం శూన్యం' ఆకాశము అంటే శూన్యము తప్ప ఇంకేమీ కాదు.

సూ. 4 శబ్దాచ్చ

శబ్దాత్, చ

శృతివల్ల కూడా ఆకాశం ఉత్పత్తి చెప్పబడలేదు. బృహదారణ్యకంలో "పంచ భూతాలలో పృథివి, జలము, అగ్ని, ఈ మూడు మూర్తములు, స్థూలమైనవి స్థావరమైనవి. నాశనమైపోయేవి. ఇవి చక్షురాది ఇంద్రియాలకు గోచరిస్తాయి. వీటిని నిర్వచించటానికి వీలవుతుంది.

పంచభూతాలలో మిగిలిన రెండూ వాయువు, ఆకాశము అమూర్తాలు. నాశనములేనివి. నిర్వచించటానికి వీలు కానివి. అమృతములు. చావు పుట్టుక లేనివి అలాగే తైత్తిరీయంలో బ్రహ్మనుంచి ఆకాశము ఉద్భవించింది. అంటే ఆకాశము కూడా బ్రహ్మమే. అని చెప్పబడింది. ఈ రకంగా ఆకాశము పరబ్రహ్మ స్వరూపము అని చెబుతున్నారు.

సూ. 5 స్యాచ్చైకస్య బ్రహ్మశబ్దవత్

స్యాత్, చ, ఏకస్య, బ్రహ్మశబ్దవత్

ఒకే ప్రకరణంలో విషయభేదంవల్ల 'అన్నంబ్రహ్మ' అన్నప్పుడు బ్రహ్మశబ్దం అప్రధానము 'ఆనందోబ్రహ్మ' అన్నప్పుడు బ్రహ్మశబ్దం ముఖ్యము అవుతుంది. అలాగే పరబ్రహ్మనుంచి ఆకాశం పుట్టింది అన్నప్పుడు ఆకాశం అప్రధానం. ఆకాశం నుండి వాయువు పుట్టింది. అన్నప్పుడు ఆకాశం ప్రధానార్ధంలో చెప్పబడింది.

సూ. 6 ప్రతిజ్ఞాऽహాని రవ్యతి రేకాచ్ఛబ్దేభ్యః

ప్రతిజ్ఞాऽహానిః, అవ్యతిరేకాత్, శబ్దేభ్యః

ఉపనిషత్తులు ప్రతిపాదించిన బ్రహ్మముకన్న ఏవీ భిన్నమైనవి కాదు. అందుచేత "ఏ విషయాన్ని గురించి తెలుసుకుంటే, అన్ని విషయాలు పూర్తిగా తెలుస్తాయో దాన్ని గురించి తెలుసుకోవాలి" అనే మాట నిజమవుతుంది.

బ్రహ్మనుంచి ఆకాశం పుట్టింది. అని తైత్తిరీయంలో చెప్పబడింది. ఛాందోగ్యంలో ఉద్దాలకుడు శ్వేతకేతువుకు ఏ విషయాన్ని గురించి తెలుసుకుంటే అన్ని విషయాలు తెలుస్తాయో, దాన్ని గురించి తెలుసుకోవాలి అని చెబుతాడు. అంటే సర్వానికి ఆధారమైనటువంటిది పరబ్రహ్మ. ఆత్మవిద్యకు మించినది ఏదీ లేదు. ప్రశ్నోపనిషత్తులో పిప్పలాదమహర్షి మహాజ్ఞాని. బ్రహ్మవేత్త ఆయనదగ్గరకు సత్యకాముదు, గార్గ్యుడు మొదలైన ఆరుగురు శిష్యులు వచ్చారు. వారంతా సగుణబ్రహ్మారాధనలో శ్రేష్ఠులు. ఇప్పుడు ఆత్మవిద్యకోసం వచ్చారు. ఆత్మవిద్యకు మించినది ఏదీ లేదు. అదే మోక్షవిద్య. అది నేర్చుకోవటానికి పిప్పలాద మహర్షి దగ్గరకు వచ్చారు. ఆకాశం కూడా బ్రహ్మమే బ్రహ్మనుండే ఆకాశం పుట్టింది. కాబట్టి బ్రహ్మను గురించి తెలుసుకుంటే ఆకాశం గురించి తెలుస్తుంది.

ఛాందోగ్యంలో ఆకాశం గురించి చెప్పలేదు. కాని ఖండించలేదు. కాబట్టి ఆకాశాన్ని అంగీకరించినట్లే కాబట్టి ఆకాశం ఉత్పత్తి జరిగింది. పంచభూతాలు ఏ రకంగా ఉత్పత్తి అయినాయి అంటే తైత్తిరీయంలో చెప్పినట్లుగానే ఆకాశము నుండి వాయువు, వాయువు నుండి అగ్ని, అగ్ని నుండి నీరు, నీటి నుండి భూమి ఉత్పత్తి అయినాయి.

సూ. 7 యావద్వికారం తు విభాగో లోకవత్

యావద్వికారం, తు, విభాగః, లోకవత్

ఆకాశానికి ఉత్పత్తి ఉన్నదనే విషయం అనుమానంతో సాధిస్తున్నారు.

బ్రహ్మయందు విభాగం లేదు. అన్నీ అందులో నుంచే ఉద్భవించాయి. పంచభూతాలు బ్రహ్మనుంచే వచ్చాయి. కాబట్టి ఆకాశము ఉత్పత్తి ఉన్నది. ఛాందోగ్యంలో చెప్పకపోయినా, ఆకాశం ఉత్పత్తిని అందులో కాదనలేదు. మిగిలిన ఉపనిషత్తులలో బ్రహ్మ నుండి ఆకాశం ఉత్పత్తి అయిందని చెప్పబడింది. కాబట్టి ఆకాశ ఉత్పత్తి ఉన్నది అంటూ మొదటి అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

2. మాతరిశ్వాధికరణము

ఛాందోగ్యోపనిషత్తులో ఆకాశము వాయువులను చెప్పలేదు. తేజస్సును మాత్రమే చెప్పటం జరిగింది. అందుచేత ఇందాక చెప్పినట్లుగానే వాయువుకు ఉత్పత్తి లేదు అంటారు.

సూ. 8 ఏతేన మాతరిశ్వా వ్యాఖ్యాతః

ఏతేన, మాతరిశ్వా, వ్యాఖ్యాతః

ఆకాశానికి ఉత్పత్తి ఉన్నది అని చెప్పటంవల్ల వాయువుకు కూడా ఉత్పత్తి చెప్పినట్లే.

తైత్తిరీయోపనిషత్తులో బ్రహ్మనుండి ఆకాశము, ఆకాశము నుండి – వాయువు ఉద్భవించాయని చెప్పబడింది కాబట్టి వాయువుకు ఉత్పత్తి ఉన్నది. అంటూ రెండవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

3. అసంభవాధికరణము

"ఆకాశానికి ఉత్పత్తి అసంభవం అన్నారు. మరి అసంభవమయిన ఆకాశం నుంచి వాయువు ఉద్భవిస్తున్నది అన్నారు కదా. అలాగే బ్రహ్మకు కూడా వేరొక బ్రహ్మతో ఉత్పత్తి చెప్పకూడదా?" అన్నాడు కృష్ణశర్మ. సమాధానం చెప్పటం మొదలుపెట్టాడు రత్నాకరుడు.

సూ. 9 అసంభవస్తు సతోऽనుపపత్తేః

అసంభవః తు, సతః, అనుపపత్తేః

సృష్టికి ముందు ఉన్నది ఒక్కటే అదే సత్తు. అదే బ్రహ్మ. నిత్యమైనది. శాశ్వతమైనది. జరామరణములు లేనటువంటిది. ఆద్యంతములు లేనట్టిది. జన్మ మృత్యువులు లేనట్టిది.

బ్రహ్మముకు జన్మము లేదు. అది శాశ్వతమైనది. మరి అలాంటి శాశ్వతమైన బ్రహ్మకు ఉత్పత్తి ఎక్కడుంటుంది. అన్నింటికీ అనాది అయిన బ్రహ్మ ఇంకొక బ్రహ్మ నుంచి పుట్టదు. బ్రహ్మతో సమానమైన వారుకాని, అంతకన్నా ఎక్కువ అయిన వారు గాని ఇంకెవరూ లేరు. అన్నిటికీ ఆధారము ఆ పరబ్రహ్మమే కాబట్టి దానికి ఉత్పత్తి లేదు. అంటూ మూడవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

4. తేజోధికరణము

"ఛాందోగ్యోపనిషత్తులో ఉద్దాలకుడు శ్వేతకేతువుకు ఆత్మజ్ఞానం వివరిస్తూ పరబ్రహ్మ అగ్నిని సృష్టించింది అన్నాడు అలాగే తైత్తిరీయంలో వాయువు నుంచి అగ్ని పుట్టింది అన్నారు. మరి వాయువుకు ఉపాదాన కారణం ఏమిటి?" అన్నాడు నారాయణభట్టు.

సూ. 10 తేజోఽ తస్తథాహ్యాహ

తేజః, అతః, తథా, హి, అహ

తేజస్సు అంటే అగ్ని, అది వాయువు నుంచే పుడుతోంది. అంతేకాని బ్రహ్మము నుంచి పుట్టటం లేదు. మరి ఛాందోగ్యంలో చెప్పింది తప్పు కాదు. బ్రహ్మనుండి ఆకాశం పుట్టింది. అంటే ఆకాశము బ్రహ్మమే. ఆకాశబ్రహ్మ నుంచి వాయువు పుట్టింది. అంటే వాయువు బ్రహ్మమే. వాయు బ్రహ్మనుంచి అగ్ని పుట్టింది. అంటే అగ్నికూడా బ్రహ్మమే. ఈ రకంగా పంచభూతాలు పరబ్రహ్మ స్వరూపాలే. ఇక్కడ బ్రహ్మనుంచి అగ్ని పుట్టింది అంటే వాయుబ్రహ్మ నుంచి అగ్ని పుట్టింది అని అర్థం. అంటూ నాల్గవ అధికరణను పూర్తిచేశాడు రత్నాకరుడు.

5. అబధికరణము

"గురువుగారూ ! ఛాందోగ్యంలో బ్రహ్మ నుండి జలము పుట్టినట్లు చెప్పారు. తైత్తిరీయంలో అగ్ని నుండి జలము పుట్టింది అన్నారుకదా ! మరి జలానికి ఉపాదాన కారణమేది?" అన్నాడు కృష్ణశర్మ. దానికి సమాధానంగా

సూ. 11 ఆపః

ఇందాక వాయువు నుంచి అగ్ని పుట్టినట్లుగానే, అగ్ని నుంచి జలము పుట్టింది. ఇక్కడ అగ్నికూడా బ్రహ్మమే అనేమాట గుర్తించాలి అంటూ ఐదవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

6. పృథివ్యధికారాధికరణము

సూ. 12 పృథివ్యధికారరూప శబ్దాంతరేభ్యః

పృథివీ, అధికార, రూప, శబ్దాంత రేభ్యః

జలం నుంచి భూమి ఉద్భవించింది. ఈ మాట తైత్తిరీయంలో చెప్పబడింది. ఛాందోగ్యంలో కూడా జలము బ్రహ్మమే. కాబట్టి జలబ్రహ్మ నుంచి పృథివీ బ్రహ్మ

ఉద్భవించింది. ఈ రకంగా పంచభూతాలు పరబ్రహ్మ స్వరూపాలే. అంటూ ఆరవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

7. తదభిధ్యానాధికరణము

"గురువుగారూ ! ఆకాశము మొదలైన పంచభూతాలు సృష్టించబడ్డాయి. అయితే జగత్తులోని నదులు, సముద్రాలు, కొండలు, పర్వతాలు, అడవులు. వీటన్నింటినీ పంచభూతాలే సృష్టిస్తున్నాయా? లేక పరబ్రహ్మే సృష్టిస్తున్నాడా? అంటూ అనుమానాన్ని వ్యక్తం చేశాడు కృష్ణశర్మ. ఆ మాటలు విన్న రత్నాకరుడు చెప్పటం ప్రారంభించాడు.

సూ. 13. తదభిధ్యానాదేవతు తల్లింగా త్సః

తదభిధ్యానాత్, ఏవ, తు, తల్లింగాత్, సః

సర్వకార్యాలకు కర్త పరమేశ్వరుడే తప్ప పంచభూతాలు కావు. అసలు ఈ భూతాలకు ఆ శక్తి కూడా లేదు. ఈ వస్తువులను సృష్టించాలనే పరమేశ్వరుని కోరిక వల్లనే ఈ సృష్టి జరుగుతున్నది. బృహదారణ్యంలో యాజ్ఞవల్క్యుడు చెబుతాడు. అగ్నిలో ఉంటాడు. అగ్ని అతన్నెరగదు. అగ్నే అతని శరీరము. అగ్నిలో ఉంటూ అగ్నిని నియంత్రిస్తుంటాడు. అతడే సర్వాంతర్యామి అయిన ఆత్మ. ఈ విధంగా అతడు పంచభూతాల లోనూ, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు. ఒకటేమిటి అన్ని చోట్లా ఉంటూ అన్నింటినీ నియంత్రిస్తాడు. కాబట్టి సృష్టి అంతా పరమేశ్వర కృతమే అంటూ ఏడవ అధికరణపూర్తి చేశాడు రత్నాకరుడు.

8. విపర్యయాధికరణము

"గురువుగారూ ! ఇంతవరకూ సృష్టి ఎలా జరిగింది? పంచభూతాలు ఏ రకంగా సృష్టించబడ్డాయి? అనేది చెప్పారు. మరి లయం ఏ రకంగా జరుగుతుంది? ఏ రకంగా సృష్టి జరిగిందో, ఆ రకంగానే లయం కూడా జరుగుతుందో లేక ఇంకా ఏ విధంగానైనా జరుగుతుందా? వివరించండి" అన్నాడు నారాయణభట్టు. వివరించటం ప్రారంభించాడు రత్నాకరుడు.

సూ. 14 విపర్యయేణ తు క్రమోఽ త ఉపపద్యతే చ

విపర్యయేణ, తు, క్రమః, అతః, చ, ఉపపద్యతే

కారణంలోనే కార్యం లయమవుతుంది. కాబట్టి సృష్టి జరిగిన విధానానికి వ్యతిరేకంగా లయం జరుగుతుంది.

అంటే లయం జరిగేటప్పుడు మొదటగా

భూమి	–	జలంలో కలిసిపోతుంది.
జలం	–	అగ్నిలో కలిసిపోతుంది
అగ్ని	–	వాయువులో లీనమైపోతుంది
వాయువు	–	ఆకాశంలో లీనమైపోతుంది
ఆకాశం	–	పరబ్రహ్మలో లీనమైపోతుంది.

ఇదే వ్యతిరేక దశ. ఈ దశగానే లయం జరుగుతుంది. అంటూ ఎనిమిదవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

9. అంతరావిజ్ఞానాధికరణము

"గురువుగారూ ! ఆత్మకీ, భూతాలకీ మధ్యన ఇంద్రియాలున్నాయి కదా! మరి వీటి మాటేమిటి?" అన్నాడు నారాయణభట్టు. వివరించటం మొదలు పెట్టాడు రత్నాకరుడు.

సూ. 15 అంతరావిజ్ఞాన మనసీ క్రమేణ తల్లింగాదితి చేన్నా విశేషాత్
అంతరా, విజ్ఞానమనసీ, క్రమేణ, తల్లింగాత్, ఇతి, చేత్, న అవిశేషాత్

ఆత్మకూ, భూతసృష్టికీ మధ్య వరుసగా విజ్ఞానము, ఇంద్రియాలు, మనస్సు, అనేవి ఉన్నాయి. ఇంద్రియాలకు భూతాలకు పెద్దగా తేడా ఏమీ లేదు.

విజ్ఞానము అంటే బుద్ధి, ఇంద్రియాలే ప్రాణాలు. మనస్సు అంటే సంకల్ప వికల్పాలకు నిలయమైనది. విజ్ఞానము, మనస్సు అనేవి ఆత్మకు, ఆకాశానికి మధ్యన పుడుతున్నాయి. కఠోపనిషత్తులో చెప్పినట్లుగా ఇంద్రియాలు గుర్రాలు. మనస్సు సారథి. మంచి సారథి చేతిలోని ఉత్తమాశ్వాలులాగా ఇంద్రియాలు మన అధీనంలో ఉండాలి. భూతాలయొక్క ఉత్పత్తివల్లనే భౌతికమైన ఇంద్రియాల ఉత్పత్తికూడా తెలుస్తోంది. అందుచేతనే వేరుగా చెప్పలేదు.

భూతాల స్వరూపాలే ఇంద్రియాలు. ఐతరేయోపనిషత్తులో సృష్టిని గురించి చెబుతూ, పరమాత్మ విరాట్స్వరూపాన్ని దృష్టిలో ఉంచుకుని తీవ్రమైన ఆలోచన చేశాడు. అదే తపస్సు దాని ఫలితంగా ఆ స్వరూపానికి నోరు వచ్చింది. నోటి నుంచి మాట వచ్చింది. వాక్కుకు అభిమానదేవత అగ్ని అంటూ ఇంద్రియాలకు అభిమానదేవతలను వివరించారు.

నోరు – అగ్ని, ముక్కు – వాయువు, కన్ను – సూర్యుడు, చెవులు – దిక్కులు, మనస్సు – చంద్రుడు, జననేంద్రియము – జలము (వీర్యము), ఈ రకంగా భూతాలు ఇంద్రియాలు ఒకటే కాబట్టి, ఇంద్రియాల గురించి వేరుగా చెప్పలేదు. అంటూ తొమ్మిదవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

10. చరాచరవ్యపాశ్రయాధికరణము

"గురువుగారూ ! ఇంతవరకు భూతాలు, ఇంద్రియాలు వాటి పుట్టుక, లయము గురించి చెప్పారు. మరి జీవుడి మాటేమిటి? జీవుడికి కూడా చావుపుట్టుకలున్నాయా?

ఫలానా సత్యవర్ధనుడు పుట్టాడు, జయవర్ధనుడు మరణించాడు. అంటే జీవి పుట్టింది, మరణించింది అంటున్నాము కదా!" అన్నాడు కృష్ణశర్మ. ఆ మాటలు విన్న రత్నాకరుడు శిష్యుని సందేహం తీర్చటం మొదలుపెట్టాడు.

సూ. 16 చరాచరవ్యపాశ్రయస్తు స్యాత్తద్వ్యపదేశో భాక్త స్తద్భావ భావిత్వాత్
చరాచరవ్యపాశ్రయః, తు, స్యాత్, తద్వ్యపదేశః, భాక్తః, తద్భావ భావిత్వాత్

జీవుడికి జననమరణాలు లేవు. కాని అవి ఉన్నాయి అని చెప్పటం కేవలము అతని శరీరాన్ని బట్టే. వీటితో జీవుడికి సంబంధం లేదు. జీవుడు శరీరంలో ప్రవేశిస్తే అతడు పుట్టాడు అంటున్నాము. ఆ శరీరాన్ని వదిలిపెడితే మరణించాడు అంటున్నాము. ఇది ఎందుకు జరుగుతుంది? కర్మఫలితాన్ని అనుభవించటానికి కర్మఫలితం అనుభవించగానే మాసినవస్త్రము వదలి ఏవిధంగా మనం కొత్త వస్త్రము ధరిస్తామో, అలాగే జీర్ణమైన ఈ దేహాన్ని వదలి ఈ జీవి ఇంకొక దేహంలో ప్రవేశిస్తుంది. జీవుడు వేరు, బ్రహ్మవేరు కాదు. ఇద్దరూ ఒకటే. అయితే అజ్ఞానంతో తాను, బ్రహ్మ వేరు అనుకుంటుంది. ముండకోపనిషత్తులో చెప్పినట్లుగా ఒకే వృక్షము మీద రెండు పక్షులు కూర్చుని ఉన్నాయి. అందులో ఒకటి తన కర్మలవల్ల వచ్చిన ఫలితాలను అనుభవిస్తున్నది. రెండవది నిర్వికారంగా చూస్తోంది. వీటిలో మొదటిది జీవాత్మ. రెండవది పరమాత్మ వారిద్దరికీ భేదం లేదు. అజ్ఞానం తొలగిపోతే జీవాత్మ పరమాత్మలో లీనమైపోతుంది. కాబట్టి జీవుడికి చావుపుట్టుకలు లేవు. ఐతరేయంలో చెప్పినట్లుగా ఈ జీవరాసిని సృష్టించిన తరువాత, పరమేశ్వరుడు తాను కూడా ఇందులో ప్రవేశించాలి అనుకున్నాడు. శరీరంలో ప్రవేశించాడు. కాబట్టి జీవుడికి చావుపుట్టుకలు లేవు అంటూ పదవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

11. ఆత్మాధికరణము

"గురువుగారూ ! శరీరంలో ఉండేది జీవాత్మ. పంచభూతాలు ఉత్పత్తి అయినట్లుగానే ఈ జీవాత్మకూడా ఉత్పత్తి అవుతున్నదా? వివరించండి అన్నాడు నారాయణభట్టు. ఆ విషయాన్ని వివరించటానికి పూనుకున్నాడు రత్నాకరుడు.

సూ.17 నాత్మాశ్రుతేర్నిత్యత్వాచ్చతాభ్యః

న, ఆత్మా, అశ్రుతేః, నిత్యత్వాత్, చ, తాభ్యః

జీవుడు పుట్టటము అనేది లేదు. అతడు నిత్యుడు. బృహదారణ్యకంలో యాజ్ఞవల్క్యుడు మైత్రేయికి బ్రహ్మోపదేశం చేస్తూ, తడిసిన కట్టెను నిప్పులో వేసినట్లైతే రకరకాల పొగలువస్తాయి. తరువాత రవ్వలు వస్తాయి. ఈ రవ్వలు అగ్నికన్న వేరైనవి కావు. అలాగే వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, మంత్రాలు, కళలు, సూత్రాలు ఇవన్నీ పరమాత్మ యొక్క స్వరూపాలు. రవ్వలు, జ్వాలలు రావటానికి ముందు అంతా అగ్నిమయమే. అలాగే నామరూపాత్మక స్థితికి ముందు జగత్తంతా ప్రజ్ఞానఘనుని స్వరూపమే అంటాడు. నిప్పుకట్టె నుండి రవ్వలు ఏరకంగా పుడుతున్నాయో. అదేవిధంగా పరమాత్మనుంచి జీవాత్మలు వచ్చి మళ్ళీ అందులోనే కలిసిపోతున్నాయి. కఠోపనిషత్తులో "ఆత్మకు చావులేదు. ఆత్మ స్వయంభువు నాశరహితమైనది. శరీరం మరణించినా ఆత్మ మరణించదు. ఆత్మ చంపేదీ, చంపబడేదీకాదు. సూక్ష్మమైన వాటి కన్న సూక్ష్మమైనది. పెద్దవైన వాటికన్న ఇంకా పెద్దది" ఐతరేయోపనిషత్తులో 'మానవశరీరాన్ని సృష్టించిన తరువాత, అందులో ప్రవేశించాలి అనుకున్నాడు. బ్రహ్మరంధ్రం ద్వారా మానవశరీరంలో పరమాత్మ ప్రవేశించాడు' అని చెప్పబడింది.

ఈ విధంగా చూసినట్లైతే జీవాత్మ పరమాత్మా రెండు వేరుకాదు. ఒకటే. పరమేశ్వరుడు మానవుణ్ణి సృష్టించి, బ్రహ్మరంధ్రం గుండా మానవదేహంలో ప్రవేశించాడు. కాబట్టి అందరిలోనూ ఉన్నవాడు పరమేశ్వరుడే. కర్మఫలం అనుభవించిన తరువాత ఈ శరీరాన్ని విడిచి ఇంకొక శరీరంలోకి ప్రవేశిస్తున్నాడు. అంతేకాని జీవికి చావుపుట్టుకలు లేవు. అవి కేవలము శరీరానికి మాత్రమే. ముండకోపనిషత్తులో శౌనకు అంగిరసుడు బ్రహ్మతత్త్వాన్ని వివరిస్తూ, "శౌనకా, ప్రజ్వరిల్లిన అగ్ని నుండి అదేవిధమైన ఆకారము, గుణముగల వేలకొలది నిప్పురవ్వలు వెలువడుతున్నట్లే, పరబ్రహ్మ నుండి అనేకమైన శరీరాలు రూపాలు వెలువడి మళ్ళీ అందులోనే లీనమవుతున్నాయి. అంటే ఆత్మకు చావు, పుట్టుకలున్నాయని కాదు. ఆత్మ శాశ్వతమైనది. ఇది పరమేశ్వర స్వరూపము. అందుకే తృతీయ ముండకంలో

ఒకే రూపము పేరు గలిగిన రెండు పక్షులు ఒక చెట్టు మీద ఆశ్రయించి ఉన్నాయి. ఈ రెండింటిలోను ఒకటి జీవాత్మ, రెండవది పరమాత్మ. జ్ఞానోదయం గలిగిన మరుక్షణమే జీవాత్మ పరమాత్మలో లీనమవుతుంది అంతేగాని జీవునికి చావుపుట్టకలు లేవు అంటూ పదకొండవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

12. జ్ఞాధికరణము

"గురువర్యా ! ఆత్మ నిత్యము, సత్యము అన్నారుకదా ! నిద్రించే స్థితిలో ఆత్మ చేతనంగా ఉండటంలేదు. అలాంటప్పుడు ఆత్మచేతనమేనా ? లేక కొన్నిసార్లు అచేతనం కుడానా ? వివరించండి అన్నాడు నారాయణభట్టు.

ఆ మాటలువిన్న రత్నాకరుడు శిష్యుని సందేహం తీర్చటం ప్రారంభించాడు.

సూ.18 జ్ఞోఽ తఏవ

జ్ఞః, అతఏవ.

జీవుడు నిత్యుడు కాబట్టే చైతన్య స్వరూపుడు. జీవికి పుట్టకలేదు. పరమాత్మ స్వరూపమే జీవుడు. నిత్య జ్ఞానస్వరూపుడు. అయితే శరీరంలో సంబంధం ఏర్పడటంవల్ల అజ్ఞానిగా కనిపిస్తున్నాడు. అతడు నిద్రించడు. సర్వత్రా వ్యాపించి ఉంటాడు. బృహదారణ్యకంలో యాజ్ఞవల్క్యుడు ఉద్దాలకునికి అంతర్యామి అయిన ఆత్మను గురించి వివరిస్తూ, అగ్నిలో ఉంటాడు. అగ్ని అతన్నెరగదు. అగ్నే అతని శరీరం. అగ్నిలో ఉంటూనే అగ్నిని నియంత్రిస్తాడు. అతడే అంతర్యామి అయిన నీ ఆత్మ. అంటే ఆత్మయొక్క సర్వవ్యాపకత్వాన్ని, చైతన్యరూపాన్ని వివరిస్తాడు. కాబట్టి ఆత్మచలనము గలది. నిత్యచైతన్య స్వరూపమైనది అంటూ పన్నెండవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

13. ఉత్క్రాంతిగత్యధికరణము

"గురువుగారూ ! ఆత్మచలనము గలది అన్నాము. జీవునికి జననమరణాలు లేవు అన్నాము. అతడు నిత్యజ్ఞానస్వరూపుడు అన్నాము. అసలు జీవుని పరిమాణము ఏమిటి? అతడు అణుపరిమాణుడా ? మహత్పరిమాణుడా ? లేక మధ్య పరిమాణుడా ? ఏవిధంగా ఉంటాడు ? అంటూ అనుమానం వ్యక్తంచేశాడు కృష్ణశర్మ. ఆ మాటలు విన్న రత్నాకరుడు జీవుని పరిమాణము వివరించటం మొదలుపెట్టాడు.

సూ.19 ఉత్క్రాంతి గత్యాగతీనామ్.

మరణ కాలంలో జీవి యొక్క ప్రాణాలు శరీరం నుండి ఉత్క్రమిస్తాయి కాబట్టి జీవుడు అణుపరిమాణుడు.

మరణకాలం ఆసన్నమయింది. ముందుగా మానవుడి కర్మేంద్రియాలు పనిచెయ్యటం మానివేస్తాయి. ఆ తరువాత జ్ఞానేంద్రియలు పనిచెయ్యవు. ఇవన్నీ మనసును ఆశ్రయిస్తాయి. ఆ మనసు జీవిని ఆశ్రయిస్తుంది. అప్పుడు మానవుడి శరీరంలోని జీవుడు ప్రయాణానికి సిద్ధం అవుతాడు. శరీరంలోని 72000 నాడీమండలము అతని ప్రయాణానికి మార్గాలే. ఈ నాడీమండలమంతా శరీరంలోని నవరంధ్రాలలోనూ ఏదోఒక రంధ్రంతో కలుపబడి ఉంటుంది. కాబట్టి మానవుని ప్రాణాలు నవరంధ్రాలలోను ఏదో ఒక రంధ్రం గుండా బయటకుపోతాయి. దీనినే ఉత్క్రమణ అంటారు. అయితే సాధకుని యొక్క ప్రాణములు ఉత్క్రమించవు. అవి బ్రహ్మరంధ్రం గుండా బయటకుపోయి పరమాత్మలో లీనమవుతాయి.

బృహదారణ్యకంలో చెప్పినట్లుగా "ఇంద్రియాలతో కూడినట్టి, అవిద్యాజన్యమైనట్టి ఈ దేహం వృద్ధాప్యం కారణంగా కృశించిపోతుంది. అప్పుడు చెట్టునుండి పండు రాలిపోయినట్లుగా శరీరంలోని పురుషుడు, ఈ అవయవాలను వదిలించుకుని కర్మానుసారము మరొక యోనిలో జన్మించటం కోసం వెళ్ళిపోతాడు. ప్రాణము, అవయవాలు ఉంటేనేగాని కర్మఫలాన్ని అనుభవించలేడు. అందుకని ఇంకొక శరీరం చేరతాడు. వేరొక శరీరాన్ని పొందటానికి వచ్చే ఆత్మని చూసి సమస్తభూతాలు 'ఇదిగో పరమాత్మ వస్తున్నాడు' అంటూ సభాస్థలిచేరే రాజుగారి కోసం ఎదురుచూసే సేవకులులాగా ఎదురుచూస్తుంటాయి. ఎగశ్వాస ప్రారంభం కాగానే చివరిదశలో ప్రాణాలు, ఇంద్రియాలు, ఆత్మకు ముందుగా నడుస్తూపోతాయి." కాబట్టి జీవుడు అణుపరిమాణుడు.

సూ.20 స్వాత్మనా చోత్తరయోః
స్వాత్మనా, చ, ఉత్తరయోః

ఉత్క్రమణ జరిగిన తరువాత జరిగే గమనం, ఆగమనం అనేవి జీవాత్మతో సంబంధం కలిగిఉన్నందున జీవుడు అణుపరిమాణం కలవాడు అనాలి.

ఇప్పటిదాకా చెప్పిన ఉత్క్రమణ, గమనము, ఆగమనము అనేవి పరిమితమైన పరిమాణం గల వాడికి మాత్రమే ఉంటాయి. అందుకే జీవుడు అణుస్వరూపుడు.

సూ.21 నాణు రతచ్ఛ్రుతేరితి చేన్నే తరాధికారాత్
న, అణు, అతత్, శ్రుతేః, ఇతి, చేత్, న, ఇతర, అధికారాత్

జీవి సర్వవ్యాపి కాబట్టి అణుపరిమాణుడు కాదు అని వారి వాదన. అది నిజం కాదు. ప్రాణాల్లో ఉన్న విజ్ఞానమయుడే మహత్పరిమాణం గల అజుడైన ఆత్మ. కాబట్టి జీవుడు అణుపరిమాణుడే.

సూ.22 స్వశబ్దో న్యానాభ్యాం చ
స్వశబ్దోన్మానాభ్యాం, చ

జీవుడికి అణుత్వం చెప్పేవాక్యాలవల్ల, పరిమాణ నిర్దేశంచేత కూడా జీవుడు అణుపరిమాణుడే. ముండకోపనిషత్తులో చెప్పినట్లుగా "ఆత్మసూక్ష్మ రూపంలో మన శరీరంలోనే ఉన్నది. ఆత్మసాక్షాత్కారానికి చిత్తశుద్ధి అవసరం. విశుద్ధమైన అంతఃకరణ గల ఆత్మజ్ఞాని కోరుకున్నవి పొందగలుగుతాడు. వారికి పునర్జన్మ ఉండదు. శ్వేతాశ్వరోపనిషత్తులో "ఒక వెంట్రుకను నూరు భాగాలుగా చేస్తే, అందులో ఒక భాగమంత ఉంటుంది జీవాత్మ"అని చెప్పబడింది. అందుచేతనే ఆత్మ ఆణుపరిమాణం గలది.

సూ. 23 అవిరోధ శ్చందనవత్
అవిరోధః, చందనవత్

జీవుడు అణుపరిమాణంలో శరీరంలో ఎక్కడో ఉంటే, చల్లదనంగాని, వేడిగాని ఆ ప్రాంతానికే తగలాలి. అంతేగాని శరీరం అంతా ఏ విధంగా వ్యాపిస్తుంది? అని వీరి వాదన. అది సరికాదు. ఎందుచేతనంటే మంచిగంధపు చుక్క శరీరానికి ఎక్కడ రాచుకున్నప్పటికీ శరీరమంతా సుగంధంవ్యాపిస్తుంది. అలాగే జీవుడు అణురూపంలో శరీరంలో ఎక్కడ ఉన్నప్పటికీ శరీరమంతా వ్యాపించే ఉంటాడు. జీవుడు ఒకచోటనే ఉన్నప్పటికీ శరీరమంతా వ్యాపించి సుఖదుఃఖాలు అనుభవిస్తుంటాడు.

సూ. 24 అవస్థితి వైశేష్యాదితి చేన్నాభ్యుపగమాద్ధృదిహి
అవస్థితి, వైశేష్యాత్, ఇతి, చేత్, న, అభ్యుపగమాత్, హృది, హి

గంధపుచుక్క శరీరానికి రాచుకున్నప్పుడు అది ఎక్కడో ఒకచోట కనిపిస్తుంది. అలా జీవుణ్ణి శరీరంలో ఎక్కడా మనం చూడటం లేదుకదా! అన్న కృష్ణశర్మకు సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

జీవుడు శరీరంలో ఫలానాచోట ఉన్నాడనటానికి వీలులేదు. కాబట్టి జీవుడు అణురూపుడు కాదు అనటం సరికాదు. ఈ ఆత్మ హృదయస్థానంలో ఉన్నది.

సూ. 25 గుణాద్వా లోకవత్
గుణాత్, వా, లోకవత్

జీవుడు అణుపరిమాణం గలవాడు. కాని చైతన్యము గలవాడు కాబట్టి శరీరమంతా వ్యాపించి ఉంటాడు. దీపం గూట్లోనే ఉన్నప్పటికీ ఇల్లంతా కాంతులు ప్రసరింపచేస్తుంది. అలాగే ఆత్మ అణురూపంలో ఉన్నప్పటికీ శరీరమంతా వ్యాపించి ఉంటుంది. ఈ మాటలు విన్న నారాయణభట్టు అంటున్నాడు "గురుదేవా! గుణిని విడిచి గుణము వ్యాపించటము సంభవము కాదు కదా!" ఆ మాటలు విన్న రత్నాకరుడు చెబుతున్నాడు.

సూ. 26 వ్యతిరేకోగంధవత్

వస్త్రానికి ఉన్న ఎరుపు, తెలుపు రంగులు ఆ వస్త్రాన్ని వదిలి ఇంకొక చోట ఉండవు. అలాగే దేహంలో ఒకచోట ఉండే ఆత్మ, శరీరమంతా వ్యాపించటం సంభవం కాదు అన్నవాదన ఉన్నది. కాని వాసన అనేది పూవుయొక్క గుణము. ఆ వాసన ఈ పూవువరకే కాకుండా ఇతర పూవులకు కూడా ఏ విధంగా వ్యాపిస్తుందో, అలాగే ఆత్మకూడా ఉన్నచోటనే కాకుండా దేహమంతా వ్యాపించి ఉంటుంది.

సూ. 27 తథాచ దర్శయతి

తథా, చ, దర్శయతి

అణు పరిమాణుడైన జీవుడు తన చైతన్య గుణంవల్ల దేహమంతా వ్యాపించి ఉన్నాడని శ్రుతులు చెబుతున్నాయి.

సూ. 28 పృథగుపదేశాత్

జీవుడు వేరు, అతని చైతన్య గుణం వేరు అని శ్రుతులు చెబుతున్నాయి. కాబట్టి జీవుడు అణుపరిమాణుడు అనటంలో తప్పులేదు.

కాని అణురూపుడైన జీవుడు సమస్త శరీరాన్ని వ్యాపించి ఉన్నాడు కాబట్టి జీవుడికి సర్వవ్యాపకత్వం చెప్పనవసరం లేదు అంటారు.

సూ. 29 తద్గుణ సారత్వాత్తు తద్వ్యపదేశః ప్రాజ్ఞవత్

తద్గుణ సారత్వాత్, తు, తద్వ్యపదేశః, ప్రాజ్ఞవత్

పరబ్రహ్మలాగానే జీవుడు కూడా అల్పపరిమాణం గలవాడని చెప్పరాదు.

పరబ్రహ్మకు కర్తృత్వము, భోక్తృత్వము లేవు. కాని బుద్ధి, గుణాలవల్ల కర్తృత్వ భోక్తృత్వాలు చెప్పబడుతున్నాయి. జీవాత్మకు పరమాత్మకు తేడాలేదు. రెండూ ఒక్కటే. పరబ్రహ్మ స్వరూపమెంత ఉంటుందో, ఆత్మస్వరూపంకూడా అంతే ఉంటుంది.

సూ. 30 యావదాత్మ భావిత్వాచ్చ నదోషస్తద్దర్శనాత్

యావత్, ఆత్మభావిత్వాత్, చ, నదోషః, తద్దర్శనాత్.

బుద్ధి సంయోగమనేది ఆత్మజ్ఞానంవల్ల సంసారనివృత్తి జరిగే వరకు ఉంటుంది. శరీర వియోగం జరిగిన పిమ్మట కూడా బుద్ధి సంయోగముంటుందని శ్రుతులు చెబుతున్నాయి.

సూ. 31 పుంస్త్వాది వత్త్వస్య సతోऽభివ్యక్తియోగాత్

పుంస్త్వాదివత్, తు, అస్య, సతః, అభివ్యక్తియోగాత్.

బాల్యంలో కూడా ఉండే పుంసాదులు, యవ్వనంలో మాత్రమే బహిర్గతమవుతున్నట్లుగా సూక్ష్మరూపంలో ఉండే ఈ బుద్ధి సంయోగం జాగ్రదాది అవస్థలలో పైకి కనిపిస్తుంది.

సూ. 32 నిత్యోపలబ్ద్యనుపలబ్ధి ప్రసంగోऽన్యతరనియమోవాऽన్యథా

నిత్యోపలబ్ద్యనుపలబ్ధి ప్రసంగః, అన్యతరనియమః వా, అన్యథా

బుద్ధి లేదా అంతఃకరణమనేది ఆత్మకు ఉపాధి. దానికి అస్తిత్వం ఉన్నదని అంగీకరించాలి. లేకపోతే నిత్యోపలబ్ధిప్రసంగం లేదా నిత్యానుపలబ్ధి ప్రసంగం ఏర్పడుతుంది.

ఉపలబ్ధి అంటే సాక్షాత్కారం. ఆత్మ ఇంద్రియ విషయాలు అనే వీటి సాన్నిధ్యమే జ్ఞానసాక్షాత్కారానికి సాధనాలు. ఇవి ఉన్నప్పటికీ ఒక్కొక్కప్పుడు జ్ఞానోపలబ్ధి కలగవచ్చు, కలగకపోవచ్చును. అంటూ జీవపరిమాణ విమర్శన చేస్తూ పదమూడవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

14. కర్త్రధికరణము

"గురువుగారూ ! శ్రుతులలో ఆత్మకు కోరికలుండవని, పక్షపాతము ఉండదని, కర్మలు చేయదని, కర్మఫలం కూడా ఉండదని చెప్పబడింది. కాని కర్మలు చెయ్యాలి. అంటే యాగాలు, హోమాలు, క్రతువులు చెయ్యాలి. అని కూడా చెప్పబడింది. ఈ వైరుధ్యం ఏమిటి?" అన్నాడు నారాయణభట్టు. ఆ మాటలు విన్న రత్నాకరుడు విశదీకరించటం ప్రారంభించాడు.

సూ. 33 కర్తా శాస్త్రార్థవత్త్వాత్

శాస్త్రము అర్థవంతం కావాలంటే జీవుడు కర్త అని చెప్పాలి.

కర్త లేకపోతే కర్మచేసే వారుండరు. కర్త లేకపోతే కర్మను ఎవరికి ఉపదేశించాలి? కాబట్టి కర్త అనేవాడు ఒకడు ఉండి తీరాలి. మరి ఆ కర్త ఎవరు ? ఆత్మయే కర్త, బుద్ధి కర్త కాదు. అన్నీ ఆత్మే. అత్మే చూచేది. ఆత్మే వినేది. ఆత్మే ఆలోచించేది. అందుకే ఈ కనులకు చూసే శక్తిని ప్రసాదించేదే ఆత్మ. చెవులకు వినికిడి శక్తిని ప్రసాదించేదే ఆత్మ. మనసుకు ఆలోచనాశక్తిని ప్రసాదించేదే ఆత్మ.

సూ. 34 విహారోపదేశాత్

జీవుడు కర్త అని చెప్పారు. ఎందుచేతనంటే అతనికి విహారమున్నది. తన ఇష్టం వచ్చినచోటికి పోతాడు. శరీరంలో శ్వేచ్ఛగా విహరిస్తాడు.

సూ. 35 ఉపాదానాత్

గ్రహించటంవల్ల కూడా జీవుడే కర్త అని చెప్పాలి. ఇంద్రియాలద్వారా గ్రహించేవాడు జీవుడు. బృహదారణ్యకంలో ఆత్మ పురుషుడు బుద్ధిద్వారా ఇంద్రియాలశక్తిని గ్రహిస్తున్నాడు. అని చెప్పబడింది.

సూ. 36 వ్యపదేశాచ్చ క్రియాయాంనచేన్నిర్దేశ విపర్యయః
వ్యపదేశాత్, చ, క్రియాయాం, నచేత్, నిర్దేశ, విపర్యయః

లౌకిక, వైదిక క్రియలందు కర్తగా చెప్పబడ్డాడు కాబట్టి జీవుడే కర్త.

సూ. 37 ఉపలబ్ధివ దనియమః
ఉపలబ్ధివత్, అనియమః

స్వతంత్రుడైనవాడే కర్త. ఈ నియమానుసారము జీవుడు కర్త అయినట్లైతే సర్వస్వతంత్రుడు కావాలి. అంటే తనకిష్టమైనదాన్నే చెయ్యాలి. ఇష్టం లేని దాన్ని చెయ్యకూడదు. మరి లోకంలో ఆ రకంగా కనిపించటం లేదు కదా! జీవుడు స్వతంత్రుడు, కర్త ఎలా అవుతాడు? అంటున్నారు.

జీవికి స్వాతంత్ర్యం ఉన్నప్పటికీ సాధనవైచిత్ర్యాన్ని బట్టి ఇష్టానిష్టాలను చెయ్యటం, చెయ్యకపోవటంలో నియమం లేదు. ఇష్టమైన దానిని, కాని దానిని కూడా నియమం లేకుండానే గ్రహిస్తున్నాడు.

సూ. 38 శక్తివిపర్యయాత్

శక్తియందలి వ్యత్యాసంవల్ల కూడా జీవుడే కర్త అవుతాడు. ఇది కేవలము పేరులో ఉన్న వివాదమే తప్ప వస్తువులో ఉన్నది కాదు.

సూ. 39 సమాధ్యభావాచ్చ
సమాధ్యభావాత్, చ

ఆత్మధ్యానం అంటే సమాధి అసంభవమవుతుంది కాబట్టి జీవుడే కర్త.

లోకంలో ఉన్నదంతా ఆత్మే. ఈ ఆత్మ అందరిలోనూ సమానంగా ఉన్నది. ఆత్మనుండే అన్నీ పుట్టినాయి. మళ్ళీ ఆత్మలోనే లయం అవుతాయి. అని బృహదారణ్యకంలో చెప్పబడ్డది. కాబట్టి జీవుడే కర్త. అంతేకాని వేరుకాదు అంటూ పధ్నాల్గవ అధికరణ పూర్తి చేశాడు. రత్నాకరుడు.

15. తక్షాధికరణము

"గురువుగారూ ! జీవుడే కర్త అని చెప్పారు కదా. మరి ఈ కర్తృత్వము అనేది జీవునికి స్వాభావికమా? లేక ఉపాధినిబట్టి వచ్చిందా?" అని అడిగాడు నారాయణభట్టు. శిష్యుని సందేహం నివృత్తి చేస్తున్నాడు రత్నాకరుడు.

సూ.40 యథాచ తక్షోభయథా
యథా, చ, తక్షా, ఉభయథా

వడ్రంగిలాగా జీవుడుకూడా కర్త, అకర్త రెండూ అవుతున్నాడు.

వడ్రంగివాడు తనసామాను తీసుకుని కర్త అయి పని చేస్తున్నప్పుడు దుఃఖితుడౌతున్నాడు. ఆ పని మానివేసి సాధనాలన్నీ వదిలేసినప్పుడు అకర్త అవుతున్నాడు. అలాగే ఆత్మకూడా అజ్ఞానంతో వచ్చిన మనస్సు, ఇంద్రియాలతో కూడినప్పుడు కర్తయై సాంసారిక దుఃఖము అనుభవిస్తున్నాడు. అవిద్యా సాధనాలను వదలివేసినప్పుడు అకర్తయై సుఖిస్తున్నాడు. కాబట్టి ఆత్మయొక్క కర్తృత్వం ఉపాధికి సంబంధించినదే. అంటూ పదిహేనవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

16. పరాయత్తాధికరణము

"గురుదేవా! జీవుడికి ఈ కర్తృత్వము ఈశ్వరునివల్ల లభిస్తోందా? లేక ఈశ్వరుని ప్రమేయం లేకుండానే లభిస్తోందా?" అని అడిగాడు కృష్ణశర్మ. సమాధానం చెప్పటం ప్రారంభించాడు రత్నాకరుడు.

సూ. 41 పరాత్తు తచ్ఛ్రుతేః

పరాత్, తు, తత్, శ్రుతేః

జీవుడికి కర్తృత్వం ఈశ్వరునివల్లనే కలుగుతున్నది. జీవి అవిద్యతోకూడి ఉన్నంత వరకు కర్తృత్వ, భోక్తృత్వ లక్షణాలు గల సంసారం లభిస్తోంది. అతడికి జ్ఞానంకలగగానే మోక్షం వస్తుంది. కాబట్టి జీవుడికి కర్తృత్వం ఈశ్వరునివల్లనే లభిస్తుంది.

సూ. 42 కృతప్రయత్నాపేక్షస్తు విహిత ప్రతిషిద్ధావైయర్థ్యాదిభ్యః

కృతప్రయత్నాపేక్షః, తు, విహిత ప్రతిషిద్ధావైయర్థ్యాదిభ్యః

వేదవిహితమైన కర్మలు వ్యర్థం కాకుండా ఉండటానికి పరమేశ్వరుడు జీవునిచేత కర్మలు చేయిస్తాడు.

వేదాలలో చేయవలసిన విధులు, చేయకూడని పనులు కూడా చెప్పబడ్డాయి. యాగాలు చెయ్యాలి. హోమాలు, దానాలు చెయ్యాలి. అలాగే సురాపానం చెయ్యకూడదు. అబద్ధమాడరాదు. ఇవి నిషేధాలు ఈశ్వరుడు జీవులచేత తన ఇష్టం వచ్చినట్లు పాపపుణ్యాలు చేయించటం లేదు. శ్రుతులందు చెప్పిన కర్మలు మాత్రమే చేయిస్తున్నాడు. ఆ కర్మలఫలితాన్నే జీవుడు మరుజన్మలో అనుభవిస్తున్నాడు. ఈ రకంగా జీవుని యొక్క కర్తృత్వం పరమేశ్వరాధీనము అంటూ పదహారవ అధికరణపూర్తి చేశాడు రత్నాకరుడు.

17. అంశాధికరణము

"గురువరేణ్యా ! జీవుడికి, బ్రహ్మతో గల సంబంధం ఏమిటి?" అంటూ అడిగాడు కృష్ణశర్మ. సమాధానం చెప్పటం ప్రారంభించాడు రత్నాకరుడు.

సూ. 43 అంశోనానా వ్యపదేశాదన్యథా చాపి దాశకితవాదిత్వ మధీయత ఏకే

అంశః, నానావ్యపదేశాత్, అన్యథా, చ, అపి

దాశకితవాదిత్వం, అధీయతే, ఏకే.

జీవికి, ఈశ్వరుడికి భేదం చెప్పినా చెప్పకపోయినా కూడా జీవుడు ఈశ్వరుని అంశమే. వేదాలలో కొన్నిచోట్ల వీరి సంబంధం అగ్నికి, నిప్పురవ్వలకు ఉండే సంబంధంగా చెప్పాయి. ఇక్కడ భేదం చెప్పబడింది.

ఛాందోగ్యంలో ఉద్దాలకుడు ఆత్మజ్ఞానాన్ని తన కుమారుడైన శ్వేతకేతువుకు బోధిస్తూ "జీవులు వాటి రూపాలు, నామాలు పోగొట్టుకుంటాయి. అవి అన్నీ ఏ తత్త్వంలో

కలిసిపోతాయో అదే బ్రహ్మ. అది అద్వితీయమైనది. సూక్ష్మమైనది సర్వవ్యాపకమైనది." కాబట్టి ఆత్మ, పరమేశ్వరుడు రెండూ ఒక్కటే. ఐతరేయోపనిషత్తులో పరమేశ్వరుడు ఇంద్రియాలతో కూడిన మానవశరీరంలో బ్రహ్మరంధ్రంద్వారా ప్రవేశించాడు' అని చెప్పబడింది. కాబట్టి పరమాత్మయే జీవాత్మరూపంలో ఉన్నది. ఈ రకంగా భేదం చెప్పటంవల్ల ఉపాధివల్ల కలిగిన భేదం కలవాడై, జీవాత్మ, పరమాత్మ యొక్క అంశలాగా ఉన్నాడు.

సూ. 44 మంత్రవర్ణాచ్చ

మంత్రవర్ణాత్, చ

మంత్రాలవల్ల జీవునికి అంశత్వం తెలుస్తున్నది. ఛాందోగ్యోపనిషత్తులో గాయత్రిద్వారా బ్రహ్మోపాసనను వివరిస్తూ "పృథివీ రూపమైన గాయత్రి, శరీరంలో ఉండే పంచభూతాలు, ఇంద్రియాల సమూహాలు ఒకటే. పురుషుని శరీర రూపమైన గాయత్రి, పురుషుని హృదయకమలంలో ఉండే పురుషుడు ఒకటే. ఆ పురుషునిలోనే అంటే గాయత్రిలోనే ప్రాణాలు ప్రతిష్ఠితమై ఉన్నాయి. శుద్ధబ్రహ్మ, కార్యబ్రహ్మకన్నా గొప్పది. పాంచభౌతికమైన జగత్తంతా శుద్ధ బ్రహ్మయొక్క ఒక పాదమే. మిగిలిన మూడు పాదాలు ఆ పరబ్రహ్మలోనే ఉన్నాయి. గాయత్రి ద్వారా ప్రతిపాదించబడి, మూడుపాదములు గల అమృత స్వరూపమైన బ్రహ్మము ఇదే. ఈ మంత్రం జీవుని యొక్క అంశత్వాన్ని తెలుపుతున్నది.

సూ. 45 అపిచ స్మర్యతే

అపి, చ, స్మర్యతే

భగవద్గీతలో కూడా ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ దేహంలోని సనాతనమైన జీవాత్మ నా అంశమే' అని చెప్పాడు.

సూ. 46 ప్రకాశాదివ న్నైవం పరః

ప్రకాశాదివత్, న, ఏవం, పరః

జీవాత్మ అనుభవించే సుఖదుఃఖాలు పరమేశ్వరుడికి కూడా కలుగుతాయా. అనే ప్రశ్న వస్తుంది.

అయితే జీవాత్మ దుఃఖాన్ని అనుభవించినట్లుగా పరమాత్మ అనుభవించదు. సూర్యుని వెలుతురుకు చెయ్యి అడ్డుపెడితే సూర్యకాంతి వంకరగా పడుతుంది. అంతేతప్ప వంగదు.

అలాగే ఖాళీ కుండలో ఆకాశం ఉన్నది. ఆ కుండను ఒకచోట నుంచి ఇంకొకచోటికితీసుకు వెళ్ళినప్పుడు, కుండతోపాటుగా ఆకాశాన్ని కూడా మోసుకొని పోము. కంటికి అలా కనిపిస్తుంది. అంతేగాని నిజంగా ఆకాశం తీసుకుపోబడదు. అలాగే తన అంశ అయినప్పటికీ జీవుని సుఖ దుఃఖాలు పరమేశ్వరునికి అంటవు. జీవుని దుఃఖము కూడా ఉపాధికి సంబంధించినదే.

సూ. 47 స్మరంతి చ

జీవుని దుఃఖంవల్ల పరమాత్మ దుఃఖితుడు కాడు

పరమాత్మ నిత్యుడు. నిర్గుణుడు. అతడు తామరాకు మీద నీటిబొట్టులాగా అంటకుండా ఉంటాడు. కర్మలను అనుభవించే జీవుడు తిరిగి తిరిగి జన్మలు ఎత్తుతూ ఉంటాడు.

సూ. 48 అనుజ్ఞాపరిహారౌ దేహసంబంధా జ్జ్యోతిరాదివత్
అనుజ్ఞాపరిహారౌ, దేహసంబంధాత్, జ్యోతిరాదివత్

అగ్ని మొదలైన వాటిలాగా, దేహంతో తాదాత్మ్య సంబంధంవలన, అనుజ్ఞ పరిహారము అనేవి సంభవమవుతున్నాయి.

అగ్ని అనేది ఒకటే. కాని ఒకచోట పరిత్యజించబడుతోంది. ఇంకొకచోట పూజింపబడుతోంది. యజ్ఞంలో అగ్ని చాలా పవిత్రం. అది పూజింపబడుతోంది. అదే స్మశానంలో అపవిత్రం. పరిత్యజించబడుతోంది. అలాగే ఈశ్వరుడు ఒక్కడే అయినా, దేహసంబంధంవల్ల అనేక రూపాలు పొందుతున్నాడు. కాబట్టి లౌకిక, వైదిక విధినిషేధాలు చెల్లుతాయి అన్నాడు రత్నాకరుడు. ఆ మాటలు విన్న కృష్ణశర్మ అడుగుతున్నాడు "స్వామీ! సర్వభూతాంతరాత్మ అయిన పరమేశ్వరుడు ఒక్కడే కదా! అలాంటప్పుడు ఒక శరీరంతో చేసిన పాపం ఇంకొక శరీరంతో అనుభవించటమేమిటి? ఒక శరీరంతో చేసిన కర్మకు, ఇంకొక శరీరంతో ఫలం ఎందుకు కలగదు?" దానికి సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 49 అసంత తేశ్చా వ్యతికరః
అసంతతేః, చ, అవ్యతికరః

జీవాత్మకు అన్ని శరీరాలతోను సంబంధం ఉండదు. కాబట్టి కర్మఫల సంకరం ఉండదు.

ఒక శరీరంలోని జీవాత్మకు వేరొక శరీరంలోని జీవాత్మకు సంబంధం లేదు. అందుచేత చేసే కర్మలు, వాటి ఫలితములతో కూడా సంబంధం ఉండదు. ఒకరి ఫలాన్ని ఇంకొకరు అనుభవించటం కుదరదు.

సూ. 50 ఆభాస ఏవచ
ఆభాస, ఏవ, చ

జీవుడు, పరమేశ్వరుని ప్రతిబింబము. ఆకాశం లో కనిపించే సూర్యుడు, నీటిలో కనిపించే ప్రతిబింబము, రెండూ ఒకటి కాదు. వేరువేరు.

పది కుండలలో నీరు పోసి పెడతాము. అన్నింటిలోనూ సూర్యుని ప్రతిబింబము కనిపిస్తూనే ఉంటుంది. కాని ఇందులో ఒకకుండను కదిపితే, అందులోని ప్రతిబింబమే కదుల్తుంది. అంతేకాని అన్ని కుండలలోని ప్రతిబింబము కదలదు. అలాగే ఒకజీవి చేసిన కర్మను అతడే అనుభవించాలి అంతేగాని వేరొక శరీరంలో ఉన్న జీవి అనుభవించదు.

సూ. 51 అదృష్టానియమాత్

అదృష్ట నియమంలేని సాంఖ్య, కణాదులకు మాత్రమే ఈ దోషం సంభవిస్తుంది. అంతేకాని వేదాంతమతానికి కాదు.

సాంఖ్యమతంలో ఆత్మలు అనేకం ఉన్నాయి. అవి అంతటా వ్యాపించి ఉన్నాయి. అవి చైతన్య స్వరూపాలు నిర్గుణాలు. ప్రధానమనేది ఈ ఆత్మలన్నిటికీ సాధారణమైనది. ఈ ప్రధానంవల్లనే ఆత్మలన్నింటికీ భోగాలు లభిస్తున్నాయి.

వీరిమతంలో ఆత్మలన్నీ చైతన్యరూపాలే. అవి అంతటా ఆవరించి ఉన్నాయి. కాబట్టి అన్ని ఆత్మలకు సుఖదుఃఖ సంబంధం కలుగుతుంది. ఇది దోషం.

కాణాదుల మతంలో కూడా ఆత్మలు అనేకాలు. అవి అచేతనాలు. వీటికి అచేతనాలయిన మనసులు ఉపకారకాలు. గుణాలు ఆత్మలందు చేరటాన్నే సంసారము అంటారు. ఈ విధంగా ఇచ్ఛ మొదలైన గుణాలు పుట్టకుండా ఉండటమే మోక్షము. వీరిమతంలో కూడా ఒక ఆత్మకు, మనస్సుకు సంయోగం కలిగితే మిగిలినవాటికి కూడా కలగాలి. ఫలానా ఆత్మకు మనస్సుకు సంయోగం పొందే అదృష్టం లేదు. కాబట్టి వీరికి సాంకర్యదోషం వస్తుంది అన్నాడు రత్నాకరుడు.

గురువుగారూ ! నిశ్చయాలు ఏ ఆత్మకు ఆ ఆత్మకే విడివిడిగా కలుగుతాయా! అంటే నేను ఈ పని చేస్తాను. ఈ ఫలితం పొందుతాను అవే నిశ్చయాలు. వీటిని వివరించండి" అన్నాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు

సూ. 52 అభిసంధ్యాదిష్వపి చైవమ్
అభిసంధ్యాదిషు, అపి, చ, ఏవమ్

అదృష్టానికి నిశ్చయాదులు నియామకాలైతే సుఖదుఃఖాది సాంకర్యదోషం రాదు అన్నప్పటికీ దోషపరిహారం కాదు.

నిశ్చయాదులకు కూడా ఆత్మ, మనస్సుల సంయోగం కావలసినదే, అన్ని ఆత్మలు, అన్ని మనసులు ఒకేచోట ఉండటంవలన, ఏ ఆత్మకు ఏ మనసుతో సంయోగం ఉంటుందో చెప్పలేము. ఈ ఆత్మకు సంబంధించిన నిశ్చయాదులు ఇవి అని చెప్పటానికి వీలులేదు. కాబట్టి నిశ్చయాదులకు సాంకర్యదోషం తప్పదు.

సూ. 53 ప్రదేశా దితిచే న్నాంతర్భావాత్
ప్రదేశాత్, ఇతి, చేత్, న, అంతర్భావాత్

ఆత్మలు సర్వవ్యాపకాలు. అన్ని శరీరాల్లోనూ ఉంటాయి. కాబట్టి ఒక శరీరంలో చేరిన ఆత్మ, మనసులకే సంయోగం కలుగుతుంది అని చెప్పటానికి కూడా వీలులేదు. అందుచేత బింబ, ప్రతిబింబ వాదము ప్రకారము సుఖదుఃఖావస్తకు సాంకర్య దోషం లేదు. (అంటే పది కుండలలో కనిపిచే ప్రతిబింబం, ఒక కుండను కదిపితే అన్ని కుండలలోని ప్రతిబింబము కదలదు) అంటూ ద్వితీయాధ్యాయంలోని తృతీయపాదాన్ని పూర్తి చేశాడు రత్నాకరుడు.

చతుర్థపాదము

ఈ పాదంలో లింగశరీరానికి సంబంధించి శ్రుతివాక్యాలలో ఉన్న భేదాన్ని సమం చేస్తున్నారు. ఈ పాదంలో 9 అధికరణలు, 22 సూత్రాలు ఉన్నాయి.

వ.నెం.	అధికరణము	విషయము	సూత్రాలు
1.	ప్రాణోత్పత్త్యధికరణము	ఇంద్రియాల ఉత్పత్తి	4
2.	సప్తగత్యధికరణము	ఇంద్రియాల సంఖ్య	2
3.	ప్రాణాణుత్వాధికరణము	ఇంద్రియాల పరిమాణం	1
4.	ప్రాణశ్రేష్ఠాధికరణము	ముఖ్యప్రాణము బ్రహ్మమే	1
5.	వాయుక్రియాధికరణము	ముఖ్యప్రాణము వాయువు కన్న వేరైనది	4
6.	శ్రేష్ఠాణుత్వాధికరణము	ముఖ్యప్రాణము అణుపరిమాణం గలది	1
7.	జ్యోతిరాద్యధికరణము	ఇంద్రియాధిష్ఠాన దేవతలు	3
8.	ఇంద్రియాధికరణము	ఇంద్రియాలు ముఖ్యప్రాణము యొక్క వృత్తిభేదాలు కావు	3
9.	సంజ్ఞామూర్తిక్లృప్త్యధికరణము	నామరూప వ్యక్తీకరణము జీవకృత్యం కాదు	3
		మొత్తం సూత్రాలు	22

1. ప్రాణోత్పత్త్యధికరణము

"గురువుగారూ ! ప్రాణాల ఉత్పత్తినిగూర్చి అన్ని ఉపనిషత్తులలోనూ చెప్పలేదు. కొన్నిచోట్ల సృష్టికి పూర్వమే ప్రాణం ఉన్నట్టు చెప్పారు. కాబట్టి ప్రాణాన్ని గురించి వివరించండి" అన్నాడు నారాయణభట్టు. ప్రారంభించాడు రత్నాకరుడు.

సూ. 1 తథా ప్రాణాః

ఆకాశము మొదలైన వాటిలాగా ప్రాణాలకు కూడా ఉత్పత్తి ఉన్నది. ప్రాణాలు అంటే ఇంద్రియాలు అని కూడా అర్థము. ముండకోపనిషత్తులో "పరబ్రహ్మనుండే సప్తప్రాణాలు (కళ్ళు-2, ముక్కులు-2, చెవులు-2, నోరు-1) పుట్టినాయి. అని చెప్పబడింది. ప్రశ్నోపనిషత్తులో "ఆ పురుషుడు ఈ శరీరం నుంచి ఎవరు వెడితే నేను

వెడతాను. ఎవరు ఉంటే నేను ఉంటాను అని ఆలోచించినవాడై, ముందుగా శరీరానికి అవసరమైన ప్రాణాన్ని సృష్టించాడు. తరువాత దానినుండి శ్రద్ధ, ఆకాశము, వాయువు, అగ్ని, జలము, భూమి, ఇంద్రియాలు, మనస్సు, అన్నము సృష్టించాడు అని చెప్పబడింది. వీటిని బట్టి చూస్తే, ప్రాణాలు బ్రహ్మయొక్క వికారాలు అనితెలుస్తోంది.

సూ. 2 గౌణ్యసంభవాత్
గౌణీ, అసంభవత్

ప్రాణోత్పత్తి విషయం గౌణము అనటం సంభవం కాదు. ఎందుకంటే ఆ ఒక్క విషయము తెలిసినంత మాత్రంచేత అన్ని విషయాలు తెలుస్తాయి.

ముండకోపనిషత్తులో శౌనకుడు "గురువర్యా! అంగీరసమహర్షీ, దేన్నిగురించి తెలుసుకుంటే నాకు సర్వమూ తెలుస్తాయో, దాన్ని గురించి వివరించండి" అన్నాడు. ఆ ఒక్క విషయము తెలుసుకుంటే అన్ని విషయాలు తెలుస్తాయి. పరబ్రహ్మనుండే సమస్త ప్రాణాలు పుడుతున్నాయి. ఇక్కడ ప్రాణాలుత్పత్తి కూడా చెప్పబడింది. కాబట్టి ఇది గౌణము కాదు.

సూ. 3 తత్ప్రాక్ శ్రుతేశ్చ
తత్, ప్రాక్, శ్రుతేః, చ

ఉత్పత్తిని సూచించే పదం 'జాయతే'. ఇది ఆకాశము మొదలైన వాటికన్న ముందుగా ప్రాణాలతో సంబంధం కలిగి ఉన్నది. కాబట్టి ప్రాణోత్పత్తి ముఖ్యమేకాని గౌణం కాదు.

జాయతే అనే పదంతోనే ఆకాశము మొదలైన భూతాలన్నీ పుట్టాయని చెబుతుండగా, అక్కడ వాటి విషయంలో ముఖ్యమైన ఈ పదము ప్రాణాల విషయంలో గౌణం కాదు.

సూ. 4 తత్పూర్వకత్వాద్వాచః
తత్ పూర్వకత్వాత్, వాచః

వాక్కు, మనస్సు, ప్రాణం అనేవి భూతాలన్నింటికన్న ముందుగా పుడుతున్నాయి. అని శ్రుతులు చెబుతున్నాయి. కాబట్టి ప్రాణోత్పత్తి నిజం, అంటే ప్రాణం ఉత్పత్తి చెందింది అంటూ మొదటి అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

2. సప్తగత్యధికరణము

"గురువర్యా ! అసలు ప్రాణాలు ఎన్ని ? వాటి సంఖ్య ఎంత ?" అన్నాడు కృష్ణశర్మ. వివరించటం మొదలుపెట్టాడు రత్నాకరుడు. ప్రాణాలు అంటే ఇంద్రియాలు.

సూ. 5 సప్తగతే ర్విశేషితత్వా చ్చ
సప్త, గతేః, విశేషితత్వాత్, చ

ఇంద్రియాలు అంటే ప్రాణాలు ఏడు.

ముండకోపనిషత్తులో అపరబ్రహ్మ నుండే సప్తప్రాణాలు ఉద్భవించాయి. అవి కళ్ళు-2, ముక్కులు - 2, చెవులు - 2, నోరు - 1, మొత్తం ఏడు. బృహదారణ్యకోపనిషత్తులో ఋతభాగుని కుమారుడు ఆర్తభాగుడు అడుగుతున్నాడు. యాజ్ఞవల్క్య ! గ్రహాలు ఎన్ని? అతిగ్రహాలు ఎన్ని ? దానికి యాజ్ఞవల్క్యుడు చెబుతున్నాడు. గ్రహము అంటే గ్రహించేది. ఇంద్రియము. విషయాలను గ్రహించేవి కాబట్టి గ్రహాలు. అతిగ్రహము అంటే అంతకన్న పెద్దది గొప్పది కాబట్టి విషయాలే అతిగ్రహాలు.

గ్రహాలు ఎనిమిది. అతిగ్రహాలు ఎనిమిది.

1.	ప్రాణము గ్రహము	-	వాసన అతిగ్రహము
2.	నాగింద్రియము గ్రహము	-	నామము అతిగ్రహము
3.	నాలుక గ్రహము	-	రుచి అతిగ్రహము
4.	కన్ను గ్రహము	-	రంగు రూపము అతిగ్రహము
5.	చెవి గ్రహము	-	శబ్దము అతిగ్రహము
6.	మనస్సు గ్రహము	-	కోరిక అతిగ్రహము
7.	చేతులు గ్రహము	-	కర్మ అతిగ్రహము
8.	చర్మము గ్రహము	-	స్పర్శ అతిగ్రహము

ఈ రకంగా ప్రాణాలు ఏడు, ఎనిమిది, పది, పదకొండు, పన్నెండు, అని అనేకచోట్ల చెప్పటం జరిగింది. కాబట్టి అసలు ప్రాణాలసంఖ్య ఎంత ? అని అనుమానం వచ్చింది. ఈ కారణంచేత వేదంలోనే భేదం ఉన్నది అని వారి వాదన.

సూ. 6 హస్తాదయస్తు స్థితేఽతో నైవమ్
హస్తాదయః, తు, స్థితే, అతః, న, ఏవమ్

చేతులు మొదలైన ఇంద్రియాలు అధికంగా ఉండటంవల్ల ప్రాణాలు ఏడు అనకూడదు.

యుక్తిబలంచేత వచన ప్రాబల్యంచేత ఇంద్రియాలు పదకొండు అంటున్నారు. అవి దర్శన, శ్రవణ, ఆఘ్రాణ, ఆస్వాదన, స్పర్శన, వదన (మాట్లాడటం) ఆ దాన (స్వీకరించటం)

గమన, ఆనంద, విసర్గ, ధ్యానము అనేవి బృహదారణ్యకంలో "జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, మనస్సు. ప్రాణియొక్క కర్మ పరిసమాప్తమైనప్పుడు వీరు శరీరంనుంచి నిష్క్రమిస్తారు. ఈ రకంగా శరీరం వదలి బంధువులను రోదింపచేస్తారు కాబట్టి ఇవి రుద్రశబ్దంచేత పిలువబడతాయి. ఇవే ఏకాదశరుద్రులు" అని చెప్పబడింది.

ఈ రకంగా ప్రాణములు భిన్నసంఖ్యలో చెప్పబడ్డాయి. కాబట్టి ప్రాణాలు (ఇంద్రియాలు) ఏడు కావు. అంటూ రెండవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

3. ప్రాణాణుత్వాధికరణము

"గురువర్యా! ఇంద్రియాల పరిమాణం ఎంత?" అడిగాడు కృష్ణశర్మ. చెప్పటం మొదలుపెట్టాడు రత్నాకరుడు.

సూ. 7 అణవశ్చ

ఇంద్రియాల అణురూపాలు. ఇవి సర్వగతాలు కావు. శరీరమంతటా పని చేస్తున్నాయి. మరణసమయంలో చప్పుడు చేయకుండా శరీరంనుంచి బయటకు వెళ్ళిపోతాయి. ప్రక్కన ఉన్నవారికి కూడా కనిపించవు. కాబట్టి ఇవి విభజించబడినాయని, అణురూపాలని అనుకోవాలి. అణువు అంటే సూక్ష్మాతిసూక్ష్మమైనదనే అర్థం. ఇవి సర్వవ్యాపకాలు కావు. ఒకవేళ అంతటా వ్యాపించి ఉంటే లోకంలో జరిగే అన్ని విషయాలు వీటికి తెలియాలి. అది జరగదు. కాబట్టి ఇంద్రియ పరిమాణము సూక్ష్మాతి సూక్ష్మము అంటూ మూడవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు

4. ప్రాణశ్రేష్ఠాధికరణము

సూ. 8 శ్రేష్ఠశ్చ
శ్రేష్ఠః, చ

ముఖ్యప్రాణము కూడా బ్రహ్మమే. బ్రహ్మమునుండే ప్రాణము పుడుతోంది. ఛాందోగ్యోపనిషత్తులో ప్రాణమే జ్యేష్ఠము, శ్రేష్ఠము అని చెప్పబడింది. బృహదారణ్యకోపనిషత్తులో "ప్రాణమే జ్యేష్ఠము, శ్రేష్ఠము అని తెలుసుకున్నవాడు తనవారిలో జ్యేష్ఠుడు, శ్రేష్ఠుడు అవుతాడు" అని చెప్పబడింది. కాబట్టి ప్రాణము శ్రేష్ఠమైనది. ముఖ్యప్రాణము బ్రహ్మమే అంటూ నాల్గవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

5. వాయుక్రియాధికరణము

"గురుదేవా! ముఖ్యప్రాణము అన్నారు కదా ! దాని స్వరూపము ఎటువంటిది?" అని అడిగాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 9 నవాయుక్రియేపృథగుపదేశాత్
న, వాయుక్రియే, పృథక్, ఉపదేశాత్

ప్రాణం అంటే వాయువు కాదు. వాయువు యొక్క క్రియల్ని ప్రాణం కన్న వేరుగా నిర్దేశించి చెప్పారు.

సామాన్యంగా ముఖమున ఉండే వాయువునే ప్రాణం అంటారు. అది నిజం కాదు. ప్రాణమనేది మనోమయబ్రహ్మ యొక్క చతుర్థపాదం. వీటిని బట్టి ప్రాణమనేది వాయువు కన్న వేరైనది. అయితే ప్రాణము స్వజీవునిలాగా స్వతంత్రమైనదా అని అనుమానం.

సూ. 10 చక్షురాది వత్తు తత్సహశిష్ట్యాదిభ్యః
చక్షురాదివత్, తు, తత్సహ, శిష్ట్యాదిభ్యః

ప్రాణంకూడా చక్షురాది ఇంద్రియాల వంటిదే తప్ప వేరు కాదు. కాబట్టి ప్రాణము జీవునిలాగా స్వతంత్రమైనది కాదు. చాందోగ్యంలోను, బృహదారణ్యకంలోనూ కూడా ఇంద్రియాలన్నీ తమలో ఎవరు గొప్ప అని వాదించుకున్నాయి. అప్పుడు ఇంద్రియాలతో పాటు ప్రాణంకూడా చెప్పబడింది. దేహానికి జీవుడు రాజు, ప్రాణం మంత్రి ఇంద్రియాలు ప్రకృతివర్గము. కాబట్టి ప్రాణం స్వతంత్రము కాదు. జీవుని అధీనంలో ఉంటూ ఉపకరణంలా సహకరిస్తుంది.

సూ. 11 ఆకరణత్వాచ్చ నదోషస్తథాహి దర్శయతి
ఆకరణత్వాత్, చ, న, దోషః, తథా, హి, దర్శయతి

ముఖ్యప్రాణం చక్షురాది ఇంద్రియాలవలె ఇంద్రియం కానందువల్ల దోషం ఏమీలేదు.

ఇంద్రియాలన్నీ జీవుడికి లోబడి ఉంటాయి. కాబట్టి అవి స్వతంత్రములు కావు. అలాగే ప్రాణము కూడా జీవుడికి లోబడి ఉంటుంది. అది అస్వతంత్రము.

సూ. 12 పంచవృత్తి ర్మనోవద్వ్యపదిశ్యతే
పంచవృత్తిః, మనోవత్, వ్యపదిశ్యతే

మనసుకు శ్రోత్రాదులవలన శబ్దాదిభావాలు కలిగినట్లుగా, ముఖ్యప్రాణము పంచవృత్తులు (భావాలు) కలిగి ఉంటుంది.

మనసుకు నేత్రాది ఇంద్రియాలవల్ల శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు వచ్చినట్లే. ముఖ్యప్రాణానికి కూడా ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానములనబడే ఐదు వ్యాపారాలు కలుగుతున్నాయి. ఈ రకంగా ముఖ్యప్రాణము వాయువుకన్న వేరైనది అంటూ ఐదవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

6. శ్రేష్ఠాణుత్వాధికరణము

సూ. 13 అణుశ్చ

ముఖ్య ప్రాణము అణుపరిమాణం గలది. మిగిలిన ఇంద్రియాలలాగానే ఇది అతిసూక్ష్మమైనది. శరీరంనుంచి నిష్క్రమించేటప్పుడు మిగిలిన ఇంద్రియాలలాగేనే ఇది కూడా కనిపించదు. అంటూ ఆరవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

7. జ్యోతిరాద్యధికరణము

"గురువర్యా! వాగింద్రియాలకు తమ తమ వ్యాపారాల్లో స్వాతంత్ర్యం ఉన్నదా?" అని అడిగాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 14 జ్యోతిరాద్యధిష్ఠానంతు తదామననాత్
జ్యోతిరాద్యధిష్ఠానమ్, తు, తదామననాత్

అగ్ని మొదలైన అధిదేవతలచే ఇంద్రియాలు ప్రేరేపించబడుతున్నాయి.

పరమాత్మ, విరాట్స్వరూపాన్ని దృష్టిలో ఉంచుకుని తీవ్రమైన ఆలోచన చేశాడు. అదే తపస్సు. దానిఫలితంగానే విరాట్స్వరూపానికి నోరు వచ్చింది. ఆ నోటి నుండి మాట, వాణికి అభిమాన దేవత అయిన అగ్ని ఉత్పన్నమైనాయి. తరువాత ముక్కు దానినుండి ప్రాణశక్తి. దాని నుండి వాయువు పుట్టాయి. తరువాత

నేత్రాలు	–	నేత్రానికి అభిమానదేవత సూర్యుడు
చెవులు	–	దిక్కులు
హృదయం	–	దానినుండి మనస్సు దాని అభిమానదేవత చంద్రుడు
నాభి	–	దాని నుండి అపానము – దాని నుండి మృత్యువు
జననేంద్రియము	–	దాని నుంచి వీర్యము – దాని అభిమాన దేవత జలము

ఈ రకంగా ఇంద్రియాలు, వాటి అభిమాన దేవతలు ఉద్భవించారు. తరువాత ఇంద్రియాలన్నీ తమ అభిమాన దేవతలచే అధిష్ఠాలై తమ తమ పనులు చేస్తున్నాయి.

ఇక్కడ దేవతలచే అధిష్ఠించబడి ఇంద్రియాలు పని చేసేటప్పుడు, ఆ పనుల భోక్తృత్వంకూడా ఆ అభిమాన దేవతలకే చెందాలి కదా? అన్న ప్రశ్న వస్తుంది.

సూ. 15 ప్రాణవతా శబ్దాత్
ప్రాణవతా, శబ్దాత్

శ్రుతులలో చెప్పిన దాన్ని బట్టి ఇంద్రియాలకు జీవునితోనే సంబంధం ఉన్నది. ఇంద్రియాలకు అధిష్ఠాన దేవతలున్నప్పటికీ, వాటి సంబంధం ప్రత్యక్షంగా జీవునితోనే

చక్షురింద్రియము ప్రకాశించిన చోట ఉన్నవాడు చాక్షుష పురుషుడు. అతడు చూడటానికే ఈ చక్షువు. అతడు వినటానికే చెవులు అతడు వాసన చూడటానికే ఈ ముక్కు. ఈ రకంగా ఇంద్రియాలన్నీ జీవుని కోసమే. జీవునితోనే ప్రత్యక్ష సంబంధము కలిగి ఉన్నాయి. ఇంద్రియాభిమానదేవతలు వేరుగా ఉన్నప్పటికీ వారికి భోక్తృత్వము ఉండదు. కర్మఫల సంబంధం ఉండదు.

సూ. 16 తస్యచ నిత్యత్వాత్
తస్య, చ, నిత్యత్వాత్

శరీరంలో ఇంద్రియాధిష్ఠాన దేవతలకు భోక్తృత్వం లేదు. భోక్తరూపంలో జీవుడే నిత్యుడు.

ఈ శరీరం జీవుని కర్మవల్ల ఏర్పడింది. అందుచేత జీవుడే భోక్త. అతనికే పుణ్యపాప సంబంధం ఉంటుంది. సుఖము, దుఃఖము, భోగము అతనికే ఉంటుంది.

దేవతలు అంటే విశిష్ట కర్మఫలం దైవత్వం పొందినవారు వీరు. కాబట్టి వీరికి పుణ్యఫలమే కాని పాపం అంటదు. వారికి మానవశరీరంలో భోగంకూడా ఉండదు. అని బృహదారణ్యకం చెబుతోంది.

జీవాత్మ శరీరం నుంచి బయటకు పోవటానికి మార్గం కనిపిస్తుంది. ఆ స్థితిలో ఆత్మ శిరస్సుద్వారాగాని, మిగిలిన అవయవాలద్వారాగాని బయటకు పోతుంది. దానితో పాటే ప్రాణంకూడా పోతుంది. ప్రాణం శరీరం నుంచి బయటకు రాగానే ఇంద్రియాలన్నీ శక్తి హీనమవుతాయి. కాబట్టి అధిష్ఠాన దేవతలకు భోక్తృత్వం లేదు. భోక్తృత్వము జీవునిదే అంటూ ఏడవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

8. ఇంద్రియాధికరణము

"గురువుగారూ ! ముఖ్యప్రాణం ఒకటి. బృహదారణ్యకంలో చెప్పినట్లుగా ఇంద్రియ రూపమైన ప్రాణాలు పదకొండు అంటే మిగిలినవన్నీ ముఖ్యప్రాణంయొక్క వృత్తి భేదాలే. ఇంద్రియాలనేవి వేరుగా ఉంటే, వాటి అధిష్ఠానదేవతల గురించి ఆలోచించవచ్చు. ఐతే, ప్రాణాలే తప్ప, ఇంద్రియాలనేవి వేరుగా లేవుకదా" అన్నాడు నారాయణభట్టు సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 17 త ఇంద్రియాణి తద్వ్యపదేశా దన్యత్ర శ్రేష్ఠాత్

తే, ఇంద్రియాణి తద్వ్యపదేశాత్, అన్యత్ర, శ్రేష్ఠాత్

వేదమందు వేరుగా చెప్పబడటంవల్ల, ముఖ్యప్రాణము కన్న వేరైనట్టి వాగాదులన్నీ ఇంద్రియాలనే శబ్దంతో చెప్పబడుతున్నాయి.

ముండకోపనిషత్తులో చెప్పినట్లుగా పరమాత్మ నుంచి ప్రాణాలు, మనస్సు, సమస్త ఇంద్రియాలు పుడుతున్నాయి. ఇక్కడ ప్రాణము ఇంద్రియాలు వేరువేరని చెప్పారు. కాబట్టి ప్రాణాలు ఇంద్రియాలు కావు. మనస్సు ఆరవ ఇంద్రియము.

సూ. 18 భేదశ్రుతేః

వేదంలో ప్రాణాలను వేరుగా చూపటంవల్ల వాగాదులు ముఖ్యప్రాణంకన్న భిన్నతత్త్వాలే.

బృహదారణ్యకోపనిషత్తులో దేవదానవుల యుద్ధంలో దేవతలు ఓడిపోయి, ఉద్గీతోపాసనతో అసురుల మీద విజయాన్ని సాధించాలనుకున్నారు. ముందుగా వాగింద్రియాన్ని ఆశ్రయించి, తమ కోసం ఉద్గీతోపాసన చెయ్యమన్నారు. అని చెబుతూ చివరకు ముఖ్యప్రాణంతో అసురులను జయించారు. అని చెప్పబడింది. అంటే ఇంద్రియాలు, ప్రాణము వేరువేరని తెలుస్తోంది.

సూ. 19 వై లక్షణ్యాచ్చ

ముఖ్యప్రాణంకన్న ఇతర ఇంద్రియాలకు భేదం ఉండటంవల్ల ప్రాణము, ఇంద్రియాలు వేరువేరని చెప్పవచ్చు.

"బృహదారణ్యకంలో" మరణకాలంలో వాక్కు మనస్సులో లీనమవుతుంది. మనసు ప్రాణంలో లీనమవుతుంది. ప్రాణం తేజస్సులో కలిసిపోతుంది. చివరకు అది పరమశక్తిలో కలిసిపోతుంది" కాబట్టి ఇంద్రియాలు ప్రాణము వేరువేరు అంటూ ఎనిమిదవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

9. సంజ్ఞామూర్తిక్లప్త్యధికరణము

"గురువర్యా! సంజ్ఞ అంటే నామము. మూర్తి అంటే రూపము. ఈ విధంగా నామరూపాలను వికసింపచేసినది ఈశ్వరుడా? జీవుడా? వివరించండి" అన్నాడు కృష్ణశర్మ. సమాధానం చెప్పటం ప్రారంభించాడు రత్నాకరుడు.

సూ. 20 సంజ్ఞామూర్తిక్లప్తి స్తుత్రి వృత్కుర్వత ఉపదేశాత్

నామరూపాలను వికసింపచేయటమనేది ఈశ్వరుని పనే. పరమేశ్వరుడు ముందుగా తేజస్సును, ఆ తరువాత జలము, అన్నము సృష్టించి, నేను వీటిలో ప్రవేశించి, నామ రూపాలను విస్తరింపచేస్తాను అనుకున్నాడు. అని ఛాందోగ్యంలో చెప్పబడింది. కాబట్టి నామరూప వ్యాపకర్త ఈశ్వరుడేకాని వేరెవరూ కాదు.

సూ. 21 మాంసాది భౌమం యథాశబ్దమితరయోశ్చ

మాంసాది, భౌమం, యథాశబ్దమ్, ఇతరయోః, చ

మాంస పురీషాదులు అన్నాత్మకమైన భూమియొక్క కార్యాలు. మూత్రము, రుధిరము జల కార్యాలు.

అన్నాన్ని పురుషుడు భుజిస్తున్నాడు. భుజించిన అన్నము మూడు భాగాలవుతున్నది. అవే మలము, మాంసము, మనస్సు, అన్నంలోని

స్థూలభాగము	–	మలము
మధ్యభాగము	–	మాంసము
సూక్ష్మభాగము	–	మనస్సు

అంటే ధాన్యాదిరూపంలో పృథివినే భుజిస్తున్నాడు. అదే విధంగా మనం త్రాగిన నీరు మూత్రము, రక్తము, ప్రాణముగా మారుతోంది. అలాగే మనం భుజించే తేజోపదార్థము (నూనె, నెయ్యి మొదలైనవి) ఎముకలు, మజ్జ, వాక్కుగా మారుతుంది. దీనినే 'త్రివృత్కరణము' అంటారు. ఈ రకంగా భూతిక భౌతిక పదార్థాలన్నీ త్రివృత్కృతాలే. అయితే ఇది పృథివి అని, ఇది జలము అని, ఇది తేజస్సు అని అనటం ఏ విధంగా సంభవము అనేది ప్రశ్న.

సూ. 22 వైశేష్యాత్తు తద్వాదస్తద్వాదః

వైశేష్యాత్, తు, తద్వాదః, తద్వాదః

త్రివృత్కృతం జరిగినా, ఏదో ఒక మూలభూతం యొక్క ఆధిక్యత కనిపిస్తుంది. అగ్నిలో తేజస్సు యొక్క ఆధిక్యం, జలంలో జలం యొక్క ఆధిక్యం. పృథివిలో అన్నము యొక్క ఆధిక్యం లాగా, ఈ త్రివృత్కృతమనేది లోకవ్యవహారం కోసం చెప్పబడింది. ఈ రకంగా నామరూప వ్యక్తీకరణ ఈశ్వరకృతమే కాని, జీవకృతం కాదు. అంటూ ద్వితీయాధ్యాయాన్ని ముగించాడు రత్నాకరుడు.

తృతీయాధ్యాయము

ఈ అధ్యాయంలో ఉపకరణ సహితుడైన జీవుడికి సంసారగతి ఏ విధంగా సంభవిస్తోంది? వాటి అవస్థలు ఏవి? మోక్షము ఎలా సిద్ధిస్తుంది?

మొదటి పాదం

ఈ పాదంలో వైరాగ్యసిద్ధి కోసం పంచాగ్ని విద్య మూలంగా సంసారగతిలో భేదాలు చెప్పి తద్వరా వైరాగ్యం కలిగించే మార్గం చెబుతున్నారు. ఈ అధ్యాయంలో 6 అధికరణలు 27 సూత్రాలు ఉన్నాయి.

వ.నెం.	అధికరణము	విషయము	సూత్రాలు
1.	తదంతరప్రతిపత్త్యధికరణము	మరణ సమయంలో జీవుడు భూతసూక్ష్మ పరివేష్ఠితుడై ఉంటాడు	7
2.	కృతాత్యయాధికరణము	కర్మశేషం నూతనజన్మను నిర్ణయిస్తుంది	4
3.	అనిష్టాది కార్యధికరణము	ఇష్టాపూర్తములు చెయ్యనివారికి చంద్రలోక ప్రాప్తి లేదు	10
4.	సాభావ్యాపత్త్యధికరణము	అవరోహణలో జీవుడు ఆకాశాదుల సాదృశ్యాన్ని మాత్రమే పొందుతాడు	1
5.	నాతిచిరాధికరణము	చంద్రలోకం నుండి దిగటం త్వరగానే జరుగుతుంది	1
6.	అన్యాధిష్ఠితాధికరణము	జీవుడికి ధాన్యాదులతో సంసర్గం మాత్రమేఉంటుంది	4
		మొత్తం సూత్రాలు	27

ఇక మొదటి అధికరణను చూద్దాం.

1. తదంతర ప్రతిపత్త్యధికరణము

"గురువుగారూ ! జీవుడు జీర్ణమైన ఈ దేహాన్ని వదలి వేరొక శరీరంలో ప్రవేశిస్తాడు. అలా వెళ్ళేటప్పుడు ఆ క్రొత్త దేహానికి కారణరూపమైన భూతసూక్ష్మాలతో కలిసివెడతాడా? లేక వాటితో కూడకుండానే వెడతాడా? తెలియచెయ్యండి" అన్నాడు కృష్ణశర్మ. చెప్పటం ప్రారంభించాడు రత్నాకరుడు.

సూ. 1 తదంతర ప్రతిపత్తౌరంహతి సంపరిష్వక్తః ప్రశ్న నిరూపణాభ్యామ్
తదంతర ప్రతిపత్తౌ, రంహతి, సంపరిష్వక్తః, ప్రశ్ననిరూపణాభ్యాం

ఇంకొక శరీరాన్ని పొందటానికి జీవుడు భూత సూక్ష్మాలతో కలిసి వెడుతున్నాడు. ఛాందోగ్యోపనిషత్తులో ఈ విధంగా చెప్పబడింది. పూర్వకాలంలో పాంచాల దేశాన్ని ప్రవాహణుడు అనే రాజు పరిపాలిస్తున్నాడు. అతని ఆస్థానానికి వచ్చాడు శ్వేతకేతువు వచ్చిన శ్వేతకేతువును పరీక్షించే ఉద్దేశ్యంతో ఐదు ప్రశ్నలు వేశాడు ప్రవాహణుడు. వాటిలో ఒక్కదానికీ సమాధానం చెప్పలేదు శ్వేతకేతువు. ఆ తరువాత శ్వేతకేతు తండ్రి అయిన ఉద్దాలకుడు వచ్చి, ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పమని కోరగా, రాజైన ప్రవాహణుడు చెబుతున్నాడు.

"యజ్ఞాలు ఐదు రకాలు. యజ్ఞవిధానంలో ఈ విధంగా ఉంటుంది. స్వర్గమే అగ్ని. యజ్ఞానికి హవిస్సు సూర్యుడు. యజ్ఞఫలం సోమరసం. ఈ సోమరసం మేఘాలవరకు ప్రయాణిస్తుంది. మేఘాలద్వారా భూలోకంలో వర్షిస్తుంది. దానివల్ల అన్నం పుడుతుంది. అన్నం మానవునిలో రేతస్సుగా మారుతుంది. ఆ శక్తి స్త్రీలో ప్రవేశిస్తుంది. అప్పుడామె గర్భం దాలుస్తుంది. బిడ్డను ప్రసవిస్తుంది. ఈ రకంగా ఐదు రకాల యజ్ఞదశలు దాటి యజ్ఞఫలమైన సోమరసం పురుషుడుగా మారుతుంది. ఇదే పంచాగ్నివిద్య అని చెప్పబడింది. దీనివల్ల 'జలము, భూమి ఇత్యాది భూతసూక్ష్మాలవల్లనే జీవి మరొక దేహం పొందుతున్నది' అని తెలుస్తున్నది.

ఇక భూత సూక్ష్మాలు అంతటా లభిస్తాయి కదా! ప్రత్యేకంగా వెంట పెట్టుకుని వెళ్ళటం ఎందుకు? అన్నది ప్రశ్న.

భూత సూక్ష్మాలు సర్వత్రా లభించినప్పటికీ, దేహానికి అవసరమయ్యే బీజాలు సర్వత్రా లభించవు. అందుచేత భూత సూక్ష్మాలను వెంట తీసుకువెళ్ళటం జరుగుతుంది అన్నాడు రత్నాకరుడు. ఆ మాటలు విన్న కృష్ణశర్మ "స్వామీ!" గొంగళిపురుగు ఒక ఆకును పూర్తిగా

అనుభవించి, దాన్ని నిస్సారం చేసి, వేరొక ఆకు మీద ఆశ్రయం సంపాదించి అంటే ఇంకొక ఆకును పట్టుకుని శరీరాన్ని కుంచించి వేసి మొదటి ఆకునుండి పూర్తిగా ఇవతలకు వస్తుంది. అలాగే ఆత్మ తానున్న శరీరాన్ని చంపి వేరొక శరీరాన్ని ఆశ్రయిస్తుంది" అని బృహదారణ్యకంలో చెప్పబడింది. అలాంటప్పుడు ఈ సూక్ష్మభూతాలతో పని ఏమిటి?" ఆ మాటలు విన్న రత్నాకరుడు చెబుతున్నాడు. "నాయనా, జీవుడు తనకర్మ ఫలం అనుభవించటానికి కొత్త శరీరం పొందుతున్నాడు. పాత శరీరాన్ని వదలి కర్మానుసారము క్రొత్త శరీరంలోకి ప్రవేశిస్తాడు అంతేగాని క్రొత్త శరీరం పొంది, పాతదానిని వదలటం జరగదు.

సూ. 2 త్ర్యాత్మకత్వాత్తు భూయస్త్వాత్
త్ర్యాత్మకత్వాత్, తు, భూయస్త్వాత్

జీవుడు అన్ని భూతాలతోనూ కలిసి వెడుతున్నాడు. గతంలో చెప్పినట్లుగా జీవుడు ఉదకాలతో చుట్టబడిన వాడై వెడుతున్నాడు. అంటే యజ్ఞఫలమైన సోమరసం మేఘాలదాకా వెళ్ళి, వర్షంగా కురుస్తోంది. ఆ వర్షంవల్ల పంటలు పండుతున్నాయి. ఈ వర్షమే ఆ ఉదకము. అయితే జీవుడు ఉదకంతో కలిసి వెడుతున్నాడు కాని, మిగిలిన సూక్ష్మభూతాలతో కలిసి వెళ్ళటం లేదు కదా! అని అనుమానం వస్తుంది. పృథివి, జలము, అగ్ని ఈ మూడింటిరూపము అన్నింటిలోనూ ఉన్నది. ఈ మూడింటిలోని ప్రతిదానిలో అన్నీ ఉన్నాయి. కాబట్టి ఉదకంతో జీవుడు వెళ్ళాడు అంటే, మిగిలిన సూక్ష్మభూతాలతో కూడా కలిసి వెళ్ళినట్లే అని గుర్తుంచుకోవాలి. శరీరంలో పృథివి, అగ్ని భాగాలకన్న జలభాగమే ఎక్కువ ఉంటుంది కాబట్టే ఉదకాలకు పురుషుడనే పేరు కలిగింది.

సూ. 3 ప్రాణగతేశ్చ
ప్రాణ, గతేః, చ

వేదాలననుసరించి జీవునితోపాటుగా ఇంద్రియాలు కూడా వెడుతున్నాయి. కాబట్టి జీవుడు సూక్ష్మభూతాలతో పరివేష్ఠితుడై ఉన్నాడని తెలుస్తున్నది. బృహదారణ్యకోపనిషత్తులో యాజ్ఞవల్క్యుడు, జనకమహారాజుకు ఆత్మను గురించి వివరిస్తూ "అంత్యకాలంలో జీవాత్మ శరీరంనుంచి బయటకు పోవటానికి మార్గం కనిపిస్తుంది. ఆ స్థితిలో ఆత్మ శిరస్సుద్వారా కాని, నవరంధ్రాలద్వారాగాని బయటకు పోతుంది. దానితోపాటే ప్రాణంకూడా బయటకు పోతుంది. ప్రాణం శరీరంనుంచి బయటకు రాగానే ఇంద్రియాలన్నీ శక్తి హీనమయి పోతాయి. ఆ స్థితిలో జీవుడు మంచి విజ్ఞానవంతుడుగా ఉంటాడు. విజ్ఞానంతో కూడిన

ప్రదేశానికి పోతాడు. అతనితోపాటు, అతని జ్ఞానము, అతడు చేసిన కర్మ, పూర్వజన్మ సంస్కారము అతని వెంట వెడతాయి. దీనిని బట్టి ఆశ్రయం లేకుండా ఇంద్రియాలు ఉండలేవు. ఎక్కడికీ పోలేవు. కాబట్టి వాటికి ఆధారంగా, ఆశ్రయంగా సూక్ష్మభూతాలు ఉండాలి. ఈ విధంగా జీవునితోబాటు సూక్ష్మభూతాల కూడా వెడతాయి.

సూ. 4 అగ్న్యాదిగతి శ్రుతేరితిచేన్న భాక్తత్వాత్

అగ్న్యాది, గతి, శ్రుతేః, ఇతి, చేత్, న, భాక్తత్వాత్

మానవుడు చనిపోయిన తరువాత వాక్కు మొదలైన ఇంద్రియాలు వాటివాటి అభిమాన దేవతలలో లీనమవుతాయి అని వేదంలో చెప్పబడింది. కాబట్టి ప్రాణాలు జీవుని అనుసరించవు. అని వాదన, అది నిజం కాదు.

బృహదారణ్యకోపనిషత్తులో ఆర్తభాగుడు యాజ్ఞవల్క్యుణ్ణి అడుగుతున్నాడు. యాజ్ఞవల్క్యా ! మానవుడు చనిపోయిన తరువాత అతని యొక్క

వాక్కు	–	అగ్నిలో లీనమయిపోతుంది
ప్రాణం	–	వాయువులో లీనమయిపోతుంది
నేత్రాలు	–	ఆదిత్యునిలో లీనమైపోతాయి
శ్రోత్రాలు	–	దిక్కులయందు లీనమైపోతాయి
మనస్సు	–	చంద్రునిలో లీనమైపోతుంది
శరీరం	–	భూమిలో లీనమైపోతుంది
హృదయాకాశం	–	భూతాకాశంలో లీనమయిపోతుంది.
కేశాలు	–	వనస్పతులలో లీనమైపోతాయి
శుక్రశోణితాలు	–	జలంలో కలిసిపోతాయి

అంటే ఇంద్రియాలన్నీ వాటి వాటి కారణాల్లో లీనమైపోగా మిగిలిన పురుషుడు ఏమౌతాడు? దేని ఆధారంగా అతడు మళ్ళీ శరీరం ధరిస్తాడు?"

రోమాలు, కేశాలు వనస్పతులలో లీనమవటము జరిగే పనికాదు. ఇది అసంభవం. అందుచేత ఇది ఔపచారికం అంటే గౌణము. ముఖ్యము కానిది అని చెప్పాలి. జీవించి ఉన్నంతవరకు అగ్ని మొదలైన దేవతలు ఇంద్రియాలకు ఉపచారం చేసి, మరణంతో విరమిస్తున్నాయి. అనే అర్థం అంతేకాని వాగాదులు అగ్న్యాదులలో లయం కావు.

సూ. 5 ప్రథమేஉ శ్రవణాదితిచేన్న తా ఏవ హ్యుపపత్తేః

ప్రథమే, అశ్రవణాత్, ఇతి, చేత్, న, తాఏవ, హి, ఉపపత్తేః

ద్యులోకం మొదలు ఆయా అగ్నులందు ఉదకాలు ఆహుతి అవటం నిరూపించగలిగితే, ఐదవ ఆహుతి పురుషుడు ఎలా అయ్యాడో నిరూపించవచ్చు. కాని మొదటి ఆహుతి 'శ్రద్ధ' అన్నారు ఉదకము అని చెప్పలేదు. 'ద్యులోకమే అగ్ని. ఈ అగ్నితోనే దేవతలు శ్రద్ధను ఆహుతిగా ఇస్తున్నారు' అని బృహదారణ్యకంలో చెప్పబడింది. మిగిలిన నాలుగు ఆహుతులు సోమము, వృష్టి, అన్నము,రేతస్సు వీటికి జల సంబంధమున్నది అయితే శ్రద్ధ అనేది కేవలము జ్ఞానమే తప్ప జలం ఎలా అవుతుంది మొదటి ఆహుతే అప్రమాణమైనప్పుడు మిగిలినవి కూడా అంతే అవుతాయి కదా! అని వారి వాదన.

అయితే వేదంలో, మొదటి ఆహుతిలో జలం చెప్పబడలేదు కాబట్టి జీవులు జలాన్ని తీసుకుపోరు అనేది నిజం కాదు. యజ్ఞయాగాదులు చేసినవారు స్వర్గలోకానికి పోతారు. శ్రద్ధ అనేది మనోవృత్తి. కాబట్టి శ్రద్ధను మనస్సు నుంచి వేరుచేసి హోమం చెయ్యటం జరగదు. ఉదకాలను హోమం చెయ్యగలం. తైత్తిరీయసంహితలో యజమాని చేసే పుణ్యకర్మకోసం జలము శ్రద్ధను పుట్టిస్తున్నది' కాబట్టి శ్రద్ధ అంటే ఉదకము.

సూ. 6 అశ్రుతత్వాదితి చేన్నేష్టాది కారిణాం ప్రతీతేః

అశ్రుతత్వాత్, ఇతి, చేత్, న, ఇష్టాదికారిణామ్, ప్రతీతేః

పైన చెప్పిన దానిని బట్టి జలానికి మల్లే జీవులను వర్ణించలేదు. కాబట్టి జీవులు ఉదకంతో కూడి ప్రయాణించటం లేదు. అని వీరివాదన. అది నిజం కాదు. ఎందుకంటే యజ్ఞయాగాలు చేసినవారు అలానే వెడుతున్నారని నమ్మకం.

యాగకర్మలు ఆచరించినవారు, జలపరివేష్టితులై స్వర్గలోకానికి పోతారు. అయితే ఇష్టాధికారులు కర్మఫలాన్ని అనుభవించటానికి చంద్రలోకం వెడుతున్నారనేది అబద్ధం. ఎందుకంటే వారు చంద్రుని చేరి అక్కడ అన్నము అవుతున్నారు. అని చెప్పబడింది. కాబట్టి దేవతలు వారిని భక్షిస్తారు. అంతేకాని వారు ఫలాన్ని అనుభవించడానికి వెళ్ళటం లేదు అని మళ్ళీ వాదన.

సూ. 7 భాక్తంవా నాత్మ విత్త్వాత్తథాహి దర్శయతి

భాక్తం, వా, అనాత్మ విత్త్వాత్, తథా, హి, దర్శయతి.

అది నిజం కాదు. ఇష్టాధికారులు దేవతలకు అన్నము అవుతారని, భోగపదార్థాలు అవుతారని శ్రుతులలో ఉన్నది. దేవతలకు అన్నమవుతారు అంటే భోగసాధనాలయి వారికి సంతోషం కలిగిస్తాడు అని చెప్పారు. ఇష్టాధికారులు దేవతలకు అన్నమవుతారని చెప్పటం ప్రధానమైన విషయం కాదు. అలా అంటే స్మృతులకు భంగం వస్తుంది.

దేవతలకు అన్నమవుతారంటే ఉపభోగసాధనాలు అవుతారని అర్థం. అంటే భార్యా పుత్రులులాగా దేవతలకు వీరు భోగసాధనాలయి సంతోషం కలిగిస్తారు. వీరంతా ఆత్మజ్ఞానం లేనివారు. అందుచేతనే ఈ రకంగా అవుతున్నారు. ఎవరైతే నేను వేరు, దేవత వేరు అని భావిస్తాడో వాడు పశుప్రాయుడు. మానవులకు పశువు భోగసాధనము. అలాగే ఇతడు కూడా పశువయి దేవతలకు భోగసాధనమవుతారు. అని చెబుతూ మానవుడు ఫలభోగం కోసం చంద్రలోకానికి సూక్ష్మభూతపరివేష్ఠితుడై వెడతాడు అంటూ మొదటి అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

2. కృతాత్యయాధికరణము

జగత్తులోని జీవరాశి అంతా కర్మలు చేస్తాయి. ఆ కర్మఫలాన్ని అనుభవించి, స్వర్గం నుంచి తిరిగి వచ్చేటప్పుడు కర్మశేషం వారిని అంటి ఉంటుంది. ఆ కర్మశేషమే నూతన జన్మను నిర్ణయిస్తుంది అంటారు గదా! ఛాందోగ్యంలో ప్రవాహణుడు అనే రాజు ఉద్దాలకుడికి పంచాగ్నివిద్య బోధిస్తూ" మహర్షీ! మానవుడు నాలుగుభూతాల మిశ్రమ స్వరూపుడు. మరణానంతరము ఆ నాలుగు భూతాలు, ఆభూతాలలో కలిసిపోతాయి. మానవుని యోగ్యత అనేది అతడు చేసిన కర్మలమీద ఆధారపడి ఉంటుంది. అతడికి ఆత్మానుభవం కలిగితే దేవయానంలో ప్రయాణం చేసి మోక్షం పొందుతాడు. అట్టి మానవుడికి పునర్జన్మ ఉండదు. అలా కాకుండా ఐహికమైన కోరికలు తీర్చుకోటానికే జీవిస్తూ, పుణ్యకర్మలు ఆచరిస్తూ జీవితం సాగించేవారు పిత్రుయానం గుండా స్వర్గం చేరతారు. అక్కడ వారి పుణ్యఫలం పూర్తిగా అనుభవించి, మళ్ళీ ఈ లోకంలో జన్మిస్తారు. పాపాలు చేసినవాడు అమృతత్వాన్ని, స్వర్గాన్నీ పోగొట్టుకుని, నీచమైన జన్మలు ఎత్తుతుంటాడు.

సంస్కారవంతులు, సదాచార సంపన్నులు ఉత్తమ యోని పొందుతారు. పాపాత్ములు పుడుతూ, శీఘ్రంగా చస్తూ ఉంటారు. పాపులు నీచమైన చావు చస్తారు. వీరి జీవితాన్ని అందరూ అసహ్యించుకుంటారు.

బ్రాహ్మణుల సొమ్ము దొంగతనం చేసేవాడు, మధిరపానం చేసే బ్రాహ్మణుడు, గురుపత్నీ సంగమం చేసేవాడు, బ్రహ్మహత్య చేసేవాడు. ఈ నలుగురూ పతితులు. వీరితో సహవాసం చేసేవాడు కూడా పతితుడే. ఇంతకన్న నీచపుపనులు చేసేవారు క్రిమికీటకాలుగా పుడతారు. అని చెప్పారు.

గురువర్యా! ఇక్కడ అనుమానం ఏమిటంటే మానవులు స్వర్గం పొందటానికి అవసరమైనదానికన్న ఎక్కువకర్మను చేస్తారా? కర్మలో కొంతభాగం మాత్రమే అనుభవిస్తున్నారా? లేక కర్మశేషం లేకుండానే తిరిగి వస్తారా? వివరించండి అన్నాడు కృష్ణశర్మ. ఆ మాటలు విన్న రత్నాకరుడు ప్రారంభించాడు.

సూ. 8 కృతాత్యయే ఉ నుశయవాన్ దృష్టస్మృతిభ్యాం యథేతమనేవంచ
కృత, అత్యయే, అనుశయవాన్, దృష్టస్మృతిభ్యాం యథేతం అనేవం, చ

మానవుడు స్వర్గసుఖాల కోసం కర్మలు చేస్తున్నాడు. వాటిఫలితము అనుభవించిన తరువాత, మిగిలిన కర్మలతో కూడినవాడై తిరిగి ఈ లోకానికి వస్తున్నాడు. ఈ విషయం శ్రుతులు, స్మృతులు కూడా చెబుతున్నాయి.

స్వర్గసుఖాలు అనుభవించి వచ్చిన సంస్కారవంతులు, సదాచార సంపన్నులు ఉత్తమయోనులందు జన్మిస్తారు. అంటే బ్రహ్మ క్షత్రియ వైశ్య యోనులు పొందుతారు. సంస్కారం లేనివారు కుక్కలు, పందులుగా, ఛండాలురుగ నీచయోనులందు జన్మిస్తారు. అని ఛాందోగ్యంలో చెప్పబడింది. దీని అర్థం ఏమంటే, అక్కడ ఆ కర్మఫలం పూర్తి అయ్యేవరకు ఉండి తరువాత భూలోకానికి వస్తాడు అంటే మానవుడు చేసిన కర్మకు ఫలితము స్వర్గ నరకాల్లో అనుభవించాలి. మళ్ళీ ఆ కర్మననుసరించే ఉత్తరజన్మలు ఎత్తాలి.

ఇక తిరిగివచ్చేటప్పుడు ఏ మార్గంగుండా వస్తారు? వెళ్ళినమార్గంగుండానా? ఇంకొక మార్గం గుండానా? తిరిగి వచ్చేటప్పుడు ఏ మార్గం గుండా నయినా రావచ్చు. వెళ్ళిన మార్గం గుండానే రావాలనే నియమం ఏమీ లేదు.

సూ. 9 చరణాదితి చేన్నో పలక్షణార్థేతి కార్ష్ణాజినిః
చరణాత్; ఇతి, చేత్, న, ఉపలక్షణార్థా, ఇతి, కార్ష్ణాజినిః

శ్రుతిలో ఆచరణము, శీలము వలన జన్మవస్తున్నది అంటున్నారు. అలాంటప్పుడు ఇష్టాధికారులు కర్మతో ద్యులోకంనుండి దిగివస్తున్నారనటానికి అవకాశం లేదు అంటున్నారు. కాని ఇది నిజం కాదు. ఎందుకంటే ఆచారమనేది కర్మలోని భాగమే. 'కార్ష్ణాజిని' అనే మహర్షి ఈ సూత్రాన్ని సమర్థిస్తున్నాడు.

సూ. 10 అనర్థక్యమితిచేన్న తదపేక్షత్వాత్

అనర్థక్యమ్, ఇతి, చేత్, న తదపేక్షత్వాత్

పుణ్యకర్మలే జన్మ హేతువులైనప్పుడు ఆచారమనేది అర్థం లేనిది అవుతుంది కదా అని వారి వాదన. కాని అట్లా జరగదు. యజ్ఞాలు, యాగాలు మొదలైనవి ఆచారవంతుడు చేసినప్పుడు మాత్రమే మంచిఫలితాన్ని ఇస్తాయి. ఆచారం లేకపోతే కర్మ ఫలప్రదం కాదు. ఆచార హీనుడైన వాడిని వేదాలుగాని, వేదోక్త కర్మలుగాని పవిత్రుణ్ణి చెయ్యలేవు.

అయితే మానవుని ఉత్తరజన్మకు కర్మలే కారణంగాని, ఆచారము, శీలము కారణం కావు.

సూ. 11 సుకృత దుష్కృతే ఏవేతితు బాదరిః

సుకృత, దుష్కృతే, ఏవ, ఇతి తు, బాదరిః

చరణము అనే పదానికి ఆచారము, అనుష్ఠానము, కర్మ అని అర్థం ఉంది. అయితే చరణము అనే పదానికి కొంతమంది ఆచారము అని అర్థం చెప్పినప్పటికీ, ఆచారమనేది కర్మలోని భాగమే. చరణము అంటే కర్మ అనే అర్థం చెప్పాలి. కాబట్టి చరణము అంటే పాపపుణ్యాలే అని బాదరి అనే మహర్షి అభిప్రాయపడుతున్నాడు. అందుచేత స్వర్గసుఖాలనుభవించిన వ్యక్తికి తిరిగి వచ్చేటప్పుడు కర్మశేషంతో వస్తాడు. అంటూ రెండవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

3. అనిష్టాది కార్యధికరణము

"గురువర్యా! ఇష్టాపూర్త కర్మలు చేసినవారు చంద్రలోకానికి వెడతారు. మరి ఇష్టాపూర్తములనబడే కర్మలు చెయ్యనివారికి కూడా చంద్రలోక ప్రాప్తి ఉన్నదా?" అని అడిగాడు కృష్ణశర్మ. వివరించటం మొదలుపెట్టాడు రత్నాకరుడు.

సూ. 12 అనిష్టాది కారిణా మపిచ శ్రుతమ్

అనిష్టాది కారిణామ్, అపి, చ, శ్రుతమ్

యజ్ఞయాగాదులు చేసినవారే కాదు. నిషిద్ధ కర్మలు చేసిన వారికి కూడా చంద్రలోకం ప్రాప్తిస్తుంది. కౌషీతకీ ఉపనిషత్తులో ఈ లోకం నుంచి వెళ్ళేవారందరూ చంద్రలోకం చేరతారు అని చెప్పబడింది. పుణ్య పాపాలు చేసినవారందరూ అక్కడికి చేరతారని చెప్పబడింది. కాబట్టి పుణ్యాత్ములు మాత్రమే చంద్రలోకం చేరతారనే మాట నిజం కాదు అని వీరివాదన.

సూ. 13 సంయమనే త్వనుభూ యేతరేషా మారోహావ రోహౌ తద్గతిదర్శనాత్

సంయమనే, తు, అనుభూయ, ఇతరేషాం, ఆరోహావరోహౌ, తత్, గతి దర్శనాత్

ఇష్టాపూర్తి కర్మలు చెయ్యనివారు యమలోకానికి పోయి, కష్టాలు అనుభవించి తిరిగి ఈ లోకంలో జన్మిస్తారు. వారికి చంద్రలోక ప్రాప్తి లేదు. పుణ్యకార్యాలు చేసిన వారికే చంద్రలోక ప్రాప్తి.

చంద్రలోకము పుణ్యఫలాన్ని అనుభవించటానికే ఉన్నది. పాపులకు అక్కడ స్థానం లేదు. కఠోపనిషత్తులో యముడు నచికేతుడితో "వేదాలలో చెప్పిన పాపకర్మలు వదలిపెట్టని వాడు, ఇంద్రియలోలుడు, ఏకాగ్రత లేనివాడు, మనశ్శాంతి లేనివాడు బ్రహ్మజ్ఞానాన్ని పొందలేడు. బాలుడికి, డబ్బుమీద వ్యామోహంగల వాడికి, మూఢుడికి, పరలోకసాధనాలు తోచవు. వారంతా నా వశం అవుతారు. అంటే పాపాలు చేసినవారు యమలోకానికి పోతారు.

సూ. 14 స్మరంతిచ

స్మరంతి, చ

వ్యాసుడు, మనువు మొదలైన వారు పాపకర్ములు యమలోకానికి పోతారని చెబుతున్నారు.

సూ. 15 అపి చ సప్త

అపిచ, సప్త

రౌరవాది నరకాలు ఏడున్నాయని, అక్కడే పాపులు శిక్షలు అనుభవిస్తారని పురాణాలలో చెప్పబడింది.

కాని రౌరవాది నరకాలు మొత్తం పద్దెనిమిది రకాలు అని చెబుతున్నారు అన్నాడు రత్నాకరుడు. గురువుగారూ ! రౌరవాది నరకాల్లో చిత్రగుప్తుడు మొదలైనవారున్నారని, వారే పాపులకు శిక్షలు వేస్తారని ఉన్నది కదా. మరి యముడే పాప ఫలాన్ని అనుభవింప చేస్తాడని ఎలా చెప్పగలరు? అంటూ సందేహం వెలిబుచ్చాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 16 తత్రాపి చ తద్వ్యాపారాదవిరోధః

తత్ర, అపి, చ, తద్వ్యాపారాత్, అవిరోధః

ఆ నరకాలన్నింటికి యముడే అధిపతి. కఠోపనిషత్తులో యముడు "కర్మఫలంవల్ల లభించే ఫలితము అనిత్యము. ఆత్మ నిత్యము. ఆ విషయం తెలిసికూడా నేను అగ్నిచయనం

చేశాను. దాని ఫలితంగా మృత్యుదేవతనయ్యాను" అని నచికేతుడికి చెబుతాడు. కాబట్టి యముడే మృత్యుదేవత నరకలోకాలకు అధిపతి. చిత్రగుప్తాదులందరూ యముడికి వశులై ఉంటారు.

సూ. 17 విద్యాకర్మణో రితితు ప్రకృతత్వాత్

విద్యాకర్మణోః, ఇతి, తు, ప్రకృతత్వాత్

వేదాలలో దేవయాన పిత్రుయాన మార్గాలు రెండు చెప్పబడ్డాయి. ఉపాసన దేవయానం. కాగా కర్మమార్గం పిత్రుయానం ఈ రెండు మార్గాలు లేని క్షుద్రులు జనన మరణరూపమైన మూడవ మార్గంగుండాపోతారు. కాబట్టి వారికి చంద్రలోకప్రాప్తి లేదు. ఛాందోగ్యంలో ప్రవాహణుడు చెబుతాడు" సంస్కారవంతులు, సదాచార సంపన్నులు ఉత్తమయోని పొందుతారు. సంస్కారహీనులు కుక్కలు, పందులుగా జన్మిస్తారు. పాపాత్ములుపై రెండు మార్గాలలోనూ పోరు. వీరిది మూడవ మార్గం. అందుకనే నిత్యము ఇన్ని జీవులు చస్తున్నా పరలోకాలు నిండవు. చచ్చినవారంతా అక్కడికి పోరు.

సూ. 18 న తృతీయే తథోపలభ్ధేః

న, తృతీయే, తథా, ఉపలభ్ధేః

నూతన దేహం పొందటానికి ఐదు ఆహుతులు పూర్తి కావాలని ఛాందోగ్యోపనిషత్తులో ప్రవాహణుడు పంచాగ్నివిద్యలో చెప్పాడు. కాని మూడవ మార్గంలో పోయేవారికి ఆ నియమం లేదు. అది లేకుండానే దేహారంభ నియమం కలుగుతుంది.

సూ. 19 స్మర్యతేஉపిచలోకే

స్మర్యతే, అపి, చ, లోకే

లోకంలో తలచబడుతున్నది కూడా.

ఏమని ? అయోనిజులకు అంటే స్త్రీ పురుష సంయోగం లేకుండానే జన్మించేవారికి ఈ నియమం లేదు. పురాణాలలో చెప్పబడిన సీత, ద్రౌపతి, ద్రోణాచార్యుడు, దృష్టద్యుమ్నుడు మొదలైనవారు ఈ కోవకు చెందినవారే. అలాగే క్రిమికీటకాదులు కూడా వీరికి సంఖ్యానియమం లేదు.

సూ. 20 దర్శనాచ్చ

దర్శనాత్, చ

కనిపించటంవల్ల కూడా ఆ నియమం లేదు

స్వేదజాలు – బురద లేక చమట నుంచి పుట్టినవి.

ఉద్భిజాలు – భూమి నుంచి పుట్టినవి.

వీటి విషయంలో ఆహుతుల సంఖ్యానియమం లేదు.

గురువుగారూ ! ఛాందోగ్యంలో

అండజములు	–	గ్రుడ్డు నుండి పుట్టేవి
జీవజములు	–	జీవులవలన పుట్టేవి
ఉద్భిజములు	–	భూమి నుండి పుట్టేవి

అని మూడు రకాలే చెప్పారు గదా? మరి స్వేదజాలు ఎక్కడ నుంచి వచ్చాయి? అన్నాడు నారాయణభట్టు వివరిస్తున్నాడు రత్నాకరుడు.

సూ. 21 తృతీయ శబ్దావరోధః సంశోకజస్య

తృతీయశబ్ద అవరోధః, సంశోకజస్య

ఈ స్వేదజాన్ని, ఉద్భిజంతోనే గ్రహించాలి. ఉద్భిజము అంటే భూమిని ఛేదించుకుని పుట్టేది. స్వేదజము జలాన్ని ఛేదించుకుని పుడుతుంది. ఛేదించుకుని పుట్టటమనేది ఈ రెండింటికీ సమానమే.

కాబట్టి ఇష్టాపూర్తకర్మలు చెయ్యనివారికి చంద్రలోక ప్రాప్తి లేదు. అంటూ మూడవ అధికరణను పూర్తి చేశాడు రత్నాకరుడు.

4. సాభావ్యాపత్త్యధికరణము

"గురువుగారూ ! ఇష్టాపూర్తములాచరించేవారు చంద్రలోకాన్ని పొందుతారని, అక్కడ భోగాలు అనుభవించి తిరిగి భూలోకానికి వస్తారని చెప్పబడింది. వీరు చంద్రలోకం నుంచి వెళ్ళిపోతున్నాననే దుఃఖంతోనే వెళ్ళిన మార్గం గుండానే తిరిగివస్తారు. ఆకాశాన్ని, ఆకాశం నుండి వాయువును, వాయువు నుండి – ధూమమై, ఆ ధూమం – అభ్రమై, అభ్రం – మేఘమై వర్షిస్తుంది. ఇలా తిరిగి వచ్చేవాడు ఆకాశము, వాయువు, ధూమం, అభ్రం, మేఘము అవుతాడని చెప్పబడింది. నిజంగా ఆకాశాదికంగా అయిపోతాడా? లేక ఆయాభావాల్ని పొందుతాడా? వివరించండి" అన్నాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 22 తత్సాభావ్యాపత్తి రుపపత్తేః

తత్సాభావాపత్తిః, ఉపపత్తేః

ఎవరైనా సరే ఒకరి పోలికను పొందగలరే తప్ప, ఆ రూపాన్ని పొందలేరు. కాబట్టి తిరిగివచ్చేవాడు దుఃఖపూరితుడై కరిగిపోయి, క్రమంగా వాటివాటి సాద్రుస్యాన్ని పొందుతూ వర్షరూపంలో భూమికి వస్తాడు. అంటూ నాల్గవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

5. నాతిచిరాధికరణము

"చంద్రమండలం నుంచి వచ్చే జీవి ధాన్యరూపం పొందటానికి పూర్వం సాదృశ్యంలో ఎంత కాలం పాటు ఉంటుంది?" అన్నాడు నారాయణభట్టు.

సూ. 23 నాతిచిరేణ విశేషాత్
న, అతిచిరేణ, విశేషాత్

ఆకాశంతో సాద్రూపం పొంది అతితక్కువ కాలంలోనే వర్షరూపంలో భూమికి వస్తాడు. అవరోహణక్రమంలో ఆలస్యం ఉండదు. త్వరగానే జరుగుతుంది అంటూ ఐదవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

6. అన్యాధిష్ఠితాధికరణము

"గురువుగారూ ! చంద్రమండలం నుంచి దిగివచ్చేవారు వర్షరూపంలో నేలమీదికి వచ్చిన తరువాత ధాన్యము, యవలు, ఓషధులు, నువ్వులు, మినుములు మొదలైన రూపాల్లో జన్మిస్తారు అని చెబుతున్నారు కదా. మరి ఇష్టాపూర్త కర్మలు చేసి, చంద్రలోక సుఖాలనుభవించి తిరిగి వచ్చేవారు కూడా, పాపాత్ములలాగా ఇలాంటి రూపాలు పొందవలసిందేనా? అన్నాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 24 అన్యాధిష్ఠితేషు పూర్వవదభిలాపాత్
అన్యాధిష్ఠితేషు, పూర్వవత్, అభిలాపాత్

కర్మశేషం గల జీవులు పైన చెప్పినట్లుగా ఆకాశము, వాయువులతో సంసర్గము పొందినట్లుగానే, అన్యజీవులచే అధిష్ఠించబడినటువంటి ధాన్యపు గింజలతో సంబంధము మాత్రమే పొందుతాడు. కాబట్టి కర్మానుభవము మాత్రము ఉండదు.

కర్మశేషం కలిగిన జీవులు ధాన్యపు మొక్కలుగా పుట్టరు. ఆ రూపాల్లో పాపాత్ములు మాత్రమే పుడతారు. వీరు వర్షరూపంలో భూమిమీద పడి ధాన్యపు గింజలతో కలిసినప్పుడు వారికి కర్మఫలభోగమనేది ఉండదు. వీరు ఆకాశవాయురూపాల్లో ఉన్నప్పుడు ఏ రకంగా కర్మఫలభోగం లేదో, ఇప్పుడూ అంతే. కాబట్టే ధాన్యం దంచటము, ఉడికించటము,

చెట్లు నరకటమువలన వచ్చే బాధలు వీరికుండవు. ద్రోవలో వీటితో కొంతసేపు కలిసి ఉండి, తరువాత జన్మకై వెళ్ళిపోతారు. కాబట్టి కర్మశేషంగలవారికి ధాన్యపుగింజలు భోగస్థానాలు కావు అన్నాడు రత్నాకరుడు.

"స్వామీ ! యజ్ఞయాగాదులు చేస్తున్నప్పుడు వీరు ఆ కర్మలలో హింసచేస్తారు. దాని ఫలితంగానే ధాన్యం రూపంలో ఇందాక మీరు చెప్పినట్లు దంచటంవంటి కష్టాలు పడుతున్నారు. అని అంటున్నారు కదా!" అన్నాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 25 అశుద్ధమితిచేన్న శబ్దాత్
అశుద్ధమ్, ఇతి, చేత్, న, శబ్దాత్

యజ్ఞకర్మలు పరిశుద్ధమైనవికాదు అని అనకూడదు. వేదం, విధిరూపంలో ఆ యొక్క హింసను ధర్మమనే చెబుతున్నది.

ధర్మాధర్మాల నిర్ణయం శాస్త్రాలవల్ల జరుగుతుంది' ఏ ప్రాణిని హింసించకూడదు' అనేది సామాన్య సూత్రం. దేవతల ప్రీతికోసం పశును సంహరించాలి. ఇది విశేషవచనం.

దేశకాలమాన పరిస్థితులను బట్టి ఒకప్పటి ధర్మము, ఇంకొకసారి అధర్మమవుతుంది. అందుచేత యజ్ఞయాగాదులలో జరిగే హింస అశుద్ధమైనది కాదు. కాబట్టి చంద్రలోకం నుంచి తిరిగి వచ్చేవారు ధాన్యరూపం దాల్చరు.

సూ. 26 రేతస్సి గ్యోగో౽థ
రేతస్సిగ్, యోగః, అథ

ప్రీహ్యాదిభావం పొంది, రేతస్సును విడిచి పెట్టే పురుషునియొక్క భావం కలుగుతుంది.

అంటే కర్మశేషంతో చంద్రలోకం నుంచి వచ్చేవారు ధాన్యభావం తరువాత, రేతస్సును విడిచి పెట్టే యువకుల భావం పొందుతారు.

అందువల్ల జీవుడు ప్రీహ్యాదులతో సంబంధం పొందటమే తప్ప ఆయా ధాన్యాలుగా పుట్టటం లేదు అని తెలుస్తున్నది.

సూ. 27 యోనే శ్శరీరమ్
యోనేః, శరీరమ్

ఆ పురుషుడు యోనియందు రేతస్సును ఉంచటంవల్ల, తన కర్మలననుభవించటానికి వీలైన శరీరాన్ని ఆ యోనినుంచి పొందుతాడు. అందుచేతనే ఛాందోగ్యంలో సంస్కార

వంతులు, సదాచార సంపన్నులు ఉత్తమయోనిని పొందుతారు. అంటే బ్రాహ్మణ క్షత్రియ, వైశ్యయోనులు పొందుతారు. సంస్కారహీనులు, కుక్కలు, పందులు, ఛండాలురుగా జన్మిస్తారు. ఇంకా పాపాత్ములు క్రిమికీటకాదులుగా జన్మిస్తారు. అని చెప్పబడింది. కాబట్టి కర్మశేషంతో భూమిని చేరే జీవికి ధాన్యపుగింజలతో సంబంధం మాత్రమే ఉంటుంది. అంటూ తృతీయాధ్యాయంలో ప్రథమపాదం పూర్తిచేశాడు రత్నాకరుడు.

ద్వితీయ పాదము

కర్మఫలము జనన మరణాలకు, సుఖ దుఃఖాలకు కారణము. కాబట్టి మానవుడికి వాటియందు విరక్తి కలగాలి. అంటే పరమాత్మ గురించి, జీవుడి గురించి జ్ఞానం కలగాలి. ఆ జ్ఞానమే ఈ పాదంలో వివరిస్తున్నారు ఈ పాదంలో 8 అధికరణలు, 41 సూత్రాలు ఉన్నాయి.

వ.నెం.	అధికరణము	విషయము	సూత్రాలు
1.	సంధ్యాధికరణము	స్వప్నావస్థలో జీవుని స్థితి	6
2.	తదభా వాధికరణము	సుషుప్తిలో జీవుని స్థితి	2
3.	కర్మానుస్మృతి శబ్దవిధ్యధికరణము	సుషుప్తిలో బ్రహ్మతో ఏకీభవించి మళ్ళీ అందుండే మేల్కొంటాడు	1
4.	ముగ్ధేర్ధ సంపత్త్యధికరణము	మూర్ఛయొక్క స్వరూపము	1
5.	ఉభయ లింగాధికరణము	బ్రహ్మకు సగుణ, నిర్గుణ రూపాలు	11
6.	ప్రకృతైతావత్త్వాధికరణము	'నేతి' పదం బ్రహ్మను నిరోధించదు	9
7.	పరాధికరణము	బ్రహ్మ ఒక్కటే అది అద్వితీయము	7
8.	ఫలాధికరణము	కర్మఫలము ఇచ్చేది పరమాత్మే	4
		మొత్తం సూత్రాలు	41

ఇప్పుడు మొదటి అధికరణ చూద్దాం

1. సంధ్యాధికరణము

సంధ్య అంటే స్వప్నము. జాగ్రత్, సుషుప్తులకు మధ్యస్థానము. స్వప్నంలో ఉంటూ మిగిలిన రెండు స్థానాలనూ చూస్తాడు ఆత్మపురుషుడు. నిద్రించేటప్పుడు ఆత్మపురుషుడు

సమస్త లోకాలలోని అనుభవాలను తీసుకుని స్థూలశరీరాన్ని వదలి స్వప్న శరీరంలో ప్రవేశించి, ఆత్మజ్యోతి రూపమైన ప్రకాశంతో స్వప్నం చూస్తాడు. ఈ స్థితిలో స్వప్నద్రష్ట అయిన పురుషుడు తైజసుడు అని పిలువబడతాడు.

స్వప్నావస్థలో రథాలు, వాటికి కట్టే గుర్రాలు, అవి నడిచే మార్గాలు ఏవీ ఉండవు. అన్నింటినీ ఆ పురుషుడే రచించుకుంటాడు. అప్పుడు ఆనందము, మోదము, ప్రమోదము ఏవీ ఉండవు. అయినా వాటిని తానే కల్పించుకుంటాడు అని బృహదారణ్యకంలో చెప్పబడ్డది. అయితే – స్వప్నంలోని స్థితి యదార్థమైనదా? లేక మిథ్యా? తెలియచెయ్యండి అన్నాడు కృష్ణశర్మ. ప్రారంభించాడు రత్నాకరుడు.

సూ. 1 సంధ్యే సృష్టి రాహ హి
సంధ్యే, సృష్టిః, అహ, హి

స్వప్నమందలి సృష్టి వ్యావహారిక సత్యం. ఇది జాగ్రత్, సుషుప్తులకు మధ్యస్థానము. ఇక్కడ రథాలు, గుర్రాలు, మార్గాలు అన్నీ సృష్టించబడుతున్నాయి. ఈ సృష్టి యదార్థమైనది అని వారివాదన.

సూ. 2 నిర్మాతారం చైకే పుత్రాదయశ్చ
నిర్మాతారమ్, చ, ఏకే, పుత్రాదయః, చ

కొంతమంది స్వప్న పదార్థాలు నిర్మించేవాడు పరమేశ్వరుడు అంటారు. అతడు నిర్మించే కామ విషయాలు పుత్రాదులు. ఇంద్రియాలన్నీ నిద్రించిన తరువాత, పురుషుడు తానుకోరిన పదార్థాలను సృష్టిస్తూ మేల్కొంటాడు. అందుకే అతన్ని కామ నిర్మాతగా చెబుతారు.

కఠోపనిషత్తులో యముడు నచికేతుడితో వంద సంవత్సరాల ఆయువుగల పుత్రులను, పౌత్రులను కోరుకో. రాజ్యం కోరుకో, భోగభాగ్యాలు కోరుకో. అంతాదాకా ఎందుకు? భూలోకంలో ఏవేవి నీకు దొరకవో అవన్నీ కోరుకో అంటాడు. ఇక్కడ 'కామ' అంటే పుత్రుడు అనే అర్థం కాబట్టి స్వప్నంలో పుత్రాదులను సృష్టించేది పరమాత్మ. జాగ్రదావస్థలాగానే, స్వప్నావస్థలో కూడా అతడే సృష్టికర్మ. అందుచేతనే ఈ స్వప్నజగత్తు కూడా సత్యమైనదే అని వారి వాదన. అది నిజం కాదు.

సూ. 3 మాయామాత్రంతు కార్త్స్న్యే నానభివ్యక్త స్వరూపత్వాత్
మాయామాత్రం, తు, కార్త్స్న్యేన, అనభివ్యక్తరూపత్వాత్

స్వప్న సృష్టి అనేది మాయామాత్రమైనది. అది దేశకాలాది సమస్త ధర్మాలతో కనిపించదు.

స్వప్న సృష్టికి రూపం లేదు. అది యదార్థం కాదు. కల గనే వాడికి మాత్రమే కనిపిస్తుంది. ఇంకొక ప్రాణికి తెలియదు. అంతా మిధ్య. స్వప్నంలో రథాలు, గుర్రాలు, అన్నీ కనిపిస్తాయి. కలకరిగి పోగానే ఏవి మిగలవు. ఇంత తక్కువ కాలంలో వీటిని సృష్టించేది ఎవరు. స్వప్నావస్థలో జీవుడు దేహంలో తన ఇష్టం వచ్చినట్లు విహరిస్తున్నాడు. ఈ మాయాస్వరూపాన్ని సృష్టించేది జీవుడు అంతేకాని ఈశ్వరుడు కాదు.

సూ. 4 సూచకశ్చ హి శ్రుతే రాచక్షతేచ తద్విదః
సూచకః, చ, హి, శ్రుతేః, అచక్షతే, చ, తద్విదః

స్వప్నశాస్త్రం తెలిసినవారు, స్వప్నం శుభాశుభాలను సూచిస్తుంది అని చెబుతున్నారు. కామ్యకర్మలు చేసేటప్పుడు స్వప్నంలో స్త్రీని దర్శిస్తే, ఆ కర్మలయందు సమృద్ధి కలుగుతుంది. అలాగే ఏనుగు పై నెక్కినట్లు కలగంటే శుభము. గాడిద నెక్కితే అశుభము. రామాయణంలో త్రిజట స్వప్న వృత్తాంతము ప్రసిద్ధి చెందింది. కాబట్టి స్వప్నము, మాయ, మిధ్య అని ఎలా అనగలము? అని వారి వాదన అది సరికాదు. స్వప్నంవల్ల కలిగే శుభాశుభాలు, లాభనష్టాలు నిజం కావచ్చు. కాని స్వప్నం మాత్రం మిథ్యే. మేలుకోగానే కల కరిగిపోతుంది. కాబట్టి అది అబద్ధం ఈ స్వప్నాలు సృష్టించేది జీవుడు.

సూ. 5 పరాభిధ్యానాత్తు తిరోహితం తతోహ్యస్య బంధవిపర్యయౌ
పరాభిధ్యానాత్, తు, తిరోహితం, తతః, హి, అస్య, బంధవిపర్యయౌ

గురువుగారూ! ఈశ్వరుడు జీవుడు ఇద్దరూ ఒకటే.

ఈశ్వరుడు సంకల్పమాత్రం చేతనే జగత్తును సృష్టిస్తున్నాడు. జీవుడు కూడా తన సంకల్పంతో స్వప్న జగత్తును సృష్టిస్తున్నాడు. అలాంటప్పుడు స్వప్నజగత్తు మిధ్య ఎలా అవుతుంది? అన్నాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

జీవుడు, ఈశ్వరుడు ఇద్దరూ ఒకటే జీవి అవిద్య అజ్ఞానంచే ఆవరించబడి ఉంటాడు. అందుచేత జీవుడికి ఈశ్వరుడికున్నంత శక్తి లేదు. జీవుడికి అజ్ఞానపు పొరలు తొలగిపోవాలి. అప్పుడు తాను, పరబ్రహ్మ ఇద్దరూ ఒకటే అని తెలుస్తుంది. మరుక్షణమే తాను పరబ్రహ్మలో లీనమవుతాడు. ఇదే విషయం ముండకోపనిషత్తులో చెప్పబడింది. ఒకేవృక్షం మీద రెండు పక్షులున్నాయి. అంటూ వివరించి జీవుడికి ఎప్పుడైతే భేదభావం నశించిపోతుందో, అప్పుడు అద్వైతభావం పొందుతాడు కాబట్టి జీవుడు సృష్టించే స్వప్నం నిజం కాదు.

సూ. 6 దేహయోగాద్వాసో ఽపి
దేహయోగాత్, వా, సః, అపి

జీవుని కుండే ఐశ్వర్య తిరోభావము దేహాది సంబంధంవల్ల కలుగుతుంది. దేహము, ఇంద్రియాలు, బుద్ధి, మనస్సు, వీటి సంయోగంవల్ల జీవుడికి సహజంగా ఉండవలసిన జ్ఞానము, ఈశత్వము తిరోభావము చెందుతాయి.

ఛాందోగ్యంలో ఉద్దాలకుడు శ్వేతకేతువుకు ఆత్మతత్త్వాన్ని వివరిస్తూ జగత్తులోని నామరూపాలన్నీ దేనిలో లీనమైపోతున్నాయో, అదే బ్రహ్మ. అదే నీవు అంటాడు. అంటే జీవాత్మ పరమాత్మ రెండూ ఒక్కటే. అయినప్పటికీ అవిద్యతో కూడినది జీవాత్మ. అటువంటి జీవుడు చేసే సృష్టి శాశ్వతమైనది కాదు. అంతా మాయ. మిధ్య. అందుకే స్వప్నం అంతా మాయ అంటూ మొదటి అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

2. తదభావాధికరణము

గురువుగారూ ! ఇప్పటిదాకా స్వప్నావస్థ గురించి చెప్పారు. మరి సుషుప్తి అంటే ఏమిటి? సుషుప్తావస్థ అనేది నాడులా? పురీతత్తా? దహరాకాశమైన పరబ్రహ్మ? ఈ మూడు కలిసినదేదైనా ఉన్నదా? ఎందుచేతనంటే సుషుప్తిని గురించి ఉపనిషత్తులలో రకరకాలుగా వివరించారు. మాండూక్యోపనిషత్తులో "నిద్రించినప్పుడు ఏ కోరికలూ లేని స్థితి. గాఢనిద్ర అదే సుషుప్తి. ఇందులో సంచరించే ప్రాజ్ఞుడే తృతీయ పాదం. ఈ స్థితిలో భేదభావాలుండవు. జాగ్రస్వప్నాలలోని అనుభవాలు ఇక్కడ కరిగిపోతాయి. అన్ని అనుభవాలు ఏకమైపోతాయి. కేవలం గ్రహణశక్తి మాత్రం నిలచిపోతుంది. పరస్పర విరుద్ధ భావాలు స్ఫురించవు. ఆ స్థితిలో ప్రాజ్ఞుడు ఆనందం అనుభవిస్తాడు. ఇది తమోగుణ ప్రధానమైన అవస్థ. ఇతడే అన్నిటికీ ప్రభువు ఈశ్వరుడు. సర్వమూ తెలిసినవాడు. అంతర్యామి నియామకుడు. ఛాందోగ్యోపనిషత్తులో ఉద్దాలకుడు ఆత్మజ్ఞానాన్ని తనకుమారుడైన శ్వేతకేతువుకు వివరిస్తూ "నిద్రపోతున్నప్పుడు మనిషి తాత్కాలికంగా ఆత్మతో తాదాత్మ్యం చెందుతాడు. తేనెటీగలు తోటంతా తిరిగి మకరందాన్ని సేకరిస్తాయి. ఆ తేనెలోని ఏ బొట్టు ఏ పువ్వు నుంచి తీసిందో తెలియదు. అలాగే జీవరాశులు విడివిడిగా ఉన్నప్పటికీ ఆత్మలో లీనమై ఉంటాయి. అది నిద్రాసమయం లేదా మరణ సమయం కావచ్చు. గాఢనిద్రలో గతం తెలియదు. వర్తమానం అసలే తెలియదు. అంతా అజ్ఞానం. అందువల్ల యదార్థమనేది తెలియదు. యదార్థాన్ని గుర్తించటం కష్టం".

బృహదారణ్యకోపనిషత్తులో కాశీరాజైన అజాతశత్రువు బాలాకికి ఉపదేశం చేస్తూ "జీవుడు నిద్రిస్తుండగా ఇంద్రియాల యొక్క విషయాలన్నింటినీ, అనగా వాక్కు మొదలైన ప్రాణాల విజ్ఞానాన్ని పూర్తిగా గ్రహించి హృదయాకాశంలో నిద్రిస్తున్నాడు. హృదయాకాశము పరమాత్మ ఉండేచోటు, నిద్రావస్థలో పురుషుడు శరీరము, ఇంద్రియాలు తనలో లీనం చేసుకుంటాడు. ప్రాణాలన్నింటినీ తనలోకి ఆకర్షించుకుంటాడు. వాక్కు, చక్షువు, శ్రోత్రము, మొదలైన ఇంద్రియాలు మనస్సుతో సహా లోపలకు ఆకర్షింపబడతాయి. ఆ స్థితిలో క్రియ అనేది ఉండదు. క్రియాఫలం ఉండదు. కాబట్టి ఆత్మ తన నిజస్థితిలో ఉంటుంది. కాబట్టి సుషుప్తిని వివరించండి అన్నాడు కృష్ణశర్మ.

సూ. 7 తదభావో నాడీషు తచ్ఛ్రుతే రాత్మని చ

తదభావః, నాడీషు, తచ్ఛ్రుతేః, ఆత్మని, చ

నాడుల్లో ప్రవేశించటంద్వారా, స్వప్నమనేది లేని ఆ స్థితి అంటే సుషుప్తి, ఆత్మయందు కలుగుతున్నది అని వేదాలలో చెప్పబడింది.

జీవాత్మకు సంబంధించిన సుషుప్తి, నాడులందు, బ్రహ్మమందు, పురీతత్తు అనే స్థానమందు కలుగుతున్నది. హృదయంలో పద్మం ఆకారంలో ఉండే నాడీ సమూహాన్ని 'పురీతత్' అంటారు ఇది హృదయానికి ప్రాకారంలాంటి ఒక కోశము. శ్రుతివాక్యాలు నాడులు, పురీతత్తు, బ్రహ్మ అనేవి జీవుడికి సుషుప్తి స్థానాలని చెప్పినాయి. ఈ నాడులగుండా పురీతత్తులో ప్రవేశించి అక్కడ బ్రహ్మము నిద్రపోతుంది.

సూ. 8 అతః ప్రబోధోఽస్మాత్

అతః, ప్రబోధః, అస్మాత్

ఆత్మలో నిద్రించి ఉన్నాడు కాబట్టి, ఆత్మనుంచే మేలుకుంటాడు. నాడులద్వారా పురీతత్తులో ప్రవేశించి, హృదయాకాశంలో నిద్రిస్తాడు. నాడులుగాని, పురీతత్తుగాని సుషుప్తి స్థానమయి ఉంటే, అక్కడి నుంచే మేల్కొనాలి. కాని అలా చెప్పలేదు కాబట్టి బ్రహ్మమే సుషుప్తి స్థానము. అందుకే సుషుప్తిలో బ్రహ్మభావాన్ని పొందుతాడు. అంటూ రెండవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

3. కర్మానుస్మృతి శబ్దవిధ్యధికరణము

"జీవుడు హృదయస్థానంలో ఉన్న బ్రహ్మలో నిద్రపోతున్నాడు. మళ్ళీ అందులో నుండే మేల్కొంటున్నాడు. అంటున్నాము. సుషుప్తి పొందిన జీవుడే మళ్ళీ మేల్కొంటున్నాడన

టానికి నిదర్శనం ఏముంది? పెద్దదైన సముద్రంలో చిన్న నీటి బొట్టు వేశాం. అది అందులో కలిసిపోయింది మళ్ళీ బయటకు తీసినప్పుడు ఆ బొట్టే రావాలనే నియమం ఏముంది? అలాగే పరమాత్మలో అనేక జీవులు కలిసిపోతాయి. అసంఖ్యాకమైన జీవులకు సుషుప్తి స్థానంగా ఉండే పరమాత్మనుండి, ఆ జీవులే మేల్కొంటున్నాయని ఎలా చెప్పగలం? ఇంకా ఇతరమైనవి రావచ్చు కదా!" అన్నాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 9 స ఏవతు కర్మానుస్మృతి శబ్ద విధిభ్యః

స ఏవ, తు, కర్మానుస్మృతి శబ్ద విధిభ్యః

1. కర్మ, 2. అనుస్మృతి, 3. శబ్దము, 4. విధి అనే కారణాలవల్ల నిద్రించిన మానవుడే మళ్ళీ మేల్కొంటున్నాడు. అంతేకాని ఇంకొకడు కాదు.

1. కర్మ : కొంత పని చేసి విశ్రాంతి తీసుకుని మర్నాడు మిగిలిన పని పూర్తి చేస్తున్నాం. పని ఎక్కడ ఆపామో మేల్కొన్న తరువాత మనకు తెలుస్తుంది. ఎందుకని? ఆ పనిని అక్కడ ఆపింది మనమే కాబట్టి అందుచేత సుషుప్తి తరువాత అంటే మెలకువ వచ్చిన తరువాత ఉండేది, అంతకు ముందున్నవాడే.

2. అనుస్మృతి : ఇందులో 'అను' అంటే సుషుప్తికి పూర్వం ఉన్న నేనే మెలకువ తరువాత నేను. అనే జ్ఞానం కలగటం. స్మృతి అంటే జ్ఞాపకం. గతంలో చేసినది గుర్తురావటం.

3. శబ్దం : శబ్దం అంటే వేదం. ఛాందోగ్యోపనిషత్తులో జీవి ఏ రూపంలో ఉన్నప్పటికీ, అంటే పులి, సింహము, మనిషి ఏదైనాకాని, అనంతచైతన్య సముద్రంలో కలిసిపోయిన తరువాత తన రూపాన్ని పోగొట్టుకుంటుంది. జీవులన్నీ ఏ తత్త్వంలో కలిసిపోతాయో, అదే బ్రహ్మ. ఈ రకంగా వేదాలలో అనేకసార్లు, అనేకచోట్ల చెప్పబడింది.

4. విధి : యజ్ఞ యాగాది విధులు. ఏవో ఫలితాలు వస్తాయని యజ్ఞయాగాది కర్మలు చేస్తున్నారు. ఇవాళ నిద్రపోయినవాడు, రేపు మేల్కొనేవాడు ఒక్కడే. అలా కాకపోతే ఈ కర్మలు, వాటివల్ల వచ్చే ఫలితాలు వ్యర్థమే.

ఇక సముద్రంలో కలిసే నీటి బిందువు. జీవుడు ఉపాధి రహితంగా అంటే శరీరం లేకుండా లీనం కావటం లేదు. నీటిబిందువును ఒక సీసాలో ఉంచి సముద్రంలో పారేశాము. మళ్ళీ ఆ సీసాను తీసినప్పుడు, అంతకుముందు మనం అందులో ఉంచిన బిందువే ఉంటుంది. అలాగే శరీరంతో ఉన్న జీవుడు మళ్ళీ మేల్కొంటాడు. కాబట్టి

జీవుడు సుషుప్తిలో బ్రహ్మలో ఏకీభావం పొంది, మళ్ళీ అందులో నుంచే మేల్కొంటాడు. అంటూ మూడవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

4. ముగ్ధేఽ ర్ధ సంపత్త్యధికరణము

"అవస్థాత్రయము గురించి తెలుసుకున్నాము. మరి ముగ్ధావస్థ అంటే మూర్ఛలో ఉన్నవాడి స్థితి ఏమిటి? పైన చెప్పిన అవస్థలు దేనిలోనైనా చేరతాడా? లేక అది ప్రత్యేకమైన అవస్థా?" అని అడిగాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 10 ముగ్ధేఽర్ధ సంపత్తిః పరిశేషాత్
ముగ్ధే, అర్ధ సంపత్తిః, పరిశేషాత్

మూర్ఛస్థితియందు సగం సుషుప్తి, సగం మరణ ధర్మంతో కూడి ఉంటుంది అని పరిశేషన్యాయం అంటే జాగ్రద్, స్వప్న, సుషుప్తి, మరణావస్థలలో దేనిలోనూ చేరకుండా ఉండేస్థితి. వేదాలలో ఎక్కడా కూడా ఐదవ స్థితి గురించి చెప్పలేదు. కాబట్టి మూర్ఛ అనేది దేనికి చెందదు. దేనిలోనూ అంతర్భూతం కాదు. ప్రత్యేక అవస్థ అంతకన్నా కాదు. మేలుకుని ఉన్నవాడిలాగా మూర్ఛపోయిన వాడికి బాహ్యజ్ఞానం ఉండదు. అలా అని అంతరజ్ఞానం అంతకన్నా ఉండదు. అసలు అతనికి ఏ విధమైన జ్ఞానము ఉండదు. అతని శరీరం కూడా అదుపులో ఉండదు. వాలిపోతుంది. అతడు స్వప్నాలు చూడలేదు. మనోవ్యాపారాలు అసలుండవు. కాబట్టి అది స్వప్నావస్థ కాదు.

శ్వాస ఆడుతోంది. ప్రాణమున్నది. కాబట్టి మరణం కాదు. పోనీ గాఢనిద్రలో ఉన్నాడా? అంటే అలానూ లేదు అది సుషుప్తి కాదు. ఈ రకంగా అన్ని అవస్థల లక్షణాలూ ఉన్నాయి. కాని ఏ అవస్థా కాదు. అంటూ నాల్గవఅధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

5. ఉభయలింగాధికరణము

"గురువుగారూ ! బ్రహ్మను గురించి వేదాలు రకరకాలుగా చెబుతున్నాయి. కొన్నిసార్లు బ్రహ్మసాకారుడు అన్నాయి. మరికొన్నిసార్లు నిరాకారుడు అన్నాయి. మరి బ్రహ్మసాకారుడా, నిరాకారుడా, లేక సాకార నిరాకారాల్లో ఉంటాడా? కాస్త వివరించండి" అన్నాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 11 నస్థానతోఽపి పరస్యోభయలింగం సర్వత్రహి
న, స్థానతః, అపి, పరస్య, ఉభయలింగం, సర్వత్ర, హి

ఉపాధివలన కూడా బ్రహ్మకు ఉభయత్వం లేదు. వేదాలలో కూడా నిర్గుణమే చెప్పబడింది.

పరబ్రహ్మ స్వరూపము సాకారము, నిరాకారము అని రెండుగా ఎప్పుడూ లేదు. ఉన్నది ఒక్కటే. అదే నిర్గుణబ్రహ్మ. ఉపాధివల్ల రెండుగా కనపడరాదా? అంటే కనపడరాదు. నీళ్ళను నిప్పులమీద కాస్తే అవి వేడెక్కుతాయి. నీళ్ళస్వభావం వేడికాదు. ఇలా వేడెక్కటంవల్ల నిప్పు స్వభావములోనూ మార్పుండదు. అలాగే ఉపాధివల్ల బ్రహ్మకు రెండు రూపాలు రావు. కఠోపనిషత్తులో చెప్పినట్లుగా ఆత్మకు చావు పుట్టుకలు లేవు. అది స్వయంభువు. నాశరహితమైనది. శాశ్వతమైనది.

సూ. 12 న భేదాదితిచేన్న ప్రత్యేక మతద్వచనాత్
న, భేదాత్, ఇతి, చేత్, న, ప్రత్యేకమ్, అతద్వచనాత్

అన్ని వేదాంత వాక్యాలలోనూ నిర్గుణబ్రహ్మమే చెప్పబడలేదు. బ్రహ్మకు నాలుగు పాదాలున్నాయని కూడా చెప్పారు. అని వీరి వాదన.

వేదాలలో బ్రహ్మను గురించి భేదం కనిపిస్తోంది. ఛాందోగ్యంలో మనస్సు అనే బ్రహ్మకు నాలుగు పాదాలున్నాయి.

మొదటి పాదం	–	వాక్కు
రెండవ పాదం	–	ప్రాణం
మూడవ పాదం	–	నేత్రం
నాల్గవ పాదం	–	శ్రోత్రం

బ్రహ్మషోడశ కళా ప్రపూర్ణుడు అన్నారు.

మాండూక్యోపనిషత్తులో ఆత్మకు నాలుగు పాదాలున్నాయి. అవే జాగ్రద్, స్వప్న, సుషుప్తి, తురీయము శాస్త్రాన్ని కాదనలేము. అందుచేత బ్రహ్మకు ఆకారం ఉంది. అంటున్నారు.

కాని అది సరి కాదు. అలా అనటానికి వీలు లేదు. పరమేశ్వరుడికి ఆకారం లేదు. అన్ని వస్తువులందు ఉన్నాడు. ఛాందోగ్యంలో ఉద్దాలకుడు చెబుతున్నాడు. జీవులన్నీ తమ నామరూపాలు కోల్పోయి, ఏ పురుషుడిలో కలిసిపోతాయో, అతడే ఆత్మ. అదే నీవు.

బృహదారణ్యకంలో యాజ్ఞవల్క్యుడు చెబుతున్నాడు.

లోకంలో ఉన్నదంతా ఆత్మే. ఆత్మయే అందరిలోనూ ఉన్నది. ఆత్మనుండే అన్నీ పుట్టాయి. అందులోనే లయం అవుతున్నాయి. ఆ పరమేశ్వరుడు సర్వాంతర్యామి అన్నిటా చైతన్యమూర్తి అని చెబుతూ "వాయువులో ఉండి వాయువును నియంత్రిస్తాడు. వాయువు అతడి శరీరము. కాని వాయువు అతన్నెరగదు. అతడే నీలో ఉన్న ఆత్మ.

ఛాందోగ్యంలో నాలుగు దిక్కులూ పరబ్రహ్మయొక్క మొదటి పాదం. భూమి ఆకాశము సముద్రాలు రెండవ పాదం. అగ్ని, సూర్యుడు, చంద్రుడు, విద్యుల్లతలు మూడవ పాదం. ప్రాణం, దృష్టి, శ్రోత్రము ఇవన్నీ నాల్గవ పాదం ఉపకోశలుడికి అగ్నులు బ్రహ్మోపదేశం చేస్తూ ఆకాశంలో ఉన్న సూర్యునిలో ఏ తత్త్వమైతే ఉన్నదో, అదే నీలోనూ ఉన్నది. దిక్కులు, నక్షత్రాలు, నీరు, నింగి అన్నింటిలోని తత్త్వము ఒక్కటే. అదే పరబ్రహ్మ అని చెప్పబడింది. కాబట్టి బ్రహ్మనిరాకారము, నిర్గుణము అంతేకాని బ్రహ్మకు రెండు రూపాలు లేవు.

సూ. 13 అపి చైవ మేకే
అపి, చ, ఏవం, ఏకే

బ్రహ్మకు భేదము కేవలము ఉపాసనకోసమే చెప్పారు అంతే తప్ప వేరు కాదు.

పరబ్రహ్మ స్వరూపాన్ని మనసుతోనే పొందాలి. దాన్ని తెలుసుకున్న తరువాత ఇంక భేదముండదు. బ్రహ్మలో భేదాన్ని చూసేవాడు జనన, మరణవలయంలో చిక్కుకుపోతాడు. అంతేకాదు. అనుభవించేవాడు, అనుభవించబడేది, ప్రేరేపించేవాడు ఈ మూడు భాగాలు ఉన్నదే బ్రహ్మ అన్నాడు రత్నాకరుడు.

గురువుగారూ కొన్నిచోట్ల వేదంలో బ్రహ్మసాకారుడని, కొన్ని చోట్ల నిరాకారుడని చెప్పారు కదా! మరి అలాంటప్పుడు బ్రహ్మనిరాకారమే అని ఎలా చెబుతారు? అన్నాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 14 అరూపవ దేవహి తత్ప్రధానత్వాత్
అరూపవత్, ఏవ, హి, తత్ప్రధానత్వాత్

రూపం, గుణం, ఆకారంలేనట్టి బ్రహ్మనే గ్రహించాలి. వేదంలో అలాంటి బ్రహ్మనే చెప్పారు.

బృహదారణ్యకంలో ఉషస్తికి చెబుతున్నాడు యాజ్ఞవల్క్యుడు. నీ ఆత్మయే బ్రహ్మ. నోటితోనూ, ముక్కుతోను ఊపిరి పీల్చే విజ్ఞానమయుడైన ఆత్మయే సర్వాంతర్యామి

అపానక్రియ ఆచరించేవాడే సర్వాంతర్యామి. వ్యానక్రియ ఆచరించేవాడే సర్వాంతర్యామి. ఉదానక్రియ ఆచరించేవాడే సర్వాంతర్యామి అయిన నీ ఆత్మ. బ్రహ్మము స్థూలమూ కాదు. సూక్ష్మమూ కాదు. పొడవూ కాదు పొట్టికాదు. శబ్ద స్పర్శరూప రసాదులు లేనటువంటిది. నాశనరహితమైనటువంటిది. ముండకోపనిషత్తులో ఆ బ్రహ్మ కారణము లేనివాడు ఆకారము లేనివాడు అని చెప్పబడింది. ఈశావాశ్యంలో ఆత్మదూరంగా ఉన్నది. దగ్గరగా ఉన్నది. లోపలా ఉన్నది, బయటా ఉన్నది. సృష్టికి అతీతమైనది. ఉపాదియుతము. తైత్తిరీయోపనిషత్తులో ఆకాశము బ్రహ్మ, వాయువు బ్రహ్మ, అగ్ని బ్రహ్మ. ఈ రకంగా పంచభూతాలు తన్మాత్రలు బ్రహ్మమని చెప్పబడింది. ఈ రకంగా బ్రహ్మ ఆకారం లేనివాడు. సర్వత్ర వ్యాపించి ఉన్నాడని చెప్పబడింది. అన్నాడు రత్నాకరుడు. ఆ మాటలు విన్న కృష్ణశర్మ అడుగుతున్నాడు. "గురువుగారూ! మరి సాకారబ్రహ్మను గూర్చి అనేక చోట్ల చెప్పారు కదా! వాటి సంగతి ఏమిటి?" ఆ మాటలకు రత్నాకరుడు సమాధానం చెబుతున్నాడు.

సూ. 15 ప్రకాశవ చ్చావైయర్థ్యాత్
ప్రకాశవత్, చ, అవైయర్థ్యాత్

సూర్యరస్మి వంకరగా రాదు. సరాసరి వస్తుంది. అలాంటి సూర్యరశ్మికి చెయ్యి అడ్డు పెట్టినట్లైతే, అది వంకరగా వస్తున్నట్లు కనిపిస్తుంది. అలాగే ఉపాధి భేదం చేత పరమాత్మ సాకారంగా దర్శనమిస్తుంది. ఇది కేవలం ఉపాసనకోసం చెప్పబడింది.

సూ. 16 అహచ తన్మాత్రమ్
అహ, చ, తన్మాత్రమ్

కాబట్టి శ్రుతివాక్యాలన్నీ బ్రహ్మగురించి చెప్పాయి. అంతేగాని వేరు కాదు. బృహదారణ్యకంలో యాజ్ఞవల్క్యుడు చెబుతాడు. ఓ మైత్రేయీ నీళ్ళలో వేస్తే ఉప్పు కరుగుతుంది. ఆ ఉప్పు నీరంతా వ్యాపించి ఉంటుంది. అదే విధంగా అద్భుతమైన శక్తిగల పరమాత్మ అనంతుడు అవ్యయుడు. విజ్ఞానఘనుడు. అతను ఉపాధులలో కలిసి, అవి నాశనమయినప్పుడు, తానుకూడా నాశనం అయినట్లు కనిపిస్తాడు. అంటే పరమాత్మ లోపల, బయట అంతటా వ్యాపించి ఉన్న రసస్వరూపం.

సూ. 17 దర్శయతి చాథో అపిస్మర్యతే
దర్శయతి, చ, అథో, అపి, స్మర్యతే

అనేక రూపాలు లేవు అంటూ, వేదం రూపంలేని పరబ్రహ్మను గురించే చెబుతున్నది.

అతడు మనకు తెలుసా? అంటే తెలియదు. తెలియదా? అంటే తెలుసు. సాధారణ బ్రహ్మము అందరికీ తెలుసు. కాని బ్రహ్మను గురించిన విశేషము ఎవరికీ తెలియదు. అందుకే ఎవరికైతే తెలియదో వారికి తెలుసు అని కేనోపనిషత్తు చెబుతున్నది. ఈ విధంగా వేదాలలోనే కాదు. స్మృతులలో కూడా అదేవిధంగా చెప్పబడింది. దేవీభాగవతంలో దేవతలందరూ తారకాసురుని బాధలు పడలేక హిమాలయాల్లో తపస్సు చేశారు. వివిధరకాల అర్చనలు, ఆరాధనలు, పూజలు, యోగము చేశారు. అప్పుడు చైత్రశుద్ధ నవమిరోజున వారికి దేవిదర్శనమయింది.

అప్పుడు వారికి ఏంకనిపించింది? అంటే వేదసమ్మతమైన పరంజ్యోతి వారి ఎదుట ప్రత్యక్షమైంది. దేవిరూపము రూపుదాల్చిన నాలుగువేదములచే స్తుతించబడుతున్నది. కోట్లకొలది సూర్యకాంంతులతో ప్రకాశిస్తున్నది. చంద్రకాంతుల చల్లదనం కలిగి ఉన్నది. ఆ రూపము కొన్నికోట్ల మెరుపులు ఒక్కసారి మెరిసినట్లున్నది. దానికి పైన, క్రింద, ప్రక్కన అనే తేడాలు లేవు. నడుమ, అడ్డము అనేవి లేవు. ఆద్యంతములు లేవు. కాళ్ళు చేతులు లేవు. స్త్రీ పురుష నపుంసక భేదాలు లేవు. ఆ కాంతిని చూడలేక దేవతలు కనులు మూసుకున్నారు. (దేవీభాగవతం, సప్తమస్కంధము, 31వ అధ్యాయము) అంతలోనే ఆ దివ్యతేజస్సు ఒక స్త్రీ రూపం దాల్చింది. ఆవిడే పరమేశ్వరి పరమేశ్వరుని అసలు రూపం నిరాకారము. కాని ఉపాసన కోసం మాత్రము రూపం చెప్పబడింది.

అంతేకాకుండా కొన్నిచోట్ల వివరించటానికి వీలులేక, వ్యతిరేక,నిషేధభావాలలో చెప్పబడింది. 'బ్రహ్మ అనాదియైనది. ఇంద్రియాలకు గోచరము కానిది ఉన్నదని, లేదని చెప్పటానికి లేనటువంటిది' కాబట్టి వస్తుతః బ్రహ్మము నిర్గుణమే.

సూ. 18 అతఏవ చోపమా సూర్యకాదివత్
అతఏవ, చ, ఉపమా, సూర్యకాదివత్

అందుకనే పరమాత్మ నీటిలో కనిపించే సూర్యబింబము వంటివాడు అంటారు.

కాంతివంతమైన సూర్యుడు ఒక్కడే. వివిధ కుండలలో నీరు పోసినప్పుడు ఒకదానిలో పెద్దగా, ఒకదానిలో చిన్నగా కనిపిస్తాడు. ఇది ఉపాధి భేదము అలాగే పరమాత్మకూడా ఉపాధి భేదంవల్ల వివిధ ఆకారాలుగా దర్శనమిస్తున్నాడు. అంతేకాని అతడు రూపరహితుడు. కాని అవిద్యచే కూడినవాడై వివిధ రకాలుగా కనిపిస్తున్నాడు.

సూ. 19 అంబువ దగ్రహణాత్తు న తథాత్వమ్
అంబువత్, అగ్రహణాత్, తు, న, తథాత్వమ్

'బ్రహ్మవిషయంలో ఉదకంలాంటి పదార్థం ఏదీ లేనందున, మీరు చెప్పినది సరిపోదు'

గురువర్యా! ప్రతిబింబం పడాలంటే ముందు బింబం ఉండాలి. దానికి ఒక రూపం ఉండాలి. అది ఉపాధికి దూరంగా ఉండాలి. ఇంకా సూర్యుణ్ణి చెప్పినప్పుడు, అతడికి దూరంగా నీరున్నది. అందుకనే సూర్యబింబం ప్రతిఫలిస్తోంది. కాని ఆత్మ అనేది రూపం కల పదార్థము కాదు. అది అన్నింటియందు వ్యాపించి ఉన్నది. దానికన్న వేరైనదేదీ లేదు. కాబట్టి మీరు చెప్పిన ఉదాహరణ సరిపోదు" అన్నాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 20 వృద్ధిహ్రాస భాక్త్వ మంతర్భావాదుభయసామంజస్యా దేవమ్
వృద్ధిహ్రాసభాక్త్వమ్, అంతర్భావాత్, ఉభయసామంజస్యాత్, ఏవం

సూర్యుడు జలంలో ప్రతిబింబిస్తున్నాడు కాబట్టి వృద్ధి, క్షయము పొందుతున్నాడు. అదే విధంగా పరబ్రహ్మ ఉపాధిని పొందటంవల్లనే వృద్ధిక్షయాలు పొందుతాడు.

అంటే నీరు పోసినటువంటి కుండ, మూకుడు, బాన, చట్టి మొదలైన వాటిభేదంవల్ల సూర్యబింబం పెద్దదిగానో, చిన్నదిగానో కనిపిస్తుంది. అలాగే బ్రహ్మకూడా ఉపాధి భేదంతో పెరగటం, తగ్గటం, చలించటం, మొదలైన లక్షణాలున్నట్లు కనిపిస్తోంది. అన్నాడు రత్నాకరుడు.

ఆ మాటలు విన్న కృష్ణశర్మ "సూర్యుడు జలంలో కనిపించినట్లుగా ఆత్మ ఈ దేహము మొదలైన వాటితో కనుపించటం లేదు కదా!" అన్నాడు. శిష్యుడికి సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 21 దర్శనాచ్చ
దర్శనాత్, చ

ప్రతిబింబం రూపంలో పరమాత్మ దేహంలో ప్రవేశిస్తాడు అని వేదంలో చెప్పబడింది. కాబట్టి బ్రహ్మము నిర్విశేషమే.

పరమేశ్వరుడు రకరకాల ఆకారాలలో 84 లక్షల జీవరాసుల్ని సృష్టించాడు. ఇంద్రియాలను కలిగిన మానవులను సృష్టించి, అందులో ప్రవేశించాలనుకున్నాడు. బ్రహ్మరంధ్రం ద్వారా ప్రవేశించాడు అని ఐతరేయోపనిషత్తులో చెప్పబడింది. ఈ రకంగా ఉపాధిలో ఉండటంచేతనే బ్రహ్మకు వృద్ధిక్షయాలు కలుగుతున్నాయి. అంతేగాక ఉపాసన కోసమే అతనికి సాకారంకూడా చెప్పబడింది. లేకపోతే బ్రహ్మనిరాకారుడే అంటూ ఐదవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

6. ప్రకృతైతావత్త్వాధికరణము

"గురువుగారూ ! బృహదారణ్యకంలో మూర్తామూర్తాలను వివరించారు. అందులో పృథివి, జలము, అగ్ని ఈ మూడూ మూర్తములు (స్థూలములు) అని ఆకాశము, వాయువులు అమూర్తములు అంటే సూక్ష్మములనీ పండితులు బ్రహ్మదర్శనం కోసం నేతి, నేతి న ఇతి ఇది కాదు ఇది కాదు అంటూ శోధన చేస్తారు అని చెప్పబడింది. ఇక్కడ నేతి అనేపదం రెండుసార్లు చెప్పారు. ఒకటి మూర్తామూర్తాన్ని, రెండవది బ్రహ్మను నిషేధించటానికే ఈ రకంగా చెప్పారు. అందుచేత శ్రుతివాక్యము బ్రహ్మను నిషేధిస్తున్నది కదా!" అన్నాడు కృష్ణశర్మ సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 22 ప్రకృతైతావత్త్వం హిప్రతిషేధతి తతో బ్రవీతిచ భూయః

ప్రకృతైతావత్త్వం, హి, ప్రతిషేధతి, తతః, బ్రవీతి, చ, భూయః

ఇక్కడ నేతి నేతి అనే పదాలవల్ల వేదము మూర్తామూర్తాలను నిషేధిస్తున్నది. అంతేకాని బ్రహ్మను కాదు. ఈ రకంగా అన్నింటినీ నిషేధించగా మిగిలేది బ్రహ్మము. అదే సత్యము, నిత్యమైనది, శాశ్వతమైనది.

అయితే 'బ్రహ్మ అనేది ఉంటే ఎందుకు కనిపించదు?' అని వీరి అనుమానం.

సూ. 23 తదవ్యక్త మాహహి

తత్, అవ్యక్తమ్, అహ, హి

బ్రహ్మ అవ్యక్తము. వ్యక్తము కానటువంటిది కనులతో దానిని చూడలేము. చెవులతో వినలేము. 'ఆత్మ కండ్లచేత చూడబడదు. చెవులతో వినబడదు మాట్లాడబడదు' అని చెప్పారు. నేతి నేతి అంటూ నిరూపింపబడిన ఆ ఆత్మ గ్రహించటానికి వీలు కాదు. ఆత్మ తెలియరానిది. ఇంద్రియాలకు విషయంకానిది అని గీతలో చెప్పబడింది.

సూ. 24 అపి చ సంరాధనే ప్రత్యక్ష్యానుమానాభ్యామ్

అపిచ, సంరాధనే, ప్రత్యక్షాను మానాభ్యామ్

యోగులు మొదలైనవారు సమాధి స్థితిలో ఆత్మదర్శనం చేసుకుంటున్నారు. అని వేదాలు, పురాణాలు చెబుతున్నాయి. ఆత్మ అనేది కనులతో చూడబడదు. చెవులతో వినబడదు. ఆలోచింపబడదు. ఆత్మ దర్శనానికి ఇంద్రియాలు అసమర్థములు. ఇంద్రియాలతో ఆత్మను చూడలేము. అందుకే మోక్షగామి, ఇంద్రియాలను అంతర్ముఖం చేసి ఆత్మను దర్శించాలి.

సూ. 25 ప్రకాశాదివ చ్చా వైశేష్యం ప్రకాశశ్చ, కర్మణ్యభ్యాసాత్

ప్రకాశాదివత్, చ, అవైశేష్యమ్, ప్రకాశః, చ, కర్మణి, అభ్యాసాత్

జీవాత్మ పరమాత్మలకు భేదం లేదు. ఆ రెండూ ఒక్కటే కేవలము వస్తురూపము పొందటంవల్ల భేదభావము కనిపిస్తుంది.

సూ. 26 అతోఽనంతేన తథాహి లింగమ్

అతః, అనంతేన, తథా, హి, లింగమ్ ॥

భేదమనేది ఉపాధివల్ల వచ్చింది అజ్ఞానంవల్లనే ఉపాధి వచ్చింది. ఉపాధి నివృత్తి చెందగానే జీవుడు అభేదం కలుగుతుంది. అప్పుడు జీవుడు కూడా అనంతమైన బ్రహ్మ అవుతాడు. కాబట్టి పరమేశ్వరుడు నిర్గుణుడే.

సూ. 27 ఉభయవ్యపదేశాత్త్వ హికుండలవత్

ఉభయవ్యపదేశాత్, తు, అహి కుండలవత్

జీవాత్మ పరమాత్మలకు భేదం లేదు. చుట్ట చుట్టుకుని పడుకున్న పాము చుట్టకు, పాముకు ఉన్న తేడా ఎంతో, జీవాత్మ పరమాత్మల మధ్య తేడాకూడా అదే.

బారుగా ఉన్న పాముకు, పాము చుట్టకు తేడా లేదు. అలాగే జీవేశ్వర పరమేశ్వరులు ఒక్కటే. నిర్వికారుడైన పరమేశ్వరుని ధ్యానిస్తున్నవాడే జీవుడు. పరాత్పరుడైన ఆ దివ్య పురుషుని జీవుడు పొందుతున్నాడు. ఇదే వీరిమధ్య భేదము. బృహదారణ్యకంలో "ఎవరు లోపల ఉంటూ, అన్నింటినీ నియమిస్తున్నాడో, అతడే ఆత్మ" అని చెప్పారు. ఇక్కడ నియమిస్తున్నవాడు, నియమింపబడేవాడు, ఇద్దరూ ఒక్కటే. మహావాక్యాలు కూడా ఈ మాటే చెబుతున్నాయి.

తత్త్వమసి – నీవే ఆత్మవు

అహంబ్రహ్మ అస్మి – నేనే పరబ్రహ్మను

కాబట్టి జీవాత్మ పరమాత్మలు రెండూ ఒకటే వేరు కాదు.

సూ. 28 ప్రకాశాశ్రయవద్వా తేజస్త్వాత్

ప్రకాశాశ్రయవత్, వా, తేజస్త్వాత్

సూర్యుడికీ, సూర్యకాంతికి ఏ విధమైన తేడా ఉన్నదో, జీవాత్మ పరమాత్మల మధ్య అదే తేడా ఉన్నది.

సూర్యుడు, కాంతి ఈ రెండూ వేరు కాదు. వీటికి తేడా లేదు. కాని చూడటానికి భేదం ఉన్నట్లు కనిపిస్తుంది. అలాగే జీవాత్మ పరమాత్మ కూడా

సూ. 29 పూర్వవద్వా

పూర్వవత్, వా

గతంలో వలెనే ఇదివరకు చెప్పినట్లుగానే ఈ భేదం అనేది ఉపాధివల్ల వచ్చింది. అంటే అవిద్య అజ్ఞానంవలన వచ్చింది. అవిద్య నశిస్తే ఈ భేదభావం కూడా నశిస్తుంది.

సూ. 30 ప్రతిషేధాచ్చ

ప్రతిషేధాత్, చ

పరమాత్మకన్న భిన్నమైన చేతనం లేదు. బ్రహ్మకన్న వేరైన ప్రపంచం లేదు. పరమాత్మకన్న వేరైన ద్రష్ట ఎవరూ లేరు. బ్రహ్మకారణ రహితుడు. కార్యరహితుడు. బ్రహ్మకన్న భిన్నమైనది ఏదీ లేదు. నీతి అనే పదం బ్రహ్మను నిరోధించదు. అంటూ ఆరవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

7. పరాధికరణము

"ఇంతవరకూ పరమాత్మకన్న వేరైనది ఏదీ లేదు అని చెప్పారు. కాని వేదంలో కొన్నిచోట్ల సేతువు (వంతెన) అంటూ భేదాన్ని చెప్పటంవల్ల బ్రహ్మకన్న వేరైన వస్తువు ఏదైనా ఉన్నదా?" అంటూ అడుగుతున్నాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 31 పరమతః సేతూన్మాన సంబంధభేదవ్యపదేశేభ్యః

పరమ్, అతః, సేతూన్మాన సంబంధభేదవ్యపదేశేభ్యః

సేతువు, ఉన్మానము (కొలత) సంబంధము, భేదములను చెప్పటంవలన బ్రహ్మము కన్న వేరొక వస్తువు ఉన్నదని తెలుస్తున్నది అంటున్నారు.

సేతువు : వంతెన, నదులు, కాల్వలపైనా దాటటానికి కట్టిన నిర్మాణం. ఛాందోగ్యంలో పరమేశ్వరుడు ఈ జగత్తును దాటించే సేతువు అని చెప్పారు.

ఉన్మానము : ఇంత పొడవు, బరువు, పరిమితి అని కొలత, తూకము. చెప్పటం ఛాందోగ్యంలో బ్రహ్మకు నాలుగు పాదాలున్నాయి. పదహారు కళలున్నాయి. అని చెప్పబడింది.

సంబంధము : ఆత్మతో బ్రహ్మకున్న సంబంధము.

'సుషుప్తిలో జీవుడు బ్రహ్మతో కలుస్తున్నాడు' అని ఛాందోగ్యంలో చెప్పారు.

భేదము : చూచేవాడికి, చూడబడేవాడికి భేదము. 'పరమాత్మ చూడదగినవాడు' అన్నారు తెలుసుకోదగినవాడు అన్నారు. అంటే చూసేవానికన్న, తెలుసుకునే వానికన్న భిన్నమైనవాడు.

దీనివల్ల ఈశ్వరునికన్న వేరైనవాడు ఇంకొకడున్నాడు అని తెలుస్తుంది. అనివారు వాదిస్తున్నారు.

సూ. 32 సామాన్యాత్తు

సామాన్యాత్, తు

బ్రహ్మసేతువు వంటివాడు అనటంవల్ల బ్రహ్మకన్న వేరైన వస్తువు ఇంకొకటి ఉన్నదని కాదు. సేతువు నదీజలం వల్ల త్రోవకు అడ్డురాకుండా ఉంటుంది. అలాగే ఈశ్వరుడు ఈ జగత్తుయొక్క మర్యాదకు విధారకుడు. జగత్తును, దానికట్టుబాట్లను నిలుపుతున్నాడు. ఇక్కడ సేతువు అంటే సేతువు దాటి బ్రహ్మను పొందాలి.

సూ. 33 బుద్ధ్యర్థః పాదవత్

బుద్ధ్యర్థః, పాదవత్

కేవలం ఉపాసనకోసం బ్రహ్మకు పరిమితి, కొలత చెప్పబడ్డాయి. ఉపాసనకోసమే బ్రహ్మకు నాలుగుపాదాలున్నాయి అన్నారు. తేలికగా ఉండటంకోసమే పావలాఎత్తు, తులం బంగారం అని చెప్పినట్లుగా, ఉపాసన కోసమే కొలత చెప్పబడ్డది.

సూ. 34 స్థాన విశేషాత్ ప్రకాశాదివత్

స్థానవిశేషాత్, ప్రకాశాదివత్

ప్రకాశములాగానే, ఉపాధియోగంవల్ల బ్రహ్మమందు సంబంధం చెప్పారు.

సంబంధం, భేదము, ఈ రెండూ బ్రహ్మకన్న వేరైన వస్తువున్నదని చెప్పవు. ఒకే బ్రహ్మకు బుద్ధి మొదలైన ఉపాధుల సంబంధంవల్ల జీవుడు, ఈశ్వరుడు అనే భేదం కలిగింది. సుషుప్తిలో ఉపాధి భేదం నశిస్తోంది. ఘటాకాశం మహదాకాశంలో కలిసి పోయినట్లుగా జీవుడు ఈశ్వరునితో ఏకమవుతాడు. సూర్యుడికి అడ్డుగా పెట్టిన వ్రేళ్ళు తీసివేస్తే సూర్యరస్మి సరాసరి పడుతుంది. అలాగే ఉపాధిభేదం పోతే అవిద్య నశించి అభేదం తెలుస్తుంది. కాబట్టి ఇక్కడ చెప్పిన సంబంధము, భేదము వాస్తవాలు కాదు.

సూ. 35 ఉపపత్తేశ్చ

ఉపపత్తేః, చ

శ్రుతివాక్యాలవల్ల సంబంధభేదాలు చెప్పటం ముఖ్యం కాదు. ఛాందోగ్యంలో "సుషుప్తిలో జీవుడు తన రూపాన్నే పొందుతాడు" అప్పుడు ప్రతిబింబం లాంటి జీవభావం పోయి, మిగిలేది ఆత్మభావం ఒక్కటే ఉపాధివల్ల వచ్చిన రూపం మాయమై పోగా నిజస్థితి తెలుస్తుంది.

సూ. 36 తథాన్య ప్రతిషేధాత్

తథా, అన్యప్రతిషేధాత్

ఇతర వస్తువులన్నింటినీ నిషేధించటంవల్ల పరమాత్మకన్న భిన్నమైనది ఏదీ లేదని తెలస్తుంది. ఈ సమస్థమూ బ్రహ్మమే. ఆత్మయే. ఈ బ్రహ్మలో నానాత్వం ఏమీ లేదు. అని ఛాందోగ్యము, బృహదారణ్యకము చెబుతున్నాయి. బ్రహ్మకన్న వేరొకటి లేదు. కాబట్టి బ్రహ్మ అద్వితీయము.

సూ. 37 అనేన సర్వగతత్వమాయామశబ్దాదిభ్యః

అనేన, సర్వగతత్వం, ఆయామ శబ్దాదిభ్యః

దీనివల్ల బ్రహ్మముకన్న వేరే ఏదీ లేదని, బ్రహ్మము సర్వగతము, పరిపూర్ణము అని తెలుస్తోంది. కాబట్టి బ్రహ్మము ఒక్కటే. అది అద్వితీయము అంటూ ఏడవ అధికరణను పూర్తి చేశాడు రత్నాకరుడు.

8. ఫలాధికరణము

"గురుదేవా! మానవులు ఇష్టము, అనిష్టము, మిశ్రమము అని మూడు రకాల కర్మఫలాలను అనుభవిస్తున్నారు. ఈ కర్మ ఫలాన్ని ఇచ్చేదెవరు. కర్మమా? ఈశ్వరుడా? వివరించండి అన్నాడు నారాయణభట్టు. వివరించటం మొదలుపెట్టాడు రత్నాకరుడు.

సూ. 38 ఫల మత ఉపపత్తేః

ఫలమ్, అతః, ఉపపత్తేః

ఉపపత్తివల్ల కర్మ అనేది ఈశ్వరునివల్లనే కలుగుతోంది. సర్వాధికారి. సృష్టి స్థితి లయాలకు కారకుడు పరమేశ్వరుడు. ఆయన సర్వజ్ఞుడు కాబట్టి, కర్మలు ఆచరించనటు వంటి వారికి, వారి వారి కర్మలనుబట్టి ఫలితము ఇస్తాడు.

సూ. 39 శ్రుతత్వాచ్చ

శ్రుతత్వాత్, చ

కర్మఫలాన్ని ఈశ్వరుడే ఇస్తాడని శ్రుతులు చెబుతున్నాయి.

అన్నభక్షణ చేసేవాడు, కర్మఫలాన్ని ఇచ్చేవాడు కూడా ఆ ఆత్మే అని వేదాలు చెబుతున్నాయి. ధనాన్ని, భోగాన్ని ఇచ్చేవాడు ఆ పరమాత్మే.

సూ. 40 ధర్మం జైమిని రతఏవ

యాగాది రూపమైన ధర్మమే ఫలమిస్తుంది అని జైమిని అంటున్నాడు.

జైమిని పూర్వమీమాంశ వ్రాశాడు. అందులో ఈశ్వరుణ్ణి అంగీకరించరు. కాబట్టి ఈశ్వరుడుగాని, యాగాదిదేవతలుగాని ఫలాన్ని ఇవ్వరని, కర్మలవల్ల కలిగిన 'అపూర్వము' అనే సూక్షశక్తే ఫలితము ఇస్తుంది అంటారు. కర్మము ఫలితము ఇవ్వదనే మాట వీరు కూడా అంగీకరిస్తున్నారు.

సూ. 41 పూర్వంతు బాదరాయణో హేతు వ్యపదేశాత్

పూర్వం, తు, బాదరాయణః, హేతువ్యపదేశాత్

కాని కర్మయొక్క ఫలితాన్ని ఇచ్చేది ఈశ్వరుడు అంటాడు బాదరాయణుడు. కర్మ అనేది స్వయంగాకాని, అపూర్వంగాకాని కర్మఫలానికి కారణం కాదు.

ఈ రకంగా అన్ని కర్మలకు ఫలాన్ని ఇచ్చేవాడు బ్రహ్మ. బ్రహ్మమే కారణము. కౌశీతకీ ఉపనిషత్తులో ఆ పరమేశ్వరుడు ఎవరిని ఈ లోకం నుండి ఉద్ధరించాలను కుంటున్నాడో, వారితో మంచి పనులు చేయిస్తాడు. అధోలోకాలకు పంపాలనుకునే వారితో చెడ్డపనులు చేయిస్తాడు" అని చెప్పబడింది. కాబట్టి ధర్మఫలాన్ని ఇచ్చేవాడు బ్రహ్మమే తప్ప వేరుకాదు. అంటూ మూడవ అధ్యాయంలో మూడవపాదాన్ని పూర్తిచేశాడు రత్నాకరుడు.

తృతీయ పాదము

ఈ పాదంలో ఉపాసనలను గూర్చి వివరిస్తున్నారు. ఉపాసన రెండు రకాలు 1. సగుణోపాసన, 2. నిర్గుణోపాసన. సగుణోపాసన చిత్తస్థైర్యాన్ని కలిగించి నిర్గుణోపాసనకు దారి చూపుతుంది. ఇందులో 36 అధికరణలు, 66 సూత్రాలు ఉన్నాయి.

వ.నెం.	అధికరణము	విషయము	సూత్రాలు
1.	సర్వవేదాంత ప్రత్యయాధికరణము	ఉపాసనల ఏకరూపత్వం	4
2.	ఉపసంహారాధికరణము	ఒక శాఖలోని గుణాలను వేరొక శాఖలోకి అన్వయించటము	1
3.	అన్యథాత్వాధికరణము	ఒకటిగా కనిపించినా కొన్ని విద్యలు భిన్నములే	3
4.	వ్యాప్త్యధికరణము	ఓంకారము అన్ని వేదాలకు సాధారణము	1
5.	సర్వాదిభేదాధికరణము	ఉపాసనలకు భేదము లేదు	1
6.	ఆనందాద్యధికరణము	ఆనందాది గుణాలు మాత్రమే సర్వత్ర అన్వయింపతగ్గవి	3
7.	అద్యానాధికరణము	అన్నిటికంటె పరుదైనవాడు పరమాత్మ	2
8.	ఆత్మగృహీత్యధికరణము	ఐతరేయంలోని ఆత్మ పరమాత్మే	2
9.	కార్యాఖ్యానాధికరణము	ప్రాణానికి జలమే వస్త్రము	1
10.	సమానాధికరణము	ఒకేశాఖలో సమానమైన విద్యల్ని సంగ్రహించుకోవాలి	1
11.	సంబంధాధికరణము	సత్యవిద్యలోని రెండు నామములు భిన్నములు	3
12.	సంభృత్యధికరణము	రాణాయనీయశాఖలోని బ్రహ్మగుణాలు ప్రత్యక్షోపాసనకు సంబంధించినవి	1
13.	పురుష విద్యాధికరణము	ఛాందోగ్య, తైత్తిరీయక విద్యలు భిన్నములు	1
14.	వేధాద్యధికరణము	వేదాలతోడి వాక్యాలు బ్రహ్మవిద్యాంగాలు కావు	1
15.	హాన్యధికరణము	జ్ఞానియొక్క పుణ్యపాపములు విసర్జించుట	1
16.	సాంపరాయాధికరణము	జ్ఞాని ఉత్క్రాంతి యందే పాపపుణ్యాలు వదులుతాడు	2
17.	గతేరర్థవత్త్వాధికరణము	సగుణోపాసకుని దేవయానము నిర్గుణోపాసకునికి బ్రహ్మము	2
18.	అనియమాధికరణము	సగుణోపాసకులందరిదీ దేవయానమే	1
19.	యావదధికారాధికరణము	ముక్తులైనవారు ధర్మరక్షణ కోసం మళ్ళీ జన్మించవచ్చు	1
20.	అక్షరధ్యధికరణము	అక్షరానికి సంబంధించిన నిషేధభావాలకు ఉపసంహారం ఉంది	1
21.	ఇయదధికరణము	'ద్వాసుపర్ణా' 'ఋతంపిబన్తౌ'లలో చెప్పిన విద్య ఒకటే	1
22.	అంతరత్వాధికరణము	ఉషస్త, కహోళ బ్రాహ్మణాలలో చెప్పిన విద్య ఒకటే	2
23.	వ్యతిహారాధికరణము	ఐతరేయకం ఉభయరూపోపాసన చెబుతుంది	1
24.	సత్యాద్యధికరణము	బృహదారణ్యకంలోని సత్యవిద్యలు రెండూ ఒకటే	1
25.	కామ్యాద్యధికరణము	ఛాందోగ్య, బృహదారణ్యకాలలోని సత్యకామాత్వాదులకు గుణోపసంహారం ఉంది	1
26.	ఆదరాధికరణము	ప్రాణాగ్ని హోత్రము గురించి	2
27.	తన్నిర్ధారణాధికరణము	కర్మలనాశ్రయించిన విద్యలు ఆ కర్మాంగాలు కావు	1
28.	ప్రదానాధికరణము	వాయు, ప్రాణోపాసనలు భిన్నములు	1
29.	లింగభూయస్త్వాధికరణము	శతపదబ్రాహ్మణంలోని అగ్నులు ఉపాసనాత్మకాలు	9
30.	శరీర వ్యతిరేకాధికరణము ఐకాత్మ్యాధికరణము	ఆత్మదేహంకన్న భిన్నమైనది	2
31.	అంగావ బద్ధాధికరణము	ఉద్గీథాదులు అన్ని శాఖలకు సంబంధించినవి	2
32.	భూమజ్యాయస్త్వాధికరణము	వైశ్వానరోపాసన సమగ్రమైనదే	1
33.	శబ్దాదిభేదాధికరణము	వేద్యం ఒకటే అయినా, గుణభేదంవల్ల, ఉపాసనా భేదం కలుగుతోంది	1
34.	వికల్పాధికరణము	బ్రహ్మోపాసనలలో దేనినైనా అనుష్ఠించవచ్చు	1
35.	కామ్యాధికరణము	కామ్యోపాసనలు సమిష్టిగానూ, ఒకటిగాను అనుష్ఠించవచ్చు	1
36.	యథాశ్రయభావాధికరణము	కర్మాంగోపాసనలు కలిపి, విడిగా కూడా చెయ్యవచ్చు	6
		మొత్తం సూత్రాలు	66

1. సర్వవేదాంత ప్రత్యయాధికరణము

గురువర్యా! అన్ని ఉపనిషత్తులలోనూ చెప్పబడిన ఉపాసనలు ఒకటేనా? లేక వేరువేరా? వివరించండి" అన్నాడు కృష్ణశర్మ. శిష్యుని సందేహం తీర్చటం ప్రారంభించాడు రత్నాకరుడు.

సూ. 1 సర్వవేదాంత ప్రత్యయం చోదనాద్యవిశేషాత్
సర్వవేదాంత ప్రత్యయమ్, చోదనాద్యవిశేషాత్

అన్ని వేదాంతములందు అంటే అన్ని ఉపనిషత్తులందూ చెప్పబడిన ఉపాసనలు భిన్నమైనవి కావు. వాటి విధిలో ఏ రకమైన తేడా లేదు.

ఉపనిషత్తులలో చెప్పబడిన ప్రాణ విద్య, పంచాగ్ని విద్య మొదలైన ఉపాసనలన్నీ ఒక్కటే. అందులో చెప్పిన విషయము, ఉపాసనా విధానము, ఉపాసనా ఫలము అంతా ఒకటే. ఛాందోగ్య, బృహదారణ్యకాలలో చెప్పిన ముఖ్య ప్రాణోపాసన ఒకటే. రెండింటిలోనూ ప్రాణమే శ్రేష్ఠము, జ్యేష్ఠము అని చెప్పబడింది అటువంటి ప్రాణాన్ని గురించి తెలుసుకున్నవాడే జ్యేష్ఠుడు, శ్రేష్ఠుడు అని చెప్పబడింది. అలాగే పంచాగ్ని విద్య, శాండిల్య విద్య, వైశ్వానర విద్యలు కూడా

సూ. 2 భేదాన్నేతి చేన్నైకస్యామపి
భేదాత్, న, ఇతి, చేత్, న, ఏకస్యామ్, అపి

ద్రవ్యభేదము, దేవతా భేదాలనుబట్టి యాగంలో భేదం వస్తుంది. అలాగే వేద్యుడు, ఉపాసదేవత, విద్య వీటివల్ల కూడా భేదం ఉంటుందనేది సరికాదు.

పంచాగ్ని విద్యలో బృహదారణ్యకంలో ఆరు అగ్నులు చెప్పగా, ఛాందోగ్యంలో ఐదు అగ్నులే చెప్పారు. అలాగే ప్రాణాన్ని గురించి చెప్పేటప్పుడు, బృహదారణ్యకంలో ఐదు చెప్పారు. అందుచేత ఉపాసన భేదం, విధానంలో నానాత్వం వస్తున్నాయని వారి వాదన. ఇది నిజం కాదు. రూపభేదం, గుణభేదం కొద్దిగా ఉండచ్చు. ఈ తేడాలు అంత ముఖ్యమైనవి కావు. అందువల్ల నానాత్వం సిద్ధించదు.

సూ. 3 స్వాధ్యాయస్య తథాత్వేన హి సమాచారేఽధికారాచ్చ సవవచ్చ తన్నియమః
స్వాధ్యాయస్య, తథాత్వేన, హి, సమాచారే, అధికారాత్, చ, సవవత్, చ, తన్నియమః

ఉపాసనలలో 'శిరోవ్రతము' అని ఒక ఉపాసన ఉన్నది. ఇది దేవీభాగవతము వంటి వాటిలో చెప్పబడింది. కానీ ఉపనిషత్తులలో చూస్తే, ఒక్క ముండకోపనిషత్తులోనే

చెప్పబడింది. ఇంకే ఉపనిషత్తులోనూ దీన్నిగురించి లేదు. కాబట్టి ఉపాసనలో భేదం ఉంది అనటం సరికాదు.

ఇది కేవలము స్వాధ్యాయానికి సంబంధించినది అంతేకాని ఉపాసధర్మం కాదు. అందుచేత ఉపాసనలలో భేదం లేదు.

సూ. 4 దర్శయతి చ
దర్శయతి, చ

వేదాలలో కూడా వేద్యుడు అంటే తెలుసుకొనదగినవాడు, ఉపాసన ఒకటే అని చెప్పబడింది. కాబట్టి ఉపనిషత్తులలో రకరకాల ఉపాసనలు చెప్పినప్పటికీ, వాటిలో ఏకరూపత్వమున్నది. అంటూ ఒకటవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

2. ఉపసంహారాధికరణము

సూ. 5 ఉపసంహారోఽర్థాభేదాద్విధి శేషవత్సమానే చ
ఉపసంహారః, అర్థభేదాత్, విధిశేషవత్, సమానే, చ

ఉపసంహారము అంటే ఒకచోట చెప్పిన గుణాన్ని, ధర్మాన్ని ఇంకొకచోట అన్వయింప చేయటం. అగ్ని హోత్రం అనేది ఎక్కడైనా ఒకటే. అలాగే ఉపాసనలోకూడా గుణోప సంహారం జరగాలి. ఉపాసనలో భేదం ఉండదు.

ఒక శాఖలో కొన్ని ధర్మాలు చెబితే, ఇంకొక శాఖలో కొన్ని ధర్మాలు చెబుతారు. ఇప్పుడు ఒకశాఖలోని ధర్మాలను ఇంకొక శాఖలోకి ఉపసంహారం చెయ్యవచ్చు. అంటే ఉపాసకుడు అన్ని శాఖలలోని గుణాలను నేర్చుకుని అన్వయింప చేయవచ్చును. ఇందులో దోషం లేదు. అంటూ రెండవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

3. అన్యథాత్వాధికరణము

అన్ని ఉపనిషత్తులలోనూ ఉపాసన ఒక్కటే. కాని ఛాందోగ్యంలోనూ, బృహదారణ్యకం లోను కూడా ప్రాణవిద్య చెప్పబడ్డది. ఈ ప్రాణవిద్యలు ఒకటేనా? వీటిలో తేడాలున్నాయా? అన్నాడు నారాయణభట్టు. వివరణ ప్రారంభించాడు రత్నాకరుడు.

సూ. 6 అన్యథాత్వం శబ్దాదితి చేన్నావిశేషాత్
అన్యథాత్వం, శబ్దాత్, ఇతి, చేత్, న, అవిశేషాత్

ఛాందోగ్యము, బృహదారణ్యకాలలో చెప్పిన ప్రాణవిద్యలు రెండూ వేరువేరు కాదు. వీటిలో ఇతరమైన అంశం ఏమీ లేదు.

ఉద్గీతను గురించి చెబుతూ ఛాందోగ్యంలో "ఓంకారాన్ని ఉద్గీతదృష్టితో ఉపాసించాలి" అని చెప్పారు. ఇక్కడ ఉద్గీత కర్మగా చెప్పబడ్డది. అదే బృహదారణ్యకంలో ముఖ్యప్రాణాన్ని ఉద్గీత కర్తగా చెప్పారు. 'దేవతల కోసం ముఖ్యప్రాణం ఉద్గానం చేసింది.' ఉద్గీత అనేది ఈ రకంగా ఒకచోట కర్త, ఇంకొక చోట కర్మగా చెప్పబడింది. కాబట్టి ఉద్గీతవిద్యలు భిన్నమైనవి అని వారి వాదన. ఇది సరియైనది కాదు.

రెండు చోట్లాకూడా దేవదానవుల యుద్ధం జరిగింది. దేవతలు ఓడిపోయి ఉద్గీతోపాసన చెయ్యమని వాక్కు మొదలైనవాటిని అడగటం, అవి నిర్వీర్యమవటం,చివరకు ముఖ్యప్రాణము ఉద్గానం చెయ్యటం. దాంతో అసురులు ఓడిపోవటం జరిగింది. రెండూ ఒకటే. కాని ఛాందోగ్యంలో పూర్వకాలంలో అనేకమంది ప్రాణాన్ని ఉద్గీతగా ఉపాసన చేశారు. ఇక్కడ ప్రాణం కర్మ. బృహదారణ్యకంలో ప్రాణం ఉద్గీతోపాసన చేసింది అంటూ కర్తగా పేర్కొనబడింది. అంతేతప్ప మిగతా భేదం ఏమీ లేదు.

సూ. 7 నవా ప్రకరణ భేదాత్పరోవరీయస్త్వాదివత్

న, వా, ప్రకరణభేదాత్, పరోవరీయస్త్వాదివత్

ప్రకరణ భేదం ఉండటంవల్ల విద్యైక్యమే లేదు. ఓంకారోపాసన, ప్రాణోపాసన రెండూ వేరు వేరు.

సూ. 8 సంజ్ఞాతశ్చేత్తదుక్త మస్తితు తదపి

సంజ్ఞాతః, చేత్, తత్, ఉక్తమ్, అస్తి, తు, తత్, అపి

రెండు విద్యలకు ఒకే పేరున్నది కాబట్టి రెండూ ఒకటే అనటానికి వీలు లేదు. వేరువేరు విద్యలకు కూడా ఒకే పేరుండవచ్చు. కాబట్టి ఒకేపేరుతో ఉన్న రెండు విద్యలలో తేడా ఉండవచ్చును. అంటూ మూడవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

4. వ్యాప్త్యధికరణము

"గురువుగారూ ! ఓంకారమనేది ఋగ్ యజు స్సామవేదాలు మూడింటింటిలోనూ వ్యాప్తమై ఉన్నది కదా! కాబట్టి ఓంకారాన్ని ఏ వేదంలోని ప్రణవంగా గ్రహించాలి?" అంటూ అడిగాడు నారాయణభట్టు. సమాధనం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 9 వ్యాప్తేశ్చ సమంజసమ్

వ్యాప్తేః, చ, సమంజసమ్

ఓంకారము మూడు వేదాలయందు వ్యాప్తమై ఉన్నది. కాని ఉద్గీతం అనేది ఓంకారానికి విశేషణం. అందుచేత సామవేదంలోని ప్రణవంగా దీన్ని గ్రహించాలి.

ఓంకారము అన్ని వేదాలలో ప్రతి ఋక్కుకు, ప్రతి అనువాకానికి ముందు, చివర కూడా ఉంటుంది. అయితే ఋగ్వేదంలో ఉద్గీతాన్ని ఓంకారానికి విశేషణంగా చెప్పారుకాబట్టి సామవేద అవయవంగా దీన్ని ఉపాసించాలి. అంటూ నాల్గవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

5. సర్వాభేదాధికరణము

"గురువుగారు ! ప్రాణవిద్య అనేది బృహదారణ్యక ఛాందోగ్యాలలో ఒకటే. అక్కడ ప్రాణమే శ్రేష్ఠము, జ్యేష్ఠము అని చెప్పబడింది. ఈ ఉపనిషత్తులలో ఇంద్రియాలకు కూడా వశిష్ఠత్వాది గుణాలు చెప్పబడ్డాయి అంటే

వాక్కుకు	–	సుస్థిరత్వము
చక్షువుకు	–	ప్రతిష్ఠాత్వము (చక్కగా నిలిచే శక్తి)
శ్రోత్రానికి	–	సంపత్త్వము (ఇతరుల అభిప్రాయం తెలుసుకునే శక్తి)
మనస్సుకు	–	అవయవత్వము (అన్ని ఇంద్రియాలకు ఆధారము)
రేతస్సుకు	–	జనిత్వము (ఉత్పత్తి కారణము)

కౌశీతకీ ఉపనిషత్తులో శ్రేష్ఠత్వము మాత్రమే చెప్పారు. కాని వశిష్ఠత్వాది గుణాలు చెప్పలేదు. కాబట్టి ఒక శాఖలో చెప్పిన వశిష్ఠత్వాది గుణాలు ఇతర శాఖలలోకి కూడా అన్వయించుకోవచ్చా? లేదా?" అని ప్రశ్నించాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 10 సర్వాభేదా ధన్యత్రేమే

సర్వాభేదాత్, అన్యత్ర, ఇమే

అన్ని శాఖలలోనూ ప్రాణోపాసను భేదం లేదు కాబట్టి, వశిష్ఠత్వాది గుణాలు అన్ని శాఖలలోకి అన్వయించవచ్చు. కౌశీతకోపనిషత్తు మొదలైన వాటిలో వశిష్ఠత్వాది గుణాలు వర్ణించబడకపోయినప్పటికి, ఛాందోగ్య, బృహదారణ్యకాలలో చెప్పిన గుణాలన్నీ ఇక్కడ అన్వయించుకోవచ్చు అంటూ ఐదవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

6. ఆనందాద్యధికరణము

గురువర్యా ! బ్రహ్మకు సత్యత్వము అనంతత్వము అనే ధర్మాలు చెప్పబడ్డాయి. మరికొన్ని చోట్ల బ్రహ్మవిద్యను ప్రతిపాదించే సందర్భాలలో విజ్ఞానఘనత్వము, సర్వాత్మత్వము, సరవగతత్వము మొదలైన గుణాలు చెప్పబడ్డాయి. ఎక్కడ ఏ ఏ గుణాలు చెప్పబడ్డాయో వాటినే అక్కడ గ్రహించాలా? లేక ఎక్కడ చెప్పిన గుణాలనైనా అన్నిచోట్లా గ్రహించవచ్చునా?" అంటూ సందేహాన్ని వెలిబుచ్చాడు కృష్ణశర్మ. సమాధానం చెప్పటం ప్రారంభించాడు రత్నాకరుడు.

సూ. 11 ఆనందాదయః ప్రధానస్య

ఆనందాదయః, ప్రధానస్య

పరబ్రహ్మ యొక్క ఆనందత్వము మొదలైన ధర్మాలను సర్వత్రా అన్వయించుకోవచ్చు.

ఉపనిషత్తులలో చెప్పబడిన పరబ్రహ్మ నిర్గుణుడు, ఆనందస్వరూపుడు, విజ్ఞానఘనుడు, సద్రూపుడు, చిద్రూపుడు, పూర్ణుడు అని చెప్పటం జరిగింది. వీటిలో కొన్ని కొన్ని ధర్మాలు కొన్ని కొన్ని చోట్ల చెప్పబడ్డాయి. అయినప్పటికీ, ఉపనిషత్తులలో చెప్పదలచినది నిర్గుణ బ్రహ్మను గూర్చే. కాబట్టి ఆ ధర్మాలు ఎక్కడ అవసరమైతే అక్కడ వాటిని చెప్పవచ్చును.

సూ. 12 ప్రియశిరస్త్వా ద్యప్రాప్తి రుపచయా పచయౌ హి భేదే

ప్రియశిరస్త్వాది, అప్రాప్తిః, ఉపచయాపచయౌ హి, భేదే.

<u>తైత్తిరీయోపనిషత్తు</u>లోని ప్రియశిరస్త్వాది ధర్మాలకు సర్వప్రాప్తి లేదు. ప్రియశిరస్త్వాది ధర్మాలు అంటే ప్రియము, మోదము, ప్రమోదము, ఆనందము అనేవి.

ప్రియము	–	తనవారిని చూసినప్పుడు కలిగే సంతోషము
మోదము	–	కోరుకున్నది లభించినప్పుడు కలిగే సంతోషము
ప్రమోదము	–	మోదము ఎక్కువైనప్పుడు కలిగేది
ఆనందము	–	అన్నింటికీ మించిన సంతోషము

ఆనందమయుడికి

ప్రియము	–	శిరస్సు
మోదము	–	దక్షిణ పక్షము
ప్రమోదము	–	ఉత్తర పక్షము
ఆనందము	–	ఆత్మ

ప్రియము, మోదము, ప్రమోదము అనేవి సంతోషంలో హెచ్చుతగ్గులు ఈ ధర్మాలను ప్రతిచోట చెప్పటానికి లేదు. వీటిని ఎక్కడైనా చెప్పవచ్చును.

సూ. 13 ఇతరే త్వర్థసామాన్యాత్

ఇతరే, తు, అర్థసామాన్యాత్

బ్రహ్మమనేది సర్వత్రా ఉండేదే కాబట్టి, ఆనందాది ధర్మాలు సర్వత్ర అన్వయించ వలసినదే.

బ్రహ్మయొక్క స్వరూపాన్ని తెలియచేసేవి, బ్రహ్మ విజ్ఞానసాధనాలు ఈ ఆనందాది ధర్మాలు. కాబట్టి వాటిని సర్వత్ర అన్వయించవలసినదే. ఇలా అన్వయించకపోతే బ్రహ్మతత్త్వాన్ని బోధించే మహావాక్యాల అర్థం తెలియదు. అందుకనే ఆనందము, సత్యములాంటి గుణాలను సర్వత్రా అన్వయించుకోవాలి అంటూ ఆరవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

7. అధ్యానాధికరణము

గురువర్యా! కఠోపనిషత్తులో

ఇంద్రియాలు	–	మనస్సు అధీనంలోనూ
మనస్సు	–	బుద్ధి అధీనంలోనూ
బుద్ధి	–	యజమాని అధీనంలోనూ ఉండాలి

విజ్ఞానహీనుడు మనసును అధీనంలో ఉంచుకోలేడు. తాను చేరవలసిన గమ్యం చేరలేడు. మోక్షాన్ని పొందలేడు. వివేకవంతమైన బుద్ధిగలవాడు, మనసును అదుపులో ఉంచగలిగినవాడు పరమపదాన్ని చేరతాడు.

ఇంద్రియాల కన్న	–	వాటివిషయాలు (లక్షణాలు) శ్రేష్ఠమైనవి
విషయాలకన్న	–	మనస్సు శ్రేష్ఠమైనది
బుద్ధికన్న	–	మహతత్త్వం శ్రేష్ఠమైనది
ప్రకృతికన్న	–	సూక్ష్మరూపి అయిన పురుషుడు గొప్పవాడు

అంతకుమించి ఇంకేమీ లేదు. అదే పరాకాష్ఠ. అతణ్ణి చేరినవారు తిరిగిరారు. అని చెప్పబడింది. ఇక్కడ పురుషుడు అన్నింటిలోనూ ఉన్నాడని చెప్పటం దీని ఉద్దేశ్యమా? లేకపోతే విషయాదులైన ఇవన్నీ ఒకదానిలోపల ఒకటున్నాయని చెప్పటం ఉద్దేశ్యమా? వివరించండి అన్నాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు కృష్ణశర్మ.

సూ. 14 అధ్యానాయప్రయోజనాభావాత్

అధ్యానాయ, ప్రయోజనాభావాత్

జ్ఞానపూర్వకమైన సమ్యక్జ్ఞానం కోసమే పురుషత్వము ఇక్కడ చెప్పబడింది. అంతేగాని మిగిలినవన్నీ ఒకదానికన్న ఇంకొకటి గొప్పది అని చెప్పటానికి మాత్రం కాదు. అలా చెప్పటంవల్ల ఉపయోగం ఏమీ లేదు.

ఇక్కడ ఇంద్రియాల కన్న వాటి లక్షణాలు, వాటికన్న మనస్సు, మనస్సు కన్న బుద్ధి ఇలా ఒకదాని కన్న ఒకటి ఎక్కువ అని చెప్పటం కాదు. ఇవి ఒకదానికన్న ఒకటి శ్రేష్ఠమైనవి అని చెప్పి పరమపురుష సాక్షాత్కారం పొందటమే ఇక్కడ లక్ష్యం. అన్నిటికన్న ఉత్కృష్టమైన వాడు పురుషుడు. అతణ్ణి గురించి తెలుసుకున్న మరుక్షణమే ముక్తి కలుగుతుంది.

సూ. 15 ఆత్మ శబ్దాచ్చ

ఆత్మశబ్దాత్, చ

ఇక్కడ ఆత్మశబ్దం చెప్పటం కేవలం పురుషుణ్ణి ప్రతిపాదించటం కోసమే. కఠోపనిషత్తులో చెప్పినట్లుగా ఆత్మ అనేది సూక్ష్మమైన బుద్ధితో మాత్రమే గ్రహించబడుతుంది. ఈ ఆత్మ సర్వవస్తు జాలమందు ఉన్నది. కాని పైకి కనుపించదు. సూక్ష్మబుద్ధి గలవారు మాత్రమే దీనిని గుర్తించగలుగుతారు. వివేకవంతుడు

ఇంద్రియాలను	–	మనస్సులో లీనం చెయ్యాలి
మనస్సును	–	బుద్ధిలో లీనం చెయ్యాలి
బుద్ధిని	–	మహతత్త్వంలో లీనం చెయ్యాలి
మహత్తత్త్వాన్ని	–	ఆత్మలో లీనం చెయ్యాలి

ఇదంతా ఎందుకు ? పురుషజ్ఞానం కోసం. ఆత్మజ్ఞానం కోసం. అంతేకాని ఇవన్నీ ఒకదానికన్న ఒకటి గొప్పది అని చెప్పటానికి కాదు. ఈ రకంగా అన్నిటికంటే పరుడైనవాడు పరమాత్మ అంటూ ఏడవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

8. ఆత్మగృహీత్యధికరణము

"సృష్టి జరగటానికి ముందు ఈ జగత్తంతా బ్రహ్మమయంగానే ఉండేది. దానికి భిన్నమైన పదార్థం ఏమీ లేదు. దాన్నే ఆత్మ అంటారు. ఆ ఆత్మయే లోకాలను సృష్టించాలి

అనుకున్నది. అంభస్సు (స్వర్గ లోకము) మరీచి (అంతరిక్షము) మర (భూలోకము) ఆపః (పాతాళము) అనే లోకాలను సృష్టించింది. అని ఐతరేయోపనిషత్తులో చెప్పబడింది. ఇక్కడ ఆత్మశబ్దానికి అర్థం – హిరణ్యగర్భుడా? లేక పరమాత్మా? వివరించండి అన్నాడు కృష్ణశర్మ. వివరించటం మొదలుపెట్టాడు రత్నాకరుడు.

సూ. 16 ఆత్మగృహీతి రితరవ దుత్తరాత్

ఆత్మగృహీతిః, ఇతరవత్, ఉత్తరాత్

వేదాలయందు ఆత్మశబ్దానికి పరమాత్మ అని అర్థం అలాగే ఇక్కడకూడా చెప్పాలి.

సృష్టిరచన చెయ్యటం పరమాత్మ లక్షణం. అది పరమాత్మ ధర్మం. కాబట్టి ఆత్మశబ్దానికి అర్థం పరమాత్మే. తైత్తిరీయంలో ఆత్మనుండి ఆకాశం, ఆకాశం నుండి వాయువు మొదలైన భూతాలు పుట్టినాయి. అని చెప్పబడింది. ఇక్కడ ఆత్మ అంటే పరమాత్మే. బృహదారణ్యకోప నిషత్తులో యాజ్ఞవల్క్యుడు జనకమహారాజుకు ఆత్మను గురించి వివరిస్తూ ఆత్మను ఎవరూ చూడలేరు. అంటూ ఆ వివరణ పూర్తి చేస్తాడు అలాగే ఛాందోగ్యంలో ఉద్దాలకుడు శ్వేతకేతువుకు ఆత్మజ్ఞానాన్ని వివరిస్తూ "శ్వేతకేతూ ! సృష్టికి పూర్వం ఈ ప్రపంచం నామరూపాలతో కూడి లేదు. అని ఆరంభించి ఆత్మతత్త్వాన్ని వివరిస్తాడు ఈ రెండు ఉపనిషత్తులలోనూ ఆత్మశబ్దానికి అర్థం పరమాత్మ.

సూ. 17 అన్వయా దితిచేత్స్యాదవధారణాత్

అన్వయాత్, ఇతి, చేత్, స్యాత్, అవధారణాత్

లోకాలను సృష్టించటం పరమాత్మ పని కాదు. హిరణ్యగర్భుని పని అని వారి వాదన. అందుకనే హిరణ్యగర్భుడు అని అర్థం చెబితేనే బాగుంటుంది అని వారంటారు ఇది తప్పు. సృష్టికి పూర్వము ఉన్నది పరమాత్మయే కాబట్టి ఇక్కడ ఆత్మ అంటే పరమాత్మ అనే అర్థం చెప్పాలి ఐతరేయంలాంటి ప్రాచీన ఉపనిషత్తులోకూడా ఆత్మ అనే శబ్దానికి 'పరమాత్మ' అనే అర్థం చెప్పారు. కాబట్టి ఆత్మ అంటే పరమాత్మ అనే చెప్పుకోవాలి. అంటూ ఎనిమిదవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

9. కార్యాఖ్యానాధికరణము

ఒకసారి ఇంద్రియాలన్నీ తమలో ఎవరు గొప్ప అనే విషయం మీద ఒకరితో ఒకరు గొడవపడి బ్రహ్మవద్దకు పోయినాయి అంటూ బృహదారణ్యకోపనిషత్తులో ప్రాణవిజ్ఞానము చెప్పబడింది. అందులో చివరకు ఇంద్రియాలన్నీ ప్రాణమే శ్రేష్ఠము అని ఒప్పుకున్నాయి.

ఈ రకంగా ఇంద్రియాలన్నీ ప్రాణం లేకపోతే తమ ఉనికి లేదని ఒప్పుకున్నాయి. అందుకే వాక్కు, చక్షువు, శ్రోత్రము, మనస్సు అనే పేర్లతోగాక అవన్నీ ప్రాణ సంకేతముతో పిలువబడతాయి.

అప్పుడు ప్రాణము మిగిలిన ఇంద్రియాలతో 'మీ మాట ప్రకారము నేను ఇక్కడే ఉంటాను. మరి నాకు అన్నము ఏది ? అని అడిగింది. కుక్కలు పిల్లులు పక్షులు మొదలైన జంతువుల ఆహారమే నీకు ఆహారము అన్నాయి. ఇంద్రియాలు అంటే విరాట్ ప్రాణానికి విరాట్ అన్నమే ఆహారము.

ఇప్పుడు ప్రాణం మళ్ళీ అడిగింది. 'మరి నాకు ఆచ్ఛాదనకు వస్త్రం ఏది?' దానికి ఇంద్రియాలు 'జలమే నీకు ఆచ్ఛాదన' అన్నాయి. అంటే భోజనానికి ముందు, తరువాత చేసే ఆపోసనా, ఉత్తరాపోసనలే ప్రాణానికి వస్త్రం. ఇదే విషయం ఛాందోగ్యంలోకూడా చెప్పబడింది.

ఇక్కడ ఆచమనము, జలాన్ని వస్త్రంగా భావించటము ఈ రెంటిలోను ఏది విధేయము అంటే శాసింపదగినదిగా చెప్పబడ్డది. అంటూ అడిగాడు నారాయణభట్టు. వివరించటం మొదలుపెట్టాడు రత్నాకరుడు.

సూ. 18 కార్యాఖ్యానాద పూర్వమ్

కార్యాఖ్యానాత్, అపూర్వమ్

అన్ని అనుష్ఠానాల శుద్ధికోసం ఆచమనాన్ని నిత్యకృత్యంగా వేదంలోను, పురాణాలలోను కూడా చెప్పబడింది. అందుకే ఉదకాన్ని వస్త్రంగా భావించటం విధేయం. అంతే తప్ప ఆచమనం కాదు.

అన్నాన్ని ఉదకంతో కప్పటమనేది అపూర్వమనేది అపూర్వమైన విషయం. కాబట్టి అపూర్వమైన వస్త్రంగా భావించదలచారు. అన్నాన్ని నగ్నంగా లేకుండా చేయటం అంటే కప్పటము అనే అపూర్వమైన ధ్యానమే విధేయము అంటూ తొమ్మిదవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

10. సమానాధికరణము

'గురువర్యా! వాజసనేయశాఖలోని శతపద బ్రాహ్మణంలో శాండిల్యవిద్య చెప్పారు. అలాగే బృహదారణ్యకంలో కూడా శాండిల్యవిద్య చెప్పారు. ఈరెండూ ఒకటేనా? వేరు వేరా ? వివరించండి' అన్నాడు కృష్ణశర్మ వివరిస్తున్నాడు రత్నాకరుడు.

సూ. 19 సమాన ఏవం చాభేదాత్

సమానే, ఏవం, చ, అభేదాత్

రెండు చోట్లాకూడా ఈ విద్య ఒకటే. ఉపాస్య వస్తువు ఒకటే. కాబట్టి విద్యాభేదం లేదు. శతపథ బ్రాహ్మణంలో అనేకగుణాలు చెప్పబడ్డాయి. కాబట్టి అది ఉత్పత్తి విధి. బృహదారణ్యకంలోది గుణవిధి. శతపద బ్రాహ్మణంలోని విద్య విధివిహితము. ఉపనిషత్తులోది అనువాదము. కాబట్టి రెండు విద్యలూ సమానమైనవే అంటూ పదవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

11. సంబంధాధికరణము

గురువర్యా! బృహదారణ్యకంలో సత్యబ్రహ్మోపాసన గురించి చెప్పారు. పరబ్రహ్మ పేరే సత్యం. సత్యం అనే మాటలో మూడు అక్షరాలున్నాయి. 1. స 2. త్, 3. యం. ఇందులో మొదటి అక్షరం సత్యం. చివరి అక్షరం సత్యం. మధ్యలో అక్షరమే అసత్యం. మృత్యువు. ఈ మూడింటిలోనూ రెండు సత్యం. ఒకటి అసత్యం సత్యం బరువు ఎక్కువయి అసత్యం తేలిపోతుంది. ఈ విధంగా సత్యబ్రహ్మోపాసన చేసిన వారిని అసత్యం అనే మృత్యువు అంటదు.

సత్యమనేదే ఆదిత్యుడు. ఆదిత్యమండలంలోని పురుషుడే దక్షిణనేత్రంలో ఉన్నాడు. వీరిద్దరూ ఒకటే తన కిరణాల ద్వారా కాంతినిస్తున్న ఆదిత్యుడు కళ్ళలోనే ఉన్నాడు. అలాగే కళ్ళలోని పురుషుడు ప్రాణాలద్వారా ఉపకారం చేస్తూ, ఆదిత్య పురుషునిలో లీనమై ఉన్నాడు.

మరణకాలంలో ఆదిత్యుడు తన కిరణాలను ఉపసంహరించుకోవటం వల్ల కళ్ళు తమశక్తిని కోల్పోతాయి. ఆదిత్యమండలంలోని పురుషునికి వ్యాహృతులు.

భూః అనేది	–	శిరస్సు
భువః అనేది	–	భుజాలు
సువః అనేది	–	పాదాలు

సత్యబ్రహ్మకు అహః అనేది రహస్యనామం. అహిర్నామమైన బ్రహ్మన్ని ఈ విధంగా వ్యాహృతుల రూపంలో తెలుసుకుని ఉపాసన చేసేవాడు పాపాలను వదలివేస్తాడు ఇక్కడ ఆధ్యాత్మానికి రెండు రహస్యమైన పేర్లు చెప్పబడ్డాయి. అధిదైవతంలో అహః అనే పేరు, ఆధ్యాత్మంలో అహం అనే పేరు అహః అనేది ఆదిత్యునికి అహం అనేది అక్షిపురుషునికి పేరు.

ఇప్పుడు సత్యవిద్యలో నామవ్యవస్థను బట్టి ధ్యానం చెయ్యాలా? ఈ రెండు పేర్లను ఆదిత్య అక్షిపురుషులిద్దరికీ అన్వయించవచ్చునా? అంటూ సందేహాన్ని వెలిబుచ్చాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 20 సంబంధా దేవమన్యత్రాపి

సంబంధాత్, ఏవం, అన్యత్ర, అపి

ఇందాక చెప్పిన శాండిల్యవిద్యలో చెప్పినట్లుగానే సత్యవిద్యలోకూడా ఇరువురు పురుషులలోను ఈ రెండు పేర్లను ఉపసంహారం చెయ్యవచ్చు అని వారి వాదన.

శతపద బ్రాహ్మణము, శాండిల్యవిద్య రెండూ ఒకశాఖకు చెందినవే. ఒకే రకమైన ఉపాసనకు సంబంధించినవి. అందుకనే ఈ రెండు విద్యలకు గుణోసంహారం చెప్పబడ్డది. అలాగే సత్యవిద్యలో చెప్పబడిన ఇరువురు పురుషులయందు రెండు పేర్లను (అహః, అహం) ఉపసంహారం చేయవచ్చు అని వారి వాదన.

సూ. 21 నవా విశేషాత్

న, వా, విశేషాత్

ఇక్కడ రెండు ఉపనిషత్తులు - విద్యలకు - రెండు స్థలాల్లో ప్రాప్తి లేదు.

ఆదిత్య మండలంలోని పురుషునికి అహం అని పేరు అని బృహదారణ్యకంలోని మూడవ అధ్యాయంలో చెప్పారు. అలాగే కంటిలోని పురుషునికి అహం అనే పేరు చెప్పారు. ఇలా స్థానభేదాన్ని బట్టి నామభేదాలు చెప్పబడ్డాయి. కాబట్టి ఇరువురు పురుషుల్లోనూ, వారి పేర్లలోనూ ఉపసంహారం లేదు.

సూ. 22 దర్శయతి చ

ఈ విధమైన కట్టుబాటు ఉన్నది. ఛాందోగ్యంలో ఆదిత్యాంతర్గ పురుషుని రూపం వంటిదే ఈ కంటిలోని పురుషునిది కూడా ఆ పురుషుని అవయవాలే ఈ పురుషుని అవయవాలు. అతని పేరే ఇతని పేరు, అంటూ ఆదిత్య పురుషుని లక్షణాలను అక్షి పురుషునిలో ఆరోపించి చెప్పారు. ఈ విధమైన ఆరోపణ లేనిదే పరస్పర గుణోపసంహారం కుదరదు. కాబట్టి ఇక్కడ ఇద్దరు పురుషులకు, రెండు పేర్లకు ఉపసంహారం లేదు అంటూ పదకొండవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

12. సంభృత్యధికరణము

"పంచభూతాలు బ్రహ్మయొక్క శక్తిరూపాలు. వీటికి కారణం బ్రహ్మ. బ్రహ్మే వీటిని సృష్టించింది. కాబట్టే బ్రహ్మము మిక్కిలి శ్రేష్ఠమైనది. బ్రహ్మను ఎవరూ అతిక్రమించలేరు.

అనిరాణయనీయశాఖ, ఛాందోగ్యశాఖ లోని ఖిలకాండలో ఒకచోట బ్రహ్మముయొక్క వీర్యసమృద్ధి, స్వర్గవ్యాప్తి చెప్పబడ్డది. ఈ గుణాలన్నీ ఈ శాఖకు చెందిన ఉపనిషత్తులందే చెప్పబడిన శాండిల్య విద్య మొదలైన వాటిలోకి అన్వయిస్తాయా? ఉపనిషత్తులలో చెప్పబడిన విద్యలు, ఇవి ఒకటేనా? తేడాలేమైనా ఉన్నాయా? వివరించండి" అంటూ అడిగాడు నారాయణభట్టు. వివరించటం ప్రారంభించాడు రత్నాకరుడు.

సూ. 23 సంభృతి ద్యువ్యాప్త్యపి చాతః

సంభృతి, ద్యువ్యాప్తి, అపి, చ, అతః

స్థానభేదంవల్ల నామభేదం వచ్చినట్లుగా, స్థానభేదంవల్లనే సంభృత్యాదులు శాండిల్య విద్యయందు ఉపసంహరింపబడవు.

ఛాందోగ్యంలో నా ఆత్మ హృదయంలో ఉన్నది అన్నారు.

ఇంకొకచోట ఆత్మ అనేది దహరాకాశంలో ఉన్నది అన్నారు. ఉపకోశల విద్యలో కంటియందు కనిపించే పురుషుడు అన్నారు. ఈ రకంగా వేరువేరు స్థానాలు చెప్పబడ్డా, వీటిలో ఎక్కడా సంభృత్యాది గుణాలు చెప్పబడలేదు. కాబట్టి ఈ గుణాలకు పై విద్యల్లో ఉపసంహారం లేదు. రాణీయశాఖలోని బ్రహ్మగుణాలు ప్రత్యక్షోపాసనకు సంబంధించినవి అంటూ పన్నెండవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

13. పురుషవిద్యాధికరణము

"గురువుగారూ ! 'పురుష యజ్ఞము' అంటున్నారు దీనిమీద భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఛాందోగ్యంలోను, తాండినాయన, పైంగి, రహస్య బ్రాహ్మణాల్లో పురుషయజ్ఞం గురించి చెప్పారు. అంటే ఇక్కడ పురుషుడికి యజ్ఞరూపం కల్పించారు. ఛాందోగ్యంలో దాన్నిగురించి చెబుతూ, 'పురుషుడే యజ్ఞం' అతని ఆయుర్దాయంలో

మొదటి 24 సంవత్సరాలు - పాతత్సవనం

తరువాత 44 సంవత్సరాలు - మధ్యాహ్న సవనం

చివరి 48 సంవత్సరాలు - తృతీయ సవనం

సవనము అంటే - యజ్ఞంలో ఇచ్చే బలి. ఈ విద్యను ఎవరైతే తెలుసుకుంటారో? వారు 116 సంవత్సరాలు జీవిస్తారు అతనికి ఆకలి దప్పిక లేకపోవటము, ఇష్టమైన వస్తువులను తీసుకోకపోవటమే దీక్ష అంటూ పురుష యజ్ఞాన్ని వివరించారు.

తైత్తిరీయంలో 'యజమానియే యజ్ఞం. భార్యశ్రద్ధ శరీరం ఇధ్మం. రొమ్ము యజ్ఞవేదిక' అని చెప్పారు. కాబట్టి ఈ రెండు చోట్ల చెప్పిన గుణాలు ఉపసంహరించవచ్చునా?

అంటే, రెండూ పురుష విద్యలే. పేరు ఒకటే. ఛాందోగ్యంలో పురుషుడే యజ్ఞంగా కల్పించబడ్డాడు. తైత్తిరీయంలో 'విద్వాంసుడనే యజ్ఞానికి' అంటున్నారు మరి ఈ రెండు వేరు వేరనుట సమంజసం కాదు. వీటికి సమాన ధర్మాలు కూడా ఉన్నాయి. కాబట్టి, ఛాందోగ్యంలోని గుణాలు తైత్తిరీయంలోకి తెచ్చుకోవచ్చా? అంటూ అనుమానం వ్యక్తం చేశాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 24 పురుష విద్యాయామివచేతరేషా మనామ్నానాత్

పురుషవిద్యాయామివ, చ, ఇతరేషామ్, అనామ్నానాత్

తాండి మొదలైన వాటిలో చెప్పిన పురుష యజ్ఞము తైత్తిరీయంలో చెప్పబడలేదు. కాబట్టి దానిలోని ధర్మాలను దీనిలో అన్వయించరాదు.

ఈ రెండింటిలోనూ 'మరణమే అవబృధము' లాంటి పోలికలు కొన్ని ఉన్నప్పటికీ, తేడాలే ఎక్కువ ఉన్నాయి. తాండిశాఖలో పురుషుడే యజ్ఞం. కాని తైత్తిరీయంలో పురుషుడు చేసే యజ్ఞంలో ఆత్మాదులందు యజమాని మొదలైనవి కల్పన చెయ్యబడ్డాయి. కాబట్టి ఈ రెండూ ఒకటి కాదు. వేరువేరు అంటూ పదమూడవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

14. వేధాద్యధికరణము

"గురుదేవా ! ఉపనిషత్తును ప్రారంభించేటప్పుడు అధర్వశాఖవారు "ఓ దేవతా! నా శత్రువు యొక్క సమస్త అవయవాలను ఛేదించు, హృదయాన్ని ఛేదించు" అంటూ శత్రుసంహారమంత్రాలు చదువుతారు. మిగిలిన ఏ శాఖలోనైనా భగవంతుణ్ణి స్తుతిచేస్తూ, మనకు వరుణుడు, మిత్రుడు శుభాలిచ్చుగాక వంటి మంత్రాలు చదువుతారు. మరి వీటన్నింటినీ విద్యలో ఉపసంహరించుకోవచ్చునా? అంటూ సందేహం వెలిబుచ్చాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 25 వేధాద్యర్థ భేదాత్

వేధాది, అర్థభేదాత్

హృదయాన్ని భేదించు మొదలైనవి అభిచారిక మంత్రాలు. వీటి అర్థంలో తేడా ఉన్నది. కాబట్టి విద్యలోను, ఉపాసనలోను వీటికి ఉపసంహారం లేదు. అంటూ పధ్నాల్గవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

15. హాన్యధికరణము

"గురుదేవా ! జ్ఞాని మరణించేటప్పుడు అతని పాపపుణ్యాలు ఏమవుతాయి?

ఛాందోగ్యంలో గుర్రము శరీరాన్ని విదిల్చి దుమ్మును పోగొట్టుకున్నట్టుగా జ్ఞాని పాపపుణ్యాలు వదలి పరమాత్మలో లీనమవుతాడు అని చెప్పబడింది.

ముండకోపనిషత్తులో నదులన్నీ ప్రవహించి సముద్రంలో కలిసేటప్పుడు తమ నామరూపాలను వదలినట్లుగా జ్ఞాని పాపపుణ్యాలను వదలి పరమాత్మలో లీనమవుతాడు అన్నారు.

కఠశాఖవారు చనిపోయిన వ్యక్తి యొక్క పుత్రులు, శిష్యులు ధనాన్ని పొందుతారు. స్నేహితులు పుణ్యకర్మలను, ద్వేషించేవారు పాపకర్మలు పొందుతారు అంటారు.

కిశీతకీ ఉపనిషత్తులో అంత్యకాలంలో జ్ఞానితన సుకృత దుష్కృతాలు వదలివేస్తాడు. అతని పుణ్యాన్ని బంధువులు, పాపాన్ని ద్వేషించే శత్రువులు పొందుతారు అని చెప్పారు.

అయితే ఇక్కడ చెప్పినట్లుగా విద్వాంసుడు వదలిపెట్టిన పాపపుణ్యాలను జ్ఞాతులు మొదలైనవారు గ్రహిస్తారా? అంటూ అనుమానం వ్యక్తం చేశాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 26 హానౌ తూపాయన శబ్ద శేషత్వాత్కుశాఛంద స్తుత్యుపగానవత్తదుక్తమ్

హానౌ, తు, ఉపాయనశబ్దశేషత్వాత్, కుశాచ్ఛంద స్తుత్యుపగానవత్, తత్, ఉక్తమ్

జ్ఞానియైనవాడు ఉత్క్రమణకాలంలో పాపపుణ్యాలను వదలిపెడతాడు. వాటిని జ్ఞాతులు గ్రహిస్తారు. అంటూ పదిహేనవ ప్రకరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

16. సాంపరాయాధికరణము

"జ్ఞాని పాపపుణ్యాలు వదిలిపెడతాడు అని చెప్పారు కదా! అది ఎప్పుడు జరుగుతుంది? మరణించకముందా ? మరణించిన తరువాతనా? వివరించండి" అన్నాడు నారాయణభట్టు. వివరించటం మొదలుపెట్టాడు రత్నాకరుడు.

సూ. 27 సాంపరాయే తర్తవ్యాభావాత్తథా హ్యన్యే

సాంపరాయే, తర్తవ్యాభావాత్, తథా, హి, అన్యే

దేహాన్ని వదిలే సమయంలోనే జ్ఞానంవల్ల యోగి సుకృత దుష్కృతాలను వదలివేస్తాడు.

విద్వాంసుడు మరణసమయంలో అంటే ప్రాణాలు శరీరం నుంచి బయటకు పోయేటప్పుడే, శరీరంతోపాటుగా పాపపుణ్యాలను కూడా వదిలేస్తాడు. అంతేకాని అతని మరణానంతరము అవి కొంతదూరము అతన్ని వెంబడించవు. ఛాందోగ్యంలో చెప్పినట్లుగా గుర్రం తన శరీరాన్ని విదిలించి మట్టిని వదలివేసినట్లుగా జ్ఞాని పాపపుణ్యాలను వదలివేస్తాడు. మరణానంతరము అతని ధనాన్ని అతని పుత్రులు, శిష్యులు పొందుతారు. పుణ్యకర్మల్ని స్నేహితులు, పాపకర్మల్ని విరోధులు పొందుతారు. అని చెప్పబడింది. కాబట్టి యోగి మరణసమయంలోనే పాపపుణ్యాలను వదలివేస్తాడు.

సూ. 28 ఛందత ఉభయావిరోధాత్

ఛందతః, ఉభయావిరోధాత్

జీవించి ఉండగానే యమ నియమాలతో కాలం వెళ్ళబుచ్చుతున్నాడు కాబట్టి, అతని కర్మక్షయం అయిపోవచ్చు.

అంటే నియమనిష్ఠలతో జీవితం సాగిస్తాడు కాబట్టి అతడు జీవించి ఉండగానే కర్మక్షయం కావచ్చు. బ్రహ్మప్రాప్తి మాత్రం దేహాన్ని వదలిన తరువాతనే జరుగుతుంది. జ్ఞాని ఉత్క్రమణ సమయంలోనే పాపపుణ్యాలను త్యజిస్తాడు అంటూ పదహారవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

17. గతేరర్థవత్త్వాధికరణము

“గురువర్యా! పాపపుణ్యాలను వదలిపెట్టే సందర్భంలో కొన్నిచోట్ల దేవయానము చెప్పారు. కొన్నిచోట్ల ఏమీ చెప్పలేదు. పాపపుణ్యాలను వదలిపెట్టిన తరువాత జ్ఞానులందరూ దేవయానం ద్వారానే వెడతారా?” అంటూ అడిగాడు కృష్ణశర్మ. సమాధానం చెప్పటానికి సిద్ధమవుతున్నాడు రత్నాకరుడు.

సూ. 29 గతేరర్థవత్త్వ ముభయథాన్యథాహి విరోధః

గతేః అర్థవత్త్వమ్, ఉభయథా, అన్యథా, హి, విరోధః

ఉపాసనా పద్ధతి, నిర్గుణ విద్యాపద్ధతి. అని రెండు పద్ధతులున్నాయి. వీటిలో ఉపాసనా పద్ధతిలో మాత్రమే దేవయానమున్నది. నిర్గుణోపాసన సందర్భంలో దేవయానం లేదు. అజ్ఞానం వదలిపోగానే విద్వాంసుడు పాపపుణ్యాలను వదలి నిర్మలుడై పరబ్రహ్మను చేరతాడు. అని ముండకోపనిషత్తు చెబుతున్నది.

సూ. 30 ఉపపన్న స్తల్లక్షణార్థోపలబ్ధేర్లోకవత్

ఉపపన్నః, తల్లక్షణార్థోపలబ్ధేః, లోకవత్

సగుణోపాసకుడికి సగుణ బ్రహ్మప్రాప్తి. నిర్గుణ బ్రహ్మోపాసకుడికి నిర్గుణ బ్రహ్మప్రాప్తి. ఏదైనా ఊరికి పోవాలి అంటే ఏదో ఒక మార్గం కావాలి. అలాగే సగుణబ్రహ్మను పొందటానికి దేవయానం అవసరం. ఈ మార్గం ద్వారా వెళ్ళిన వారికి ఉత్తమలోకాలు ప్రాప్తిస్తాయి. సకల భోగాలు దక్కుతాయి.

నిర్గుణోపాసకుడు నిర్గుణ స్వరూపం పొందటానికి మార్గం అంటూ ఏదీ అవసరం లేదు. కాబట్టి నిర్గుణోపాసకుడికి ఏ మార్గము అవసరం లేదు. నిర్గుణవిద్యలో దేవయాన ప్రసక్తే లేదు అంటూ పదిహేడవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

18. అనియమాధికరణము

“గురువుగారూ ! సగుణోపాసనలో దేవయానము తప్ప, నిర్గుణోపాసనలో దీని ప్రసక్తి లేదు అన్నారు. కాని సగుణోపాసనలో కూడా దేవయానము కొన్నిచోట్ల చెప్పబడ్డది. మరికొన్ని చోట్ల చెప్పబడలేదు. ఉదాహరణకు పంచాగ్నివిద్య, ఉపకోశల విద్యలలో దేవయానం చెప్పబడ్డది. మధువిద్య, శాండిల్యవిద్య, వైశ్వానరవిద్యలలో ఇది చెప్పబడలేదు. మరి ఈ విద్యలయందు కూడా దేవయానము అన్వయించవచ్చునా?” అన్నాడు కృష్ణశర్మ వివరించటం ప్రారంభించాడు రత్నాకరుడు.

సూ. 31 అనియమః స్సర్వాసా మవిరోధః శబ్దానుమానాభ్యామ్

అనియమః, సర్వాసామ్, అవిరోధః, శబ్దానుమానాభ్యామ్

సగుణోపాసనలన్నింటిలోనూ దేవయానాన్ని చెప్పటంలో తప్పులేదు.

ఛాందోగ్యంలో ఈ విధంగా పంచాగ్నివిద్యను తెలుసుకున్నవారు, శ్రద్ధ, తపస్సు మొదలైన ధర్మాలతో ఉపాసన చేసినవారు అర్చిరాదిమార్గాన్ని పొందుతారు. అంటే నిర్గుణ బ్రహ్మోపాసన చేసినవారు అర్చిరాది మార్గాలద్వారా బ్రహ్మలోకం చేరతారు.

ఉపాసనాపరులకోసం దేవయానము, కర్మాధికారులకు పితృయానము చెప్పబడ్డాయి. ఈ రకంగా సగుణోపాసకులందరిదీ దేవయానమే. అంటూ పద్దెనిమిదో అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

19. యావదధికారాధికరణము

"గురువుగారూ ! జ్ఞాని ఈ దేహాన్ని వదలిన తరువాత అతడికి ఇంకొక శరీరముంటుందా ? ముక్తి అనేది నియమమా? అనివార్యమా? లేక పాక్షికమా? బ్రహ్మవేత్తలు కూడా మళ్ళీ జన్మించినట్లుగా పురాణాలలో చెప్పబడ్డది.

వేదాచార్యుడైన అపాంతరతముడే మళ్ళీ కృష్ణద్వైపాయనుడుగా పుట్టాడు. సనత్కుమారుడే ఈశ్వరాజ్ఞతో కుమారస్వామిగా పుట్టాడు. అంతేకాదు నారదుడు వసిష్ఠుడు కూడా మళ్ళీ జన్మించారు. అని చెప్పబడుతోంది. కాబట్టి ఈ దేహం విడిచిన తరువాత జ్ఞానికి ముక్తి లభిస్తుందనే నియమం ఏదీలేదనిపిస్తోంది గదా! అన్నాడు నారాయణభట్టు సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 32 యావదధికార మవస్థితి రాధికారికాణామ్

యావదధికారమ్, అవస్థితిః, అధికారికాణామ్

అపాంతరతముడు మొదలైన వారు లోకం కోసం ఈశ్వరునిచే అధికారంలో నియమించబడ్డారు. వీరు ఆ అధికార సంపాదకమైన కర్మక్షయం అయ్యేదాకా అలానే ఉంటారు.

ఈ మహానుభావులు మళ్ళీ శరీరాలు ధరించటానికి ఏ కర్మలు చేశారో, అవి క్షయం అయ్యేవరకు ఆ అధికారంలోనే ఉంటారు. శరీరధారణ చేస్తారు. వీరికి దేహసంబంధమైన లింగశరీరం నుండి విముక్తి కలగటమే తడవుగా మోక్షం లభిస్తుంది. అంటూ పందొనిమిదవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

20. అక్షరధ్యధికరణము

"గురువర్యా ! బ్రహ్మాన్ని గురించి చెప్పేటప్పుడు అవ్యయుడు లేనివాడు, అనే నిషేధ వాక్యాలతో చెప్పారు. ఉదా॥ ఆకారం లేనివాడు, గుణం లేనివాడు, ఇంద్రియాలచేత గ్రహించబడనివాడు. ఈ రకంగా కొన్నిచోట్ల చెప్పారు. కొన్నిచోట్ల చెప్పలేదు. ఈ రకంగా చెప్పనిచోట, చెప్పినచోటి నుంచి అన్వయించవచ్చునా? అంటూ ప్రశ్నించాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 33 అక్షరధియాం త్వవరోధః సామాన్య తద్భావాభ్యా మౌపసదవత్తదుక్తమ్

అక్షరధియాం, తు, అవరోధః, సామాన్య తద్భావాభ్యామ్, ఔపసదవత్, తత్, ఉక్తమ్

సామాన్యమైనందువల్ల, వస్తుభేదం లేనందువల్ల బ్రహ్మకు సంబంధించిన నిషేదార్థక భావాలు ఉపసంహరించాలి.

ఈ నిషేధవాక్యాల ద్వారా చెప్పదలచినది ఒక్కటే. అది బ్రహ్మమనేది ఒక్కటే. ఈ విధంగా బ్రహ్మకు సంబంధించిన నిషేధ వాక్యాలకు ఉపసంహారమున్నది అంటూ ఇరవైయ్యో అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

21. ఇయదధికరణము

"గురువుగారూ ! ముండకోపనిషత్తులో 'ద్వాసుపర్ణా' అనే మంత్రంలో అందమైన రెక్కలు గలవి, ఒకే రూపము ఆకారము గల రెండు పక్షులు చెట్టుమీద కూర్చుని ఉన్నాయి వాటిలో ఒకటి కర్మఫలాన్ని అనుభవిస్తోంది. రెండవది చూస్తూ కూర్చుంది. అని చెప్పబడింది.

కఠోపనిషత్తులోని 'ఋతం పి బన్తౌ' అనే మంత్రంలో శరీరంలోని బుద్ధి అనే గుహలో గొప్పదైన బ్రహ్మస్థానంలో ప్రవేశించి తమ కర్మఫలాన్ని అనుభవించేటటువంటి ఎండ, నీడలాగ పరస్పరం విలక్షణమైన తత్త్వాలున్నాయని విద్వాంసులంటారు. ఈ విషయాన్ని మూడుసార్లు అగ్నిచయనము, పంచాగ్ని ఉపాసన చేసినవారుకూడా చెబుతున్నారు.

ఈ రెండు చోట్ల చెప్పినవి భిన్నవిద్యలా? ఒకటేనా? అంటూ అడిగాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు కృష్ణశర్మ.

సూ. 34 ఇయదా మననాత్

ఇయత్, అమననాత్

ఈ రెండింటియందలి విద్య ఒకటే. తెలుసుకోవలసిన రూపాన్ని రెండుచోట్ల ఒకటిగానే చెప్పారు. రెండు మంత్రాల్లోనూ జీవుణ్ణి చెప్పి, అతనికి పరమాత్మతో అభేదం చెప్పారు. కాబట్టి విద్యలయందు ఐక్యము ఉన్నది. తెలుసుకోదగిన వాటిలో కూడా ఏకత్వమున్నది కాబట్టి రెండింటిలోనూ చెప్పదలచిన విద్య ఒకటే. అంటూ ఇరవై ఒకటవ అధ్యాయం పూర్తి చేశాడు రత్నాకరుడు.

22. అంతరత్వాధికరణము

"గురువుగారూ! బృహదారణ్యకంలో యాజ్ఞవల్క్యుణ్ణి ఉషస్తి, కహోలుడు ఇద్దరూ కూడా సర్వాంతర్యామి అయిన బ్రహ్మానుగూర్చి వివరించమని అడిగారు. అయితే

యాజ్ఞవల్క్యుడు ఉషస్తికి 'కార్యకారణ రహితుడు ఆత్మ' అని చెప్పాడు. కహోలుడికి 'ఆకలి దప్పికలు లేనివాడు ఆత్మ' అని చెప్పాడు. ఇలా భిన్నంగా చెప్పబడిన ఇద్దరూ ఒకటేనా? లేక వేరువేరా?" అంటూ అడిగాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 35 అంతరా భూతగ్రామవత్స్వాత్మనః

అంతరా, భూతగ్రామవత్, స్వాత్మనః

రెండుచోట్లా సర్వాంతరత్వాన్ని చెప్పారు. కాబట్టి రెండూ ఒకటే విద్య. శ్వేతాశ్వరోపనిషత్తులో చెప్పినట్లుగా సమస్త భూతములందు సర్వాంతరుడైన ఆత్మ ఒక్కడే.

సూ. 36 అన్యథా భేదానుపపత్తిరితిచేన్నోపదేశాంతరవత్

అన్యథా, భేదానుపపత్తిః, ఇతి, చేత్, న, ఉపదేశాంతరవత్

విద్యాభేదం అంగీకరించకపోతే శ్రుతిభేదం ఉపసన్నం కాదు. అని చెప్పటం సమంజసం కాదు.

ఛాందోగ్యంలో తత్త్వమసి అన్న దానిని తొమ్మిదిసార్లు చెప్పినప్పటికీ విద్యాభేదం కలగలేదు. అలాగే ఇక్కడ కూడా.

విద్యలో భేదం లేకపోతే ఒకే మాట లేదా విషయం రెండుసార్లు చెప్పబడవు. అని వారి వాదన. ఇది సరికాదు. 'తత్త్వమసి' అనే మాటను రెండుసార్లు కాదు తొమ్మిదిసార్లు చెప్పారు. అందువల్ల విద్యలో భేదం రాలేదు. పునరుక్తి దోషమూ కలగలేదు.

కాబట్టి ఉషస్తి కహోళ బ్రాహ్మణాలలో చెప్పిన విద్య ఒకటే అంటూ ఇరవైరెండవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

23. వ్యతిహారాధికరణము

"గురువుగారూ ! దేహేంద్రియాలలో సాక్షిగా ఉన్న పురుషుడే ఆదిత్య మండలంలోని పరమాత్మ. అలాగే ఆదిత్యమండలంలోని పరమాత్మయే మన దేహంలో ఉన్నవాడు అని ఐతరేయోపనిషత్తు చెబుతోంది. జాబాలశ్రుతిలో ఓ దేవతా! నీవే నేను. నేనే నీవు. అని చెప్పబడింది. ఈ రకంగా జీవుడు, ఈశ్వరుడు ఒకరేనా? లేక వేరు వేరా? అని అడిగాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 37 వ్యతిహారో విశింషంతి హీతరవత్

వ్యతిహారః, విశింషంతి, హి, ఇతరవత్

సర్వాత్మత్వాది గుణాలలాగా పరస్పర వినిమయం ఉపాసన కోసం ఉభయరూప చింతనంగా చెప్పబడ్డది.

ఇతర విషయాలలాగానే ఇక్కడ కూడా జీవుడే బ్రహ్మ. బ్రహ్మే జీవుడు. ఉపాసకుడే సూర్యమండలంలోని పురుషుడు. ఆ పురుషుడే ఉపాసకుడు. ఈ రకంగా రెండు రూపాల్ని ఉపాసించాలి అంటూ ఇరవై మూడవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

24. సత్యాద్యధికరణము

గురువర్యా! బృహదారణ్యకంలో అహర్నామమైన బ్రహ్మన్ని ఈ విధంగా వ్యాహృతుల రూపంలో తెలుసుకుని ఉపాసన చేసేవాడు పాపాలను వదలివేస్తాడు ఆ సత్యమే ఆదిత్యుడు. ఆదిత్యమండలంలోని పురుషుడే దక్షిణనేత్రంలో ఉన్న పురుషుడు. అని చెప్పబడ్డది. మరి ఈ రెండు సత్యవిద్యలూ ఒకటేనా? వేరువేరా? అంటూ అడిగాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 38 సైవ హి సత్యాదయః

సాఏవ, హి, సత్యాదయః

బృహదారణ్యకంలో చెప్పిన సత్యవిద్యలు రెండూ ఒక్కటే, ఈ రెండింటిలోనూ ఉపాస్యుడు హిరణ్యగర్భుడే. అంటూ ఇరవై నాల్గవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

25. కామాద్యధికరణము

"గురుదేవా! ఈ శరీరాన్నే బ్రహ్మపురం అంటారు. రాజ్యానికి అధికారులు, సేవకులు ఉన్నట్లే శరీరానికి ఇంద్రియాలు మనస్సు ఉన్నాయి. హృదయస్థానంలో ఒక పద్మమున్నది. దాన్నే హృత్పద్మము అంటారు. దాని మధ్యభాగంలో సూక్ష్మమైన ఆకాశం ఉన్నది. అదే దహరాకాశము. అందులో బ్రహ్మ ఉంటాడు. అతడు ధర్మాధర్మరహితుడు, పాపరహితుడు జరామృత్యువులు లేనివాడు శోకరహితుడు కోరికలను వెంటనే పొందే శక్తికలవాడు అని ఛాందోగ్యంలో చెప్పబడింది.

బృహదారణ్యకంలో "ఆత్మ గొప్పది. పుట్టుక లేనిది అది ప్రాణమునందుంటుంది. ఇంద్రియాల్లో ఉంటుంది. విజ్ఞాన రూపమైనది. స్వయంజ్యోతి. దహరాకాశంలోనే ఈ పురుషుడు శయనిస్తాడు. అందరిని వశం చేసుకోగలుగుతాడు" అని చెప్పబడింది.

ఛాందోగ్యంలోని విద్య సగుణము అని, బృహదారణ్యకంలోని విద్య నిర్గుణము అని అంటారు. కాబట్టి ఈ రెండింటికీ భేదం ఉన్నదా? లేదా? వివరించండి అన్నాడు కృష్ణశర్మ వివరిస్తున్నాడు రత్నాకరుడు.

సూ. 39 కామా దీతరత్ర తత్ర చాయతనాదిభ్యః

కామాది, ఇతరత్ర, తత్ర, చ, ఆయతనాదిభ్యః

సత్యకామత్వం మొదలైన గుణాలు బృహదారణ్యకంలోకి, బృహదారణ్యకంలోని సర్వవశిత్వాది గుణాలు ఛాందోగ్యంలోకి ఉపసంహరించుకోవచ్చు. రెండింటియందు హృదయమే ఆయతనము. బ్రహ్మమే ఉపాస్యము కాబట్టి ఇక్కడ సగుణ నిర్గుణ భేదం ఉన్నప్పటికీ, విద్యాస్తుతి కోసం ఉపసంహారం చెయ్యవచ్చు అంటూ ఇరవై ఐదవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

26. ఆదరాధికరణము

"గురువర్యా! వైశ్వానరోపాసకుడు భోజన సమయంలో ముందుగా వడ్డించిన అన్నాన్ని హవనం చెయ్యాలి అంటే ప్రాణాహుతులివ్వాలి. మొదటి ఆహుతి ప్రాణాయస్వాహా అంటే ప్రాణం తృప్తి పడుతుంది. దీనివల్ల నేత్రము, ఆదిత్యుడు, ద్యులోకము, దేవతలు తృప్తి పొందుతారు. అందువల్ల భోక్త సంతానము, పశువులు, తేజస్సు, బ్రహ్మవర్చస్సు పొందుతాడు.

రెండవ ప్రాణాహుతి 'వ్యానాయస్వాహా' దీనివల్ల వ్యానవాయువు తృప్తి చెందుతుంది. అందువల్ల శ్రోత్రము, చంద్రుడు, దిక్కులు, దిక్కులకు అధిష్ఠాన దేవతలు తృప్తి పొందుతారు. అంటూ ప్రాణాహుతులవల్ల ఫలితం చెప్పబడింది. ఒకవేళ ఎప్పుడైనా భోజనం చెయ్యకపోతే అంటే భోజనలోపం కలిగినప్పుడు ప్రాణాగ్ని హోత్రానికి లోపం కలుగుతుందా?" అంటూ ప్రశ్నించాడు కృష్ణశర్మ సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 40 ఆదరా దలోపః

ఆదరాత్, అలోపః

భోజన లోపం కలిగినప్పటికీ అగ్నిహోత్ర లోపం ఉండదు. అతిథులకన్న ముందు భోజనం చెయ్యాలి అని జాబాల సృతి చెబుతున్నది. కాబట్టి ఒకవేళ భోజన లోపం కలిగినా ప్రాణాగ్ని హోత్రానికి లోపం కలగదు.

సూ. 41 ఉపస్థితే౽ తస్తద్వచనాత్

ఉపస్థితే, అతః, తద్వచనాత్

భోజనద్రవ్యం దగ్గరగా ఉన్నప్పుడు, ముందుగా లభించినట్టి పదార్థంతోనే ప్రాణాగ్ని హోత్రం చెయ్యాలి. భోజనం లేకపోతే ప్రాణాహుతులుండవు. అంటే భోజనం దొరకనప్పుడు ప్రాణాగ్ని హోత్రానికి లోపమే. అంటూ ఇరవై ఆరవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

27. తన్నిర్ధారణాధికరణము

ఓంకారాన్ని ఉద్గీథ దృష్టితో ఉపాసించాలి. ఈ విధంగా ఉద్గీథాన్ని ఆశ్రయించిన ఉపాసనలున్నాయి. అంటే అనేకమైన ఉపాసనలు కర్మలకు అంగాలుగా చెప్పబడ్డాయి. కాబట్టి ఈ ఉపాసనలు కర్మలతో నిత్యముగా సంబంధించునా? లేదా? వివరించండి అన్నాడు కృష్ణశర్మ. వివరిస్తున్నాడు రత్నాకరుడు.

సూ. 42 తన్నిర్ధారణానియమ స్తద్దృష్టేః పృథగ్ఘ్య ప్రతిబంధః ఫలమ్

తన్నిర్ధారణానియమః, తదృష్టేః, పృథక్, హి, అప్రతిబంధః, ఫలమ్

కర్మల ఫలసిద్ధికి, కర్మసంబంధం అనే ఫలం ఉపాసనలకు ప్రత్యేకంగా చెప్పబడింది. కాబట్టి కర్మాంగాలను ఆశ్రయించిన ఉపాసనలకు కర్మాంగత్వ నియమం లేదు.

కొన్ని ఉపాసనలు కర్మాంగాలను ఆశ్రయించి ఉన్నాయి. ఈ ఉపాసనలు కర్మాంగాలు కావు. ఉపాసనలకు, కర్మలకు నిత్యసంబంధం లేదు అని వేదం చెబుతోంది. కర్మలకు, ఉపాసనలకు ఫలము వేరుగా చెప్పబడింది. కర్మఫలం వేరు. ఉపాసన ఫలం వేరు కాబట్టి కర్మఫలం అనుభవించటానికి ఉపాసనలు ప్రతిబంధకాలు. అంటూ ఇరవై ఏడవ అధికరణం పూర్తి చేశాడు రత్నాకరుడు.

28. ప్రదానాధికరణము

"గురువుగారూ ! బృహదారణ్యకము, ఛాందోగ్యాలలో సంవర్గ విద్య చెప్పబడింది. సంవర్గము అంటే దేవతలను తనలో లీనం చేసుకోవటం.

బృహదారణ్యకంలో ఆధ్యాత్మలలో శరీరమందలి ఇంద్రియాలలో ప్రాణమే జ్యేష్ఠము శ్రేష్టము అని చెప్పబడింది. ఛాందోగ్యంలో ఆధిదైవతాల్లో వాయువే మిగిలిన దేవతలను తనలో లీనం చేసుకుంటుంది అని చెప్పబడింది.

ఆధ్యాత్మ సంబంధమైనది ప్రాణము. ఆధిదైవత సంబంధమైనది వాయువు. ఈ రెండూ ఒకటేనా? లేక వేరువేరా? వివరించండి" అన్నాడు నారాయణభట్టు వివరించటం ప్రారంభించాడు రత్నాకరుడు.

సూ. 43 ప్రదానవదేవ తదుక్తమ్
ప్రదానవత్, ఏవ, తత్, ఉక్తమ్.

ఇక్కడ వాయువు, ప్రాణాల్ని విడివిడిగా భావించాలి. వాయువు వేరు. ప్రాణము వేరని శ్రుతులు చెబుతున్నాయి. ఇంద్రుడు ఒకడే. అయినప్పటికీ రాజ, అధిరాజ, స్వరాజ గుణభేదాల చేత వేరవుతున్నాడు. అలాగే వాయుతత్త్వంలో భేదం లేకపోయినా ఆధ్యాత్మ, ఆధిదైవత స్థానాలనుబట్టి వాయువు, ప్రాణము అనే వాటి ఉపాసనలు వేరువేరుగా ఉన్నాయి అంటూ ఇరవై ఎనిమిదవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

29. లింగభూయస్త్వాధికరణము

"మనస్సుచేత చింతించబడిన దానిని మనశ్చితము అంటారు. శతపథ బ్రాహ్మణంలో మనస్సుచేత చింతించబడినట్టి, వాక్కుచేత సంపాదించబడినట్టి, ప్రాణము, చక్షువులు, శ్రోత్రము, మొదలైన వాటిచేత సంపాదించబడిన వాటివాటి వృత్తిరూపమైన ముప్పై ఆరువేల అగ్నుల్ని చూచింది అని చెప్పబడింది.

మామూలుగా మానవుడి ఆయుర్దాయం వంద సంవత్సరాలు. సంవత్సరానికి రోజులు 360. కాబట్టి మొత్తం 100 × 360 = 36,000 రోజులు. ఒక రోజులో పుట్టే ఆలోచనలన్నీ ఒక మనోవృత్తి అనుకుంటే, జీవితంలో మొత్తం 36,000 మనోవృత్తులు ఉంటాయి. వీటిని అగ్నిగా, సూర్యునిగా, ఆత్మస్వరూపాలుగా భావించి ధ్యానించవచ్చు. ఇవి మనశ్చితాలు.

ఈ విధంగా మనస్సు మొదలైన వాటిచేత చింతించబడినవిగా చెప్పబడినటువంటి అగ్నులు కర్మలకు సంబంధించినవా? లేక ఉపాసనా కోసం చెప్పబడినాయా? వివరించండి" అన్నాడు కృష్ణశర్మ. వివరించటం ప్రారంభించాడు రత్నాకరుడు.

సూ. 44 లింగభూయస్త్వాత్తద్ధి బలీయస్తదపి
లింగభూయస్త్వాత్, తత్, హి, బలీయః, తత్, అపి

ఈ అగ్నులు అన్నీకూడా స్వతంత్రములు.

ఈ భూతములు, ప్రాణులు మనస్సులో ఏమి సంకల్పించినా అవన్నీ ఈ అగ్నులు చేసే పనులే. ఉపాసకుడు నిద్రపోతున్నా మేల్కొని ఉన్నా, అతనికోసం ఈ సమస్త భూతాలు ఎల్లవేళలా, ఈ అగుల్ని సంపాదిస్తూనే ఉంటాయి. కాబట్టి ఈ అగ్నులన్నీ కూడా స్వతంత్రములు.

సూ. 45 పూర్వవికల్పః ప్రకరణాత్స్యాత్ క్రియా మానసవత్
పూర్వవికల్పః, ప్రకరణాత్, స్యాత్, క్రియా, మానసవత్

ఈ అగ్ని, క్రియలకు అంగభూతమైనదే. ఆ అగ్నికి వికల్పోపదేశం తప్ప స్వతంత్రం కాదు. మానస పాత్రలాగా ఇదికూడా కర్మకు అంగమే. అని వారి వాదన.

సూ. 46 అతిదేశాచ్చ
అతిదేశాత్, చ

ఒక ధర్మాన్ని ఇంకొక దానియందు ఆరోపించటాన్ని అతిదేశము అంటారు. ఈ అతిదేశం వల్లకూడా ఈ అగ్నులు క్రియాంగాలే. అని వారంటారు.

సూ. 47 విద్యైవతు నిర్ధారణాత్
విద్యా, ఏవ, తు, నిర్ధారణాత్

ఈ మనశ్చితాది అగ్నులు స్వతంత్రమైన విద్యాత్మకాలే. ఇవి కర్మాంగాలు కావు. శతపథ బ్రాహ్మణంలో 'అవి విద్యాభావంతోనే సంపాదించబడతాయి. ఈ విషయం తెలుసుకున్న ఉపాసకుడు వీటిని ఉపాసనతోనే సంపాదించగలుగుతున్నాడు' అని చెప్పబడింది.

సూ. 48 దర్శనాచ్చ
దర్శనాత్, చ

వెనుక చెప్పిన లింగములవల్ల కూడా ఇవి స్వతంత్రములు అని తెలుస్తోంది.

సూ. 49 శ్రుత్యాది బలీయస్త్వాచ్చ నబాధః
శ్రుత్యాది బలీయస్త్వాత్, చ, న, బాధః

శ్రుతి, లింగవాక్యాలూ ప్రకరణకన్న బలమైనవి. కాబట్టి ఈ అగ్నులు స్వతంత్రములు అనటానికి సంశయము లేదు.

'ఈ విషయం తెలుసుకున్న ఉపాసకుడు నిద్రిస్తున్నా, మేల్కొన్నా, అతని కోసం ఈ భూతాలన్నీ అగ్ని రచన చేస్తూనే ఉంటాయి.

ఇలాంటి శ్రుతివాక్యాలవల్ల ఈ అగ్నులు కర్మాంగాలు కావు.

సూ. 50 అనుబంధాదిభ్యః ప్రజ్ఞాంతర పృథక్త్వవద్, దృష్టశ్చ తదుక్తమ్
అనుబంధాదిభ్యః, ప్రజ్ఞాంతరపృథక్త్వ వత్, దృష్టః, చ, తత్, ఉక్తమ్

అనుబంధం మొదలైన వాని వల్లకూడా మనశ్చితాదులకు కర్మాంగత్వం లేదు. ఇవి స్వతంత్రాలు. 'అవేష్టి' అనే క్రతువుని రాజసూయం నుండి పైకి తీసినట్లుగా, మనశ్చితాదుల్ని కర్మప్రకరణం నుంచి విడదియ్యాలి అవి కర్మాంగాలు కావు.

సూ. 51 న సామాన్యాదప్యుపలబ్ధేర్మృత్యువన్న హిలోకాపత్తిః

న, సామాన్యా, దపి, ఉపలబ్ధేః, మృత్యువత్, నహిలోకాపత్తిః

మృత్యుశబ్దంలాగానే మనశ్చితాది అగ్నులకు మానసత్వసాదృశం ఉన్నప్పటికీ, అవి క్రియాంగాలు కావని శ్రుతులవల్ల తెలుస్తోంది.

సూ. 52 పరేణచ శబ్దస్య తాద్విధ్యం భూయస్త్వాత్త్వనుబంధః

పరేణ, చ, శబ్దస్య, త్వాద్విద్ధ్యమ్, భూయస్త్వాత్, తు, అనుబంధః

ఉత్తర బ్రాహ్మణాన్ని, పూర్వ బ్రాహ్మణాన్ని బట్టి మనశ్చిదాదులను చెప్పే ఈ బ్రాహ్మణం కూడా అటువంటిదే. కేవలం విద్యావిధిత్వం కలిగినటువంటిది. మానసికాగ్ని విద్యలో సంపాదింపదగిన కర్మాంగాలు అనేకం ఉన్నాయి. కాబట్టి ఈ మానసికాగ్ని స్వతంత్రమైన పురుషార్థ హేతువు అవి కర్మాంగాలు కావు. ఆ అగ్నులు ఉపాసనాత్మకాలు అంటూ ఇరవై తొమ్మిదవ ప్రకరణం పూర్తి చేశాడు రత్నాకరుడు.

30. శరీరవ్యతిరేకాధికరణము (ఐకాత్మ్యాధికరణము)

"గురుదేవా! దేహంకన్న వేరైనటువంటిది ఆత్మ అనేది ఒకటి ఉండాలి. ఆత్మగనక లేకపోతే బ్రహ్మలోకప్రాప్తి ఎవరికి జరుగుతుంది? అయితే ఆత్మదేహంకన్న భిన్నమైనదా? కాదా? ఆత్మ పురుషుడు ఎవరు?" అని అడిగాడు నారాయణభట్టు వివరిస్తున్నాడు రత్నాకరుడు.

సూ. 53 ఏక ఆత్మనః శరీరే భావాత్

ఏకే ఆత్మనః శరీరే భావాత్

శరీరమనేది ఉన్నప్పుడే ఆత్మయొక్క ధర్మాలకు అస్తిత్వం ఉన్నది. కాబట్టి దేహంకన్న వేరైనటువంటి ఆత్మ అనేది ఏదీ లేదు అంటారు చార్వాకులు. ప్రాణము, చైతన్యము మొదలైన ధర్మాలు శరీరం ఉన్నప్పుడే కనిపిస్తాయి. శరీరం లేకపోతే ఉండవు. కాబట్టి శరీరంకన్న వేరైన ఆత్మలేదని వారి వాదన.

సూ. 54 వ్యతిరేకస్తద్భావాభావిత్వాన్న తూపలబ్ధివత్

వ్యతిరేకః, తద్భావాభావిత్వాత్, న, తు, ఉపలబ్ధివత్

ఆత్మ అనేది దేహం కన్న వేరైనది. మృతునికి శరీరమున్నప్పటికీ చైతన్యము ఇత్యాదులుండవు. కాబట్టి శరీరానికే చైతన్యాది ధర్మాలుంటాయనటం సరికాదు.

సమాధి స్థితిలో శరీరముంటుంది. మూర్ఛవచ్చినప్పుడు శరీరముంటుంది. మరణం తరువాత శరీరముంటుంది. కాని దానిలో చైతన్యం కనుపించదు. కాబట్టి శరీరమే ఆత్మకాదు. ఆత్మ అనేది శరీరం కన్న వేరైనది. అంటూ ముప్పైయవ ప్రకరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

31. అంగావబద్ధాధికరణము

'ఓంకారాన్ని ఉద్గీథంగా ఉపాసించాలి. అని ఛాందోగ్యంలో చెప్పారు. ఇలా ప్రతి వేదంలోను, ప్రతిశాఖలోను చెప్పబడ్డాయి. కాబట్టి ప్రతిశాఖలోని ఉద్గీథాన్ని, ఉపాసనా విధుల్ని ఆ శాఖలో మాత్రమే గ్రహించాలా? లేక అన్ని శాఖలకు సంబంధించినవా?' అని ప్రశ్నించాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 55 అంగావబద్ధాస్తు న శాఖాసు హి ప్రతివేదమ్

అంగానబద్ధాః తు, న, శాఖాసు, హి, ప్రతివేదమ్

కర్మాంగాశ్రయాలైన ఈ ఉపాసన విద్యలు ఈ శాఖయందే అని లేదు. అవి ప్రతివేదంలోను, ప్రతి శాఖలోను చెప్పబడ్డాయి.

సూ. 56 మంత్రాదివద్వా విరోధః

మంత్రాదివత్, వా, అవిరోధః

ఒక శాఖ యందు చెప్పిన ఉద్గీథాదులను ఇతర శాఖలందు చెప్పినప్పటికీ ఇబ్బంది లేదు. కాబట్టి ఉద్గీథాదులు అన్ని శాఖలకు సంబంధించినవి అంటూ ముప్పై ఒకటవ ప్రకరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

32. భూమజ్యాయస్త్వాధికరణము

"గురువుగారూ ! ప్రాచీనశీలుడు మొదలైనవారు వైశ్వానరాత్మను గురించి తెలుసుకునేందుకు అశ్వపతి మహారాజు వద్దకు వెడతారు. రాజు ప్రాచీనశీలుణ్ణి "నువ్వు వైశ్వానరాత్మను ఏ విధంగా ఉపాసన చేస్తున్నావు?" అని అడుగుతాడు. దానికి ప్రాచీనశీలుడు "రాజా! నేను ద్యులోకాన్ని (స్వర్గం) వైశ్వానరాత్మగా భావిస్తున్నాను" అంటాడు దానికి అశ్వపతి మహారాజు "నువు ఉపాసించేది "సుతేజ" అనే పేరుతో ప్రసిద్ధి చెందిన

వైశ్వానరాత్మ ఈ ఉపాసనవల్లనే నీ కులంవారు తరతరాలుగా కర్మనిష్ఠా పరతంత్రులౌతారు. సుతేజమనే ఈ ఆత్మ వైశ్వానరాత్మలో నాల్గవ భాగం మాత్రమే. అది వైశ్వానరాత్మకు శిరోభాగం వంటిది. విశ్వరూపుడు అతనికి నేత్రం. వాయువే అతని ప్రాణం. ఆకాశం శరీరం, జలం పొత్తికడుపు. పృథివిపాదాలు" అంటే వారు చేసే ఉపాసన గురించి చెప్పాడు ఈ వ్యష్టి, సమిష్టి ఉపాసనలు రెండూ విధేయాలా? లేక సమస్తోపాసనమా? అంటూ అడిగాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 57 భూమ్నః క్రతువజ్జ్యాయస్త్వం తథాహి దర్శయతి

భూమ్నః, క్రతువత్, జ్యాయస్త్వమ్, తథా, హి, దర్శయతి

ఛాందోగ్యంలో నువు నా వద్దకు వచ్చి ఉండకపోతే నీ తల తెగిపోయి ఉండేది. పాదాలు శిథిలమై పోయేవి. అని చెప్పబడింది. వారు అతని వద్దకు వెళ్ళకుండా అంశోపాసన చేసినట్లైతే వారి శరీర భాగాలు శిథిలమైపోయి ఉండేవి. ఇలా చెప్పటంవల్ల వైశ్వానరాత్మ అంటే సమస్తాన్ని ఉపాసించటమే సమగ్రమైన సమస్తోపాసన అంటూ ముప్పైరెండవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

33. శబ్దాదిభేదాధికరణము

"గురుదేవా! ఛాందోగ్యంలోని శాండిల్యవిద్య, దహరవిద్య, మధువిద్య ఇవన్నీ ఒకటే. వానియందు వేద్యుడైన ఈశ్వరుడికి నానాత్వం లేదుకదా? అన్నాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 58 నానాశబ్దాది భేదాత్

ఇక్కడ వేద్యం అంటే తెలుసుకోదగినది ఒకటే. అయినప్పటికీ ఈ విద్యలలో గుణభేదం ఉన్నది. కాబట్టి శాండిల్యాది విద్యలన్నీ వేరువేరు. అంటూ ముప్పై మూడవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

34. వికల్పాధికరణము

అలా అయితే వీటన్నింటినీ అనుష్ఠించాలా? ఏదో ఒకటి అనుష్ఠిస్తే చాలా అన్నాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 59 వికల్పోఽ విశిష్ట ఫలత్వాత్

వికల్పః అవిశిష్టఫలత్వాత్

సగుణోపాసన చేసేటప్పుడు వేరు వేరు విద్యలనే ఉపాసించాలి. ఎందుకంటే అక్కడ వేద్యము అంటే తెలుసుకోదగినవస్తువు వేరు. సాక్షాత్కారమయ్యే దేవత వేరు. ఉపాసనా ఫలం వేరు.

శాండిల్యాది విద్యలు నిర్గుణోపాసన. ఇందులో సాక్షాత్కారమయ్యేది ఆత్మ. వేద్యము తనను గురించి తాను తెలుసుకోవటం. ఫలితము మోక్షము. ఐహిక బంధనాలు తెంచుకుని, జ్ఞానియై పరమాత్మలో లీనం కావటం అదే ముక్తి.

కాబట్టి ముక్తి కోసం అన్ని విద్యలు వేరువేరైనవి అవసరం లేదు. బ్రహ్మోపాసనలలో దేనినైనా అనుష్ఠించవచ్చు అంటూ ముప్పైనాల్గవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

35. కామ్యాధికరణము

గురువర్యా! బ్రహ్మోపాసన ఒకటిగానే అనుష్ఠించాలి. మరి కామ్యోపాసన మాట ఏమిటి? వీటిని విడివిడిగా ఉపాసించాలా? సమిష్టిగా ఉపాసించవచ్చునా? అన్నాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 60 కామ్యాస్తు యథాకామం సుముచ్చీయేరన్నవాపూర్వహేత్వభావాత్

కామ్యాః తు, యథాకామమ్, సముచ్చీయేరన్, న, వా, పూర్వ హేతు, అభావాత్

కామ్యవిద్యలను ఇష్టం వచ్చినట్లు అంటే వ్యష్టిగాగాని, సమిష్టిగాగాని అనుష్ఠించవచ్చు వీటన్నింటికీ ఒక రకమైన ఫలితం లేదు.

కామ్యవిద్యలు రెండు రకాలు 1. దైవసాక్షాత్కారము. 2. భోగప్రాప్తి. మొదటిదానిలో కొంతకాలం ఒక ఉపాసన చేస్తాడు. తరువాత ఇంకొక ఉపాసన. ఆ తరువాత ఇంకొకటి ఇటువంటి వాటిలో సాధకుడికి పిచ్చిఎక్కుతుంది. ఉపాసకుడు గనక తాదాత్మ్యం చెందితే తానే దేవత అవుతాడు. కాబట్టి ఇలాటి వాటిలో ఉపాసనలు మార్చకుండా ఒకే రకమైన ఉపాసన చెయ్యాలి.

ఇక రెండవది భోగప్రాప్తి. ఇందులో సాధకుడు కోరినది పొందుతాడు. అతడికి సుఖము, భోగము లభిస్తాయి. కాబట్టి ఉపాసన మారాల్సిన అవసరం లేదు.

కాబట్టి వీటిని అంటే కామ్యోపాసనలను మన ఇష్టప్రకారం ఉపాసించవచ్చు అంటూ ముప్పై ఐదవ ప్రకరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

36. యథాశ్రయభావాధికరణము

గురుదేవా! లౌకికోపాసనలు ఇష్టం వచ్చిన విధంగా ఆచరించవచ్చు అన్నారు. మరి కర్మాంగము లైనట్టి ఉద్గీదులను కలిపి అనుష్ఠించాలా ? విడివిడిగా అనుష్ఠించవచ్చా? అన్నాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 61 అంగేషు యథాశ్రయ భావః

అంగేషు, యథాశ్రయభావః

కర్మాంగాలైనటువంటి ఆశ్రతఉపాసనలలో సముచ్చయం వల్ల అనుష్ఠాననియమం ఉంది. అంటే కర్మాంగాలకు, వాటిని ఆశ్రయించిన అంగాలుగా చెప్పబడ్డ ఉపాసనలకు ఒకే నియమం వర్తిస్తుంది. అంటే ఉపాసనలను ఉద్గీథాల్లాగానే సముచ్చయంగా అనుష్ఠించాలి.

సూ. 62 శిష్టేశ్చ

శిష్టేః, చ

కర్మాంగాలకు, వాటిని ఆశ్రయించిన ఉపాసనలకు వేదాలు విధానభేదాన్ని ఉపదేశించవు. కాబట్టి కర్మాంగాలలాగానే ఉపాసనలు సముచ్చయంగానే అనుష్ఠించాలి.

సూ. 63 సమాహారాత్

సమాహారం వల్ల, ఋగ్వేదానికి సంబంధించిన ఓంకారానికి, సామవేదానికి సంబంధించిన ఉద్గీధానికి ఐక్యత చెప్పబడింది.

సూ. 64 గుణసాధారణ్య శ్రుతేశ్చ

గుణ సాధారణ్య శ్రుతేః, చ

ఉపాసనలకు ఆశ్రయమైన ప్రణవం అన్ని వేదాలకు సాధారణమే. కాబట్టి దానిని ఆశ్రయించిన ఉపాసనలకు కూడా సముచ్చయానుష్ఠానం సిద్ధిస్తోంది.

సూ. 65 నవా తత్సహభావాశ్రుతేః

న, వా, తత్సహభావాశ్రుతేః

మూడువేదాల్లోను విహితమైన అంగాలకు స్తోత్రాలకు సహభావం ఉన్నదని శ్రుతి చెబుతున్నది. కాని ఆశ్రయాలకు, ఆశ్రితాలకు సహభావం లేదు. కాబట్టి ఉపాసన అనుష్ఠించవచ్చు లేదా మానవచ్చు.

సూ. 66 దర్శనాచ్చ

దర్శనాత్, చ

శ్రుతులు ఆవిధంగా చెప్పటంవల్ల ఉపాసనలకు సహభావం లేదు. వాటిని ఇష్టం వచ్చినట్లుగా అంటే విడివిడిగానో, కలిపో అనుష్ఠించవచ్చు అంటూ మూడవ అధ్యాయంలో మూడవపాదాన్ని ముగించాడు రత్నాకరుడు.

చతుర్థ పాదము

ఈ పాదంలో సగుణ, నిర్గుణ విద్యలు వేరొక కర్మతో సంబంధం లేకుండా స్వతంత్రంగానే ఫలితాన్నిస్తాయి. అనే విషయాన్ని వివరిస్తున్నారు. ఇందులో 17 అధికరణలు 52 సూత్రాలు ఉన్నాయి.

వ.నెం.	అధికరణము	విషయము	సూత్రాలు
1.	పురుషార్థాధికరణము	బ్రహ్మజ్ఞానము కర్మాంగము కాదు	17
2.	పరామర్శాధికరణము	సన్యాశాశ్రమం వేదాల్లో చెప్పబడ్డది	3
3.	స్తుతిమాత్రాధికరణము	కొన్ని శ్రుతులు ఉపాసనల్ని విధిస్తున్నాయి	2
4.	పారిప్లవాధికరణము	ఉపనిషత్తులలోని కథలు క్రతుకర్మాంగాలు కావు	2
5.	అగ్నీంధనాద్యధికరణము	మోక్షానికి కర్మానుష్ఠానం లేదు	1
6.	సర్వాపేక్షాధికరణము	జ్ఞానోత్పత్తికి విహితకర్మలు ఉపయోగిస్తాయి	2
7.	సర్వాన్నాను మత్యధికరణము	ప్రాణాపాయస్థితిలో ఆహారనియమాలకు సడలింపు ఉన్నది	4
8.	ఆశ్రమకర్మాధికరణము	మోక్షాపేక్షలేనివారు కూడా ఆశ్రమ, విహితకర్మలు చెయ్యాలి	4
9.	విధురాధికరణము	ఆశ్రమరహితులకు కూడా బ్రహ్మవిద్యాధికారమున్నది	4
10.	తద్భూతాధికరణము	సన్యాసి మళ్ళీ పూర్వాశ్రమానికి రాకూడదు	1
11.	అధికారాధికరణము	సన్యాసాశ్రమ భ్రష్టులకు ప్రాయిశ్చిత్తం	2

12.	బహిరధికరణము	ప్రచ్యుతి పొందిన నైష్ఠికునికి సంఘ బహిష్కారం ఉంది.	1
13.	స్వామ్యధికరణము	ఉద్గీథాది ఉపాసనలకు కర్త ఋత్విక్కే	3
14.	సహకార్యంతరవిధ్యధికరణము	పాండిత్యం బాల్యాలతోబాటు మౌనం కూడా విధే	3
15.	అనావిష్కారాధికరణము	బాల్యమంటే రాగద్వేషాలు లేని నిర్మల భావం	1
16.	ఐహికాధికరణము	జ్ఞానోత్పత్తి ఈ జన్మలోనే కలుగుతుంది	1
17.	ముక్తిఫలాధికరణము	మోక్షము అందరికీ ఒకటే	1
		మొత్తం సూత్రాలు	52

ఇక మొదటి అధికరణ చూద్దాం.

1. పురుషార్థాధికరణము

గురువుగారూ ! ఉపనిషత్తులలో చెప్పబడిన ఆత్మజ్ఞానం కర్మలతో కలిసి మోక్షానికి సాధకమువుతుందా? లేక కర్మలను అపేక్షించకుండానే స్వతంత్రంగా పురుషార్థసాధకమవుతుందా ? అంటూ అనుమానం వ్యక్తం చేశాడు కృష్ణశర్మ. వివరించటం మొదలుపెట్టాడు రత్నాకరుడు.

సూ. 1 పురుషార్థోఽ తశ్శబ్దాదితి బాదరాయణః

పురుషార్థః, అతః, శబ్దాత్, ఇతి, బాదరాయణః

ఉపనిషత్తులలో చెప్పబడిన స్వతంత్రమైన ఆత్మజ్ఞానం వల్లనే మోక్షం సిద్ధిస్తుంది అంటున్నాడు వ్యాసమహర్షి.

ఛాందోగ్యోపనిషత్తులో ఉద్దాలకుడు శ్వేతకేతువుకు ఆత్మజ్ఞానాన్ని వివరిస్తూ ఆత్మ అనేది ఎక్కడో ఆకాశంలో లేదు. నిన్ను నువ్వు తెలుసుకోవటమే ఆత్మజ్ఞానం. ఆత్మజ్ఞాని మోక్షాన్ని పొందుతాడు అని చెప్పాడు.

ముండకోపనిషత్తులో మనోమయుడు ఈ అన్నమయ శరీరంలోనే ఉన్నాడు. ఈ విషయం తెలిసినవాడు ఆత్మతత్త్వాన్ని సాక్షాత్కరింపచేసుకోగలుగుతాడు. అని చెప్పబడింది. బృహదారణ్యకంలో బ్రహ్మజ్ఞాని కూడా బ్రహ్మమే అవుతాడు అని చెప్పబడింది.

ఈ విధంగా గురువు యొక్క ఆదేశానుసారం పరబ్రహ్మను శోధించి తెలుసుకున్నవాడు మోక్షం పొందుతాడు. కాబట్టి ఆత్మజ్ఞానంవల్లనే మోక్షం కలుగుతుంది.

సూ. 2 శేషత్వాత్పురుషార్థవాదో యథాన్యేష్వితి జైమినిః

శేషత్వాత్ పురుషార్థవాదః, యథా, అన్యేషు, ఇతి, జైమినిః

కర్తృ రూపంలో ఆత్మ అనేది కర్మకు అంగమే. అంటే ఆత్మ, ఆత్మను గూర్చిన జ్ఞానం, ఈ రెండూ కర్మాంగాలే. ఇది జైమిని అభిప్రాయం

సూ. 3 ఆచార దర్శనాత్

ఆచారము కనపడటం వల్ల కూడా జ్ఞానమనేది స్వతంత్రంగా జ్ఞానసాధనం కాదు. విదేహాధిపతి అయిన జనకుడు గొప్ప గొప్ప దక్షిణలిచ్చి యజ్ఞాలు చేశాడు. ఈ రకంగా జనకుని లాంటి బ్రహ్మవేత్తలుకూడా కర్మని ఆచరించారని చెబుతున్నారు. కేవలం జ్ఞానం వల్లనే మోక్షం వచ్చేటట్లయితే వారు కర్మలు ఎందుకు చేస్తారు?

సూ. 4 తచ్ఛ్రుతేః

తత్, శ్రుతేః

విద్య అనేది కర్మ శేషము. అంటే జ్ఞానమనేది కర్మలకు అంగము. ఛాందోగ్యంలో విద్య, శ్రద్ధ, యోగము అనే ఈ మూడింటితోనూ కలిపి చేసిన కర్మ శక్తివంతమవుతుంది.

సూ. 5 సమన్వారంభణాత్

విద్య, కర్మము అనే వాటి సముచ్చయం కనిపిస్తోంది. ఈ కారణంవల్ల కూడా విద్య కర్మాంగమే. మానవుడు చనిపోయిన తరువాత అతని విద్య, కర్మ రెండూ కూడా అతని వెనకే వెడతాయి. వాటివల్లనే అతడు కర్మఫలితం పొందుతాడు. ఫలితాన్నివ్వటంలో ఈ రెండూ ఒకదానికొకటి సహాయపడతాయి. అందుచేత విద్య అనేది స్వతంత్రం కాదు కర్మాంగమే.

సూ. 6 తద్వతో విధానాత్

తద్వతః విధానాత్

శ్రుతినిబట్టి అన్నివేదాల అర్థాన్ని తెలుసుకున్నవారికి కూడా కర్మను విధించటం కనిపిస్తోంది. కాబట్టి విద్య కర్మాంగమే. అని వారి వాదన.

నియమానుసారం గురువును సేవించి, సుశ్రూషలు చేసి వేదాధ్యయనం పూర్తి చేసి, సమావర్తనం చెంది గృహస్థాశ్రమం స్వీకరించి, స్వాధ్యాయం చేస్తూ, విద్యార్థులకు విద్యబోధిస్తూ ఈ రకంగా కర్మలు చేస్తూ బ్రహ్మవిద్య సాధన చెయ్యాలి అని ఛాందోగ్యంలో చెప్పబడింది. కాబట్టి విద్య అనేది కర్మాంగము అని వీరంటారు.

సూ. 7 నియమాచ్చ

నియమాత్, చ

జీవించి ఉన్నంతవరకూ కర్మ చెయ్యాలి అని వేదం చెబుతోంది. కర్మ చేస్తూనే వంద సంవత్సరాలు బ్రతకాలి. అలా చెయ్యటంవల్ల అశుభకర్మ నీకు అంటదు. అని చెప్పబడింది. కాబట్టి విద్య కర్మాంగము అని తెలుస్తోంది అంటారు.

సూ. 8 అధికోపదేశాత్తు బాదరాయణ స్యైవం తద్దర్శనాత్

అధికోపదేశాత్, తు, బాదరాయణస్య, ఏవం, తద్దర్శనాత్

విద్య అనేది కర్మశేషం కాదు. జ్ఞానమనేది స్వతంత్రంగానే మోక్ష సాధనమని వ్యాసభగవానుడంటాడు ఇది నిజమే. ఎందుకంటే వేదాంతంలో కర్మిష్ఠిని గూర్చి కర్మశేషుడైన వానిని గూర్చి, సంసారిని గూర్చి, చెప్పిన దానికన్న అసంసారి చిన్మాత్రుడు అయిన పరమేశ్వరుణ్ణి గురించే ఎక్కువగా చెప్పబడింది.

ఈశ్వరుడు సర్వజ్ఞుడు, సర్వవేత్త అంటూ ఈశ్వరుణ్ణి గూర్చి ఎక్కువగా ఉపనిషత్తులలో చెప్పటంచేత, ఆత్మజ్ఞానము కర్మాంగము కాదని తెలుస్తోంది.

సూ. 9 తుల్యం తు దర్శనమ్

తుల్యం, తు, దర్శనమ్

తత్త్వ జ్ఞానము కర్మలకు అంగం కాదు. అనే మాటకు వేదప్రమాణం కూడా ఉంది.

కావషేయమానులు, బ్రహ్మజ్ఞానులు, వారు "మనం వేదాధ్యయనం చెయ్యటం ఎందుకు? యజ్ఞయాగాదులు చెయ్యటం ఎందుకు? అని అడిగారు. దానికి సమాధానంగా బృహదారణ్యకంలో "నేనే పరమాత్మను అని తెలుసుకుని, బ్రాహ్మణులైన వారు పుత్రులు, ధనముమొదలైన ఐహికవాంఛలను వదలి భిక్షాటన చేస్తూ ఉంటారు" అని చెప్పబడింది. అంటే బ్రహ్మజ్ఞానులు కర్మలు చెయ్యరు. కర్మ చేసినా, చెయ్యకపోయినా వారికి ఒకటే. కాబట్టి విద్య కర్మాంగము కాదు.

సూ. 10 అసార్వత్రికీ

ఛాందోగ్యంలో "విద్యాయుక్తుడై శ్రద్ధతో, యోగంతో చేసిన కర్మ మిగతా వాటికన్న ప్రబలంగా ఉంటుంది." అని చెప్పబడింది. ఈ మాట ఉద్గీధోపాసనకు మాత్రమే వర్తిస్తుంది.

సూ. 11 విభాగః శతవత్

విభాగః, శతవత్

పదిరూపాయలను ఇద్దరికి పంచి ఇమ్మన్నప్పుడు, చెరి ఐదు రూపాయలు ఇస్తాము. అలాగే విద్య, కర్మ ఈ రెండూ పరలోకానికి వెళ్ళేవాడిని అనుసరిస్తాయి. సాధకులకు విద్యను, కర్మను, విభజించే ఇవ్వాలి. ఇక్కడ విద్య ఒక పురుషుణ్ణి అనుసరిస్తుందని (జ్ఞానిని) కర్మ మరియొక పురుషుణ్ణి (సంసారిని) అనుసరిస్తుందని భావము.

సూ. 12 అధ్యయన మాత్రవతః

వేదాధ్యయనం చెయ్యాలి. శిష్యులకు బోధించాలి అనేది వేదాధ్యయనం చేసేవారికి చెప్పిన మాట, అంతేకాని జ్ఞానులకు కాదు. ఛాందోగ్యంలో చెప్పిన గురువుకు శుశ్రూష చెయ్యాలి ఇత్యాదివిధులు కర్మాధికారికోసం, అంతేకాని జ్ఞానికోసం కాదు. జ్ఞానియైన వాడికి వేదాధ్యయనం, కర్మానుష్ఠానము అవసరం లేదు.

సూ. 13 నావిశేషాత్

న, అవిశేషాత్

లోకంలో అగ్నిహోత్రాది కర్మలు చేస్తూ వంద సంవత్సరాలు బ్రతకాలి అని చెప్పింది కర్మిష్ఠులకు అంతేకాని జ్ఞానులకు కాదు.

సూ. 14 స్తుతయే ఽను మతిర్వా

స్తుతయే, అనుమతిః, వా

తత్త్వజ్ఞానికి కర్మానుష్ఠానము కేవలము స్తుతికోసము. జీవన పర్యంతం కర్మ చెయ్యనప్పటికీ తత్త్వవేత్త యందు విద్యాసామర్థ్యంవల్ల కర్మలోపం ఉండదు.

సూ. 15 కామకారేణచైకే

కామకారేణ, చ, ఏకే

వాజసనేయశాఖవారు కొందరు గృహస్థాశ్రమాన్ని త్యాగం చెయ్యాలని చెబుతున్నారు.

అంటే జ్ఞానులైనవారు, సంసారబంధనాలు విడిచిపెట్టినవారు, విరాగులు "ఈ సంతానము, కర్మలవల్ల ప్రయోజనం లేదు. మనకు ఆత్మ లోకం కావాలి" అని భావించేవారు కర్మలకు ప్రాధాన్యత ఇవ్వరు.

సూ. 16 ఉపమర్దంచ

ఉపమర్దం, చ

కొందరు విద్వాంసులు వైరాగ్యం చెబుతున్నారు. విద్యావేత్తకు సర్వమూ ఆత్మే. అతడికి కర్త అనే భావం ఉండదు. కర్మ జరగాలంటే కర్త, కర్మ రెండూ ఉండాలి. విద్యాఫలం అంటే ఆత్మసాక్షాత్కారము స్వస్వరూప జ్ఞానము. దీనికి కర్మలు అవసరం లేదు. కాబట్టి విద్య కర్మాంగము కాదు.

సూ. 17 ఊర్ధ్వరేతస్సు చ శబ్దేహి

ఊర్ధ్వరేతస్సు, చ, శబ్దే, హి

బ్రహ్మవిద్య, అనేది కేవలం సన్యాసాశ్రమంలోనే వినిపిస్తుంది. ఇంకెక్కడా వినిపించదు. కాబట్టి విద్య కర్మాంగం కాదు.

యతులకు అగ్నిహోత్రాది కర్మలు లేవు. కాబట్టి వారికి విద్య కర్మాంగం కాదు. వారి దృష్టిలో విద్య అంటే బ్రహ్మవిద్య ఊర్ధ్వరేతస్కులున్నారని వేదం చెబుతుంది.

ఆత్మలోకం కోరే సన్యాసులు కర్మలు త్యజిస్తారు. వారు కర్మలు చెయ్యరు. కర్మ చేసినా, చెయ్యకపోయినా వారికి ఫలితం ఒక్కటే. కాబట్టి బ్రహ్మవిద్య స్వతంత్రంగానే మోక్షసాధనము అంటూ మొదటి అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

2. పరామర్శాధికరణము

గురువుగారూ ! బ్రహ్మవిద్యద్వారానే మోక్షము వస్తుంది అని చెప్పారు. సన్యాసాశ్రమంలో దీనికి కర్మ అనేది లేదన్నారు. అయితే అసలు సన్యాసాశ్రమమనేది ఉన్నదా? ఉంటే దాన్ని ఆచరించవచ్చా ? లేదా? అన్నాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 18 పరామర్శం జైమిని రచోదనాచాపవదతి హి

పరామర్శం, జైమినిః, అచోదనా, చ, అపవదతి, హి

సన్యాసాశ్రమం గురించి చెప్పటంలో విధాయకమైన గుణాలేమీ లేవు. కొన్ని శ్రుతులు దీన్ని నిషేధిస్తున్నాయి. అయినప్పటికీ శాస్త్రాలు సన్యాసాశ్రమాన్ని అంధపరంపర న్యాయంగా చెప్పాయి అని జైమిని అభిప్రాయం.

అంధ పరంపర న్యాయమంటే ఒక గ్రుడ్డివాడి చెయ్యి పట్టుకుని ఇంకొక గ్రుడ్డివాడు. అలా నడిచి వెడుతుంటారు. త్రోవలో ఏమున్నదో ముందు నడిచేవాడికీ తెలియదు. వెనకనడిచే వాడికీ తెలియదు. అదేవిధంగా ఒక శాస్త్రంలో చెప్పారు కాబట్టి ఇంకొక శాస్త్రంలో సన్యాసాశ్రమం గురించి వ్రాశారు అంటాడు జైమిని.

ఆశ్రమాలు మూడే చెప్పబడినాయి.

1. బ్రహ్మచర్యం – గురుకులవాసంలో గడిపేది
2. గృహస్థాశ్రమం – యజ్ఞము, వేదాధ్యయనము, దానము చేసేది
3. వానప్రస్తం – తపస్సు చెయ్యటం

ఈ రకంగా మూడు ఆశ్రమాలే చెప్పబడ్డాయి. వాటిలో సన్యాసాశ్రమం లేదు అంటాడు జైమిని.

సూ. 19 అనుష్ఠేయం బాదరాయణః సామ్యశ్రుతేః

అనుష్ఠేయం, బాదరాయణః, సామ్యశ్రుతేః

సన్యాసాశ్రమం అనుష్ఠింపదగినది అని వ్యాసుడంటాడు. వేదంలో గృహస్తాశ్రమంతో పాటే సన్యాసాశ్రమం కూడా చెప్పారు. వేదంలో పైన చెప్పిన మూడు ఆశ్రమాలను ఒకే ఫలం పుణ్యలోకాలు అని చెప్పారు. సన్యాసాశ్రమం దీనికి భిన్నమైనది. మోక్షప్రాప్తికి ఉపయోగిస్తుంది. అందుకే దాన్ని అనుష్ఠించాలి.

సూ. 20 విధిర్వాధారణవత్

విధిః, వా, ధారణవత్

విధిలో చెప్పకపోయినప్పటికీ సన్యాసావస్థ ఉన్నది. మొదటి మూడు ఆశ్రమాలలోనూ ఫలితం పుణ్యలోకాలు. సన్యాసాశ్రమానికి ఫలం మోక్షము. ఇది వేదాలలో చెప్పబడింది. అంటూ రెండవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

3. స్తుతిమాత్రాధికరణము

గురువర్యా! ఉద్గీధం అన్నిటికన్న శ్రేష్ఠమైనది. అది పరమాత్మ రూపము అందువల్ల సర్వోత్తమమైనది. అయితే వేదాలలో వాటిశ్రేష్ఠతను కీర్తించటం జరిగింది. ఈ కీర్తనము ఉద్గీధాన్ని స్తుతించటానికా? లేక ఉపాసన కోసమా? అన్నాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 21 స్తుతిమాత్రముపాదానాదితిచేన్నా పూర్వత్వాత్

స్తుతిమాత్రమ్, ఉపాదానాత్, ఇతి, చేత్, న, అపూర్వత్వాత్

ఉద్గీధాది శ్రుతులు కర్మాంగాలుగా గ్రహించబడినాయి. అందుచేత ఇది కేవలము స్తుతికోసమే అని అనటం సరికాదు.

ఉద్గీధాదులు శ్రేష్ఠమైన గుణాలతో కూడుకుని ఉంటాయనే విషయంగాని, వాటి ఉపాసనగాని ఏ ప్రమాణంచేతా ప్రతిపాదించబడలేదు. అవి అపూర్వములు. అందుచేతనే శ్రేష్ఠమైన గుణాలతో కూడిన ఉద్గీధోపాసనమే ఈ వాక్యాలలో చెప్పబడ్డది.

సూ. 22 భావ శబ్దాచ్చ

'ఉద్గీధముపాసీత' 'సామోపాసీత' లాంటి విధులు ప్రత్యక్షంగా ఉన్నాయి. ఈ వాక్యాలన్నీ ఉపాసనా విధులనే బోధిస్తున్నాయి అంటూ మూడవ ప్రకరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

4. పారిప్లవాధికరణము

పారిప్లవకర్మ అంటే అశ్వమేధ యాగంలో రాత్రిపూట యజమానిని సకుటుంబంగా కూర్చోపెట్టి అధ్వర్యుడు వేదాలలో ఉన్న కథలు చెప్పటం.

బృహదారణ్యకంలో మైత్రేయి కథ ఈ రకంగా చెప్పినదేనా? లేక విద్యను స్తుతించటం కోసం చెప్పినదా? అన్నాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 23 పారిప్లవార్థా ఇతిచేన్న విశేషితత్వాత్

పారిప్లవార్థాః, ఇతి, చేత్, న, విశేషితత్వాత్

ఇక్కడ పారిప్లవము అనేమాట ఉన్నందువల్ల మైత్రేయి కథ పారిప్లవము అనకూడదు.

వేదాలలో కొన్ని కథలు మాత్రమే అలా చెప్పబడ్డాయి. కాబట్టి ఉపనిషత్తులలో కథలన్నీ విద్యావిశేషాలతో తప్ప కర్మ శేషాలు కావు.

సూ. 24 తథాచైకవాక్య తోపబంధాత్

తథా, చ, ఏకవాక్యతోపబంధాత్

ఇవన్నీ విద్యకోసం చెప్పినవే. ఈ కథలన్నీ ఆయాచోట్ల ఉన్న విద్యలతో ఏకవాక్యతను కలిగి ఉన్నాయి. కథవల్ల ఉపాసనకు ఫలం ఏమీ లేదు. శిష్యులకు విద్యయందు అభిలాష కలిగించటానికి, ఆ విద్యను తేలికగా బోధించటానికి ఇటువంటి కథలు చెప్పబడ్డాయి. అంతేకాని ఈ కథలు క్రతుకర్మాంగాలు కావు. అంటూ నాల్గవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

5. అగ్నీంధనాద్యధికరణము

గురుదేవా! బ్రహ్మవిద్య పురుషార్థాన్ని కలిగించటంలో కర్మను అపేక్షిస్తుందా? అన్నాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

బ్రాహ్మణులు వేదాధ్యయనం చేత, యజ్ఞంచేత, దానంచేత పరబ్రహ్మను తెలుసు కుంటారు. అని కొన్నిచోట్ల చెప్పబడింది. అందువల్ల జ్ఞానానికి కర్మ సాధనంగా చెప్పినట్లు కనిపిస్తుంది. అంటే మోక్షానికి కర్మ సహాయం కూడా కావాలి. అని తెలుస్తోంది. అని వీరు వాదిస్తారు.

సూ. 25 అతఏవచాగ్నీంధనాద్యనపేక్షా

అతఏవ, చ, అగ్ని, ఇంధనాది, అనపేక్షా

విద్య అనేది పురుషార్థ హేతువు. అందువల్లనే అగ్ని, ఇంధనాలు ఇవేవీ అవసరం లేదు. విద్య స్వతంత్రంగానే పురుషార్థ హేతువు. కాబట్టి దానికి కట్టెలు, నిప్పులాంటి అవసరం లేదు. బ్రహ్మవిద్య మోక్షాన్ని కలిగించటంలో కర్మను అపేక్షించదు అంటూ ఐదవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

6. సర్వాపేక్షాధికరణము

గురుదేవా! జ్ఞానోత్పత్తికి విహితకర్మలు ఉపయోగిస్తాయా? అన్నాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 26 సర్వాపేక్షా చ యజ్ఞాది శ్రుతే రశ్వవత్

సర్వాపేక్షా, చ, యజ్ఞాదిశ్రుతేః, అశ్వవత్

విద్యకు అన్ని ఆశ్రమాలలోను కర్మలు అవసరమే యజ్ఞయాగాలు జ్ఞానోత్పత్తికి హేతువులు. గుర్రం పొలం దున్నటానికి పనికిరాదు కాని రథంలాగటానికి పనికి వస్తుంది. అలాగే కర్మలు మోక్షాన్ని ఇవ్వలేకపోయినా జ్ఞానోత్పత్తికి ఉపయోగిస్తాయి.

సూ. 27 శమదమాద్యుపేతః స్యాత్తథాపితు తద్విధే
స్తదం గతయా తేషామవశ్యానుష్ఠేయత్వాత్
శమదమాద్యుపేతఃస్యాత్, తథాపి, తు, తద్విధేః
తదంగతయా, తేషామ్, అవశ్యానుష్ఠేయత్వాత్

విద్య స్వతంత్రమైనదే కాని మోక్షగామి శమదమాదులు గలిగి ఉండాలి. అవి విద్యకు అంగాలు.

జ్ఞానసాధనలో అవసరమయ్యేవి కర్మలే. శమదమాలు అంతరంగసాధనాలు యజ్ఞాలు చేసినా, యాగాలు చేసినా, సాధకుడు శమదమాది గుణాలు గలవాడు కావాలి. కాబట్టి జ్ఞానోత్పత్తికి కర్మలు ఉపయోగిస్తాయి. అంటూ ఆరవ అధ్యాయం పూర్తి చేశాడు రత్నాకరుడు.

7. సర్వాన్నానుమత్యధికరణము

గురువుగారూ! ఛాందోగ్యంలో విరాట్ ప్రాణానికి విరాట్ అన్నమే ఆహారము అని చెప్పబడింది. అంటే అన్ని రకాల పదార్థాలను భక్షించవచ్చు అని చెప్పబడింది. అలాగే ఉషస్తికథలో ప్రాణం పోయే సమయంలో మాత్రమే నియమోల్లంఘునం చెయ్యవచ్చు అని చెప్పబడింది. అంటే ప్రాణాపాయస్థితిలో ఆహార నియమాలకు సడలింపు ఉన్నదా? అన్నాడు కృష్ణశర్మ. వివరిస్తున్నాడు రత్నాకరుడు.

సూ. 28 సర్వాన్నానుమతిశ్చప్రాణాత్యయే తద్దర్శనాత్
సర్వాన్నానుమతిః, చ, ప్రాణాత్యయే, తద్దర్శనాత్

ప్రాణాపాయస్థితిలో ఏ విధమైన అన్నానైనా తినవచ్చును అని వేదం చెబుతున్నది. ఈ మాటే ఛాందోగ్యంలోను, బృహదారణ్యకంలోనూ కూడా చెప్పబడ్డది. కుక్కలు, పిల్లులు, పక్షులు మొదలైన జంతువుల ఆహారమే నీకు ఆహారము కాబట్టి ప్రాణాపాయ స్థితిలో ఏ రకమైన ఆహారమైనా తినవచ్చును.

సూ. 29 అబాధాచ్చ
అబాధాత్, చ

భక్ష్యాభక్ష్య నిర్ణయశాస్త్రం ఈ విధంగా చెప్పింది కాబట్టి అది ఆచరణీయము.

వేదంలో ఆహారం నిర్మలంగా, పరిశుద్ధంగా ఉంటేనే, మనసుకూడా పరిశుద్ధంగా ఉంటుంది అని చెప్పబడింది. అందుకే ఇది తినవచ్చు, ఇది తనరాదు అని నిర్ణయించ బడింది.

సూ. 30 అపి చ స్మర్యతే
అపి, చ, స్మర్యతే

స్మృతులలోకూడా ఈ విషయం చెప్పబడింది. మనుస్మృతిలో 'ఎవరైనా సరే, ప్రాణాపాయ స్థితిలో భక్ష్యాభక్ష్య విచక్షణ లేకుండా ఏ వస్తువునైనా తినవచ్చు' అని చెప్పబడింది. ఇది ప్రాణాపాయ స్థితిలో మాత్రమే.

ఎటువంటి సమయంలోనైనా మద్యము మాత్రమే నిషేధము.

సూ. 31 శబ్దశ్చాతోఽ కామకారే
శబ్దః, చ, అతః, అకామకారే

ఆహార విషయంలో స్వేచ్ఛ పనికిరాదు. శాస్త్రంలో అంగీకరించినవాటినే తినాలి. నిషేధించిన వాటిని వదలివెయ్యాలి. అంటూ ఏడవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

8. ఆశ్రమకర్మాధికరణము

గురువుగారూ! మోక్షాపేక్షలేనివారు, విద్యాసిద్ధి అవసరం లేనివారు నిత్యకర్మలు చెయ్యాలా? అవసరం లేదా? ఒకవేళ కర్మచేస్తే జ్ఞానం కోసం ఒకసారి. నిత్యాసిద్ధి కోసం ఒకసారి. మొత్తం రెండుసార్లు చెయ్యాలా? ఒకసారి చేస్తే చాలా? వివరించండి అన్నాడు కృష్ణశర్మ. వివరిస్తున్నాడు రత్నాకరుడు.

సూ. 32 విహితత్వాచ్చా శ్రమకర్మాపి
విహితత్వాత్, చ, ఆశ్రమకర్మ, అపి

ముముక్షువు కానివాడు కూడా ఆశ్రమ విహితకర్మలు చెయ్యాలి. అని వేదాలు చెబుతున్నాయి. అయితే నిత్యకర్మ సిద్ధికోసం ఒకసారి, జ్ఞానం కోసం ఒకసారి రెండుసార్లు చెయ్యనక్కరలేదు. ఒకసారి చేస్తే చాలు.

ఆ మాటలు విన్న కృష్ణశర్మ "రూపభేదం లేకపోయినా, అగ్నిహోత్రమనేది ఒకటే అయినా ఫలితంలో తేడా ఉంది కాబట్టి రెండుసార్లు చెయ్యనవసరం లేదా? నిత్యకర్మలు పాపక్షయం చేస్తాయి. విద్యాంగకర్మలు జ్ఞానం కోసం కదా." అన్నాడు.

సూ. 33 సహకారత్వేన చ

సహకారిత్వేన, చ

విద్యోత్పత్తిలో యాగాది కర్మలు సహకారి రూపంలో అనుష్ఠింపతగ్గవి.

ఇవి రెండూ పరస్పర సహకారం గలవి. కాబట్టి రెండుసార్లు చెయ్యవలసిన అవసరం లేదు. ఈ నిత్యకర్మలే జ్ఞానంకోసం కూడా తోడ్పడతాయి.

ఈ రెండింటి ప్రయోజనాలు వేరు కదా? అంటే చంద్రకద్ర యజ్ఞంలో యూపస్తంభం గానూ ఉపయోగిస్తుంది. లౌకికంలోనూ ఉపయోగిస్తుంది. అలా ఈ కర్మలుకూడా రెండు రకాలుగానూ ఉపయోగిస్తాయి.

సూ. 34 సర్వథాపి త ఏవోభయ లింగాత్

సర్వథా, అపి, త ఏవ, ఉభయలింగాత్

యాగాది కర్మలు ఆశ్రమత్వ పక్షంలోను, విద్యాసహకారిత్వ పక్షంలో కూడా అనుష్ఠింపతగ్గవే. ఎవరు ఫలితం ఆశించకుండా, చేయవలసిన కర్మలు చేస్తాడో అతడికి మోక్షమార్గం లభిస్తుంది.

సూ. 35 అనభి భవంచ దర్శయతి

అనభిభవం, చ, దర్శయతి

బ్రహ్మచర్యాది సాధన సంపన్నుడైనవాడు పొందిన ఆత్మజ్ఞానం, క్లేశాలవల్ల నాశనం పొందదు. ఆశ్రమాలకు సంబంధించిన కర్మలు కూడా సాధకునిలోని అవిద్య, రాగము, ద్వేషము మొదలైన క్లేశాలను పోగొట్టి జ్ఞానాన్ని కలుగజేస్తాయి. అందుచేతనే అధ్యయనము. దానము వంటి నిత్యకర్మలు జ్ఞానానికి సహాయకారులవుతాయి. కాబట్టి మోక్షాపేక్ష లేనివారు కూడా ఆశ్రమవిహితకర్మలు చెయ్యాలి. అంటూ ఎనిమిదవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

9. విధురాధికరణము

గురువర్యా! ఆశ్రమరహితులకు కూడా బ్రహ్మవిద్యాధికారమున్నదా. అన్నాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 36 అంతరా చాపి తు తద్దృష్టేః

అంతరా, చ, అపితు, తద్దృష్టేః

వేదాలలో ఆశ్రమరహితులైన వారికి కూడా బ్రహ్మవిద్యాధికారమున్నది అని చెప్పబడింది.

ఆశ్రమరహితులు అంటే భార్య చనిపోయినవారు, ధనం లేకపోవటంవల్ల గృహస్థాశ్రమ ధర్మాలు నిర్వహించలేనివారు. ఇటువంటి వారికి బ్రహ్మవిద్యాధికారం ఉన్నదా? అనేది ప్రశ్న. వారికికూడా బ్రహ్మవిద్యాధికారమున్నది. ఛాందోగ్యంలో రైక్వుడు ఈ కోవకు చెందినవాడే అతడికి భార్య లేదు. జానశ్రుతి కుమార్తెనిచ్చి వివాహం చేశాడు.

సూ. 37 అపిచ స్మర్యతే

అపి, చ, స్మర్యతే

ఏ ఆశ్రమము లేనట్టి సంవర్తుడు మొదలైనవారు మహాయోగులైనారని చెప్పబడింది.

ఇతిహాసాల్లో దిగంబరులైనవారు ఏ ఆశ్రమధర్మాలు నిర్వర్తించకుండా (సంవర్తుడు) మహాయోగులైనారని చెప్పబడింది. కాబట్టి ఆశ్రమరహితులకు కూడా బ్రహ్మవిద్యాధికారం ఉంది.

సూ. 38 విశేషాను గ్రహశ్చ

విశేష, అనుగ్రహః, చ

రైక్వుడు మొదలైనవారికి ఏ ఆశ్రమం లేదు. అయినప్పటికీ జపతపాలవంటి కర్మాలవల్ల విద్యాధికారం ప్రాప్తించింది. ఆశ్రమాలలో ఉన్నవారికి యజ్ఞయాగాలు, అధ్యయనమువంటి ధర్మాలున్నట్లే, ఏ ఆశ్రమం లేనట్టి రైక్వుడు మొదలైనవారికి జపము, తపము, దేవతారాధనవంటివి విద్యోత్పాదకాలు. “జపంద్వారా బ్రాహ్మణుడు మోక్షం పొందవచ్చు”నని మనుస్మృతి చెబుతోంది.

సూ. 39 అతస్త్వితరజ్జ్యాయో లింగాచ్చ

అతః, తు, ఇతరత్, జ్యాయః, లింగాత్, చ

ఏ ఆశ్రమం లేకపోవటంకన్న, ఆశ్రమం కలిగి ఉండటమే శీఘ్రమైన విద్యాప్రాప్తికి సాధనం.

ఏ ఆశ్రమం లేకపోయినా విద్యాధికారమున్నప్పుడు, ఇంకా ఆశ్రమధర్మాలు ఎందుకు అనే ప్రశ్న వస్తుంది.

ఏ ఆశ్రమం లేకుండా ఉండేకన్న, ఏదో ఒక ఆశ్రమాన్ని ఆశ్రయించటం శ్రేయస్కరం. అందువల్ల బ్రహ్మవిద్యాసాధన తేలిక అవుతుంది. ఆశ్రమం ఏదీ లేకుండా బ్రాహ్మణుడు

ఒక్కరోజుకూడా ఉండకూడదు. ఒక సంవత్సరంపాటు ఈ విధంగా ఉంటే ప్రాయశ్చిత్తం కూడా చేసుకోవాలి.

కాబట్టి ఏ ఆశ్రమం లేకపోయినా విద్యాధికారం మాత్రం నశించదు. అయితే ఏ ఆశ్రమం లేకపోవటంకన్న, ఏదో ఒక ఆశ్రమాన్ని గ్రహించటం మంచిది అంటూ తొమ్మిదవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

10. తద్భూతాధికరణము

గురువర్యా! సన్యాసాశ్రమం స్వీకరించినవాడు ఐహిక వాంఛలతోగాని, ఇంద్రియలాల సత్వంతోగాని, ఇతర కారణాలతోగాని, తిరిగి గృహస్థాశ్రమాన్ని స్వీకరించవచ్చునా? అంటూ అడిగాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 40 తద్భూతస్యతు నాతద్భావోజైమినేరపి నియమా తదూప్రాభావేభ్యః

తద్భూతస్య, తు, న, అతద్భావః, జైమినేః, అపి, నియమాతద్రూపాభావేభ్యః

సన్యాసాశ్రమంలో ఉన్నవాడు మళ్ళీ వచ్చి గృహస్థాశ్రమం స్వీకరించరాదు. ఆశ్రమ భ్రంశం పనికి రాదు. గురువు అనుజ్ఞ పొందిన నాలుగు ఆశ్రమాలలో ఏదో ఒకదానిని గ్రహించి, మరణకాలం వరకు ధర్మపరుడై ఆ ఆశ్రమాన్నే ఆశ్రయించి ఉండాలి.

బ్రహ్మచర్యం నుండి గృహస్థాశ్రమానికి రావాలి అనుకొని శ్రుతులు చెబుతుండగా, బ్రహ్మచర్యం నుండి ఒక్కసారిగా సన్యాసాశ్రమం స్వీకరించాలని కొన్ని శ్రుతులు చెబుతున్నాయి. అంతేకాని సన్యాసాశ్రమం నుంచి క్రిందికి రావచ్చని ఎక్కడా చెప్పబడలేదు.

శిష్టులైన వారెవ్వరూ అలా చెయ్యలేదు. సన్యాసాశ్రమాన్నే అంగీకరించని జైమినికూడా ఇందుకు ఒప్పుకోలేదు.

అందుకనే వివాహం చేసుకుని, కోరికలన్నీ తీరినతరువాతనే సన్యాసం స్వీకరించాలి. ఒకవేళ సన్యాసి గనకపతనమైతే, అధోగతి పాలవుతాడని ఈశావాశ్యోపనిషత్తు చెప్పబడింది. అలాగే శుకమహర్షికి జనకమహారాజు కూడా బోధించాడు. అంటూ పదవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

11. అధికారాధికరణము

గురుదేవా! సాధారణ బ్రహ్మచారిని 'ఉపకుర్వాణులు' అంటారు. జీవితాంతం బ్రహ్మచర్యం వహించేవాడు నైష్ఠిక బ్రహ్మచారి. నైష్ఠిక బ్రహ్మచారి, వానప్రస్థుడు, సన్యాసి

వీరు ఊర్ధ్వరేతస్కులు వీరికి ఆశ్రమభ్రంశం పనికిరాదు. భ్రష్టులైనవారు చేసే కర్మలు విద్యాహేతువులు కావు. మరి ఇలా భ్రష్టులైనవారికి ప్రాయశ్చిత్తము ఏదైనా ఉన్నదా? వివరించండి అన్నాడు నారాయణభట్టు. వివరించటం మొదలుపెట్టాడు రత్నాకరుడు.

సూ. 41 నచాధికారికమపి పతనానుమానాత్తదయోగాత్

న, చ, అధికారికమ్, అపి, పతనానుమానాత్, తదయోగాత్

నైష్ఠికబ్రహ్మచారి గనక ఆశ్రమచ్యుతి పొందితే, అతడికి ప్రాయశ్చిత్తం లేదు. అలాగే సన్యాసాశ్రమం నుంచి చ్యుతుడైన వాడికి కూడా ప్రాయశ్చిత్తం లేదు. ఈ రకంగా ప్రాయశ్చిత్తం అనేది ఏదైనా ఉంటే, అది మామూలు బ్రహచారికి మాత్రమే అంతేకాని సన్యాసికి మాత్రం కాదు అని వీరివాదన.

సూ. 42 ఉపపూర్వ మపిత్వే కే భావమశనమత్తదుక్తమ్

ఉపపూర్వమ్, అపితు, ఏకే, భావమ్, అశనవత్, తత్, ఉక్తమ్

మామూలు బ్రహ్మచారి మధు మాంసాలు సేవిస్తే అతనికి ప్రాయశ్చిత్తమున్నది. అలాగే నైష్ఠిక బ్రహ్మచారికికూడా ప్రాయశ్చిత్తమున్నది. ఈ విషయం పూర్వమీమాంసలో చెప్పబడ్డది.

ఒకవేళ సంభోగిస్తే దానికి ప్రాయశ్చిత్తమున్నది. గురుదారా గమనం మాత్రం మహాపాపం. దానికి ప్రాయశ్చిత్తం లేదు. పైన చెప్పినట్లుగా ప్రాయశ్చిత్తం జరిగినా, వారితో సత్పురుషులు కలిసి ఉండరు. అంటే వెలివేస్తారు.

వానప్రస్థ, పరివ్రాజకులకు కూడా ప్రాయశ్చిత్తమున్నది అంటాడు జైమిని. దీక్షా లోపం గనకచేస్తే వానప్రస్థుడికి, సన్యాసికి కూడా ప్రాయశ్చిత్తమున్నది. వారు 'కృచ్ఛ్రవ్రతం' చెయ్యాలి. అంటే సోమలతమినహా, మిగిలిన చెట్లు, చేమలకు నీరు పోసి పెంచాలి. శాస్త్రవిహితమైన ప్రాణాయామాదులుకూడా చెయ్యాలి. ఈ రకంగా ఊర్ధ్వరేతస్కులకు (సన్యాసి, వానప్రస్థుడు) కూడా ప్రాయశ్చిత్తం ఉన్నది. అంటూ పదకొండవ ప్రకరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

12. బహిరధికరణము

"గురువుగారూ ! ఈ రకంగా భ్రష్టుడైనటువంటి నైష్ఠికునికి సంఘ బహిష్కార మున్నదా?" వారికి ప్రాయశ్చిత్తం జరిగింది కదా?" అన్నాడు కృష్ణశర్మ. వివరిస్తున్నాడు రత్నాకరుడు.

సూ. 43 బహిస్తూభయథాపి స్మృతే రాచారాచ్చ

బహిః, తు, ఉభయథా, అపి, స్మృతేః, ఆచారాత్, చ

ఊర్ధ్వరేతస్కులు పతనం కావటం రెండు రకాలుగా జరుగుతుంది. 1. ఉపపాతకము 2. మహాపాతకము. కాని వారు ఏ రకంగా పతనమైనప్పటికీ బహిష్కరింపతగిన వారే.

పతనమైన యతీశ్వరులు ప్రాయశ్చిత్తం పొందినప్పటికీ సదాచారులు వారితో కలవరు. అంటే వారు బహిష్కృతులు. ఉత్తమాశ్రమం నుంచి పతనమైన వారు అంటే తన సంఘాన్ని విడిచి పరజాతితో కలిసినవాడు, ఉరివేసుకున్నవాడు, ఇలాంటి వారికి రెండు రకాల పాపాలు కలుగుతాయి. 1. ఈ లోకంలో అశుద్ధి 2. పరలోకంలో అశుద్ధి వీరు చాంద్రియణాది వ్రతాలు చేసినందువల్ల, రెండవ దోషం పోతుంది. కాని మొదటిది పోదు. అందువల్ల వీరు శిష్టులతో ఆహార వ్యవహారములకు పనికి రారు. అంటూ పన్నెండవ ప్రకరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

13. స్వామ్యధికరణము

"గురువర్యా! కర్మాంగ ఉపాసనలను ఆచరించవలసినది ఋత్విక్కా! లేక యజమానా?" అని సంశయం వెలిబుచ్చాడు నారాయణభట్టు. సంశయం తీరుస్తున్నాడు రత్నాకరుడు.

సూ. 44 స్వామినః ఫలశ్రుతే రిత్యాత్రేయః

స్వామినః, ఫలశ్రుతేః, ఇతి ఆత్రేయః

కర్మాంగోపాసనల కర్త యజమానే అని ఆత్రేయుని వాదము. ఉద్గీథాది కర్మాంగోపాసనలలో కర్త యజమానే. ఉపనిషత్తులలో చెప్పిన దానిని బట్టి కర్తకే ఫలం లభిస్తుంది. కాబట్టి ఉపాసనలకు కూడా కర్త యజమానే అని వీరి వాదన.

సూ. 45 ఆర్త్విజ్యమిత్యౌడులోమిస్తస్మైహి పరిక్రీయతే

ఆర్త్విజ్యమ్, ఇతి, ఔడులోమిః, తస్మై హి, పరిక్రీయతే

ఈ ఉపాసనలకు కర్త యజమానే అని ఔడులోమి అనే ఆచార్యుడు కూడా అంటున్నాడు.

యజమానికి ఫలం సంపాదించి పెట్టటం కోసం దక్షిణ ఇచ్చి ఋత్విక్కునుకొన్నాడు. అక్కడ చేసేది ఋత్విక్కే కాని ఆ ఫలితాన్ని అతడు యజమానికి సంక్రమింపచేస్తాడు అంటాడు ఔడులోమి.

సూ. 46 శ్రుతేశ్చ

శ్రుతేః, చ

శ్రుతులలో ఋత్విక్కు చేసిన ఉపాసన ఫలం యజమానికి చెందటం గురించి వివరించారు.

యజ్ఞం చేసేటప్పుడు ఋత్విక్కు కోరేకోరికలన్నీ యజమాని కోసమే. కాని దీనివల్ల వచ్చే ఫలితం యజమానిది. కాబట్టి ఉపాసనలకు కర్త ఋత్విక్కే అంటూ పదమూడవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

14. సహకార్యంతర విధ్యధికరణము

"బృహదారణ్యకంలో" పరబ్రహ్మను తెలుసుకున్నవాడు పరమసుఖాన్ని, బ్రహ్మభావాన్ని పొందుతాడు. కాబట్టి బ్రాహ్మణుడైనవాడు, బ్రహ్మను గురించి తెలుసుకోవాలనుకునేవాడు మొదటగా శాస్త్రపరిజ్ఞానం సంపాదించాలి. తరువాత దాన్ని ధృడపరచుకోటానికి మననం చెయ్యాలి. ఆ తరువాత మౌనంగా ధ్యానం చెయ్యాలి. అప్పుడు అతడు బ్రహ్మవేత్త అవుతాడు" అని చెప్పబడింది.

ఇక్కడ శాస్త్రజ్ఞానంతోపాటు మౌనం కూడా చెప్పబడింది. కాబట్టి మౌనము కూడా విధేనా? వివరించండి అన్నాడు నారాయణభట్టు. వివరిస్తున్నాడు రత్నాకరుడు.

సూ. 47 సహకార్యంతరవిధిః పక్షేణ తృతీయం తద్వతో విధ్యాదివత్

సహకార్యంతరవిధిః, పక్షేణ, తృతీయం, తద్వతః, విధ్యాధివత్

విద్యకు సహకారి మౌనం. శ్రవణాది సాధనంలో మూడవ విధి ధ్యానం. ఇది మౌనంగా జరగాలి. అది విధి అని చెప్పబడింది.

ఇక్కడ పాండిత్యం అంటే శ్రవణం. బాల్యమంటే మననం. అత్యంత సూక్ష్మమైన బ్రహ్మతత్త్వ సాధనకు బ్రహ్మధ్యానం కావాలి. ఆ ధ్యానానికి నియమాలు అవసరం లేదు. భిక్షాటనలో కూడా చెయ్యవచ్చు అయితే ప్రధానమైన బ్రహ్మవిద్యకు ఈ మౌనమే సహకారి.

ఈ రకంగా సన్యాసాశ్రమం ఉత్తమోత్తమమైనది కాగా ఛాందోగ్యంలో గృహస్థాశ్రమ ధర్మాన్ని చెప్పి "ఈ విధంగా జీవితాంతం ఆచరించినవారికి బ్రహ్మలోకం కలుగుతుంది" అనిచెప్పారు. ఇలా చెప్పటంవల్ల గృహస్థాశ్రమానికి మించి ఇంక ఏ ఇతర ఆశ్రమమూ లేదు. అని వారి వాదన.

సూ. 48 కృత్స్నభావాత్తు గృహిణోపసంహారః

కృత్స్న భావాత్, తు, గృహిణా, ఉపసంహారః

గృహస్థాశ్రమం చెప్పటంవల్ల ఇబ్బంది ఏదీ లేదు. గృహస్థుకు యజ్ఞయాగాదులేకాదు. శమదమాదులు కూడా కావాలి. అతడికి స్వర్గసుఖాలు కావాలనుకుంటే యజ్ఞయాగాదులు చేసి వాటిని పొందవచ్చు. మోక్షం కావలనుకుంటే బ్రహ్మజ్ఞాన సిద్ధి పొందవచ్చు. కాబట్టి గృహస్థాశ్రమము శ్రేష్ఠము. అంతమాత్రం చేత సన్యాసాశ్రమం లేదని మాత్రం కాదు.

సూ. 49 మౌనవదితరేషా మప్యుపదేశాత్

మౌనవత్, ఇతరేషామ్, అపి, ఉపదేశాత్

గృహస్థ, సన్యాసాశ్రమాలు శ్రుతి సమ్మతాలు అలాగే వానప్రస్త సన్యాసాశ్రమాలు కూడా సమ్మతాలే మొత్తంమీద నాలుగు ఆశ్రమ ధర్మాలు అనుష్ఠింపదగినవే. ఈ రకంగా పాండిత్య బాల్యాలతో పాటు మౌనం కూడా విధే అంటూ పధ్నాల్గవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

15. అనావిష్కారాధికరణము

గురువుగారూ ! బాల్యము అంటే చిన్నతనము అనా ? చిన్నపిల్లలు చేసే పనులు అనా ? దంభము, దర్పము తెలియని స్థితా ? వీటిలో ఏ అర్థాన్ని తీసుకోవాలి ? అన్నాడు కృష్ణశర్మ. వివరిస్తున్నాడు రత్నాకరుడు.

సూ. 50 అనావిష్కుర్వన్న న్వయాత్

అనావిష్కుర్వన్, అన్వయాత్

బాల్యము అంటే తన జ్ఞానాదుల్ని ప్రజలకు వ్యక్తం చెయ్యకుండా కేవలము పవిత్ర భావం కలిగిఉండటము అంటే బాలకుడు ఇంద్రియ ప్రాబల్యం లేనివాడు. దంభము దర్పములేకుండా నిర్మలస్వభావం కలవాడు. అంటూ పదిహేనవ ప్రకరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

16. ఐహికాధికరణము

జ్ఞానమనేది జన్మలోనే కలుగుతుందా ? అన్నాడు నారాయణభట్టు, వివరిస్తున్నాడు రత్నాకరుడు.

సూ. 51 ఐహికమప్య ప్రస్తుత ప్రతిబంధే తద్దర్మనాత్

ఐహికమ్, అపి, అప్రస్తుత ప్రతిబంధే, తద్దర్మనాత్

శ్రవణమననాది సాధనాలకు కర్మ శేషం అడ్డం కానపుడు ఈ జన్మలోనే జ్ఞానోత్పత్తి కలుగుతుంది. ఒకవేళ కర్మ ప్రతిబంధకం ఏదైనా ఉంటే మరు జన్మలో జ్ఞానం కలుగుతుంది. వాయుదేవుడికి గర్భంలో ఉండగానే, జన్మాంతర శ్రవణం వల్ల జ్ఞానం కలిగింది. కాబట్టి ఏ అడ్డంకీ లేకపోతే ఈ జన్మలోనే జ్ఞానోత్పత్తి జరుగుతుంది అంటూ పదహారవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

17. ముక్తిఫలాధికరణము

గురువుగారూ! జ్ఞానానికి ఫలితం ముక్తికదా! మరి ఆ ముక్తి అందరికీ కలుగుతుందా? లేక అందులో తారతమ్యమున్నదా ? అన్నాడు కృష్ణశర్మ వివరిస్తున్నాడు రత్నాకరుడు.

సూ. 52 ఏవం ముక్తి ఫలానియమస్త దవస్థానదృతే స్తదవ స్థావధృతేః

ఏవం, ముక్తిఫలానియమః , తదవస్థావధృతేః

బ్రహ్మ సాక్షాత్కారంలో లాగానే ముక్తిఫలంలో కూడా తారతమ్యం లేదు. అన్ని ఉపనిషత్తులలోనూ మోక్షము ఒకటే.

ముండకోపనిషత్తులో చెప్పినట్లుగా బ్రహ్మవేత్త సాక్షాత్తూ బ్రహ్మమే అవుతాడు. ముక్తికి స్వరూపము పరమేశ్వరుడే. ఇతడు నిరాకారుడు, నిర్గుణుడు. బేధరహితుడు. కాబట్టి ముక్తిలో కూడా బేధాలుండవు. అంటూ మూడవ అధ్యాయం పూర్తిచేశాడు రత్నాకరుడు.

చతుర్థాధ్యాయము

ఈ అధ్యాయంలో విద్యకు ఫలమైన ముక్తిని గురించి చెప్పటం జరుగుతుంది. క్రమముక్తి, జీవన్ముక్తి విదేహముక్తిలను ఇక్కడ వివరిస్తారు.

ప్రథమపాదము

ఈ పాదంలో జీవన్ముక్తి గురించి వివరిస్తున్నారు. ఇందులో 14 అధికరణలు, 19 సూత్రాలు ఉన్నాయి.

వ.నెం.	అధికరణము	విషయము	సూత్రాలు
1.	ఆవృత్త్యధికరణము	ఆత్మధ్యానానికి ఆవృత్తి ఉంది	2
2.	ఆత్మత్వోపాసనాధికరణము	బ్రహ్మాన్ని తన ఆత్మగా భావించాలి	1
3.	ప్రతీకాధికరణము	ప్రతీకములందు ఆత్మబుద్ధి పనికిరాదు	1
4.	బ్రహ్మదృష్ట్యధికరణము	ప్రతీకమందు బ్రహ్మదృష్టి ఉండాలి	1
5.	ఆదిత్యాదిమత్యధికరణము	కర్మాంగాల యందు దేవతాభావం ఉండాలి	1
6.	ఆసీనాధికరణము	కూర్చునే ధ్యానం చెయ్యాలి	4
7.	ఏకాగ్రతాధికరణము	మనసు ఏకాగ్రతే ప్రధానము	1
8.	ఆప్రాయణాధికరణము	మరణపర్యంతము ధ్యానం చెయ్యాలి	1
9.	తదధిగమాధికరణము	జ్ఞానికి పూర్వోత్తరకృత పాపాలంటవు	1
10.	ఇతరా సంశ్లేషాధికరణము	జ్ఞానికి పుణ్యకర్మలు అంటవు	1
11.	అనారబ్ధాధికరణము	జీవన్ముక్తుడు	1
12.	అగ్నిహోత్రాద్యధికరణము	నిత్యాగ్ని హోత్రకర్మ కూడా బ్రహ్మజ్ఞానంతో నశిస్తుందా ?	2
13.	విద్యాజ్ఞానసాధన్వాధి కరణము	కృతకర్మలు కూడా జ్ఞానోత్పత్తికి ఉపకరిస్తాయి	1
14.	ఇతరక్షపణాధికరణము	కర్మక్షయం కాగానే బ్రహ్మవేత్త బ్రహ్మతో ఐక్యం పొందుతాడు	1
		మొత్తం సూత్రాలు	19

ఇక మొదటి అధికరణ చూద్దాం.

1. ఆవృత్త్యధికరణము

"గురుదేవా ! బ్రహ్మసాక్షాత్కారానికి శ్రవణ మననాదులు చెప్పారుకదా ! అంటే పరబ్రహ్మను గురించే వినాలి. ఆ విన్న దాన్ని మననం చెయ్యాలి. ఇది ఒకసారి చేస్తే చాలా ? మళ్ళీ, మళ్ళీ చెయ్యలా ?" అన్నాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 1 ఆవృత్తి రసకృదుపదేశాత్
ఆవృత్తిః, అసకృత్, ఉపదేశాత్

జ్ఞానాన్ని ఆ వృత్తి చెయ్యాలి. అంటే విన్న దానిని మరిచిపోతాము కాబట్టి మళ్ళీ గుర్తుచేసుకోవాలి. మనసుకు పట్టించుకోవాలి. అందుకే మననం చెయ్యాలి. అదే విషయాన్ని మళ్ళీ మళ్ళీ గుర్తుచేసుకుంటూ ఉండాలి. ఇలా ఎంతకాలం చెయ్యాలి? అంటే ఫలితం వచ్చేదాకా బ్రహ్మసాక్షాత్కారమయ్యే దాకా, ఆత్మ సాక్షాత్కారమయ్యేదాకా చెయ్యాలి. వడ్లు ఎంతసేపు దంపాలి అంటే? బియ్యం వచ్చేదాకా దంపాల్సిందే. అలాగే ఆత్మసాక్షాత్కార మయ్యే దాకా వాటిని మననం చేస్తూనే ఉండాలి.

సూ. 2 లింగాచ్చ
లింగాత్, చ

ఈ విషయాన్ని నిరూపించే గుణాలు కూడా ఉన్నాయి. ఛాందోగ్యంలో ఆదిత్యుడే ఉద్గీత అంటూ "ఒక ఆదిత్యోపాసనవల్ల ఒక్క పుత్రుడే కలుగుతాడు. కాబట్టి, ఆదిత్యకిరణాలను ఆదిత్యుని కన్న భిన్నమైన వాటిగా ధ్యానించు" అని చెప్పబడింది. ఈ వృత్తి కాబట్టి ఆత్మజ్ఞానం కావాలంటే విన్నవాటిని మళ్ళీమళ్ళీ వినాలి. ఈ రకంగా ఆత్మజ్ఞానానికి ఆవృత్తి ఉన్నది అంటూ ప్రథమప్రకరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

2. ఆత్మత్వోపాసనాధికరణము

"గురుదేవా ! పరబ్రహ్మోపాసన చేసేటప్పుడు ఆ పరమాత్మను నేనే అని భావించాలా? పరమాత్మ వేరు, నేను వేరు అని ధ్యానించాలా ?" అని అడిగాడు కృష్ణశర్మ చెప్పటం మొదలుపెట్టాడు రత్నాకరుడు.

సూ. 3 ఆత్మేతి తూపగచ్ఛంతి గ్రాహయంతి చ
ఆత్మేతి, తు, ఉపగచ్ఛంతి, గ్రాహయంతి, చ

నేనే పరమాత్మను అనే 'అహం' ప్రత్యయంతోనే ఉపాసన చెయ్యాలి. అప్పుడే పరబ్రహ్మ సాక్షాత్కారమవుతుంది. 'అయమాత్మా బ్రహ్మ', 'తత్త్వమసి' వంటి మహా వాక్యాలు ఇలాంటివే.

పరమాత్మ నిత్య, శుద్ధ, బుద్ధ, ముక్త స్వరూపుడు. ఆ పరమాత్మ సాక్షాత్కారం కోసం సగుణం చేసినా, నిర్గుణం చేసినా 'నేనే ఆ పరమాత్మను' అని చెయ్యాలి. అంతే తప్ప పరమాత్మ వేరు, నేను వేరు అనే ద్వైతం పనికిరాదు. ఓ పరమాత్మా ! నీవే నేను, నేనే నీవు అంటోంది జాబాలోపనిషత్తు. ఉపాసకుడైన జీవాత్మ, ఉపాస్యుడైన పరమాత్మ రెండూ ఒక్కటే. ఈ రకంగా బ్రహ్మాన్ని తన ఆత్మగానే భావించి ఉపాసన చెయ్యాలి అంటూ రెండవ ప్రకరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

3. ప్రతీకాధికరణము

ప్రతీకము అంటే ప్రతిమ ఆధారము అని అర్థం. ఒక ఆధారంలో ఇష్టదైవాన్ని భావించి ధ్యానం చెయ్యటాన్ని 'ప్రతీకోపాసన' అంటారు. ఛాందోగ్యంలో మనస్సే బ్రహ్మ అని ఉపాసించాలి. ఆదిత్యుడే బ్రహ్మ. నామమే బ్రహ్మ. ఈ ప్రతీకాలన్నీ పరమేశ్వరుడే సృష్టించాడు. కాబట్టి నేనే బ్రహ్మను నేనే మనసును, నేనే ఆదిత్యుణ్ణి అని ఉపాసించాలా? లేక ప్రతీకరూపంలోనే ఉపాసించాలా అని అడిగాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 4 న ప్రతీకే న హిసః

న, ప్రతీకే, న, హి, సః

ప్రతీకలో బ్రహ్మబుద్ధి పనికిరాదు. ఎందుచేతనంటే ఉపాసకుడు ప్రతీక స్వరూపుడు కాదు.

బంగారు కంకణము, కిరీటము. ఈ రెండింటిలో ఉన్నది బంగారమే. కాని రూపంలో తేడా ఉంది. అదేవిధంగా ప్రతీకాలకు బ్రహ్మత్వ దృష్టిలో ఏకత్వం ఉన్నప్పటికీ, స్వరూపంలో తేడా ఉంది. కాబట్టి నేనే ప్రతీకాన్ని అని ఉపాసించరాదు. అంటూ మూడవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

4. బ్రహ్మదృష్ట్యధికరణము

అయితే గురువర్యా! ఉపాసన చేసేటప్పుడు ప్రతీకాలలో బ్రహ్మదృష్టి ఉంచాలా ? లేక బ్రహ్మయందు మనసు ఉంచి ఉపాసన చెయ్యాలా? లేక మనసును బ్రహ్మగా భావించి ఉపాసించాలా ? అన్నాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 5 బ్రహ్మదృష్టి రుత్కర్షాత్

బ్రహ్మ దృష్టిః, ఉత్కర్షాత్

ఉత్కృష్టమైనది కాబట్టి మనసు మొదలైన వాటియందు బ్రహ్మదృష్టి ఉంచి ఉపాసించాలి. నికృష్టమైన సేవకుణ్ణి నువ్వు గొప్పవాడివి. నువ్వే రాజువు. అని పొగిడి పనిచేయించుకుంటాం కదా. అలాగే మనసును, నువ్వే బ్రహ్మ అని భావించి ఉపాసించాలి అంటూ నాల్గవ ప్రకరణ పూర్తిచేశాడు రత్నాకరుడు

5. ఆదిత్యాదిమత్యధికరణము

'గురుదేవా ! కర్మాంగము లందు దేవతాభావం ఉండాలా ?' అన్నాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 6 ఆదిత్యాది మతయశ్చాంగ ఉపపత్తేః

ఆదిత్యాదిమతయః, చ, అంగే, ఉపపత్తేః

అంగమైన ఉద్గీథాది కర్మలందు ఆదిత్యభావం ఉండి తీరాలి. అలా అయితేనే సంపూర్ణమైన ఫలం లభిస్తుంది.

ఈ రకమైన ఉపాసనలు కర్మఫలాన్ని సంపాదించుకోవటం కోసం ఏర్పాటు చెయ్యబడ్డాయి. కాబట్టి కర్మాంగాలైన ఉద్గీథాదులందు దేవతాదృష్టి ఉంచాలి. అంటూ ఐదవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

6. ఆసీనాధికరణము

గురువు గారూ ! ఉపాసనచేసేటప్పుడు కూర్చుని చెయ్యాలా ? నిలబడి చెయ్యాలా? ఏవిధంగా చెయ్యాలి ? అని అడిగాడు కృష్ణశర్మ. వివరిస్తున్నాడు రత్నాకరుడు.

సూ. 7 ఆసీనః సంభవాత్

ఆసీనః, సంభవాత్

కూర్చునే ఉపాసన చెయ్యాలి. పడుకుని చెయ్యకూడదు. అలా అయితే నిద్రవస్తుంది. నడుస్తూ చెయ్యకూడదు. ధ్యాస నేలమీద ఉంటుంది. ముందు ప్రశాంతంగా, స్థిరంగా కూర్చుని, ఆ తరువాత ఉపాసన చెయ్యాలి. ఆసనం మనోవికారం కలిగించకూడదు.

సూ. 8 ధ్యానాచ్చ

ధ్యానాత్, చ

ఉపాసన ధ్యానరూపమైనది. కాబట్టి కూర్చునే చెయ్యాలి. అసలు ఉపాసన అంటేనే ధ్యానం. మనసు ఏకాగ్రత, స్థిరంగా కూర్చునప్పుడే ఉంటుంది.

సూ. 9 అచలత్వం చాపేక్ష్య

అచలత్వం, చ, అపేక్ష్య

పృధ్వి ధ్యానంచేస్తున్న దానిలా ఉన్నది. అంటే కదలకుండా నిశ్చలంగా ఉన్నది. ఈ రకంగా ధ్యానానికి నిశ్చలత్వం అవసరమని చెబుతోంది. అది కూర్చున్నప్పుడే సాధ్యము.

సూ. 10 స్మరంతి చ

స్మృతులలో కూడా ఇదే చెప్పబడింది. ఉపాసకుడు పరిశుద్ధమైన స్థలంలో ఆసనం ఏర్పాటు చేసుకోవాలని స్మృతులు కూడా చెబుతున్నాయి. కాబట్టి కూర్చునే ఉపాసన చెయ్యాలి. అంటూ ఆరవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

7. ఏకాగ్రతాధికరణము

"గురువుగారూ ! ఉపాసనకు దిక్కు, చోటు, కాలము వంటి నియమాలేమైనా ఉన్నాయా ?" అన్నాడు నారాయణభట్టు సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 11 యత్రైకాగ్రతాతత్రా విశేషాత్

యత్ర, ఏకాగ్రతా, తత్ర, అవిశేషాత్

ఎప్పుడు, ఎక్కడ, ఏ దిక్కుగా, ఎలా అయితే మనసు ప్రశాంతంగా, ఏకాగ్రతగా ఉంటుందో, ఆ విధంగానే ఉపాసన చెయ్యాలి.

దిక్కులు, దేశకాలాలు అనేది నియమాలు కర్మలకే ఉంటాయి కాని ఉపాసనకుండవు. అయితే మనసుకు నచ్చేటటువంటి ప్రదేశంలో, ఆహ్లాదమైన చోట ప్రశాంతమైన వాతావరణంలో సుఖాసనం మీద కూర్చొని ఉపాసన చెయ్యాలి. ఇన్ని ఉన్నప్పటికీ ఏకాగ్రతలేనిదే ఫలితం లేదు. కాబట్టి ముందుగా మనసుకు ఏకాగ్రత అనేది ప్రధానము అంటూ ఏడవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

8. ఆప్రాయణాధికరణము

"గురువుగారూ ! ఉపాసన ఎంతకాలం చెయ్యాలి ? కొంతకాలం చేసి వదలి వెయ్యవచ్చునా ?" అన్నాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 12 ఆప్రాయణాత్తత్రాపి హి దృష్టమ్

ఆప్రాయణాత్, తత్ర, అపి, హి, దృష్టమ్.

ఉపాసనలు కర్మల లాగానే కొంతకాలంపాటు చేసి వదలివేయవచ్చు. జీవితాంతం చెయ్యనవసరం లేదు అని వారి వాదన. అది సరికాదు. ఉపాసనలు మరణ పర్యంతం చెయ్యవలసినదే. అని వేదాలు చెబుతున్నాయి. మరణకాలంలో ఏ ఆలోచనలతో ఉంటే జీవుడు ఆ లోకాలకే పోతాడు. ఆ జన్మ ఎత్తుతాడు. జడ భరతుడే ఇందుకు ఉదాహరణ. కాబట్టి మరణపర్యంతం ఉపాసన చెయ్యాలి. అంటూ ఎనిమిదవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

9. తదధిగమాధికరణము

గురువర్యా ! బ్రహ్మసాక్షాత్కారం వల్ల పాపమంతా నశిస్తుందా ? నశించదా ? అన్నాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 13 తదధిగమ ఉత్తర పూర్వాఘయో రశ్లేష వినాశౌ తద్వ్యపదేశాత్

తదధిగమే, ఉత్తర పూర్వాఘయోః, అశ్లేశవినాశౌ, తద్వ్యపదేశాత్

బ్రహ్మజ్ఞానం కలిగిన తరువాత పూర్వోత్తర పాపాలన్నీ నశిస్తాయి. తామరాకు మీద నీటిబొట్టు ఏరకంగా దానికి అంటదో అలాగే బ్రహ్మజ్ఞానికి పాపం అంటదు. బ్రహ్మజ్ఞానికి వెనుకటి పాపాలతోను, రాబోయే పాపాలతోను ఎట్టి సంబంధమూ ఉండదు. అంటూ తొమ్మిదవ ప్రకరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

10. ఇతరాసంశ్లేషాధికరణము

'గురువుగారూ ! బ్రమ్మజ్ఞానికి పాపాలు అంటవు అన్నారు. మరి పుణ్యాల సంగతి ఏమిటి? అదికూడా అంటదా?' అన్నాడు కృష్ణశర్మ సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 14 ఇతరస్యాప్యేవ మసంశ్లేషః పాతేతు

ఇతరస్య, అపి, ఏవమ్, అసంశ్లేషః, పాతే, తు

పాపమే కాదు. పుణ్యం కూడా అంటదు. అంటే బ్రహ్మజ్ఞానికి పాపపుణ్యాలు రెండూ నశించిపోతాయి. అవి రెండూ అతన్ని అంటవు. అలా నశించకపోతే వాటిని అనుభవించటానికి అతడు మళ్ళీ ఈ లోకంలో జన్మించాలి. కాబట్టి బ్రహ్మవేత్త పుణ్య పాపాలు రెండింటి నుంచీ తరిస్తాడు. ఇక శరీరపాతమే మోక్షము మరుజన్మ ఉండదు. అంటూ పదవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

11. అనారబ్ధాధికరణము

'గురువర్యా ! బ్రహ్మజ్ఞానికి ఆరబ్ధ, అనారబ్ధ కర్మలు రెండూ నశిస్తాయా ?' అన్నాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 15 అనారబ్ధ కార్యే ఏవతు పూర్వే తదవధేః

అనారబ్ధకార్యే, ఏవ, తు, పూర్వే, తదవధేః

అనారబ్ధ కర్మలు అంటే పూర్వకర్మలు, సంచితకర్మలు మాత్రమే జ్ఞానంవల్ల నశిస్తాయి.

ఫలితము ఆరంభించిన కార్యాలు ఆరబ్ధకర్మ అనబడతాయి. వీటినే ప్రారబ్ధము అంటారు. ఫలితం ఇవ్వటం ప్రారంభించని కర్మలు అనారబ్ధకర్మలు. ప్రారబ్ధకర్మలు వదిలిపెట్టిన బాణంలాటివి. వాటివేగం తగ్గించటం ఏవరి వల్లకాదు. అనారబ్ధకర్మలు అమ్ములపొదిలోని బాణాలవంటివి, కాబట్టి జ్ఞాని అనారబ్ధాలను నాశనం చేసుకోగలడు. ఆరబ్ధాల నుంచి తప్పించుకోలేడు. బ్రహ్మజ్ఞానికి శరీరపాతం వరకు ప్రారబ్ధం ఉంటుంది. శరీరపాతం జరగగానే అతనికి ముక్తి లభిస్తుంది. అతడే జీవన్ముక్తుడు అంటూ పదకొండవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

12. అగ్నిహోత్రాద్యధికరణము

'నిత్యాగ్ని హోత్రమైన కర్మ బ్రహ్మజ్ఞానం వలన నశిస్తుందా ? అన్నాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 16 అగ్నిహోత్రాది తు తత్కార్యాయైవ తద్దర్మనాత్

అగ్నిహోత్రాది, తు, తత్కార్యాయ, ఏవ, తద్దర్శనాత్

అగ్నిహోత్రాది నిత్య, నైమిష్ఠికర్మలన్నీ జ్ఞానంతో సాధించే మోక్షం కోసమే. వేదాలలో కర్మలను జ్ఞానహేతువులుగా చెప్పారు.

అంటే నిత్య, నైమిత్తికర్మలు మోక్షహేతువులు. అవి చిత్తశుద్ధి కలిగిస్తాయి. తద్వారా జ్ఞానం కలుగుతుంది. దానివల్ల కర్మ నశిస్తుంది. కర్మగనక ఫలం ఇవ్వకుండా నశిస్తే, అదినాశనమవుతుంది. ఈ నిత్యకర్మలు ఫలం ఇచ్చి నశిస్తాయి ఆ ఫలమేజ్ఞానం.

సూ. 17 అతోఽన్యాపి హ్యే కేషా ముభయోః

అతః అన్యా, అపి, హి, ఏకేషామ్, ఉభయోః

కొన్ని శాఖలవారి అభిప్రాయంలో అగ్నిహోత్రాది నిత్యకర్మలకన్న స్వర్గము పొందటానికి చేసే కర్మలు వేరు. ఈ విషయం జైమిని, వ్యాసుడు కూడా ఒప్పుకుంటున్నారు.

కామ్యకర్మలు జ్ఞానోత్పత్తి కారకాలు కావు. అవి కోరికలు తీరుస్తాయి. కాబట్టి నిత్యనైమిత్తికర్మలు మోక్షాపేక్ష కలవారు ఆచరించదగినవే అంటూ పన్నెండవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

13. విద్యాజ్ఞానసాధనాధికరణము

"గురుదేవా ! నిత్యకర్మలు రెండురకాలు 1. ఉపాసనతో కూడినవి. 2. ఉపాసనలేనివి. కృతకర్మలు జ్ఞానోత్పత్తికి ఉపకరిస్తాయా ?" అన్నాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 18 యదేవ విద్యయేతి హి

యదేవ, విద్యయా, ఇతి, హి.

విద్యతో అంటే ఉపాసనతో కూడిన నిత్యకర్మము, కేవలం నిత్యకర్మ ఈ రెండూ కూడా ఈ జన్మలో బ్రహ్మజ్ఞానానికి సాధనాలవుతాయి. ఈ రకంగా కృతకర్మలు జ్ఞానోత్పత్తికి సాధనాలవుతాయి అంటూ పదమూడవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

14. ఇతరక్ష పణాధికరణము

"గురువుగారూ ! బ్రహ్మ జ్ఞానం పొంది, మోక్షానికి అధికారియై, ప్రారబ్ధ వశాన దేహపాతం వరకూ జీవించి, ఉన్నట్లే, దేహపాతం తరువాత కూడా ప్రారబ్ధం అనుభవించటం కోసం శరీరం ధరించాల్సి వస్తే, అప్పుడు ముక్తి కలుగుతుందా ?" అన్నాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 19 భోగేన త్విత రేక్షపయిత్వా సంపద్యతే

భోగేన, తు, ఇతరే, క్షపయిత్వా, సంపద్యతే.

ప్రారబ్ధ కర్మ అనుభవించగానే, అంటే కర్మ క్షయం కాగానే దేహపాతం జరుగుతుంది.

బ్రహ్మజ్ఞానం కలిగినవాడికి అనారబ్ధకర్మ నాశనమయిపోతుంది. ప్రారబ్ధకర్మ క్షయం అయ్యేవరకు దేహం ఉంటుంది. కర్మ క్షయం కాగానే దేహపాతం జరుగుతుంది. కాబట్టి దేహపాతం తరువాత మళ్ళీ శరీరం ధరించటం జరగదు. కర్మక్షయం కాగానే బ్రహ్మవేత్త బ్రహ్మలో ఐక్యం పొందుతాడు అంటూ నాల్గవ అధ్యాయంలో మొదటిపాదం పూర్తిచేశాడు రత్నాకరుడు.

ద్వితీయపాదము

ఈ పాదంలో సగుణబ్రహ్మవేత్తలకు కలిగే క్రమముక్తిని గురించి వివరించబడుతోంది. క్రమముక్తికి సాధనము దేవయానము. ఈ మార్గాన వెళ్ళినవారు బ్రహ్మలోకానికి వెళ్ళి అక్కడ కల్పాంతము వరకు ఉండి, కల్పాంతాన చతుర్ముఖబ్రహ్మతో పాటుగా పరబ్రహ్మలో లీనమవుతాడు. ఇది క్రమముక్తి. ఈరకంగా జరగాలంటే ముందుగా దేహం నుండి ప్రాణాలు ఉత్క్రమించాలి. ఆ ఉత్క్రాంతి ఎలా జరుగుతుందో ఇక్కడ వివరిస్తున్నారు.

సాధారణ మానవుని ప్రాణాలు ఉత్క్రమిస్తాయి. కాని బ్రహ్మజ్ఞాని యొక్క ప్రాణాలు ఉత్క్రమించవు. ఆ ఉత్క్రాంతి ఎలా జరుగుతుందో చెబుతున్నారు. ఈ పాదంలో 11 అధికరణాలు 21 సూత్రాలు ఉన్నాయి.

వ.నెం.	అధికరణము	విషయము	సూత్రాలు
1.	వాగధికరణము	మరణసమయంలో ఇంద్రియ వృత్తులన్నీ మనస్సులో లీనమవుతాయి	2
2.	మనోఽధికరణము	మనస్సు ప్రాణంతో లీనమవుతుంది	1
3.	అధ్యక్షాధికరణము	ప్రాణం జీవునిలో లయమవుతుంది	3
4.	ఆసృత్యుపక్రమాధికరణము	నాడుల్ని చేరేదాకా జ్ఞానికి అజ్ఞానికి ఉత్క్రాంతి సమానమే	1
5.	సంసారవ్యపదేశాధికరణము	దేహంలో వేడి సూక్ష్మశరీరం వల్లనే ఉంటుంది.	4
6.	ప్రతిషేధాధికరణము	నిర్గుణ బ్రహ్మవేత్త ప్రాణాలు ఉత్క్రమించవు	3
7.	కలాప్రళయాధికరణము	నిర్గుణ బ్రహ్మవేత్త ఇంద్రియాలు బ్రహ్మమందే లయిస్తాయి	1
8.	కలాఽవిభాగాధికరణము	బ్రహ్మవేత్తయొక్క ఇంద్రియాలు, భూతసూక్ష్మాలు నిరవశేషంగా బ్రహ్మలో లయమవుతాయి.	1
9.	తదోకోఽధికరణము	సగుణబ్రహ్మవేత్త యొక్క ఆత్మసుషుమ్నా నాడి ద్వారా నిర్గమిస్తుంది	1
10.	రశ్మ్యధికరణము	ఉత్క్రమించే జీవుడు సూర్యరశ్మిని అనుసరిస్తాడు	2
11.	దక్షిణాయనాధికరణము	జ్ఞాని దక్షిణాయణంలో మృతి చెందినా బ్రహ్మలోకానికే పోతాడు	2
		మొత్తం సూత్రాలు	21

ఇక మొదటి అధికరణ చూద్దాం.

1. వాగధికరణము

"గురుదేవా ! 'అవసానదశలో వాక్కు మనసునందు, మనసు ప్రాణమందు, ప్రాణం తేజస్సునందు లీనమవుతాయి' అని ఛాందోగ్యంలో చెప్పబడింది. ఇదే ఉత్క్రాంతిక్రమము. అయితే వాక్కు మనస్సునందు లయమవుతోంది అన్నారు. ఇక్కడ వాక్కు లయమవుతోందా? లేక వాగింద్రియ వ్యాపారం లయం అవుతోందా ? వివరించండి అన్నాడు కృష్ణశర్మ. ప్రారంభించాడు రత్నాకరుడు.

సూ. 1 వాఙ్మనసి దర్శనాచ్ఛబ్దాచ్చ
వాక్, మనసి, దర్శనాత్, శబ్దాత్, చ

వాగింద్రియ వ్యాపారం మనసులో లయమవుతుంది. అప్పటికి మనసు పనిచేస్తూనే ఉంటుంది. వాక్‌లయమవటమంటే వాగింద్రియ వ్యాపారం లయమవటమే. ఇక వాక్కు పుట్టకుండా ఉండటమే లయం కావటం. అంటే జీవి ఇక మాటాడలేడు. అతనికి వాక్కురాదు.

సూ. 2 అతఏవ చ సర్వాణ్యను
అతఏవ, చ, సర్వాణి, అను.

వాక్కుకు మల్లేనే కళ్ళు మొదలైన ఇంద్రియాల వృత్తులు కూడా మనసులో లయం అవుతాయి.

ఇందాక చెప్పినట్లే లయం అంటే వృత్తిలయమే తప్ప స్వరూపలయం కాదు. ఈ రకంగా ఇంద్రియాల వృత్తులన్నీ, మనసులో లీనమవుతాయి. అంటూ మొదటి అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

2. మనోఽ ధికరణము

గురువుగారూ ! వాక్కు అనే పదానికి వాగ్వృత్తి అని అర్థం చెప్పారు. మరి మనస్సు అంటే మనోవృత్తా ? లేక మనస్సే అని అర్థమా ? అన్నాడు నారాయణభట్టు.

సూ. 3 తన్మనః ప్రాణ ఉత్తరాత్

తత్, మనః, ప్రాణే, ఉత్తరాత్

అన్ని ఇంద్రియాలను తనలో లయం చేసుకున్న తరువాత మనస్సు ప్రాణంలో లీనమవుతున్నది. అంటే మనోవ్యాపారాలన్నీ ప్రాణంలో లయమవుతాయని గుర్తించాలి అంటూ రెండవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

3. అధ్యక్షాధికరణము

అయితే గురుదేవా! ప్రాణం దేనిలో లీనమవుతుంది ? అన్నాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 4 సోఽ ధ్యక్షే తదుపగమాదిభ్యః

సః, అధక్షే, తదుపగమాది భ్యః

ప్రాణం జీవునిలో లయమవుతుంది. ప్రాణం జీవాత్మను పొందుతుంది అంటే దేహానికి, ఇంద్రియాలకు అధ్యక్షుడైన జీవుని యందు లయమవుతుంది.

బృహదారణ్యకంలో "చెప్పినట్లుగా" ఇంద్రియాలలో కూడినట్టి, అవిద్యాజన్యమైనట్టి ఈ శరీరము వృద్ధాప్యం కారణంగా కృశించిపోతుంది. అప్పుడు చెట్టు నుండి పండు రాలిపోయినట్లుగా శరీరంలోని పురుషుడు ఈ అవయవాలను వదిలించుకుని కర్మానుసారము మరియొక యోనిలో జన్మించటం కోసం వెళ్ళిపోతాడు. ప్రాణము, అవయవాలు ఉంటేనే గాని కర్మఫలాన్ని అనుభవించలేడు. అందుకని ఇంకొక శరీరంలో చేరతాడు. ఈ రకంగా ముఖ్యప్రాణం బయటకు వెళ్ళేటప్పుడు దానితోపాటుగా ఇంద్రియ వ్యాపారాలన్నీ కూడా నిష్క్రమిస్తాయి.

సూ. 5 భూతేషు తచ్ఛ్రుతేః

అవసానకాలంలో తేజస్సుతో కూడిన చరించే భూతసూక్ష్మాలతో, ప్రాణంతో సహాకూడి జీవుడు ఉంటాడు. తేజస్సు అంటే అగ్ని అని అర్థం. ఇక్కడ తేజస్సు అనటం చేత అగ్ని మొదలైన అన్ని భూతాలు అని గ్రహించాలి. మరణకాలంలో జీవుడు భూతసూక్ష్మాలతో

కూడి ఉంటాడు. ఆ భూతాలే జీవుడికి ఉపాధులు కాబట్టి జీవునిలో లయం అయినప్పటికీ, ప్రాణం ఆ ఉపాధులైన భూతాలను పొందినట్లే అని గుర్తుంచుకోవాలి. ఈ రకంగా ప్రాణాలు జీవుని యందే లయమవుతాయి.

సూ. 6 నైకస్మిన్ దర్శయతో హి

న, ఏకస్మిన్, దర్శయతః, హి

పైన చెప్పిన దానిలో తేజస్సుతో కూడి అన్నారు. కాబట్టి పురుషుడు తేజస్సులోనే ఉంటాడు అని వారి వాదన. అది సరికాదు. ఎందుచేతనంటే అంత్యకాలంలో తేజస్సు ఒకటే ఉండదు. సమస్త భూతాలు ఉంటాయి. కాబట్టి మరణ సమయంలో శరీరాన్ని విడిచి, ఇంకొక శరీరాన్ని ధరించేటప్పుడు అన్ని భూతాల సూక్ష్మాంశల యందు, సూక్ష్మ శరీరంతో ఉంటాడు. శరీరానికి భూతాలన్నీ అవసరమే. కాబట్టి ఇలా జరుగుతుంది. ఈ రకంగా అంత్యకాలంలో ప్రాణం జీవునియందు లయమవుతుంది అంటూ మూడవప్రకరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

4. ఆసృత్యుపక్రమాధికరణము

గురువుగారూ ! ఉత్క్రమణ అన్నారు కదా ! ఉత్క్రమణ అనేది ఉపాసకుడికి, ఉపాసకుడు కాని వారికి సమానమేనా ? కాదా ? అన్నాడు నారాయణభట్టు సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 1 సమానా చాసృత్యుపక్రమా దమృతత్వం చానుపోష్య

సమానా, చ, అసృత్యుపక్రమాత్, అమృతత్వం, చ, అనుపోష్య

దేవయానం ప్రారంభానికి ముందు జ్ఞానికి, అజ్ఞానికి ఉత్క్రమణ అనేది ఒకేరకంగా ఉంటుంది.

జ్ఞానంలేని వాడికి నాడుల్లో ప్రవేశం కలుగుతుంది. అతని ప్రాణాలు దక్షిణ మార్గానపోతాయి. ఆయా మార్గాల వరకు ఉపాసకుడైన జ్ఞానికి, ఉపాసకుడు కాని అజ్ఞానికి కూడా భూతసూక్ష్మావయం సమానమే. దేవయానం ద్వారా వెళ్ళని వాళ్ళకి బ్రహ్మలోక ప్రాప్తి కలగదు. కాబట్టి ఉత్క్రమణ దాకా అంటే ఇంద్రియాలు మనసులో లీనం కావటం, మనసు ప్రాణంలో లీనం కావటం, ప్రాణాలు జీవంలో లీనంకావటం ఇవన్నీ సమానమే అంటూ నాల్గవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

5. సంసారవ్యపదేశాధికరణము

"గురువర్యా ! సూక్ష్మ శరీరం ఎంతవరకు ఉంటుంది ? బ్రహ్మలో ఐక్యమయ్యే వరకు ఉంటుందా ? ఈ లోపులో అంతరిస్తుందా ?" అన్నాడు కృష్ణశర్మ సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 8 తదాపీతేః సంసారవ్యపదేశాత్

తత్, ఆపీతేః, సంసారవ్యపదేశాత్

తేజస్సు మొదలైన భూతాలు మోక్ష పర్యంతము ఉంటాయి.

అజ్ఞానులు తాముచేసిన కర్మఫలాన్ని అనుభవించటానికి వేరొక యోనిని ప్రవేశిస్తారు. పుణ్యకర్ములు ఉత్తమ యోనులు పొందుతారు. అలాకాని వారు నీచయోనులు పొందుతారు. నీచులు క్రిమికీటకాలుగా పుడుతారు. అధమాధములు రాళ్ళు, రప్పలు, చెట్లుచేమలుగా పుడతారు. కాబట్టి తేజస్సు మొదలైన సూక్ష్మ, భూతసూక్ష్మాలకు పరమాత్మయందు లయము మాత్రమే మిగిలిఉందని తెలుసుకోవాలి.

సూ. 9 సూక్ష్మం ప్రమాణతశ్చ తథోపలబ్ధేః

సూక్ష్మం, ప్రమాణతః, చ, తథా, ఉపలబ్ధేః

శరీరం నుండి పోతున్న జీవుడికి ఆశ్రయభూతమైన తేజస్సు ప్రమాణ్ణి బట్టి, స్వరూపాన్ని బట్టి చాలా సూక్ష్మంగా ఉంటుంది.

జీవుడికి ఆధారభూతంగా ఉంటూ, ఈ శరీరంలో నుండి వేరే శరీరంలోకిగాని, బ్రహ్మలోకానికి వెళ్ళే తేజస్సు, భూతసూక్ష్మాలతో కూడిన తేజస్సు, చాలా సూక్ష్మమైనటువంటి నాడీమండలం గుండా పోతుంది అని చెప్పబడింది.

సూ. 10 నోపమర్దేనాతః

న, ఉపమర్దేన, అతః

సూక్ష్మ శరీరమనేది అత్యంత సూక్ష్మమైనది. స్థూలశరీరానికి ఒరిపిడిచేత సూక్ష్మ శరీరానికి బాధకలగదు.

అంటే ఇది సూక్ష్మమైనది. స్వచ్ఛమైనది. కాబట్టే స్థూలశరీరానికి ఏదైనా బాధ కలిగినా అది సూక్ష్మశరీరానికి అంటదు. ఒకవేళ స్థూలశరీరాన్ని దహనం చేసినా, సూక్ష్మశరీరం దహించబడదు.

సూ. 11 అస్యైవచోపపత్తే రేష ఊష్మా

అస్య, ఏవ,చ, ఉపపత్తేః, ఏష, ఊష్మా.

స్థూల శరీరంలో మనకు లభించే ఆవిరి, ఈ సూక్ష్మశరీరానికి సంబంధించినదే. సూక్ష్మశరీరం ఉన్నప్పుడే ఆ ఆవిరి ఉంటుంది. అదే దేహంలోని వేడి. మృతదేహానికి ఆ వేడి ఉండదు. అవసాన దశలో కాళ్ళుచేతులు చల్లబడిపోయాయి అంటారు. అంటే దేహంలోనించి సూక్ష్మశరీరం వెళ్ళిపోవటం వల్ల శరీరం చల్లబడిపోతుంది. అంటూ ఐదవఅధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

6. ప్రతిషేధాధికరణము

గురువుగారూ ! అవసానదశలో ప్రాణాలు ఉత్క్రమిస్తాయి అన్నారు. మరి బ్రహ్మవేత్త యొక్క ప్రాణాల కూడా ఉత్క్రమిస్తాయా ? అంటూ అడిగాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 12 ప్రతిషేధాధితిచేన్న శారీరాత్

ప్రతిషేధాత్, ఇతి, చేత్, న, శారీరాత్.

సగుణారాధన చేసేవాడి ప్రాణాలు ఉత్క్రమిస్తాయి. కాని బ్రహ్మవేత్త ప్రాణాలు ఉత్క్రమించవు. అని అనటం సరికాదు. ఉత్క్రమణం అనేది జీవుని నుండి లేదు. అంతేకాని శరీరం నుండి లేదని కాదు.

సూ. 13 స్పష్టో హ్యేకేషామ్

స్పష్టః, హి, ఏకేషామ్

కొంతమంది సూత్రాకారుల ప్రకారం బ్రహ్మవిదుడికి ఉత్క్రాంతిలేదు. బృహదారణ్యకంలో "మానవుడు చనిపోయినప్పుడు, బ్రహ్మవేత్త యొక్క ప్రాణాలు శరీరం నుంచి ఉత్క్రమిస్తాయా ? లేదా ? అన్నాడు ఆర్తభాగుడు.

ఉత్క్రమింపవు తత్త్వజ్ఞాని యొక్క ప్రాణాలు పరమాత్మలో లీనమవుతాయి. సామాన్య మానవుడి లాగానే బ్రహ్మవేత్త కూడా మరణిస్తాడు. కాని అతడికి పునర్జన్మ ఉండదు" అన్నాడు యాజ్ఞవల్క్యుడు.

మరి ప్రాణాలు ఉత్క్రమించకపోతే మరణించడు కదా ? అని అనుమానం. ప్రాణాలు పోగానే శరీరం ఉబ్బిపోతుంది. వళ్ళు చల్లబడిపోతుంది. జీవి మరణిస్తాడు. అతని ప్రాణాలు ఉత్క్రమించవు. పరమేశ్వరుడిలో లీనమయిపోతాయి. అని వేదాలు చెబుతున్నాయి.

సూ. 14 స్మర్యతే చ

బ్రహ్మ సాక్షాత్కారం పొందిన వాడికి ప్రాణాలు ఉత్క్రమించటంగాని, దేవాలయానాది మార్గాలుగాని లేవని పురాణాలు చెబుతున్నాయి. కాబట్టి బ్రహ్మవేత్త ప్రాణాలు ఉత్క్రమించవు. అంటూ ఆరవఅధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

7. కలాప్రళయాధికరణము

"గురువుగారూ ! బ్రహ్మవేత్త ప్రాణాలు ఉత్క్రమింపవు అన్నారు మరి అతని ఇంద్రియాలూ, భూతాలూ పరమాత్మలో లయమవుతాయా ? లేక తమతమ ప్రకృతులందు లయమవుతాయా ? అన్నాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 15 తాని పరే తథా హ్యాహ

తాని, పరే, తథా, హి, అహ

జ్ఞానికి మోక్షం కలిగేటప్పుడు పదిహేను కళలు వాటివాటి ఉత్పత్తి స్థానాన్ని పొందుతాడు. అని ముండకోపనిషత్తులో చెప్పబడ్డది. అలాగే ప్రశ్నోపనిషత్తులో పదహారు కళలకు పరమేశ్వరుడే ఆధారము. కాబట్టి అతని యందే లీనమవుతాయి. అని చెప్పబడ్డది.

బ్రహ్మవేత్త యొక్క ప్రాణాలు (ఇంద్రియాలు) భూతాలు పరమాత్మలోనే లయమవుతాయి.

వర్షం కురిసనప్పుడు ఆ నీరంతా వాగులుగా ప్రవహించి నదులుగా ఏర్పడుతుంది. ఆ నదులకు ప్రత్యేకమైన పేర్లుంటాయి. ఈ నదులన్నీ సముద్రంలో కలుస్తాయి. అప్పుడు వాటికి ప్రత్యేకమైన పేర్లుండవు. అంతా సముద్రమే. అలాగే పదహారు కళలు పరమేశ్వరుని యందే ఉంటాయి. అవి ఎప్పుడైతే అతన్ని చేరాయో అప్పుడు వాటికి నామరూపాలుండవు. దాన్ని పురుషుడని మాత్రమే అంటారు. సమాధి స్థితిలో ఉన్నప్పుడు ఈ కళలన్నీ ఆత్మలో లీనమవుతాయి. బండి చక్రానికి ఉండే ఆకులన్నీ దాని ఇరుసుమీద ఆధారపడి ఉన్నట్లుగానే ఈ కళలన్నీ పురుషుడి మీద ఆధారపడి ఉంటాయి. పదహారుకళలు పురుషుని భాగాలుకావు. అతడు కల్పించినవే.

ఈ రకంగా నిర్గుణ బ్రహ్మవేత్త ఇంద్రియాలు (ప్రాణాలు) బ్రహ్మలో లీనమవుతాయి అంటూ ఏడవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

8. కలాఽ విభాగాధికరణము

గురువుగారూ! బ్రహ్మవేత్త యొక్క ఇంద్రియాలు, భూతసూక్ష్మాలు, నిరవశేషంగా బ్రహ్మలో లయమవుతాయా? అన్నాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 16 అవిభాగో వచనాత్

అవిభాగః, వచనాత్

జ్ఞాని యొక్క ఇంద్రియాలు బ్రహ్మతో పూర్తిగా లయమవుతాయి.

ఆ కళలు అంటే ఇంద్రియాలు, ప్రాణాలు యొక్క నామరూపాలు నశిస్తాయి. అన్నీ కలసిపోయి పురుషుడని వ్యవహరించబడతాడు. ఈ రకంగా బ్రహ్మైక్య రూపమైనట్టి లయం పొందినప్పుడు సాధకుడు కళలు లేని వాడవుతాడు. అంటే ముక్తుడవుతాడు.

ఈ రకంగా బ్రహ్మవేత్త యొక్క ఇంద్రియాలు, భూతసూక్ష్మాలు నిరవశేషంగా బ్రహ్మలో లయమవుతాయి అంటూ ఎనిమిదవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

9. తదోకోఽ ధికరణము

గురువుగారూ ! సగుణోపాసకుడు, అజ్ఞాని యొక్క ఆత్మ ఏవిధంగా నిష్క్రమిస్తుంది? అన్నాడు కృష్ణశర్మ. చెప్పటం మొదలుపెట్టాడు రత్నాకరుడు.

సూ. 17 తదోకోఽ గ్రజ్వలనం, తత్ప్రకాశిత ద్వారో విద్యాసామర్థ్యా త్తచ్ఛేషగత్యను స్మృతి యోగాచ్చ హార్దాను గృహీతః శాతాధికయా

తదోకోఽ గ్రజ్వలనం, తత్ప్రకాశితద్వారః, విద్యాసామర్థ్యాత్ తచ్ఛేషగత్యను స్మృతియోగాత్, చ, హార్దానుగృహీతః, శతాధికయా

సగుణోపాసకుని ఆత్మ శరీరం నుంచి బయటకు వచ్చేటప్పుడు జీవునికి వాసస్థానమైన హృదయం యొక్క చివరిభాగంలో ఒకవిధమైన జ్వలన కలుగుతుంది. దానిచేత ప్రకాశింపచేయబడిన మార్గం కలవాడై, హృదయంలో అధిష్టించి ఉన్న బ్రహ్మచేత అనుగ్రహించబడినవాడై, బ్రహ్మవిద్యాసామర్థ్యం వల్ల, బ్రహ్మవిద్యకు అంగముగా చెప్పబడిన గతిని ధ్యానించటం వల్ల, నూటొకటవదైన సుషుమ్నా నాడీ మార్గాన నిష్క్రమిస్తాడు.

వాక్కు మొదలైన ఇంద్రియాలు పనిచెయ్యకుండా మాని వెయ్యటము, జీవుడు హృదయాన్ని ప్రవేశించటము, హృదయము యొక్క పై భాగము ప్రకాశించటము ఇవన్నీ

జ్ఞానికీ, అజ్ఞానికీ సమానమే. అయితే జ్ఞాని బ్రహ్మరంధ్రం ద్వారా నిష్క్రమిస్తాడు. అజ్ఞాని నవరంధ్రాలలో ఏదో ఒక మార్గం ద్వారా నిష్క్రమిస్తాడు.

హృదయంలో నూటొక్క నాడీ మండలమున్నది. అందులో సుషమ్నా నాడి మాత్రమే, మోక్ష మార్గం వైపుపోతుంది. మిగిలిన నాడులు ఏదో ఒక ఇంద్రియాన్ని కలుపుతాయి. సుషమ్నా మార్గం గుండాపోయినవాడు అమృతత్త్వం పొందుతాడు. మిగిలిన నాడులగుండా పోయిన వారికి బ్రహ్మలోక ప్రాప్తిలేదు. అంటూ తొమ్మిదవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

10. రశ్మ్యధికరణము

గురువుగారూ ! బ్రహ్మరంధ్రం గుండా పోయే మానవుడికి తేజోరశ్మి సంబంధం ఉన్నదా? ఉపాసకుడు శరీరం నుంచి నిష్క్రమించేటప్పుడు ఈ కిరణాల ద్వారానే పైకి పోతాడు. అని వేదం చెబుతున్నది. ఈ తేజోసంబంధము పగలు, రాత్రి, ఎప్పుడు మరణించినా ఉంటుందా? అన్నాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 18 రశ్మ్యనుసారీ

సుషుమ్న ద్వారా ఈ దేహం నుండి ఉత్క్రమించిన ఉపాసకుడు ఆ నాడితో సంబంధం ఉన్న సూర్యకిరణాలను అనుసరించి బ్రహ్మలోకం చేరతాడు.

ఇక ఈ తేజోసంబంధం పగలు రాత్రి అనే భేదం లేకుండా ఎప్పుడైనా ఉంటుంది.

సూ. 19 నిశినేతి చేన్న సంబంధస్య యావద్దేహభావిత్వా ద్దర్శయతి చ

నిశి, న, ఇతి, చేత్, న, సంబంధస్య, యావద్దేహభావిత్వాత్, దర్శయతి, చ

ఇక్కడ గమనించవలసిన విషయం ఏమంటే, నాడులకు సూర్యరస్మికి దేహం ఉన్నంతవరకు సంబంధం ఉంటుంది. అందుచేత రాత్రులందు జీవుడు కిరణాలను అనుసరించడు అని చెప్పటంలో అర్థం లేదు. వేదం కూడా ఈ విషయాన్నే చెబుతున్నది.

వీరి అనుమానం ఏమంటే రాత్రులందు సూర్యుడుండడు గదా. మరి రాత్రులందు మరణించిన వారికి సూర్యరశ్మి సంబంధం ఉండదు అని. అది నిజం కాదు. నాడులకు, సూర్యరశ్మికి ఉన్న సంబంధం వస్తూపోతూ ఉండేది కాదు. శరీరం ఉన్నంతవరకు ఇది ఉంటుంది. అందుచేతనే సూర్యరశ్మి సంబంధానికి రాత్రిపగలు తేడాలేదు. అన్ని నాడులలోనూ వ్యాపించి ఉండే పిత్తరసమే సూర్యుని తేజస్సు. కాబట్టి జీవి పగలు

మరణించినా, రాత్రివేళ మరణించినా, ఆ సమయంలో సూర్యరశ్మి ఉన్నా, లేకపోయినా, మృతిచెందిన వెంటనే సూర్యరశ్మి ప్రాప్తి కలుగుతుంది. అంటూ పదవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

11. దక్షిణాయనాధికరణము

“గురువర్యా ! ఉత్తరాయణ పుణ్యకాలంలో స్వర్గద్వారాలు తెరిచి ఉంటాయి. కాబట్టి ఉత్తరాయణంలో మరణించిన వారు బ్రహ్మలోకానికిపోతారు. దక్షిణాయనంలో మరణించిన వారికి బ్రహ్మలోక ప్రాప్తిలేదు అంటారు ఇది నిజమేనా ? అన్నాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 20 అతశ్చాయనేఽపి హిదక్షిణే

అతః, చ, ఆయనే, అపి, హి, దక్షిణే.

ఉత్తరాయణము, దక్షిణాయనము అనేవి మనం చెప్పుకుంటునట్లుగా సూర్యగమనం వల్ల కలిగేవికాదు. అవి దేవయాన పితృయానాలు. ఈ జ్ఞానమనేది ఎప్పుడూ ఉండేది. కాబట్టి దక్షిణాయనంలో చనిపోయినప్పటికీ బ్రహ్మలోక ప్రాప్తి జరుగుతుంది. అలాగే అజ్ఞానులు ఏ సమయంలో మరణించినా, వారికి బ్రహ్మలోకం లభించదు.

సూ. 21 యోగినః ప్రతిచస్మర్యతే స్మార్తేచైతే

యోగినః ప్రతి, చ, స్మర్యతే, స్మార్తే, చ, ఏతే.

యోగుల కోసం చెప్పే స్మృతిలో కాలవిశేషాన్ని వివరించారు. ఈ యోగము, సాంఖ్యము అనేవి పురాణాలలో చెప్పబడ్డాయి. అంతేకాని వేదంలో కాదు.

గీతలో చెప్పబడిన అర్చిరాది మార్గము, ధూమంది మార్గము యోగులనుద్దేశించి చెప్పబడినది. సాంఖ్య, యోగశాస్త్రాలు పురాణాల్లోనే చెప్పబడ్డాయి. అవి వేదప్రమాణాలు కావు. అయితే వేదాలలో చెప్పబడ్డ దేవయాన పితృయానాలు, పురాణాలలో చెప్పబడ్డ అర్చిరాది, ధూమాది మార్గాలు ఒకటే అని చెప్పవచ్చు.

క్రమముక్తికి కాల నియమం లేదు. జ్ఞానియైన వాడు. దక్షిణాయానంలో మరణించినా బ్రహ్మలోకం చేరతాడు. మరి భీష్ముడు ఉత్తరాయణం వచ్చే దాకా ఆగాడు కదా ! అంటారు. భీష్ముడికి స్వచ్ఛంద మరణం ఉంది. దాని శక్తిని అందరికీ తెలియచెయ్యాలనే ఆ విధంగా చేశాడు. అంటూ నాల్గవ అధ్యాయంలో రెండవ పాదాన్ని పూర్తిచేశాడు రత్నాకరుడు.

తృతీయపాదము

ఈ పాదంలో దేవయాన మార్గాన్ని వివరిస్తున్నారు. ఇందులో 6 అధికరణలు, 16 సూత్రాలు ఉన్నాయి.

ప.నెం.	అధికరణము	విషయము	సూత్రాలు
1.	అర్చిరాద్యధికరణము	అర్చిరాదిమార్గమే బ్రహ్మలోక మార్గము.	1
2.	వాయ్వధికరణము	ఉత్క్రమించే జీవుడు, సంవత్సర దేవత, తరువాత వాయువును పొందుతారు	1
3.	వరుణాధికరణము (తడిదధికరణము)	విద్యుద్దేవత తరువాత జీవుడు వరుణ లోకాన్ని చేరతాడు.	1
4.	అతివాహికాధికరణము	అర్చిరాదులంతా అతివాహిక దేవతలే	3
5.	కార్యాధికరణము	దేవయాన మార్గం ద్వారా సగుణ బ్రహ్మను పొందుతాము	8
6.	అప్రతీకాలంబనాధికరణము	అ ప్రతీకోపాసకులు బ్రహ్మలోకాన్ని పొందుతారు	2
		మొత్తం సూత్రాలు	16

ఇక మొదటి అధికరణ చూద్దాం

1. అర్చిరాద్యధికరణము

గురువుగారూ ! బ్రహ్మలోకానికి వెళ్ళే మార్గాల గురించి వేదంలో భేదం కనిపిస్తున్నది.

1. బృహదారణ్యకంలో "వీరు జ్యోతిరభిమాన దేవతను పొందుతారు".

2. ముండకోపనిషత్తులో "వారు పాపరహితులై సూర్యుని ద్వారా ఉత్తరాయణ మార్గాన అక్కడికి (బ్రహ్మలోకానికి) వెడతారు".

3. బృహదారణ్యకంలో "ఉపాసకుడు ఈ లోకం నుండి వెళ్ళేటప్పుడు వాయువును పొందుతాడు".

4. కౌశీతకోపనిషత్తులో "అతడు దేవయాన మార్గాన్ని పొంది అగ్నిలోకానికి పోతాడు".

ఈ రకంగా బ్రహ్మలోకానికి భిన్నమార్గాలు చెప్పబడ్డాయి. ఇవన్నీ ఒకదానితో ఒకటి సంబంధం లేనటువంటివా ? లేక వేరువేరు పేర్లతో పిలువబడుతున్నాయా ? అన్నాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 1 అర్చిరాదినా తత్ప్రథితేః

అర్చిరాదినా, తత్ప్రథితేః

బ్రహ్మలోకానికి మార్గము 'అర్చిరాది మార్గమే' ఈ మార్గం గుండానే బ్రహ్మలోకానికి వెడతారు. అన్నిచోట్ల ఎక్కువగా అర్చిరాది మార్గమే చెప్పబడింది. ఛాందోగ్యంలో శ్వేతకేతువు, ఉద్దాలక అరుణికి ఈ విధంగా చెబుతాడు. "మానవుడు మరణించిన తరువాత ఆ నాలుగు భూతాలు, ఆయా భూతాలలో కలిసిపోతాయి. మానవుని యోగ్యత అనేది, అతడు చేసిన కర్మల మీద ఆధారపడి ఉంటుంది. అతడు గనక ఆత్మానుభవం పొందితే వెలుగుబాటలో ప్రయాణం చేస్తాడు. అదే దేవయానము. అర్చిరాది మార్గము. ఆ బాటలో ప్రయాణించి, పుణ్యఫలాన్ని అనుభవించి మోక్షాన్ని పొందుతాడు. అతడికి పునర్జన్మ ఉండదు. అతడికి శాశ్వతమైన ఆనందం లభిస్తుంది. ఇందులో ఉపాసకులంతా అర్చిరాది మార్గం ద్వారానే వెడతారు అని చెప్పబడింది. వాయ్వాది మార్గాలన్నీ దీనిలోనే అన్వయించబడతాయి. ఎక్కడైనా మార్గం చెప్పకపోతే, అక్కడ కూడా అది అర్చిరాది మార్గమే అని గ్రహించాలి. అంటూ మొదటి అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

2. వాయ్వధికరణము

గురుదేవా ! మోక్షాధికారులు అర్చిరాది మార్గం గుండా వెడతారు అన్నారు. ఆ మార్గము యొక్కక్రమము.

1. కౌశీతకీ ఉపనిషత్తులో "ఉపాసకుడు ముందుగా అగ్నిలోకానికి పోతాడు. అక్కడ నుంచి వరుసగా వాయు, వరుణ, ఇంద్ర, ప్రజాపతి లోకాలకు పోయి ఆ తరువాత బ్రహ్మలోకం చేరతాడు."

2. ఛాందోగ్యంలో "ఉపాసకుడు అర్చిరభిమాన దేవతను పొందుతాడు. అక్కడి నుండి దినాభిమాన దేవతను, అక్కడ నుండి శుక్లపక్ష అభిమానదేవత, ఉత్తరాయణ దేవత, సంవత్సరదేవత, సూర్యలోకము, చంద్రలోకము, విద్యుత్తు లోకము ఆ తరువాత బ్రహ్మలోకము పొందుతారు."

3. బృహదారణ్యకంలో "ఈ లోకం నుండి నిష్క్రమించే పురుషుడు వాయువును పొందుతాడు. ఆకాశంలో ఘనీభవించిన ఆ వాయువు పగిలిపోయి మార్గం ఇస్తుంది. ఆ మార్గం గుండా ఉపాసకుడు సూర్యలోకం చేరతాడు.

ఈ రకంగా అర్చిరాది మార్గవర్ణనలో తేడా వున్నది. కౌశీతకంలో, దేవయానంలో వాయుమార్గం రెండవది. ఛాందోగ్యంలో వాయు మార్గంలేదు. ఈ రకంగా తేడాలున్నాయి. వాయుమార్గం ఎక్కడ ఉంది? వివరించండి అన్నాడు నారాయణభట్టు. వివరిస్తున్నాడు రత్నాకరుడు.

సూ. 2 వాయు మబ్దాదవిశేష విశేషాభ్యామ్
వాయుమ్, అబ్దాత్, అవిశేష విశేషాభ్యామ్

వాయువును సంవత్సరానికి తరువాత, ఆదిత్యునికి ముందుచేర్చాలి.

బృహదారణ్యకంలో ఆదిత్యలోకానికి ముందు, సంవత్సర లోకానికి తరువాత వాయులోకం చెప్పారు. ఈ వాయులోకం ద్వారానే సూర్యలోకం పొందుతాడు. ఉపాసకుడు అర్చిరాది మార్గాన ప్రవేశించి వరుసగా పగటిపూట దేవత, శుక్లపక్షదేవత, మాసదేవత, సంవత్సర దేవతలను పొంది అక్కడనుండి దేవలోకాన్ని, వాయులోకాన్నిచేరి, ఆ వాయువుచేత కల్పించబడ్డ రంధ్రం ద్వారా ఆదిత్యలోకం చేరి, అక్కడ నుండి బ్రహ్మలోకం చేరతాడు. అని చెప్పబడింది. కాబట్టి వాయులోకము ఆదిత్యలోకానికి ముందు, సంవత్సర లోకం తరువాత ఉంటుంది. అంటూ రెండవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

3. వరుణాధికరణము (తడిదధికరణము)

"గురువర్యా ! కౌశీతకీ ఉపనిషత్తులో, అర్చిరాది మార్గంలో వరుణలోకం ఉందన్నారుకదా ! దాన్ని వివరించండి ! అన్నాడు కృష్ణశర్మ. వివరిస్తున్నాడు రత్నాకరుడు.

సూ. 3 తడితోஉధి వరుణః సంబంధాత్
తడితః అధి, వరుణః, సంబంధాత్

వరుణుడికి విద్యుత్తుతో సంబంధం ఉన్నది. కాబట్టి విద్యుల్లోకానికి పైన వరుణలోకమున్నది.

విద్యుత్తు తరువాత వరుణుడికి స్థానముంటుంది. ఎందుచేతనంటే వరుణుడికి విద్యుత్తుతో, అంటే మెరుపుతో సంబంధమున్నది. అందుచేత విద్యుల్లోకానికి పైన వరుణ లోకమున్నది అంటూ మూడవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

4. అతివాహికాధికరణము

గురువుగారూ ! అర్చిరాది మార్గంలో అనేకమైన లోకాలను వరుసగా చెప్పారుకదా. ఇవన్నీ గుర్తుకోసమా ? త్రోవలో విశ్రాంతి తీసుకోవటానికి స్థానాలా ? లేక ఉపాసకుని బ్రహ్మలోకానికి తీసుకుపోయే దేవతలా ? వివరించండి అన్నాడు నారాయణభట్టు. వివరిస్తున్నాడు రత్నాకరుడు.

సూ.4 అతి వాహికా స్తల్లింగాత్
అతివాహికాః, తల్లింగాత్

బ్రహ్మలోకానికి ప్రయాణమయ్యే వాడికి ఇవన్నీ అతివాహికలు. ఈ అర్చిరాదులన్నీ ఉపాసకుణ్ణి వెంటపెట్టుకుని బ్రహ్మలోకానికి తీసుకువెడతాయి. "విద్యులోకమునుంచి దివ్యపురుషుడొకడు బ్రహ్మలోకానికి తీసుకొని వెడతాడు". ఈ రకంగా ప్రతిలోకంలోను ఆయా దేవతలు ఉపాసకుని జాగ్రత్తగా తరువాత లోకానికి చేరుస్తారు. కాబట్టి వారంతా అతివాహికలే.

సూ. 5 ఉభయ వ్యామోహాత్తత్సిద్ధేః
ఉభయ, వ్యామోహాత్, తత్సిద్ధేః

ఉపాసకుడు వెళ్ళే మార్గాలన్నీ జడాలు. అచేతనాలు. అందుచేత అవి వ్యామోహితాలు. జడాలు కాబట్టి వాటికి సంకల్పం ఉండదు. ఉపాసకుణ్ణి భరించే సామర్థ్యం ఉండదు. ఉపాసకుడు శరీరహీనుడు. అతడికి మార్గజ్ఞానం ఉండదు. కాబట్టి బ్రహ్మలోకం చేరలేడు. అందుకని ఆయాలోకాలలోని దేవతలు అతణ్ణి తరువాతిలోకానికి మోసుకొని పోతారు.

ఈ దేవతలు అన్నికాలాల యందు, అన్ని సమయాలయందు ఉంటారు. కాబట్టి దక్షిణాయనం, రాత్రిపగలు ఎప్పుడైనా వారుంటారు. కాబట్టి ఉపాసకుడు బ్రహ్మలోకం చేరటానికి ఆటంకం ఏమీ ఉండదు.

సూ. 6 వైద్యుతేనైవ తతస్తచ్ఛ్రుతేః
వైద్యుతేన, ఏవ, తతః, తచ్ఛ్రుతేః

విద్యులోకం తరువాత ఒక పురుషుడు ఉపాసకుణ్ణి బ్రహ్మలోకం చేరుస్తాడు. ఆ విధంగా ప్రతిలోకం నుండి దివ్యపురుషుడు ఉపాసకుణ్ణి ఇంకొక లోకం చేరుస్తూ ఉంటారు. ఆ రకంగా ఉపాసకుడు బ్రహ్మలోకం చేరతాడు. ఈ లోకాలలోని దేవతలంతా అతివాహికలే అంటూ నాల్గవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

5. కార్యాధికరణము

"గురువుగారూ ! దేవయానం ద్వారా ఉపాసకుడు బ్రహ్మలోకం చేర్చబడతాడు. అని చెప్పారు. అక్కడ బ్రహ్మ అంటే పరబ్రహ్మ లేక కార్యబ్రహ్మ. (కార్యబ్రహ్మ అంటే చతుర్ముఖ బ్రహ్మ) అన్నాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 7 కార్యం బాదరి రస్య గత్యుపపత్తేః

కార్యం, బాదరిః, అస్య, గత్యుపపత్తేః

దేవయానం ద్వారా వెళ్ళిన ఉపాసకుడు ముందుగా కార్యబ్రహ్మను చేరతాడు. కార్యబ్రహ్మ అంటే చతుర్ముఖ బ్రహ్మ. పరబ్రహ్మ సర్వాంతర్యామి. అందుచేత ముందుగా సగుణబ్రహ్మ అంటే కార్యబ్రహ్మను చేరతాడు.

సూ. 8 విశేషితత్వాచ్చ

విశేషితత్వాత్, చ

ఇంకొక శ్రుతిలో కూడా ముందుగా సగుణ బ్రహ్మను చేరతాడు అని చెప్పబడింది. కాబట్టి బ్రహ్మలోకము అంటే కార్యబ్రహ్మమే అని గుర్తించాలి.

సూ. 9 సామీప్యాత్తు తద్వ్యపదేశః

సామీప్యాత్, తు, తద్వ్యపదేశః

పరబ్రహ్మకు అతి సమీపంగా ఉంటాడు కార్యబ్రహ్మ. అతడే అపరబ్రహ్మ కాబట్టి అపరబ్రహ్మను కూడా బ్రహ్మమనే అంటాడు.

ఉపాసన కోసము మనోమయత్వాది గుణాలతో కూడినదిగా చెప్పబడే నిర్వికారబ్రహ్మమే కార్యబ్రహ్మము. అందుచేతనే సగుణబ్రహ్మను కూడా బ్రహ్మమనే అంటారు. అద్దంలో కనుపించేది ప్రతిబింబమే అయినా దాన్ని కూడా ముఖము అనే అంటాము. అలాగే కార్యబ్రహ్మ కూడా పరబ్రహ్మలాటివాడే.

సూ. 10 కార్యాత్యయే తదధ్యక్షేణ సహాతః పరమభిధానాత్

కార్యాత్యయే, తత్, అధ్యక్షేణ, సహ, అతః పరమ్, అభిధానాత్

కార్యబ్రహ్మకు ప్రళయం సంభవించినప్పుడు అంటే కల్పాంతమునందు, బ్రహ్మయొక్క ఆయుర్దాయము పూర్తి అయిన తరువాత, ఈ కార్యబ్రహ్మ, పరబ్రహ్మలో లీనమవుతాడు. బ్రహ్మతోపాటే బ్రహ్మలోకం చేరిన జ్ఞానులు కూడా పరబ్రహ్మలో లీనమవుతారు. ఇదే క్రమముక్తి.

సూ. 11 స్మృతేశ్చ

స్మృతేః, చ

బ్రహ్మలోకం చేరినవారు కల్పాంతం వరకు బ్రహ్మలోకంలో, బ్రహ్మవద్దనే ఉండి, కల్పాంతాన పరబ్రహ్మలో లీనమవుతారు.

సూ. 12 పరం జైమినిర్ముఖ్యత్వాత్

పరం, జైమినిః, ముఖ్యత్వాత్

బ్రహ్మశబ్దానికి ముఖ్యమైన ఆలంబనం పరబ్రహ్మే కాబట్టి ఇక్కడ గతి పరబ్రహ్మే అని జైమిని ఉద్దేశ్యం.

సూ. 13 దర్శనాచ్చ

దర్శనాత్, చ

బ్రహ్మనాడీ మార్గాన వెళ్ళినవాడు ముక్తిని అంటే అమృతత్వాన్ని పొందుతాడు. అని వేదం చెబుతోంది. అమృతత్వమనేది. పరబ్రహ్మవల్లనే సంభవం. కార్యబ్రహ్మకు అమృతత్వాన్నిచ్చే శక్తిలేదు. కాబట్టి ఇక్కడ బ్రహ్మ అంటే పరబ్రహ్మే అని గుర్తించాలి.

సూ. 14 న చ కార్యే ప్రతిపత్త్యభి సంధిః

న, చ, కార్యే, ప్రతిపత్యభిసంధిః

ఉపాసకులకు బ్రహ్మలోకమే ప్రాప్తి. అంటే ఇక్కడ కార్యబ్రహ్మమే కాదు. పరబ్రహ్మమే అని అర్థము. అంటూ ఐదవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

6. అప్రతీకాలంబనాధికరణము

"గురువుగారూ ! ఉపాసకులంతా బ్రహ్మలోకం చేరతారా ? లేక వారిలో కొందరు మాత్రమే వెడతారా ? దివ్యపురుషులు అందరినీ బ్రహ్మలోకానికి తీసుకుపోతారా ? లేదా?" అన్నాడు నారాయణభట్టు. వివరిస్తున్నాడు రత్నాకరుడు.

సూ. 15 అప్రతీకాలంబనాన్నయతీతి బాదరాయణ ఉభయథా దోషాత్తత్క్రతుశ్చ

అప్రతీకాలంబనాన్, నయతి, బాదరాయణః,

ఉభయథా, అదోషాత్, తత్క్రతుః, చ

జ్ఞానులైన వారిని ఆ దివ్యపురుషుడు బ్రహ్మలోకం చేరుస్తాడు. అని వ్యాసుని అభిప్రాయము. ఎవరు ఏ ఉపాసన చేస్తే, ఆ ఫలం పొందుతారు. అందుచేత ఉపాసకులు బ్రహ్మలోకం చేరతారు.

పంచాగ్ని విద్య, దహరవిద్య, పర్యంతకవిద్య, వైశ్వానరవిద్య మొదలైనవి ఉపాసించేవారు బ్రహ్మలోకం చేరతారు. ప్రతీకోపాసనలు కాకుండా మిగిలిన వారంతా బ్రహ్మోపాసకులే. వారు బ్రహ్మలోకం చేరటంలో సందేహం లేదు. ప్రతీకోపాసనలలో బ్రహ్మోపాసన లేదు. అందుకనే ప్రతీకోపాసకులకు బ్రహ్మలోక ప్రాప్తిలేదు. వీరునామము, వాక్కు, మనస్సు మొ॥వాటిని ఉపాసిస్తారు.

సూ. 16 విశేషం చ దర్మయతి

విశేషం, చ, దర్మయతి

ప్రతీకోపాసకులు బ్రహ్మలోకానికి పోరు. నామాన్ని బ్రహ్మగా ఉపాసించే వారు నామం ప్రసరించినంత వరకు స్వేచ్ఛగా విహరిస్తారు. మనస్సును, వాక్కు మొదలైన వాటిని ఉపాసన చేసినవారు అవి వ్యాపించి ఉన్నంతవరకు స్వేచ్ఛగా సంచరించ గలుగుతారు.

అందుచేత ప్రతీకోపాసకులకు బ్రహ్మలోక ప్రాప్తిలేదు. అప్రతీకోపాసకులు అంటే బ్రహ్మోపాసకులు మాత్రమే బ్రహ్మలోకం పొందుతారు. అంటూ నాల్గవ అధ్యాయంలో మూడవపాదాన్ని పూర్తిచేశాడు రత్నాకరుడు.

చతుర్థపాదం

ఈ పాదంలో బ్రహ్మవేత్తలకు కలిగే సాక్షాన్ముక్తి, సగుణోపాసకులకు కలిగే బ్రహ్మ సమాన ఐశ్వర్యములను వివరిస్తున్నారు. ఇందులో 7 అధికరణలు, 22 సూత్రాలు ఉన్నాయి.

వ.నెం.	అధికరణము	విషయము	సూత్రాలు
1.	సంపద్యావిర్భావాధికరణము	ముక్తపురుషుడు స్వరూపంలో ఉంటాడు	3
2.	అవిభాగేన దృష్టత్వాధికరణము	ముక్తునికి పరబ్రహ్మకు తేడాలేదు	1
3.	బ్రహ్మాధికరణము	ముక్తాత్ముడైన వాని లక్షణాలు	3
4.	సంకల్పాధికరణము	కోరినంతనే ముక్తాత్ముని కోరికలు సిద్ధిస్తాయి	2
5.	అభానాధికరణము	ముక్తాత్ములకు శరీరం ఉండటం లేకపోవటం వారి సంకల్పాధీనం	5
6.	ప్రదీపాధికరణము	ముక్తుడు ఒకేకాలంలో అనేక శరీరాల్లో ప్రవేశించగలడు	2
7.	జగద్వ్యాపారాధికరణము	ముక్తుడికి జగసృష్టి తప్ప మిగిలిన ఐశ్వర్యాలన్నీ ఉంటాయి.	6
		మొత్తం సూత్రాలు	22

ఇక మొదటిపాదం చూద్దాం

1. సంపద్యావిర్భావాధికరణము

గురువుగారూ ! జీవుడు శరీరం నుండి లేచి అంటే శరీరాన్ని, వదిలి పరబ్రహ్మను పొంది స్వరూపంతో నిలుస్తున్నాడు. అని ఛాందోగ్యంలో ఉంది. ఇందులో చెప్పిన ముక్తి అనేది స్వర్గము లాగా ఉంటుందా? స్వర్గము పొందినవాడు సుఖాలనుభవించి, ఉత్తరజన్మలు ఎత్తుతాడు. అలాగే ఈ ముక్తుడు కూడా ఏదైనా అధిఖ్యాన్ని పొందుతాడా? లేక స్వస్వరూపంతోనే ఉంటాడా ? అన్నాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 1 సంపద్యావిర్భావః స్వేనశబ్దాత్

సంపద్య, ఆవిర్భావః, స్వేన, శబ్దాత్.

ప్రకాశరూపమైన ఆత్మ సాక్షాత్కారాన్ని పొంది, ఆ ఆత్మరూపంలో విద్వాంసుడు ఆవిర్భూతుడౌతాడు. జీవుడు తానైన రూపంలో ఉండటమే ముక్తి. అదే స్వరూప స్థితి. అజ్ఞానం వదిలిపోగానే స్వస్వరూపం తెలుస్తుంది. కాబట్టి ముక్తి అనేది పుట్టదు.

సూ. 2 ముక్తః ప్రతిజ్ఞానాత్

ముక్తః, ప్రతిజ్ఞానాత్

ముక్తి పొందిన పురుషుడు పూర్ణానంద స్వరూపంలో ఉండిపోతాడు. సంసారదశలో అవిద్యతో బంధించబడిన ఆత్మ, జ్ఞానం కలిగిన తరువాత శుద్ధుడు, ముక్తుడు అవుతున్నాడు. శరీరంలేనటువంటి ఆత్మకు ప్రియము, అప్రియము ఉండవు.

సూ. 3 ఆత్మా ప్రకరణాత్

ప్రకరణాన్ని బట్టి జ్యోతి అంటే 'ఆత్మ' అని అర్థం. అంతేకాని వెలుగుకాదు. ఇది ఆత్మను గురించి చెప్పే ప్రకరణము. అందుకని ఇక్కడ జ్యోతి అంటే ఆత్మ. అనే అర్థం. "దానిని దేవతలు జ్యోతికి జ్యోతిగా చూస్తారు" అని చెప్పబడింది. కాబట్టి ముక్తపురుషుడు ఆ స్వస్వరూపం అంటే ఆత్మరూపంలోనే ఉంటాడు అంటూ మొదటి ప్రకరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

2. అవిభాగేన దృష్టత్వాధికరణము

గురుదేవా ! ముక్తపురుషుడు పరమాత్మకన్న భిన్నమైన రూపంలో ఉంటాడా ? ఏకరూపంలోనే ఉంటాడా ? వివరించండి అన్నాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 4 అవిభాగేన దృష్టత్వాత్
అవి భాగేన, దృష్టత్వాత్

ముక్త స్వరూపుడు బ్రహ్మతో అవిభక్తమైన రూపంలో ఉంటాడు. బ్రహ్మ అయి ఆ పరబ్రహ్మనే పొందుతాడు. వేదం ముక్తపురుషుడికి, బ్రహ్మకు భేదం లేదు. అని చెబుతోంది. ముక్తపురుషుడు విడదీయటానికి వీలులేని విధంగా నిరతిశయానంద స్వరూపంగా ఉంటాడు. 'అహంబ్రహ్మస్మి' ముక్తపురుషుడు పరమాత్మే అంటూ రెండవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

3. బ్రహ్మాధికరణము

"గురువుగారూ ! ముక్తపురుషుడు సత్యసంకల్ప, సర్వజ్ఞత్వాది లక్షణాలు కలవాడై ఉంటాడా? అతడి లక్షణాలేమిటి ?" అన్నాడు నారాయణభట్టు. వివరిస్తున్నాడు రత్నాకరుడు.

సూ. 5 బ్రాహ్మేణ జైమిని రూపన్యాసాదిభ్యః
బ్రాహ్మేణ, జైమినిః, ఉపన్యాసాది భ్యః

జైమిని అభిప్రాయం ప్రకారం సర్వజ్ఞత, సర్వేశ్వరత్వము, అనే లక్షణాలు కలిగి ఉంటాడు ముక్తపురుషుడు. ఛాందోగ్యంలో చెప్పినట్లుగా ఆత్మపాపరహితుడు, ముసలితనము, చావు, శోకము, ఆకలి, దప్పిక లేనివాడు. సత్యకాముడు, సత్యసంకల్పుడు.

సూ. 6 చితి తన్మాత్రేణ తదాత్మకత్వాదిత్యౌడులోమిః
చితితన్మాత్రేణ, తదాత్మకత్వాత్, ఇతి, ఔడులోమిః

జీవుడు చైతన్య స్వరూపుడు కాబట్టి ముక్తపురుషుడు కూడా చైతన్యరూపంలోనే ఉంటాడని 'ఔడులోమి' అభిప్రాయం.

తైత్తిరీయంలో సత్యము జ్ఞానము అనంతమయినది పరబ్రహ్మఅని చెప్పబడింది. బృహదారణ్యకంలో ఆత్మబాహ్యాభ్యంతరాలు లేనిది. సంపూర్ణమైనది. ప్రజ్ఞాన ఘనమైనది ఆత్మజ్ఞానికి శోకము, మోహము దుఃఖము ఉండవు. బ్రహ్మ చైతన్యరూపుడు. అందుచేతనే బ్రహ్మనుపొందే ముక్తపురుషుడు కూడా చైతన్యరూపుడే అయిఉంటాడు. ఇది ఔడులోమి అభిప్రాయం.

సూ. 7 ఏవమప్యుపన్యాసాత్ పూర్వ భావాద విరోధం బాదరాయణః
ఏవం అపి, ఉపన్యాసాత్, పూర్వభావాత్, అవిరోధం, బాదరాయణః

ముక్తుడు చైతన్య స్వరూపుడు అని చెప్పినప్పటికీ, బ్రహ్మకుండే సత్యసంకల్పం, సర్వజ్ఞత మొదలైన గుణాలు ముక్తుని యందు కూడా సంభవిస్తాయి అంటారు వ్యాసమహర్షి కాబట్టి ఈ రకంగా పరబ్రహ్మ కుండే లక్షణాలన్నీ ముక్తునికి కూడా ఉంటాయి. అంటూ మూడవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

4. సంకల్పాధికరణము

"గురుదేవా ! అర్చిరాది మార్గాన బ్రహ్మలోకం చేరిన ఉపాసకుడికి, భోగ్యవస్తువుల్ని సృష్టించటం అనేది సంకల్ప మాత్రంచేత సాధ్యమా ? లేక ప్రయత్నంచేత సాధ్యమా ? వివరించండి" అన్నాడు నారాయణభట్టు. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

సూ. 8 సంకల్పాదేవ తు తచ్ఛ్రుతేః
సంకల్పాత్, ఏవ, తు, తచ్ఛ్రుతేః

జ్ఞానియైనవాడు కోరినంతనే అంటే సంకల్పమాత్రం చేతనే పితృదేవతలు మొదలైనవారు ప్రత్యక్షమవుతారు.

ఛాందోగ్యోపనిషత్తులో చెప్పినట్లుగా "తానే బ్రహ్మ అని తెలుసుకున్నవాడు. సమస్తలోకాల్లోనూ విహరించగలుగుతాడు.

సత్యకాముడై దహరాకాశంలో బ్రహ్మను సేవించినవాడు మరణానంతరము పితృలోకం కోరితే పితృగణం ప్రత్యక్షమవుతుంది. వారితోపాటు పితృలోకాలకు పోయి పితృలోక అనుభవాలతో సంపన్నుడై మహిమాన్వితుడౌతాడు. మాతృలోకాలుకోరితే అక్కడకు చేరతాడు. అంటూ అతడు సమస్తలోకాలు చేరగలుగుతాడని చెప్పబడింది. కాబట్టి జ్ఞాని సంకల్ప మాత్రం చేతనే సర్వమూ పొందగలుగుతాడు.

సూ. 9 అతఏవ చానన్యాధిపతిః
అతఏవ, చ, అనన్యాధిపతిః

ఇటువంటి తిరుగులేని సంకల్పంవల్లనే విద్వాంసుడు అనన్యాధిపతి అవుతున్నాడు. అతడికి వేరొక ప్రభువు అంటూ ఎవరూ ఉండరు. అతడికి చక్రవర్తి లాగా అన్ని లోకాలలోనూ సంచారముంటుంది. అతడు కోరినంత మాత్రంచేతనే అన్నిలోకాలు పొందగలుగుతాడు అంటూ నాల్గవ అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

5. అభావాధికరణము

గురుదేవా ! ముక్తపురుషులకు సంకల్ప మాత్రంచేతనే, కోరిన లోకాలు పొందుతాడు అన్నారు. సంకల్పం ఉందన్నారు. సంకల్పం కావాలంటే మనస్సు కావాలి. అంటే ముక్తపురుషుడికి మనస్సు, ఇంద్రియాలు అన్నీ ఉంటాయా ? అన్నాడు కృష్ణశర్మ వివరిస్తున్నాడు రత్నాకరుడు.

సూ. 10 అభావం బాదరి రాహహ్యేవమ్

అభావం, బాదరిః, అహ, హి, ఏవమ్

విద్వాంసుడు అంటే జ్ఞానియైన వాడికి మరణానంతరము శరీరముండదు.

ముక్తపురుషుడికి ఇంద్రియలు శరీరము ఉండవు అంటాడు వ్యాసుడు. విద్వాంసుడికి మనస్సుకన్న భిన్నమైన శరీరము, ఇంద్రియాలు ఏవీ బ్రహ్మలోకంలో లేవు.

సూ. 11 భావం జైమినిర్వికల్పా మననాత్

భావం, జైమినిః, వికల్పామననాత్

జైమిని అభిప్రాయం ప్రకారం ముక్తపరుషుడికి శరీరాదులున్నాయి.

సూ. 12 ద్వాదశాహవ దుభయవిధం బాదరాయణోஉతః

ద్వాదశాహవత్, ఉభయవిధం, బాదరాయణః, అతః

ఇక్కడ రెండు విధాలైన శ్రుతులు కనిపిస్తున్నాయి. బ్రహ్మలోకాన్ని పొందినవారు స్వతంత్రులు. వారి సంకల్పం తిరుగులేనిది. అందుచేత శరీరం కావాలనుకుంటే శరీరం ధరిస్తారు. అక్కరలేదు అనుకుంటే శరీరం ఉండదు. అని వ్యాసుడు అంటున్నాడు.

సూ. 13 తన్వభావే సంధ్యవదుపపత్తేః

తన్వభావే, సంధ్యవత్, ఉపపత్తేః

బ్రహ్మ లోకంలో ఇంద్రియాలతో కూడిన దేహం లేకపోయినప్పటికీ, స్వప్నంలో లాగా మానసికంగా విషయాలు పొందుతారు.

స్వప్నంలో అనేక విషయాలు చూస్తాము. పదార్థాలు తింటాము. భోగాలు అనుభవిస్తాము. కాని శరీరము ఇంద్రియాలు ఏవీ ఉండవు.

అవన్నీ స్వప్నంలో యదార్థమే. అలాగే బ్రహ్మలోకంలో భోగాలు మనసు ద్వారానే అనుభవిస్తారు.

సూ. 14 భావే జాగ్రద్వత్

శరీరం ఉన్నప్పుడు జాగ్రదావస్థలో లాగా అనుభవిస్తాడు. శరీరం లేనప్పుడు మనసుతో అనుభవిస్తాడు. కాబట్టి ముక్తపురుషునికి శరీరం ఉండటం లేకపోవటం అనేది అతని సంకల్పం వల్లనే జరుగుతుంది. అంటూ ఐదవ అధికరణ పూర్తిచేశాడు రత్నాకరుడు.

6. ప్రదీపాధికరణము

గురువర్యా ! ముక్తుడు కావాలనుకుంటే ఒక శరీరమే పొందుతాడా ? లేక ఒకే కాలంలో అనేక శరీరాలు పొందుతాడా ? వివరించండి అన్నాడు నారాయణభట్టు వివరిస్తున్నాడు రత్నాకరుడు.

సూ. 15 ప్రదీప వదావేశస్తథా హి ధర్మయతి

ప్రదీపవత్, ఆవేశః, తథా, హి, ధర్మయతి

విద్వాంసుని చేత నిర్మించబడిన అనేక శరీరాల్లో విద్వాంసుడు ప్రదీపం లాగా ఆవేసిస్తాడు.

ముక్తుడు ఆత్మభోగం కావాలనుకున్నప్పుడు అనేక శరీరాలు కలుగుతాయి. ఒకే ఆత్మ, ఒకే మనస్సుతో అనేక శరీరాల్లో భోగము అసంభవం. కాబట్టి అనేక ఆత్మలు, మనసులు కల్పించబడాలి. అలా జరుగుతుందా ? అంటే జరగదు. కాని ప్రదీపం లాగా ఆవేసిస్తాడు. అంటే దీపం ఒకటే కాని వత్తులను అంటుకుని అనేక దీపాలవుతుంది. అలాగే ముక్తుడు, తానొక్కడే అయినా అనేక రూపాలు పొందుతాడు. అనేక శరీరాలను ఆవేశిస్తాడు.

సూ. 16 స్వాప్యయ సంపత్త్యో రన్యతరాపేక్ష మావిష్కృతం హి

స్వాప్యయ సంపత్త్యోః, అన్యతరాపేక్షమ్, అవిష్కృతం, హి

స్వాప్యయము అంటే సుషుప్తి. ఇక్కడ సుషుప్తి, మోక్షము, ఈ రెండింటిలోనూ ఏదో ఒక దానిని ఉద్దేశించి మాత్రమే చెప్పబడింది.

ముక్తపురుషుడు తాను ఒకేకాలంలో అనేక శరీరాల్లో ప్రవేశించగలడు అంటూ ఆవర అధికరణ పూర్తి చేశాడు రత్నాకరుడు.

7. జగద్వ్యాపారాధికరణము

"గురువుగారూ ! ముక్తపురుషుడు సంకల్ప మాత్రంచేత జగత్తును సృష్టించగలడా?" అన్నాడు కృష్ణశర్మ. వివరిస్తున్నాడు రత్నాకరుడు.

సూ. 17 జగద్వ్యాపార వర్జం ప్రకరణాద సన్నిహితత్వాచ్చ
జగద్వ్యాపారవర్జం, ప్రకరణాత్, అసన్నిహితత్వాత్, చ

విద్వాంసుడికి అణిమాది అష్టసిద్ధులన్నీ లభిస్తాయి. కాని జగత్తును సృష్టించే శక్తి మాత్రం ఉండదు. ఆ పని పరమేశ్వరుని వల్లనే జరుగుతుంది.

సృష్టి సమయంలో పరమేశ్వరుడు ఒక్కడే ఉంటాడు. అతనికి సన్నిహితులుగాని, అతనితో సమానమైన వారుగాని ఎవరూ ఉండరు.

సూ. 18 ప్రత్యక్షోపదేశా దితిచేన్నాధికారిక మండలస్థోక్తేః
ప్రత్యక్షోపదేశాత్, ఇతి, చేత్, న, అధికారిక, మండలస్థోక్తేః

విద్వాంసుడికి ఈశ్వరునితో పాటు సమానమైన ఐశ్వర్యం కలుగుతోంది. అంతమాత్రం చేత జగద్వ్యాపారము, జగత్కర్తృత్వము కలగవు. వీరంతా బ్రహ్మలోకంలోనే ఉంటారు. కాబట్టి వీరిశక్తి అక్కడి వరకే పరిమితము. వీరంతా పరబ్రహ్మకు లోబడే ఉంటారు. లోకాలను సృష్టించే అధికారం వీరికి లేదు.

సూ. 19 వికారావర్తి, చ తథా హి స్థితి మహ
వికారావర్తి, చ, తథా, హి, స్థితిమ్, అహ

పరమేశ్వరుని రూపం వికారమందు మాత్రమే ఉండేదికాదు. నిత్యమైనది కూడా. అంటే సూర్యమండలంలో మార్పు పొందేదేకాదు. ఇది సగుణము, నిర్గుణము అని రెండు రకాలుగా ఉన్నది అని వేదంలో చెప్పబడింది.

ఈ వికారమంతా పరమేశ్వరుని వ్యాప్తి. ఆయన మాత్రం వికారానికి ఆవల ఉన్నాడు. నిర్వికారుడై ఉన్నాడు. ఈ సమస్త భూతాలు పరమేశ్వరుని యొక్క ఒక పాదము మాత్రమే. మిగిలిన మూడు పాదాలు స్వర్గంలో ఉన్నాయి. ఈశ్వరుడికి సగుణ, నిర్గుణ రూపాలు రెండూ ఉన్నాయి. నిర్గుణ రూపాన్ని సగుణోపాసకులు పొందలేరు.

సూ. 20 దర్శయతశ్చైవం ప్రత్యక్షానుమానే
దర్శయతః, చ, ఏవం, ప్రత్యక్షానుమానే.

ప్రత్యక్షం అంటే వేదం. అనుమానం అంటే స్మృతి పురాణాలు.

జ్యోతి రూపుడైన పరబ్రహ్మ యందు లోకాలను ప్రకాశింపచేసే సూర్యుడు ప్రకాశింపడు. చంద్రుడు కాంతులివ్వడు. తారకలు ప్రకాశింపవు. అని ఉపనిషత్తులు చెబుతున్నాయి. ఇవి వేదంలో భాగాలు.

ఇదే విషయాన్ని పురాణాలు కూడా చెబుతున్నాయి. స్వయం ప్రకాశమానుడైన పరమాత్మను సూర్యచంద్రాగ్నులు ప్రకాశింపచేయలేవు అంటోంది భగవద్గీత.

పరమాత్మది అన్ని తేజస్సులకన్నా అధికమైన తేజస్సు. కాబట్టి సగుణ, నిర్గుణరూపాలు రెండూ ఉన్నాయి.

సూ. 21 భోగమాత్ర సామ్యలింగాచ్చ
భోగమాత్ర, సామ్య, లింగాత్, చ

ఉపాసకులకు ఈశ్వరునితో పాటుగా భోగమాత్రమైన సామ్యమే ఉన్నదని వేదాలు చెబుతున్నాయి. అందుచేత వారికి జగత్తును సృష్టించే శక్తి, అధికారము లేవు.

సమస్త ప్రాణులు హిరణ్యగర్భుని పూజించినట్లే ఉపాసకులను కూడా పూజిస్తాయి. అంటే హిరణ్యగర్భునికిమల్లేనే ఉపాసకునికి కూడా భోగసాధనాలవుతాయి.

బ్రహ్మలోకం చేరిన ఉపాసకులతో బ్రహ్మ "ఓ ఉపాసకులారా ! ఇక్కడ అమృతరూపమైన జాలాన్ని నేను ఉపయోగిస్తున్నట్లే, మీరు కూడా ఉపయోగిస్తారు". అంటే వీరికి భోగసామ్యమే తప్ప జగద్వ్యాపారం లేదు.

సూ. 22 అనావృత్తిః శబ్దాదనావృత్తిః శబ్దాత్
అనావృత్తిః, శబ్దాత్, అనావృత్తిః, శబ్దాత్

అర్చిరాది మార్గం గుండా బ్రహ్మలోకం చేరిన వారికి పునరావృత్తి లేదు.

కఠోపనిషత్తులో చెప్పినట్లుగా బ్రహ్మనాడి గుండా పైకిపోయిన వారు అమృతత్త్వం పొందుతారు. బృహదారణ్యకంలో చెప్పినట్లుగా దేవయానం ద్వారా పోయేవారు మానవలోకానికి తిరిగిరారు.

వీరంతా కల్పాంతం వరకు బ్రహ్మలోకంలోనే ఉండి, కల్పాంతాన పరబ్రహ్మలో లీనమవుతారు. వీరికి మరుజన్మ లేదు.